# తెలుగు నవల - సామాజిక చైతన్యం

Vol : 23 | Spl. Issue | February 2026 | BHAVAVEENA | ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

Referred Journal &
Peer Reviewed Journals

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Arts, Literary,
Culture & Language Study

## జాతీయ సదస్సు - ఫిబ్రవరి 2026



సంపాదకులు

**డా॥. ఎ. చంద్రబాబు**

ప్రచురణ

**తెలుగు శాఖ**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కుప్పం**

**చిత్తూరు జిల్లా.**

# తెలుగు నవల - సామాజిక చైతన్యం

## జాతీయ సదస్సు


సంపాదకులు

**డా॥. ఎ. చంద్రబాబు**

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం, చిత్తూరు జిల్లా.

సహ సంపాదకులు

**డా॥. కె. శ్రీనివాసులు రెడ్డి**

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు.

**డా॥. కె. ఈశ్వరబాబు**

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల.

**డా॥. ఇ. వాసు**

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.



**ఎల్. బి. ప్రదీప్ కుమార్**
**ప్రిన్సిపాల్**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం.**

# సందేశం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం తెలుగు విభాగం తరపున "తెలుగు నవల - సామాజిక చైతన్యం" అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సు సందర్భంగా ఈ సందేశాన్ని పంపడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది.

తెలుగు సాహిత్యంలో వచ్చిన నవలలు ఆధునిక సమాజానికి ప్రతిబింబాలుగా ఎలా నిలిచాయో చర్చించడానికి ఈ సదస్సు ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుంది.

తొలి తెలుగు నవలల నుండి నేటి ఆధునిక నవలల వరకు జరిగిన పరిణామాన్ని, అవి సమాజంలో తెచ్చిన మార్పులను పరిశోధకులు విశ్లేషించడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తాను.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా ?నేటి తరానికి తెలుగు నవలల గొప్పతనాన్ని, మన సంస్కృతిని సాహిత్యం ద్వారా తెలియజేయడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అవుతుంది.

ఈ సదస్సులో సమర్పించే పరిశోధనా పత్రాలు నవలా సాహిత్యంలో కొత్త కోణాలను ఆవిష్కరిస్తాయని నేను ఆశిస్తున్నాను.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన తెలుగు విభాగానికి, అధ్యాపకులకు మరియు విద్యార్థులకు నా హృదయపూర్వక అభినందనలు.

శుభాకాంక్షలతో,

L. Pradeep Kumar

**(ఎల్. బి. ప్రదీప్ కుమార్)**
ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం.



**డా॥. వి. ఆర్. రాసాని**

**కథ, నవల, నాటక రచయిత.**

**తిరుపతి.**

# ముందుమాట

బ్రిటీషువారి విద్య ప్రభావంతో వచ్చిన ఆధునిక సాహిత్యంలో కథ, వచన కవిత్వం, నవల బాగా ప్రాచుర్యాన్ని పొందాయి. వీటిలో నవల అశేష జనాన్ని ఆకర్షించిన సాహిత్య ప్రక్రియ. ఆంగ్లంలో **'novel'** అనే పదం నుంచే తెలుగులో 'నవల' అనే పదం పుట్టింది. ఇది **'novella'** అనే ఇటాలియన్ పదం నుంచీ ఏర్పడింది. ఇది వచన రూపంలో వున్న శక్తివంతమైన సాహిత్యరూపం. ఆంగ్లంలో దీన్ని ఇలా నిర్వచిస్తారు.

**"A novel is an extended work of narrative fiction, typically written in prose and published as a book, that imaginatively explores human experiences through a connecting sequence of events, characters, and settings".**

ఇలా రాయబడిన నవలకు దాదాపు రెండు వేల సంవత్సరాల చరిత్ర వుందని ఆంగ్ల సాహితీవేత్త మార్గరెట్ డూడీ సెలవిస్తారు. కానీ మనకు ఇప్పటివరకు దొరుకుతున్న మొదటి నవల మురసాకి షికిబు రాసిన 'దిటేల్ ఆఫ్ జెంజి' (The tale of Genji) మాత్రమే. నిజానికి పెద్దకథగా చెప్పబడేదే నవల. అలాంటి కథలు చెప్పడంలో పురాతన మూలాలను కలిగి వున్నప్పటికీ ఇప్పుడు మనం నవలగా గుర్తిస్తున్న ప్రక్రియ 17, 18వ శతాబ్దాలలో ఆరంభమైందిగా గుర్తించవచ్చు. ఆంగ్లంలో మిగ్యుల్ డి సెర్వాంటెస్ రాసిన 'డాన్‌క్విక్సోట్', డేనియల్‌డిఫో రాసిన 'రాబిన్సన్‌క్రూసో' అనేవే నేటి నవలకు మార్గదర్శకాలుగా నిలబడ్డాయి. ఆ తర్వాత ఎందరో మహానుభావులు నవలా సాహిత్యాన్ని పండించారు.

మన తెలుగులో నరహరి గోపాలకృష్ణమ శెట్టియార్ 1872లో ఒక క్షత్రియరాజయిన రంగరాజు, సోనాబాయి అనే ఒక సుగాలీ మహిళను వివాహమాడిన ఇతివృత్తంతో 'శ్రీరంగరాజ చరిత్రము' అనే నవలను రాశాడు. ఇతను రాయలసీమ వాసికావడం విశేషం. ఇలా వెలువడిన మొదటి నవలే కులాలకతీతంగా వివాహ సంబంధాలను పెంచుకుంటూపోతే ఈ దేశంలో సమాజాభివృద్ధికి ఆటంకంగా నిలచిన కులవ్యవస్థను కూలదోయొచ్చునన్న అర్థంలో రాయడం చాలా గొప్ప విషయం. ఆతర్వాత కందుకూరి వీరేశలింగంగారు 'రాజశేఖర చరిత్రము' అన్న నవల రాశాడు. ఇక అప్పటి నుంచీ నవలది తిరుగు లేని ప్రయాణం. అయితే అది మధ్య తరగతి వ్యక్తుల జీవితాలవరకే పరిమితమైపోయింది. ఈమధ్య తరగతి మనుషుల్లోని స్త్రీ పురుష సంబంధాల గురించి యద్దనపూడి సులోచనారాణి నవలలురాసినా ఆమెకంటే ముందే స్త్రీస్వేచ్ఛనాకాంక్షిస్తూ,

పురుషాధిక్య సమాజాన్ని వ్యతిరేకిస్తూ చలం, రంగనాయకమ్మ లాంటివారు నవలలు రాస్తూ వచ్చారు. వాటిలో చలం 'మైదానం', రంగనాయకమ్మ 'బలిపీఠం', 'జానకివిముక్తి' లాంటి నవలలు మకుటాయమానంగా నిలిచిపోయాయి. ఇదే విధంగా మనస్తత్వ నవలలూ వచ్చాయి. గోపీచంద్ 'అసమర్థుడి జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది', రావిశాస్త్రి 'అల్పజీవి', వి.ఆర్.రాసాని 'స్వప్నజీవి' వీటిలో గుర్తుండిపోయే నవలలు.

అయితే గతశతాబ్ది చివరి దశాబ్దాలలో పురుషుడితో సమానంగా అన్ని రంగాలలో స్త్రీ సాధికారికతను, సమానత్వాన్ని కోరుకుంటూ స్త్రీవాద ఉద్యమం ప్రారంభమైంది. ఆవాదం ప్రభావంతో ఓల్గా, కుప్పిలి పద్మ, జయప్రభ, కొండేపూడి నిర్మల, సత్యవతి లాంటివారు రచనలు చేశారు. వాటిలో ఓల్గా గారి 'స్వేచ్ఛ', 'సహజ' వంటి నవలలు గొప్ప స్త్రీవాద నవలలుగా పేరు తెచ్చుకున్నాయి. ఆతర్వాత 1990 నుంచీ ప్రపంచీకరణ ఫలితంగా 'సెల్' రూపంలో మొత్తం ప్రపంచం మనిషి అరచేతిలోకి వచ్చేసి ప్రపంచంలో ఎక్కడ ఏంజరుగుతోందో సామాన్యులకు సులభంగా తెలిసిపోతూ వచ్చింది. ఆకారణంగా అస్తిత్వ ఉద్యమం ఆరంభమైంది. ఎవరి బాధలు వారు చెప్పుకోవడం జరుగుతూవస్తోంది. అందులో భాగంగా ఎన్నో వేల సంవత్సరాల నుంచీ వివక్షకు, అస్పృశ్యతకు గురైన దళితుల గురించి బలంగా సాహిత్యం రాసాగింది. అలాగే కులవృత్తుల వారి గురించీ, మైనారిటీ, గిరిజన, సంచార తెగల వారి గురించీ ఎన్నడూ లేని విధంగా ఎన్నో కథలూ, నవలలూ వచ్చాయి. ఇలా వచ్చిన దళిత, బహుజన, గిరిజన, మైనారిటీ వాదాలు లాంటివి వచన సాహిత్యానికి బలాన్ని చేకూర్చాయి. ఎండ్లూరి సుధాకర్, చిలుకూరి దేవపుత్ర, నాగప్పగారి సుందరరాజు లాంటి దళిత రచయితలు, బండి నారాయణ స్వామి, వి.ఆర్. రాసాని, పెద్దంటి అశోక్‌కుమార్, కాలువ మల్లయ్య, శాంతి నారాయణ లాంటి బహుజన రచయితలు, ఖదీర్ బాబు, వేంపల్లి షరీఫ్, షాజహానా లాంటి మైనారిటీ రచయితలు, పలమనేరు బాలాజీ, మల్లిపురం జగదీష్ లాంటి గిరిజన తెగల రచయితలు, అట్టాడ అప్పలనాయుడు, పాణిలాంటి విప్లవ రచయితలు తమ తమ బాధలను తమ రచనలలో చిత్రిస్తూవస్తున్నారు. ఈ నేపథ్యంలో చిలుకూరి దేవపుత్ర 'పంచమం', బండి నారాయణస్వామి 'గద్దలాడతాండాయి', 'మీరాజ్యం మీరేలండీ', వి.ఆర్.రాసాని 'ముద్ర', 'చీకటిరాజ్యం', 'పరస', 'కపిరి, పెద్దింటి అశోక్ 'జిగిరి', సన్నపరెడ్డి వెంకట్రామిరెడ్డి 'ఒంటరి', 'కొండఫలం', శాంతి నారాయణ 'ముడి', 'సాధన' వంటి నవలలు గొప్ప నవలలుగా నిలచిపోయాయి.

అలాగే ఈమధ్యన పురాణాలకు, చారిత్రక ఘటనలను పునర్మూల్యాంకనం చేస్తూ కూడా నవలలు వచ్చాయి. కృష్ణుడిని వలస ఆర్యుల్ని ఎదుర్కొన్న వీరుడిగా చిత్రించిన 'ఆదియోధుడు' నవల నవలా సాహిత్యంలో ప్రకంపనల్ని సృష్టించింది. అలాగే 17వ శతాబ్దంలో అనంతపురం ప్రాంతాన్నేలిన అండే కురబల నేపథ్యంతో స్వామి రాసిన 'శప్తభూమి' నవల కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారాన్నందుకుంది. ఇటీవల వీరు రాసిన చారిత్రక నవల 'కడపటి యుద్ధం' కూడా సంచలనంగా మారిది. అలాగే మారుతి పౌరోహితం రాసిన 'ప్రణమహంపి', సడ్లపల్లి చిదంబరరెడ్డి 'లేపాక్షి' నవలలూ చారిత్రక మూల్యాంకనాలే. ఆతర్వాత కులవృత్తుల నేపథ్యంలో వచ్చిన జి.నాగశేషు నవల 'ఏకుదారం' బాగా గుర్తింపు తెచ్చుకున్నది.

థర్డ్ జండర్స్ గురించిన స్పృహ కూడా ఈమధ్యనే రచయితలకు కలుగుతోంది. వీరి గురించి మొదట రాసాని 'చీకటి రాజ్యం' నవలలో పైటన్న అన్న ఒక పాత్ర ద్వారా కాస్తా చెప్పగలిగారు. ఆతర్వాత వీరే 'తృతీయ వర్గం' అన్న గుర్తుండిపోయే కథను రాశారు. నవలాపరంగా చూస్తే బండి నారాయణస్వామి 'అర్ధనారి' అనే సంచలనాత్మక నవలను రాశారు.

ఒకప్పటి ఉద్యమాల నేపథ్యంలో విప్లవాత్మకాంశాలతో అట్టాడ అప్పలనాయుడు 'బహుళ', 'ఉత్కళం' నవలలను, పాణి 'అనేకవైపుల' అనే నవలలను రాశారు.

ఇదంతా ఒక నేపథ్యం. ఈనాటి రచనల గురించి వివరించే క్రమంలో చెప్పే ఒక భూమిక. ఈ భూమికను దృష్టిలో పెట్టుకుని ఈ సదస్సుకు వచ్చిన పత్రాలను చూస్తే దాదాపుగా పై విషయాలన్నింటిపైనా పరిశోధకులు తమ పత్రాలను సమర్పించినట్లుగా తెలుస్తుంది. జాతీయోద్యమాన్ని ప్రతిఫలించే నవలలకాన్నుంచీ, సంఘసంస్కరణ, విప్లవదృక్పథం, స్త్రీచైతన్యం, విద్యాసంబంధమైనవి, దళిత, బహుజన, గిరిజన, సంచార జాతులు, చేతివృత్తులవారి గురించి, కులవృత్తులవారి కష్టాలు వంటివాటిపైన వచ్చిన ప్రధాన నవలలపైన పేపర్లు వచ్చాయి. ఇంకా రాజకీయ, సామాజిక చైతన్య నవలలపైనా, మనోవిశ్లేషణాత్మక నవలలపైనా మంచి పత్రాలే వచ్చాయి.

ఇవన్నీ పరిశీలిస్తే వచ్చిన పత్రాలన్నీ ఆలోచనాత్మకంగానూ, సామాజిక ప్రయోజనాత్మకంగానూ ఉన్నాయి. ఇలాంటి ప్రయోజనాత్మకమైన మంచి సదస్సును ఏర్పాటు చేసినందుకు చంద్రబాబు గారినీ, పత్రసమర్పకుల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

(డా॥. వి. ఆర్. రాసాని)



**డా॥. కె. శ్రీనివాసులరెడ్డి**
తెలుగు అధ్యాపకులు
సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పీలేరు, అన్నమయ్య జిల్లా

# అభినందన

మానవుడిని మొత్తంగా తన పరిధిలోకి తీసుకుని అతన్ని సంపూర్ణంగా చిత్రించడానికి ప్రయత్నించిన మొట్టమొదటి కళారూపం నవల అంటాడు రాల్ఫ్ ఫాక్స్. నవల కాల్పనిక సాహిత్య ప్రక్రియ అయినా సామాజిక వాస్తవికత దానికి పునాది. అంత మాత్రం చేత అది కేవలం సంఘటనలని నమోదు చేసే నోట్ పుస్తకం కాదు. ఒక వ్యక్తి జీవితంలోని చిన్న శకలాన్ని తీసుకుని దాని ద్వారా జీవితావగాహనను కల్పించేది కథ అయితే ఒక వ్యక్తి జీవితాన్ని కేంద్రంగా తీసుకొని ఆనాటి సమాజాన్ని దాని పట్ల అవగాహనను చైతన్యాన్ని కలుగజేసేది నవల. ఒక వ్యక్తి జీవిత కార్యాచరణ క్రమంలో ఎదురయ్యే మార్పులను, కార్య కారణ సంబంధాలను, సంఘర్షణలను, సంక్షోభాలను వీటన్నింటి నుండి అతనికి కలిగే యెరుకను, ఆ యెరుకలో నుండి పుట్టే జీవిత కార్యాచరణను వెల్లడించేది గొప్ప నవల అవుతుంది. ఈ విధంగా చూసినప్పుడు నవల సాధించే సామాజిక ప్రయోజనం జీవిత వాస్తవికతకు, సామాజిక వాస్తవికతకు దగ్గరగా ఉండి సామాజిక చైతన్యం వైపు మనిషిని నడిపించేదిగా ఉంటుంది. అందువల్ల ఇతర సాహిత్య ప్రక్రియలతో పోల్చినప్పుడు నవలా ప్రయోజనం విస్తృతమైనదిగా కనిపిస్తుంది.

నవల వస్తుపరంగా చూసినప్పుడు దాని మూలాలు ప్రాచీన సాహిత్యం నుండినే కనిపిస్తాయి. ఇతిహాసాలు, వాటిలోని సుదీర్ఘ ఉపాఖ్యానాలు, ప్రబంధ సాహిత్యం వంటి వాటిల్లో విషయపరమైన సామ్యం నవలకు కనిపిస్తుంది. భాష, శైలి వంటి శిల్పపరమైన అంశాలను పరిగణలోకి తీసుకున్నప్పుడు నవల పూర్తిగా ఆధునికమైనది. అందుకే బూర్జువా సంస్కృతి ప్రపంచ సాహిత్యానికి ఇచ్చిన మహోజ్వలమైన కానుక నవల అని నవలా శిల్పం గ్రంథంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్య వ్యాఖ్యానిస్తాడు. పాశ్చాత్య దేశాలలోని రాచరిక సంస్కృతికి ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా మధ్యతరగతి నిర్మించిన ఆధునిక ఇతిహాసం నవల. పాండిత్యపు బరువు జీవితానికి ఆవలగా ఉండే ఊహలు, వర్ణనలను దాటి సామాన్య మానవుడి జీవితాన్ని, దాని చలనాన్ని, అందులోని ఘర్షణను, ద్వైదీ భావాన్ని, డొల్లతనాన్ని, వేదనను సాధారణ భాషలో వారికి దగ్గరగా ఉన్నదున్నట్టు జీవితాన్ని విడమరిచి చెప్పింది, చూపించింది నవల.

బ్రిటీష్ వారి కాలంలో ఉన్నత వర్గాల వారు, ఆంగ్ల చదువుల వల్ల భారతీయ సమాజాన్ని నూతన దృక్కోణంతో అర్థం చేసుకోవడం మొదలైంది. దానికి పాశ్చాత్య సాహిత్యం దోహదం చేసింది. ఆ విధంగా

ఇప్పుడు మనం నవలగా పేర్కొంటున్నది మెల్లగా భారతీయ సాహిత్యంలో ప్రవేశించింది. సాహిత్య చరిత్రలో క్షీణయుగంగా పేర్కొనే 17, 18 శతాబ్దాల తరువాత సంఘసంస్కరణ ఒక సామాజిక ఆవశ్యకతగా ఏర్పడింది. ఆ క్రమంలో భాగంగా తెలుగులో నవల యుగం మొదలైంది. సంఘసంస్కరణ కోరుకున్నది సామాజిక చైతన్యాన్ని. ఆ విధంగా తెలుగులో మొదటగా సామాజిక చైతన్య అవసరంగా నవల పురుడు పోసుకున్నది. తెలుగులో నవల ఏ సామాజిక సాహిత్య ప్రయోజనాని నెరవేర్చడం కోసం మొదలైందో ఆ అంశాన్నే భూమికగా చేసుకొని “తెలుగు నవల - సామాజిక చైతన్యం” పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించడం మొత్తం నవల సాహిత్యాన్ని, దాని ప్రయాణాన్ని, ప్రయోజనాన్ని మూల్యాంకనం చేసే ఒక బృహత్ ప్రయత్నంగా చెప్పవచ్చు. అందుకు పూనుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల,  కుప్పం తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఆసాది చంద్రబాబు గారిని అభినందించకుండా ఉండలేం.

జాతీయ సదస్సును నిర్వహించడమే కాక పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలోకి తీసుకురావడం ముదావహం. ఇందులో దాదాపు 40 కి పైగా విలువైన వ్యాసాలున్నాయి. వాటిలో  శ్రీరంగరాజ చరిత్రము నుండి నేటి వరకు జరిగిన నవలా ప్రస్థానాన్ని తమ వ్యాసాల్లో చర్చించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి, ఈ కార్యక్రమంలో తమ సహాయ సహకారాలు అందించిన అధ్యాపక మిత్రులకు అభినందనలు.

(డా॥. కె. శ్రీనివాసులురెడ్డి)



**డా॥. చంద్రబాబు ఆసాది**
**తెలుగు అధ్యాపకులు**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం,**
**చిత్తూరు జిల్లా.**

# నా మాట

తెలుగు సాహిత్యంలో 'నవల' ఒక శక్తివంతమైన ప్రక్రియ. పాశ్చాత్య దేశాల ప్రభావంతో మన దగ్గర అడుగుపెట్టినప్పటికీ, అతి తక్కువ కాలంలోనే శాఖోపశాఖలుగా విస్తరించి తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. కేవలం కాలక్షేపానికో, కథ చెప్పడానికో పరిమితం కాకుండా.. మనిషిలో దాగున్న అజ్ఞాత కోణాలను తట్టిలేపి, సమాజం పట్ల బాధ్యతను పెంచే గొప్ప సాధనం నవల.

ప్రముఖ రచయిత మొపాసా అన్నట్లుగా, చదువరులను కేవలం ఆనందపరచడమే కాకుండా, వారిని ఆలోచింపజేయడమే నవల అసలు ధ్యేయం. ఒక వ్యక్తి జీవితంలోని ఒక చిన్న సంఘర్షణ నుండి మొదలుకొని, తరతరాల చరిత్రను, సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులను కళ్ళకు కట్టినట్లు చూపగల విస్తృతి ఈ వచన ప్రక్రియకు ఉంది. నా వ్యక్తిగత ప్రయాణం కూడా సైన్స్ నేపథ్యం నుండి సాహిత్యం వైపు మళ్లిందంటే దానికి కారణం నవల కలిగించిన అంతర్మథనమే. గత 140 ఏళ్లుగా తెలుగు నవల నిరంతరం పరిణామం చెందుతూనే ఉంది. వివిధ దేశాల సంస్కృతులను మనకు పరిచయం చేయడంలోనూ, మన అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటడంలోనూ ఇది కీలక పాత్ర పోషించింది. పాఠకుడు ఒక నవలను చదువుతున్నప్పుడు అందులోని పాత్రలతో మమేకమై, తనను తాను సంస్కరించుకునే అవకాశం లభిస్తుంది. సమాజంలోని దురాచారాలను ఖండిస్తూ, చైతన్యాన్ని నింపుతూ సాగుతున్న ఈ ప్రయాణంలో నవల ఒక నిరంతర కాంతిరేఖ.

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఈ 'నవల సాహిత్యం'పై జాతీయ సదస్సు నిర్వహించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. ఈ సందర్భంగా మాకు మార్గదర్శనం చేసిన ప్రిన్సిపాల్ ఎల్. బి. ప్రదీప్ కుమార్ గారికి, పీ.యం. ఉష గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన సలహా మండలికి, అధ్యాపక మిత్రులకు, ముఖ్యంగా అడుగడుగునా తోడుగా నిలిచిన డాక్టర్ కె. శ్రీనివాసులు రెడ్డి గారు, డాక్టర్ కె. ఈశ్వర్ బాబు గారు, డాక్టర్ ఇ. వాసుగారు, పల్లె. సతీష్ గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.ఈ సంకలనం కోసం అమూల్యమైన పరిశోధనా పత్రాలను అందించిన సాహితీ మిత్రులందరికీ నా హృదయపూర్వక అభినందనలు.

ఇట్లు

**(డా॥. చంద్రబాబు ఆసాది)**
సదస్సుసంచాలకులు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఫిబ్రవరి - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



***Founder :***

Kolla Sri Krishnarao (Late)

***E-mail :***

bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.



**Vol. 23 - Spl. Issue. 02 - February 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**



## EDITORIAL BOARD

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

## ADVISORY COMMITTEE

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Former Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD, Dept. of Telugu
   Sri A.S.N.M. Govt. Degree College,
   Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

## ASSOCIATE EDITORS

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002, Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ఒక విశిష్టమైన మనోవిశ్లేషణాత్మక నవల - రాసాని 'స్వప్నజీవి' | - డా॥. మన్యం నరసింహులు | 1 |
| 2. | చలం 'మైదానం' - విశ్వనాథ 'చెలియలికట్ట' స్త్రీ స్వేచ్ఛ భావనపై తులనాత్మక అధ్యయనం | - డా॥. మానమ మునిరత్నం | 5 |
| 3. | కేశవరెడ్డి నవలలు - సామాజిక చైతన్యం | - డా॥. సి. చెన్నకేశవులు | 13 |
| 4. | 'అతడు అడవిని జయించాడు' - సామాజిక విశ్లేషణ | - డా॥. ఇ. వాసు | 18 |
| 5. | 'వొలికలబీడు' నవల - సామాజిక చైతన్యం | - డా॥. కలవకుంట ఈశ్వరబాబు | 22 |
| 6. | పాయిదరువుల నవల - గిరిజన జీవన చిత్రణ | - డా॥. సుంకర గోపాలయ్య | 27 |
| 7. | అనువాద నవలలు - సామాజిక చైతన్యం | - డా॥. చంద్రబాబు ఆసాది | 31 |
| 8. | 'నీరు నేల మనిషి' నవల - ఛిద్రమైన రైతుల జీవిత సజీవ చిత్రణ | - డా॥. పి. జయ చంద్రుడు | 35 |
| 9. | రెసిడెన్సీ నవలలో నగర జీవన వైవిధ్యం - చారిత్రక - సాంస్కృతిక విశ్లేషణ | - డా॥. ఇడికోజు శ్రీనివాసాచారి | 40 |
| 10. | వెలి బతుకుల ఆర్తనాదం అర్ధనారి | - డా॥. పి. కుమారి నీరజ | 46 |
| 11. | మధ్యతరగతి కుటుంబ విలువల విచ్ఛిన్న ప్రతిబింబం - డాలర్ కోడలు | - డా॥. గుమ్మనూరు ఉషారాణి | 51 |
| 12. | తెలుగు నవలా సాహిత్యం - స్త్రీ చైతన్య వికాసం | - భూక్యా గోపిర్యానాయక్ | 55 |
| 13. | వెనుదిరగని వెన్నెల - వస్తు విశ్లేషణ | - డా॥. వి. వింధ్యవాసినీదేవి | 60 |
| 14. | 'ప్రజల మనిషి' నవల - సామాజిక చిత్రణ | - డా॥. కట్టా సుబ్బారావు | 64 |
| 15. | చలం రచించిన "అమీనా" నవలలో నారీవాద దృక్పథం | - డా॥. ఎస్. గులాబ్ జాన్ | 68 |
| 16. | నవీన్ నవలల్లో నిర్మాణ కౌశలం | - డా॥. బి. సుబ్బలక్ష్మి | 71 |
| 17. | 'ప్రజల మనిషి' నవల విశిష్టత | - డా॥. తండు కృష్ణయ్య | 75 |
| 18. | కొలకలూరి ఇనాక్గారి "రంధి" నవల - సామాజిక చైతన్యదృష్టి | - డా॥. వై. దివ్య | 79 |
| 19. | కోకొరో జపనీస్ నవల - మానసిక సంఘర్షణ | - వై. శ్రీనివాసులు | 82 |
| 20. | అక్కినేని కుటుంబరావు నవలలు-సామాజిక చైతన్యం | - పిడతల రామచంద్రుడు | 87 |

| | | |
|---|---|---|
| 21. స్వప్నజీవి - స్త్రీ కోణం | - డా॥. టి. ఎన్. ఆంజనేయులు | 90 |
| 22. మల్లాది వెంకట కృష్ణమూర్తి సాంఘిక నవలలు-సందేశం | - జి. యమునా రాణి | 94 |
| 23. శాంతి ప్రబోధ "జోగిని" నవలలో స్త్రీ చైతన్యం | - డా॥. సయ్యద్ ఆఫిన్ బేగం | 101 |
| 24. కోడూరు కౌసల్యాదేవి సాహిత్యంలో స్త్రీ చైతన్యం | - డా॥. బి. జ్యోతి | 104 |
| 25. పాకుడురాళ్లు నవలలో స్త్రీ స్వేచ్ఛ భోగాలు రాజీ : మంజరి పాత్రలో స్త్రీవాద అస్తిత్వ సంక్షోభ విశ్లేషణ | - డా॥. కె. భీమమోహన రావు | 108 |
| 26. తెలుగులో వృత్తి ఆధారిత నవలలు (2010 - 2023) - సామాజిక, ఆర్థిక కోణం | - డా॥. సిద్ధుల జ్యోతి | 113 |
| 27. వేయి పడగల వివేచన | - డా॥. వరలక్ష్మి పూజారి | 119 |
| 28. మానవ సంబంధాల విధ్వంస చిత్రణ భూదేవి నవల | - తీగల లావణ్య | 127 |
| 29. రాగో నవల - ఆదివాసీ స్త్రీ జీవన చిత్రణ | - బొడ్డుపల్లి అఖిల్ | 132 |
| 30. ప్రతాప రుద్రుడు చారిత్ర నవల-సామాజిక చైతన్యం | - జబ్బు మధు | 136 |
| 31. శప్తభూమి నవల - దళిత బహుజన జీవన చిత్రణ | - డా॥. ఎం.రాజ్ కుమార్ | 140 |
| 32. నవలా సాహిత్యం - చాకలి వృత్తి నవలలు | - డా॥. పి. దస్తగిరి | 146 |
| 33. రాసాని నవలలు ప్రపంచీకరణ ప్రభావంతో కూలీగా మారిన రైతు | - డా॥. జి. నాగరాజు | 149 |
| 34. 'ఏడు తరాలు' నవల - బానిస బతుకుల వెతలు | - ఎ. బిందు మాధవి | 153 |
| 35. యండమూరి వీరేంద్రనాథ్ గారి అంతర్ముఖం నవల - సామాజిక ధృక్పథం | - డా॥. కొంకా మల్లికార్జున | 156 |
| 36. తెలంగాణ ప్రజా జీవనం - సామాజిక చిత్రణ | - డా॥. మెంతబోయిన సైదులు | 162 |
| 37. కుల అస్తిత్వాన్ని చిత్రించిన నవల - పుట్టు మచ్చ | - డా॥. ఉరటి సతీష్ యాదవ్ | 173 |
| 38. తెలుగు నవల - జాతీయోద్యమ చిత్రణ (మాలపల్లి, వేయిపడగలు నవలలు) | - డా॥. టేకు నీలకంఠబాబు | 181 |
| 39. 'చింతల' చేనులో మధ్య తరగతి మనుషుల బ్రతుకు పోరు | - సురేష్ సుండుపల్లి | 184 |
| 40. అంటరాని వసంతం - దళితుల జీవన చిత్రణ | - డా॥. సిహెచ్. యేసయ్య | 190 |
| 41. తెలుగు నవలల్లో దళితులు - సామాజికత | - డా॥. బి. శ్రీనివాసులు నాయక్ | 196 |

| | | |
|---|---|---|
| 42. కొల్లాయిగట్టితేనేమి? - సామాజికత | - బాణావత్ చంద్రకళ | 200 |
| 43. "తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం - పరిణామ క్రమం, సామాజిక దృక్పథం" | - బొడ్డు భరద్వాజ | 204 |
| 44. నువ్వే నీ అసలైన నిధి - పరుసవేది | - పి. స్వాతి | 214 |
| 45. మాలతీ చందూర్ - శతాబ్ది సూరీడు - స్త్రీ చైతన్యం | - డా॥. వై. స్రవంతి | 222 |
| 46. సూర నవల దళిత చైతన్యం సామాజిక విశ్లేషణ | - నరేష్ భూక్య | 230 |
| 47. పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్ నవలా త్రయంలో హైదరాబాద్ నగర జీవన చిత్రణ | - పల్లె సతీష్ | 234 |
| 48. పెద్దింటి అశోక్ కుమార్ జిగిరి నవల - సామాజిక జీవన చిత్రణ | - మారేపల్లి లక్ష్మయ్య | 239 |
| 49. షాజహాన మేరా జహా నవల - మానవీయ కోణాలు | - షేక్ జరీన బేగం<br>- డా॥. ఇరపని మాధవి | 242 |
| 50. బసివిని వ్యవస్థపై - చెరగని చైతన్య "ముద్ర" | - మద్దిలేటి సోమశేఖర్ | 246 |
| 51. కేశవరెడ్డి నవలలు - బహుజన జీవన చిత్రణ | - కూచం తేజేశ్వర | 250 |
| 52. చిల్లర దేవుళ్ళు నవలలోని ఫ్యూడల్ సమాజం | - ఇట్టవేని రాకేశ్ | 254 |
| 53. తెలుగు నవలలు - గిరిజన చైతన్యం | - ఏ. ఆర్. శ్రీకాంత్ | 260 |
| 54. 'చిల్లర దేవుళ్ళు' నవల - చారిత్రక నేపథ్యం | - ఎస్. పవిత్ర | 265 |
| 55. బ్రతుకు జీవన చిత్రం పరంపర | - అమల బానోత్ | 270 |
| 56. 'మాలపల్లి' నవలలో సామెతలు, జాతీయాలు - విమర్శాత్మక దృక్పథం | - చిట్టి రవీంద్ర | 274 |
| 57. హిమజ్వాల నవల - గీత పాత్ర మనో విశ్లేషణ | - మీసరగండ గాయత్రి దేవి | 282 |
| 58. తెలుగు నవలల్లో ఆదర్శ దాంపత్య జీవన చిత్రణ | - దేవరపల్లి విశ్వనాథ్ | 288 |
| 59. తెలుగు నవల - దళిత చైతన్యం | - యస్. రెడ్డి ఆంజనేయులు | 294 |
| 60. ప్రతి మనిషి అంతర్ముఖం-అసమర్థుని జీవయాత్ర నవల | - తండు శివుడు | 298 |
| 61. నిన్ను చేరుకోవడానికి నువ్వు చేసే ప్రయాణమే - పరుసవేది | - కె. మధుమిత | 302 |

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ఒక విశిష్టమైన మనోవిశ్లేషణాత్మక నవల
# - రాసాని 'స్వప్నజీవి'

- డా॥. మన్యం నరసింహులు
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు, తిరుపతి జిల్లా.

డా॥ వి.ఆర్. రాసానిగా ప్రసిద్ధులైన రాసాని వెంకట రామయ్య గారు 200కు పైగా కథలు, 15 నవలలు, 22 నాటికలు, కవితలు పాటలు (100), సుమారుగా నాలుగు వందల పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో తెలుగు రీడర్‌గా పనిచేసి పదవీ విరమణ చెందారు. డా॥ వి.ఆర్. రాసానిగారు అనేక పురస్కారాలు పొందారు.

ఈ మధ్యకాలంలో బాగా ప్రజల్లోకి పోయిన ఈ రచయితే రాసిన 'ఆదియోధుడు' గొప్పగా చెప్పుకోదగింది. అలాగే 'స్వప్నజీవి' ఇప్పటి సంచలనాత్మక నవల రాసాని ఏదిరాసినా బాగా పరిశీలించి, పరిశోధన చేసి రాస్తారు. వీరు ఒక నవలాకారుడిగానేకాక, గొప్ప కథకుడిగా, నాటక రచయితగా, సాహిత్య విమర్శకుడిగానూ పేరుపొందిన వారు. వారు ఇప్పటివరకు 200 కథలు, పాతిక నాటకాలు, పదహైదు నవలలు, వందల పరిశోధనా వ్యాసాలు రాశారు. వీరి నవలల్లో చీకటిరాజ్యం, మట్టి బతుకులు, ముద్ర, చీకటి ముడులు, బతుకాట, వక్రగీత, ఏడో్గ్రహం, రక్తచందనం, ఆదియోధుడు, కపిరి, వౌలికల బీడు లాంటివి ప్రసిద్ధమైన నవలలు. అందులో బతుకాట గతంలో డిగ్రీ మొదటి సంవత్సరానికి పాఠ్యాంశంగా కూడా ఉండేది. వీరిపైన పలు విశ్వవిద్యాలయాలలో ఇరవై మందికి పైగా పీహెచ్.డీలు చేశారు. వీరి పలు నవలలు, కథలు, నాటకాలు, ఇతర భాషల్లోకీ అనువాదం చేయబడ్డాయి. కృష్ణుడిని హేతువాదదృక్పథంతో పరిశోధించి రాసిన 'ఆదియోధుడు' నవల ఆంగ్లంలోకి, హిందీ, కన్నడ, జపనీస్ భాషల్లోకి అనువదింపబడి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందింది. అలాగే 'ముద్ర' నవల కన్నడ, హిందీ, ఉర్దూ భాషల్లోకి, చీకటిరాజ్యం, బతుకాట నవలలు ఆంగ్లం, కన్నడ భాషల్లోకి, వౌలికలబీడు హిందీలోకి అనువాదం చేయబడ్డాయి. ప్రస్తుతం స్వప్నజీవి మరాఠీ, కన్నడ భాషల్లోకి అనువాదం చేయబడుతోందని రచయిత ఒకచోట స్వయంగా చెప్పుకున్నారు.

మనుషుల అంతర్గత ఆలోచనలు, మానసిక సంఘర్షణ, మానసిక అపస్మారక స్థితి (Unconscious Mind) లోని కోరికలు వంటి వాటిపైన దృష్టి సారించి రాసిన రచనలను మనోవిశ్లేషణాత్మక రచనలు అంటారు. 19వ శతాబ్దం చివరిభాగంలో, 20వ శతాబ్దం ఆరంభంలో ఈ నవలా రూపం పుట్టుకొచ్చింది.మనిషి బాహ్య జీవితంతో పాటు అంతరంగ జీవితం, ఆలోచనలు, భావోద్వేగాలు, సంఘర్షణలు మొదలైన వాటిని ప్రధానంగా మనోవిశ్లేషణాత్మక నవలలు చిత్రిస్తాయి. ఈ నవలల్లో కథ కన్నా పాత్రల మనస్తత్వ విశ్లేషణకే ఎక్కువ

ప్రాధాన్యం ఉంటుంది. ఇలాంటి మనోవిశ్లేషణాత్మకమైన నవలలు ఆంగ్ల భాషలోనే మొదట వ్రాయబడ్డాయి. ఫ్రాయిడ్, యూంగ్ లాంటి వారి మానసిక సిద్ధాంతాలే దీనికి కారణం.

జర్మన్ మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన అవచేతన మనస్సు (Unconscious Mind), స్వప్న విశ్లేషణ, అణచివేత భావనలు, మనో విశ్లేషణాత్మక నవలలకు బలమైన ఆధారాలు. సమాజంలో మార్పులు, యాంత్రిక జీవితం, వ్యక్తి ఒంటరితనం కూడా ఈ నవలల ఆవిర్భావానికి కారణ మయ్యాయి. చైతన్య ప్రవాహశైలి (Stream of Consciousness) కూడా మనోవిశ్లేషణాత్మక నవలల్లో ఒక ముఖ్య లక్షణం. ఈ నవలలు మనిషి అంతరంగాన్ని లోతుగా అర్థం చేసుకొనే అవకాశం కల్పిస్తాయి. ఇవి సాహిత్యంలో కొత్తశైలిని, కొత్త దృష్టిని పరిచయం చేశాయి. ఇవి ఆధునిక నవలావికాసంలో కీలకపాత్ర పోషించాయి. ఇలాంటి నవలలు మొదటగా వర్జీనియావుల్ఫ్ (Wolf), 'Mrs Dolloway', జేమ్స్‌జాయిస్ 'Ulysses',, 'ఫ్యోడర్ దోస్తోవ్స్కీ, 'Crime and Punishment' వంటివి వచ్చాయి. వీటిని చదివిన తెలుగు రచయితలు కూడా కొందరు ఇలాంటి ప్రయత్నం చేశారు. ఈ కోవకు చెందినవే గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది', నాగరాజు 'ఊబిలో దున్న', రా.వి. శాస్త్రి 'అల్పజీవి', నవీన్ 'అంపశయ్య', కాశీభట్ల 'నేనూ - చీకటి' లాంటి నవలలు. అయితే వీటన్నింటికంటే ప్రత్యేకం గానూ, లోతుగానూ రాసిన అరుదైన మనోవిశ్లేషణాత్మక నవల డా॥ వి.ఆర్. రాసాని 'స్వప్నజీవి'. దీనిని ఇటీవల అంటే 2022వ సంవత్సరంలో ఆన్వీక్షికి ప్రచురణ వారు ముద్రించారు. ఇది ఇటీవల చాలామంది పాఠకుల్ని ఆకర్షించింది. స్వప్నజీవి క్లాసిక్ నవలనీ, సున్నిత మనస్కు డైన ఒక కళాకారుడి మానసిక సంఘర్షణనీ, మనోవిక్షిప్తిని ఫలవంతంగా చిత్రించిన నవల అనీ, అరుదైన యదార్థ జీవిత చిత్రణ నవల అనీ పలువురిచేత ప్రశంసింపబడిన గొప్పనవల. దానికి నిదర్శనం ఇటీవల ఈ నవలపైన పలు పత్రికల్లోను, ముఖపుస్తకంలోను, యూట్యూబు లోను లెక్కలేనన్ని వ్యాసాలు, ఆడియోలు, వీడియోలు రావడమే.

స్వప్నజీవి విషయానికొస్తే ముందే చెప్పినట్లుగా ఇది ఒక లోతైన మనోవిశ్లేషణాత్మక నవల. మనుషులకు అరుదుగా వచ్చే మానసికరోగం 'స్కిజోఫ్రీనియా' ఆధారం చేసుకుని రాసిన నవల ఇది. వీరు రాసిన పలు నాటకా లలో ప్రధాన స్త్రీ పాత్రలు వేసే ఒక కళాకారిణి, ఒక శాడిస్టుని పెండ్లి చేసుకుని పిచ్చిదిగా మారిపోయి, బిచ్చమెత్తుకొని తిరుగుతున్నదనీ, ఆమెను మగవాడిగా మార్చి 'హనీ' అని పేరుపెట్టి, ఆమె భర్తను 'శశికళ' అన్న కళాకారిణిగా మార్చి ఈ నవల రాసినట్టుగా రచయితే స్వయంగా ఒక ముఖాముఖిలో సెలవిచ్చారు.[1]

ఇదే నవల ముందుమాటలో ప్రచురణకర్త, కథకుడు అయిన వెంకట్‌సిద్ధారెడ్డి 'మరణం తప్పదని తెలిసిన మనిషికి తన క్షీణతను అధిగమించగలిగే ఒకే ఒక సాధనం కళ' అంటాడు[2]. అలాంటి కళను ప్రదర్శించే కళాకారుడు హనుమంతరావు, కుంచెతో అద్భుతాలు సృష్టించి 'హని'గా ప్రసిద్ధుడయ్యాడు. రంగస్థలం పైన తిరుగులేని నటనతో, గాత్రంతో హనుమంతరావు మేటి అనిపించుకున్నాడు. వేణువుతో వెన్నెలకు సైతం పూలు పూయించగల మధుర గానాన్ని పుట్టించే వేణుమాస్టరయ్యాడు. కానీ సాధారణ జీవితం గడుపుతుంటాడు. పాత ఇంటినిండా కాన్వాసులు, రంగులడబ్బాలు, సిగరెట్టు ముక్కలే. అలాంటి కళాకారుడికి తిరుపతిలోని కళాకారులంతా చేరి శశికళ అనే మరో కళాకారిణితో వివాహం జరిపిస్తారు. ఆమెకు ముందే వివాహమై, భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటుంది. ఆమెకు అప్పటికకే ఎనిమిదేళ్ల భార్గవి అనే ముద్దుబిడ్డ కూడా ఉంటుంది. ఇతనూ వివాహ వయసు దాటినవాడు కాబట్టే మిత్రులు ఆ ఇద్దరికీ పెళ్లి చేశారు. అతను పెళ్లికాకముందు వేసిన ఒక చిన్నారి బొమ్మ లాగే భార్గవి ఉంటుంది. మగదిక్కు లేని తమకు దిక్కుగా నిలచి, గౌరవ జీవితాన్నిచ్చాడన్న భావనతో భార్గవి తండ్రిని దేవుడిలా చూస్తుంటుంది. శశికళ భీమేశ్వర్ అనే బొమ్మల వ్యాపారి బొమ్మల కొట్టులో ఉద్యోగంలో చేరి, అతనితో అక్రమ సంబంధం పెట్టు

కొంటుంది. దాంతో హనీ వేసిన బొమ్మల్ని తన పేరుతో ఫ్రేములు కట్టించి అధిక ధరలతో వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటుంటాడు. భీమేశ్వర్, శశికళ ఉన్న పాత ఇల్లును అమ్మించి మరోచోట తన పేరుతో ఇల్లు కట్టించు కుంటుంది. భార్గవికి పెళ్లీడు రాగానే శ్యాంప్రసాద్ అనే మంచివాడితో పెళ్ళి కూడా జరిపిస్తాడు హనీ. హనీతో శశికళకు గిరీశ్ అనే కొడుకు కూడా పుట్టివుంటాడు. అతను నిరంతరం సెల్లునొక్కుకుంటూ కాలేజీకి పోయి వస్తుం టాడు. ఆ తల్లీకొడుకులిద్దరూ హనీని క్షణక్షణం అవ మానిస్తూ మానసిక సంఘర్షణకు గురిచేస్తుంటారు. అతనికి కపిలేశ్వర్ అనే శిష్యుడు ధైర్యం చెబుతూనే ఉంటాడు. ఒకరోజు తన ఇంట్లోనే భీమేశ్వర్‌తో శశికళ శృంగారంలో మునిగి ఉన్నప్పుడు కిటికీ నుంచీ ప్రత్యక్షంగా చూసి మనోవిక్షిప్తికి లోనై భ్రమల్లో జీవిస్తుంటాడు హనీ. ఆ భ్రమలతోనే ఇల్లు విడిచి, రైలెక్కి చిత్రకూటమనే ఒక అటవీ ప్రాంతానికి చేరుకుంటాడు.

అక్కడున్న అందమైన మన్మథమంటపాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. అదీ, దానిప్రక్కనున్న సమాధి, దానిపైన ఒక సరస్సు అంతా ఒకప్పుడు తాను వేసిన 'మన్మథ మంటపం' అన్న చిత్రపటంలాగ ఉంటుంది. దానికి రాష్ట్రపతి అవార్డు కూడా వచ్చివుంటుంది. ఆ బొమ్మ చిత్రింపబడివున్న పేపరు బోర్డుకూడా అతని సంచిలోనే, అతను ఊదే పిల్లనగ్రోవితోబాటే ఉంటుంది. అక్కడే పిచ్చివాడిగా మారిపోయి గెడ్డం, జుట్టూ పెరిగిపోయి, ఆ అడవిలోనే వున్న గిరిజనగూడెంలో అడుక్కుతింటూ ఆ మంటపంలోనే పడుకుని ప్రకృతిలో ప్రకృతిగా కలిసిపోయి జీవిస్తుంటాడు. భార్గవి, అతని శిష్యుడు కపిలేశ్వర్‌తో కలిసి అతని జాడ కనుక్కొని వెళ్లి ఇంటికి రమ్మంటే అతను రాడు. అతను పూర్తిగా భ్రమల్లో బ్రతికే స్కిజోఫ్రీనియా అనే మానసిక విక్షిప్తికి గురై, తనవాళ్ళను కూడా గుర్తుపట్టలేని స్థితిలో వుంటాడు. చివరికి భార్గవి తిరిగి ఇంటికి వచ్చి అతను తీసుకురాడానికి ఆ మరునాడు తన భర్త శ్యాంప్రసాద్, కపిలేశ్వర్, శశికళలతో వెహికల్‌లో బయలుదేరుతుంది. ఆ రోజు రాత్రే హనీ మానసిక విక్షిప్తి పరాకాష్టకు చేరి తన ప్రతిరూపంలో తనే మాట్లాడినట్లు, ఆ ప్రతిరూపం ప్రక్కనే వున్న సమాధిలోకి మాయమైనట్టు భ్రమపడి ఆ సమాధిని తవ్వుకుంటూ కూర్చుంటాడు. వీరు వెళ్ళేసరికి తాను తవ్విన ఆ సమాధి గుంతలో పడి హనీ మరణించివుంటాడు. అది చూసి భార్గవీ, కపిలేశ్వర్ భరించలేక దుఃఖంలో మునిగిపోవడంతో నవల ముగిసి పోతుంది. ఇక్కడ ఏ పాఠకుడైన కళ్ల నీళ్లు పెట్టు కోవాల్సిందే. అందుకే దీన్ని చదివిన చాలామంది జీవితంలో మరచిపోలేని పాత్ర హనీ అని చెప్పుకున్నారు.

ఈ నవలలో వాడిన భాషకూడా చాలా విలక్షణంగా, వేగంగా, పాఠకుడికి ఊపిరి పీల్చుకోలేని విధంగా సాగిపోతుంది. ఉదాహరణకు ...

"ఒక వైషగురువు మనోసంఘర్షణ, ఇంకో వైపు శిష్యుని హృదయఘోష!
బాధ! సంఘర్షణ! గురుశిష్యులత్రికోణ ఘర్షణ" (1)

"ఆ నిద్రలోనే హనీ కలలు కంటూ కలవరిస్తున్నాడు.
దె ఆర్ మై చిల్డ్రన్, నా బొమ్మల బిడ్డలు
చిల్డ్రన్, బిడ్డెలు, బిడ్డెల .... బొమ్మల బిడ్డెలు
ఒకటే కలవరింత" (2)

''ఆలోచించే కొద్దీ అతనిగుండెనెవరో కత్తితో కోస్తున్నట్లనిపించింది,
ఉన్నట్టుండి గుండెల్లోనుంచీ ఏదో, ఎవరో గుంజేసి నట్లుంది. అతని తల తిమ్మి రెక్కి, తిరిగిపోతున్నట్లని పించింది.
తను సర్వస్వం కోలుపోయినట్టు, శరీరమంతా ఏవో ప్రాకుతున్నట్లు,
సన్నసన్నని పురుగులేవో కదలాడుతున్నట్టు,
పురుగులు .. పురుగులు ... ఒకటే పురుగులు .." (3)

ఇలా నవల ఆద్యంతమూ పేజీలనుంచీ చూపును మరల్చుకోలేనంత వేగవంతమైనభాష పాఠకున్ని ఆకట్టు కుంటుంది. ఇదే నవలలో రచయిత చివరన మానసిక భ్రమలను నవలలో హనీ పాత్రపరంగా ఎన్ని రకాలు గా ఉంటాయో కూడా వివరించారు. పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నట్లు అతనికతడే మాట్లాడుకోవడం (థర్డ్‌పర్సన్ హెల్లూసినేషన్స్) దూరంగా వున్న బంధువులతో మాట్లాడుతున్నట్లు భ్రమపడడం (హెక్స్టా

హెల్లూసినేషన్స్), శరీరాంతర్భాగాలలో స్పర్శ వున్నట్లు, వారికి వారే నవ్వుకోవడం (సినీస్థటిక్ హెల్యూసినేషన్స్), ఏవో శబ్దాలువస్తున్నట్లు, ఆ శబ్దాలనే చూస్తున్నట్లు భ్రమపడడం (సైనీస్థటిక్స్). అలాగే శరీరంపైన ఏవో ప్రాకుతున్నట్లు గీరుకోవడం (కొకైన్ ఈస్థటిక్స్), తన రూపమే తనకు ఎదురుగా వచ్చి తనతో మాట్లాడు తున్నట్లు భ్రమపడడం (ఆటోస్కోపీ హెల్యూసినేషన్స్), నేల, ఆకాశం, చెట్లులాంటివి కదులుతున్నట్లు అను కోవడం (కైనీస్థటిక్స్), ఇంకా వావివరుసలు మరచి కోరికలు వున్నట్లు (ఈడిపస్ కాంప్లెక్స్) అనుకోవడం లాంటివి హనీ పాత్రపరంగా చిత్రించడం వుంది.

ఇన్ని కారణాల వల్లనే ఇది గొప్ప మనోవిశ్లేషణాత్మక నవలగా గుర్తింపబడింది. దీన్ని చదవడం ఒక గొప్ప అనుభవం, అనుభూతి కూడా.

**కళారంగ విశేషాలు :**

'స్వప్నజీవి' నవలలో మానసిక విశ్లేషణతో పాటు కళారంగం గురించిన చర్చ కూడా ఉంది. ఈ నవలలోని ప్రధానపాత్ర చిత్రకారుడు, రంగస్థల నటుడు, గాయకుడే కాక కవి కూడా. హనుమంతరావు (హనీ) సారంగధర, చెంచిత, హరిశ్చంద్ర, విరాటపర్వం మొ॥న నాటకాల్లో ప్రధాన పాత్రలు వేసేవాడు. నాటకాల్లో అతను పాడే పద్యాలకు ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ, ఈలలు వేసే వారు. కొంతమంది నాటక కంపెనీ యజమానులు ఇతర రచయితల నాటకాలను పేరు మార్చి తమ పేరును రచయితగా వేసుకొని ప్రదర్శించేవారు. ఇలా చేయడం చాలా మోసం.

చిత్రకారుల చిత్రాలను దళారులు యాభై రూపాయి లకు కొనుగోలు చేసి, వాటికి ఫ్రేమ్ కట్టించి వెయ్యో రెండువేలకో అమ్ముకొనేవారు. అంతేకాక చిత్రకళా ప్రదర్శనల్లో చిత్రకారుని పేరు ఉన్నచోట తమ పేరు రాసుకొని ప్రదర్శించి సొమ్ముచేసుకొనే ఘరానా మోస గాళ్లు ఉన్న విషయం రచయిత వివరిస్తారు.

అలాగే పడమటి విషపుగాలి వల్ల తెలుగు భాషే కాదు తెలుగు సంస్కృతి కూడా మాయమవుతున్నదనే రచయిత ఆవేదన అక్షరసత్యం.

ఈ విధంగా ఎన్నో బాధలను అనుభవిస్తూ బ్రతికిన ఒక కళాకారుడి జీవితాన్ని చిత్రించిన విశిష్ట నవల 'స్వప్నజీవి'.

**ఆధార గ్రంథాలు :**

1. స్వప్నజీవి - డా॥ వి.ఆర్. రాసాని
2. రక్తచందనం - నవల - డా॥ వి.ఆర్. రాసాని
3. ఆరుద్ర ఈశ్వర్ - యూట్యూబ్ వీడియో
4. పేటయుగంధర్ - ముఖపుస్తకం - గోడపైన - 10-01-2026.
5. జీవితం రాజేసే మానసిక సంఘర్షణకు నిలువెత్తురూపం - వ్యాసం
6. డా॥ కొత్వాలు అమరేంద్ర - 8.7.2024 ఆంధ్రప్రభ దినపత్రిక.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# చలం 'మైదానం' - విశ్వనాథ 'చెలియలికట్ట' స్త్రీ స్వేచ్ఛ భావనపై తులనాత్మక అధ్యయనం

- డా॥. మానను మునిరత్నం
తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై.

**వ్యాస సంగ్రహం :**

తెలుగు సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ అంశం ఎప్పటికీ చర్చనీయాంశమే. ఈ వ్యాసం చలం రచించిన మైదానం మరియు విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలి కట్ట అనే రెండు ప్రముఖ నవలలను ఆధారంగా తీసుకుని, స్త్రీ స్వేచ్ఛపై ప్రతిపాదితమైన భిన్న దృక్కోణాలను విశ్లేషిస్తుంది. ఈ రెండు నవలలు స్త్రీ జీవితాన్ని కేంద్రంగా చేసుకున్నప్పటికీ, స్త్రీ స్వేచ్ఛను పూర్తిగా భిన్నమైన మార్గాల్లో ప్రతిబింబిస్తాయి. మైదానంలో చలం సంప్రదాయ వివాహ వ్యవస్థను, పాతివ్రత్య భావనను ప్రశ్నిస్తూ, స్త్రీకి ప్రేమ, శరీరం, అనుభూతులపై స్వతంత్ర హక్కు ఉండాలన్న ఆలోచనను ముందుకు తెస్తాడు. అయితే ఆ ప్రశ్న చివరకు సమానత్వంతో కూడిన స్వతంత్ర జీవనంగా మారకపోవడం ఈ నవల పరిమితిగా కనిపిస్తుంది. మరోవైపు చెలియలికట్టలో విశ్వనాథ సంప్రదాయాన్ని ధర్మంగా ప్రతిష్ఠించి, దాని పరిధిలోనే స్త్రీ జీవితాన్ని నియంత్రించాల్సినదిగా చూపిస్తాడు. ఇందులో స్త్రీ స్వేచ్ఛ ప్రమాదకరమైనదిగా చిత్రితమవుతుంది.

ఈ రెండు నవలలను తులనాత్మకంగా పరిశీలించినప్పుడు, ఒకటి సంప్రదాయాన్ని ప్రశ్నించినా, మరొకటి సంప్రదాయాన్ని కాపాడినా ఈ రెండింటిలోనూ స్త్రీకి సంపూర్ణ స్వతంత్ర జీవితం అందుబాటులోకి రాలేదన్న సత్యం స్పష్టమవుతుంది. అందువల్ల, స్త్రీ స్వేచ్ఛ అనేది ఇంకా అభివృద్ధి చెందుతున్న భావనగా ఈ వ్యాసం తేల్చి చెబుతుంది.

**1. ఉపోద్ఘాతం :**

ఈనాటి సమాజంలో స్త్రీలు చదువులో, ఉద్యోగాల్లో, ఆర్థికంగా ముందుకు వస్తున్నారని చెప్పుకుంటున్నాం. కానీ ప్రేమ, వివాహం, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే విషయంలో ఆమె ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. కుటుంబం, సంప్రదాయం, సమాజం అనే పేర్లతో స్త్రీ జీవితంపై నిర్ణయాలు ఇప్పటికీ ఎక్కువగా ఇతరులే తీసుకుంటున్నారు. ఆమె అభిప్రాయానికి, ఆమె మనసుకు తగిన స్థానం లభించడంలేదు. ఈ పరిస్థితి ఇప్పటి కాలంలోనే మొదలైనది కాదు; గత శతాబ్దం నుంచే కొనసాగుతున్న సమస్యే. ఇలాంటి సందర్భంలో స్త్రీ స్వేచ్ఛ గురించి తెలుగు సాహిత్యంలో జరిగిన చర్చలను అర్థం చేసుకోవడానికి చలం రచించిన మైదానం (1927), విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలికట్ట (1935) చాలా ముఖ్యమైన నవలలు. మైదానంలో చలం సంప్రదాయ వివాహ జీవితంలో ప్రేమ లేకపోవడాన్ని, భావాలను

అణిచివేయడాన్ని ప్రశ్నించాడు. ప్రేమ ద్వారా స్త్రీకి స్వేచ్ఛ సాధ్యమవుతుందా అనే ఆలోచనను ముందుకు తెచ్చాడు. కానీ ఆ మార్గం నిజంగా ఆమెకు విముక్తి ఇచ్చిందా అనే ప్రశ్నను కూడా నవలే లేవనెత్తుతుంది. మరోవైపు చెలియలికట్టలో విశ్వనాథ సంప్రదాయ ధర్మాన్ని ఆధారంగా చేసుకుని, స్త్రీ జీవితం నియమాల మధ్య ఉండాలనే భావాన్ని చూపించాడు. ఈ రెండు నవలలు భిన్నంగా కనిపించినా, స్త్రీ స్థానం విషయంలో మన సమాజంలో ఇప్పటికీ కొనసాగుతున్న ఆలోచనా తగాదాలను స్పష్టంగా చూపిస్తాయి. అందుకే ఇవి నేటి సమాజానికి కూడా అవసరమైన రచనలుగా నిలుస్తాయి.

**1.2. లక్ష్యం :**

ఈ పరిశోధన వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం చలం రచించిన మైదానం, విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలికట్ట నవలలను పోల్చి చూడటం. ఈ రెండు నవలల ద్వారా స్త్రీ స్వేచ్ఛ, ప్రేమ, వివాహం, పాతివ్రత్యం, పురుష ఆధిపత్య ఆలోచనలు ఎలా చూపించబడ్డాయో విశ్లేషించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం. సంప్రదాయ ఆలోచనలు ఒక వైపు, మార్పు కోరే భావనలు మరోవైపు ఎలా ఎదురెదురుగా నిలిచాయో చూపించడం కూడా ఈ పరిశోధన లక్ష్యంలో భాగం. అలాగే నేటి సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి ఈ నవలలు ఎంతవరకు ఉపయోగపడతాయో స్పష్టంగా చెప్పడమే ఈ వ్యాసం లక్ష్యం.

**1.3. ముఖ్యాంశాలు :**

ఈ వ్యాసంలో మైదానం, చెలియలికట్ట నవలల ద్వారా స్త్రీ స్వేచ్ఛ, ప్రేమ-వివాహ వ్యవస్థ, సంప్రదాయం, మార్పు మధ్య తగాదా, పురుష ఆధిపత్య భావనలు, నేటి సమాజానికి ఈ నవలల అవసరాన్ని తులనాత్మకంగా పరిశీలించబడుతుంది.

**2. చలం సాహిత్యం , స్త్రీ స్వేచ్ఛ పట్ల ఆందోళన :**

**2.1 చలం సాహిత్య కేంద్ర బిందువు స్త్రీ స్వేచ్ఛ :**

చలం సాహిత్యాన్ని మొత్తం పరిశీలిస్తే, అది ఒకే ముఖ్యమైన అంశం చుట్టూ తిరుగుతుందని స్పష్టంగా తెలుస్తుంది. ఆ అంశమే స్త్రీ స్వేచ్ఛ. అయితే చలం మాట్లాడిన స్వేచ్ఛ, రాజకీయ హక్కులకో లేదా చట్టపరమైన సమానత్వానికో మాత్రమే పరిమితం కాదు. అది స్త్రీ మనస్సు, శరీరం, భావాలు ఈ మూడు స్థాయిల్లోనూ సాధించాల్సిన అంతర్గత విముక్తి. చలం దృష్టిలో స్త్రీ కేవలం త్యాగానికి ప్రతిరూపం కాదు. ఆమె ప్రేమించగలదు, ప్రశ్నించగలదు, అవసరమైతే తిరస్కరించగలదు. అంటే స్త్రీ కూడా ఒక సంపూర్ణ మనిషి అనే భావన చలం సాహిత్యానికి మూలం. ఈ విషయాన్ని చలం స్పష్టంగా ఇలా చెప్పాడు “స్త్రీని దేవతగా చేసి పూజించడం కాదు; మనిషిగా గుర్తించడమే అసలైన గౌరవం” (చలం, మైదానం, 1927, పు. 14) ఈ వాక్యం చలం సాహిత్య దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి కీలకంగా ఉపయోగపడుతుంది.

**2.2 చలం సాహిత్యంలో స్త్రీ పాత్రల స్వభావం :**

చలం సాహిత్యంలో కనిపించే శశిరేఖ, అరుణ, లాలన, పద్మావతి వంటి స్త్రీ పాత్రలు సంప్రదాయ పాతివ్రత్యాన్ని అంధంగా అంగీకరించవు. అవి పెద్ద తిరుగుబాట్లు చేయకపోయినా, తమ మనసు మాటను వినిపించడానికి ప్రయత్నిస్తాయి. ఈ పాత్రల్లో అరుపులు, నినాదాలు ఉండవు కానీ నిశ్శబ్దమైన ధైర్యం ఉంటుంది. చలం ఒకచోట ఇలా అంటాడు

“మౌనం కూడా ఒక తిరుగుబాటే; అది మనసులో పుట్టినప్పుడు” (చలం, చెలియలకట్ట, పు. 67) ఈ వ్యాఖ్య చలం స్త్రీ పాత్రల అంతర్గత స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

**2.3 'మైదానం'లో రాజేశ్వరి ఒక సంక్లిష్ట పాత్ర :**

మైదానం నవలలోని రాజేశ్వరి పాత్ర చలం సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందుతుంది. ఆమె బాహ్యంగా ధైర్యంగా కనిపించినా, అంతర్గతంగా తీవ్రమైన గందరగోళంలో ఉంటుంది. సంప్రదాయ వివాహ జీవితం ఆమెకు ప్రేమను ఇవ్వదు; కర్తవ్యాలు, నిర్లక్ష్యమే మిగులుతాయి. అందుకే ఆమె ఆ జీవితం నుంచి బయటకు రావాలని నిర్ణయించుకుంటుంది. ఈ పరిస్థితిని చలం ఇలా వ్యక్తపరుస్తాడు “గృహ జీవితం స్త్రీకి ప్రేమ ఇవ్వకపోతే, అది బంధనమే అవుతుంది” (చలం,

మైదానం, పు. 42) అయితే ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న ఉద్భవిస్తుంది, రాజేశ్వరి నిజంగా స్వేచ్ఛ వైపు అడుగు వేసిందా? లేదా ఒక బంధం నుంచి మరో బంధంలోకి ప్రవేశించిందా?

**2.4 ప్రేమలో సమానత్వం మైదానం వేసిన ప్రశ్న :**

రాజేశ్వరి వివాహాన్ని తిరస్కరించడం ధైర్యమైన నిర్ణయమే. కానీ ఆమె ప్రేమ జీవితం పూర్తిగా సమానత్వంపై ఆధారపడిందని చెప్పలేం. అక్కడ కూడా నిర్ణయాలు ప్రధానంగా పురుషుడివే. ఆమె త్యాగం చేస్తుంది; ఆమెనే భరిస్తుంది. అందుకే ఒక విమర్శకుడు ఇలా వ్యాఖ్యానించాడు "రాజేశ్వరి పాతివ్రత్యాన్ని వదిలింది గానీ, పురుషాధిక్యాన్ని వదల్లేదు" (కె. రామకృష్ణ, చలం సాహిత్యం : స్త్రీ విమర్శ, పు. 91) ఈ వ్యాఖ్య మైదానం నవలలోని అంతర్గత లోపాన్ని స్పష్టంగా చూపిస్తుంది.

**2.5 శరీర స్వేచ్ఛ, చలం దృక్కోణం :**

చలం శరీరాన్ని పాపంగా చూసే సంప్రదాయ ఆలోచనలను తిరస్కరిస్తాడు. ఆయన దృష్టిలో శరీరం అపవిత్రం కాదు; అది అనుభూతుల కేంద్రం. "శరీరాన్ని దాచడం వల్ల పవిత్రత రాదు; అర్థం చేసుకోవడం వల్లే వస్తుంది" (చలం, మైదానం, పు. 58) ఈ భావన అప్పటి సమాజానికి సంచలనంగా మారింది. ఇప్పటికీ స్త్రీ శరీరం గురించి మాట్లాడటం సులభం కాదు. అందువల్ల చలం ఆలోచనలు ఇంకా ప్రాధాన్యం కలిగినవే.

**2.6 చలం సాహిత్యంలో అంతర్గత ఆందోళన :**

చలం స్త్రీ విముక్తిని కోరుకున్నాడు. కానీ సమాజ నిర్మాణాన్ని పూర్తిగా మార్చలేకపోయాడు. అందుకే ఆయన స్త్రీ పాత్రలు సంపూర్ణ విజేతలుగా కాక, ప్రశ్నలుగా మిగులుతాయి.

అందుకే మైదానం సమాధానాలు ఇవ్వదు ప్రశ్నలు వేస్తుంది. ఆ ప్రశ్నలే చలం సాహిత్యానికి ప్రాణం.

**2.7 సమకాలీన సమాజంలో చలం ఆలోచనల అవసరం:**

నేటికీ అనేకమంది స్త్రీలు ఒక బంధం నుంచి మరో బంధంలోకి వెళ్తూనే ఉన్నారు. సంప్రదాయం నుంచి ప్రేమలోకి, ప్రేమ నుంచి కొత్త ఒత్తిళ్లలోకి. ఈ పరిస్థితిని రాజేశ్వరి పాత్ర ముందుగానే సూచించింది. అందుకే చెప్పవచ్చు

రాజేశ్వరి పరాజయం కాదు.ఆమె ఒక ప్రయాణం. ఆ ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది.చలం సాహిత్యం స్త్రీ స్వేచ్ఛను సంపూర్ణంగా అందించలేకపోయినా, ఆ స్వేచ్ఛ అవసరమని గట్టిగా గుర్తు చేసింది. అదే ఆయన సాహిత్య విజయంగా భావించవచ్చు.

**3. 'మైదానం' స్త్రీ తిరుగుబాటా? భావోద్వేగ బానిసత్వమా?:**

**3.1 రాజేశ్వరి సంప్రదాయ గృహిణి నుంచి తిరుగుబాటు వైపు :**

చలం రచించిన మైదానం నవలలో రాజేశ్వరి మొదట సంప్రదాయ గృహిణిగా కనిపిస్తుంది. ఆమె భర్త చదువుకున్న లాయరు. సమాజంలో గౌరవం ఉన్న వ్యక్తి. బయటికి చూస్తే అది "మంచి సంసారం"గా అనిపిస్తుంది. కానీ ఆ ఇంట్లో రాజేశ్వరి జీవితం సంతోషంగా ఉండదు.

ఆమెకు ప్రేమ లేదు. రోజువారీ పనులు, బాధ్యతలే ఉన్నాయి. తన మనసు చెప్పుకునే అవకాశం లేదు. ఈ పరిస్థితిని రాజేశ్వరి ఇలా వ్యక్తపరుస్తుంది "ఈ ఇంట్లో నేను భార్యను కాదు...పనిమనిషినీ కాదు... మధ్యలో ఎక్కడో నిలబెట్టిన ఒక నీడను." (చలం, మైదానం, పు. 42) ఈ వాక్యం ఆమె జీవితంలోని ఖాళీని స్పష్టంగా చూపిస్తుంది. వివాహం ఆమెకు భద్రత ఇచ్చింది గానీ, ఆత్మగౌరవం ఇవ్వలేదు. అందుకే ఆమె ఆ బంధం నుంచి బయటపడాలని కోరుకుంటుంది. ఆ కోరిక ఫలితంగా ఆమె అమీర్తో కలిసి ఇంటిని వదిలి వెళ్లడం ఒక ధైర్యమైన నిర్ణయం. కుటుంబం, సంప్రదాయం, సమాజాన్ని దాటి వేసిన అడుగు అది. కానీ ఈ నిర్ణయం నిజమైన స్వేచ్ఛకా? అనే ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది.

**3.2 మైదానంలో ప్రేమ స్వేచ్ఛ అనుభూతియా? :**

రాజేశ్వరి అమీర్ మధ్య ప్రేమను చలం ప్రకృతి నేపథ్యంతో చూపిస్తాడు. మైదానం రాజేశ్వరికి కొత్త అనుభూతిని ఇస్తుంది. అక్కడ ఆమె తనను తాను కొత్తగా గుర్తిస్తుంది "ఆ మైదానం నాకు, మొదటిసారి నేను నేనే అనిపించిన స్థలం." (చలం, మైదానం, పు. 70).

ఇక్కడ ఆమె తన శరీరాన్ని, మనసును మొదటిసారి తనదిగా అనుభవిస్తుంది. సంప్రదాయ సమాజం శరీరాన్ని పాపంగా చూసిన చోట, చలం దాన్ని సహజమైన అనుభూతిగా చూపించాడు.అయితే ఈ ప్రేమలో ఒక లోపం ఉంది. సమానత్వం లేదు. అమీర్ మాటే చివరి మాటగా ఉంటుంది. రాజేశ్వరి ప్రశ్నలు అడిగితే అతనికి ఇష్టం ఉండదు. నవలలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది "ఆమె మాటలు అతనికి ప్రశ్నలుగా అనిపించాయి." (చలం, మైదానం, పు. 78)

ఇక్కడ రాజేశ్వరి తన నిర్ణయాధికారాన్ని క్రమంగా కోల్పోతుంది. ప్రేమ పేరుతో తన భావాలను అణిచివేస్తుంది. అమీర్ కోపాన్నీ ప్రేమగా అర్థం చేసుకునే స్థితికి చేరుతుంది. "అతని కోపాన్నికూడా ఆమె ప్రేమగానే భావించింది." (చలం, మైదానం, పు. 85) ఇది స్వేచ్ఛ కాదు. ఇది భావోద్వేగ ఆధీన స్థితి.

**3.3 తిరుగుబాటు ఫలితమా? లేదా కొత్త బంధమా? :**

రాజేశ్వరి చేసిన తిరుగుబాటు వ్యక్తిగత స్థాయిలోనే ఆగిపోతుంది. అది ఒక సామాజిక ఉద్యమంగా మారదు. ఒక వ్యవస్థను కూల్చదు. కేవలం ఒక బంధం నుంచి మరో బంధంలోకి మారుతుంది. ఈ విషయాన్ని విశ్వనాథ చెలియలికట్ట లో ఇలా సూచిస్తాడు"అధికారం లేని స్వేచ్ఛ అవ్యవస్థకు దారి తీస్తుంది." (విశ్వనాథ, చెలియలికట్ట, పు. 56) చలం ప్రశ్నలు వేస్తాడు. విశ్వనాథ దిశను సూచిస్తాడు. ఈ తేడా ఇద్దరు రచయితల ఆలోచనా భేదాన్ని చూపిస్తుంది. చివరికి రాజేశ్వరి చేసిన తిరుగుబాటు సంపూర్ణ విముక్తికి దారి తీసిందని చెప్పలేం. ఆమెకు ధైర్యం ఉంది. కానీ ఆ ధైర్యానికి స్పష్టమైన దిశ లేదు. వ్యవస్థను మార్చలేక, మరో వ్యక్తి ఆధీనంలో చిక్కుకుంది. అందువల్ల మైదానం కేవలం స్త్రీ స్వేచ్ఛను చూపించిన నవల కాదు; స్వేచ్ఛ పేరుతో వచ్చే భావోద్వేగ బానిసత్వాన్ని కూడా బయటపెట్టిన నవల.

**4. విశ్వనాథ 'చెలియలికట్ట' ధర్మం పేరుతో స్త్రీ జీవితానికి గీతలు :**

**4.1 రత్నావళి వ్యక్తి కాదు, ధర్మ భావనకు ప్రతీక :**

విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలికట్ట నవలలో రత్నావళి ప్రధాన స్త్రీ పాత్ర. అయితే ఆమెను రచయిత ఒక సాధారణ స్త్రీగా చిత్రించడు. ఆమె వ్యక్తిగత కోరికలు, స్వతంత్ర నిర్ణయాలు కలిగిన వ్యక్తిగా కాకుండా, ఒక నిర్దిష్ట ధర్మ భావనకు ప్రతినిధిగా నిలబెడతాడు. ఈ నవలలో విశ్వనాథ స్పష్టంగా ప్రతిపాదించాలనుకున్నది ఒక్కటే , స్త్రీ జీవితం సంప్రదాయం, ధర్మ నియమాల లోపలే ఉండాలి అన్న భావన.

రత్నావళి తన మనసు మాట వినాలని ప్రయత్నించిన ప్రతిసారి కథ దారి మళ్లుతుంది. ఆమె ఆలోచనలు స్వతంత్రంగా ఎదగకుండా రచయిత స్వరం అడ్డుకుంటుంది. స్త్రీ స్వేచ్ఛ అనే ఆలోచనను ధర్మానికి వ్యతిరేకమైనదిగా చిత్రిస్తూ, నవలలో ఒకచోట ఇలా స్పష్టంగా చెబుతారు "స్త్రీ స్వేచ్ఛ కోరడం ధర్మాన్ని తక్కువ చేయడమే." (విశ్వనాథ, చెలియలికట్ట, పు. 72).

ఈ వాక్యం రత్నావళి వ్యక్తిగత అభిప్రాయం కాదు; అది రచయిత సిద్ధాంతం. అందువల్ల ఆమె పాత్ర మనిషిలా ఎదగదు. ఆమె ఒక హెచ్చరికగా మారుతుంది. సంప్రదాయాన్ని దాటితే పరిణామం ఏమిటో చూపించే సాధనంగా ఆమెను ఉపయోగిస్తారు.

నవల చివర రత్నావళి ఆత్మహత్య చేసుకోవడం వ్యక్తిగత విషాదంగా మాత్రమే చూడలేం. అది ఒక తుది నైతిక తీర్పు. సంప్రదాయానికి విరుద్ధంగా ఆలోచించిన స్త్రీకి జీవితం ఇవ్వలేమన్న సందేశాన్ని ఈ ముగింపు బలంగా ప్రతిపాదిస్తుంది. ఈ స్థాయిలో చెలియలికట్ట ధర్మాన్ని కాపాడే రచనగా నిలుస్తుంది; కానీ ఆ రక్షణలో స్త్రీ వ్యక్తిత్వం త్యాగమవుతుంది. ఇక్కడే చలం మైదానంతో పోలిక స్పష్టమవుతుంది. చలం స్త్రీకి ప్రశ్నించే అవకాశం ఇస్తాడు. విశ్వనాథ మాత్రం ప్రశ్నకే స్థానం ఇవ్వడు. చలం ప్రశ్నలతో కథను నడిపిస్తే, విశ్వనాథ తీర్పుతో కథను ముగిస్తాడు.

**4.2 ఒకే సమాజం , రెండు న్యాయాలు :**

చెలియలికట్టలో విశ్వనాథ పురుష , స్త్రీ సంబంధాలపై ఒక ప్రత్యేక దృక్కోణాన్ని ప్రతిపాదిస్తాడు. పురుషుని కోరికలను సహజంగా అంగీకరిస్తూ, స్త్రీకోరికలను నియంత్రించాల్సినవిగా చిత్రిస్తాడు.ఈ భావనను నవలలో

ఒకచోట ఇలా వ్యక్తం చేస్తారు "ప్రతి పురుషుడికీ స్త్రీ సుఖంపై హక్కు ఉంది." (విశ్వనాథ, చెలియలికట్ట, పు. 88) ఈ వాక్యం లోతుగా చూస్తే ఒక ద్వంద్వ న్యాయాన్ని వెల్లడిస్తుంది. పురుషునికి కోరిక హక్కుగా కనిపిస్తుంది; స్త్రీకి అదే కోరిక తప్పుగా మారుతుంది. స్త్రీ శరీరం ఆమెకు చెందిందిగా కాక, సమాజానికి చెందిందిగా భావించబడుతుంది. ఆమె సుఖం ఆమెది కాదు; ధర్మ నియమాలకు లోబడి ఉండాల్సిందే అన్న భావన బలంగా ప్రతిపాదించబడుతుంది.

విధవలు, యువతులు తమ భావాలను అణచుకోవాల్సిందే. అలా చేయకపోతే అది పాపంగా ముద్ర వేస్తారు. ఆ పాపానికి శిక్ష మరణం. రత్నావళి మరణం ఈ సిద్ధాంతానికి తుది ఉదాహరణ. ఇదే సమయంలో చలం మైదానంలో స్త్రీ ప్రశ్నిస్తుంది "నాకు కోరికలు ఉండటం తప్పేనా?" (చలం, మైదానం, పు. 64)

ఈ ప్రశ్నకు చెలియలికట్ట సమాధానం ఇవ్వదు; తిరస్కరిస్తుంది. చలం ప్రశ్నను బతికిస్తాడు. విశ్వనాథ ప్రశ్నను మూసివేస్తాడు.

ఈ ధర్మ దృష్టికోణం కేవలం గత కాలానికి చెందినది కాదు. నేటికీ పురుషుల వ్యక్తిగత జీవితం సహజంగా అంగీకరించబడుతూ, స్త్రీలది తప్పుగా చూడబడే పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ భావనల మూలాలు ఇలాంటి సాహిత్య ధర్మ వాదనల్లోనే కనిపిస్తాయి.

పరిశీలనలో తేలిన అంశాలు, చెలియలికట్ట స్త్రీ విముక్తిని ప్రతిపాదించే నవల కాదు. ఇది స్త్రీకి హద్దులు చూపించే నవల. సంప్రదాయానికి లోబడితే జీవితం ఉంటుందని, దాటితే శిక్ష తప్పదని చెప్పే రచన ఇది. ఈ భావన ఒక కాలానికి చెందినదైనా, దాని ప్రభావం పూర్తిగా తొలగిపోలేదు. అందువల్ల 'చెలియలికట్ట'ను పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు. అలాగే అన్నింటికీ సమ్మతించాల్సిన అవసరం కూడా లేదు. ఇది ఒక ప్రత్యేక ఆలోచనతో రాసిన నవల. అందుకే దీన్ని ఆలోచిస్తూ, ప్రశ్నలు వేసుకుంటూ చదవాలి.

**5. మైదానం , చెలియలికట్ట :**

**(స్త్రీ జీవితం గురించి రెండు భిన్నమైన దృక్కోణాలు - తులనాత్మక విశ్లేషణ)**

చలం రచించిన మైదానం మరియు విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలికట్ట నవలలు స్త్రీ జీవితాన్ని కేంద్రంగా చూపిస్తున్నప్పటికీ, స్త్రీని చూసే దృక్కోణం పూర్తిగా భిన్నం. ఒక నవల స్త్రీ మనసును అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తే, మరొక నవల స్త్రీకి హద్దులు వేస్తుంది. ఈ భేదం పాత్రల స్వభావం, ప్రేమ భావన, చివరి ముగింపు, రచయిత చూపు, సమాజానికి ఇచ్చే సందేశంలో స్పష్టంగా కనిపిస్తుంది.

**5.1 స్త్రీ స్థానం , మనసా? నియమమా? :**

**మైదానం :**

రాజేశ్వరి ఇంట్లో గౌరవం, పేరు ఉన్నా మనసుకు విలువ ఇవ్వబడదు. ప్రేమ లేకుండా జీవించడం ఆమెకు భారంగా మారుతుంది. "ఈ ఇంట్లో నాకు పేరు ఉంది...కానీ నా జీవితం మాత్రం ఎక్కడో పోయింది." (చలం, మైదానం, పుట 58):

**చెలియలికట్ట :**

రత్నావళి స్థానం నియమాలతో నిర్ణయించబడుతుంది. వ్యక్తిగత కోరికలకు ప్రాధాన్యం ఉండదు. "స్త్రీ ధర్మాన్ని విడిచిన క్షణమే ఆమె పతనం మొదలవుతుంది." (విశ్వనాథ సత్యనారాయణ, చెలియలికట్ట, పుట 72)

**తులనాత్మక భావన :**

మైదానం మనసు ఆధారంగా స్త్రీస్థానం.

చెలియలికట్ట నియమాల ఆధారంగా స్త్రీ స్థానం.

**5.2 స్వేచ్ఛ భావన , వెతుకులాటా? హెచ్చరికనా? :**

**మైదానం :**

రాజేశ్వరి స్వేచ్ఛను వ్యక్తిగత సంబంధంలో అనుభవిస్తుంది. భర్త ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత, అమీర్ దగ్గర కొద్దిసేపు తనదైన భావన కలుగుతుంది.

"అతని దగ్గర ఉన్నప్పుడు నా శరీరం నాకు చెందినదనిపించింది." (చలం, మైదానం, పుట 64)

**చెలియలికట్ట :**

స్వేచ్ఛ ప్రమాదకరంగా చూపబడుతుంది. అనవసర

స్వేచ్ఛ స్త్రీకు అనుమతించబడదు, అది సమాజాన్ని చీల్చే మార్గం. "అర్థం లేని స్వేచ్ఛ సమాజాన్ని నాశనం చేస్తుంది." (విశ్వనాథ సత్యనారాయణ, చెలియలికట్ట, పుట 88)

**తులనాత్మక భావన :**

మైదానం వ్యక్తిగత అనుభవంలో పరిమిత స్వేచ్ఛ

చెలియలికట్ట హెచ్చరిక, నేరం

**5.3 చివరి ముగింపు , ఆలోచనా? శిక్షనా? :**

**మైదానం :**

రాజేశ్వరి భవిష్యత్తు ప్రశ్నగా మిగిలిపోతుంది. రచయిత పాఠకుడిని ఆలోచించమని సూచిస్తాడు.

**చెలియలికట్ట :**

రత్నావళి ఆత్మహత్య వ్యక్తిగత విషాదం కాదు, సంప్రదాయం ఇచ్చిన తీర్పు. సరిహద్దు దాటిన స్త్రీకి శిక్ష తప్పదు.

**తులనాత్మక భావన :**

మైదానం ముగింపు ప్రశ్నగా ఉంటుంది

చెలియలికట్ట ముగింపు శిక్షతో ఉంటుంది

**5.4 రచయిత చూపు :**

**చలం :**

పాత్రలను జీవితం మధ్యలో చూపిస్తాడు. తప్పులు ఉన్నా శిక్షించడు. పాఠకుడికి ప్రశ్నలు వేస్తాడు.

**విశ్వనాథ :**

సిద్ధాంతం ప్రధానం. పాత్రలు ఆ సిద్ధాంతాన్ని మోసేవాళ్లే. వ్యక్తిగత బాధ కంటే ధర్మం ముఖ్యమవుతుంది.

**5.5 సమాజానికి ఇచ్చే సందేశం :**

**మైదానం :**

ప్రేమ పేరుతో కూడా స్త్రీ బంధించబడవచ్చు.

**చెలియలికట్ట :**

సంప్రదాయం దాటితే స్త్రీకి స్థానం లేదు.

నిజమైన స్త్రీ స్వేచ్ఛ ఈ రెండింటిలో ఏదీ కాదు. ఇది రెండింటినీ దాటి ఉండాలి.

మైదానం మనసును ప్రశ్నిస్తుంది. చెలియలికట్ట మనసుకు హద్దు వేస్తుంది. ఈ రెండు నవలలు కలిపి స్త్రీ స్వేచ్ఛ ఎంత క్లిష్టమైనదో స్పష్టంగా చూపిస్తాయి.

**6. రెండు నవలల నుంచి వచ్చిన ఫలితం :**
**(స్త్రీ స్వేచ్ఛపై ఈ వ్యాసంలో చెప్పే స్పష్టమైన మాట)**

ఈ వ్యాసంలో చలం రచించిన మైదానం మరియు విశ్వనాథ సత్యనారాయణ రచించిన చెలియలికట్ట నవలలను పరిశీలించిన తరువాత ఒక ముఖ్యమైన విషయం స్పష్టంగా బయటపడింది. ఈ రెండు రచనలు స్త్రీ జీవితాన్ని కేంద్రంగా తీసుకున్నప్పటికీ, స్త్రీ స్వేచ్ఛకు సరైన దారి ఏదీ పూర్తిగా చూపలేకపోయాయి.

మైదానం నవలలో చలం సంప్రదాయ వివాహ జీవితం స్త్రీకి ఎలా భారంగా మారుతుందో చూపించాడు. రాజేశ్వరి ద్వారా స్త్రీ మనసు, అనుభూతులు, ప్రేమ ఎంత ముఖ్యమో తెలియజేశాడు. భర్తతో కలిసి ఉన్న జీవితం ఆమెకు భద్రత ఇచ్చినప్పటికీ, అంతరంగ సంతృప్తి ఇవ్వలేకపోయింది. అందుకే ఆమె తన జీవితానికి అర్థం వెతుక్కుంటూ బయటకు వస్తుంది. ఈ దశలో చలం స్త్రీకి ప్రశ్న వేసే హక్కు ఇచ్చాడు. ఇది ఈ నవల ఇచ్చిన ముఖ్యమైన సానుకూల ఫలితం. అయితే, అదే నవల చివరికి వచ్చేసరికి రాజేశ్వరి జీవితంలో నిజమైన స్వతంత్రత ఏర్పడదు. భర్త ఆధీనంనుంచి బయటపడిన ఆమె, ప్రేమ పేరుతో మరో వ్యక్తిపై ఆధారపడే స్థితికి చేరుతుంది. అందువల్ల సంప్రదాయం నుంచి బయటపడటం మాత్రమే స్త్రీ విముక్తి కాదన్న విషయం స్పష్టమవుతుంది. ఈ నవల స్త్రీ సమస్యను చూపింది గానీ, పరిష్కారాన్ని పూర్తిగా ఇవ్వలేదు.

చెలియలికట్ట నవలలో విశ్వనాథ సంప్రదాయాన్ని ధర్మంగా నిలబెట్టి చూపించాడు. రత్నావళి పాత్ర ద్వారా స్త్రీకి హద్దులు అవసరమనే భావనను బలంగా చెప్పాడు. వ్యక్తిగత కోరికలు, భావాలు ధర్మానికి లోబడినప్పుడే అంగీకారయోగ్యమని ఈ నవల స్పష్టం చేస్తుంది. సంప్రదాయం దాటిన స్త్రీకి చివరికి శిక్షే ఎదురవుతుందనే భావనను రచయిత ముగింపులో బలంగా ప్రతిపాదించాడు. ఈ విధంగా చూస్తే, చెలియలికట్ట సంప్రదాయాన్ని కాపాడింది గానీ, స్త్రీ వ్యక్తిత్వాన్ని కాపాడ

లేకపోయింది. స్త్రీ జీవితం ఒక సిద్ధాంతాన్ని నిలబెట్టడానికి ఉపయోగపడే సాధనంగా మారింది. ఇది ఈ నవల ద్వారా వెలువడిన ముఖ్యమైన ఫలితం.

ఈ రెండు నవలలను కలిపి చూసినప్పుడు ఒక స్పష్ట మైన నిజం బయటపడుతుంది. రాజేశ్వరి అయినా, రత్నావళి అయినా ఇద్దరూ తమ జీవిత నిర్ణయాలను స్వయంగా తీసుకునే స్థాయికి పూర్తిగా చేరలేకపోయారు. ఒకరిని ప్రేమ పేరుతో కట్టిపడేశారు; మరొకరిని ధర్మ పేరుతో అణిచేశారు. మార్గాలు వేరు అయినా, ఫలితం ఒకటే స్త్రీ స్వేచ్ఛ అసంపూర్ణమే.

అందువల్ల ఈ వ్యాసం చెప్పే తుది ఫలితం ఏమి టంటే స్త్రీ విముక్తి అనేది సంప్రదాయాన్ని విస్మరించడం వల్ల గానీ, సంప్రదాయానికి పూర్తిగా లోబడి ఉండటం వల్ల గానీ సాధ్యం కాదు. స్త్రీకి తన జీవితం మీద నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నప్పుడే నిజమైన స్వేచ్ఛ మొదలవుతుంది. ఆర్థిక భద్రత, శరీరంపై హక్కు, ప్రేమలో సమానత్వం, వ్యక్తిగత గౌరవం ఈ నాలుగు కలిసినప్పుడే స్త్రీ జీవితం సంపూర్ణంగా మారుతుంది.

ఈ దృష్టితో చూస్తే, మైదానం ప్రశ్నను ముందుకు తెచ్చింది; చెలియలికట్ట ఒక సమాధానాన్ని విధించింది. కానీ నేటి సమాజానికి తప్పనిసరి ప్రశ్నను బతికించి, సమానత్వంతో కూడిన కొత్త దారిని వెతకడం. అదే ఈ రెండు నవలల పరిశీలన మనకు ఇచ్చిన అసలైన ఫలితం.

### 7. ఉపసంహారం
### (స్త్రీ స్వేచ్ఛపై తెలుగు సాహిత్య తుది నిర్ణయం)

చలం రచించిన మైదానం మరియు విశ్వనాథ సత్య నారాయణ రచించిన చెలియలికట్ట ఈ రెండు నవలలు తెలుగు సాహిత్యంలో స్త్రీ జీవితాన్ని కేంద్రంగా చూపుతూ, స్వేచ్ఛపై విభిన్న దృక్కోణాలను ప్రతిపాదిస్తాయి. ఒకటి సంప్రదాయాన్ని ప్రశ్నిస్తే, మరొకటి అదే సంప్రదాయాన్ని కాపాడుతుంది. అయినప్పటికీ, ఈ రెండు మార్గాల మధ్య స్త్రీకి పూర్తి స్వతంత్ర జీవితం దొరకలేదనే విషయం స్పష్టంగా గుర్తించవచ్చు.

మైదానంలో చలం సంప్రదాయ వివాహాన్ని, పాతివ్రత్య భావనను ప్రశ్నిస్తూ, స్త్రీ శరీరానికి, ప్రేమకు, అనుభూతులకు స్వతంత్ర హక్కు ఉందని ప్రతిపాదిం చాడు. రాజేశ్వరి పాత్ర స్త్రీ వ్యక్తిత్వానికి, కోరికలకు మౌలిక స్థానం కల్పించే ప్రయత్నంగా ఉంటుంది. కానీ, ప్రేమ సంబంధాల్లో సమానత్వం సృష్టించలేకపోవడం, స్వతం త్రత్వానికి అడ్డంకిగా మారుతుంది.

చెలియలికట్టలో విశ్వనాథ సత్యనారాయణ సంప్ర దాయాన్ని ధర్మ కేంద్రంగా నిలబెట్టి, స్త్రీ స్వేచ్ఛను ప్రమాద కరంగా చూపిస్తాడు. రత్నావళి పాత్ర ద్వారా, సంప్ర దాయాన్ని దాటిన స్త్రీకి ఎదురయ్యే సమస్యలను, నష్టా లను, మరియు స్వతంత్రత కోసం తీసుకోవలసిన నిర్ణయాల పరిమితులను హైలైట్ చేస్తాడు. రాజేశ్వరి అయినా, రత్నావళి అయినా పురుషాధిక్య సమాజంలో నియంత్రణకు లోబడిన పాత్రలే. మారినది రూపం మాత్రమే; నియంత్రణ తత్వం అలాగే ఉంది. ఈ రెండు నవలలు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తాయి:

సంప్రదాయాన్ని ప్రశ్నించడం, లేదా దానిని రక్షించడం ఏదీ స్త్రీ స్వేచ్ఛను పూర్తిగా ఇవ్వదు. నిజమైన స్వేచ్ఛ ఆర్థిక, శారీరక, మానసిక సమానత్వం కలిగినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. స్త్రీ స్వతంత్రత అంటే ప్రేమకు బానిస కావడం, లేదా ధర్మానికి బలవంతం కింద ఉండటం కాకుండా, సమానత్వం ఆధారంగా నిర్మించిన మానవ హక్కులలో జీవించడం.

ఈ వ్యాసం చెప్పే మాట , మైదానం నవలలో చలం సంప్రదాయాన్ని ప్రశ్నించాడు. స్త్రీకి తన మనసు, తన భావాలు ముఖ్యమని చెప్పాడు. కానీ ఆ ప్రశ్న చివరికి సమానత్వంగా మారలేదు. సంప్రదాయం నుంచి బయట పడిన స్త్రీ ప్రేమలో కూడా స్వతంత్రంగా నిలబడ లేకపోయింది.

చెలియలికట్ట నవలలో విశ్వనాథ సంప్రదాయాన్ని కాపాడాడు. ధర్మమే ప్రధానమని చెప్పాడు. కానీ ఆ ధర్మ పరిరక్షణలో స్త్రీకి స్వతంత్ర నిర్ణయాల అవకాశం లేదు. ఆమె జీవితం పరిమితుల్లోనే ముగిసిపోతుంది.

ఈ రెండు నవలలు కలిపి మనకు చెప్పేది ఇదే

స్త్రీ స్వేచ్ఛ పూర్తిగా సాధ్యపడలేదు.

ఒక చోట ప్రశ్న ఉంది కానీ దారి లేదు.

మరో చోట దారి ఉంది కానీ ప్రశ్నకే చోటు లేదు.

కాబట్టి నేటి సమాజం చేయవలసిన పని స్పష్టంగా ఉంది. స్త్రీ స్వేచ్ఛను ఒక్క ఆలోచనగా కాకుండా, నిరంతరం ముందుకు సాగాల్సిన ప్రయత్నంగా చూడాలి. అందులో సమానత్వం ఉండాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఉండే అవకాశం ఉండాలి. శరీరంపై, జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉండాలి. మనసుకు గౌరవం లభించాలి. అప్పుడు మాత్రమే రాజేశ్వరి అడిగిన ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. అప్పుడు మాత్రమే రత్నావళి లాంటి మరణాలు అవసరం లేని సమాజం ఏర్పడుతుంది. స్త్రీ విముక్తి ఇప్పటికీ పూర్తయిన దశలో లేదు. అది ఇంకా ఎదుగుతున్న ప్రయాణంలోనే ఉంది. ఆర్థిక, శారీరక, మానసిక సమానత్వం కలిసినప్పుడే నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుంది.

**8.ఆధార గ్రంథాలు :**


1. చలం, మైదానం, అరుణా పబ్లిషింగ్ హౌస్ ఏలూరురోడ్డు, విజయవాడ, 2002
2. విశ్వనాథ సత్యనారాయణ ,చెలియలికట్ట, రవీంద్ర పబ్లికేషన్స్, విజయవాడ, 2010
3. భారతి, ఆది. తెలుగు సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ భావన.ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం, 2018
4. రామకృష్ణ, కె., స్త్రీ - సమాజం - సాహిత్యం. ఎమిస్కో పబ్లికేషన్స్, హైదరాబాద్, 2020.
5. నాగరాజు, కె. ఆధునిక తెలుగు నవలలు - సామాజిక దృష్టి. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2016.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కేశవరెడ్డి నవలలు - సామాజిక చైతన్యం

- డా॥. సి. చెన్నకేశవులు
తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

తెలుగు నవలా సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని స్పష్టంగా, బలంగా ప్రతిపాదించిన రచయితలలో కేశవరెడ్డి ప్రముఖుడు. గ్రామీణ సమాజపు రూపురేఖలను, అంతః సంఘర్షణలను లోతుల్లోకి వెళ్లి చిత్రించిన రచయిత కేశవరెడ్డి. దళితులు, గిరిజనులు, స్త్రీలు ఇలా అణచి వేతకు గురయ్యే వారిపట్ల సంవేదనతో రచనలు చేసిన ప్రగతిశీలవాది. ఆయన నవలలు ప్రధానంగా గ్రామీణ సమాజాన్ని నేపథ్యంగా చేసుకొని రైతాంగ సమస్యలు, భూసంబంధ అసమానతలు, వర్గ సంఘర్షణలు, రాజ కీయ దోపిడీ, అణగారినవర్గాల జీవనవెతలను వాస్తవికంగా ఆవిష్కరిస్తాయి.

కేశవరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా పూతలపట్టు సమీపంలోని తలుపులపల్లి గ్రామంలో 1946 మార్చి 10న జన్మించారు. తిరుపతిలో పియుసి, పాండిచ్చేరిలో ఎంబిబిఎస్ చదివారు. వర్ణాంతర మతాం తర వివాహం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లిలోనూ, ఆర్మూరులోనూ స్కిన్ స్పెషలిస్ట్‌గా కుష్టురోగులకు సేవలు చేశారు. 2015 ఫిబ్రవరి 13న నిజామాబాదులో మరణించారు.

పీడితజన పక్షపాతంతో, దళితుల సమస్యల పట్ల సానుతాపంతో రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణలే ఇతివృత్తాలుగా కేశవరెడ్డి నవలలు రాశారు, భగవానువాచ, బానిసలు వీరి నవలికలు. స్మశానం దున్నేరు, ఇన్ క్రెడిబుల్ గాడెస్, రాముడుండాడు రాజ్జి వుండాది, సిటీ బ్యూటిఫుల్, అతడు అడవిని జయించాడు, మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె, మునెమ్మ వీరి నవలలు. విశేష ప్రాచుర్యాన్ని పొందిన వీరి నవలలు భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషు భాషలోకి అనువదించబడ్డాయి.

కేశవరెడ్డి మొదటి రచన భగవానువాచ. బడి పంతులుగా పదవీ విరమణ పొందిన రామదాసు తన కూతురి పెళ్లి కోసం బ్యాంకులో దాచుకున్న తన కష్టార్జితం నాలుగువేల రూపాయలు విత్ డ్రా చేసుకొని ఒక లారీలో స్వగ్రామానికి బయలుదేరుతాడు. ఒంటరిగా, నిస్సహాయంగా ఉన్న ఎదుటిమనిషి జేబునిండా డబ్బు కనిపించడంతో డ్రైవర్‌లోని రాక్షసుడు రామదాసును గొంతు పిసికి చంపేసి డబ్బు కాజేయాలనుకుంటాడు. ఆ క్షణంలో రామదాసుకు శ్రీకృష్ణుని గీతోపదేశం జ్ఞప్తికి వచ్చి తానే భగవానువాచను పాటించి తనను తాను రక్షించుకుంటాడు.

కేశవరెడ్డి రెండో రచన బానిసలు. సుబ్బారాయుడు హరిజనుడే అయినా మిలిటరీకి వెళ్లిరావడం వల్ల లోక జ్ఞానం కలిగి ఉంటాడు. అగ్రహారీకుల ఖర్చుతో

హరిజనుల శ్రమదానంతో అగ్రహారాన్ని మరియు హరిజన వాడను కలుపుతూ బాట వేయించడానికి అందరినీ ఒప్పిస్తాడు సుబ్బారాయుడు. ఇంతలో మునసబుగారి బంగారు గొలుసు దారిపోతుంది. దాన్ని హరిజనులే కాజేసి ఉంటారనే అనుమానంతో హరిజనులపెద్ద అయిన కుట్టిగాడిపైనే మునసబు చేయిచేసుకుంటాడు. హరిజనులందరూ గుడిలో ప్రమాణం చేయాలని ఆజ్ఞాపిస్తాడు. అందుకు సుబ్బారాయుడు అంగీకరించక కుట్టిగాడికి జరిగిన అన్యాయాన్ని ఎదిరిస్తాడు. కానీ కుట్టిగాని నాయకత్వంలోన హరిజనులందరూ రోడ్డుపని చేయడానికి నిరాకరించడమే గాక సుబ్బరాయుడిని సంఘబాహ్యునిగా వెలివేస్తారు.

కేశవరెడ్డి రాసిన "స్మశానం దున్నేరు" తెలుగు నవలా సాహిత్యంలో ఒక శక్తివంతమైన సామాజిక చిత్రం. ఈ నవలలో ఒకనాటి హరిజనుల దుర్భర జీవితం దర్శనమిస్తుంది. వారిలోని అంతర్గత వైరుధ్యాలు ఎంత తీవ్రమైనవో తెలుస్తాయి. నవల ఆరంభంలోనే ఈ వైరుధ్యాల ప్రస్తావన ఉండటం గమనార్హం. హరిజనవాడలోని ముప్పై కుటుంబాలు పోకనాటి తెగవి. వీరభద్రుని కుటుంబం మాత్రం రంపాల తెగకు చెందింది. ఈ రెండు తెగలు మాల కులానికి చెందినవే. తెగలు వేరైనా వారు పడే కష్టాలు ఒకటే. వారి మీద జరిగే అణచివేత ఒకటే. బీభత్సపూరితమైన పీడన కింద ఈ రెండు తెగలవారు అణగారిపోతూనే ఉంటారు. అతి భయానకమైన, హేయమైన భూస్వామ్య దోపిడీకి, పీడనకి తెలిసి తెలియకనే వెనకబడ్డ కులాలకు చెందిన వారు సైతం తోడ్పడిన వైనాన్ని మనం గమనించవచ్చు. ఈ నవలలో పెదరెడ్డికి తొత్తుగా ఉన్న వెంకటాద్రీ, హరిజనులకు కల్లుపోసే ఈడిగివాడూ హరిజనులను అవమానకరంగా, హీనంగా మాట్లాడుతారు. ఇది సమాజంలోని నిచ్చెనమెట్ల కుట్రను వ్యక్తీకరిస్తుంది. తన చేతికి మట్టి అంటకుండానే హరిజనుల మీదకు బీసీలను ఉసిగొల్పడం, తన పెత్తనాన్ని ప్రశ్నించిన రంపాల తెగకు చెందిన వీరభద్రుడిని పోకనాటి మాలల చేత హత్య చేయించడం పరిశీలిస్తే ఆయా కులాల్లోని అంతర్గత వైరుధ్యాల్ని అగ్రకులాలు ఏ విధంగా ఉపయోగించుకుంటాయో తెలుస్తుంది. తమ ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి వస్తే పెత్తందారులు ఏళ్ల తరబడి తమకు సేవ చేసిన వెంకటాద్రి లాంటివారిని సైతం జైలు పాలుచేస్తారు. భూస్వామ్య పెత్తందారితనం ఎంతటి భయానకమైనదో, అమానవీయమైనదో కేశవరెడ్డి ఈ నవల ద్వారా ప్రతీకాత్మకంగా తెలియజేశారు.

ఆత్మగౌరవ చైతన్యం ఉన్న మాలకులస్తుడు పరిసరాలతో, శత్రువుతో ప్రత్యక్షంగా పోరుకు దిగడం వలన సంభవించిన పరిణామాల ప్రతిఫలనం "ఇన్ క్రెడిబుల్ గాడెస్" నవల. రంపాల రామచంద్రుడు మాలలలో స్వీయ చైతన్యం ఉట్టిపడేవాడు, ఆత్మాభిమానం కలవాడు, అన్యాయాన్ని సహించలేనివాడు. రామచంద్రుడి భార్య నాగ కూడా అతనికి తగిన ఇల్లాలు. వారి కొడుకు కిష్టుడు. పెదరెడ్డికి రాయపాటాయనకు కోర్టులో కేసు నడుస్తూ ఉంటుంది. రాయపాటాయనకు పెదరెడ్డి చేతుల్లో కోర్టు సాక్షిగా జరుగుతున్న అన్యాయాన్ని రామచంద్రుడు సహించలేకపోతాడు. పెదరెడ్డి ఆజ్ఞ మేరకు మాలలందరూ రాయపాటాయనకు వ్యతిరేకంగా కోర్టులో దొంగసాక్ష్యం చెబుతారు. రామచంద్రుడు మాత్రం దొంగసాక్ష్యం చెప్పడానికి నిరాకరిస్తాడు. ఆ కారణంగా ఊరినుండి వెలివేయబడతాడు. తన పందులను తీసుకొని భార్య, కొడుకుతోపాటు రామచంద్రుడు ఒంటిల్లు అనే మరో ఊరు చేరుతాడు. చాలా దూరం నడవడం చేత కిష్టుడికి వేడి చేస్తుంది. కొబ్బరి నీళ్లు తాగిస్తే కొడుకు ఆరోగ్యం కుదుటపడుతుందని రామచంద్రుడు కొబ్బరికాయ కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు. కానీ కొబ్బరికాయను సంపాదించలేకపోతాడు. మనసబు కొబ్బరితోటలో దొంగలు పడకుండా చెట్లసుడుల్లో కనపడకుండా బ్లేడ్లు పెట్టి ఉంటారు. ఒళ్ళు కాకచేసి అవస్థ పడుతున్న కిష్టుడు కొబ్బరికాయ కోసం చెట్టు ఎక్కి, చెట్టు పైనుండి జారిపడి ప్రాణాలు కోల్పోతాడు. చెరుకుతోటకు వేసిన గానుగపిండిని తిన్నాయని రామచంద్రుని పందులను మునసబు మనుషులు కొట్టి చంపేస్తారు. అలా అత్యంత హింసాత్మకమైన పరిస్థితులలో రామచంద్రుడు

తన ఒక్కగానొక్క కొడుకును, జీవనాధారమైన పందులను పోగొట్టుకుంటాడు. రామచంద్రుడు, నాగ సుదూర ప్రయాణం చేసి ఒక అగ్గురారం (అగ్రహారం) చేరు కుంటారు. గుడి పక్కన గుడిసెలో ఉన్న అర్జునరెడ్డి వారికి ఆశ్రయమిస్తాడు. మాలవాడైన రామచంద్రునికి ఆశ్రయం ఇచ్చి, గుడిని అపవిత్రం చేశాడని ఆ ఊరి మాలలే అర్జున్ రెడ్డి గుడిసెను తగలబెట్టేస్తారు. గాఢనిద్రలో ఉన్న అర్జునుడి ఒళ్లంతా కాలిపోతుంది. మండుతున్న బొబ్బ లను చల్లార్చడానికి గర్భగుడిలో ఉన్న ఆముదం తెమ్మం టాడు అర్జునుడు. తాను అంటరానివాడు కాబట్టి గుడి లోకి వెళ్ళనంటే వెళ్ళనంటాడు రామచంద్రుడు. రామ చంద్రుడి మొఖంపైన ఉమ్మేసి అర్జునుడు మరణిస్తాడు. అసమ భారతీయ కులవ్యవస్థను, హెచ్చుతగ్గుల నిచ్చెన మెట్ల రాజకీయ ఆర్థికవ్యవస్థను ఒక క్షుద్రదేవతగా అభి వర్ణించిన కేశవరెడ్డి మనిషి బానిసతత్వాన్ని, తిరుగుబాటు తత్వాన్ని అత్యంత మానవీయ దృక్కోణం నుంచి దర్శించి ఎంతో అభివ్యక్తితో రచించిన నవల ఇన్ క్రెడిబుల్ గాడెస్.

కేశవరెడ్డి రాసిన "రాముడుండాడు రాజ్జివుండాది" నవల చిత్తూరు ప్రాంతంలో కులవృత్తులను కోల్పోయి, గ్రామాలను వదలి, ఇంత విశాల దేశంలో ఎక్కడైనా పని దొరకక పోతుందా అనే ఆశతో వలసపోతున్న వారి జీవితాలు, కష్టాలు, మనోప్రవృత్తులు చిత్రీకరిస్తుంది. కోనెగాడు పెదనాయుడు దగ్గర ముప్పై ఏళ్ళు వెట్టి చాకిరీ చేశాడు. కోనెగాడు ఉడిగిపోయినప్పుడు అతనికి ఒక ఎకరం ఎర చూపి మళ్లీ అతని కొడుకు పుల్లిగాన్ని వెట్టి జీతగాడిగా పెట్టుకోవాలనుకొంటాడు పెదనాయుడు. పట్నంలో పనిచేసి కొంత లోకజ్ఞానాన్ని పొందిన పుల్లిగాడు అందుకు ఒప్పుకోడు. కొడుకు వేసిన లెక్కల ద్వారా తాను ఏమి కోల్పోయానో ఎంత నష్టపోయానో తెలుసుకున్న కోనెగాడూ, భూస్వాముల దాడిలో కొలిమి ధ్వంసం అయిపోవడంతో జీవనాధారం కోల్పోయిన కంసాలీ, అప్పు తీర్చలేక భూమిని వేలంపాటలో పోగొట్టుకున్న తిరుపాల్ నాయుడూ, కష్టజీవుల వెతలను తీర్చలేని దేవుడిని పూజించడం ఇష్టంలేని గుడిపూజారీ వీరందరూ పనుల కోసం పట్నం బయలుదేరుతారు. ఈ నవల మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సామాన్యుల వలసల వెనుక ఉన్న ఆర్తిని, ఆవేదనను కళ్ళకు కట్టినట్లు చిత్రించింది.

ఎర్నెస్ట్ హెమ్మింగ్వే రాసిన "ఓల్డ్ మ్యాన్ అండ్ ద సీ" నవల స్ఫూర్తితో కేశవరెడ్డి రాసిన నవల "అతడు అడవిని జయించాడు". ఒక ముసలివాని పందులను అతని మనవడు మేత కోసం అడవికి తోలుకెళ్తాడు. సాయం కాలం తిరిగి వచ్చినప్పటికీ ఒక సూడి పంది ఉండదు. ముసలివాడు దాన్ని వెతికి తెచ్చేందుకు ఒంటరిగా ఒక ఈటెను తీసుకొని బయలుదేరుతాడు. ఆ రాత్రి అడవిలో ఒకచోట తన పందిని చూస్తాడు. ఆ పంది ముసలివాడిని తన పిల్లల దగ్గరికి రానివ్వదు. ముసలివాడు విధిలేక పందిని చంపి, పంది పిల్లల్ని తీసుకెళ్తూ ఉంటాడు. చివరికి పంది పిల్లల్ని కూడా రాబందులు తినేస్తాయి. మానవ జీవితంలోని సంఘర్షణలను, జీవించాలనే తపనను, ఓటమిని అంగీకరించే దృక్పథాన్ని చిత్రిస్తుంది ఈ నవల.

"మూగవాని పిల్లనిగ్రోవి" ఒక సన్నకారురైతు బక్కిరెడ్డి మరణం, పునరుత్థానాల చుట్టూ తిరిగే అద్భుతమైన నవల. బక్కిరెడ్డి తండ్రి చనిపోయే ముందు పొలాలను మొక్కపోకుండా చూడమని బక్కిరెడ్డిని చివరి కోరిక కోరతాడు. బక్కిరెడ్డి అలాగే కాపాడుకుంటానని తన తండ్రికి మాట ఇస్తాడు. వర్షాలు పడకపోవడంతో బక్కిరెడ్డి బావి తవ్వించడానికి బ్యాంకులో అప్పు చేస్తాడు. బావిలో నీళ్లు పడకపోవడంతో అప్పు తీర్చలేకపోతాడు. బ్యాంకు వాళ్లు పొలాన్ని వేలం వేస్తారు. పొలం కోల్పోయిన బక్కిరెడ్డి ఉన్మాదానికి గురై, ఆ పొలంలోనే నాగలి దున్నుతూ దున్నుతూ మరణిస్తాడు. బక్కిరెడ్డి ఆత్మ ఆ పొలాలకు రక్షణగా ఉందని ఎవరు అందులోకి ప్రవేశించరు. కొన్నాళ్ళకి ఆ పొలాలు చిట్టడవిలా తయారవుతాయి. ఆ చిట్టడవికి "బక్కిరెడ్డి కాన" అనే పేరు స్థిరపడింది. ఈ నవల రైతుకు భూమికి మధ్య ఉన్న విడదీయరాన్ని అనుబంధాన్ని ఉద్వేగభరితంగా చిత్రించింది.

బాధామయమైన, భయావహమైన తీవ్ర ఉత్కంఠతో కూడిన విషాదాంతగాథ "చివరి గుడిసె" నవల. ఉదారవాది అయిన బ్రిటిష్ కలెక్టరు జార్జి దొర చెట్టుకొకరు

పుట్టుకొకరుగా ఉన్న యానాదులకు గుడిసెలు కట్టించి, తలా రెండెకరాలు పట్టా చేయించి ఇస్తాడు. అడవిలా ఉన్న భూమిని యానాదులు చాలా కష్టపడి చదును చేసి వ్యవసాయం చేసుకొని జీవిస్తూ ఉంటారు. ఆ ఊరి మణియం యానాదులను దొంగలుగా ముద్రవేసి, వారిని కొట్టి, వారిపై కేసులు పెట్టించి, వారిని తరిమేసి యానాది మిట్ట మొత్తాన్ని ఆక్రమించుకుంటాడు. అందరూ తలోదిక్కు వెళ్ళిపోగా మిగిలిన ఒకేఒక్క చివరి గుడిసె మన్నుగాడిది. అనారోగ్యంతో అతని భార్యతో పాటు ముగ్గురు పిల్లలు కూడా చనిపోతారు. మిగిలిన నాలుగో కొడుకు చిన్నోడితో కలిసి ఆ గుడిసెలో ఉంటాడు మన్నుగాడు. చిన్నోడికి కొంచెం బుద్ధిమాంద్యం, చాలా పిరికివాడు కూడా. ఒకరోజు ఆ గుడిసెకు ఒక బైరాగి వస్తాడు. ఒక్కరోజులోనే ఆ బైరాగితో మన్నుగాడికి, చిన్నోడికి చాలా అనుబంధం ఏర్పడుతుంది. ఆ రాత్రి మణియం ఆదేశాల మేరకు మణియం వరిపొలంలో మన్నుగాడు, చిన్నోడు ఎలుకలు పడతారు. అదే రాత్రి దొంగలు మణియం వరికంకుల్ని దొంగలిస్తారు. కోపోద్రిక్తుడైన మణియం మన్నుగాడే వరికంకుల్ని దొంగలించాడని నేరంమోపి విపరీతంగా కొడతాడు. దాంతో మన్నుగాడు చనిపోతాడు. తీవ్రమైన ఆవేదనకు గురైన బైరాగి మన్నుగాడి కుక్కను మణియం మీదకు ఉసి గొలుపుతాడు. కుక్క మణియం గొంతు కొరికి చంపేస్తుంది. ఇదంతా చూసి చిన్నోడు భయంతో ఆత్మహత్య చేసుకుంటాడు. భూస్వామ్య వర్గ స్వభావాన్ని ప్రతిభావంతంగా చిత్రించిన నవల ఇది.

తన భర్తను చంపిన హంతకుల కోసం అన్వేషించే ఒక స్త్రీ యొక్క అసాధారణ ధైర్య సాహసాలను, తెగువను, ఆత్మవిశ్వాసాన్ని చిత్రించిన నవల “మునెమ్మ”. మునెమ్మ జయరాముడి భార్య. గడ్డి కోస్తున్న మునెమ్మ వీపుమీద బొల్లిగిత్త తన రెండుకాళ్లతో గీరడంతో ఆమె రవికె చెరిగి పోతుంది. దాంతో కోపోద్రిక్తుడైన జయరాముడు ఆ బొల్లిగిత్తను అమ్మేయాలని తరుగులోడితో (పశువుల దళారి) కలిసి మద్దిపాలెం సంతకు వెళ్తాడు. రెండురోజుల తర్వాత జయరాముడు లేకుండా బొల్లిగిత్త ఒకటే ఇంటికి వస్తుంది. బొల్లిగిత్త కొమ్ములకు ఉన్న మద్దిపాలెం సంత చీటీ ఆధారంతో మునెమ్మ తన భర్త కోసం అన్వేషణ సాగిస్తుంది. తరుగులోడు, పశువులకు నాటువైద్యం చేసే వైద్యుడు కలిసి తన భర్తను చంపారని మునెమ్మ తెలుసుకుంటుంది. బొల్లిగిత్త పొడవడం వల్ల పశువైద్యుడు మంచంలో పడివుంటాడు. తనను వెతుకుతూ వచ్చిన మునెమ్మ చేతిపైన ఉన్న బొల్లిగిత్త పచ్చబొట్టును చూడగానే వెర్రికేక పెట్టి ప్రాణం విడుస్తాడు. తర్వాత మునెమ్మ తరుగులోడి పైకి బొల్లిగిత్తను వదులుతుంది. బొల్లిగిత్త తరుగులోడిని పొడిచి చంపుతుంది. ఈ ఉత్కంఠ భరిత ప్రయాణంలో మునెమ్మకు ఎదురైన పరిస్థితులు, విభిన్న మనస్తత్వాలు, మునెమ్మ ఆత్మ విశ్వాసం అచ్చెరువు కలిగిస్తాయి. సమాజంలోని స్వార్థాన్ని, కపటాన్ని, క్రౌర్యాన్ని చిత్రించిన నవల మునెమ్మ.

కేశవరెడ్డి గ్రామీణ నేపథ్యాన్ని కేంద్రంగా చేసుకొని రచనలు చేసిన వాస్తవవాద రచయిత. ఆయన అనుభవాలు, సమకాలీన సామాజిక పరిస్థితులు ఆయన రచనలకు ప్రాణం పోశాయి. ముఖ్యంగా దళితులు, పేద రైతులు, కూలీలు, మహిళల జీవితాలను ఆయన నవలలు ప్రతిబింబిస్తాయి. గ్రామీణ జీవితం, రైతుల కష్టాలు, వ్యవసాయ సంక్షోభం, భూస్వాముల దౌర్జన్యం కేశవరెడ్డి నవలల్లో చిత్రించబడ్డాయి. కులవ్యవస్థ ఒక దుర్మార్గమైన సామాజిక నిర్మాణంగా కనిపిస్తుంది. కులం పేరుతో జరిగే వివక్షను, హింసను ఆయన తీవ్రంగా ఖండించారు. భూస్వామ్యవ్యవస్థ సమాజంలోని దళితులు, కూలీలు, పేదరైతుల జీవితాలను ఎలా నాశనం చేస్తుందో ఈ నవలల్లో స్పష్టంగా చిత్రీకరింపబడింది. రాజకీయ నాయకులు, పోలీసు వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు ఎలా దూరమైందో రచయిత వివరిస్తారు. అధికార వ్యవస్థల వైఫల్యం సామాజిక అన్యాయాలకు కారణమని సూచించారు. అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటమే కేశవరెడ్డి నవలల్లో ప్రధానాంశం. ఈ పోరాటమే సామాజిక చైతన్యానికి మూలం. ఈ నవలలు సమాజాన్ని ప్రశ్నించే శక్తిని కలిగిస్తాయి. సామాజిక మార్పుల పట్ల ఆలోచనను రేకెత్తిస్తాయి. అందువలన కేశవరెడ్డి నవలలు నేటికీ ప్రాసంగికమే.

**ఆధార గ్రంథాలు :**


1. స్మశానం దున్నేరు - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
2. ఇన్ క్రెడిబుల్ గాడెస్ - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
3. రాముడుండాడు రాజ్జివుండాది - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
4. అతడు అడవిని జయించాడు - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
5. మూగవాని పిల్లనగ్రోవి - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
6. చివరి గుడిసె - డాక్టర్ కేశవరెడ్డి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
7. తెలుగు నవల - సామాజిక చైతన్యం - కేతు విశ్వనాథరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
8. సామాజిక వాస్తవవాద సాహిత్యం- ఆచార్య కె. రామకృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
9. తెలుగు నవల సామాజిక చిత్రణ -డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
10. తెలుగు నవలా సాహిత్యం - పరిణామ వికాసం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.


❖❖❖

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'అతడు అడవిని జయించాడు' - సామాజిక విశ్లేషణ

- డా॥. ఇ. వాసు
తెలుగు అధ్యాపకులు, శ్రీవర్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

తెలుగు సాహిత్యంలో సామాజిక సమస్యలు, రైతు జీవితం మరియు బడుగు వర్గాల నేపథ్యంలో రచనలు చేసిన రచయిత డా.పి.కేశవరెడ్డిగారు. రాయలసీమ మాండలికాన్ని, రైతు జీవితాన్ని అత్యంత సహజంగా, బలమైన పాత్రలతో వాస్తవికంగా ఆయన చిత్రించారు. పేదరికం, మూఢనమ్మకాలు, గ్రామీణ ప్రజల అను బంధాలు సమస్యలు మరియు సామాజిక అన్యాయాలే విషయ వస్తువులుగా ఆయన రచనలను రచించారు. వైద్యుడిగా సేవలందిస్తూనే సాహిత్యంపై ఉన్న ప్రేమతో క్లిష్టమైన సామాజికాంశాలను తన రచనల ద్వారా పాఠకులకు పరిచయం చేశారు. డా.పి.కేశవరెడ్డి గారు రాసిన 'అతడు అడవిని జయించాడు' నవల మొదట 1984లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికగా ప్రచురితమై తరువాత 1985లో తొలిసారి నవోదయ పబ్లిషర్స్ సంస్థ ప్రచురించి ఆ తరువాత అనేకమార్లు ప్రచురితమైన ఈ నవలను నేషనల్ బుక్ ట్రస్టువారు 14 భారతీయ భాషల్లోకి ప్రచురించారు. ఈ నవల అస్తిత్వవాద సాహిత్యానికి ప్రతీకగా అటవీ సాహిత్యంలో ఒక వ్యక్తి యొక్క అంతర్గత సంఘర్షణ, జీవితంపై పోరాటం ఓటమిని అంగీకరించి ముందుకు సాగడం వంటి అంశా లను ప్రతిబింబిస్తుంది. ఇటువంటి గొప్ప నవలకు "పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం" 'ఉత్తమ నవల' పురస్కారం లభించింది. ఈ నవలలోని సామాజిక అంశాలను పరిశీలిస్తే.

**నేపథ్యం :**

అసలు ఈ కథకి ప్రాణం రచయిత తీసుకున్న నేపథ్యం. అడవి, అందులో ఒక పందులని కాసే ముసలి వాడు. అదికూడ జీవితాన్ని జీవితంగానే చూస్తాడు. అది కూడ ఒక సహజమైన ప్రక్రియలా. తన పందులు, చిన్న పాక, ఆ అందమైన ప్రకృతి, ఆ చిన్న పిల్లాడు ఇదే తన జీవితం. ఈ కథ అంతా రాత్రి మొదలయ్యి తెల్లారే సరికి అయిపోతుంది. ఈ కథలోని తాత్వికత అంతా ఇక్కడితోనే మొదలవుతుంది. అంటే ఒక మనిషి పయనం చీకటి నుంచి వెలుగులోకి, అది కూడా చీకటి మన జీవితం లోకి తెచ్చే ఎన్నో కష్టాలను ఓర్చుకుని వెలుగులోకి. ఆ పందులని తినడానికి వచ్చిన నక్కలు మనం కూడబెట్టు కున్నదానిని మన నుంచి తీసుకుపోయే అవకాశవాదులు. అంత అంధకారంలో కూడా ఆ పందులు ఎక్కడ ఉన్నాయి చెప్పే ఆ తోడు పిట్ట మనం ఎన్ని కష్టాల్లో ఉన్నా మనతో ఉండే స్నేహితులు. ఇక ఆ పంది పిల్లలు మన ఇష్టాలు, కోరికలు, ఆస్తులు, పాస్తులు, ఇంకా మన ఆశలు. ఆ సుక్క పంది మన జీవితం. ఆ పిల్లల్ని ఎలా కాపాడాలి అనే అతని సంకల్పం తన తర్వాత తరాన్ని

ఎలాగైన కాపాడుకోవాలనుకునే ఆరాటం, ఆయన పయనం చీకటి నుంచి వెలుగుకి. ఆ రాత్రంతా ఆ కష్టాల కారడవిలో ఆయన జీవించాడు. మనకో జీవిత సత్యాన్ని చెప్పాడు. అందుకే ఆయన అడవిని జయించాడు. నిజానికి ఆయన జీవితాన్ని పూర్తిగా జీవించాడు. మనం ఎలా జీవించాలో చెప్పాడు.

**ఇతివృత్తం :**

సూర్యాస్తమయం నుండి మరుసటి సూర్యోదయం వరకు జరిగే కథ 'అతడు అడవిని జయించాడు' రెండే మానవ పాత్రలున్న చిన్న నవలిక ఇది. అందులోను ఒకటి చాలా చిన్నపాత్ర. కాబట్టి ఒక పాత్ర అని చెప్పుకోవచ్చు. ఆ పాత్రకు పేరు లేదు ముసలివాడు అని సంబోధిస్తాడు రచయిత. ముసలివాని పందులను మనుమడు మేతకని అడవికి తోలుకుపోయి సాయంకాలాని తిరిగి వచ్చాక చూస్తే ఆమందలో సూడిపంది లేకపోవడం గ్రహించి, దాన్ని వెతికి తెచ్చేందుకు ఒంటరిగా ఒక ఈటె తీసుకుని 'అస్తమిస్తున్న సూర్యుణ్ణిపై దండెత్తిన వాడివలె బయలు దేరాడు. తన ప్రయాణంలో ఎన్నో కష్టనష్టాల మధ్య ఆ రాత్రి అడవిలో ఒక చోట ఈనిన పందిని చూసి ఆపందిని, దాని పిల్లలను జంతువుల బారి నుండి రక్షించి ఇంటికి తీసుకెళ్ళడం అతని లక్ష్యం. అయితే ఈనిన పంది తన పిల్లలను తినజూసే నక్కల్నే కాదు, వాటిని రక్షించాలను కుంటున్న ముసలివాణ్ణి కూడా దగ్గరికి రానివ్వదు. అతను తనను దాన్నుండి రక్షించుకొంటూ పిల్లలను నక్కల బారి నుండి రక్షించడానికి పందిని చంపడం, పిల్లలను తన గుడిసెకు చేర్చడానికి అతడు ప్రయత్నంలో పిల్లలను చేర్చలేకపోయినా తాను అటవి జంతువులను ఎదుర్కొవడం తన విజయమే కాబట్టి అతను పోరాటం ఫలితం లేకపోయినా అడవిని జయించాడని రచయిత పెట్టిన పేరుకు విమర్శలొచ్చిన ముసలివాడు అడవిలో సంఘర్షణల మధ్య జరిపిన పోరాటం విజయం సాధించాడని చెప్పవచ్చు.

**ప్రకృతి వర్ణన :**

నేడు కాలుష్య కోరల్లో జీవిస్తున్న నగర వాసులకు ముఖ్యంగా పర్యావరణంకు సంబంధించి అరణ్యంలోని ప్రకృతికి-మనిషికి, మనిషికి-జంతువుకి, జంతువుకి - జంతువుకి ఉండే అనుబంధాలను ఈ నవలలో చక్కగా వర్ణించాడు. అడవిలోని వివిధ చెట్లు జంతువుల గురించి రచయితకు ఎంత లోతైన అవగాహన ఉందో అతని వర్ణనలో స్పష్టంగా తెలుస్తుంది. అడవిలోని ప్రతిమూలకు రచయిత మనల్ని తీసుకెళ్తారంటే అతిశయోక్తి కాదేమో. ఎత్తు పల్లాలుగా పేర్చబడ్డ కొండలు, పాయలుగా చీలి ప్రవహిస్తున్న నదులు, వణకు పుట్టించే లోతైన లోయలు, గాలి తాకిడికి గంభీరంగా కదిలే చెట్ల కదలికలు, కుందేళ్ళను, పాములను తమలో ఇముడ్చుకుని శబ్దం చేస్తున్న గుబురు, గుబురు పొదలు, అమాయకపు ప్రాణుల వాసనను అనంతదూరం నుండి పసిగట్టే తోడేళ్ళు, ఎప్పుడూ తన అస్తిత్వాన్ని ప్రకటించుకునే స్వభావం ఉన్న తోటి గువ్వపక్షి, రకరకాల చెట్లు, రకరకాల పక్షుల ధ్వనులు, పూలు ఇలా అనేక అంశాలను చక్కగా వర్ణించాడు. అంతేకాకుండా సూర్యాస్తమయం, చంద్రోదయ వర్ణనలను చక్కగా చిత్రీకరించాడు.

**పట్టుదల, అకుంఠిత దీక్ష :**

ముసలివాని పాత్ర ద్వారా తన శరీరం సహకరించే స్థితిలేకపోయినా, తను ఆరోగ్యం సహకరించపోయినా తన ప్రాణంగా పెంచుకున్న తన సూడిపందిని వెతకడానికి ముంతడు కల్లు తాగి రాత్రివేళలో భయంకరమైన అరణ్య ప్రాంతంలో, క్రూర జంతువులున్న ప్రాంతాలలో తన శక్తిమేర తనకున్న అనుభవంతో దానిని వెతికి కని పెట్టడానికి అతడు చేసిన ప్రయత్నంలో సఫలీకృతు డయ్యాడు. బహుశా వాటిని కాపాడలేకపోయినా తాను చేసిన ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడని చెప్పవచ్చు. ఈ పాత్ర ద్వారా మనం నేటి సమాజంలో యువతకు ఆదర్శమని చెప్పవచ్చు. ప్రయత్నిస్తే ఎన్ని కష్టాలు ఎదురైనా మనం విజయం సాధించవచ్చు. ఈ నవలలో అది అక్షర సత్యం. ముసలివాని పాత్ర ద్వారా మనకు అవగతమవుతుందని చెప్పవచ్చు.

**మూర్ఖత్వం పనికిరాదు :**

ఈ నవలలో మూర్ఖత్వం ఉంటే ఎంత ప్రమాదమో సూడి పంది పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు. తాను తన

పిల్లలను ఈనిన తరువాత తన మూర్ఖత్వంతో యజమానిని సైతం గాయాలు పాలు చేసింది. చివరకు తాను ప్రాణాలు కోల్పోవడమే కాకుండా తన పిల్లల ప్రాణాలు కోల్పోయింది. యజమానిని గాయపరచకుండా ఉండి ఉంటే క్షేమంగా తన పిల్లలతో ఇల్లు చేరేది. కాబట్టి జంతువులకైనా, మనుషులకైనా మూర్ఖత్వం అన్ని సందర్భాలలోను మంచిదికాదు. మూర్ఖత్వం ఉంటే సూడి పందికి పట్టిన గతే మనకు సంభవిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా మనుషులు బుద్ధి జ్ఞానం ఉన్నవారు కాబట్టి మూర్ఖత్వం విడనాడితే అనేక అనర్థాల నుండి బయటపడవచ్చు అనేది చక్కని నిదర్శనంగా చెప్పవచ్చు.

**అమాయకత్వం అన్నివేళలా పనికిరాదు :**

అమాయకత్వం ఎప్పుడూ మంచిది కాదు అనేదానికి ఈ నవలలోని 'తోటిగువ్వ' పక్షి పాత్రను పరిశీలిస్తే మనకు అవగతమవుతుంది. దారి తెలియని ముసలివానికి చీకటిలో కొట్టుమిట్టాడుతున్న ముసలి వానికి 'దారిచూపిన దేవత' 'తోటిగువ్వ పక్షి'. ఎక్కడైన కొత్త శబ్దాలు, కొత్త వ్యక్తులు, జంతువులను చూస్తే శబ్దం చేయడం ఆ పక్షి ప్రత్యేకత. సూడిపంది, దాని పిల్లలను చూసి అరచి ముసలివానికి దారి చూపించి ముసలివాని దృష్టిలో దేవత లాగా భావించబడింది. అదే తోటిగువ్వ అరవడం నిలపకుండా క్రూర జంతువులకి అరచి ముఖ్యంగా నక్కలకు ఆపంది జాడను తెలిసేటట్లు చేసి ఆపంది మరణానికి కారణమైంది. ముసలివాని దృష్టిలో దేవతలాగా భావించబడిన తోటిగువ్వ చివరకు ముసలివాని చేతిలోనే మరణించింది. ముసలివాడు దానిని ఎరలేసి ఇంట్లో పెట్టి పోషించి దానికి సేవలు చేయాలనుకున్నాడు. అలాంటిది తన పంది మరణంకు కారణం కాబోతుందని తానే చంపేశాడు. కాబట్టి అమాయకత్వం అన్ని సందర్భాలలోనూ మంచిది కాదని ఈ తోటిగువ్వ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

**ఆలోచన, ధైర్యసాహసాలు :**

సుంక్రేసు చెట్టుమీద సూడి పందికి బయపడి కూర్చున్న ముసలివానికి తన పందిని దాని పిల్లలను తినడానికి వచ్చిన 'నక్క'ను రక్షించాలనే ఆలోచన మరియు సూడి పంది తనను ఏమి చేస్తుందనే భయం మధ్య ఆ నక్కను సూడిపందే చంపడం, తరువాత నాలుగు నక్కలు వచ్చినపుడు ఈటెతో ఒక నక్కను చంపడం సూడిపంది ఒక నక్కను చంపడం, మిగిలిన రెండు నక్కలు రెండు పిల్లలను ఎత్తుకొని పోవడం తరువాత అనేక నక్కల గుంపు రావడం వాటిని ఎదుర్కొనడానికి సూడి పంది రావడం ఆ సమయంలో ముసలివాడు ఈటెతో దిగి పందిని చంపడం ఆ భయానికి నక్కలు పారిపోవడం ఇది అనాగరికుడైన ముసలివానికి వచ్చిన చక్కని ఆలోచన. ఎనిమిది పిల్లలను రక్షించుకోవడానికి సూడి పందిని చంపి, ఆ నక్కల బారి నుండి పిల్లలను కాపాడిన అతని చక్కని ఆలోచన, ధైర్యం చెప్పదగినది. కాబట్టి విపత్కర పరిస్థితుల్లో మనం ఎలా బయటపడాలనే దానికి నవలలోని ఈ ఘట్టం చక్కటి ఉదాహరణ మరియు సంఘర్షణ నడుమ ఎనిమంది పిల్లలా, వాటి తల్లా - అనే అంశంలో ఒక ప్రాణంకంటే ఎనిమంది పిల్లల ప్రాణాలను రక్షించడం అనేది మంచి ఆలోచనగా చెప్పవచ్చు.

**పౌరాణిక స్పృహ :**

వయోభారంతో వంగి, పురాతన శిలలా పడివున్న ముసలివాడు సంకల్ప దీక్షతో, జీవచైతన్యంతో ఉబకలెత్తుతున్న సింధువులు యుద్ధానికి సిద్ధమవడంతో అసలు కథ ప్రారంభమవుతుంది.

పురాణగాథల్లో తారసిల్లే నేర్పరి విలుకాడికి, పక్షి కన్నే సర్వత్రా కనిపించినట్లు, కర్తవ్య మోహితుడైన ముసలివాడికి, అదృశ్యమైన సుక్కపంది, పరిపరి విధాల ప్రత్యక్షమై తనను వెదికేందుకు 'రారమ్మని' ద్రౌపదిని కీచకుని ఎర నుండి కాపాడేందుకు ఉత్సాహంగా వెళ్ళే భీమసేనుడితో పోల్చడం, తన సుక్క పందిని రక్షించుకోడానికి భీమసేనుడితో తనను తాను పోల్చుకోవడం. తను చేసే ప్రయత్నాన్ని విక్రమార్కుని కథతో సాహస బాలుడిలాగా వర్ణించుకోవడం, అదేవిధంగా అరణ్యంలో పూలు, చెట్లు, జంతువుల వర్ణనలు మరియు సూర్యాస్త

మయం, చంద్రోదయ వర్ణనలు మనకు పురాణ, ప్రబంధాలలో వర్ణించినట్లు చాలా చక్కగా వర్ణించబడ్డాయి. నవల ఆధునికమైన, ఆధునిక ఇతివృత్తమైన కేశవరెడ్డిగారు ఈ నవలను మరియు అడవిలో అతను నవలను నడిపించిన విధానం, ఆ సంఘటనలు, పౌరాణిక మరియు ప్రబంధాలకు దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది.

**నామ సార్థకత :**

ముసలివాడు ఏ పందిని కాపాడుకోవాలని అడవికి వచ్చాడో దాన్నే చివరకు చంపుకున్నాడు. దానికి రచయిత చెప్పిన కారణం తోడేళ్ళ బారి నుండి పంది పిల్లల్ని (ఆయన భాషలో గులుగుల్ని) కాపాడుకుందాం అని భావించడం. కాని చివరకు పిల్లలను రక్షించుకోలేక పోయాడు. "కాకి పిల్ల కాకికి ముద్దు" అంటారు. ముసలి వాడికి తన పంది, దాని పిల్లలు సర్వస్వం. తను ఆ పంది పిల్లలను "చందమామ" తో పోల్చుకున్నాడు. ఇక్కడ తాను ఎంతగానో ప్రేమించిన పిల్లలను పోగొట్టు కున్నాడు. ఎంతమంది విమర్శించినా "కేశవరెడ్డిగారు" పెట్టిన "అతడు అడవిని జయించాడు" అనే పేరు స్థిరం. ఎందుకంటే లేవలేక ముసలివాడు భయంకర అరణ్యంలో తన సుక్క పంది కోసం, దాని పిల్లల కోసం అతను చేసిన ప్రయత్నం వెలకట్టలేనిది. చివరకు తన మాటల్లోనే "యుద్ధం ముగిసింది నేను పూర్తిగా ఓడిపోయాను" అను కున్నాడతడు. ప్రయత్నం చేసి ఓడిపోయినా ఓటమి చెంది నట్లు కాదు. విజయం సాధించినట్లే అతను ఆ సుక్క పందికోసం చేసిన ప్రయత్నం లేదు. కాబట్టి జీవితం విచిత్రమైనది కాబట్టి అతని ప్రయత్న లోపం లేదు. అతడు అడవిలో సాగించిన పోరాటం విజయమనే చెప్పవచ్చు. కాబట్టి ఈ పేరు ఈ నవలకు సార్థకమని చెప్పవచ్చు.

**ముగింపు :**

కేశవరెడ్డిగారు 'అతడు అడవిని జయించాడు' నవలలో ఇతివృత్తం, రచనాశిల్పం, మాటలు, వర్ణనలు, రసానుభూతులు, ఆలోచనధార, సన్నివేశాలు, తర్కం, తత్వం అన్ని విశిష్టమే. ఇందులోని పాత్రచిత్రణ, ప్రకృతి వర్ణనలు జంతువుల స్థితిగతులు, గ్రామీణ స్థితిగతులను చక్కగా చిత్రీకరించడంలో ముఖ్యంగా రాయలసీమ మాండలికం, శైలిలో రచనలను కొసాగించడంలో వారికి మాత్రమే సాధ్యమని చెప్పవచ్చు. తాను తెలంగాణా ప్రాంతంలో స్థిరపడినా తన ప్రాంతం భాషను, శైలిని మరవకపోవడం అతని గొప్పతనానికి నిదర్శనంగా చెప్ప వచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. అతడు అడవిని జయించాడు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రచురణ : 2012.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'వొలికలబీడు' నవల - సామాజిక చైతన్యం

- డా॥. కలవకుంట ఈశ్వరబాబు
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.

'వొలికలబీడు' నవలా రచయిత డాక్టర్ రాసాని వెంకట్రామయ్య. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. వీరు సమాజాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొని వివిధ సామాజిక సమస్యల్ని కేంద్రంగా సాహిత్య సృజన చేస్తున్న రచయిత రాసాని. కవిత్వం, కథ, నవల, నాటక రచయితగా వీరు తెలుగునాట ప్రసిద్ధులు.

**పరిచయం :**

'వొలికలబీడు' అంటే స్మశానం అని అర్థం. దీనికే ఇంకా సుడుగాడు, వల్లకాడు, బొందలగడ్డ, ఖబరస్థాన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. 'వొలిక' అంటే శవాల్ని పూడ్చే గుంత అని అర్థం. ఈ నవలలో వొలికలబీడును కేంద్రంగా చేసుకొని జీవనం సాగిస్తున్న కాటికాపరుల జీవితం ప్రధాన అంశం. కాటికాపరుల మనస్తత్వం, వారి ఆర్థికకష్టాలు, సామాజిక సమస్యలు, మారిన సమాజంలో వారి దీనస్థితి, వారికి జరుగుతున్న అన్యాయాల్ని ఎత్తి చూపి ప్రశ్నించిన గొప్ప సామాజిక నవల 'వొలికలబీడు'.

**ముఖ్యమైన పదాలు :**

వొలిక, ఉలికమ్మ, తంగి, అసుకులు, చెంచికారం, సావునాటకం, చేదుముట్టడం.

**'వొలికలబీడు' నవల - విశేషాలు :**

ఈ నవలలో ప్రధానపాత్ర దాసు. అతని భార్య గంగి. వీరికి ఒక సంతానం కాశయ్య. స్మశానంలో కాటికాపరి వృత్తి వీరిది. స్మశానానికి శవం వస్తేనే వీరి కడుపు నిండు తుంది. లేకుంటే పస్తులే. రోజూ ఏదైనా శవం శ్మశానానికి రాకపోతుందా అని ఎదురుచూసే పరిస్థితి ఆ కుటుంబా నిది. కుటుంబ పరిస్థితి ఎలా ఉన్నా దాసు గొప్ప మానవత్వం ఉన్న మనిషి. కూటికి కష్టంగా ఉన్నా అనాథ బిడ్డలను చేరదీసి తన సొంత బిడ్డలుగా పెంచుకున్న మహోన్నత వ్యక్తిత్వం కలిగిన పాత్రగా దాసు పాత్ర మనకు దర్శనమిస్తుంది. అలా పెంచుకున్న బిడ్డలు బొందయ్య, సిన్నమ్మి, భైరప్ప.

ఒకసారి చనిపోయిన స్త్రీ శవాన్ని పూడ్చిపెట్టడానికి స్మశానానికి తీసుకు వచ్చారు. ఆమెకు పెళ్ళి కాకుండానే రెండు సంవత్సరాల బిడ్డ ఉన్నాడు. ఆ బిడ్డను బంధువులు స్మశానంలోనే వదిలేసి వెళ్ళిపోయారు. ఏడుస్తున్న ఆ పిల్లోన్ని దాసు చేరదీసి పెంచుకున్నాడు. బొందకాడ దొరికినోడు కాబట్టి అతడికి బొందయ్య అని పేరు పెట్టాడు. ఇంకో రోజు ప్రభుత్వాసుపత్రిలో ఒకబిడ్డ పురిట్లోనే సచ్చిపోయిందని గుడ్డల్లో సుట్టి పూడ్చేయమని డాక్టరు చేతికి ఇచ్చాడు. వొలికల బీట్లో పూడ్చడానికి

తీసుకు రాగా ఆ బిడ్డ కదిలింది. తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టరుకి చెప్పగా నువ్వే ఎవరికన్నా ఇచ్చేయ్ అన్నాడు. ఆ బిడ్డను దాసే పెంచుకున్నాడు. ఆమె పేరు సిన్నమ్మి. ఉలిగమ్మగా మారడానికి ఇష్టం లేని భైరప్ప ఇళ్ళు వదిలి వచ్చేశాడు. స్మశానంలో పనిలేక కుటుంబం గడవడానికి దాసు, గంగి కనికట్టు విద్య ద్వారా సంపాదనకు వేరే ఊరికి వెళ్ళారు. అక్కడ భైరప్ప తనకు ఎవరూ లేరని చెప్పడంతో అతన్ని కూడా తమతో తీసుకువచ్చారు. అనాథ పిల్లలకు ఎవరో ఒకరు ఆసరా చూపించాలనే రచయిత సున్నిత హృదయం ఇందులో కనిపిస్తుంది.

**ఉలిగమ్మ సాంప్రదాయం :**

బోయ సామాజిక వర్గంలో కనిపించే ఒక సాంప్రదాయం ఉలిగమ్మ. వీరు బృహన్నలను తమ కుల దేవుడుగా భావిస్తారు. ఊర్వశి శాపం కారణంగా పేడిగా మారిన అర్జునుడే బృహన్నల. ఆ బృహన్నల ఇంకోరూపమే ఉలిగమ్మ. మొక్కుబడి ఉన్న మగవారిని ఉలిగమ్మగా ముద్దరేసి వదులుతారు. ఉలిగమ్మగా మారినోడు పెళ్ళి చేసుకోరాదు. సంవత్సరంలో ఆరు నెలలు చీర, రవిక ధరించి పల్లెలమీద అడుక్కోని జీవించాలి. ఏ గుళ్ళోనో, సత్రంలోనో పడుకోవాలి. కొంతకాలానికి ఈ ఉలిగమ్మలు ఊరొదిలేసి వెళ్ళి హిజ్రాలలో చేరిపోతున్నారు. చివరి దశలో ఎవరూ లేక అనాథలుగా మారి చనిపోతుంటారు. నిజానికి అందరూ ఉన్న అనాథలు ఉలిగమ్మలు అని ఈ సాంప్రదాయాన్ని నిరసించాడు రచయిత. దీన్ని వ్యతిరేకించి ఇంట్లోంచి వెళ్ళిపోయే పాత్ర భైరప్ప. భైరప్ప పాత్రను రచయిత ఇంట్లోంచి పారిపోయే పాత్రగా కాకుండా ఆ సాంప్రదాయానికి ఎదురునిలబడి పోరాడే పాత్రగా మలచుంటే ఆ సామాజిక వర్గంలో మార్పుకు ఆస్కారం ఉండేది.

**దింపుడు కళ్ళెం :**

ఈ ఆచారం ఎందుకు అని భైరప్ప దాసుని అడుగుతాడు. గతంలో ఒకసారి “పాడెపై నుండే పీనిగెను పిలిస్తే లేసి కూసునిందంట” అప్పటి నుండి శవాన్ని గుంతలో పూడ్చేముందు ఎక్కడో ఒకచోట పాడె దించి పెడతారు. అలా శవాన్ని దించిపెట్టే ప్రదేశాన్ని దింపుడు కళ్ళెం అంటారు. ఆ దింపుడు కళ్ళెంలో శవం చెవి దగ్గర పేరు పెట్టి మూడుసార్లు పిలవడం ఆచారంగా మారిందని దాసు ద్వారా ఈ సాంప్రదాయం గురించి రచయిత తెలియజేశాడు.

**హిజ్రాల ఉత్సవం :**

ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో హిజ్రాలు దేవత పూజను నిర్వహిస్తారు. మూడు రోజులు జరిపే ఈ పూజ మంగళవారం ప్రారంభమవుతుంది. చౌత్‌రాజ్ మాతే వీరి దేవత. ఈ ఉత్సవానికి వేలాదిగా హిజ్రాలు హాజరవుతారు. హిజ్రాలకు కులం, మతం, పేద, ధనిక భేదాలుండవు. ఉలిగమ్మలుగా మార్చబడిన బాలురు కూడా ఈ ఉత్సవానికి హాజరవుతారు. వీరిని కూడా హిజ్రాలు తమ వర్గం వారిగా ఆదరిస్తారు. హిజ్రాలు మరణిస్తే వారి శవాన్ని పూడ్చరు. ఎంత ఖర్చయినా వారిని కాల్చేస్తారు. పూడిస్తే చేతబడులు చేసేవాళ్ళు రాత్రికి రాత్రే తీసుకెళ్ళిపోతారనే భయంతో అలా చేస్తారట. హిజ్రా శవం ఉన్న పాడెను హిజ్రాలు చెప్పుల్తో కొడతారట. అలా కొడితే ఆ వ్యక్తి మరలా హిజ్రాగానే పుడుతుందని వాళ్ళ నమ్మకమట.

**చేదుముట్టడం :**

నామదార్లలో గల ఒకానొక సంప్రదాయం ఇది. వీరి ఇళ్ళలో ఎవరైనా చనిపోతే శవం దగ్గిరే ఒక యాటను కొట్టి వండుతారు. శవాన్ని నట్టింట్లో గోడ కానించి కూర్చోబెట్టి ముందర తళిగె వేస్తారు. దాయాదులంతా వరుసగా కూర్చుంటారు. శవం, బంధువుల ఆకుల్లో అన్నం, మాంసం వడ్డిస్తారు. కాటికాపరి శవం నోట్లో ఒక ముక్క పెట్టి అందరినీ తినమంటాడు. అందరూ ఇష్టం లేకున్నా కొంత తిని మిగిలింది వదిలేస్తారు. దీన్నే “చేదుముట్టడం” అంటారు.

**కపాలమోక్షం :**

బ్రాహ్మణుల్లో కొందరిలో ఈ ఆచారం ఉంది. మోక్షం పొందకనే మరణించే దైవజ్ఞులకు కపాల మోక్షం కలిగించడం ఆచారం. ఒక మఠాధిపతి చనిపోయాడు. అతనికి కపాల మోక్షం జరగాలంటే అతని తలపై టెంకాయలు కొట్టి కపాల మోక్షం చేస్తారు. చనిపోయిన మఠాధిపతిని గుంతలో ఉత్తర దిక్కుకు ముఖం ఉండేలాగా పద్మా

సనంలో ధ్యానం చేస్తున్నట్లుగా కూర్చోబెట్టారు. అతని శిష్యులు మొదట తలపై ఒక టెంకాయ కొట్టారు. ఇక తోటోన్ని పిలవండి అని దాసును పిలిచి అతనికి టెంకాయ లిచ్చి తలపై ఎలా కొట్టాలో చెప్పారు. దాసు ఒక టెంకాయను తీసుకొని రెండు చేతుల్ని జోడించి ఇందులో నా తప్పేమీ లేదు. నన్ను క్షమించు స్వామీ అని మొక్కి తలపై టెంకాయలు కొట్టడం ప్రారంభించాడు. చాలా కాయలు కొట్టిన తర్వాత తల నిలువునా రెండుగా చీలి మెదడు బయటికి వచ్చింది. దీనినే కపాల మోక్షం జరిగిందంటారు.

**'వొలికలబీడు' - సామాజిక చైతన్యం :**

'వొలికలబీడు' నవలలో సామాజిక చైతన్యాన్ని కలిగించే అంశాలు చాలా ఉన్నాయి.

**దెయ్యాలు - ఆత్మలు :**

దెయ్యాలు, ఆత్మలు ఉన్నాయా? లేవా? అంటే సమాజం, సైన్స్ ఎంతో అభివృద్ధి చెందినా, చదువుకున్న వారి శాతం భారీగా పెరిగినా ఇంకా ఆత్మలు, దెయ్యాలు ఉన్నాయని నమ్మేవారున్నారు. ఇలా నమ్మేవాళ్లలో చదువుకున్న వారు కూడా ఉన్నారు. రచయిత భైరప్ప ద్వారా 'కోరికలు తీరకుండా సచ్చిపోయిన మనిషి జీవుడు ఆత్మరూపంలో తిరగతా వుంటాదంటారు గదా. అట్లా తిరిగే ఆత్మలే దయ్యాలంటారు.'' నిజమే నా అని దాసుని అడిగిస్తాడు. అందుకు బదులుగా దాసు ''ఈ ఆత్మలు, దెయ్యాలు అన్నీ మనకు కలిగే గిలే'', మన తాతల ముత్తాతల కాలం నుంచీ.. స్మశానాల్ని నమ్ముకోని బతికే వాళ్లం. ఎవురూ ఇబ్బుటివరకు ఆత్మను సూసినోళ్లేలే. సచ్చినోడు సచ్చినట్లే మన్నులో కలిసిపోతాయి....... వాడిలో వున్న ఊపిరి గాల్లో కలిసిపోతుంది. అంతే. దెయ్యమూలే. పిశాచమూలే''. దెయ్యాలు, ఆత్మలు లేవనే మాట దాసు పాత్ర ద్వారా చెప్పించడం చాలా ఔచిత్యవంతంగా ఉంది. దాసు కాటికాపరిగా నిత్యం శవాలను పూడ్చడం, దహనం చేయడం చేస్తుంటాడు. అతని నివాసం కూడా వొలికలబీట్లోనే. కనుక శవాల గురించి దాసుకన్నా ఎక్కువగా ఎవరికీ తెలియదు. కనుక దెయ్యాలు, ఆత్మలు లేవనే విషయాన్ని కాటికాపరి దాసు ద్వారా చెప్పించి సమాజంలో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు రచయిత.

ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఎక్కువగా బాధపడతారు, దు:ఖిస్తారు. కొందరైతే లే, నాతో ఒక్కసారైనా మాట్లాడు అని శవాన్ని పట్టుకొని ఏడుస్తారు. చనిపోయిన వ్యక్తి నిజంగా బ్రతికితే సమాజం ఆవ్యక్తిని ఎలా చూస్తుంది? అతన్ని చేర దీస్తుందా? అంటే చేరదీయదు. ఇటువంటి సంఘటన ఒకటి వొలికలబీడు నవలలో కనిపిస్తుంది. పెద్దపల్లిలో పెద్దరెడ్డి అనే ఒక పెద్ద ఆసామి, ఆయనకు భూములు కూడా బాగా ఉన్నాయి. ఆరోగ్యం పాడై ఆయన చని పోయాడని దహన కార్యాల కోసం దాసు తండ్రిని పిలుచు కొని వెళ్ళారు. దింపుడు కళ్ళెం దగ్గర అతను పెద్దరెడ్డి అని మూడుసార్లు పిలిచాడట. అతను లేచి కూచొని నాకేమైంది? నేను ఎక్కడున్నాను? అని అడిగాడట. అంతవరకూ ఏడుస్తున్న బంధువులు తమ మనిషి బ్రతికాడని సంతోషించాల్సింది పోయి భయంతో పరుగులు తీశారు. ఆయనలోకి వచ్చింది ఆయన ఆత్మ అయితే పరవాలేదు. ఇతరుల ఆత్మ అయితే ఊరే స్మశానం అయిపోతుంది అని రకరకాలుగా మాట్లాడు కోసాగారు. చాలామంది భయంతో వెళ్ళిపోయారు. కొడుకు తండ్రి బ్రతికాడని సంతోషించక బంధువులు మాటలు విని వొలికలబీడుకు తీసుకెళ్ళిన ఏ వస్తువు ఇంటికి తీసుకురాకూడదు కనుక తండ్రిని కూడా పొలం దగ్గర గుడిసెలో పెట్టారు. ఆయనకు సమయానికి తిండిలేదు. అందరూ ఉన్న అనాథలాగా జీవిస్తున్నాడు. చచ్చి బతకడం నేరమైందని రోజూ తలచుకొని కుమిలిపోసాగాడు. తాను సంపాదించిన ఆస్తులను చూసి ఒకప్పుడు ఇవన్నీ నావే అని గర్వపడ్డాను. అవి ఇప్పుడు నావికావు, రేపు ఇంకెవరివో అనుకుంటూ దు:ఖించసాగాడు. చచ్చి బతికిన మనిషిని మనిషిగా చూడలేని మనుషుల్లోని మానవత్వాన్ని ప్రశ్నిస్తాడు రచయిత.

**అంటరానితనం :**

ఒక రోజు కాటికాపరి దాసు భైరప్ప, బొందయ్య పట్నంలోని ఒకవీధిలో నడుచుకొని వెళుతున్నారు. ఆ వీధిలో మఠాధిపతి వస్తున్నాడని ఎదురుగా ఎవరూ రావద్దని అందరూ దూరంగా వెళ్ళండని అతని శిష్యులు

ముందు చెబుతూ వెళుతున్నారు. వారు దాసును చూసి నువ్వు స్మశానంలో శవాలు పూడ్చి, కాల్చేవోడివి అస్సలు ఎదురు రావద్దు అని దూషించారు. అది చూసిన భైరప్ప మనసులో కాటోళ్లు అంటరాని వాళ్ళా? వీళ్ళ శవాలు పూడ్చడానికి, కాల్చడానికి అంటులేదు, బతికున్నోళ్ళకు మాత్రం అంటా? అని మనసులో ప్రశ్నించుకున్నాడు. ఆయన ఆశీర్వదిస్తే మంచి జరుగుతుందంటారు. కానీ ఆయన దగ్గరికి పోనీయరు. ఇది ఏమి భక్తి అని కాటికాపరుల పట్ల చూపే అంటరానితనాన్ని సూటిగా ప్రశ్నిస్తాడు రచయిత.

ఒకసారి భైరప్పకు తన కుటుంబం గుర్తుకు వచ్చి దాసుతో ఊరెళ్ళి వస్తాను అంటే వెళ్ళి రమన్నాడు. భైరప్ప తన ఊరికెళ్ళి తనవారితో సంతోషంగా మాట్లాడాడు. ఏమి చేస్తున్నావని అడగ్గా వొలికలబీట్లో శవాలు కాల్చే పని అని చెప్పగా అప్పటి నుండి భైరప్ప పట్ల బంధువులు, గ్రామస్తులు చూపిన అంటరానితనం, దూషణలు తీవ్ర ఆవేదన కలిగిస్తాయి. మనిషిని మనిషిగా చూడలేని సమాజం పట్ల జాలి, ఆగ్రహం కలుగుతాయి. ఆ బాధను స్వయంగా అనుభవించిన భైరప్ప చేత కాటికాపరుల గొప్పదనాన్ని పలికిస్తాడు రచయిత. "నన్ను అక్కున చేర్చుకుని నన్నింతోన్ని చేసిన గంగి, దాసే నిజమైన మనుషులు, వోళ్ళకు కులంలే, మతంలే. ఇట్లా కులాచారాలు, తెలపలేని సంప్రదాయాలు ఏమీల్యా. వోళ్లు చేసేదే నిజమైన మానవసేవ". ఈ మాటలు కాటికాపరి వృత్తి పట్ల రచయితకు గల సానుభూతి, గౌరవాన్ని తెలుపుతున్నాయి.

కొంతకాలానికి ఆ మఠాధిపతి చనిపోయాడని ఆయనకు అంత్యక్రియలు చేయాలని ఒక వ్యక్తి వచ్చి దాసుతో చెప్పాడు. అయితే మీరు అగ్రహారానికి గానీ, మఠానికి గానీ రావడానికి వీల్లేదు. నేరుగా మా బ్రాహ్మణుల స్మశానానికి వెళ్ళి గుంత సిద్ధం చేయాలని చెప్పాడు. "ఇదేందిరా నాయనా... మేము వోళ్ల మఠాల్లోకి పోగూడదు. అగ్రహారంలోకే పోగూడదు... కానీ పీనిగిని పూడ్చే వొలికలబీడుకు మాత్రం పోవాల. దానికి మాత్రం అంటులే. ఏం బామ్మలో, ఏమాచారాలో....." అని అంటరానితనం దురాచారాన్ని భైరప్ప పాత్ర ద్వారా సూటిగా ప్రశ్నిస్తాడు.

**స్మశానవాటిక పేరు :**

స్మశానంలో కూడా అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతోందని, చివరికి స్మశానవాటిక పేరులో కూడా కాటికాపరులకు స్థానంలేదని రచయిత ఆ సమాజాన్ని ధైర్యంగా, సూటిగా ప్రశ్నించాడు. మనిషి బ్రతికున్నంత వరకు ఎన్ని అంతరాలున్నా చనిపోయాక అందరినీ శవమనే పిలుస్తారు. అన్ని వర్గాల శవాలు చేరుకునేది స్మశానానికే. అయితే ఆ స్మశానాల్లో కూడా కులాల పేర్లతో అంతరాలు కొనసాగించే పరిస్థితి పెరిగిపోతున్నదనేది రచయిత ఆవేదన. హరిశ్చంద్ర స్మశానం, హరిశ్చంద్ర ఘాటు, దళితుల స్మశానవాటిక, క్రిస్టియన్ స్మశానం, ముస్లింలకు ఖబరస్తాన్ దర్గా అని ఇలా స్మశానాలకు కూడా కుల మతాల పేర్లు ఇప్పటికీ మనకు దర్శనమిస్తాయి.

చాలాచోట్ల హిందూ స్మశానవాటికలకు 'సత్య హరిశ్చంద్ర స్మశానవాటిక' పేరు కనిపిస్తుంది. అసలు స్మశానానికి సత్యహరిశ్చంద్ర పేరుకు ఏమి సంబంధం అని నిలదీస్తాడు రచయిత. ఇందులో పెద్ద కులాలోళ్ల కుట్ర ఉందంటాడు. స్మశానంలో హరిశ్చంద్రునికి పని చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది వీరబాహుడు. వీరబాహుడు కాటికాపరి కులస్థుడు. నిజమైన మానవ సేవ చేసేది కాటికాపరులే. కనుక సత్యహరిశ్చంద్రుని స్మశానానికి బదులుగా "వీరబాహు వొలికలబీడు" అని పేరు పెట్టాలని, స్మశానాల్లో హరిశ్చంద్రుని విగ్రహాలకు బదులు వీరబాహుని విగ్రహాలు పెట్టాలని సూచిస్తాడు రచయిత.

**శ్రమ దోపిడీ :**

కాటికాపరుల శ్రమదోపిడీని కూడా ఈ నవలలో చిత్రించారు రచయిత. స్మశానంలో దహనం చేసే కాటికాపరులకు ఇచ్చే డబ్బుల విషయంలో బేరాలడడం తగదంటాడు రచయిత. కాలక్రమంలో పట్టణాలు విస్తరించడం, జనాభా పెరుగుదల కారణంగా ప్రభుత్వాలు స్మశానాల నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించాయి. స్మశాన వ్యవస్థ అంతా కాటికాపరుల చేతి నుండి

కాంట్రాక్టరుల చేతిలోకి వెళ్ళిపోయింది. కాంట్రాక్టర్లు శవానికింత అని కూలి ఇచ్చేసి మిగిలిందంతా వారే తీసుకుంటున్నారు. కాటికాపరులు ప్రశ్నిస్తే మీరు స్మశానానికి రావద్దని బెదిరిస్తున్నారు. స్మశాన కాంట్రాక్టర్లు కోట్లకు పడగలెత్తడానికి స్మశానాలు వారికి పునాదులవు తున్నాయని కాటికాపర్లు కడుపు కాల్చుకొని ఎంగిలి మింగి బతికే స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేయడంతోపాటు వారికి జరుగుతున్న శ్రమదోపిడీని ప్రశ్నించాడు.

**చిత్తూరు మాండలికం :**

వొలికలబీడు నవలలో చిత్తూరు మాండలికాన్ని విరివిగా ప్రయోగించాడు రచయిత రాసాని. ఇది ఆయనకు తన మాండలికంపై గల ఆదరాభిమానాలు, గౌరవాన్ని సూచిస్తున్నాయి. పూడ్సినాడు, అన్యాడు, పేరు పెట్న్యా, దూం తగల్నిట్టు, యలబారేది, దానం, కీనేరు నేల, పీనిగె, వయసుకొచ్చిండాది, తొలికట్టు, బిశాంబరం (నిశ్శబ్దం), సస్తాడు, యసన (బాధ) గెవనాలు (జ్ఞాపకాలు), పిలస్తారు, బిరీనా (త్వరగా), సోరకం (స్పృహ), మర్లు (ఇష్టం), మాటుగప్పి (మాయచేసి), అసుకల దుత్త (అస్తికల), పవుడి (జాడ) చెంచికారం (అడ్వాన్స్), పయ్యేరు.

ఈ పదాలు ప్రధాన భాషా స్రవంతిలోకి ప్రవేశంతో తెలుగుభాష మరింత పరిపుష్టం అవుతుంది.

అరుదైన, అంతరించిపోతున్న తన మాండలిక పదాలను ప్రాణం పోసిన రచయితే అక్కడక్కడ తెలుగు పదాలు ఉన్నప్పటికీ ఆంగ్ల పదాలు ప్రయోగించడం చూస్తే పంటి కింద పడ్డ రాయిలాగా అనిపిస్తున్నాయి. అవి వెహికల్లో (వాహనంలో) డబుల్ డబుల్‌గా (రెండింతలు) గా పవుడర్ (పొడి) వంటి పదాలు.

కాటికాపరి కులానికి తెలుగు సాహిత్యంలో పెద్దగా స్థానం ఉన్నట్లు కనిపించదు. సత్యహరిశ్చంద్ర నాటకంలో కొంత కనిపిస్తుంది. ఇతర రచయితలు ఎవరూ పెద్దగా కాటికాపరుల గురించి పట్టించుకోలేదు. అయితే డాక్టర్ వి.ఆర్.రాసాని గారు 'వొలికలబీడు' నవల ద్వారా కాటి కాపరులకు సాహిత్యంలో మంచి స్థానాన్ని కల్పించారని చెప్పవచ్చు. కాటికాపరుల జీవితం, సమస్యలు, కష్ట నష్టాలను చర్చించడం ద్వారా కాటికాపరులకు సంబంధిం చిన ఖాళీని సాహిత్యంలో రాసాని గారు కొంతమేర పూరించ గలిగాడని చెప్పవచ్చు.

కాటికాపరులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి వారి జీవితాల్లో వెలుగులు రావాలనే ఆకాంక్షతో రచయిత ఈ 'వొలికలబీడు' నవల రాశాడు. కాటికాపరులకు జరుగు తున్న అన్యాయాలను, కష్టాలను సమస్యలను సమాజం ముందు పెట్టడంలో రచయిత ఆమేరకు విజయం సాధించాడని చెప్పవచ్చు. వారి సమస్యల పరిష్కారానికి పోరాటమే తగిన మందని భైరప్ప పాత్ర ద్వారా తెలియ జేశాడు. తమకు జరుగుతున్న అన్యాయాలకు భైరప్ప రాష్ట్రంలోని అందరు కాటికాపరులను ఏకం చేసి వివిధ సంఘాల మద్ధతుతో పోరాటం ప్రారంభించాడు.

ఈ విధంగా 'వొలికలబీడు' నవలలో కాటికాపరుల సమస్యల పరిష్కారం కోసం వారిని పోరాటమార్గం పట్టించాడు రచయిత.

**ఆధార గ్రంథాలు :**

1. వొలికలబీడు - డాక్టర్ వి.ఆర్.రాసాని
2. తెలుగులో ఆధునిక నవల - అంపశయ్య నవీన్
3. సత్యహరిశ్చంద్రీయము - శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతం
4. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వానా శాస్త్రి

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పాయిదరువుల నవల - గిరిజన జీవన చిత్రణ

- డా॥. సుంకర గోపాలయ్య

డి.ఆర్.జి ప్రభుత్వకళాశాల, తాడేపల్లిగూడెం.

**సంక్షిప్తం :**

చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతానికి చెందిన యువర చయిత కె.విమేఘనాథ్ రెడ్డి రచించిన పాయి దరువులు అనే నవలలో చిత్తూరు ప్రాంత గిరిజన జీవితా లను చిత్రీకరించింది. నవల మొత్తం పలమనేరు ప్రాంతా నికి చెందిన గిరిజన ప్రజలు మాట్లాడే మాటలెక్క భాష లోనే సాగుతుంది. గిరిజన చైతన్యం ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. పరిశోధనాత్మక దృక్పథంతో, యానాదుల జీవితాల్లోకి పరకాయ ప్రవేశంచేసి మేఘనాథ్ రెడ్డి రాసిన ఈనవల, తెలుగు సాహిత్యంలో యువర చయితల సత్తాను చాటిచెబుతోంది. అణచివేతకు వ్యతిరేకంగా గొడ్డలి పెట్టులా నిలిచే చిన్నమ్మి పాత్ర, కేశవరెడ్డి 'మునెమ్మ' నవలలోని నాయిక అంతబలంగా రచయిత తీర్చిదిద్దాడు. చివరికి పాఠకుడి గుండెబరువెక్కేలా, ఆజాతి ఆవేదనను ఈనవల ప్రతిబింబిస్తుంది. యానాదులకు అడవితో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని, వారికష్టాల వైశాల్యాన్ని రచయిత కళ్ళకుకట్టినట్లు చూపారు. నాగరికతకు దూరంగా ఉండే గిరిజన స్త్రీలు పెత్తం దారుల చేతిలోపడే వేదనను ఇందులోచర్చించారు.

**సాంకేతిక పదాలు :**

పాయిదరువులు - చినమ్మి - గిరిజన చైతన్యం - మొరసనాడు - లింగాలగోడు - మాండలికం - నవల - ఆనందుడు.

**పరిశోధనా పత్రనేపథ్యం :**

ఒకవ్యక్తులోని అనుభూతుల్ని ప్రభుత్వం చిత్రీకరిస్తే ఆవ్యక్తి తాలూకా అనుభవాలను నవల చిత్రీకరిస్తుంది. 19వశతాబ్దపు చివరికాలంలో నవల ఆంగ్లసాహిత్య ప్రభావంతో తెలుగులో ప్రవేశించింది. కందుకూరి రాజశేఖర చరిత్ర తన వలారచయితలకు మార్గదర్శకమైన నవల. ఆ తర్వాత తెలుగులో నవలలు కోకొల్లలుగా వచ్చాయి. "నవలప్రజాప్రక్రియ" అనిస్టీఫెన్లిస్లిక్ అంటారు. తెలుగులోచారిత్రక, సాంఘిక, మనోవైజ్ఞానిక, తాత్విక రాజకీయ హాస్య నవలలు వచ్చాయి.అస్తిత్వవాద ఉద్యమాలు బయలుదేరాక నవలలు కొత్తమలుపును తీసుకున్నాయి. దళితవాద, స్త్రీవాద, ప్రాంతీయవాద, గిరిజన ప్రపంచీకరణ నవలలు వచ్చాయి.

కె.విమేఘనాథ్ రెడ్డి అనే రచయిత రచించిన పాయ దరువులు అనే నవల విశ్లేషనే ఈ పరిశోధనా పత్రనేపథ్యం. ఈనవలలోని వస్తువు, శిల్పవైవిధ్యం మాండలిక భాషా ప్రయోగం మొదలైన అంశాల గురించి విశ్లేషిస్తాను. నవలలో చిత్రీకరించిన గిరిజన చైతన్యం గురించి చర్చిస్తాను. ఈనవల తెలుగు సాహిత్యంలో అరుదుగా

కనిపించే ఆదివాసీ గిరిజన (యానాది) జీవితాలను, వారి సంస్కృతిని ప్రతిబింబించే ఒక శక్తివంతమైన రచన.

**రచయిత పరిచయం :**

కె.విమేఘునాథ్ రెడ్డి పలమనేరు మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన యువరచయిత. వారు 1990లో కె.బవాసుదేవరెడ్డి, శివేగారిదేవమ్మ దంపతులకు జన్మిం చారు. 2017లో రచనలు మొదలుపెట్టి కరిగిపోయే కన్నీటి చుక్క అనేక వితాసంపుటిని, కలంకూరిగుట్ట అనేకథల సంపుటిని వెలువరించారు. కలంకూరిగుట్ట కథసంపుటికి వారుఅనేక పురస్కారాలను అందుకున్నారు. ఆకథాసంపుటి ద్వారా తెలుగు సాహిత్యంలో స్థానాన్ని సంపాదించారు. వారితల్లి శివయ్యగారి దేవమ్మపేరు మీద ప్రతి ఏటా పురస్కారాల ఇస్తున్నారు. ప్రస్తుతం నవల వాయు దరువులు 2024 లోవెలువడింది.

**వాయిదరువులు - ఇతివృత్తం :**

నవల ప్రధానంగా చిత్తూరుజిల్లా ప్రాంత యానాదుల బతుకు చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. అనాదిగాతమజాతిపై, ముఖ్యంగా స్త్రీలపై సాగుతున్న పెత్తందారీ అణచివేతను, అన్యాయాలను ఒక ఒంటరి గిరిజన స్త్రీఎలా ఎదిరించింది అనే ప్రతీకారం మరియు పోరాటం ఈనవల ప్రధాన ఇతివృత్తం. కథమొత్తం చిన్నమ్మి అనే చురుకైన గిరిజన యువతి చుట్టూ తిరుగుతుంది. ఆమెఅమాయకత్వం, ప్రేమ, పాటలు పాఠకులను అలరిస్తూనే, మరోవైపు ఆమె ఎదుర్కొనే సామాజిక వివక్షకంటతడి పెట్టిస్తుంది. నవల ప్రత్యేకత ఏమిటంటే, సంభాషణలతోపాటు కథనం మొత్తం యానాదియాస (మాండలికం) లోనేసాగుతుంది. ఇది పాఠకుడిని ఆప్రాంత వాతావరణంలోకి నేరుగా తీసుకెళ్తుంది. పాయిదరువులు' నవలలో కె.వి. మేఘునాథ్ రెడ్డి సృష్టించిన పాత్రలు కేవలం ఊహాజనిత వ్యక్తులుగా కాకుండా, రక్తమాంసాలున్న మనుషులుగా పాఠకులకు అనిపిస్తాయి.

**పాయిదారువులు - విశ్లేషణ :**

లంబాడోళ్ళ రాందాసు (కొర్రపాటిగంగాధరరావు), కొమురంభీము (సాహు, అల్లంరాజయ్య), అతడు అడవిని జయించాడు (డాక్టర్కేశవరెడ్డి), అడవి (వసంత రావ్దేశ్పాండే), సంఘం (చిన్నప్పభారతి), సరిహద్దు (సాధన), రాగో (సాధన), చివరిగుడిసె (డాక్టర్కేశవరెడ్డి), ఊరు (వసంతరావ్దేశ్పాండే), పునరావాసం (అట్టాడ అప్పల నాయుడు), అడివంటుకుంది (భూషణం), అడవితల్లి (పులుగుశ్రీనివాస్), ఎల్లి (అరుణ), ఎన్నెలనవ్వు (ఏకుల వెంకటేశ్వర్లు), వసంతగీతం (అల్లంరాజయ్య) మొదలైన నవలలు తెలుగులో వచ్చాయి. పాయదరువులు వాటికి అదనంగా ఇప్పుడుచేరింది.

పాయిదరులు అనగా తల్లినిబిడ్డని వేరుచేయడం అనే అర్థం ఉంది. చిన్నమ్మి అనే గిరిజనస్త్రీ, రాజయ్యని భూస్వామి దాష్టికానికి బలైన బూలచ్చిమి కూతురు. తండ్రిని కూడా కోల్పోతుంది. భూస్వామివల్ల తనతల్లికి జరిగిన అన్యాయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న చిన్నమ్మి, చాకచక్యంగా రాజయ్యని మట్టు పెడుతుంది. ఈనవల చిన్నమ్మ చుట్టూనే తిరుగుతుంది. చిన్నమీ బతుకు చిత్రమే ఈనవల. అయితే రచయిత చిన్నమ్మి బాల్యం నుంచి చైతన్యం కలిగిన పాత్రగా మనముందు నిలుపు తాడు. నవల ప్రారంభం నుండి చివరివరకు ఆమె యానాదుల అస్తిత్వంకోసం పోరాటం చేస్తుంది. చిన్నమీతో పాటులింగాల గోడు అనే మేకపిల్ల ఈనవలలో మరొక ఆసక్తి కరమైనపాత్ర. ఇందులో యానాదుల జీవనంతో పాటు మూగజీవాల బతుకు కూడా కనిపిస్తుంది లింగాల గోడు బొల్లిమేక అలాగేపొట్టోడు అనేకుక్క, పాపులమ్మ, చిన్నమ్మినీ చూసిప్రేమలోపడే ఆనందుడు, రాజయ్య ఇందులో ప్రధానపాత్రలు. కౌండిన్య అడవి ప్రాంతంలో ఆనుకుని ఉన్న గిరిజనపల్లె జీవితాన్ని రచయిత మన ముందు బొమ్మకడతాడు.

మేఘునాథ్ రెడ్డికి గిరిజన జీవితానికి సంబంధంలేదు. అయినప్పటికీ వారితో కలిసి తిరిగిన జీవితాన్ని తాను గిరిజనుల కష్టాల్ని చూసిన విధానాన్ని సమర్థవంతంగా నవలలో తీసుకురాగలిగాడు. తెలుగునేల మీద అస్తిత్వ ఉద్యమాలు అందించిన చైతన్యం మనకు తెలుసు. ఎవరి జీవితాలు వారు సాహిత్యంలోకి తీసుకొని వచ్చిన తర్వాత తెలుగు సాహిత్యంలో పెనుమార్పులు సంభవించాయి. ఎవరి కష్టాలు వారు చెప్పుకున్నారు. ఎవరి జీవితాన్ని వారు

చిత్రీకరించారు. కానీఈనవల గిరిజన జీవితంపట్ల ఉండే సహానుభూతి సానుభూతి ఆధారంగా రచయిత రచించాడు. గిరిజనులు ఊరికి దూరంగా ఉంటారు. బడికి దూరంగా ఉంటారు. చదువు ఉండదు. పశువులకాపర్లుగాను భూస్వాములు దగ్గరకూలి వాళ్ళుగాను బతుకును సాగిస్తుంటారు. ఊరికి దూరంగా లేదా అడవులకు దగ్గరగా చిన్నచిన్న గుడిసెల్లో నివసిస్తూ ఉంటారు. వారి ఆహారపు అలవాట్లు, గొర్రెలను, మేకలను, బర్రెలను ఆవులను మేపడంలో వారిబతుకు సాగుతుంది. కౌండిన్య అడవికి దగ్గరగా చిన్నచిన్న గుడిసెల్లో నివసిస్తూ రాజయ్య అనేభూస్వామి దౌర్జన్యానికి తమ జీవితాలను కోల్పోతున్న గిరిజనుల జీవితాలు ఇందులోకనిపిస్తాయి.

**పాయిదరువులు - పాత్ర చిత్రణ :**

**1.చిన్నమ్మి (ప్రధానపాత్ర) :**

చిన్నమ్మి ఈ నవలకు ప్రాణం. ఆమెపాత్ర కేవలం ఒక గిరిజన యువతిగా మాత్రమే కాకుండా, అణచివేతపై తిరుగుబాటు చేసే ఒకశక్తిగా కనిపిస్తుంది. కథ ఆరంభంలో చిన్నమ్మి అల్లరి, ఆమెచిందులు, పాటలు పాఠకులను అలరిస్తాయి. ఆమె ప్రకృతికి, అడవికి ప్రతిరూపం.గిరిజన స్త్రీలపట్ల పెత్తందారులు ప్రదర్శించే ఆధిపత్యాన్ని, అన్యాయాన్ని ఆమె ఒక ఒంటరి మహిళగా ఎదుర్కొన్న తీరు అద్భుతం. తల్లిమేక ఈనేటప్పుడు ఆమెపడే వేదన, ఆ సమయంలో పాఠకుడికి అతనితో కలిగే స్నేహం రచయిత యొక్కగొప్ప సృజన. గిరిజనుల సహజమైన, నిష్కల్మషమైన మనస్తత్వానికి ఈపాత్ర నిదర్శనం.

**2. లింగాలోడు :**

నవలలో లింగాలోడు పాత్ర ఒక కీలకమైన మలుపు. చిన్నమ్మితో లింగాలోడికి ఉండే అనుబంధం చాలా సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఉంటుంది.

**3. ఆనందుడు :**

ఆనందుడు, చిన్నమ్మి జీవితంలోని ప్రేమకోణాన్ని ప్రతిబింబిస్తాడు. ఇతను నవలలోని ప్రతినాయకుడు రాజయ్య కొడుకు. కానీ రాజయ్య మనస్తత్వం ఇతనికి రాలేదు. గిరిజన జీవితాలపట్ల సానుభూతి ఉంది. చిన్నమ్మి, ఆనందుల మధ్య సాగే ప్రేమాయణం పాఠకులను మైమరిపిస్తుంది. వీరిద్దరి మధ్య ఉండే అనుబంధం గిరిజన జీవనంలోని సున్నితమైన పార్శ్వాలను చూపుతుంది.

**4. రాజయ్య :**

రాజయ్యది దోచుకునే స్వభావం. ఆప్రాంత యానాదులను మోసం చేస్తుంటాడు. ముఖ్యంగా చిన్నమ్మతల్లి, ఇతని కారణంగానే చనిపోతుంది. తల్లినుండి బిడ్డను వేరుచేసినట్టుగా మూగజీవాల నుండి పిల్లలను కూడా వేరుచేస్తాడు. స్త్రీలోలుడు.

**నవలలోని భాష :**

మేఘనాథ్ రెడ్డి భాషాపరంగా చాలా అద్భుతమైన ప్రతిభని చూపారు. నవల ఇతివృత్తానికి సరిపోయే భాషను ఎంచుకున్నారు. నవల మొత్తం జరిగిన మొరసనాడు ప్రాంత గిరిజన భాషను యధాతథంగా నవలలో వాడారు. అచ్చమైన మొరసనాడు ప్రాంతపలుకుబడిని ప్రతి వాక్యంలో పలికించాడు. సంభాషణలు చాలా సహజంగా ఉంటాయి. మాండలిక పరిమళం మనల్ని తాగుతుంది. అయితే నవల ప్రారంభంలో ఈమాండలిక భాషవేరే ప్రాంత వ్యక్తులకు అడ్డు తగులుతుంది. కొన్ని పేజీలు నవల చదివాక ఆపలుకుబడికి పాఠకులు అలవాటు పడతారు. “ఉడుకుడుగ్గా ఉడుముకూరలో రాగిసంగటి తినల్లంటేదే ముడిదెగ్గిర అడిగొచ్చిండల్ల. దానిరుసి, పసితిన్నోడికే తెలిస్తాది.” దేముళ్లకి అమృతంఎట్లనో.. అడివోళ్లకి ఉడుముకూరట్ల.

**నవల - ప్రత్యేకత :**

1. గిరిజన అస్తిత్వానికి దూరంగా ఉన్నవ్యక్తి రాసిన నవల.
2. గిరిజన జీవితం తెలుసుకో కాబట్టి రచయిత నవల విజయవంతంగా నడపగలిగారు.
3. గిరిజనుల ఆహారం వేషధారణ వైద్య విధానాల గురించి రచయితకు అవగాహన ఉంది.
4. నవలలో మూగజీవులు మనుషులు మధ్య ప్రేమను గొప్పగా చిత్రీకరించారు.

5. శతాబ్దాలుగా గిరిజనులపై జరుగుతున్న శ్రమదోపిడి లైంగిక దోపిడీని చెప్పారు.
6. ఇది చిన్న మీకు సంబంధించిన మూడుతరాల కథను చెప్పిన నవల.
7. ఈ నవల కథానాయిక చినమ్మి నవల మొత్తం చైతన్యం కలిగిన పాత్రగా కనిపిస్తుంది. తన జాతికి జరిగిన అవమానానికి అన్యాయానికి ఎదురు జరుగుతుంది.
8. గిరిజన భాషలో సంభాషణలు సాగాయి.
9. గిరిజనుల జీవన విధానం సాంస్కృతిక అంశాలను రచయిత సృశించాడు.
10. అణగారిన వర్గాల కుటుంబాలలో స్త్రీల ఆత్మ విశ్వాసాన్ని, పోరాటాన్ని చినమ్మి ప్రతిబింబించింది.

**ముగింపు :**

సాయిదరువుల నవల చదువుతున్నంసేపు మనం వారి జీవితాన్ని దగ్గరగా చూసినట్టుగా భావిస్తాం. వేరే ప్రాంతాలవారికి నవల చదవడం కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. నవల ముగింపులో రచయిత ఆనందుడి పాత్రను హఠాత్తుగా నిష్క్రమింప చేస్తాడు. రాజయిని మొట్టుపెట్టిన చిన్నమ్మి కూడా చనిపోతుంది. ముగింపుని ఇంకాస్త ఆశాజనకంగా రచయిత మలిచి ఉంటే బాగుం డేది. ఏదిఏమైనాప్పటికీ ఆదిపత్య సమాజంపైగిరి జనఆడబిడ్డ పోరాటంగా ఈనవల సాగింది. గిరిజనులలో ఉండే మానవసంబంధాలు, ప్రదేశాలకు సంబంధించిన జ్ఞానం, వైద్యవిజ్ఞానం మిగిలిన విషయాలను రచయిత చర్చించాడు.

**ఆధార గ్రంథాలు :**


1. చంద్రశేఖర్, మత్తే. (2011). ఉత్తరాంధ్ర ఆదివాసీ విజ్ఞానం విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
2. జి.శైలమ్మ - తెలుగుకథా సాహిత్యం గిరిజన జీవితం, కుప్పం, ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.
3. రమేష్, జె. (2012). తెలుగు నవలగిరిజన జీవితచిత్రణ, హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
4. వెంకటేష్. ఎమ్. (2018). ఆధునిక తెలుగు సాహిత్యం గిరిజన జీవనచిత్రణ.,హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
5. ఆదివాసీవిజ్ఞానం- ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రచురణ, దూరవిద్య.
6. పాయిదరువులు- ఆదర్శినిమీడియా, హైదరాబాద్ -2024


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# అనువాద నవలలు - సామాజిక చైతన్యం

- డా॥. చంద్రబాబు ఆసాది
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెదురుకుప్పం.

ప్రపంచంలోని గొప్ప గొప్ప అనువాద నవలలు మన తెలుగులోకి అనేకం వచ్చాయి. అందులో బానిసత్వాన్ని, అణచివేతను, కార్మికుల కడగండ్లను చిత్రించి సామాజిక చైతన్యానికి దోహదపడిన వాటిలో అమ్మ, స్పార్టకస్, ఏడు తరాలు ఎంతో ప్రత్యేకమైనవిగా చెప్పవచ్చు. అమ్మ, ఏడు తరాలు, స్పార్టకస్ నవలలు చారిత్రాత్మకంగా కార్మిక, దాస్య, బానిస ఉద్యమాల చైతన్యాన్ని రేకెత్తించి, ఆధునిక సామాజిక పోరాటాలకు మూలాలుగా నిలిచాయి. ఈ నవలలు వర్గ పోరాట చరిత్రను రాత పూర్వకంగా మన ముందుకు తేవడంలో ఎంతో సఫలీకృతమయ్యాయి. 1905 రష్యన్ విప్లవాన్ని ప్రపంచవ్యాప్తం చేసి, లెనిన్ ప్రశంసలు పొందింది. ప్రొలిటారియట్ సాహిత్యానికి మార్గదర్శకం. స్పార్టకస్ (1951): రోమ్ బానిస యుద్ధం (73 బిసి) చరిత్రను మార్క్సిస్ట్ దృక్కోణంతో పునరుద్ధరించి, కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో చిహ్నంగా మారింది. రూట్స్ (1976): ప్లాంటేషన్ బానిసత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా చైతన్యం తెచ్చింది.

**అమ్మ :**

మాక్సిమ్ గోర్కీ రచించిన "అమ్మ" నవల రష్యన్ సాహిత్యంలో కమ్యూనిస్ట్ విప్లవ ఆదర్శాలను ప్రతిబింబించే మైలురాయి. తెలుగులో క్రొవ్విడి లింగరాజు అనువదించిన ఈ నవల, సామాజిక న్యాయం, తల్లి త్యాగాలను చిత్రీకరిస్తుంది. మాక్సిమ్ గోర్కీ (1868-1936), అసలు పేరు అలెక్సీ మాక్సిమోవిచ్ పెష్కోవ్, రష్యన్ సాహిత్యంలో ప్రొలిటారియట్ సాహిత్య పితామహుడు. తెలంగాణ ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చింది. మాక్సిమ్ గోర్కీ నిజ్నీ నోవ్గోరోడ్ (వోల్గా నది)లో కార్మిక కుటుంబంలో పుట్టాడు. 3 ఏళ్లలో తండ్రి, 9 ఏళ్లలో తల్లి మరణించి అనాథయ్యాడు.12 ఏళ్ల నుండి చెప్పుల షాపు, ఓడలో, రైల్వేలో బేకరీలలో పని చేస్తూ, రష్యా అంతటా తిరిగి కార్మికుల బాధలు అనుభవించాడు. అమెరికా పర్యటనలో "అమ్మ" నవల రాశాడు (1906).

ఈ నవల ప్రధాన భూమిక సామాజిక విప్లవం, తల్లి త్యాగం మరియు కార్మిక వర్గ పోరాటంపై ఆధారపడి ఉన్నాయి. ఈ నవల 1905 రష్యన్ విప్లవాన్ని నేపథ్యంగా చేసుకుని, పెలాగియా నిళోవ్నా అనే తల్లి తన కుమారుడు పావెల్‌లోని కమ్యూనిస్ట్ ఆదర్శాలను అంగీకరించి, తానే విప్లవయోధురాలిగా మారే ప్రయాణాన్ని చిత్రీకరిస్తుంది.

నవల మొదట్లో పెలాగియా తన తాగుబోతు, హింసాత్మక భర్త విల్సన్ మరియు కుమారుడు పావెల్‌తో కష్టాల్లో జీవిస్తుంది, పెలాగియా మొదట భయం, అజ్ఞానం బలహీనతలతో కూడిన గృహిణిగా కనిపిస్తుంది. తాగు

బోతు భర్త వాసిలి హింసకు గురైన, కుమారుడు పావెల్‌ను పోషించే స్త్రీ. రష్యన్ కర్మాగార పట్టణంలో కూలి జనం, యంత్రాల రోధ, గొట్టాల పొగ, గొడ్డు చాకిరీ, తక్కువ జీతాలు, మాసిన బట్టలు, చెమటకంపు ఒళ్ళు, కిటికీలు లేని ఇళ్ళు, సారాయి అంగల్లు, తాగుబోతు భర్తలు, భరించే భార్యలు, జూలయి కొడుకులు. భూతు పాటలు, అర్థం కానీ ఆవేశం, ఆకలి కేకలు, అనారోగ్యం, కారణం తెలియని గొడవలు. మారని బ్రతుకులు, అకాల మరణాలు. ఇది ఆనాటి కార్మికుల జీవన ముఖ చిత్రం. ప్రజలు ఇంత చెడ్డ బతకెందుకు బతుకుతున్నారు. అలాంటి పరిసరాలలో జీవించే మనుషులు ఎలావుంటారో పెలాగియా భర్త, కుమారుడు పావెల్ కూడా అలాగే ఉండేవారు. కానీ తల్లి కష్టాలు చూసి కొడుకులో మార్పు వచ్చింది. ఫ్యాక్టరీలో కష్టపడి పని చేస్తున్నాడు. తల్లికి కొడుకు మీద జాలి కలిగింది. నిషేధించబడిన పుస్తకాలు చదవడం మొదలు పెట్టాడు. ఆ పుస్తకాలు కార్మికుల గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం వల్ల నిషేధించ బడ్డాయి. ఆడంబరాలకు స్వస్తి చెప్పాడు. అతని నడ వడికలో ఎక్కువ స్వేచ్ఛ, నిరాడంబరత్వం కనిపించాయి. తమ బ్రతుకులు మారాలంటే "బాగా చదువుకోవాలి. తర్వాత ఇతరులకు బోధించడం. మన కూలి జనం బాగా చదువుకోవాలి. మన జీవితాలు ఇంత భారంగా ఎందుకు మారాయి అని బాగా గుర్తించి అవగాహన చేసుకోవాలి. కొడుకు ఆలోచనలు, ఆశయాలు, ఆశలు చూసి భయమేసేది. వీరుల మాటలు, పోరుబాటలు గురించీ కొడుకు మాట్లాడుతుంటే తల్లికి భయమేసేది. నన్ను నీవు ప్రేమిస్తే నా దారికి అడ్డురాకు" అని తల్లితో అన్నాడు కొడుకు. మనం ఇప్పటి వరకు ఎలా బతికేమో నాకు అక్కర్లేదు ఇంక ఎలా బతకాలో నేను తెలుసుకోవాలి. మనల్ని నాశనం చేస్తున్నది భయమే. మన మీద సవారీ చేసేవాళ్లు మన భయం మూలంగానే మనలనణగదొక్కి బెదిరిస్తున్నారు. పావెల్ మార్క్సిస్ట్ ఆలోచనలతో విప్లవ ఉద్యమంలో చేరడంతో ఆమె జీవితం మలుపు తిరుగు తుంది.

పెలాగియా తన కుమారుడు పావెల్ స్నేహితులతో (సామ్యవాదులు) కలిసి ప్రజా హక్కుల కోసం ప్రచారం చేయడాన్ని గమనిస్తుంది. మొదట భయపడినా, పావెల్ పట్ల మాతృప్రేమతో ఆమె వారి భావాలను అర్థం చేసుకుని, ప్రచార పత్రికలు అచ్చు చేసి పంపుతూ విప్లవ కారిణిగా మారుతుంది. పావెల్‌ను అరెస్టు చేసినప్పుడు కూడా ఆమె పోరాటాన్ని కొనసాగిస్తుంది, మేడే ర్యాలీలో పాల్గొని, జైలు శిక్షలు అనుభవిస్తుంది. క్లైమాక్స్‌లో పావెల్‌ను ఊహించని స్థలంలో హెచ్చరించినా, అతను విప్లవానికి అంకితమైన మరణిస్తాడు. అమ్మ పాత్ర అయిన పెలాగియా ప్రజలకు ఆదర్శంగా మారడం, విప్లవ ఫలితాలను తానే చూడడంతో ఈ నవల ముగుస్తుంది.

ఈ "అమ్మ" నవలలో ప్రధాన సమస్యలు కార్మికుల దుర్భర జీవితం, సామాజిక అన్యాయం, తల్లి మాతృ హృదయ సంఘర్షణ మీద కేంద్రీకృతమై ఉన్నాయి. పరిష్కారాలు విప్లవ ఐక్యత, త్యాగం, సామాజిక చైతన్యంగా ఆదర్శాలుగా సూచించబడతాయి.

**స్పార్టకస్ :**

హెవర్డ్ ఫాస్ట్ "స్పార్టకస్" నవల కథ చాలా వివరంగా రోమన్ సామ్రాజ్యంలో బానిసల తిరుగుబాటును చిత్రీకరి స్తుంది, స్వేచ్ఛే ప్రతిపదికగా బానిస సంకెళ్లు తెంచు కోవడానికి ప్రాణాలు సైతం తెగించి, బానిసలు చేసిన యుద్ధమే. ఇది క్రీ.పూ. 73-71 మూడవ బానిస యుద్ధాన్ని నేపథ్యంగా చేసుకుని, స్పార్టకస్ జీవిత ప్రయాణాన్ని హీరోయిక్‌గా వర్ణిస్తుంది.

స్పార్టకస్ థ్రేసియా గిరిజనుల నుండి వచ్చిన యోధుడు, రోమన్ సైన్యంలో చేరి తర్వాత బానిసగా మారాడు. ఖని కార్మికుడిగా కష్టాలు అనుభవించి, కెపువా గ్లాడియేటర్ స్కూల్లో లెంక్యులస్ బైలస్ కింద శిక్షణ పొందుతాడు. అక్కడ అతని స్నేహితుడు సామ్యుక్ (కాప్పడోసియా బానిస) గ్లాడియేటర్ రోమ్‌లో మర ణిస్తాడు.

ఈ సంఘటన స్పార్టకస్‌లో తిరుగుబాటు బీజాన్ని నాటుతుంది. అతను తన ప్రేమికురాలు లైసార్కాతో కలిసి బానిస వ్యవస్థ దుర్మార్గాలను గ్రహిస్తాడు.క్రీ.పూ. 73లో స్పార్టకస్, క్రిక్సస్ (గాలటియన్ గ్లాడియేటర్),

ఓనోమాయోస్ (గ్రీక్), గాన్నికస్‌తో కలిసి 70 మంది గ్లాడియేటర్లను సమకూర్చి కెపువా జైలు నుండి పారి పోతారు. వారు రొమ్ము కత్తెర్లు, కిచెన్ కత్తెర్లతో ఆయుధాలు చేపట్టి, సమీప బటియటస్ విల్లాపై దాడి చేసి బానిస లును సైన్యంలో చేర్చుకుంటారు. వెసూవియస్ పర్వతంపై ప్రేటార్ గ్లాబ్ర్ 3,000 సైన్యంతో క్యాంపు వేస్తాడు.

స్పార్టకస్ వారి రహస్య గుండాల ద్వారా దాడి చేసి విజయం సాధిస్తారు. ఇది వారి సైన్యాన్ని 1,20,000 మందికి పెంచుతుంది. విజయాలు మరియు సమస్యలు "ఫ్రీ లెజియన్"గా మారిన సైన్యం పొంపే, గ్లాబ్ర్ సైన్యా లను ఓడించి ఇటలీలో ముందుకు సాగుతుంది. స్పార్టకస్ న్యాయ సమాజాన్ని స్థాపిస్తాడు. స్త్రీలకు సమాన స్థానం, ప్రతీకారం కాకుండా క్షమాగుణం, శిక్షణాళ్వారాలు. అల్ప్స్ దాటి థ్రేస్‌కు (స్వేచ్ఛ దేశం) వెళ్లాలని ప్రణాళిక, కానీ క్రిక్సస్ (గ్రామీణ బానిసల నాయకుడు) సిందూర్ లొంగడం వల్ల దక్షిణ ఇటలీ వైపు తిరుగుతారు. సిసిలీ సముద్రతీరంలో కిలికియన్ పైరేట్లతో ఒప్పందం చేస్తారు కానీ పైరేట్లు మోసం చేస్తారు.

క్రసస్ (రోమ్ ధనవంతుడు) 8 లెజియన్లతో (40,000 సైన్యం) కమ్ముకుని 39 మైళ్ల గోడ (37 కోట్లు) వేస్తాడు. స్పార్టకస్ గోడ దాటి పోరాడుతాడు. లుకానియా (సిలారస్ నది) చివరి యుద్ధంలో స్పార్టకస్ తన శత్రువులను చూస్తూ "స్వేచ్ఛ కోసం జీవితం" అని చెప్పుతూ ధైర్యంగా మరణిస్తాడు. మిగిలిన 6,000 మందిని క్రసస్ క్రూస్‌లపై 200 మైళ్ల పొడవున సిలువు వేయిస్తాడు; శివారులో "నేనే స్పార్టకస్" అని చెప్పుతూ శిక్షలు భయం స్థానంలో స్వేచ్ఛ కోసం చావుకు కూడా వెరవకుండా ముందుకు రావడంతో రాబోయే సామాజిక చైతన్య చిహ్నంగా ముగించడం ఒక కొస మెరుపు.

**ఏడు తరాలు :**

అలెక్స్ హేలీ రచించిన "రూట్స్: ది సాగా ఆఫ్ యాన్ అమెరికన్ ఫ్యామిలీ తెలుగులో "ఏడు తరాలు"గా (అనువాదం: సహవాసి) ప్రసిద్ధి చెందింది. ఇది ఆఫ్రికన్-అమెరికన్ బానిసల ఏడు తరాల చరిత్రను చిత్రీకరిస్తూ, బానిసల గమనం, వివక్ష, స్వేచ్ఛ పోరాటాన్ని వాస్తవికంగా వర్ణిస్తుంది. ఏడు తరాలు నవల ఆఫ్రికా నుండి అమెరికాకు బానిస యాత్రను మొదలుపెట్టి, సివిల్ వార్ వరకు సాగుతుంది. రచయిత అలెక్స్ హేలీ తన ముని మ నవడు కుంటా కింటె వంశాన్ని పరిశోధించి రాశాడు.

**1వ తరం :**

కుంటా కింటె (1750లు, గాంబియా) జుఫురే గ్రామంలో మండింకా గిరిజనులకు మొదటి కుమారుడు కుంటా పుట్టాడు. గ్రామ క్రమశిక్షణలో పెరిగి, ఇస్లాం, డ్రమ్ వాయింపు, శికారు నేర్చుకున్నాడు. 17 ఏళ్ల వయసులో చక్కెర డ్రమ్ తయారు చేస్తుండగా "తౌబాబ్" (తెల్ల గులామ వ్యాపారులు) దాడి చేసి అపహరించారు. లండన్ షిప్‌లో అట్లాంటిక్ మీదుగా మధ్యాహ్న యాత్ర, గొలుసులు, కల్డీలు, ఆకలి, రోగాలతో చాలామంది చనిపోయారు. విర్జీనియా వాలర్ ప్లాంటేషన్‌లో "టోబీ" పేరుతో అమ్మబడ్డాడు. నాలుగుసార్లు పారిపోయి విఫలమై, కుడి పాదం కట్ చేయబడ్డాడు. వంటమనిషి బెల్తో వివాహం, కూతురు కిజ్జీ పుట్టింది.

**2వ తరం :**

కిజ్జీకిజ్జీ మాస్టర్ కుమార్తె ఆన్తో స్నేహం చేసి ఫేక్ పాస్ రాసింది. శిక్షగా వాలర్ ఆమెను టామ్ లీకి అమ్మాడు. లీ బలాత్కరణలకు గురై చికెన్ జార్జ్ పుట్టాడు. కుంటా తన గ్రామ చరిత్రను కిజ్జీకి చెప్పి వంశానికి అంకితం చేశాడు.

**3వ తరం :**

చికెన్ జార్జార్జ్ పెద్దయ్యి కాక్‌ఫైట్ ట్రైనర్‌గా ప్రసిద్ధి చెందాడు. మాటిల్డా (ఇంకా గ్రామ దాసీ)తో ప్రేమలో పడి 8 మంది సంతానం పొందాడు. వారిలో టామ్ (బ్లాక్ స్మిత్) ప్రత్యేకంగా పోరాట స్వభావం కలిగి ఉండేవాడు. జార్జ్ గొప్ప జీవనం గడిపాడు కానీ గులామత్వం కొనసాగింది.

**4వ తరం :**

టామ్ మరియు తర్వాలుటామ్ బ్లాక్‌స్మిత్‌గా పనిచేస్తూ స్వేచ్ఛ కోసం పోరాడాడు.

**5వ తరం :**

విల్లియం సివిల్ వార్ సమయంలో గృహ దాసుడిగా

మారాడు.

**6వ తరం :**

టామ్ లెయా ముక్తి తర్వాత కష్టాలు ఎదుర్కొన్నాడు.

**7వ తరం :**

అలెక్స్ హేలీరచయిత తన తాతల నుండి విన్న కుంటా కథను పరిశోధించి, గాంబియా వెళ్లి వంశ చరిత్రను రాశాడు. సివిల్ వార్ (1865) తర్వాత విముక్తి వచ్చినా వివక్ష కొనసాగింది.

"మన మూలాలు తెలిస్తే మనం ఎవరో తెలుస్తుంది" అనే సత్యాన్ని బోధిస్తుంది.

అమ్మ, స్పార్టకస్, ఏడు తరాలు నవలలు సామాజంలో చైతన్యానికి కారణమయ్యాయి. ముఖ్యంగా ఈ కార్మిక ఉద్యమాల్లో బానిస తిరుగుబాట్లు సామాజిక చైతన్యాన్ని రేకేతించాయి. 2000 ఏళ్ళ క్రితం గ్రీకులో బానిసలుగా చేసిన, 200 ఏళ్ళ క్రితం ఆఫ్రికా నుండి అమెరికాకు తరలించి తమ జీవితాలకి దూరం చేసిన, 120 ఏళ్ల క్రితం సంపన్న పాలకవర్గం కానా కష్టంతో ప్రజలను కార్మికులుగా మార్చిన, ఈ నవల ఇతివృత్తాలు ఈనాటికీ దోపిడీ అణిచివేత ఏదో రూపంలో కొన సాగుతూనే ఉన్న ప్రేరణ కలిగిస్తాయి అని అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**


1. "అమ్మ" - (మాక్సిమ్ గోర్కీ ) తెలుగు అనువాదం - క్రొవ్విడి లింగరాజు, విశాలాంధ్ర 2015.
2. స్పార్టకస్, (హొవర్డ్ ఫాస్ట్) తెలుగు - అకెళ్ళ కృష్ణ మూర్తి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2025.
3. ఏడు తరాలు (ఎలెక్స్ హేలీ) తెలుగు - సహవాసి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2022.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# 'నీరు నేల మనిషి' నవల - ఛిద్రమైన రైతుల జీవిత సజీవ చిత్రణ

- డా॥. పి. జయ చంద్రుడు

తెలుగు అధ్యాపకులు, తెలుగు విభాగం, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర)

"అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య"
బోరు ఫెయిలైందని రైతు ఆత్మహత్య
గిట్టుబాటు ధరలేక - పెట్టుబడి కూడా తిరిగిరాక రైతుబలి"

అనాదిగా భారతదేశం వ్యవసాయాధారిత దేశం. ఎన్నో జీవనదులు గల పవిత్ర దేశం. అలాగే సరైన నదులు లేక సరైన వర్షాలు లేక వ్యవసాయం చేసే ప్రజలు మన దేశంలో ఉన్నారు. ఒకవైపు జీవనదులుంటే మరోవైపు ఎడారి ప్రాంతం ఉంది. ఒకవైపు ఉష్ణప్రాంతం మరోవైపు శీతలప్రాంతం గల భిన్న భౌగోళిక ప్రాంతాలున్న దేశం మన భారతదేశం. భారతదేశంలో ఉత్తర ప్రాంతంలో గోదుమలు పండిస్తే, దక్షిణ భారతదేశంలో వరి ఎక్కువగా పండిస్తారు. వరి పండించినా, గోదుమలు పండించినా, వాణిజ్య పంటలు పండించినా వ్యవసాయానికి ప్రధాన వనరు నీరు. నదీ పరివాహక ప్రాంతంలో వ్యవసాయానికి నీటికొరత ఏ మాత్రం ఉండదు. కానీ మెట్ట ప్రాంతాలలో వ్యవసాయానికి అడుగడుగునా కొరత ఏర్పడుతుంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు జీవనాధారం కోసం అప్పులు చేసైనా బోర్లు మీద బోర్లు వేసి వ్యవసాయం చేస్తుంటారు. వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల బోర్లు ఎండిపోయి నీటి జాడ లేకుండా రైతులకు పంటరాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా నష్టాల ఊబిలో కూరుకుపోయి రైతులు దుర్భర జీవితాలను గడపలేక ఎలా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో తెలియజేయడమే ఈ నాపత్రోద్దేశం.

భారతదేశం లాగా ఆంధ్రరాష్ట్రం కూడా భిన్న వాతావరణ పరిస్థితులు కల్గిన ప్రాంతమని చెప్పవచ్చు. తూర్పు రాష్ట్రాలలో కృష్ణ, గోదావరి నదులు ప్రవహించడం వల్ల కోస్తాంధ్ర ప్రాంతాలు సశ్యశ్యామలమై పంటలు గొప్పగా పండుతున్నాయి. రాయలసీమ ప్రాంతం వర్షాధార ప్రాంతం కావడం చేత వర్షాకాలంలో ఏ కొద్ది ప్రాంతాలలో మాత్రం పంటలు పండిచగలరు. కానీ రాయలసీమ ప్రాంత ప్రజలు కూడా ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాయలసీమలో భాగమైన కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురిస్తేగానీ వ్యవసాయం చేయలేని పరిస్థితి. చిత్తూరుజిల్లాలో కొంత వరకు వర్షాలు మోస్తారుగా కురుస్తాయి. అలాగే పంటలు బాగానే పండుతున్నాయి. చిత్తూరుజిల్లాలో తూర్పు ప్రాంతంలో లభించినంత నీరు పడమర ప్రాంతాలలో లభించదు. అందువల్ల పడమర ప్రాంతాల వారు ఎక్కువగా బోర్లపై ఆధారపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో బోర్లపై బోర్లు వేసినా నీరు రాక జీవనాధారం లేక పరువు

నిలుపుకోలేక రైతులు అమాయకంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తద్వారా ఆయా కుటుంబాలు ధీనస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. అలాంటి విషాధ గాథలను, ఛిద్రమైన రైతు జీవితాలను ఎందరో రచయితలు తమ కథల్లో, నవలల్లో చిత్రిస్తూనే ఉన్నారు. అలాంటి రైతుల దుర్భరజీవితాలను చిత్రించిన నవలే 'నీరు నేల మనిషి'. ఈ నవలను సుప్రసిద్ధ చిత్తూరుజిల్లా రచయిత, జర్నలిస్టయిన సుంకోజి దేవేంద్రాచారి రచించారు. ఈ నవల 2005 సంవత్సరంలో 'తానా' వారి నిఉత్తమ నవలగా బహుమతి పొందింది. ఈ నవలలో చిత్తూరు జిల్లాలో పడమర మండలమైన కె.వి.పల్లి మండలంలోని రైతుల జీవనగాథను చిత్రించింది. ఈ నవలలో ప్రధాన నాయకుడు రామచంద్ర రైతు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ గొప్పగా, గౌరవంగా బ్రతికే కుటుంబం. తాతల కాలం నాడు ఆరు మాగాలు పండి ఆనందంగా గడిపిన రైతు కుటుంబం. అలాంటి రైతు కుటుంబం ప్రకృతి వికృత చేష్టలకు, కార్పోరేట్ మోసాలకు, ప్రపంచీకరణ దగాలకు చిక్కుకుని చివరకు అప్పులపాలై రామచంద్ర రైతు ఆత్మహత్యకు బలికావలసి వచ్చింది.

మానవ తప్పిదాలకు, ప్రకృతి ఆగ్రహానికి మధ్య నిత్యం నలిగిపోతూ వ్యవసాయాన్ని గౌరవంగా భావించే వాడు రైతు. అలాంటి రైతులలో రామచంద్ర రైతు కూడా ఒకడు. ఇతడు ఒక సన్నకారు రైతు. భూస్వాములు ఎంతటి నష్టాలైన భరించగలరు. కానీ సన్నకారు రైతులు కొంత నష్టాన్ని కూడా మోయలేరు. కానీ అట్లని వ్యవసాయాన్ని విడిచిపెట్టరు. ఆత్మగౌరవం కోసం అప్పుల పాలౌతారేగానీ వ్యవసాయాన్ని మాత్రం విడిచిపెట్టరు. అలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకుంటే సన్నకారు రైతులు ఇలా ఆత్మహత్యలు చేసుకోరు. వారి బతుకులు దుర్భరంగా తయారయ్యేవి కావు. రామచంద్ర భార్య రమణమ్మ కూడా శ్రమజీవే. వీరికి ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు విజయకు పెళ్ళి చేసాడు. కానీ ఇంతవరకు పెళ్ళి కోసం ఇస్తానన్న బంగారు చైను కొని పెట్టలేక పోతున్నాడు. కుమారుడు బాలకృష్ణ, ఇంకొక కుమార్తె శారదలకు పెళ్ళికాలేదు. కొన్ని సంవత్సరాలు వర్షాలు సరిగ్గాలేకపోవడం వల్ల కుమార్తె శారదకు 26 సంవత్సరాలైనా ఇంకా పెళ్ళి చేయలేకపోతున్నాడు. శారద స్నేహితురాళ్ళు పెండ్లయి ఇద్దరు ముగ్గరు బిడ్డలు కూడా కలిగి ఉన్నారు. కొడుకు బాలకృష్ణను చదివిస్తే సరిగ్గా చదువుకోకుండా తండ్రికి సహాయంగా ఉంటున్నాడు. కానీ బాధ్యత లేకుండా వ్యవహరించడం తండ్రి రామ చంద్రకు నచ్చేదికాదు. ఇలాంటి కుటుంబ పరిస్థితుల్లో రైతు రామచంద్ర పదిబోర్లు వేస్తే అన్నీ వృధా అయిపోయాయి. రెండెకరాల చేను అమ్మి అప్పులు తీర్చినా ఇంకా చాలా అప్పులే మిగిలున్నాయి. ఇలాంటి సంక్షోభంలో కూడా ఆత్మగౌరవం కోసం, జీవనాధారం కోసం రామచంద్ర మరొక బోరు వెయ్యక తప్పలేదు. ఇప్పటికీ రెండు లక్షలకుపైగా అప్పుల ఊబిలో కూరుకు పోయిన రామచంద్ర మరాలా అప్పుచేసి ఒక బోరు వేసాడు. మొదట్లో ఆ బోరులో నీరు బాగానే వచ్చినా మరలా ఆ బోరు కూడా నీరురాక, వర్షాలు సరిగ్గా లేక వ్యవసాయం కుంటుపడింది. వేసిన పంటలు నీరులేక ఎండిపోతుంటే రామచంద్ర దీనిని చూసి తట్టుకోలేక పోయాడు.

మన దేశంలో ఫ్యాక్టరీలు పెట్టడానికి ప్రభుత్వాలు ఎన్నో రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తాయి. కానీ రైతులకు అలాంటి రాయితీలు, ప్రోత్సాహకాలు తక్కువనే చెప్పవచ్చు. ఈ దేశంలో ఏ చిన్నరైతు అప్పుల్లేకుండా లేదు. అప్పుచేయకుండా విత్తనం నాటే పరిస్థితి లేదు. మంచి పంటలు పండించండి. ఫలానా పంటకు తగిన పెట్టుబడి ఇస్తామని ఏ ప్రభుత్వం చెప్పదు. ఫలానా ఫ్యాక్టరీ పెట్టండి. సోపుల తయారు చేయండి. సిమెంటు రాళ్ళు తయారు చేయండని వారిని ప్రోత్సహిస్తూ లక్షల రూపాయిల లోనుల ద్వారా ప్రభుత్వం సహాయ మందిస్తోంది. కానీ దేశానికి తిండిపెట్టే రైతులకు కంటితుడుపుగా సబ్సిడీలు ఇస్తున్నాయి. సరైన విత్తనాల కోసం రైతులు రోడ్లపై ధర్నాకు దిగితే వారిని అరెస్టులు చేస్తున్నాయి. బడాబడానాయకులు కోట్లల్లో అప్పులు చెల్లించలేక దేశం వదిలి పారిపోతుంటే వారి నుండి

చిల్లిగవ్వకూడా తిరిగిపొందలేక పోతున్నాయి. ఏ యాభైవేలో, లక్షో అప్పులు తీసుకున్న రైతుల నుండి వడ్డీతో సహా ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి మన ప్రభుత్వాలు. ఆత్మగౌరవం కోసం అప్పులుపాలైన రైతులు పురుగుల మందుల తాగి ఆత్మహత్య చేసుకుంటున్నారు. అప్పులు చేసి బోర్లేసినా సరైన నీరులేక పంటలెండి పోవడంతో రామచంద్ర పడిన ఆవేదనను అతని మాటల్లోనేవిందాం.

"ఎందురు సేద్దిం చేస్తాండారు?
సేద్దిం చేసేవోడు ఎవుడు బాగుపడతాండాడు?
సేద్దిగాన్ని నమ్ముకున్నోళ్ళు మాత్రం ఎందురు బాగుపన్నేరు?
ఎంతెంతో అప్పులైపోతాండారు...?
సమచ్చర సమచ్చరానికీ ఈ అప్పు పెరగతాందేగానీ తరగతాందా...?
సేద్దిం చేయకుంటేనేం?
తాతల కాలంనింటీ సేద్దిమే గదా చేస్తాండేది..
సేద్దిం చేయకపోతే ఇంగేం చేస్తాం...?
ఇప్పుడు అప్పులెట్ల తీర్చేది.... బిడ్డల పెండ్లిండ్లు ఎట్ల చేసేది"

వ్యవసాయం చేద్దామని అప్పులు చేసి మరీ బోర్లు వేసి పంటలు పండించినా ఒక్కొక్కసారి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నాశనమయ్యేవి. దాంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. పంటలు చేతికొచ్చే సమయానికి వడగళ్ళవానకు పంటలు నాశనమైతే ఆ ఆవేదన రైతులను ఎలాక్రుంగదీస్తుందో రైతు రామచంద్ర పడే అవస్థను పరిశీలిద్దాం.

"గులకరాళ్ల మాదిరిగా వడగండ్లు పడతాండాయి.
టమేటా చెట్లలోంచి పూతలు, పిందెలు నేల రాల తాండాయి.
పిందెలు, వడగండ్లు.... ముందూ ఎనకగా పడతాండాయి.
వడగండ్లు కరిగిపోతాండాయి... టమేటాలు దీనంగా చూస్తాండాయి.
చిన్నచిన్న రెమ్మలు గూడా విరిగిపోతాండాయి.
రామచంద్రకు భయమేసింది. బాధేసింది. దిగులేసింది.
.......................................................
అప్పుల మీద అప్పులయితాండాయి.
ఒక పంటా చేతికి రాదు.
బేంకులోల్లు జప్తుకు వస్తామంటాండారు.
ఎట్ల బతికేది?
ఎట్ల బిడ్డలను ఒగింటోళ్లను చేసేది?
ఎట్ల అప్పులు తీర్చేది! దిగులయిపాయ రామచంద్రకు మబ్బులే కాదు.. ఆయన గుండెగూడా పగిలినట్టుండాది
కండ్లనింటి నీళ్ళుధారగా కారతాండాయి."

దుక్కిదున్ని, నారుపోసి, పంటను చక్కగా పండించి పంట చేతికి వచ్చే సమయానికి వడగండ్ల వానలు పంటలు నాశనం చేస్తే ఆ పంటనే నమ్ముకున్న రైతుల కుటుంబాలు ఎంతటి సంక్షోభానికి, వ్యధకు గురౌతుందో చక్కగా చిత్రించడం జరిగింది.

ఇలా రైతులు ప్రకృతిలో పోరాడుతూ రెక్కలను ముక్క లను చేసుకుని వ్యవసాయం చేస్తుంటే రైతులు బోర్లు వేయాలన్నా అధికారులకు తగిన లంచం ఇవ్వకపోతే బోర్లు వేసుకోనివ్వరు. ప్రభుత్వం పెట్టిన "వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్" (వాల్టా) చట్టాన్ని అధికారులు స్వయం లాభాలకోసం రైతులను మానసికంగా హింసిస్తూ వారి నుండి లంచాలు తీసుకుంటే రైతులు అప్పుల కాకుండా ఎలా ఉంటారు. ఇలా ప్రకృతి ఒకవైపు, ప్రభుత్వాధికారులు, అప్పులవాళ్ళు రైతుల జీవితాలతో జూదమాడుతున్నారు. అలాగే ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలకొకసారి మారుతున్నా రైతుల జీవితాలకు మాత్రం కష్టాల నుండి గట్టెక్కించలేకపోతున్నాయి. ఫ్యాక్టరీ లకు ఇరవైనాలుగు గంటలు కరంటునిచ్చే ప్రభుత్వాలు రైతులకు మాత్రం రోజుకు ఎనిమిది గంటలో, పది గంటలు మాత్రమే ఇస్తోంది. అదీ కూడా ఏ అర్ధరాత్రికో, అపరాత్రివేళకో కరంటు ఇవ్వడంతో రైతులు విష జంతువులకో, కరంటుతీగలకో బలైపోతున్నారని ఈ నవలలో రచయిత తెలియజేసారు.

రైతు రామచంద్ర పదకొండు బోర్లు వేయించాడు. పదిబోర్లు పూర్తిగా ఎండిపోయాయి. ఇన్ని బోర్లు వేసినా రామచంద్ర రైతుకు మిగిలింది అప్పులే. ఆ చేసిన అప్పులను తలచుకుంటూ రోజు మానసిక వ్యథతో బాధపడుతున్నాడు. బతకడానికి మార్గం లేక తల్లడిల్లి పోతున్నాడు. ఎదిగొచ్చినా పిల్లలకు ఎలా పెండ్లి చేయాలో అర్థం కాకుండా అంధకారంలో కుంగిపోతున్నాడు. రైతుల ఆత్మహత్యలను ఆపడానికి ప్రభుత్వం రైతులకు భరోసా చెబుతూ బ్యాంకులకు ఆదేశాలిచ్చాయి. అప్పిచ్చిన వడ్డీ వ్యాపారులకు రైతులను అప్పుపేరుతో వేధిస్తే జైలుకెళ్తారని శాసనం చేసింది. కానీ రైతులు బ్రతుకు తెరువు లేక అప్పుల బాధతో మదనపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో రైతు రామచంద్రయ్యకు తన కుటుంబాన్ని గట్టెక్కించడానికి అమాయకంగా, అజ్ఞానంతో ఇలా ఆలోచిస్తున్నాడు.

"నీళ్ళు.....నీళ్ళు.....నీళ్ళు....ఎట్ల చెయ్యాల...?
బోరు....బోరు...బోరు ఎట్లెయ్యాల.....?
దుడ్డు.....దుడ్డు.....దుడ్డు....యాడ తేవాల.?
దుడ్డులేకుంటే....బోరేయకుంటే....నీళ్ళులేకుంటే...
పంటరాకుంటే..
పాణం తీసుకోవాల్సిందేనా... అంతేనా
ఇంగేం చేయాల....అప్పులోల్లకు ఏం చెప్పాల...
బిడ్డలకు పెండ్లిండ్లు ఎట్ల చెయ్యాల..... ఏం చెయ్యాల
పాణం తీసుకోవాల్సిందేనా.... తీసుకుంటె...
గవర్మెంటు ఒగటిన్నర లక్షిస్తాదంట... ఇస్తే
ఇంగ ఒకటికాకుంటే రెండుబోర్లేసుకుంటారు
ఒకదాంట్లో పడకపోయినా ఇంగోదాంట్లో నీళు ౣపడతాయి
ఇంట్లో అంతా సుఖంగా బతుక్కుంటారు.
నేను చస్తేనేం....నా వాళ్లంతా సుఖంగా ఉంటే చాలు...
అంతా సుఖంగా ఉంటారా... ఉంటారు... ఎందు కుండరు...
నీళ్లుంటాయి.....పంటలుంటాయి.....దుడ్డుంటాది.
బిడ్డలకు పెండ్లిండ్లయితాయి..... పిల్లాపాపలయితారు.
నాక్కావలసింది వోళ్లు పచ్చగా ఉండేదీ.
బతికుండి....పంటల్లేక...
దిగులుపడి...ఎండిపోయి
తినీతినక...గోర్చిగోర్చి...గుటుక్కుమనే దానికన్నా
ఇప్పుడే సస్తే....ఇంట్లో అంతా బాగుపడతారు...
అంతా బాగుడపతారు..
ఒక్కన్ని చస్తే చాలు..
కుటుంబమంతా బాగుపడతాది
ఒక్కన్ని చస్తే చాలు...."

ఇలా రైతు రామచంద్ర అజ్ఞానంతో, అమాయకంతో కుటుంబం సంతోషంగా ఉండాలని బెల్లంతో చేసిన ముష్టి చెక్క ముద్ద తిని ఆత్మహత్య చేసుకోవాలని సిద్ధమౌతారు. గతాన్ని, కుటుంబాన్ని తల్చుకుని ముష్టి చెక్క తినక ముందే గుండె పగిలి మరణిస్తాడు. అధికారులు మొదట్లో ఆత్మహత్యేనని భావించి రామచంద్ర కుటుంబానికి లక్షన్నర ఇవ్వడానికి అర్జీ పెట్టుకోమంటారు. కానీ తీరా గుండెనొప్పని తెలుసుకుని రామచంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం అందివ్వదు. చేసేది లేక రామచంద్ర కొడుకు బాలకృష్ణ మరలా అప్పులు చేసి బోరువేసి వ్యవసాయం చేస్తాడు. అదికూడా కలిసి రాకపోవడంతో ఒక లక్షరూపాయలు అప్పు తీసుకుని కువైట్‌కు ఉద్యోగం కోసం వెళుతాడు. కానీ మధ్య ఉన్న ఏజెంట్లు మోసం చేసి విహారయాత్రకు సంబంధించిన వీసా ఇవ్వడంతో రైతు రామచంద్ర కొడుకు బాలకృష్ణ కువైట్‌లో సరైన ఉపాధిలేక నరకం అనుభవిస్తూ ఏదో ఒక ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించి ఇండియా వస్తానని తన కుటుంబా నికి భరోసా ఇస్తాడు. చేసేది లేక రామచంద్ర భార్య ఒకవైపు తన భర్తను, మరోవైపు తన కొడుకును తల్చుకుని మూర్ఛపోతుంది. అమాయకపు ఆలోచనలు కల్గిన రైతులు తమ ప్రాణాలను కోల్పోయి తమ కుటుంబాలను ఎంతటి దారిద్ర్యానికి నెట్టేస్తున్నారో ఈ 'నీరు నేల మనిషి' నవల చక్కగా చిత్రించిందని చెప్పవచ్చు.

ఈ నవలలోని పాత్రలు కల్పితం కావచ్చు. రైతు మరణాలు వాస్తవం. అలాగే ఈ నవలల్లో కె.వి.పల్లి మండలంతోపాటు చిత్తూరు జిల్లాలోని నగరి, పీలేరు,

మదనపల్లె, కుప్పంలాంటి ఇతర మండలాల్లోని రైతు జీవితాలను హృదయవిదారకంగా చిత్రించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**


1. 'నీరు నేల మనిషి' నవల - దేవేంద్రాచారి, సుంకోజి.
2. 'చిత్తూరు కథ' సంకలనం - బాలసుబ్రహ్మణ్యం, పేరూరు. (సం.)
3. 'రైతు కథలు' సంకలనం - నాగరాజు సాకం. (సం.)


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# రెసిడెన్సీ నవలలో నగర జీవన వైవిధ్యం - చారిత్రక - సాంస్కృతిక విశ్లేషణ

- డా॥. ఇడికోజు శ్రీనివాసాచారి
తెలుగు అధ్యాపకులు, హైదరాబాద్.

**సారాంశం :**

చారిత్రక నవలలు ఒక యుగపు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వాస్తవాలను సాహిత్యరూపంలో నిలబెట్టే ప్రధాన ప్రక్రియ. ముదిగొండ శివప్రసాద్ రచించిన రెసిడెన్సీ నవల హైదరాబాద్ నగర చరిత్రను, నిజాం పాలనా వ్యవస్థను, బ్రిటిష్ వలసవాద ప్రభావాన్ని, అంతర్మత ప్రేమ సంబంధాలను, నగర జీవన వైవిధ్యాన్ని సమగ్రంగా చిత్రించిన చారిత్రక కృతి. ఈ వ్యాసం రెసిడెన్సీ నవలలో ప్రతిఫలించిన నగర జీవనం, భాషా పరిస్థితులు, మతసామరస్యం, కళాజీవితం, ఆహార సంస్కృతి, వైద్య విధానాలు, వలసల ప్రభావం వంటి అంశాలను విశ్లేషిస్తుంది.

**కీలక పదాలు :**

రెసిడెన్సీ, హైదరాబాద్ చరిత్ర, నిజాం రాజ్యం, నగర జీవనం, చారిత్రక నవల, అంతర్మత వివాహం

చారిత్రక నవల అనేది కేవలం గతాన్ని పునర్నిర్మించే సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు; అది ఒక కాలపు జీవన తత్త్వాన్ని, సంస్కృతి స్వరూపాన్ని, మానవ సంబంధాల అంతర్ముఖ ప్రపంచాన్ని పునరావిష్కరించే సాధనం. ఈ దృష్టిలో ముదిగొండ శివప్రసాద్ రచించిన రెసిడెన్సీ నవల ఒక విశిష్టమైన చారిత్రక-సాంస్కృతిక గ్రంథంగా నిలుస్తుంది. హైదరాబాద్ నగర చరిత్రను ఒక ప్రేమకథ అల్లికలో నేసి, ఆ కాలపు సామాజిక నిర్మాణాన్ని జీవంగా చూపించిన అరుదైన తెలుగు చారిత్రక నవలగా ఇది గుర్తింపు పొందింది. రచయిత నగరాన్ని కేవలం స్థలంగా కాకుండా ఒక జీవచరిత్రగా, ఒక సంస్క తి ప్రవాహంగా, ఒక మానవ సంబంధాల వలయంగా ఆవిష్కరించారు.

“నదీతీరాల్లో సంస్కృతులు వికసించాయి. నగరాలు నది పరివాహక ప్రాంతాల్లో అనాదిగా నిర్మించారు” (శివప్రసాద్ ముదిగొండ-రెసిడెన్సీ పుట 189) అనే వ్యాఖ్య నగర నాగరికతల ఉద్భవానికి సంబంధించిన సామాజిక చారిత్రక అవగాహనను ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ నగర నిర్మాణంలో మూసీనది పాత్ర, దాని పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి చెందిన జీవన విధానం, ఆర్థిక కార్య కలాపాలు, వాణిజ్య సంబంధాలు అన్నీ కలిసి ఒక బహుళ సాంస్కృతిక నగర నాగరికతకు పునాది వేశాయి. రెసిడెన్సీ నవల ఈ నగర స్వరూపాన్ని చారిత్రక దృశ్యరూపాలుగా పాఠకుని ముందుంచుతుంది.

ఈ నవల నేపథ్యం ఈస్ట్ ఇండియా కంపెనీ భారత దేశంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని విస్తరించుకుంటున్న కాలానికి చెందింది. వ్యాపార సంబంధాల పేరుతో భారతదేశంలోకి ప్రవేశించిన బ్రిటిష్ శక్తులు క్రమంగా

స్థానిక రాజ్యాల రాజకీయాల్లో జోక్యం చేసుకొని పరిపాలన వ్యవస్థలపై ప్రభావం చూపడం ప్రారంభించాయి. స్వదేశీ రాజుల అంతర్గత బలహీనతలు, వారసత్వ వివాదాలు, ఆర్థిక ఇబ్బందులు బ్రిటిష్ వ్యూహాలకు అనుకూలంగా మారాయి. ఈ క్రమంలోనే 'రెసిడెంట్' వ్యవస్థ ప్రవేశించింది. రెసిడెంట్ అనేది రాజసభలో ఉన్న విదేశీ ప్రతినిధి మాత్రమే కాదు; అతడు పరోక్ష రాజకీయ నియంత్రణకు ప్రతీక. స్థానిక రాజ్యాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారాన్ని కలిగి ఉన్నాడు. బెంగాల్ గవర్నర్‌కు జవాబుదారిగా ఉండే ఈ రెసిడెంట్లు బ్రిటిష్ వలస వ్యూహంలో కీలక పాత్ర పోషించారు.

ఈ నేపథ్యంలో గోల్కొండ రాజ్యానికి రెసిడెంట్‌గా వచ్చిన జేమ్స్ అకిలెస్ కర్క్‌పాట్రిక్ నవల కథానాయకుడిగా రూపుదిద్దుకున్నాడు. అతని వ్యక్తిత్వం సాధారణ వలసాధికారిలా కఠిన రాజకీయ ధోరణితో మాత్రమే కాకుండా సాహిత్యాభిరుచి, సౌందర్యారాధన, సంస్కృతి గ్రాహకత్వం కలిగిన వ్యక్తిగా కనిపిస్తుంది. అతడు ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఆశువుగా కవిత్వం చెప్పగలడని రచయిత పేర్కొంటారు (శివప్రసాద్ ముదిగొండ -రెసిడెన్సీ పుట 59). ఈ లక్షణం అతనిని ఇతర వలసాధికారుల నుంచి భిన్నుడిగా నిలబెడుతుంది. ఒకవైపు బ్రిటిష్ సామ్రాజ్యానికి ప్రతినిధి, మరోవైపు భారతీయ సంస్కృతిపై మక్కువ కలిగిన వ్యక్తి అనే ద్వంద్వ స్వభావం అతని పాత్రలో కనిపిస్తుంది. ఈ ద్వంద్వత్వం వలసవాద చరిత్రలో తరచుగా కనిపించే మానసిక విభేదాలకు ప్రతీక.

ఖైరున్నిసా పాత్ర నవలలో మహిళా భావజీవితానికి ప్రతినిధిగా నిలుస్తుంది. పర్షియన్ వలస కుటుంబానికి చెందిన ఆమె తండ్రి మహమ్మద్ అలీఖాన్ నిజాం ఆయుధగారానికి రక్షణాధికారి కాగా, తల్లి షర్ఫున్నిసా సంప్రదాయ కుటుంబ విలువలను పాటించే మహిళ (శివప్రసాద్ ముదిగొండ -రెసిడెన్సీ పుట 89). ఈ నేపథ్యం ఖైరున్నిసా జీవితాన్ని పరిమితుల గోడల మధ్య ఉంచుతుంది. అయినప్పటికీ ముషాయిరా సభలో కవిత్వం ద్వారా ప్రారంభమైన పరిచయం ప్రేమగా మారడం, ప్రేమను కాపాడుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు మహిళా స్వాతంత్ర్య చైతన్యానికి సంకేతాలుగా కనిపిస్తాయి. కుటుంబ గౌరవం, మత పరిమితులు, సామాజిక నియమాలు అన్నింటిని దాటి ప్రేమను స్వీకరించడం ఆమె వ్యక్తిత్వ దృఢత్వాన్ని తెలియజేస్తుంది.

ముషాయిరా సభ నవలలో సాంస్కృతిక వేదికగా నిలుస్తుంది. కవిత్వం ద్వారా పరిచయం ఏర్పడటం అనేది ఉర్దూ-పర్షియన్ సాహిత్య సంప్రదాయాల ప్రభావాన్ని సూచిస్తుంది. కవిత్వం ప్రేమకు దారితీయడం అనేది మధ్యయుగ దర్బార్ సంస్కృతిలో తరచుగా కనిపించే అంశం. ఈ సందర్భంలో కవిత్వం కేవలం కళ కాదు; భావ వ్యక్తీకరణ సాధనం, సంభాషణా మాధ్యమం, హృదయాల కలయికకు వంతెన. ఈ ప్రేమ సంబంధం తరువాత రాజకీయ పరిణామాలకు దారితీయడం ద్వారా రచయిత వ్యక్తిగత భావోద్వేగాలు కూడా చరిత్రలో భాగమవుతాయని సూచిస్తారు.

కర్క్‌పాట్రిక్ మతమార్పిడి, 'హష్మత్ జంగ్ బహదూర్' అనే పేరు స్వీకరించడం, ముస్లిం ఆచారం ప్రకారం వివాహం జరగడం, తరువాత క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఉంగరాల మార్పిడి జరగడం వంటి సంఘటనలు ఆ కాలపు మతసామరస్య రాజకీయాలను తెలియజేస్తాయి. నిజాం పాలకుడు ఈ వివాహానికి అనుమతి ఇవ్వడం రాజకీయ వ్యూహంగా కూడా భావించవచ్చు. బ్రిటిష్ ప్రతినిధిని తన ప్రభావ పరిధిలో ఉంచేందుకు ఇది ఒక సాంస్కృతిక-రాజకీయ ప్రయత్నంగా చూడవచ్చు. ప్రేమ వ్యక్తిగతమైనదైన దాని ప్రభావం రాజకీయంగా విస్తరించగలదని ఈ సంఘటనలు తెలియజేస్తాయి.

హైదరాబాద్ నగర చిత్రణ ఈ నవలలో అత్యంత ప్రాముఖ్యమైన అంశం. మూసీనది పరివాహక ప్రాంతం, గోల్కొండ కోట చారిత్రక వైభవం, లష్కర్ ప్రాంతంలోని సైనిక కేంద్రీకరణ, బేగంబజార్ వ్యాపార వాతావరణం, కార్వాన్ ప్రాంతంలోని పర్షియన్ వలసదారుల నివాసాలు నగరాన్ని బహుళసాంస్కృతిక స్థలంగా నిలబెడతాయి (శివప్రసాద్ ముదిగొండ - రెసిడెన్సీ పుట 154). నగరం అనేది కేవలం భౌతిక నిర్మాణం కాదు; అది వలసలతో,

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

వాణిజ్యంతో, మతాచారాలతో, భాషలతో రూపుదిద్దుకునే జీవ సమూహం. రెసిడెన్సీ నవల ఈ జీవన వైవిధ్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

నిజాం రాజ్యంలో భాషా పరిస్థితులు భాషా రాజకీయాల స్పష్టమైన ఉదాహరణ. ఉర్దూ అధికార భాషగా ఉండగా, పర్షియన్ పరిపాలనా భాషగా ప్రాముఖ్యం పొందింది. తెలుగు జనాభా అధికమైనప్పటికీ పరిపాలనా స్థాయిలో తెలుగు ప్రాధాన్యం తగ్గింది. అయినప్పటికీ తెలుగు భాష మాధుర్యాన్ని గుర్తించి దాన్ని సంగీతానుకూల భాషగా పేర్కొన్నారు (శివప్రసాద్ ముదిగొండ - రెసిడెన్సీ పుట 169). ఇది భాషా గౌరవం మరియు రాజకీయ ప్రాధాన్యం రెండూ వేర్వేరు విషయాలని సూచిస్తుంది.

నగర జీవన విధానంలో కళాకారుల పాత్ర విశేషం. బుర్రకథలు, ఒగ్గుకథలు, భాగమతి కథా ప్రదర్శనలు, సంగీత గోష్టులు నగర సంస్కృతిని సజీవంగా ఉంచాయి. కళాకారులు వలసలు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా నగరం ఒక సాంస్కృతిక కూడలిగా మారింది. సంస్కృతి అనేది అధికారంతో మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో జీవిస్తుంది అనే భావన ఇక్కడ స్పష్టమవుతుంది.

నగర జీవన చిత్రణను మరింత లోతుగా పరిశీలించినప్పుడు రెసిడెన్సీ నవలలో కనిపించే సామాజిక వర్ణచిత్రం ఒక సమగ్ర నగర సమాజ శాస్త్ర గ్రంథంలా అనిపిస్తుంది. హైదరాబాద్ నగరం కేవలం రాజనీతి కేంద్రం మాత్రమే కాదు; వలసలు, వాణిజ్యం, మతాచారాలు, కళలు, భాషలు పరస్పరం కలిసిన ఒక సజీవ నాగరికత. ఈ నాగరికతలో అంచులపై కనిపించే వర్గాల జీవితం కూడా రచయిత దృష్టిని అకర్షించింది. అందులో ముఖ్యంగా ప్యారీల (కొజ్జాల) జీవితం ఒక ప్రత్యేక సామాజిక కోణాన్ని అందిస్తుంది. హైదరాబాదులో ప్యారీలు రాణివాసాల కాపలాదారులుగా నియమించబడటం, వారికి ఉర్దూ, తెలుగు, పార్సీ భాషల పరిజ్ఞానం ఉండటం, వారి సామాజిక స్థానం ప్రత్యేక వర్గంగా ఉండటం నగర నిర్మాణంలోని లింగ-సామాజిక వైవిధ్యాన్ని తెలియజేస్తుంది. ఈ వర్గం సాధారణ సమాజ నిర్మాణంలో పక్కకు నెట్టబడినా రాజభవన వ్యవస్థలో కీలక పాత్ర పోషించడం గమనార్హం. రెసిడెన్సీ నవలలో ప్యారీ పాత్ర కేవలం ఉప పాత్ర కాదు; అది నగర సామాజిక నిర్మాణంలో విభిన్నతకు ప్రతీక.

నగర సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే ఆహార సంస్కృతిని పరిశీలించడం అత్యంత అవసరం. నాగన్న తోట వంటి అతిథి గృహాలు నగర ఆతిథ్య సంప్రదాయానికి చిహ్నాలుగా నిలుస్తాయి. అక్కడ వడ్డించే ఆహార పదార్థాల జాబితా నే హైదరాబాద్ సంస్కృతుల సంగమాన్ని తెలియజేస్తుంది. అన్నం, రొట్టె, బ్రెడ్, పచ్చికూరలు, ఆవకాయ, దక్షిణాది సాంబారు, గోల్కొండ కుర్బానీకా మీఠా, ఉత్తరాది కచోరి, అప్పడాలు, గారెలు వంటి వంటకాలు ఒకే వేదికపై కనిపించడం ఆహారంలో సంస్కృతుల కలయికకు ఉదాహరణ. మట్టి పాత్రల వినియోగం, తగిన వెంటనే వాటిని పగలగొట్టడం పరిశుభ్రతతో పాటు ఆచారపరమైన విశ్వాసాన్ని సూచిస్తుంది (శివప్రసాద్ ముదిగొండ -రెసిడెన్సీ పుట 174). ఆహారం ఇక్కడ జీవనావసరం మాత్రమే కాదు; అది సంస్కృతి, ఆతిథ్యం, సామాజిక గౌరవానికి ప్రతీక.

నగర వైద్య వ్యవస్థ కూడా నవలలో ప్రస్తావనకు వచ్చింది. ప్రజలు అనారోగ్య సమయంలో ఆయుర్వేదం, యునాని వైద్యాలపై ఆధారపడటం ఆ కాలపు వైద్య సంస్కృతిని తెలియజేస్తుంది (శివప్రసాద్ ముదిగొండ - రెసిడెన్సీ పుట 176). పాశ్చాత్య వైద్యం ఇంకా బలంగా స్థిరపడని కాలంలో స్థానిక వైద్య సంప్రదాయాలు ప్రజల విశ్వాసాన్ని పొందినట్టు తెలుస్తుంది. ఇది జ్ఞాన వ్యవస్థల స్థానికతను తెలియజేసే అంశం. నగరాల్లో కూడా సంప్రదాయ వైద్య పద్ధతులు ప్రాధాన్యాన్ని కోల్పోలేదని ఈ వివరాలు సూచిస్తాయి.

రెసిడెన్సీ నవలలో కనిపించే మరో ముఖ్యమైన సామాజిక వాస్తవికత రాయలసీమ కరువు వర్ణన. ఇది నగర-గ్రామ సంబంధాలను అర్థం చేసుకోవడానికి కీలకం. దత్త మండలాలుగా పిలువబడే రాయలసీమలో వచ్చిన భయంకర కరువు ప్రజల జీవనాన్ని అతలాకుతలం

చేసింది. ఆహార ధాన్యాల కొరత, సరఫరా వ్యవస్థల లోపం, చేతివృత్తుల నాశనం, మగ్గాల మూగబాటు, పద్మశాలీల దుస్థితి. ఈ పరిస్థితులన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దారుణంగా క్షీణించిందని సూచిస్తున్నాయి. ఆకలి తాళలేక వలసలు, వెట్టి చాకిరి, దొంగతనాలు పెరగడం నగర జనాభా నిర్మాణాన్ని ప్రభావితం చేశాయి (శివప్రసాద్ ముదిగొండ - రెసిడెన్సీ పుట 185). నగరాలు వలసల వల్ల పెరుగుతాయని సామాజిక శాస్త్ర సిద్ధాంతాలు చెబుతాయి; రెసిడెన్సీ నవల దానికి సాహిత్య ఆధారాన్ని అందిస్తుంది.

మతాచారాల వివరణ నగర ఆధ్యాత్మిక వాతావరణాన్ని తెలియజేస్తుంది. ఓరుగల్లు ప్రాంతంలో అగ్నికుండాలపై నడక, వీరశైవ ఆచారాలు, కత్తులు పట్టుకొని చేసే భక్తి కార్యక్రమాలు ప్రజల విశ్వాస ప్రపంచాన్ని ప్రతిబింబిస్తాయి. కలకత్తా నుంచి వచ్చిన గూఢచారి జాన్ మాల్కం వీటిని యుద్ధనాకి సన్నాహాలుగా అనుమానించడం సంస్క తి అవగాహనలోని విదేశీ దృష్టికోణాన్ని తెలియజేస్తుంది (శివప్రసాద్ ముదిగొండ - రెసిడెన్సీ పుట 177). ఒక సంస్కృతిలో పవిత్రమైనది మరొక ద ష్టిలో అనుమానాస్పదంగా కనిపించవచ్చని ఇది సూచిస్తుంది.

నగర జీవన విధానంలో జ్యోతిష్కులు, సంఖ్యా శాస్త్రజ్ఞులు, సన్యాసులు, చిలక జ్యోష్యం చెప్పేవారు, గణాచారులు వంటి వర్గాల ప్రస్తావన నగర ఆధ్యాత్మిక-అనుభూతి జీవనాన్ని తెలియజేస్తుంది. నగరం కేవలం భౌతిక అభివృద్ధి కేంద్రం మాత్రమే కాదు; అది విశ్వాసాల, భవిష్యత్ ఊహల, మానసిక ఆశ్రయాల కేంద్రం కూడా. ఈ వర్గాలు నగర ప్రజల మానసిక ప్రపంచానికి ఆధారంగా నిలిచాయి.

రెసిడెన్సీ భవనం స్వయంగా ఒక చారిత్రక చిహ్నం. అది ప్రేమకు గుర్తు మాత్రమే కాదు; వలస రా జకీయాల స్మారక చిహ్నం కూడా. ఒక బ్రిటిష్ అధికారి తన ప్రేమ కోసం నిర్మించిన భవనం, అదే సమయంలో బ్రిటిష్ రాజకీయ ప్రభావానికి ప్రతీక కావడం చరిత్రలోని వ్యంగ్యాన్ని తెలియజేస్తుంది. వ్యక్తిగత భావోద్వేగాలు సామ్రాజ్య రాజకీయాల మధ్య ఎలా చిక్కుకుపోతాయో ఈ భవనం సూచిస్తుంది.

నవలలో కనిపించే మతసామరస్య ద క్కోణం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కర్క్‌పాట్రిక్-ఖైరున్నిసా వివాహం రెండు మతాల కలయికగా చిత్రించబడింది. ఇది కేవలం ప్రేమ విజయం కాదు; సామాజిక గోడల దాటడం. అయితే ఈ సంఘటన వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయని కూడా గ్రహించాలి. మతం, రాజనీతి, ప్రేమ పరస్పరం కలిసినప్పుడు వ్యక్తిగత నిర్ణయాలు సామాజిక చరిత్రలో భాగమవుతాయి.

భాషా వైవిధ్యం నగర సంస్క తికి మూలాధారం. ఉర్దూ అధికార భాష, పర్షియన్ పరిపాలనాభాష, తెలుగు ప్రజాభాషగా ఉండటం నగర బహుభాషా స్వరూపాన్ని తెలియజేస్తుంది. భాషలు కేవలం సంభాషణ సాధఎ లు కాదు; అవి అధికార నిర్మాణాలకు ప్రతీకలు. తెలుగు జనాభా అధికమైనప్పటికీ అధికార ప్రోత్సాహం లేకపోవడం భాషా రాజకీయాల ఉదాహరణ.

సాహిత్య పరంగా రెసిడెన్సీ నవల వర్ణాత్మక శైలితో ప్రత్యేకత సాధించింది. రచయిత కవితాత్మక భాషను ఉపయోగిస్తూ చారిత్రక సమాచారాన్ని కథలో మేళవించారు. దృశ్య వర్ణనలు పాఠకునికి కాలయానం చేసిన అనుభూతిని కలిగిస్తాయి. చరిత్రను కథగా, కథను సంస్కృతి అధ్యయనంగా మలచిన అరుదైన రచనగా ఇది నిలుస్తుంది.

నగర అధ్యయనాల దృష్టిలో ఈ నవల విలువైన పాఠ్యంగా నిలుస్తుంది. నగరాలు ఎలా అభివృద్ధి చెందుతాయి, వలసలు వాటిని ఎలా మార్చుతాయి, సంస్కృతుల కలయిక ఎలా కొత్త జీవన రూపాలను సృష్టిస్తుంది అన్నది ఈ నవల స్పష్టంగా తెలియజేస్తుంది. ప్రేమకథను కేంద్రంగా తీసుకొని ఒక యుగపు జీవన విధానాన్ని ప్రతిబింబించిన ఈ కృతి చారిత్రక సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందింది.

ఇక్కడ కనిపించే నగరం స్థిరంగా ఉండదు; అది మారుతూ ఉండే జీవ ప్రపంచం. వలసలు, మతాలు, భాషలు, రాజకీయాలు ఈ అంశాలన్నీ నగర రూపాన్ని

ఎప్పటికప్పుడు మార్చుతున్నాయి. అందుకే రెసిడెన్సీ నవల ఒక నగర చరిత్ర మాత్రమే కాదు; ఒక నగర తత్త్వశాస్త్రం.

నగర జీవన చిత్రణను విశ్లేషించే సందర్భంలో రెసిడెన్సీ నవలను వలసవాద విమర్శాత్మక దృష్టితో చూడటం అత్యంత అవసరం. ఎందుకంటే ఈ నవలలో వ్యక్తిగత ప్రేమ కథతో పాటు సామ్రాజ్యం రాజకీయాల నీడ సుదీర్ఘంగా విస్తరించి ఉంటుంది. ఈస్ట్ ఇండయా కంపెనీ భారతదేశంలో అమలు చేసిన సైన్య సహకార పద్ధతి, ఒప్పందాల రాజకీయాలు, స్థానిక పాలకులపై పరోక్ష నియంత్రణ వంటి అంశాలు నవల నేపథ్యాన్ని నిర్మిస్తాయి. నిజాం అలీ బెంగాల్ గవర్నర్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిపై తొలి సంతకం చేయడం ద్వారా బ్రిటిష్ ప్రభావానికి ద్వారాలు తెరుచుకున్నాయి. దాని ఫలితంగా రెసిడెంట్ వ్యవస్థ బలపడింది. ఈ రాజకీయ వాస్తవం కేవలం పరిపాలనా మార్పు కాదు; అది నగర సామాజిక నిర్మాణం పై కూడా ప్రభావం చూపింది. అధికార నిర్మాణాలు మారినప్పుడు భాషా ప్రాధాన్యాలు, ఆర్థిక మార్గాలు, సంస్కృతి సంబంధాలు కూడా మారుతాయని ఈ నవల సూచిస్తుంది.

వలసవాద అధ్యయనాల దృష్టిలో చూస్తే కర్క్‌పాట్రిక్ పాత్రలో ఒక ''సాంస్కృతిక మధ్యవర్తి'' స్వభావం కనిపిస్తుంది. అతడు బ్రిటిష్ అధికార ప్రతినిధి అయినప్పటికీ స్థానిక సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇది వలసవాదంలో కనిపించే ఒక ప్రత్యేక ధోరణి స్థానిక సంస్కృతిని గ్రహిస్తూ కూడా అధికార ఆధిపత్యాన్ని కొనసాగించడం. అతని మతమార్పిడి , స్థానిక దుస్తులు, స్థానిక ఆచారాల అనుసరణ ఇవన్నీ సంస్కృతి అనుసరణలా కనిపించినా రాజకీయంగా అది స్థానిక విశ్వాసాన్ని పొందేందుకు ఉపయోగపడే సాధనం కూడా కావచ్చు. ఈ ద్వంద్వత్వాన్ని నవల అంతర్ముఖంగా చూపిస్తుంది.

రెసిడెన్సీ నవలను సాంస్కృతిక అధ్యయనాల కోణంలో పరిశీలించినప్పుడు ఇది ఒక "సంస్కృతుల సంగమ పాత్యం"గా కనిపిస్తుంది. హైదరాబాద్ నగరం ఇక్కడ ఒక జీవ సాంస్కృతిక ప్రదేశంగా రూపుదిద్దుకుంటుంది. పర్షియన్ వలసదారులు, తెలుగు స్థానికులు, మరాఠీ, కన్నడ భాషా వర్గాలు, బ్రిటిష్ అధికారులు అందరు ఒకే నగర పరిధిలో సహజీవనం చేస్తున్నారు. ఈ సహజీవనం ఎల్లప్పుడూ సామరస్యంగా ఉండకపోయిన పరస్పర ప్రభావాన్ని కలిగిస్తుంది. నగర సంస్కృతి అనేది ఈ పరస్పర ప్రభావాల ఫలితమని నవల చూపిస్తుంది.

నగర సమాజ శాస్త్ర దృష్టిలో నగరం అనేది వలసల కేంద్రం. రాయలసీమ కరువు వంటి సంఘటనలు గ్రామీణ ప్రజలను నగరాలవైపు నెట్టాయి. వలస వచ్చిన ప్రజలు తమతో పాటు తమ వ స్తువులు, ఆచారాలు, భాషలు తీసుకువస్తారు. దాంతో నగర సంస్కృతి విస్తరిస్తుంది. నగరాన్ని ఒక తెరిచిన సంస్క తి వేదికగా చూడవచ్చని ఈ నవల సూచిస్తుంది.

సాహిత్య సిద్దాంత పరంగా చూస్తే రెసిడెన్సీ నవల చారిత్రక వాస్తవికత మరియు కవితాత్మక వర్ణనల సమ్మేళనం. రచయిత దృశ్య వర్ణనలో కవితాత్మకతను ఉపయోగించి పాఠకునికి కాలయానం అనుభూతిని కలిగిస్తారు. అదే సమయంలో చారిత్రక సమాచారాన్ని ఆధారాలతో మేళవించడం ద్వారా ప్రామాణికతను నిలబెట్టారు. చారిత్రక నవలల లక్షణంగా చెప్పే ''సత్యం-కల్పన సమన్వయం'' ఈ కృతిలో స్పష్టంగా కనిపిస్తుంది. కథా ప్రవాహంలో ప్రేమ ప్రధాన వాహక శక్తిగా ఉన్నప్పటికీ దాని చుట్టూ తిరిగే సామాజిక వాస్తవాలు నవలకు లోతు తీసుకొస్తాయి.

నవలలో మహిళా పాత్రల చిత్రణ కూడా విశ్లేషణకు పాత్రం. ఖైరున్నిసా పాత్రలో ప్రేమ మాత్రమే కాక స్వీయ నిర్ణయాధికారం కనిపిస్తుంది. కుటుంబ నిరాకరణను ఎదుర్కొని ప్రేమను కాపాడుకోవడం ఆమె వ్యక్తిత్వ దృఢత్వాన్ని తెలియజేస్తుంది. అదే సమయంలో ఆమె జీవితం సామాజిక నిర్మాణాల పరిమితుల్లోనే సాగుతుంది. ఇది ఆ కాలపు మహిళా స్థితిగతులను ప్రతిబింబిస్తుంది. మహిళా స్వేచ్ఛ మరియు సామాజిక నియంత్రణ మధ్య సంఘర్షణను ఈ పాత్ర ప్రతిబింబిస్తుంది.

మతసామరస్య దృక్కోణం ఈ నవలలో ప్రధానాంశం. ముస్లిం-క్రైస్తవ వివాహం చారిత్రక సందర్భంలో అరుదైనది. ఇది రెండు మతాల కలయికకు ప్రతీకగా చూపబడింది.

అయితే రచయిత దీన్ని ఆదర్శవాదంగా మాత్రమే చూపకుండా రాజకీయ నేపథ్యంతో అనుసంధానించారు. మతం అనేది వ్యక్తిగత విశ్వాసం మాత్రమే కాక అధికార నిర్మాణాల్లో కూడా పాత్ర పోషిస్తుందని ఈ సంఘటనలు తెలియజేస్తాయి.

రెసిడెన్సీ భవనం ఒక స్మృతి చిహ్నంగా నిలుస్తుంది. అది ప్రేమ స్మారక చిహ్నమా ? లేక వలసవాద ఉనికి గుర్తా ? ఈ ద్వంద్వార్థం నవలకు తత్త్వాత్మక లోతును ఇస్తుంది. ఒకే నిర్మాణం వ్యక్తిగత అనుభూతికి, సామ్రాజ్య చరిత్రకు ప్రతీక కావచ్చు. చరిత్రలో వస్తువులు కూడా భావోద్వేగాలను మోస్తాయని ఈ నవల సూచిస్తుంది.

నగర తత్త్వశాస్త్ర దృష్టిలో నగరం అనేది నిరంతర పరిణామ ప్రక్రియ. వలసలు, భాషలు, మతాలు, ఆర్థిక మార్పులు నగరాన్ని మారుస్తూ ఉంటాయి. రెసిడెన్సీ నవలలో కనిపించే హైదరాబాద్ అలాంటి పరిణామ నగరం. అది ఒకే సంస్కృతికి చెందలేదు; అనేక సంస్కృతుల సంతతిగా రూపుదిద్దుకుంది. అందుకే ఈ నవల నగరాన్ని స్థిర దృశ్యంగా కాక ప్రవాహంగా చూపిస్తుంది.

చారిత్రక సాహిత్యంలో రెసిడెన్సీ నవల స్థానం ప్రత్యేకం. ఇది కేవలం ప్రేమకథ కాదు; ఒక యుగపు సామాజిక సాంస్కృతిక దస్తావేజు. నగర జీవనాన్ని అంతర్భావంగా ప్రతిబింబించిన సాహిత్య కృతి. చరిత్రను మానవ సంబంధాల ద్వారా అర్థం చేసుకోవచ్చని ఇది చూపిస్తుంది. చరిత్ర అనేది రాజుల కథలు మాత్రమే కాదు; సాధారణ ప్రజల జీవన విధానాల సమాహారం అని ఈ నవల స్పష్టం చేస్తుంది.

మొత్తానికి రెసిడెన్సీ నవల నగర అధ్యయనాలకు, సాంస్కృతిక చరిత్ర పరిశోధనలకు, వలసవాద విమర్శలకు విలువైన ఆధారం. ప్రేమకథను కేంద్రంగా తీసుకొని ఒక నగర నాగరికతను సాహిత్య రూపంలో నిలబెట్టిన అరుదైన తెలుగు చారిత్రక నవలగా ఇది నిలుస్తుంది. సంస్కృతుల సంగమం నగరాలను ఎలా నిర్మిస్తుందో, వ్యక్తిగత అనుభూతులు చరిత్రలో ఎలా స్థానం సంపాదిస్తాయో ఈ కృతి బలంగా తెలియజేస్తుంది. నగర జీవితం అనేది అనేక స్వరాల సమ్మేళనం; ఆ స్వరాల ప్రతిధ్వని రెసిడెన్సీ నవలలో వినిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**


1. రెసిడెన్సి - ముదిగొండ శివ ప్రసాద్
2. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. తెలుగు నవల - శ్రీ అక్కిరాజు రమాపతిరావు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
4. తెలుగు నవలా సాహిత్య వికాసము - పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహిత్య అకాడమీ


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వెలి బతుకుల ఆర్తనాదం అర్ధనారి

- డా॥. పి. కుమారి నీరజ

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.

బండి నారాయణస్వామి అందరికీ పరిచితులే. 2017లో తానా బహుమతితో ప్రచురితమైన వీరి నవల 'అర్ధనారి' గూర్చి మాట్లాడుకుందాం. ఈ నవల పితృ స్వామ్య వ్యవస్థను ప్రశ్నించింది. ఇందులో రెండు అంశాల ప్రస్తావన ప్రధానం. ఒకటి మగశరీరంలో దాగున్న ఆడతనం - హిజ్రాల దైనందిన జీవితం, వారి వెలి బతుకులు, శరీరమే హాస్యాస్పదమైన వారి ఆవేదన, సృష్టి చేసిన మోసం, సమాజం చూపిన వివక్ష. రెండు భర్త లొదిలిన భార్యలపై కుటుంబ భారం, వేశ్యావృత్తి, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు, అవమానాలు, ఛీత్కారాలు, చీదరింపులు.

స్వామి రాసిన ఐదో నవల ఇది. విభిన్న ఇతివృత్తా లతో, సామాజిక స్పృహతో నవలలు రాయడం వీరు సామాజిక బాధ్యతను ఎలా నెత్తికెత్తుకున్నారో తెలుస్తుంది. ఈ నవలలో హిజ్రాల(ట్రాన్స్‌జెండర్‌ల) వాస్తవిక చిత్రణ ప్రధాన కథనం, దీంతోపాటు పడుపువృత్తిని గురించిన మరో కథనం కూడా కన్పిస్తుంది.

ట్రాన్స్‌జెండర్ ప్రపంచాన్ని చంద్రన్న అలియాస్ రమణి జీవితం ద్వారా నిర్మిస్తూ, పడుపువృత్తి వాస్తవికతను రామలక్ష్మి పాత్రద్వారా నిర్మిస్తారు రచయిత.

కుటుంబానికి, ఊరికి దూరమై, సమాజం గేలి చేసే వారిని ఒక మనిషిగా గుర్తించాలని, వారిని అపార్థం చేసుకోకూడదని ఈ నవల తెలియజేస్తుంది.

మనుషులు ఆడ మగగానే కాదు మరెన్నో రకాలుగా పుట్టడం అనాదిగా జరుగుతున్నది. కానీ వారిపట్ల వివక్ష, అణచివేత, దారుణాతి దారుణ మానవ హింస, సామాజిక వెలివేత... మానవ జాతికి హీనాతిహీనమైన పాపం. అట్లాంటి వారి గురించి రాయాలనిపించటమే స్వామి తాత్విక చింతనేమిటో తెలియజేస్తుంది.

చంద్రన్న (రమణి), రామలక్ష్మిల చుట్టూ తిరిగే ప్రధాన మైన కథ. చలపతి, ఆదిమూర్తి, చంద్రన్న తల్లిదండ్రులు, అక్క, బావ, రామలక్ష్మి భర్త, ఆమె తల్లిదండ్రులు, రఘునాథరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, నరసప్ప (రామలక్ష్మి తండ్రి), మణిమాల, రసూలమ్మ, పిట్ పిట్ భాష, తనూజ, సరోజ, రూప, పప్పుల జీవితాల చుట్టూ తిరుగుతూ మనమెప్పుడూ పట్టించుకోని, అసహ్యించు కునే, చీదరించుకునే జీవితాల్లోని బాధామయ సాగరంలో మనల్ని ముంచి ప్రక్షాలన చేస్తారు రచయిత. ఈ జీవితాలు మనకు తెలియనివి కావు. రోజూ చూస్తున్నవే, గమ నిస్తున్నవే... కానీ మనకేమీ పట్టనట్టు, అవీ ఒక జీవితాలేనా అన్నట్టు మనం చులకన భావంతో చూస్తున్న జీవితాలను గురించి ఆలోచించేటట్లు చేసిన నవల ఇది.

రెండు శరీరాలు, రెండు ఆత్మలుగా కలగలిసి పోవడం... వారు ఆడ మగ కావచ్చు... కాని వారూ కావచ్చు. ఆడ ఆడ, మగ మగ, ఆడ మగకాని వారూ కావచ్చు. ఆ శరీరాల మధ్య పొంచిఉండే వాస్తవాధీన స్పృహను పసిగట్టి... వర్ణించిన తీరు తిరుగులేనిది. అసభ్యత లేని శృంగారాన్ని చూపించారు రచయిత.

...మగ శరీరాలలో దాక్కున్న ఆడతనాలు గోడలు పగలగొడుతున్నాయి.

గీతలు చెరిపేస్తున్నాయి. ప్రవాహపు ఒడ్డుల్ని తెగ్గొడుతున్నాయి.

వారు గలాటా చేస్తున్నట్టు లేదు. దేనినో అపహసిస్తూ ఉన్నట్టున్నారు. దేన్ని? లోకాన్ని! సమాజాన్ని! పితృస్వామ్యంలో మగ కేంద్రాన్ని!

జీవిత యుద్ధంలో ఓడిపోయిన వాళ్ళు, కుటుంబానికీ, ఊరికీ వెలి అయిన వాళ్ళు, సమాజం గేలి చేసిన వాళ్ళు, శరీరమే పరిహాసాస్పదమైనవాళ్లు! మగ దుస్తులు కప్పుకున్నా, నడకలో ఆడతనం ఒలికి పోయేవాళ్ళు! ఆడతనాన్ని దాచుకునీ దాచుకునీ అలసిపోయినవాళ్ళు!

తల్లిదండ్రులు, తోబుట్టువుల దగ్గర ఒంటరితనం, కుటుంబంలో, సమాజంలో ఒంటరితనం. రాత్రికప్పుకున్న దుప్పటిలో కూడా ఒంటరితనపు భయం!.

సృష్టి మోసం చేసింది. సృష్టిలో ఆడ మగ, మరి వీరెవరు? ఆడ గౌరవం ఆడకు, మగ గౌరవం మగకు, మరి వీరికి అవమానాలు, చీదరింపులు, ఛీత్కారాలు, చిత్రవధలు, భగ్న హృదయాలు,ఛిద్ర వ్యధలు! అమ్మ పొమ్మంటుంది. నాన్న బృహన్నల నా కొడకా! అని తిడతాడు. ఊరు కాకై పొడుస్తుంది, సమాజం చూపుల శూలాలు విడుస్తుంది! ఎక్కడికెళ్ళాలి.

అనాకారి తనాన్నైనా భరిస్తుంది కానీ అర్ధనారీ ముఖాన తుపుక్కున ఊస్తుంది! ఒక భయం, ఒక భీతి, ఒక జుగుప్స. యేం పాపం చేసారని ఈ బతుకు? ఏం నేరం చేసినందుకు ఈ నరకం? ఈ రూపం ఎవరి శాపం? సృష్టిలో ఆడ అంటే ఆడ, మగ అంటే మగ... అదే గాడిలో నడవాల...

సృష్టే గాడి తప్పితే...నిసృష్టి గాడితప్పితే పర్వాలేదా లోకమా? సృష్టి గాడి తప్పినా విలువలు గాడి తప్పకూడదు. అంతేనా సమాజమా?? స్వీయ అస్థిత్వమే ప్రశ్నార్థకమైన వారికి సామాజక ధర్మాలు వర్తిస్తాయా?ు ఇలా నిలదీస్తారు స్వామి. అర్ధనారి! ఆడా మగా సృష్టి ధర్మం అని నమ్మేవాడి కోసం కాదిది! తన ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా, ఒక లోపంతో జన్మించిన మనుషుల వెలివేతల్ని నిలవరిస్తున్న ప్రశ్నార్థకమిది.

అర్ధనారి ఒక ఆధునిక ఎపిక్, నిషిద్ధ మానవుల ఎలిజీ, ఒక విషాద కావ్యం, ఎవరికీ అక్కర్లేని తృతీయ ప్రవృత్తి. మర్యాదస్తుల సమకాలీన నీతులకూ, కట్టుబాట్లకూ ఎదురెళ్లి, తమని ఛీకొడుతున్న సమాజాన్ని వెలివేసి బతికే నిషిద్ధ మానవలోకాన్ని పరిచయం చేయడమే దీని ఉద్దేశం!.

సినిమా టాకీస్ సందుల్లోనో, కొట్టాల కిందనో, బజారు దాపునో శరీరం వొంచి బేరాలు చూసుకునే వెరపు పుట్టించే లోకమిది! తాగుడూ, నోరు పట్టని బూతులూ, నోరంతా తెరుచుకుని తుపుక్కున వుమిసే తాంబూలాలూ, చేలాలూ, తాలీలూ, పురుషుడికీ పురుషుడికీ మధ్య సాగే అనైతిక, అశుద్ధ, ప్రకృతి విరుద్ధ కామ కేళి... అంతేనా! వారి జీవితానందం కూవగం కూతాండవర్ కోవెల ముందు ఆరావన్‌తో ఒక్కనాటి వైవాహిక వైభోగం! పెళ్లినాటి వారి నృత్య హేలాలా... అదొక బుద్బుదప్రాయపు మెరుపు... మర్నాడే వైధవ్యంపొందే క్షణభంగుర శాపగ్రస్త జీవితం!

భర్తచేతిలో మోసపోయిన రామలక్ష్మి... ముగ్గురు బిడ్డల తల్లి... కుటుంబ పోషణ, సమాజం వెర్రి చూపులు, వెక్కిరింతలు, ఉమ్మేయడాలు. కుటుంబంలో అన్నీ బాగున్న పతివ్రతలు గొప్ప. ధనిక స్త్రీ వ్యభిచార గృహం నడిపినా...గొప్పే!. కన్నేసిన కామాందులు..., బరితెగించిన వేటకుక్కలు...?, మోసం చేసే ముసల్ది, బిడ్డల కడుపు నింపడానికి, ఊర కుక్కలనుండీ, వేటకుక్కలనుండీ తనను తాను కాపాడుకోవడానికి...అద్దాలో కనబడే మేస్త్రీ, వెంటాడే పురుషులనుండీ భద్రతకోసం మళ్లీ ఒక పురుషుడికి వళ్ళప్పగించి మోసపోవడానికి సిద్ధపడే రామ

లక్ష్మి, మేస్త్రీ కుటుంబసభ్యుల దాడి, పోలీసుల చేష్టలు.... ఆ రామలక్ష్మిని నిఅంగడి పెట్టినావంటనే!\ అని మగ భాషలో అడిగే పోలీసు హెడ్డు కానిస్టేబుల్...భరిస్తుంది బిడ్డలకోసం... పేగుబంధాలు...తల్లి కదా! తండ్రిలా వది లించుకోలేదు కదా!

భర్త పరాయైతే, సంసారం దారి తప్పింది అనుకుంది. చీకట్లో మగవాళ్లు మీదపడితే దారి తప్పినాను అనుకుంది. మేస్త్రీతో సంబంధం పెట్టుకున్నప్పుడు తప్పు దారిలో పడి పోతున్నాను అనిపించింది... మనిషి పుట్టడమే ఒక దారీ తెన్నూ లేని ప్రపంచంలోకి విసిరివేయబడతాడు. ఇంక దారి తప్పడం ఏముంది? ఆమెకిప్పుడు ఇలానే బతకాలనే లేదు. ఎలాగైనా తాను బతకాలి, బిడ్డల్ని బతికించుకోవాలి.

రామలక్ష్మికున్న లోకభయాలు రమణికుండవు. అదొక్కటే తేడా. హిజ్రాలకు లోకం అంటే భయం లేదు.

ఎర్రిస్వామిలాంటి జర్రిపోతును భరిస్తూ, ఫ్రిజ్జు చల్ల దనాలకోసం, కార్ల సుఖాలకోసం, బిడ్డని డాక్టరీ చదివిం చడంకోసం, మధ్య తరగతి లక్ష్మణరేఖల్ని వెర్రి భర్త ఎర్రిస్వామితోనే చెరిపించి, రంగారెడ్డి పంచన చేరి, బతక నేర్చిన మణిమాల... ఇరుగు పొరుగున అతిశయం చూపి బతుకు బండిని భద్రంగా లాక్కెళ్లే గడుసు పుల్లమ్మలూ చూడచ్చు.

“I don’t call myself a woman and I know I am not a woman… అని తన్ని తాను వర్ణించుకున్న కేట్‌బోర్న్‌స్టీన్ ఒకచోట అడుగుతుంది అమాయకంగా Gender outlaw జండర్ లా అనే పుస్తకంలో, …Is the determination of one another’s gender a social responsibility? Do we have the legal or moral right to decide and assign our own genders? అని! ఓ మర్యాదల ముసుగు ప్రపంచమా! సమాధానం చెప్పు!” వి. విజయకుమార్ దిగువ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రన్న అనే యువకుడు రమణిగా పరిణమించిన క్రమంలో కుటుంబంనుంచీ, సమాజంనుంచీ, ప్రభుత్వంనుంచీ నిరాదరణకు గురై అవమానాల్నీ, హింసనీ, వివక్షనీ, వంచననీ అనుభవించిన తీరును చిత్రించారు రచయిత. ఇందులో భాగంగా ట్రాన్స్‌జెండర్ వ్యవస్థ నిర్మాణాన్నీ అందులోని ఖాన్‌దాన్ లనూ, గురువులనూ, నానీలనూ, చేలాలనూ వారి జీవన విధానాన్నీ రోజువారీ ఆచరణ, ఆచార సంప్రదాయాలతో సహా మన ముందుకు తీసుకొచ్చారు.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణ కేంద్రంగా ఈ కథను నడుపుతూ ట్రాన్స్‌జెండర్ల కష్టాలు, వారికోసం పనిచేసే కిన్నెరలాంటి ఎన్.జి.ఒ సంస్థలనీ, రచన లాంటి సహాయకుల్ని కూడా ప్రస్తావిస్తుంది. మరోవైపు కింది తరగతి బహుజన గ్రామీణ కుటుంబంనుంచీ వచ్చిన ముగ్గురు పిల్లల తల్లి రామలక్ష్మి భర్త చేతిలో మోసపోయి సెక్స్ వర్కర్‌గా తప్ప బతికి బట్టకట్టలేకపోయిన కథనాన్ని వివరిస్తుంది. బిడ్డలకు తిండి పెట్టడానికి, బతకడానికి స్వేచ్ఛలేక తార్పుడుగత్తెలూ, పోలీసులు, రౌడీలు, రాజకీయ అండ ఉన్న పడుపువృత్తి కంపెనీలూ, ఇరుగు పొరుగూ తనపై చేసే దాష్టీకంతో అవమానాలతో వేగలేక రామలక్ష్మి జరిపిన ఒంటరి పోరాటం వాస్తవికంగా చిత్రిత మైంది.

కష్టాల్లో ఉన్నోల్లే ఒకరికొకరు తోడుంటారు. కష్టాల్లో కడతేరలేని చంద్రన్న, రామలక్ష్మిలు ఒకరికొకరు అండగా నిలుస్తారు. ఇద్దరికీ ఒకరిపట్ల ఒకరికి సానుభూతి, అవగాహన ఏర్పడి ఒకరికొకరు తోడ్పడుకునేందుకు పరిస్థితులే కారణం. వారి స్వభావాలు, పితృస్వామిక వ్యవస్థ పాత్రను రచయిత ఎప్పటికప్పుడు అర్థం చేయిస్తూ ఉంటాడు.

చివరికి చంద్రన్న ట్రాన్స్‌జెండర్‌గా తన హక్కులకోసం, రామలక్ష్మి సెక్స్‌వర్కర్‌గా తన హక్కులకోసం వారివారి ప్రత్యేక ఉద్యమాల్లో భాగమవ్వటాన్నీ, తమ స్వేచ్ఛకోసం, తమ హుందాతనం కోసం తమలాంటి జనం ఉన్న ప్రత్యేక సమూహాల్లో కలవడమే దారి అని నిర్ధారణకు రావడాన్నీ చూపుతాడు రచయిత. రమణిగా చెలామణి అవుతున్న చంద్రన్న ఆస్తిలో తన హక్కుకోసం కోర్టులో దావాలేసే ఘటనతో నవల ముగుస్తుంది. చిన్నప్పటినుండీ తండ్రి దగ్గర నేర్చుకున్న బ్రహ్మంగారి తత్వాలూ, భజన పాటలూ రామలక్ష్మికి ఒక భజన సమాజం నెలకొల్పి ఇష్టమైన వ్యాపకంలో బతకడానికి అవకాశమివ్వడంతో ఆమె కథకూ ఒక తాత్కాలిక ముగింపు.

ఈ నవల చదివిన తర్వాత జీవితాలపట్ల మునుపటి దృక్పథాలు మారుతాయి.

చదువుకున్న, నగర ధనిక ఇళ్ళల్లో పుట్టిన ట్రాన్స్ జెండర్లు, పేద కుటుంబాల్లో పుట్టిన ట్రాన్స్‌జెండర్లతో పోలిస్తే మెరుగైన జీవితాల్ని గడపటం గమనించవచ్చు. ఇందుకు రచన జీవితమే ఉదాహరణ. అటు ట్రాన్స్ జెండర్ల వేదనకూ, ఇటు సెక్స్ వర్కర్ల ఇక్కట్లకూ మగ సమాజమే, మగదృష్టే కారణమనే విషయాన్ని నొక్కి చెబుతుందీ నవల.

ఇందులో ట్రాన్స్‌జెండర్ల చరిత్ర, పరిణామం, పౌరాణిక మూలాలూ, వారిదైన ప్రత్యేక ప్రపంచం, దాని కట్టు బాట్లూ, దందాలూ, బస్తీలూ, పావ్‌పడితీలూ, వారిలోని ప్రేమా, ఐక్యతలూ, అంతర్గత రాజకీయాలూ, అసూయా ద్వేషాలూ, నేర ప్రవర్తనలూ, పడుపువృత్తి మూలాలూ, సెక్స్‌వర్కర్ల స్థితిగతులూ, కుటుంబాల, ప్రభుత్వాల, సమాజపర క్రూరత్వం ఇవన్నీ మనం ఈ నవలలో చూడచ్చు.

కూవగం అనే తమిళ పల్లెలో జరిగే అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్‌ల ఉత్సవాలను వర్ణించిన సందర్భంలో, హిజ్రా జీవితాన్ని చేపట్టే సందర్భంలో హిజ్రా ఖాన్‌దాన్‌లు స్వీకరించి రంగంలోకి దించే తంతును, హిజ్రాల ప్రేమ కలాపాల్ని రూపుకట్టిన సన్నివేశాలు మనలో ఆసక్తిని పెంచుతాయి, ఆలోచనను రేకెత్తిస్తాయి.

చంద్రన్న, రామలక్ష్మి లాంటి పాజిటివ్ పాత్రలేగాక రంగారెడ్డి, మణిమాల, పిట్‌పిట్ బాషా, రూపా, చలపతి, కానిస్టేబుల్ లింగారెడ్డి లాంటి నెగెటివ్ పాత్రలు కూడా వాటి వాటి సొంత దారుల్లో గమ్యాల్ని చేరుకుంటాయి.

స్వామి మాటలు, కొన్ని లోక సత్యాలు.

తాము డూపు అని అందరికీ తెలుసు, కానీ తెలీనట్లు ప్రవర్తిస్తారు, ఇది ఇంకా పెద్ద డూపు అని పిట్‌పిట్ బాషా చేత అనిపిస్తాడు.

శీలం కూడా ఒక సామాజిక విలువ అంటారు.

తాను ఫలానా పురుషుడికే స్వంతం అని గర్వపడే స్త్రీత్వం సామాజికమైనదా? లేక నిసర్గమైనదా? చంద్రన్న స్త్రీత్వం సామాజికమైనదే!

స్త్రీ అయినంతమాత్రాన ఉన్నత వర్గ స్త్రీ, పేద స్త్రీ ఒకటి కాదు... మగతోడు లేకుండా పేదవర్గంలోని స్త్రీ బతకలేదు.

మనిషి ఆర్థిక జీవితాన్ని ఉద్యోగం పోషిస్తుంది. కాయకష్టం పోషిస్తుంది.కానీ రామలక్ష్మి జీవితాన్ని ఆమె లైంగిక వ్యవస్థ పోషిస్తూ ఉంది.

మామూలు మనుషులపట్ల కనీసమైన మర్యాద చూపని ఉద్యోగాల్లో పోలీసు ఉద్యోగం ఒకటి.

లోకులు పలు కాకులు. సమాజం ఒక అంటువ్యాధి.

లోకంలో మనుషుల్ని చూసినంక దయ్యాలంటే భయంపోయింది.

తెలుగులో విభిన్న లైంగికతల ప్రస్తావనున్న కథలూ, రచనలూ తక్కువే. విశ్వనాథ, కప్పగంతుల, ఇంద్రగంటి జానకీబాలలు రాసినవి స్వలింగ సంపర్కానికి చెందినవైతే, ఎండ్లూరి మానస రాసిన ఉల్ఫత్ కథ, రాసాని తృతీయ వర్గం కథలు హిజ్రా జీవితానికి చెందినవి.

తమిళంలో హిజ్రాల జీవిత చరిత్రలతో కొన్ని పుస్తకాలు వచ్చాయి. హిజ్రాలైన రేవతి రాసిన ఒక హిజ్రా ఆత్మ కథ, విద్య రాసిన ఐ యాం విద్య, ప్రియబాబు రాసిన నాన్ శరవణన్ వారి జీవిత చరిత్రలు. అరుంధతీరాయ్ రాసిన అనే నవలలోని అంజుమ్ ముస్లిం కుటుంబానికి చెందిన హిజ్రా.

తృతీయ ప్రకృతి కలిగిన వారిని ఇప్పుడు హిజ్రా అని సంబోధించడం, ఇస్లామిక్ సామ్రాజ్యవాదుల ద్వారానే మొదలైంది. హిజ్రాలను రాజవంశపు స్త్రీలకు రక్షకులుగా ఉంచేవారు. రాజాస్థానాల్లో బలమైన విశ్వసనీయమైన సేవకులు.

18వ శతాబ్దిలో స్వలింగ సంపర్కం నేరంగా ప్రకటించ బడింది. అప్పటినుండీ సహజమైన లైంగికత, అసహజమైన లైంగికత అని రెండుగా విభజించి, అసహజమైన లైంగికతను నేరంగా ప్రకటించారు. అప్పటినుండే హిజ్రాలు, స్వలింగసంపర్కులంటే ప్రజలకు ఏహ్యాభావం కలిగేలా చేసిందని పరిశోధకుల అభిప్రాయం అంటారు వెంకట్ శిధారెడ్డి.

'అర్ధనారి'లో రచయిత తాపత్రయం జన్యుపరంగా

సంక్రమించిన లైంగికతను, స్వతంత్రంగా అనుభవించే హక్కు తమకు ఎందుకు లేకుండాపోయిందనే స్పృహ కూడా రానివ్వకుండా, వచ్చినా ప్రశ్నించలేని జీవితాల్ని గడుపుతున్న హిజ్రాల దీనమైన జీవితాల కథ ఇది. ఏ సమాజమైతే వీరిని హీనంగా చూస్తుందో, అదే సమాజం లోని వ్యక్తుల లైంగిక ప్రవర్తనలను, వారి ద్వంద్వ స్వభావాన్ని చూపెడుతూ, ఒక సమాజంగా మనం ఎంత వికృతంగా ప్రవర్తిస్తున్నామో, మన మనస్తత్వాలకు అద్దంపడుతుందీ నవల.

సమాజపు విలువల పేరుతో అణగదొక్కిన సమూహాల దృష్టికోణంలో మనం ఇప్పుడు ఎక్కడ ఉన్నాం? చీకటిబారిన వారి జీవితాల్లో వెలుగు నింపడానికి ఇంకా ఎక్కడివరకూ వెళ్లాలి? అని మనల్ని మనమే ప్రశ్నించు కునేలా చేస్తుందీ నవల.

హిజ్రాలు, స్వలింగసంపర్కులు, భిన్న లైంగికత కలిగినవారు తమ అస్తిత్వాన్ని గౌరవప్రదంగా చాటుకునే అవకాశం ఇప్పుడిప్పుడే మొదలైంది. ఈ సందర్భంలో ఈ నవల సమాజానికి అవసరం. మనలోని మలినాన్ని కడిగేసే శక్తి ఒక మంచి పుస్తకానికి ఉంటుంది. అలా కడిగేసుకుని వారినీ మనుషులుగా గుర్తించే మానవత పెంచుకోవాలని ఆశ.

చిన్నప్పటినుండీ ఆడతనాన్ని ఇష్టపడే చంద్రన్న, మగపుట్టుక పుట్టి ఏదో కోల్పోయినట్లు మధనపడేవాడు. తల్లిదండ్రుల్నీ, తోబుట్టువునీ, భార్యనీ...అందర్నీ వదిలేసి తనజీవితం తాను జీవించడానికి వెళ్లిపోవడం, భార్యనూ, బిడ్డనూ చూసుకోవడానికి పడే తాపత్రయం, తండ్రి ఆడంగుల నా కొడకా...! అని తిట్టే తిట్లు, ఛీత్కారాలు, ఆడంగుల పనులు మానమనటం, కోడలు గర్భవతైతే కొడుకు ప్రయోజకుడే అనుకోవడం, ఆడవేషాలు మానక పోతే తరిమేయడం, ఆస్తినంతా కూతురికి రాయడం...

లాలన్ హమామ్ గురు తనూజ డిగ్రీ చదువుకున్న నిరుద్యోగురాలు. బంధాలకే కాదు, వంశపారంపర్యంగా వచ్చే ఆస్తిపాస్తులకు కూడా దూరం చేయబడింది. అందరిలాగే యాచకత్వం తప్పలేదు. ఆమె చంద్రన్న లాంటివారు ఇలా అవమానకర జీవితం బతకడాన్ని తట్టుకోలేదు. ఇక్కడేముంది బేటీ? బతకాలంటే యాచన చేయల్ల, వ్యభిచారం చేయల్ల. తాగుడు అలవాటు అవుతుంది. ఏం బతుకు ఇదీ? చక్కగా వ్యవసాయం చేసుకోమంటుంది ఊర్లో. కానీ కుటుంబమే వీరికి పెద్ద శత్రువు.

ట్రాన్స్‌జెండర్‌గా పుట్టడంవల్ల మాత్రమే సమస్యలు రావు. ట్రాన్స్‌జెండర్స్‌ని కుటుంబాలు స్వీకరించలేనప్పుడు సమస్యలు వస్తాయి. ట్రాన్స్‌జెండర్స్‌ని ఎగతాళి చేసే సమాజంవల్ల సమస్యలు వస్తాయి. ట్రాన్స్‌జెండర్ దానికదే వాస్తవం. యాచకత్వం హిజ్రాల స్వభావం కాదు. కుటుం బాలు తరిమేస్తే, సమాజాలు వెలివేస్తే వారికి యాచకత్వం అనివార్యం అయ్యింది.

ప్రభుత్వం ఎందుకు వీరిని అక్కున చేర్చుకుని చదువు చెప్పించదు. జీవితం శాపగ్రస్తమైన హిజ్రాలకు ఇళ్లు ఎందుకు కట్టించదు, ఉపాధి ఎందుకు కల్పించదు? హిజ్రాలు ఈ దేశంలో లేరా, ఈ రాజ్యంలో భాగం కాదా?ప్రశ్నిస్తారు రచయిత. వృత్తి చేసుకునేవారికి లైసెన్సు ఇవ్వాలంటారు.

హిజ్రాలందరూ ఇంటినుండి తరిమివేయబడినవారు. లేదా కుటుంబవ్యవస్థనుండి పారిపోయి వచ్చినవారు. ఆడవాళ్లు కోరుకుని వృత్తిలోకి దిగినవాళ్లు ఎవరూ లేరు. తొంభైతొమ్మిది శాతం ఆడవాళ్లు ఏదో ఒక విధంగా మగవారి చేతిలో మోసపోయి, తప్పనిసరిగా వృత్తిలోకి దిగినవాళ్లే. వారిలో చాలామంది కడుపున పుట్టిన బిడ్డలను సాకోవడానికి పడుపు వృత్తి చేస్తున్నవారు. సమాజంలో వేశ్య వృత్తి పురుషుని పుణ్యమే! అంటాడు రచయిత.

ఎట్టకేలకు కథను సుఖాంతం చేశారు రచయిత. ప్రభుత్వాలు చెయ్యలేని పని ఆర్గనైజేషన్ చేసింది. రామలక్ష్మి ఆటోడ్రైవర్ అయ్యింది. చంద్రన్న లేడీస్ టైలర్ అయ్యాడు. రాత్రిమాత్రం రమణిగా మారకుండా ఉండలేడు. కుటుంబం ఒక్కటి ఆదరిస్తే సమస్యే లేదు. ఊరే మనుకున్నా ఎవరేమనుకున్నా చింత లేదు వీరికి. సమాజం దృష్టి కూడా మారాలి. వీరి జీవితాల్ని అర్థంచేసుకోవాలి. వీరి తప్పేం లేదని తెలియాలి. కావాలని ఇలా ఎవ్వరూ మగతనాన్ని వదులుకుని ఆడవారిగా మారరన్న నిజాన్ని తెలుసుకునే జ్ఞానం రావాలి. విశాల దృక్పథం రావాలి.

❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# మధ్యతరగతి కుటుంబ విలువల విచ్ఛిన్న ప్రతిబింబం - డాలర్ కోడలు

- డా॥. గుమ్మనూరు ఉషారాణి
తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు, (ఆం.ప్ర).

**ఉపోద్ఘాతం :**

తొంభైయవ దశకంలో జరిగిన ఆర్థిక సంస్కరణల కారణంగా ప్రపంచీకరణ భారతదేశం ముంగిట్లో కాలుమోపింది. దీని ప్రభావంతో బహుళ జాతి సంస్థల ఆవిర్భావంతో పాటు, గ్రామీణ ప్రాంతాల సంక్షోభం, మధ్యతరగతి విద్యావంతుల విదేశయాన కాంక్షలు, తద్వారా సామాజిక సంబంధాలు, కుటుంబ విలువలు, మానవీయ అంశాలు ప్రభావితమయ్యాయి.

ఈ నేపథ్యంలో తెలుగు నవలా ప్రక్రియకు రైతుల ఆత్మహత్యలు, ఐటీ రంగ విస్తరణ, అంతర్జాతీయ వ్యాపారాలు, యువతకు విదేశీ సంస్కృతి పట్ల ఆకర్షణ, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, యువత విదేశీవిద్య, డాలర్ పై మోజు ... తదితర అంశాలతో / ఇతివృత్తంతో తెలుగు నవలాప్రక్రియ విస్తృతంగా కొనసాగింది. యువతకు డాలర్‌పై ఏర్పడ్డ ఆకర్షణ, కుటుంబ బంధాల పట్ల దాని ప్రభావం ఇతివృత్తంగా రచింపబడిన నవలే పద్మశ్రీ సుధామూర్తిగారి 'డాలర్ కోడలు'. కన్నడ భాషలోని 'డాలర్ సొసె' నవలను శ్రీమతి జగదీశ్వరిగారు 'డాలర్ కోడలు'గా అనువదించారు.

**పద్మశ్రీ సుధామూర్తిగారి పరిచయం :**

సుధామూర్తి గారిని పరిచయం చేయడం అంటే "సూర్యుని చూపడానికి దివిటీ పట్టడం" లాంటిదే. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు శ్రీ ఎన్.ఆర్. నారాయణమూర్తి గారి సతీమణి. పద్మశ్రీ సుధామూర్తి 19-08-1950వ సంవత్సరంలో ఉత్తర కర్ణాటకలో జన్మించారు. టాటా ఇంజినీరింగ్ అండ్ లోకోమేటివ్ కంపెనీలో ఉద్యోగం చేసిన తొలి మహిళా ఇంజినీర్. శ్రీమతి సుధామూర్తి సంఘ సేవకురాలు. ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్, రాజ్యసభసభ్యురాలు, బహుముఖ ప్రజ్ఞాశాలి.

సుధామూర్తి గారు తమ జీవితానుభవాలను ఏర్చికూర్చి చిన్న పిల్లలతోపాటు తల్లిదండ్రులు, పెద్దలు అందరూ నేర్చుకోవలసిన అనేక అంశాలను / విషయాలను ఉపన్యాసాలరూపంలో, కథల, నవలలరూపంలో అందించారు. తొమ్మిది నవలలు, నాలుగు సాంకేతిక గ్రంథాలు, మూడు యాత్రావిశేషగ్రంథాలు, కథా సంపుటులు వెలువరించారు.

**డాలర్ కోడలు నవల ఇతివృత్తం :**

ఈ నవల నేటిసమాజంలో డాలర్ల సంపాదనే ధ్యేయంగా తిరిగే మధ్యతరగతి వ్యక్తుల ఆలోచనలే ప్రధాన ఇతివృత్తంగా సాగుతుంది. ఇంటిలో ఒకరు ఇంజినీరింగ్ చదివితే విదేశాల్లో ఉద్యోగం, డాలర్ల రూపంలో జీతం, సుఖమయమైన జీవనం, బంధువర్గంలో

గౌరవప్రతిష్టలు ... మొదలైనవాటి చుట్టూ తిరిగే ఆశల వలయంలో చిక్కుకొని కుటుంబంలోని బంధాలు విచ్ఛిన్నం అయిపోవడం, డబ్బే సర్వస్వంగా భావించి తమ సామాజికహోదాకు చిహ్నంగా మార్చుకోవడం ఈ నవల ప్రధానేతివృత్తం.

**పాత్రల పరిచయం :**

ఈ నవలలో మనకు ఎదురయ్యేవి సాధారణ మధ్య తరగతి కుటుంబాలలో కనిపించే పాత్రలే. ఈ నవల చదివేటప్పుడు పాఠకుడికి దాదాపు ఆ పాత్రలన్నీ తమ నిజజీవితంలో ఏదో ఒక సందర్భంలో ఎదురైన, పరిచయమైన వ్యక్తులు తారసపడ్డట్టే అనిపిస్తుంది.. ఈ నవలలోని ప్రముఖ పాత్రలు :

**1. శ్యామసుందర్ :**

ఇతడు వృత్తిరీత్యా ఒక పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడు. ఈ నవలలో పరిచయం చేయబడ్డ మధ్య తరగతి ఉమ్మడి కుటుంబ యాజమాని. ఇతడి భార్య గౌరమ్మ. ఇతడు ఉన్నదానిలో సంతృప్తిపడుతూ, ఆస్తులు పెద్దగా లేకపోయినా గుణసంపద సమృద్ధిగావున్న ధనికుడు.

**2. గౌరమ్మ :**

శ్యామసుందర్ గారి భార్య. భర్త స్వభావానికి, ఆలోచనలకు పూర్తి విరుద్ధమైన నైజం గల ఇల్లాలు. ఆడంబరాల పట్ల మోజు, డబ్బుమీద విపరీతమైన ఆశ. పెద్దకొడుకు ఇంజనీరై విదేశాలకు వెళ్ళాడని, అతని భార్య డబ్బున్న కోడలని వారిపట్ల విపరీతమైన ప్రేమప్రదర్శిస్తూ, గతిలేని కుటుంబం నుంచి వచ్చిందని, వినయం, ఒద్దిక, అందం అన్నీ ఉన్నా చిన్నకోడలిని చిన్నచూపు చూస్తుంది.

**3. చంద్రశేఖర్ :**

శ్యామసుందర్, గౌరమ్మల పెద్దకుమారుడు. ధనార్జనే ధ్యేయంగా ఇంజినీరింగ్ చేసి భారతదేశ కంపెనీ తరపున వెళ్ళి ఆ కంపెనీకి చెప్పకుండా వదిలేసి వేరే కంపెనీకి మారిపోయి, నిజాయితీ లేనివాడుగా పాఠకుడికి పరిచయమవుతాడు. తర్వాత బాగా డబ్బున్న జమునను పెళ్ళి చేసుకొంటాడు. తల్లిపాలిటి బంగారుబాతులాంటి వాడు.

**4. వినుత :**

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పెదనాన్న పెంపకంలో పెరిగిన అమ్మాయి. గౌరమ్మ చిన్నకొడుకు గిరీశ్ భార్య. పెద్దలపట్ల గౌరవం, మర్యాద కలిగింది. స్వాభిమాని. చదివిన విద్యకు సార్థకతచేకూరాలని చిన్న ఉద్యోగమైనా తన కాళ్ళమీద తాను నిలబడాలనుకొనే వ్యక్తిత్వం తనది.

**5. జమున :**

చంద్రశేఖర్ భార్య. డబ్బులో పుట్టిపెరిగి, ఎలాంటి వారినైనా డబ్బుతో లొంగదీసుకోవచ్చన్న హీనమైన ఆలోచనతో అత్తను, ఆడపడుచును తనచుట్టూ తిప్పుకుంటుంది. తోడికోడలు వినుత ఆమె దృష్టిలో ఉత్తగొడ్డు స్వరూపం.

**6. గిరీశ్ :**

గౌరమ్మ, శ్యామసుందర్‌ల రెండవ సంతానం తండ్రి గుణగణాలు పుణికిపుచ్చుకొన్నవాడు. మితభాషి, బ్యాంకులో క్లర్క్. బ్యాంకు పని అయిన తర్వాత అనాథ శవసంస్కారాల్లాంటి సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటుంటాడు. తన లాంటి మనస్తత్వమే కలిగిన వినుతను కోరి వివాహం చేసుకొని ఆమెను ప్రేమగా, గౌరవంగా చూసుకుంటాడు.

**7. సురభి :**

శ్యామసుందర్, గౌరమ్మల కూతురు. తనకు తెలిసిందల్లా టి.వి. చూడడం, బాగా అలంకరించుకోవడం. డబ్బున్న పెద్దవదిన మీద గౌరవభావం. చిన్న ఉద్యోగం చేస్తూ, ఇంట్లో చాకిరీ చేసే చిన్నవదిన పట్ల చిన్నచూపు.

ఈ పాత్రలతో పాటు అమెరికాలో ఉంటూ అక్కడ అవస్థలుపడుతూ స్వదేశంలో బంధువులు, స్నేహితులు వాళ్ళు గొప్పగా బతికేస్తున్నారని పొగుడుతూవుంటే అమెరికాలో బతుకుబండినిలాగే శశికళ, చిత్ర, జయ, రాధాకృష్ణ, శ్యామ మొ॥న పాత్రలు ఆయా సన్నివేశాలకు, సందర్భాలకు ఊతనిస్తాయి.

**నవల పరిశీలన :**

ఈ డాలర్ కోడలు నవలను చదివినప్పుడు ప్రపంచీ

కరణ నేపథ్యంలో భారతీయసమాజంమీద విదేశీద్రవ్య ప్రభావం ఎంతలా ఉందో అర్థమౌతుంది. చాపకింద నీరులా పాశ్చాత్యుల జీవనవిధానం మధ్యతరగతి కుటుంబాల్లోకి చొరబడి, వ్యక్తిగతస్వార్థం పెరిగిపోయి కుటుంబ బంధాలు ఆర్థికబంధాలుగా మారిపోతున్న తీరుని రచయిత్రి హృద్యంగా వివరించారు.

మనదేశంలోని యువతకు అమెరికా "ల్యాండ్ ఆఫ్ ఆపర్చ్యునిటీస్". అక్కడ ఉండే వారి దృష్టిలో "ఇదో విచిత్రదేశం. ఇది రంగులమయం. ఆకర్షణీయమైన సాలెగూడు. యంత్రాలు, తంత్రాలు ఉండవచ్చు. సుఖ సంపత్తులు ఉండవచ్చు. అక్కడి నుండి బయటకు రావడానికి ఎన్నో ద్వారాలున్నాయి. కానీ లోపలికెళ్ళితే ఏ గుమ్మం కానరాదు" ఇది అమెరికాలో ఉండే రాధాకృష్ణ అభిప్రాయం.

పద్మ మాటల్లో చెప్పాలంటే "ఆసుపత్రికి వెళ్ళాలంటే పదిమైళ్ళు రాను, పదిమైళ్ళు పోను. ప్రతిఒక్కరికి తమదే అయినపని ఉంటుంది. శక్తి ఉన్నంతవరకే ఇక్కడ ఉండాలి. ఏ మాత్రం హెల్త్ దెబ్బతిన్నా, సమయానికి ఎవరూ రారు. ఎవరికే ఇంకోరి గురించి పట్టించుకునే టైముండదు" (డాలర్ కోడలు పుట - 105)

భారతదేశంలో ఏ ఇబ్బంది కలిగినా.. సమయానికి నా అనేవాళ్ళు ఎవరో ఒకరుంటారు. అక్కడ వారిని ఒంటరితనం ఎంతలా వేధిస్తుందో ఈ నవలలో రచయిత్రి ఆర్ద్రతతో వివరిస్తారు.

భారతదేశంలో తల్లిదండ్రులు తప్పుచేసే పిల్లలను మంచిదారిలోకి తేవడానికి కఠినంగా వ్యవహరిస్తారు. కానీ అదే అమెరికాలో అయితే ...

"ఇక్కడ అలా చేయరు పిన్నిగారు! పిల్లల్ని తల్లి దండ్రులు హింసిస్తే వాళ్ళు పోలీసు కంప్లైంట్ ఇస్తారు" ... కన్న తల్లిదండ్రులను జైళ్ళకు పంపే కుసంస్కృతిని వేలెత్తిచూపించారు రచయిత్రి (డాలర్ కోడలు, పుట - 107)

ఒక్కసారి అమెరికాలో కాలుపెట్టి, డబ్బు వ్యామోహపువలలో చిక్కుకున్న భారతీయుడి పరిస్థితిని చెబుతూ .. "ఆ రోజుల్లో థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో బెర్త్ దొరికితే చాలు ఎంతో సంతోషపడేవాణ్ణి. కానీ నేడు విమానంలో ఫస్ట్‌క్లాస్‌లో కూర్చొని వస్తున్నా... ఆనందం అనుభవించలేకపోతున్నాను. ఆ రోజు అమెరికాకుడ రావడమే గొప్పగా భావించాను. నేడు నా దృష్టిలో అది సిరివంతుల గడ్డ అంతే" అని బాధపడే చంద్రశేఖర్ తల్లి గౌరమ్మ అదే డబ్బుమీద వ్యామోహంతో తన ధనవంతురాలైన పెద్దకోడలు, శేఖర్ భార్య జమునను నెత్తిన పెట్టుకొని, వివేకవంతురాలు, వినయవంతురాలైన చిన్నకోడలు వినుతను హీనంగా చూడడం బాధాకరంగా అనిపిస్తుంది.

నిండు గర్భిణి వినుతకు ప్రసవానికి సమయం దగ్గర పడుతున్నా, పట్టించుకోకుండా అదే సమయానికి సురభి పెళ్ళికి ముహూర్త సమయానికి జమున, చంద్రశేఖర్ రావాలని సురభి పెళ్ళి ముహూర్తం నిర్ణయిస్తుంది. తేదీ మార్చడానికి ఒప్పుకోదు. దానికి కారణం పెళ్ళికి శేఖర్ ధనసహాయం చేయడమే. దానితో వినుత మనసు విరిగిపోతుంది. డాలర్ కుటుంబబంధాన్ని ఆర్థికబంధంగా మార్చేస్తుంది.

జమున ప్రసవం తరువాత ఆమెకు, బిడ్డకు సాయంగా గౌరమ్మ అమెరికాకు వెళ్తుంది. మొదట్లో అక్కడి సౌకర్యాలకు ఎంతగానో ఆనందపడిన గౌరమ్మకు మెల్లమెల్లగా చిన్నకోడలి అసలు స్వరూపం బయటపడడంతో వినుత విలువ తెలిసివస్తుంది. చివరకు తప్పు తెలుసుకొని భారతదేశానికి తిరిగివచ్చేసరికి వినుత గిరీశ్‌తో, కొడుకు హర్షతో కలిసి వేరేకాపురం పెట్టడంతో ఆమెకు దుఃఖం ముంచుకొని వస్తుంది.

నవల అంతంలో డాలర్‌కు ఆమె దృష్టిలో ఎలాంటి విలువ లేకుండాపోయి రూపాయే గెలుస్తుంది.

**ముగింపు :**

సుధామూర్తిగారి "డాలర్ కోడలు" నవల ఆధునిక భారతీయ మధ్యతరగతి కుటుంబానికి దర్పణంలాంటిది. డబ్బే జీవితపరమావధి అయితే మనిషి తన నైతిక విలువలను, బాంధవ్యాలను ఏ విధంగా కోల్పోతాడో స్పష్టంగా వివరించారు. మధ్యతరగతికుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు మన సంస్కృతి

వినాశనానికి, సంప్రదాయాల పతనానికి డాలర్ ఎలా కారణమౌతోందో, మనుషుల మధ్య అంతరాలకు ఏ విధంగా కారణమౌతుందో రచయిత్రి సుధామూర్తిగారు ఈ నవలలో స్పష్టంగా వివరించారు.

**ఆధార గ్రంథాలు :**


1. డాలర్ కోడలు - సుధామూర్తి (కన్నడ మూలం) అనువాదం - జగదీశ్వరి, అలకనంద ప్రచురణలు, విజయవాడ - 520 608. జనవరి :2006.
2. డాలర్ సొసె - సుధామూర్తి, ప్రకాశన - సప్న బుక్ హౌస్, 2000.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవలా సాహిత్యం - స్త్రీ చైతన్య వికాసం

- భూక్యా గోపీర్యానాయక్
తెలుగు అధ్యాపకులు, తెలుగు విభాగం, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర).

## 1. ఉపోద్ఘాతం (Introduction) :

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమాజంలో జరిగే పరిణామాలు, సంఘర్షణలు, మార్పులు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. తెలుగు సాహిత్య ప్రక్రియలలో 'నవల' ఆధునిక కాలంలో అత్యంత శక్తివంతమైన ప్రక్రియగా అవతరించింది. 19వ శతాబ్దపు చివరలో ప్రారంభమైన తెలుగు నవల, 21వ శతాబ్దం నాటికి అనేక రూపాలను సంతరించుకుంది. ఈ పరిణామ క్రమంలో "స్త్రీ చైతన్యం" అనేది ఒక ప్రధాన ఇతివృత్తంగా మారింది.

'చైతన్యం' అంటే కేవలం నిద్రలేవడం కాదు; తన ఉనికిని, తన హక్కులను, తన బాధ్యతలను, తనపై జరుగుతున్న అన్యాయాలను గుర్తించి, వాటిని ప్రశ్నించే స్థాయికి ఎదగడం. ఒకప్పుడు "వంటింటి కుందేలు"గా, "అబల"గా చిత్రించబడిన స్త్రీ, నేడు "సబల"గా, "విశ్వవ్యాప్త విజేత"గా నవలల్లో ఎలా పరిణామం చెందిందో పరిశీలించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం. ఈ సదస్సులో తెలుగు నవల ద్వారా స్త్రీ ప్రయాణాన్ని విశ్లేషించడం సందర్భోచితం.

## 2. చారిత్రక నేపథ్యం - సామాజిక సంస్కరణోద్యమ దశ:

తెలుగు నవల పుట్టుకకు సామాజిక సంస్కరణోద్యమమే మూలం. స్త్రీ విద్య, బాల్య వివాహాల రద్దు, వితంతు పునర్వివాహం వంటి అంశాలే తొలితరం నవలలకు వస్తువులు. అయితే, ఈ దశలో నవలలు రాసినవారు పురుషులు కావడం గమనార్హం.

### 2.1. కందుకూరి వీరేశలింగం - విద్యా గంధం :

తెలుగు నవలా పితామహుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖర చరిత్రము' మరియు 'సత్యవతీ చరిత్రము' స్త్రీ చైతన్యానికి తొలి మెట్లు.

**విశ్లేషణ :**

కందుకూరి దృష్టిలో స్త్రీ చైతన్యం అంటే ఆమెను ఒక "మంచి గృహిణి"గా తీర్చిదిద్దడం. స్త్రీ చదువుకుంటే ఇంటిని పొదుపుగా నడుపుతుందని, పిల్లలను బాగా పెంచుతుందని ఆయన భావించారు. ఇది పరిమిత చైతన్యమే అయినా, అంధకారంలో ఉన్న నాటి స్త్రీలకు ఇది ఒక వెలుగు రేఖ.

### 2.2. చిలకమర్తి మరియు ఇతర రచయితలు :

చిలకమర్తి వారి 'గణపతి', 'రామచంద్ర విజయము' వంటి నవలల్లో స్త్రీల పట్ల సమాజంలో ఉన్న చిన్నచూపును హాస్యం ద్వారానే అయినా ఎండగట్టారు. స్త్రీకి కూడా మనసు ఉంటుందని, ఆమెకు కూడా ఆశలు ఉంటాయని ఈ నవలలు గుర్తుచేశాయి.

**3. భావ విప్లవ దశ - చలం మరియు శరత్ ప్రభావం :**

సంస్కరణల నుండి "తిరుగుబాటు" వైపు స్త్రీ అడుగులేసిన దశ ఇది. ఇక్కడ "పాతివ్రత్యం" అనే సంకెళ్లను స్త్రీలు ప్రశ్నించడం మొదలు పెట్టారు.

**3.1. గుడిపాటి వెంకట చలం - స్త్రీ స్వేచ్ఛా పతాక :**

తెలుగు నవలలో స్త్రీని రక్తమాంసాలున్న మనిషిగా, కోర్కెలున్న జీవిగా చూపించిన మొదటి రచయిత చలం.

**మైదానం :**

ఈ నవలలోని 'రాజేశ్వరి' పాత్ర తెలుగు సాహిత్యంలో ఒక సంచలనం. భర్త అమీర్ ఖాన్ దగ్గరకు వెళ్లిపోవడం ద్వారా, ఆమె పితృస్వామ్య వ్యవస్థకు, వివాహ వ్యవస్థకు సవాలు విసిరింది. "నా శరీరానికి, నా మనసుకు నేనే యజమానిని" అని చాటిన పాత్ర అది.

**అమీనా, 'బ్రాహ్మణీకం' :**

ఈ నవలలు కూడా స్త్రీ అణచివేతను తీవ్రంగా నిరసించాయి. చలం చూపిన మార్గం స్త్రీలకు తాము అనుభవిస్తున్న బానిసత్వాన్ని గుర్తించేలా చేసింది.

**3.2. ఉన్నవ లక్ష్మీనారాయణ - 'మాలపల్లి' :**

జాతీయోద్యమ కాలంలో వచ్చిన ఈ నవలలో 'జ్యోతి' పాత్ర అద్భుతమైనది. అప్పటివరకు నాలుగు గోడలకే పరిమితమైన స్త్రీ, దేశం కోసం, సమాజం కోసం ప్రాణ త్యాగం చేయడానికి కూడా సిద్ధపడటం ఇందులో చూస్తాం. ఇది రాజకీయ చైతన్యానికి నిదర్శనం.

**4. అభ్యుదయ మరియు మనోవిశ్లేషణ దశ :**

1940-60ల మధ్య కాలంలో మార్క్సిజం మరియు ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతాల ప్రభావం తెలుగు నవలపై పడింది.

**బుచ్చిబాబు - 'చివరికి మిగిలేది' :**

ఇందులో 'అమృతం' పాత్ర, ఇతర స్త్రీ పాత్రలు సంక్లిష్టమైన మానసిక స్థితులను కలిగి ఉంటాయి. స్త్రీ మనసులోని అంతర్మథనాన్ని ఈ నవల ఆవిష్కరించింది.

**కొడవటిగంటి కుటుంబరావు - 'చదువు' :**

స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే సామాజిక గౌరవం దక్కుతుందని కొడవటిగంటి బలంగా నమ్మారు. ఆయన నవలల్లో స్త్రీలు హేతువాదులుగా, ఆలోచనాపరులుగా కనిపిస్తారు.

**5. నవలా రాణుల యుగం - మధ్యతరగతి స్త్రీ ఆవిష్కరణ (1960-1980) :**

ఈ కాలాన్ని స్త్రీ రచయితల స్వర్ణయుగం అనవచ్చు. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచన, రంగనాయకమ్మ వంటి వారు లక్షలాది మంది పాఠకులను సృష్టించుకున్నారు.

**5.1. యద్దనపూడి సులోచనారాణి - ఆత్మగౌరవ పోరాటం:**

విమర్శకులు వీరిని "పాపులర్ నవలా రచయిత్రి" అని పిలిచినా, వీరి నవలల్లోని కథానాయికలు బలమైన వ్యక్తిత్వం కలవారు.

**'సెక్రటరీ' :**

ఇందులో కథానాయిక 'జయంతి' తన కుటుంబం కోసం ఉద్యోగం చేస్తుంది. అప్పటివరకు స్త్రీ ఉద్యోగం చేయడం చిన్నతనంగా భావించే సమాజంలో, ఉద్యోగం చేయడం గర్వకారణమని ఈ నవల చాటింది. ఆఫీసుల్లో అధికారుల వేధింపులను ఎదుర్కొని నిలబడే ధైర్యాన్నిచ్చింది. 'విజేత', 'మీనా':ఈ నవలలు స్త్రీ విద్యను, ఆమె నిర్ణయాధికారాన్ని బలపరిచాయి.

**5.2. రంగనాయకమ్మ - సామాజిక విప్లవం :**

**బలిపీఠం :**

కులాంతర వివాహం చేసుకున్న స్త్రీ, సమాజం నుండి, అత్తింటి వారి నుండి, చివరకు భర్త నుండి కూడా ఎదుర్కొన్న అవమానాలను ఇందులో చిత్రించారు. "సంస్కరణ అనేది వేదికల మీద కాదు, ఆచరణలో ఉండాలి" అని ఈ నవల ప్రశ్నించింది.

**'స్వీట్ హోమ్' :**

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో స్త్రీ ఎలా నలిగిపోతుందో, ఆమె శ్రమకు ఎలా విలువ లేకుండా పోతుందో ఈ నవల కళ్లకు కట్టింది.

**6. స్త్రీవాద యుగం - అస్తిత్వ చైతన్యం (1980 తర్వాతి కాలం) :**

1980 తర్వాత వచ్చిన "స్త్రీవాద సాహిత్యం" తెలుగు నవల దశను, దిశను మార్చేసింది. స్త్రీని దేవతగా

పూజించవద్దు, బానిసగా చూడవద్దు, తోటి మనిషిగా గౌరవిస్తే చాలు అనే వాదన బలపడింది.

**6.1. ఓల్గా -వైచారిక ధిక్కారం :**

తెలుగు స్త్రీవాద నవలా రచయితల్లో ఓల్గా అగ్ర గణ్యులు.

**'స్వేచ్ఛ' :**

ఇది తెలుగు నవలా చరిత్రలో ఒక మైలురాయి. ప్రధాన పాత్ర 'అరుణ' తన చిన్నతనం నుండి పెళ్లి వరకు, ఆ తర్వాత ఉద్యోగం చేసే వరకు ఎదుర్కొన్న పితృస్వామ్య ఆంక్షలను ప్రశ్నిస్తుంది. "భద్రత పేరుతో స్త్రీని బంధించడం కుట్ర" అని ఆమె గ్రహిస్తుంది. భర్తను వదిలి, కూతురితో ఒంటరిగా జీవించడానికి నిర్ణయించుకోవడం ద్వారా, పెళ్లి ఒక్కటే స్త్రీకి గమ్యం కాదని నిరూపించింది.

**'మానవి' :**

ఇందులో స్త్రీల మధ్య ఉండే స్నేహం, సహజీవనం ఎలా వారికి బలాన్నిస్తుందో ఓల్గా చిత్రించారు.

**6.2. పి. సత్యవతి - గృహ శ్రమ రాజకీయాలు :**

**'ఇల్లు అమ్మి పోదాం' :**

మధ్య తరగతి స్త్రీలు ఇల్లు, పిల్లలు, భర్త అంటూ తమ జీవితాన్ని ఎలా కరిగించుకుంటున్నారో, చివరికి వారికి మిగిలేది శూన్యమే అని సత్యవతి గారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పనికి వేతనం లేకపోవడం వల్ల అది గుర్తించబడటం లేదని ఆమె తన నవలల్లో చర్చించారు.

**6.3. వాసిరెడ్డి సీతాదేవి - బహుముఖ ప్రజ్ఞ :**

**'మట్టి మనిషి' :**

వ్యవసాయ రంగంలో స్త్రీ పాత్రను అద్భుతంగా చిత్రించిన నవల. భూమికి, స్త్రీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని, ప్రపంచీకరణ వల్ల వ్యవసాయం దెబ్బతింటే మొదట నష్టపోయేది స్త్రీలే అని ఆమె హెచ్చరించారు.

**7. నవలల్లో బహుజన, దళిత మరియు మైనారిటీ స్త్రీ చైతన్యం :**

"స్త్రీ" అనేది ఒకే వర్గం కాదు. కులం, మతం, ప్రాంతం ఆధారంగా స్త్రీ సమస్యలు మారుతూ ఉంటాయి.

**దళిత స్త్రీ చైతన్యం :**

దళిత స్త్రీలు ఒకవైపు పురుషాధిక్యతను, మరోవైపు అగ్రవర్ణ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటున్నారు. గోగు శ్యామల, జాజుల గౌరి వంటి వారి రచనల్లో దళిత స్త్రీల ఆత్మ విశ్వాసం, వారి పోరాట పటిమ కనిపిస్తుంది. వారి భాష, వారి సంస్కృతి నవలల్లోకి రావడమే ఒక పెద్ద చైతన్యం.

**ముస్లిం స్త్రీ చైతన్యం :**

షాజహానా, స్కైబాబ వంటి వారి రచనలు ముస్లిం స్త్రీల అంతర్గత సమస్యలను (పరదా, తలాక్, విద్య) చర్చించాయి.

**8. రాయలసీమ ప్రాంతీయ నవలలు - స్త్రీ స్థితి :**

"రాయలసీమ అంటే కేవలం రాళ్ళ సీమ కాదు, అది రత్నాల సీమ. కానీ ఆ రత్నాలు కరువు కోరల్లో చిక్కుకున్న స్త్రీల కన్నీటిలో మెరుస్తున్నాయి."

ఆధునిక తెలుగు సాహిత్యంలో 'ప్రాంతీయ అస్తిత్వ వాదం' బలంగా వినిపించిన ప్రాంతం రాయలసీమ. శ్రీశ్రీ అన్నట్లు "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం" అన్న మాట అటుంచితే, రాయలసీమ చరిత్ర చూస్తే "కరువు, వలసలు, ఫ్యాక్షన్ గొడవలు" కనిపిస్తాయి. ఈ మూడింటి ప్రభావం పురుషుల కంటే స్త్రీల పైనే ఎక్కువగా పడింది. రాయలసీమ నవలల్లో స్త్రీ ఒక అద్భుతమైన శక్తి స్వరూపిణి. ఆమె కేవలం గృహిణి మాత్రమే కాదు, కరువుతో యుద్ధం చేసే సైనికురాలు.

**కరువు బతుకుల్లో స్త్రీ :**

రాయలసీమ నవలల్లో ప్రధాన ఇతివృత్తం 'నీరు' తాగునీటి కోసం, సాగునీటి కోసం మైళ్ళ దూరం నడిచే స్త్రీల దీన స్థితిని అనేక నవలలు చిత్రించాయి.

పురుషుడు నీటి కోసం బావులు తవ్వి అలసిపోతే, ఆ బావిలో నీరు పడకపోతే వచ్చే నైరాశ్యాన్ని దిగమింగుకుని, కుటుంబానికి ధైర్యం చెప్పేది స్త్రీయే.

**సామాజిక బాధ్యత :**

నీటిని పొదుపు చేయడంలో, దొరికిన గుక్కెడు నీటితో

ఇంటి అవసరాలు తీర్చడంలో రాయలసీమ స్త్రీ చూపే నేర్పు అనిర్వచనీయం.

**ఉదాహరణ :**

అనంతపురం జిల్లా నేపథ్యంలో వచ్చిన నవలల్లో, వేరుశనగ పంట ఎండిపోతుంటే, ఆ ఎండిన పైరును చూసి బిడ్డను కోల్పోయిన తల్లిలా రోదించే స్త్రీ పాత్రలు మనకు కనిపిస్తాయి.

**వలసలు - స్త్రీ ఏకాకితనం :**

రాయలసీమ సామాజిక జీవితంలో "వలస" ఒక నిత్య కృత్యం.

**పురుషుల వలస :**

బతుకు దెరువు కోసం మగవారు బెంగళూరుకో, ముంబైకో, లేదా గల్ఫ్ దేశాలకో వెళ్ళిపోతారు. లేదా కనీసం గుంటూరు మిర్చి కోతలకు వెళ్తారు.

**గ్రామంలో మిగిలేది స్త్రీ :**

భర్త వలస వెళ్తే, గ్రామంలో ముసలి అత్తమామలను, చిన్న పిల్లలను, పశువులను, ఉన్నకాస్త పొలాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత పూర్తిగా స్త్రీ భుజాలపై పడుతుంది.

**ద్విపాత్రాభినయం :**

అప్పటి వరకు వంటింటికే పరిమితమైన స్త్రీ, భర్త లేని సమయంలో ఇంటి యజమానిగా మారుతుంది. బ్యాంకు వ్యవహారాలు, అప్పులు, పంటల పెట్టుబడి వంటి బయటి ప్రపంచాన్ని ఆమె ఒంటరిగా ఎదుర్కొం టుంది. ఈ క్రమంలో ఆమె పడే మానసిక సంఘర్షణ, భర్త పక్కన లేడన్న బెంగ, సమాజం నుండి రక్షణ లేదన్న భయం నవలల్లో తీవ్రంగా చిత్రించబడ్డాయి.

**3. రచయితల దృష్టిలో రాయలసీమ స్త్రీ :**

ఈ ప్రాంత రచయితలు స్త్రీని "అబల"గా కాకుండా "సబల"గా, కష్టాలను ఎదిరించే "మట్టి మనిషి"గా చిత్రించారు.

**సింగమనేని నారాయణ - రైతు స్త్రీ :**

అనంతపురం కరువును, రైతుల ఆత్మహత్యలను తన నవలల్లో (ఉదా:'అనంతం', 'జ్వాల') చిత్రించిన సింగమనేని, ఆ రైతు కుటుంబాలలోని స్త్రీల పాత్రను అద్భుతంగా మలిచారు.

రైతు ఆత్మహత్య చేసుకుంటే, ఆ తర్వాత ఆ కుటుంబం చిన్నాభిన్నం కాకుండా కాపాడేది ఆ ఇంటి ఇల్లాలు మాత్రమే. అప్పుల వాళ్ళ వేధింపులను తట్టుకుని, పిల్లలను చదివించి, వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లే "ధైర్యలక్ష్మి"గా ఆమెను సింగమనేని చూపించారు.

**మధురాంతకం నరేంద్ర - అస్తిత్వ పోరాటం :**

చిత్తూరు జిల్లా, అందునా కుప్పం, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల మాండలికంలో, అక్కడి మధ్యతరగతి మరియు గ్రామీణ జీవితాలను మధురాంతకం నరేంద్ర తన నవలల్లో ఆవిష్కరించారు.

**మానసిక విశ్లేషణ :**

వీరి నవలల్లో స్త్రీలు కేవలం కష్టజీవులే కాదు, వారికి బలమైన ఆలోచనలు, వ్యక్తిత్వం ఉంటాయి. సంప్ర దాయం పేరుతో స్త్రీపై జరిగే అణచివేతను వీరు సున్నితంగా ప్రశ్నిస్తారు. ముఖ్యంగా విద్యావంతులైన స్త్రీలు కుటుంబంలో ఎదుర్కొనే ఒత్తిడిని వీరు చిత్రించారు.

**'మనోధర్మ పరాగం' :**

ఈ నవలలో ద్రౌపది ఇతివృత్తం ద్వారా, ఆధునిక స్త్రీ తన అస్తిత్వం కోసం చేసే పోరాటాన్ని అద్భుతంగా వర్ణించారు.

**స్వామి - గిరిజన/బంజారా స్త్రీలు :**

రాయలసీమ ప్రాంతంలో (ముఖ్యంగా అనంతపురం, కర్నూలు) బంజారా (లంబాడీ) తండాలు ఎక్కువ. స్వామి గారు రాసిన 'గద్దలాడ తండ' వంటి నవలల్లో గిరిజన స్త్రీల జీవితం, వారిపై అటవీ శాఖ అధికారుల, భూస్వాముల దౌర్జన్యాలు, వాటిని ఆ స్త్రీలు ఎదుర్కొనే తీరు కళ్ళకు కట్టినట్లు ఉంటుంది.

రాయలసీమ నవలల్లోని స్త్రీ పాత్రలు కల్పితాలు కావు, అవి ఈ నేల నుండి పుట్టిన నిజాలు. కరువు వారిని కృంగదీయలేదు, వలసలు వారిని ఓడించలేదు. రాయల సీమ స్త్రీ "ఓపిక"కు మారుపేరు మాత్రమే కాదు, "పోరాటా నికి" ప్రతీక కూడా. మగవాడు లేని లోటును భర్తీ చేస్తూ, సమాజంతో ఒంటరి పోరాటం చేస్తున్న రాయలసీమ స్త్రీల జీవితాలను ఈ నవలలు చరిత్రలో శాశ్వతం చేశాయి.

**9. సమకాలీన అంశాలు – ప్రపంచీకరణ ప్రభావం :**

1990 తర్వాత వచ్చిన ప్రపంచీకరణ స్త్రీ జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. సాఫ్ట్‌వేర్ రంగం, కాల్ సెంటర్లు స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛను ఇచ్చాయి. కానీ, అదే సమయంలో "బ్యూటీ కాంటెస్ట్‌లు", "వస్తు వినియోగ సంస్కృతి" స్త్రీని ఒక భోగ వస్తువుగా మార్చాయి. ఈ వైరుధ్యాలను సమకాలీన నవలలు చర్చిస్తున్నాయి. "లివ్-ఇన్ రిలేషన్షిప్", "సరోగసి" (అద్దె గర్భం) వంటి కొత్త అంశాలు నవలల్లో చోటు చేసుకున్నాయి.

**10. ముగింపు :**

తెలుగు నవల ప్రస్థానం స్త్రీ చైతన్య ప్రస్థానం. 1878లో కందుకూరి వీరేశలింగం గారి రాజశేఖర చరిత్రము నుండి నేటి ఓల్గా, సత్యవతి గారి నవలల వరకు జరిగిన ప్రయాణం స్త్రీ వికాసానికి నిలువుటద్దం.

1. విద్య : అక్షరం రాని స్థితి నుండి అత్యున్నత విద్య వరకు.
2. వివాహం : బాల్య వివాహాల నుండి స్వయంవరం, సహజీవనం వరకు.
3. ఆర్థికం : వంటింటి నుండి అంతరిక్షం వరకు.
4. అస్తిత్వం : పరాధీనత నుండి స్వయం నిర్ణయాధికారం వరకు.

ఈ మార్పులన్నీ తెలుగు నవలల్లో రికార్డు చేయబడ్డాయి. అయితే, ఇప్పటికీ స్త్రీలపై హింస, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. చట్టాలు మారినా, మనుషుల దృక్పథం పూర్తిగా మారలేదు. ఈ మార్పును త్వరితం చేయడంలో భవిష్యత్తు నవలలు మరింత కీలక పాత్ర పోషించాల్సి ఉంది.

**ఉపయుక్త గ్రంథ సూచి (References) :**

1. ముదిగొండ శివప్రసాద్ - తెలుగు నవలా వికాసం.
2. ఓల్గా - రాజకీయ కథలు - ముందుమాటలు మరియు మాకు గోడలు లేవు.
3. కాత్యాయనీ విద్మహే - మహిళావరణం - స్త్రీవాద సాహిత్యం.
4. మృణాళిని - తెలుగు నవల - స్త్రీ చైతన్యం.
5. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - నవలా శిల్పం.
6. యోజన, మూసీ, విపులవంటి పత్రికలలో వచ్చిన వివిధ సాహిత్య వ్యాసాలు.

❖❖❖

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# వెనుదిరగని వెన్నెల - వస్తు విశ్లేషణ

- డా॥. వి. వింధ్యవాసినీదేవి
తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పు), క్లస్టర్ విశ్వవిద్యాలయం, కర్నూలు.

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి 97 వ ప్రచురణగా వెలువరించిన నవల “వెనుదిరగని వెన్నెల”. రచయిత్రి డా. కె. గీతామాధవిగారు. తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గంపేటలో జన్మించిన డా. కె.గీతామాధవి గారు కవయిత్రి, గాయని, రచయిత్రి, భాషా నిపుణురాలుగా సాహితీలోకంలో చిరపరిచితులు. ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి కె. వరలక్ష్మిగారి కుమార్తె. అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడిన వీరు మాతృభాషా, సాహిత్య,సంస్కృతుల పట్ల అవ్యాజమైన మమకారాన్ని కలిగి ఉండి వారి ప్రతి రచనలోను తెలుగుదనాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తున్నారు. ద్రవభాష(2001), శీత సుమాలు (2006), శతాబ్ది వెన్నెల (2013), సెలయేటి దివిటీ(2017), అసింట (2022) మొదలైన కవితా సంపుటాలు. సిలికాన్ లోయ సాక్షిగా (2018), కథా సంపుటి గీతాకాలం, అనగనగా అమెరికా, నా కళ్ళతో అమెరికా, యాత్రాగీతం, ట్రావెలాగ్స్, కంప్యూటర్ భాషగా తెలుగు మొదలైన భాషాపరిశోధనా వ్యాసాలు వీరి రచనలు. ‘వెనుదిరగని వెన్నెల’ నవల జనవరి 2015 నుండి డిసెంబర్ 2020 వరకు ఆరు సంవత్సరాలు 72 నెలల పాటు కౌముది అంతర్జాల పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. ఈ పత్రికలో ప్రచురితమవుతున్నపుడే అశేష పాఠకాదరణ పొంది, సెప్టెంబరు 2021 లో పుస్తకరూపంలో వెలువడి, అమెరికా తెలుగు సాహితీ సదస్సులో ఆవిష్కరించబడింది.

‘వెనుదిరగని వెన్నెల’ నవలా శీర్షికలో సానుకూల దృక్పథం గోచరమవుతున్నట్లుగానే, నవలలోని కథావస్తువు కూడా ఆశావహ ఆలోచనలకు వేదికగా నిలబడి సంపూర్ణంగా నామౌచిత్యాన్ని కలిగి ఉంది. నవలలోని కథావస్తువు సమకాలీన సమాజానికి దర్పణం పడితుంది. నవలాకథనంలో 4, 5 దశాబ్దాల సామాజిక పరిణామాలను చిత్రించారు రచయిత్రి. ఉత్తరాలు రాసుకునే దశ నుండి గూగుల్ మ్యాపులో ఇంటి చిరునామాలను గుర్తించే దశ వరకు సమాజంలో చోటుచేసుకున్న ఎన్నో పరిణామాలను ఒడుపుగా చిత్రించారు. మానవ మనస్తత్వాలు, బంధాలు, బంధుత్వాలలో పైకి కనిపించని లసగులు, స్నేహం ముసుగులో కనిపించే అవకాశవాదం, ఛిద్రమవుతున్న కుటుంబవిలువలు, కుటుంబ హింస, విలువల పతనం ఇలా అనేకాంశాలను ఈ నవల ప్రతిబింబించింది. సవాళ్ళమయమైన ఈ సమాజంలో ఒంటరి మహిళ జీవన ప్రయాణం, బతుకు సంఘర్షణ నేపథ్యంమే ప్రధానాంశం. నవల ముందుమాటలో (ఆమె వెన్నెల..ఆమె వెనిదిరగని వెన్నెల..ఆమె శుక్లపక్ష క్రౌన్నెల)నాగరాజు రామస్వామిగారు

" మెలికలు తిరుగుతున్న సర్పిలమార్గంలో మొక్కవోని ధైర్యంతో అడుగు ముందుకు వేస్తూ, పర్వతారోహణం చేస్తూ శిఖరాన్ని చేరుకున్న ఒక సామాన్య తెలుగింటి ఆడబిడ్డ ఆత్మకథ" అంటారు. 'వాస్తవజీవిత వర్ణచిత్రం' శీర్షికతో ముందుమాట రాసిన ఓల్గాగారు 'ఉపన్యాసాలు, బోధనలు లేకుండా జీవితంలో జరిగే సంఘటనలను చిన్న చిన్న వివరాలతో రాసుకుంటూ వెళ్ళింది రచయిత్రి.... భావుకతా, వాస్తవజీవితంలో వాస్తవంగా జరిగే కఠినమైన పరీక్షలు - రెండూ సమపాళ్ళలో ఉంచడంలో కె.గీత విజయం సాధించారనే చెప్పాలి. ఏ పాత్రా అసహజంగా లేకపోవడం, క్యారికేచర్‌లా లేకపోవటం ఈ నవలలోని మరొక మంచి లక్షణం. పాత్రలన్నిటికీ బలాలు, బల హీనతలు ఉన్నాయి. అందువల్ల మన మధ్య తిరిగే మామూలు మనుషుల్లానే అనిపిస్తారు తప్ప అతీత మానవుల్లా కనిపింరు." (పుట:6) అంటారు.

**వస్తు విశ్లేషణ :**

కష్టాల సుడిగుండంలో చిక్కి మునిగిపోతున్న జీవిత నౌకను ఒడ్డుకు చేర్చుకున్న మహిళ కథనే ఈనవల ఇతివృత్తం. జీవితంలోని ముఖ్యదశలన్నింటిలోను, సమస్యలు వెనక్కి లాగుతున్నా, ఎక్కడా అనుకూల వాతావరణం లేకపోయినా జీవితాన్ని గెలిచి చూపించిన నవలానాయిక పాత్ర ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. చిన్న చిన్న సమస్యలకే జీవితం నుండి పారిపోదామని ప్రయత్నించే వాళ్ళందరికీ బతకడానికి కావలసిన ప్రేరణను, స్ఫూర్తినందిస్తుంది ఈ నవలానాయిక తన్మయి. తన్మయి జీవితంలో ప్రవేశించిన అనివార్య సంబంధ, బాంధవ్యాలను ఎదిరించి, పోరాడి ఒక బంధాన్ని వది లించుకొని, తనను వెతుక్కుంటూ వచ్చిన మరో బంధాన్ని దూరం చేసుకోకుండా సంయమనంతో జీవితాన్ని చెక్కిన శిల్పంగా రూపొందించుకున్న తీరు ఆదర్శప్రాయం. అభినందనీయం, ఆలోచనాత్మకం, అనుసరణీయం.

దిగువ మధ్యతరగతి కుటుంబంలో పల్లెకు, పట్టణా నికి మధ్యస్తంగా ఉన్న పల్లెలో పుట్టి పెరిగిన అమ్మాయి తన్నయి. తన జీవితంలో ఎదురైన అనేకానేక అవరోధా లను దాటుకుంటూ, అమెరికాలో స్థిరపడేంత వరకు ఆమె సాగించిన బతుకుపోరాటం నవలలో ప్రధాన వస్తువు. చదువు పట్ల ఆమెకున్న ఇష్టం ఆమెజీవితనౌకకు చుక్కాని వంటిది.చదువే ఆమెకు దారిదీపమై వెలుగునిస్తుంది. ఆ వెలుగులోనే ఆమె జీవితాన్ని చక్కదిద్దుకుంటుంది.

తన్మయి ఒక సాధారణ ఆడపిల్ల. సగటు అమ్మాయి లందరిలాగే అందమైన వైవాహిక జీవితం, భర్త, పిల్లలు, కుటుంబం వంటి కలలు కంటుంది. ఆమెను ప్రేమ పేరుతో కట్టిపడేసి రంగుల ప్రపంచాన్ని ఆమె కళ్ళముందు నిలిపి ఆమెను పెళ్ళి చేసుకుంటాడు శేఖర్. పెళ్లి తర్వాత అతని అసలు రంగు బయటపడి తన్మయి జీవితం ఆటుపోటులకు గురౌతుంది. ఆమెను కాకుండా ఆమె సంపదను చూసి ప్రేమించిన శేఖర్, అతని కుటుంబ సభ్యుల వలన ఆమె ప్రమేయం లేకుండానే ఆమె జీవితంలో చీకట్లు ముసురుకుంటాయి. అటువంటి పరిస్థితుల్లోనూ వారిలో మార్పును ఆశిస్తూ కష్టమైనా ఉన్నత చదువులు అభ్యసిస్తుంది. ఎంత సంయమనం పాటించినా చివరకు భర్త, అత్తమామల దాష్టికానికి బలైన సమిధగానే మిగిలుతుంది. భర్త, తన నుండి విడాకులు కావాలని కోరినప్పుడు తీవ్ర వేదనకు గురవుతుంది. మార్పురాని మనుషుల మధ్య నుండి విడిపోయి సొంత జీవితాన్ని ప్రారంభిస్తుంది.తను, తన కొడుకే లోకంగా కొత్తజీవితానికి పాదులు వేసుకుంటుంది. ఈ క్రమంలో ఆమె ఆశయమైన ఉన్నత చదువులే ఆమెకు దారి చూపుతాయి. ఇటు అత్తింటివారు, అటు పుట్టింటి వారు ఇరువురి ఆదరణ కరువైనా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, ఆదరించే స్నేహితుల సహకారంతో, చీకటైన జీవితంలో వెలుగులను ప్రోది చేసుకుంటుంది. నమ్మిన మనుషులు చేసే మోసాలు, వారి కుటిల మనస్తత్వాలు,స్వార్థపూరిత సమాజంలో ఆమె మనసును దృఢపరచుకొని ముందుకు సాగుతుంది.ఈ సమయంలో అమెను ఇష్టపడి ఆమెను తన జీవితంలోకి ఆహ్వానిస్తాడు ప్రభు. ప్రభు ఎంతగా ప్రేమిస్తాడో అతని కుటుంబసభ్యులు అంతగా ద్వేషిస్తారు. జీవితంలో వెన్నెల తిరిగొచ్చిందని సంతోషపడకముందే చీకట్లు కమ్ముకుంటాయి. ప్రభు కుటుంబంలో యుద్ధ వాతావరణంలో జీవితాన్ని వెళ్ళదీయవలసి వస్తుంది.

డాక్టరేటు పట్టా పొంది ప్రభుత్వ అధ్యాపకురాలిగా నిర్వహిస్తున్నప్పటికి కుటుంబజీవితంలోని అపశ్రుతులు చుట్టుముడుతూనే ఉంటాయి. అడుగడుగునా సమస్యలు, ఎదురవుతున్న సంఘర్షణలు, మానసిక ఒత్తుడులు కూడా తట్టుకుంటూ తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ ముందడుగు వేస్తూనే ఉంటుంది. ఎక్కడా వెనితిరగక సాగించే ముళ్ళబాట మీది ప్రయాణంలో ప్రభుకి అమెరికాలో ఉద్యోగం రావడంతో అతనితో పాటూ అమెరికా వెళ్లిన ఆమె జీవితమార్గంలో తిరిగి వెన్నెల ప్రవేశిస్తుంది. సమస్యల వలయాలను చేదించుకొని సాగించిన ఆమె జీవితప్రయాణం ఎందరికో దారి చూపుతుంది.

నవలలో కథానాయిక తన్మయి పాత్ర ద్వారా వైవాహిక జీవితం విఫలమైన మహిళల సామాజిక ,ఆర్థిక పరిస్థితిని, ఒంటరిజీవితంలో వారి మానసికస్థితిని కళ్ళకు కట్టించారు రచయిత్రి. భావుకత్వం, అమాయకత్వం, సున్నితత్వం కలగలిసిన సగటు అమ్మాయి తన్మయి. జీవితాన్ని అందమైన పూలతోటలా భావించేతత్వం ఆమెది. అయితే వివాహం విషయంలో ఆమె కలలు చెదిరి దుర్భర జీవితం అనుభవిస్తుంది.భౌతికంగానే కాకుండా మానసికంగా కూడా ఆమె జీవితం ఆమె అధీనంలో లేని స్థితిని చవిచూస్తుంది.తన జీవితంతన చేతుల్లో లేకుండా పరాధీనమవడాన్ని గ్రహించినా, ఏమీ చేయులేని అశక్తురాలవుతుంది. ఆమె అభిప్రాయాలు, ఆలోచనలు, ఆశలు,ఆశయాలు అన్నీ ఆవిరైనా, అత్తింటివారి వేధింపులు, పుట్టింటివారి నిస్సహాయత, భర్త శేఖర్ పెట్టే లైంగిక హింస ఇలా అన్నింటిని తట్టుకొని, తనలోని ధైర్యమే తన బలంగా మార్చుకోవడం ఆమె విజయానికి తొలి పునాదిగా నిలుస్తుంది. “దేనికీ తక్షణ పరిష్కారాలు కనుచూపుమేరలో లేవు. అసలు ఉన్నాయో లేవో కూడా తెలియదు. అయినా మన కలలు సాకారమయ్యే ఒకరోజు వస్తుంది నాన్న. నువ్వు జీవితంలో రెండు వదలకూడదు. ఒకటి ఈ అమ్మని, రెండు మంచి జీవితమ్మీద ఆశని. మొదటిది నువ్వు చెయ్యి, రెండోది నేను సంపాదించి పెడతాను' అంది ఒళ్ళో మోకాళ్ళ మీద ఎదురుగా పడుకోబెట్టుకున్న బాబు కళ్ళలోకి చూస్తూ.”(పుట:113) నిస్సహాయ పరిస్థితిలోనూ తన్మయి ఆలోచనలు ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తాయి.

జీవితం నేర్పిన పాఠాలతో భావుకత నుండి ప్రాక్టికాలిటి వైపు మారిన తన్మయి తనను తాను పునర్నిర్మించుకోవడం నవల రెండో భాగంలో కనిపిస్తుంది. ఆమె జీవితం చీకటిలోంచి వెలుతురులోకి ప్రయాణించడానికి తోడ్పడింది చదువుపట్ల ఆమెకున్న మక్కువ. చిన్నప్పటి నుండి చదువంటే విపరీతమైన తపన. పెద్ద చదువులు చదవాలనీ, పరిశోధన చేయాలని, ఏనాటికైనా డాక్టరేట్ పట్టా సాధించాలన్న సంకల్పమే ఆమె జీవితానికి ఆసరాగా నిలుస్తుంది. తన చుట్టూ ఉన్న సంక్లిష్ట పరిస్థితులను చక్కదిద్దుకోవడానికి, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, సంక్షోభాలతో కూడిన సంఘర్షణ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి చదువును ప్రధాన సాధనంగా మార్చుకుంటుంది తన్మయి. చంటిబిడ్డను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటూ, తనకు,తన బిడ్డకు మంచి జీవితం కోసం అహర్నిశలు కష్టపడుతుంది. కుటుంబం, సమాజం నుండి ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యమే ఆయుధంగా ముందుకు సాగుతుంది. “అపజయాల మీద నుంచి పడుతూ, లేస్తూ నడిచొచ్చిన విజయాలు. అడుగడుగునా అవరోధాలు, తన కన్నీళ్ళు తనే తుడుచుకొని, తన గాయాలకు తనే చికిత్స చేసుకుని, ముందుకు నడిచిన సైనికురాలు. తనే సైన్యం,ధైర్యం (పుట:273) చెప్పుకుంటూ నడిచిన తన్మయిని ఒక మార్గదర్శకురాలిగా, ఆదర్శప్రాయురాలుగా తీర్చిదిద్దారు కె. గీతగారు. సున్నిత మనస్తత్వం గల ఒక స్త్రీ చదువు సాయంతో అంచెలంచెలుగా ఎదిగిన క్రమాన్ని రచయిత్రి ఎంతో సమర్థవంతంగా చిత్రించారు. సార్వకాలీనత కలిగిన పాత్రగా తన్మయిని తీర్చిదిద్దారు. “ కాలం అన్ని సమయాల్లోనూ ఒకేలా ఉండదనడానికి నీ జీవితమే ఉదాహరణ. సమస్యలు వచ్చినపుడు ' ఆ రోజుతో జీవితం ఆఖరయిపోతుందని, ఇక భవిష్యత్తు లేదేమో' అని జీవితాన్ని అంతం చేసుకోవాలనుకునే వాళ్ళు తెలుసుకోవలసిన గాథ. కాలం గాయాల్ని మాన్పడమే కాదు,సమస్యల్ని కూడా

పర్కిరిస్తుందని నిరూపించావు. కష్టాల్ని ఎదిరించి, చక్కగా నీ కాళ్ళమీద నువ్వు నిలబడ్డావు. నువ్వు ఎందరికో స్ఫూర్తిదాయకం. (పుట : 301) అని స్నేహితుల చేత అనిపించుకుంటూ తన్మయి తనకు కావలసినది తాను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది.

నవల మూడవభాగంలో తన్మయి జీవితం మరో మలుపు తిరుగుతుంది. దుర్మార్గ మనస్తత్వం గల భర్త శేఖర్ నుండి విడిపోయిన తన్మయి ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తన జీవితాన్ని తాను ఆవిష్కరించుకుంటున్న సమయంలో చిన్ననాటి స్నేహితుడు ప్రభు ఆమెను ఇష్టపడతాడు. ఆమెకు అండగా నిలబడతాడు. తనకు దగ్గరవుతున్న ప్రభును మొదట అంగీకరించకపోయినా క్రమేనా అతని ప్రేమను అర్థం చేసుకుంటుంది. అతనితో ఏడడుగుల జీవితానికి సిద్ధపడుతుంది. రెండవ పెళ్ళి చేసుకుంటే హర్షించని సమాజాన్ని పక్కనపెట్టి తన జీవితానికేం కావాలో తను నిర్ణయించుకోగలిగిన సాధికార మహిళగా తన్మయి పాత్రను చిత్రించారు రచయిత్రి కె.గీత. ప్రభు తన్మయిని ఇష్టపడి పెళ్లి చేసుకున్నా అతని కుటుంబం మాత్రం తన్మయిని అంగీకరించదు. అ కారణంగా ద్వేషం చూపుతారు. అయితే ఆర్థికంగా బలహీనంగా ఉన్న ప్రభు కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది తన్మయి. క్రమేనా వారి అవసరాలు తన్మయి బాధ్యతగా నెరవేర్చడంతో కొంత ఉపశమనం లభిస్తుంది. ప్రభుకి విదేశంలో ఉద్యోగం వచ్చిన తర్వాత తన్మయి జీవితం మారుతుంది. ప్రభుతో కలిసి అమెరికా వెళ్ళడమంటే జీవితాన్ని మళ్ళీ పున్ణప్రారంభించడమే అనుకొని, అయినా వెనుతిరగకుండా ముందుకు అడుగు వెయ్యడానికే నిర్ణయించుకుంటుంది తన్మయి. ఈ నిర్ణయమే ఆమె జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. వెనుతిరగి చూడాల్సిన అవసరం లేని ఆనందాన్ని సొంతం చేసుకుంటుంది తన్మయి.

రచయిత్రి కె. గీత నవల ముందుమాటలో " ఈ కథలో తన్మయికి కుటుంబమే బలమూ, బలహీనతా కూడా. ఆ బలంతోనే ఆమె ఉన్నతశిఖరాలకు ఎదుగుతుంది. ఆ బలహీనతతోనే అనేక బాధల్ని అనుభవిస్తుంది." (పుట:13) అంటారు. బలాన్ని బలహీనతలను సమంగా స్వీకరిస్తూ జీవితాన్ని చక్కబరచుకోవడంలోనే తన్మయి విజయం దాగుంది. జీవితం పూలపాన్పు కాదు, ముళ్ల కంచే కాదు. పూలతో పాటూ ముళ్లు, ముళ్లలో వికసించే పూవు వంటిది మనిషి జీవితం. ఈ సూత్రాన్ని అర్థం చేసుకొన్న తన్మయిజీవితాన్ని నందననవం చేసుకుంటుంది. ఆధునిక కాలంలో స్త్రీ సాధికారత వైపు అడుగులు వేస్తుంది. ఆ గమనంలో ఎదురయ్యే ఎత్తు పల్లాలను సరిచేసుకుంటూ, తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ స్వావలంబన దిశగా అడుగేయాల్సిన ఆవశ్యకతను తన్మయి పాత్ర ద్వారా సమాజానికి చాటి చెప్పారు రచయిత్రి కె.గీత.

**ముగింపు :**

నవలలో రచయిత్రి ఎంపికచేసుకున్న కథావస్తువు వాస్తవ జీవిత ప్రతిబింబం. ఎందరో ఒంటరి మహిళల పోరాట జీవితాలకు ఈ నవల అద్దం పడుతుంది. మహిళల మనస్తత్వాన్ని, సామర్థ్యాన్ని, పోరాట తత్వాన్ని సమర్థవంతంగా చాటుతుంది రచయిత్రి. మహిళ మానసిక శక్తి ముందు ఏ సమస్యలైనా గడ్డిపరకలుగా మారతాయని, అంతటి సంకల్పశక్తిని నేటి మహిళ సంతరించుకోవాలని రచయిత్రి ఉవాచ. నేటికాలంలో సాధికారత దిశగా పయనించే మహిళ. సమస్యల అలలకు బెదరకుండా లంగకుండా నడిసంద్రంలోనావ లాంటి జీవన ప్రయాణంలో సైతం చెరగని ఆత్మవిశ్వాసమే ఆలంబనగా ముందుకు ప్రయాణించాలన్న సూచనను వ్యక్తం చేశారు రచయిత్రి. జీవితంలో ఒడిదుడుకులకు భయపడుతూ, సమాజానికి తలవంచుతూ వ్యక్తిగతజీవితాన్ని చేజార్చుకోకూడదన్న సందేశంతో నవల ముగుస్తుంది. జీవితంలో సమస్యలు సహజం. సమస్యలు ఎదురైనప్పుడు పోరాడి గెలవాలన్న తీర్పును అందించారు ఈ నవల ద్వారా రచయిత్రి డా. కె.గీత.

**ఆధారగ్రంథాలు :**


1. డా.కె. గీతా వెనుతిరగని వెన్నెల
2. డా. సి. మృణాళిని - సాంఘిక నవల - కథన శిల్పం,
3. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - నవలా శిల్పం


❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'ప్రజల మనిషి' నవల – సామాజిక చిత్రణ

– డా॥. కట్టా సుబ్బారావు
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కార్వేటినగరం.

**ఉపోద్ఘాతం :**

నిజాం నిరుంకుశ పాలన నుండి తెలంగాణా ప్రజలను విముక్తి చేయడానికి తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్గించడానికి కృషి చేసిన గొప్ప రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. తన జీవితంలో అనేక కష్టనష్టాలకోర్చి నిజాంకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడిన గొప్ప యోధుడు. అంతటి మహానుభావుడ్ని గురించి దాశరథి కృష్ణమాచార్యులు తన 'అగ్నిధార'ను అంకితమిస్తూ ఇలా ప్రస్తుతించారు.

"ఆశ్రయింపు లెరుగనివాడు
విశ్రాంతి తెలియనివాడు
స్వసుఖం కోరనివాడు
వారం వారం మారనివాడు
రంగులద్దుకోలేనివాడు
అతనిదే సార్థకమైన జీవితం
అతనికి అగ్నిధార అంకితం"

ప్రజల మనిషి 1938లో తెలంగాణా స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావానికి ముందు తెలంగాణా సామాజిక స్థితిగతులను చిత్రించిన తెలంగాణా తొలి నవల. నిజామాబాద్, కామారెడ్డి సమీపాన వున్న దిమ్మగూడెం గ్రామం ఈ నవలకు భూమిక. "ప్రజల మనిషి కథ అతి పల్చని పొర! ఉద్యమం కోసం అల్లిన చిన్నకథ. ఇది ఉద్యమ నవల మాత్రమే కాదు. సాంఘిక చరిత్ర, నాటి అమలిన జీవితాన్ని, ప్రేమలు, ఆప్యాయతలు, వేదనలను అతి సున్నితంగా, ఆర్ద్రంగా చిత్రించారు. ఇది నెత్తుటి మరకలేని నవల! ఆళ్వారుస్వామి అహింసా కమ్యూనిస్టు." అని దాశరథి రంగాచార్యులు వ్యాఖ్యానించడం ఈ నవల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. ఈ నవలలో అంతర్లీనంగా కనిపించే సామాజిక స్థితిగతులను గురించి వివరంగా తెలుసుకుందాం.

**గ్రామీణ జీవితం :**

దిమ్మగూడెం గ్రామానికి పట్వారీ రామభూపాల్‌రావు. దొరతనాన్ని రామభూపాల్‌రావు తన తండ్రి భుజంగరావు నుండి వారసత్వంగా పొందాడు. భుజంగరావు తన మంచి మనసుతో ఆవూరి ప్రజల మన్ననలు పొందగా రామ భూపాల్‌రావు తన వికృత చేష్టలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తాడు. రామభూపాల్‌రావు గడీ పాలన గురించి ఆర్య సమాజీకుడు విజయదేవు ఇలా అంటాడు. "ఈ ఊరిలో రామభూపాల్‌రావు గారు నందంటే నంది పందంటే పంది. ఆయన ఇష్టులు తప్ప వేరేవాండ్లు, తలెత్తుకొని తిరగడము అసాధ్యము. ప్రజలు పండించే పంట, పిండేపాలు, సమకూర్చే నెయ్యి, పాతము చేసిన

భూమి, పెంచబడు పశువులు, అందమైన స్త్రీలు అన్నింటిపై రామభూపాల్‌రావు గారి లేక అతని తొత్తుల కన్నుంటుంది. ఎప్పుడు వశము చేసుకుందామని ఆలోచిస్తుంటారు. కొద్దిలో చెప్పాలంటే అందరూ బానిస లుగా బ్రతుకుతున్నారు.''

రామభూపాల్‌రావు తన కూతుర్ని అత్తారింటికి పంపే క్రమంలో ఆవును అరణంగా పంపాల్సివస్తే, కోటయ్యను తన ఆవును ఇమ్మంటాడు. చేసేదేమీలేక కోటయ్య తన ఆవును దొర బిడ్డతో పంపుతాడు. కోటయ్య కొడుకు కొమరయ్య దొర అన్యాయాన్ని పదే పదే గుర్తు చేస్తే ''నీకెందుకురా ఈ తిప్పలంతా! కన్నబిడ్డనే ఇంకో అయ్యకిచ్చి రోజులు గడపడం లేదు? ఇక గొడ్డు కొచ్చింది'' అని కోటయ్య అనడం గ్రామీణ జీవితంలోని ఓ రైతు అసక్తతను తెలియజేస్తుంది.

రఘునాథాచార్యులు ఆవూరి బ్రాహ్మణుడు. భుజంగ రావు బ్రతికున్నపుడు రఘునాథాచార్యుల ప్రతిభను మిక్కిలి కొనియాడి కొంతభూమిని దానంగా ఇస్తాడు. దాంట్లో వ్యవసాయం చేసుకుంటూ కాలం గడుపు తుంటాడు. భుజంగరావు మరణించిన తరువాత రామ భూపాల్ రావు వ్యావహారిశైలి రఘునాథాచార్యులకు ఏ మాత్రం నచ్చదు. రామభూపాల్‌రావు తన కూతురి పెండ్లి సమయంలో రఘునాథాచార్యులతో వచ్చిన చిన్న మాట పట్టింపు వల్ల తన తండ్రి దానంగా ఇచ్చిన భూమిని వెనక్కి తీసుకుంటాడు. దీంతో రఘునాథాచార్యులు బతుకు దెరువు కోసం దేశాటన చేయాల్సి వస్తుంది.

ఎప్పుడో ఊరు విడిచి వెళ్ళిన ఓ బ్రాహ్మడి భూమిని కోటయ్య కుటుంబం సాగు చేసుకుంటూ జీవిస్తుంటుంది. ఆ భూమిపై రామాభూపాల్‌రావు కన్ను పడుతుంది. అనుకున్నదే తడువుగా తహసీలులో వెంకటాచారి చేత అబద్ధపు సాక్ష్యం చెప్పించి కోటయ్య భూమిని తన వశం చేసుకుంటాడు. ఇలా ఆ వూరిలో రామభూపాల్‌రావు తిరుగులేని అధికారాన్ని చెలాయిస్తూ, తన పెత్తందారీ పోకడంతో ప్రజల్ని పీడిస్తూ పచ్చని గ్రామీణ జీవితంలో నిజాం నిరంకుశ పాలనకు ప్రతీకగా నిలుస్తాడు.

**కుటుంబ వ్యవస్థ :**

ఈ నవల ప్రారంభంలో కనిపించే పాత్ర రఘునాథా చార్యులు. పరమ భాగవతోత్తముడు. అతని భార్య ఆండాళమ్మ. వీరికిద్దరు కుమారులు. వెంకటాచారి మరియు కంఠీరవం. రఘునాథాచార్యులు దేశాటన చేసి సంభావనలు స్వీకరిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. వయో భారంతో రఘునాథాచార్యులు మరణించడంతో వెంకటాచారి కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకుంటాడు. కంఠీరవం ఏ పనీ పాటా లేకుండా తిని తిరుగుతున్నాడని తరచూ తన తల్లితో గొడవపడుతుంటాడు. ఒకానొక సమయంలో కన్నతల్లిపై వెంకటారి చేయి చేసుకున్నపుడు కంఠీరం ఎదిరిస్తాడు. దీంతో వెంకటారి కంఠీరవాన్ని ఇంటి నుండి వెళ్ళ గొడతాడు. ఆ సమయంలో ఆండాళమ్మ మనసు ఎంతగానో తల్లడిల్లుతుంది. కంఠీరం నిజామా బాదు వెళ్ళి ప్రయోజకుడైనాడని తెలిసి ఎంతగానో సంతోషిస్తుంది.

ఈ నవలలో కనిపించే మరో ప్రధాన కుటుంబం కోటయ్యది. అన్నమ్మ కోటయ్య భార్య. వీరిది అన్యోన్య దాంపత్యం. వీరికి ఒక్కగానొక్క కొడుకు కొమరయ్య. దిమ్మగూడెంలో రామభూపాల్‌రావు దాష్టీకానికి నలిగి పోయిన కుటుంబం కోటయ్యది. బంగారం లాంటి ఆవును వదులుకుంటాడు. ఆ క్షణంలో తన బతుకు ఇంతేనని తనకు తాను సమాధాన పరచుకున్న సగటు రైతు కోటయ్య. కోటయ్య అకాల మరణంతో కొమరయ్య వారసత్వంగా వచ్చిన భూమిని సాగుచేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటాడు. కానీ రామభూపాల్ రావు కన్ను కొమరయ్య సాగుచేస్తున్న పొలంపై పడడంతో అన్నమ్మ, కొమరయ్యలు రామభూపాల్‌రావును ధైర్యంగా ఎదిరిస్తారు.

నిజామాబాదు నేపథ్యంలో సాగిన మరో కుటుంబం వేదాంతాచార్యులది. ఆయుర్వేద వైద్యులుగా వేదాంతా చార్యులు మంచి పేరు ప్రఖ్యాతులు గడిస్తాడు. అతని భార్య సీతమ్మ. మోహనాచార్యులు వీరి కొడుకు. లోగడ వేదాంతాచార్యులకి రఘునాథాచార్యులతో మంచి స్నేహం ఉండేది. ఆ కారణంగానే అనాథగా మిగిలిన కంఠీరవాన్ని

చేరదీస్తాడు. ఆయుర్వేద వైద్యం నేర్పిస్తాడు. మోహనాచార్యుల సాహచర్యంతో కంఠీరవం ఆలోచనా పరిధి విస్తరిస్తుంది. తదుపరి కాలంలో కంఠీరవం గ్రంథాల యోద్యమ కార్యకర్తగా, ఉద్యమకారుడుగా ఎదగడానికి స్ఫూర్తి వేదాంతాచార్యుల కుటుంబమేనని చెప్పుకోవచ్చు. ఇలా ఈ నవలలో కుటుంబ వ్యవస్థ బలమైన పునాదులపై నిర్మితమై మంచి సమాజ నిర్మాణానికి ఎంతగానో దోహదం చేసిందనే చెప్పుకోవచ్చు.

**గ్రంథాలయోద్యమం :**

నిజాం పరిపాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో చైతన్యం లేక పోవడమేనని ప్రగతి కాముకులు గ్రహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా గ్రంథాల యోద్యమం అంతర్లీనంగా సాగింది. ఇందుకు తెలంగాణ సమాజం మినహాయింపు కాదు. ఊరూరా గ్రంథాలయాల్ని స్థాపించడం దేశమంతటా ఒక ఉద్యమ స్ఫూర్తిగా కొనసాగింది. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నవలలోని కంఠీరవం అటువంటివాడే. నిజామాబాదు చేరుకున్న కంఠీరవం అక్కడి వివేక వర్ధిని గ్రంథాలయాన్ని సందర్శిస్తాడు. గాంధీజీ రాసిన సత్యశోధన లాంటి పుస్తకాలు కంఠీరవాన్ని ఆలోచింపజేస్తాయి. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తాడు. అందుకు గుర్తింపుగా కంఠీరవం గ్రంథాలయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైతాడు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా గ్రంథాలయ వార్షికోత్సవాన్ని నిర్వహించి అందరి ప్రసంశల్ని అందుకుంటాడు.

ఈ సందర్భంగా కంఠీరవం "మేము తల పెట్టిన సభగాని, నిర్వహించుతున్న గ్రంథాలయముగాని రాజకీయాశయము. లక్ష్యము లేక కేవలం విజ్ఞాన వికాసమునకు వీలు కలిగించాలని మాత్రమే ఉద్దేశించబడింది. విజ్ఞాన వికాసము కలిగి వివేకవంతులైన ప్రజలుండటం ప్రతి ప్రభుత్వము గర్వించుటకును, ఆ దేశము ప్రతిష్ట పొందుటకును కారణాలవుతాయి. ప్రజలపై అవిశ్వాసముతో ప్రభుత్వ మున్నదంటే దానికి ప్రధాన కారణం ప్రభుత్వం తనలో వున్న ఏదో లోపాన్ని గ్రహించి భయపడుతున్నదన్న మాట. అట్టి లోపాన్ని తొలగించుకొనుట వివేకమనిపించు కొనునుగాని, తన తప్పులను కప్పిపుచ్చుకొనుటకు ప్రజలను నిందితులుగా తలచుట అన్యాయం, ప్రమాదకరము" అన్న మాటలు సభికుల్ని ఆలోచింపచేస్తాయి.

కంఠీరవం ప్రోద్భలంతో పరందామయ్య దిమ్మ గూడెంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తాడు. అక్కడి ప్రజల్ని చైతన్యవంతం చేయడంతో గ్రంథాలయం ప్రధానకేంద్రంగా పనిచేస్తుంది. ఆ చైతన్యంతోనే దిమ్మగూడెం ప్రజలు రామభూపాల్‌రావు గడీ పాలనకు చరమగీతం పాడతారు.

**మతమార్పిడి :**

అంజుమన్ ఇత్తెహాదుల్ముసల్మీన్ అధ్వర్యంలో అట్టడుగు వర్గాలను మహమ్మదీయులుగా మార్చడంలో గ్రామీణ జీవితం అతలాకుతులం అవుతున్న రోజులవి. ఈ పరిణామం దిమ్మగూడెంలో రామభూపాల్‌రావును ఆలోచనలో పడేస్తాయి. అందుకు తగ్గట్టుగానే తన గుమస్తా హైదరాలీ ప్రవర్తన రామభూపాల్‌రావుకి కంటి మీద కునుకు లేకుండా చేసింది. హైదరాలీ అల్లుడు నిజామాబాదులో అంజుమన్ నాయకుడు. అతని ప్రోద్భలంతో దిమ్మెగూడెంలో మతమార్పిడి కార్యక్రమానికి పూనుకుంటాడు. ప్రతిరోజు హైదరాలీ చావడి ముందర కూర్చొని దళితులతో సానుభూతిగా మాట్లాడేవాడు. భగవంతుడు దళితులకు మేలు చేయబోతున్నాడని, అందుకు తగినట్లుగానే పేదలకు భూములు, చదువుకున్నోళ్ళకు ఉద్యోగాలు ప్రభుత్వం ఇస్తుందని నమ్మబలికాడు. దీంతో గ్రామంలో మతమార్పిడి కార్యక్రమానికి రంగం సిద్ధమౌతుంది. ఈ విషయం తెలిసిన కంఠీరవం మతమార్పిడి కార్యక్రమాన్ని అడ్డుకుంటాడు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారిని అడ్డుకున్నందుకు దేశద్రోహం నేరం కింద కంఠీరవాన్ని అరెస్టు చేస్తారు. జైలుపాలవుతాడు. హైదరాలీ ప్రోద్భలంతో మహమ్మదీయులుగా మారిన దళితుల జీవితాలు ఏమాత్రం మారకపోగా, కొత్తగా వచ్చిన సామాజిక హోదా కారణంగా కూలీపనులకు వెళ్ళకపోవడంతో వారి జీవితాలు మరింత దుర్భరంగా మారతాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న రామభూపాల్‌రావు దళితులందరనీ తన గడీకి పిలిపించు

కొని "మీరంతా తొందరపడి తురకలైనారు. అందుకు ఫలితం అనుభవిస్తున్నారు. హైదరలీ మోసం ఇప్పుడైన మీరు గ్రహించి ఉంటారు. మీరెన్ని కష్టాలు పడుతున్నారో నేను ప్రతిరోజు తెలిసికొంటూనే ఉన్నాను. ఉన్న ఊళ్లో పుట్టి పెరిగిన మీరు తిండిలేక అవస్థ పడుతుంటే గ్రామానికి ప్రభువునైన నేను ఎట్లా ఊరుకుంటాను? నేను రైతులకందరికి చెప్పి తిరిగి మీ పనులు, కొలువులు యధాప్రకారం ఇప్పిస్తాను. మీ కేమీ భయంలేదు" అనడం వాళ్ళను ఆలోచనలో పడేస్తాయి. రామభూపాల్ రావు సూచనతో హైదరాబాదు నుండి వచ్చిన ఆర్య సమాజీకుడు జయదేవు వారందరినీ శుద్ధి చేసి హిందువులుగా మారుస్తాడు.

**ప్రజా చైతన్యం :**

కొమరయ్య పొలాన్ని అన్యాయంగా లాక్కొని రామ భూపాల్‌రావు తన అరకలతో దున్నతున్నపుడు అన్నమ్మ వాటికి అడ్డంగా నిలబడి "ఇక దున్నండి. నా ప్రాణం పోయినామానె. ఇప్పుడు భూమి గుంజుకున్నారు. రేపు మెడ పిసికేస్తరు. ఎట్లయినా మావి కుక్క బతుకులే ఎప్పుడో చచ్చేది ఇప్పుడే చస్తా" అనడం ఒక సాధారణ గృహిణిలో వచ్చిన చైతన్యాన్ని మనం గమనించవచ్చు.

మరొపక్క కొమరయ్య తన భూమి విషయమై గట్టిగా ప్రశ్నించినందుకు రామభూపాల్‌రావు కొమరయ్యను గడీలో గుంజకు కట్టి కొరడాతో కొట్టడం సాటి రైతులు కొమరయ్య పట్ల సానుభూతి చూపిస్తారు. అదే సమయంలో రామభూపాల్‌రావు దౌర్జన్యానికి అడ్డుకట్ట వేయాలన్న ఆలోచన మొగ్గ తొడిగింది. సమయం చూసుకొని రైతులు కొమరయ్య భూమిని తనపై ఖానూను చేసుకోవడం అన్యాయమని చెప్పడం, రామభూపాల్‌రావు అధికార దర్పానికి గొడ్డలిపెట్టుగా చెప్పుకోవచ్చు. రామభూపాల్‌రావుకు భయపడి ఊరొదిలి పారిపోయిన కనకయ్య ఊళ్లోకి రాగే అతనికి రావాల్సిన పైకాన్ని ఇప్పించడానికి కాపు రైతులంతా కట్టగట్టుకొని రామభూపాల్‌రావు ఇంటికి వెళ్ళి మర్మగర్భంగా హెచ్చరించడం, రైతుల్లో వచ్చిన చైతన్యానికి మరోమెట్టుగా చెప్పుకోవచ్చు.

నిజామాబాదులో కంఠీరవం స్నేహితుడైన పరందామయ్య దిమ్మగూడెం వచ్చి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తాడు. రాత్రి పాఠశాల, భజన కార్యక్రమాలు నిర్వహిస్తాడు. దీంతో ప్రజల్లో చైతన్యం వస్తుంది. క్రమేణా రామభూపాల్‌రావంటే భయం పోతుంది. ఆ సంవత్సరం రైతులంతా మూకుమ్మడిగా కలిసి చెరువు హర్రాజులో పాల్గొనాలని నిర్ణయించుకుంటారు. కానీ రహస్యంగా గిర్దావరు, వెంకటాద్రి మరియు హైదరాలీ కలిసి రామభూపాల్‌రావు పేర పాటను ముగిస్తారు. రామ భూపాల్‌రావు నాగండ్లు చెరువులో దున్నడానికి రాగానే ఊర్లో కలకలం మొదలవుతుంది. ప్రజలంతా కలిసి నాగండ్లు విప్పివేస్తారు. ప్రజలు సాహసానికి రామ భూపాల్‌రావు ఆశ్చర్యపోతాడు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ విషయమై మెజిస్ట్రేటు విచారణ చేస్తాడు. అసలు విషయం బయటపడటంతో గిర్దావరు ఉద్యోగం ఊడుతుంది. రామభూపాల్‌రావును పట్వారి పదవి నుండి తాత్కాలికంగా తొలగిస్తారు. మరో పక్క కొమరయ్య భూమికి నిజమైన వారసుడు న్యాయవాది వెంకటేశ్వరరావు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. విచారణ పిదప అన్యాయంగా వెంకటేశ్వరరావు భూమిని తనపై ఖానూను చేసుకొన్నందుకు రామభూపాల్‌రావు, దొంగసాక్ష్యం చెప్పినందుకు వెంటాచారి జైలు పాలవుతారు.

**ముగింపు :**

కంఠీరవం కేంద్రం సాగిన ఈ నవలలో అశాంతం నిజాం గడీల పాలనలో మగ్గిపోయిన తెలంగాణా గ్రామీణ ప్రజల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు వట్టికోట ఆళ్వారుస్వామి. అలాగే జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొవాలని, ఉన్నత స్థితికి బాటలు వేసుకొని సమసమాజ నిర్మాణానికి పాటు పడాలన్నదే ఈ నవలా సందేశం.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రజలమనిషి - వట్టికోట ఆళ్వారుస్వామి
2. అగ్నిధార - దాశరథి కృష్ణమాచార్యులు
3. తెలంగాణా విమోచనోద్యమం తెలుగు నవల - వరవరరావు
4. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణశర్మ

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# చలం రచించిన "అమీనా" నవలలో నారీవాద దృక్పథం

- డా॥. ఎస్. గులాబ్ జాన్
తెలుగు అధ్యాపకురాలు, ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరి, అన్నమయ్య జిల్లా.

తెలుగు సాహిత్యంలో ఆధునికతకు, విప్లవాత్మక ఆలోచనలకు ప్రతీకగా నిలిచిన రచయిత చలం (గుడిపాటి వెంకట చలపతి రావు). సంప్రదాయ భావ జాలానికి వ్యతిరేకంగా వ్యక్తి స్వేచ్ఛ, ప్రేమ, స్త్రీ స్వాతంత్ర్యం వంటి అంశాలను ధైర్యంగా ప్రతిపాదించిన రచయితగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. చలం రచించిన "అమీనా" నవల ఈ దృక్పథానికి ప్రతినిధిగా నిలుస్తుంది.

ఈ నవలలో చలం ఒక స్త్రీ జీవితం ద్వారా Patriarchal సమాజం విధించిన కట్టుబాట్లను ప్రశ్నిస్తూ, స్త్రీ వ్యక్తిత్వ స్వాతంత్ర్యాన్ని నారీవాద దృష్టితో ఆవిష్కరిస్తారు. 'అమీనా' నవలలోని కథాంశం, పాత్రచిత్రణ, స్త్రీ చైతన్యం, నారీవాద భావజాలం, సమకాలీన ప్రాసంగికతలను గూర్చి తెలియజేయడమే నా పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం.

చలం సాహిత్యమంతటా స్త్రీని అనుభూతి వస్తువుగా కాకుండా స్వతంత్ర వ్యక్తిత్వం కలిగి మనిషిగా చిత్రించిన తీరు కనిపిస్తుంది. స్త్రీకి ప్రేమించే హక్కు, తన జీవిత నిర్ణయాలు తానే తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్న భావన ఆయన రచనల మూలసూత్రం.

నారీవాదం అనేది కేవలం పురుష వ్యతిరేక భావజాలం కాదు. ఇది స్త్రీకి సమాన హక్కులు, వ్యక్తిత్వ గౌరవం, స్వేచ్ఛ కోరే సిద్ధాంతం. ఈ కోణంలో చూస్తే 'అమీనా' నవల నారీవాద సాహిత్యానికి బలమైన పునాది వేస్తుంది.

'అమీనా' నవల ఒక స్త్రీ అంతర్మథన కథ. సమాజం విధించిన నియమాల మధ్య ఆమె ప్రేమ, స్వేచ్ఛ, వ్యక్తిత్వం కోసం చేసే పోరాటమే కథ యొక్క కేంద్ర బిందువు. అమీనా జీవితం ద్వారా చలం మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను, మత-సామాజిక ఆచారాల ప్రభావాన్ని విశ్లేషిస్తారు.

అమీనా సాధారణంగా కనిపించినా, ఆలోచనల్లో అసాధారణమైన స్త్రీ. ఆమె ప్రశ్నలు సమాజాన్ని ఎదుర్కొంటాయి - "స్త్రీకి తన జీవితంపై హక్కు లేదా?" అన్న ప్రశ్న నవల అంతటా ప్రతిధ్వనిస్తుంది.

అమీనా పాత్ర చలం సృష్టించిన శక్తివంతమైన స్త్రీ పాత్రలలో ఒకటి. ఆమె తన ప్రేమను పాపంగా భావించదు. తన భావోద్వేగాలను అణచివేయాల్సిన అవసరం లేదని నమ్ముతుంది.

ఒక సందర్భంలో అమీనా ఇలా అంటుంది. "నేను అనుభవిస్తున్న భావాలు తప్పైతే, ఈ హృదయాన్ని నాకు ఎందుకు ఇచ్చారు?" ఈ సంభాషణలోనే అమీనా నారీవాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. స్త్రీ భావోద్వే

గాలకు కూడా నైతిక హక్కు ఉందన్న ఆలోచనను చలం బలంగా ప్రతిపాదిస్తారు.

సాంప్రదాయ సమాజంలో స్త్రీ ప్రేమను అనుమానంతో చూస్తారు. కానీ 'అమీనా' నవలలో ప్రేమ ఒక సహజ మానవ అనుభూతిగా చిత్రితమవుతుంది. అమీనా ప్రేమను దాచుకోవాలని కాదు, అర్థం చేసుకోవాలని కోరుతుంది.

"ప్రేమ నా బలహీనత కాదు .. .అది నా జీవితం".

ఒక సందర్భంలో ఆమె తనలో తానే అనుకుంటుంది. ఇక్కడ ప్రేమను బలహీనతగా చూస్యూఫ్తీఋతీఎష్ట్రఝశ్రీ దృష్టిని చలం ప్రశ్నిస్తారు.

నవలలోని పురుష పాత్రలు ఎక్కువగా సంప్రదాయ ఆలోచనలకు ప్రతినిధులు. వారు స్త్రీ స్వేచ్ఛను నైతిక పరిమితుల్లో బంధించాలనుకుంటారు. 'సమాజం ఏమంటుంది?' అనే భయం వారి నిర్ణయాల వెనుక పనిచేస్తుంది.

ఈ పాత్రల ద్వారా చలం సమాజం స్త్రీపై ఎలా అధికారం చలాయిస్తుందో చూపిస్తారు. అమీనా వ్యక్తిత్వం ఈ Patriarchal ఆలోచనలకు ఎదురుదెబ్బగా నిలుస్తుంది.

'అమీనా' నవలలో బాహ్య సంఘటనల కంటే అంతర్గత సంఘర్షణలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అమీనా ప్రేమ - భయం, స్వేచ్ఛ - సంప్రదాయం మధ్య నలిగిపోతూ కూడా తన ఆలోచనలకు నిజాయితీగా ఉండాలని ప్రయత్నిస్తుంది. ఈ మానసిక విశ్లేషణలో చలం ఆధునిక నవలాకారుడిగా తన ప్రతిభను చూపిస్తారు.

నైతికత పేరుతో వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకునే సమాజ ధోరణిని చలం తీవ్రంగా విమర్శిస్తారు. పొరుగు వారు, బంధువులు, పరిచయస్థులు - వీరందరూ సమాజపు తీర్పు స్వభావానికి ప్రతీకలు.

అమీనా జీవితం ఒక వ్యక్తిగత కథగా కాకుండా, సమాజం - వ్యక్తి మధ్య సంఘర్షణగా మారుతుంది.

'అమీనా' నవలలో మతం ఒక కీలక పాత్ర పోషిస్తుంది. మత ఆచారాలు స్త్రీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తాయో చలం సూక్ష్మంగా చూపిస్తారు. మతం పేరుతో స్త్రీపై విధించే ఆంక్షలు ఆమె స్వేచ్ఛను మరింత సంకుచితం చేస్తాయి.

"దేవుడు నాకు హృదయం ఇచ్చాడంటే, దానికి భావాలు ఉండకూడదా?" అమీనా తనలో తాను ప్రశ్నించుకుంటుంది.

ఇక్కడ మతాన్ని వ్యతిరేకించడం కాకుండా, మతాన్ని ఆధారంగా చేసుకుని స్త్రీ స్వేచ్ఛను అణచే ధోరణిని చలం ప్రశ్నిస్తారు.

ఇంతవరకు చేసిన విశ్లేషణ ఆధారంగా చూస్తే, 'అమీనా' నవల ఒక వ్యక్తిగత స్త్రీ కథ మాత్రమే కాకుండా, సమాజం - వ్యక్తి మధ్య సాగుతున్న నిరంతర సంఘర్షణకు ప్రతీకగా నిలుస్తుంది. అమీనా తన జీవితం గురించి తానే నిర్ణయించుకోవాలన్న తపన ద్వారా Patriarchal వ్యవస్థకు సవాల్ విసురుతుంది. చలం ఈ నవల ద్వారా స్త్రీ విముక్తి భావనను సాహిత్యరూపంలో బలంగా ప్రతిపాదించారు.

అమీనా పాత్ర చివరికి ఓడిపోయిన పాత్ర కాదు. ఆమె బహిరంగంగా విజయం సాధించకపోయినా, ఆలోచనల్లో స్వతంత్రంగా నిలబడుతుంది. అదే ఈ నవల యొక్క నారీవాద విజయంగా భావించాలి.

'అమీనా' నవల చలం సాహిత్య దృష్టికి అద్దం పడుతుంది. ఇది కేవలం ఒక కథ కాదు; ఒక సామాజిక ప్రకటన. స్త్రీ విముక్తి, వ్యక్తిత్వ స్వాతంత్ర్యం వంటి నారీవాద భావనలకు ఈ నవల బలమైన మద్ధతు ఇస్తుంది.

అమీనా తన జీవిత నిర్ణయాలను తానే తీసుకోవాలనే తపన ద్వారా Patriarchal సమాజానికి సవాల్ విసురుతుంది. అందువల్ల 'అమీనా' నవల తెలుగు నారీవాద సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. పురుషాధిక్య సమాజంలో స్త్రీ శరీరంపై కూడా సమా జమే హక్కు కలిగినట్లు వ్యవహరిస్తుంది. 'అమీనా' నవలలో ఈ అంశం పరోక్షంగా వ్యక్తమవుతుంది. స్త్రీ శరీరాన్ని పవిత్రత - అపవిత్రత అనే ద్వంద్వ భావాలతో కొలిచే ధోరణిని చలం విమర్శిస్తారు.

"నా శరీరం నా ఆత్మకు నివాసం. దానిపై హక్కు ఇంకెవరికీ లేదు". అమీనా తనలో తాను అనుకుంటుంది : ఈ భావన నారీవాద సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది.

నవలలో కనిపించే ఇతర స్త్రీ పాత్రలు ఎక్కువగా మౌనంగా ఉంటాయి. వారు సమాజానికి అలవాటుపడ్డ జీవనానికి ప్రతినిధులు. అమీనా ఈ మౌనానికి విరుద్ధంగా నిలిచే స్వరం.

నేటి ఆధునిక నారీవాద సిద్ధాంతాలతో పోల్చితే, చలం ఆలోచనలు చాలా ముందున్నవిగా కనిపిస్తాయి. స్త్రీ స్వేచ్ఛ, శరీర స్వామ్యత, భావ స్వాతంత్ర్యం వంటి అంశాలు నేటి స్త్రీవాద చర్చలతో అనుసంధానమై ఉంటాయి. అందువల్ల 'అమీనా' నవల కాలాతీతమైన ప్రాసంగికతను సంపాదించింది.

ఈ నవలలో చలం వాడిన భాషాశైలి సరళమైనదైనా, భావభరితమైనది. 'అమీనా' నవలలో సంభాషణలు సహజంగా ఉంటాయి. ముఖ్యంగా అమీనా తనలో తాను ప్రశ్నించుకోవడం ఈ నవలకు ప్రాణం పోశాయి.

చలం కథనం పాఠకుడిని ఆలోచింపజేసేలా ఉంటుంది. ఇది నారీవాద భావజాలాన్ని మరింత ప్రభావవంతంగా చేస్తుంది.

మొత్తంగా 'అమీనా' నవల స్త్రీ జీవితాన్ని నియంత్రించే ప్రతి వ్యవస్థపై ప్రశ్నగా నిలుస్తుంది. చలం సాహిత్యం ద్వారా స్త్రీకి ఆలోచించే హక్కు ఉందని, ప్రేమించే హక్కు ఉందని, తన జీవితాన్ని తానే మలచుకునే స్వేచ్ఛ ఉందని స్పష్టంగా చెబుతారు.

అందుకే 'అమీనా' నవల ఒక కథ మాత్రమే కాదు - ఒక నారీవాద ప్రకటన.

**గ్రంథ సూచి :**


1. చలం - అమీనా, తెలుగు నవల.
2. చలం - మా జీవితాలు, ఆత్మకథ.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆధునిక నవల విభాగం
4. స్త్రీవాద సాహిత్య విమర్శ గ్రంథాలు


❖❖❖

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# నవీన్ నవలల్లో నిర్మాణ కౌశలం

- డా॥. బి. సుబ్బలక్ష్మి

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ (స్వయంప్రతిపత్తి) కళాశాల, రాజమహేంద్రవరం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవీన్ ఒక ధ్రువతార. కేవలం కథలు చెప్పడమే కాకుండా, మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే నూతన నవలా శిల్పాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ఘనత ఆయనది. తన విశిష్టమైన రచనా శైలితో ఆధునిక సాహిత్య ప్రస్థానాన్ని ఒక మలుపు తిప్పిన క్రాంతదర్శి ఆయన. నవీన్ గారి నవలల్లో ప్రధానంగా కనిపించేది ఆత్మాశ్రయ రీతి. తన చుట్టూ కథను ఆద్యంతం నడుపుతూ పోయే నవలా శిల్పాన్ని ఆయన పరిపుష్టం చేశారు. ఆయన రచనల్లో కథాంశం కేవలం వ్యక్తిగత పరిధులకే పరిమితం కాదు. మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే అనేక కోణాలను ఆయన స్పృశిస్తారు. "ఆయన నవలలు చదువుతుంటే ఆయనను చదువుతున్నట్లు అనిపించినా, మన గురించి మనం చదువుతున్న అనుభూతి కలుగుతుంది. అంటే తనలో అందరినీ పలకరించే విశ్వజనీనత లేదా ఆత్మీయత ఉంది."

తెలుగు నవలా ప్రపంచంలో 'నవీన్' ఒక విలక్షణమైన ముద్ర. ఆయన నవలలు చదువుతుంటే రచయితను చదువుతున్నట్లు అనిపించినా, అంతర్లీనంగా మన గురించి మనం చదువుకుంటున్నామన్న అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. తనలోని సామాన్యత్వాన్ని విశ్వజనీనం చేస్తూ అందరినీ పలకరించే ఒక ఆత్మీయ గుణం ఆయన సాహిత్యంలో పుష్కలంగా కనిపిస్తుంది. సమాజం అనేది ఒక ప్రవాహమైతే, మనిషి అంత రంగం ఆ ప్రవాహానికి మూలమైన అంతస్స్రవంతి. ఆ అంతస్స్రవంతిలో ప్రవహించే మనిషి జీవితం ఎప్పుడూ సుగమం కాదు. అది అడ్డంకులతో కూడిన ఒక 'ముళ్ళ పొద'. ఈ జీవన సంఘర్షణను గుర్తించిన రచయిత నవీన్, దానిని ఒక 'అంపశయ్య'గా దర్శించారు. భారతంలో భీష్ముడు అంపశయ్యపై ఉండి లోక ధర్మాలను బోధించి నట్లు, నవీన్ తన సాహిత్యం ద్వారా మానవ ప్రపంచంలోని సహస్ర మనోప్రవృత్తులను ఆవిష్కరించారు.

ఒక విత్తులో వేర్లు, కాడలు, పుష్పాలు, ఫలాలు ఏ విధంగా నిగూఢంగా దాగి ఉంటాయో, నవీన్ గారి తర్వాతి కాలపు నవలల్లోని ఇతివృత్తాలన్నీ ఆయన తొలి నవల 'అంశపయ్య'లోనే బీజరూపంలో కనిపిస్తాయి. విద్యార్థి లోకపు అంతర్మథనం, సామాజిక అశాంతి, మనిషి అస్తిత్వ వేదన వంటి అంశాలన్నీ ఆ నవలలోనే అంకురించాయి. అందుకే పాఠకలోకం ఆయనను గౌరవపూర్వకంగా 'అంపశయ్య నవీన్' అని పిలుచుకుంది. ఆ పేరు ఆయన వ్యక్తిత్వానికి, సాహిత్యానికి ఒక పర్యాయపదంగా మారి పోయింది.

అంపశయ్యలో నాటబడిన ఆ సాహిత్య బీజం. తర్వాతి కాలంలో వచ్చిన అనేక నవలల రూపంలో మొలకెత్తి,

మొగ్గ తొడిగి ఆకులతో రెమ్మలతో విస్తరించింది. తెలంగాణ జనజీవన చిత్రణ అయినా, రాజకీయ విశ్లేషణ అయినా ఆయన కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం ఆ అంపశయ్య పునాదుల మీద నిర్మితమైనదే.

నవీన్ గారి మొదటి త్రయీ నవలల్లో 'అంపశయ్య' మొదటిది. నవీన్ నవలా విశ్వరూపం. ఈ నవలలో వామన రూపంలో దాగి ఉంది. ఇది ఒకానొక సమాధ్యవస్థలో, యూనివర్సిటీ జీవితంలోని ఒక విద్యార్థి మనస్సు వినిపించిన విషాద మౌనరాగాల సంపుటి. తెలుగు నవలా సాహిత్యంలో 'చైతన్య ప్రవంతి' కథన శిల్పానికి ఇది మూలమైంది. మనిషి అంతరంగాన్ని ఆలోచనా వేగాన్ని అక్షరీకరించడంలో ఈ నవల ఒక ట్రెండ్ సెట్టర్.

విత్తులో వేర్లు, కొమ్మలు దాగి ఉన్నట్లు, అంప శయ్యలో నవీన్ తన ఇతర రచనలల్లో ఆవిష్కరించిన విషయాలన్నీ బీజరూపకంగా కనిపిస్తాయి. అందుకే పాఠకలోకం ఆయనను 'అంపశయ్య నవీన్' అని గుండె లకు హత్తుకుతుంది. అంపశయ్యలో మొదలైన ఆ చైతన్య ప్రవంతి శిల్పం, కాలక్రమేణా విస్తరిస్తూ మరో రెండు నవలల రూపంలో రూపుదిద్దుకుంది. ఈ మూడు నవలలు ఒక మనిషి జీవితంలోని మూడు దశలకు ప్రతి బింబాలు.

నవీన్ గారి సాహిత్య ప్రస్థానంలో మొదటి త్రయీ నవలల్లో 'అంపశయ్య' (1969) మొదటిది. నవీన్ గారి నవలా విశ్వరూపం ఈ నవలలో వామన రూపంలో దాగి ఉంది. ఇది ఒకానొక సమాధ్యవస్థలో, యూనివర్సిటీ జీవితంలోని ఒక విద్యార్థి మనస్సు వినిపించి నవిషాద మౌనరాగాల సంపుటి. తెలుగు నవలా సాహిత్యంలో 'చైతన్య ప్రవంతి' కథన శిల్పానికి ఇది మూలమైంది. ఈ శిల్పాన్ని అన్వయించుకుంటూనే ఆయన 'ముళ్ళపొదలు' (1976). 'అంతస్స్రవంతి' (1991) నవలలను వెలువరిం చారు.

భారతంలో ఉన్నవే ప్రపంచంలో ఉన్నవి. భారతంలో లేనివి మరెక్కడా లేవు - అనే ప్రతిజ్ఞతో వ్యాసుడు భారతం రాసాడు. అదేవిధంగా ప్రపంచంలోని సామాజిక ఆర్థిక ఆధ్యాత్మిక విషయాలన్నీ తన సాహిత్యంలో ఉన్నవని చెప్పడానికే రచన చేసాడని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

నవీన్ ఒక భావుకుడు. ఆకాశంలో విహరించే రాజ హంస. అప్పుడప్పుడు విశ్రాంతి కొరకు చెట్టునో, గుట్టనో, పుట్టన, ఆశ్రయంగా తీసుకున్నా వాటిమీదనే కాపురం పెట్టేది గాదు. హాయిగా ఆకాశంలో ఎగురుతూ వెలుతురు, వెన్నెలలను మేసే విద్యార్థి జీవితంలోని ఆశలు, ఆశయాలు, అంతర్మథనం, ముళ్ళపొదలు చదువు ముగిశాక ఎదురయ్యే నిరుద్యోగం, ఉద్యోగాల వేటలోని ముళ్ళ వంటి అనుభవాలు. అంతస్స్రవంతి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత సాగే వైవాహిక జీవితం చిత్రణ. మొదటి త్రయిలో వ్యక్తిగత కోణానికి ప్రాధాన్యత ఉంటే, రెండవ త్రయిలో సామాజిక, రాజకీయ ఉద్యమాల నేపథ్యం కనిపిస్తుంది. ఈ దశలో ఆయన మూడు అద్భుతమైన నవలలను అందించారు.

కాలరేఖలు (2002) 1944 నుండి 1956 వరకు సాగిన తెలంగాణ ఉద్యమ నేపథ్యం. నవీన్ గారి బాల్యం నుండి ఆయన హెచ్.ఎస్.సి. పాసైన నాటి వరకు ఉన్న చారిత్రక పరిణామాల చిత్రణ. చెదిరిన స్వప్నాలు (2003) 1957 నుండి 1970 వరకు సాగిన యూనివర్సిటీ జీవితం మరియు వైవాహిక జీవిత ప్రారంభ దశల సమాహారం. బాంధవ్యాలు (2002) 1970 నుండి 1994 వరకు సాగిన ఉద్యోగ జీవిత పర్యంత విశేషాల ఆవిష్కరణ.

సమాజానికి మనిషి అంతస్స్రవంతి అయితే, మనిషి లోని ఆ అంతస్స్రవంతే అతని జీవితం. ఈ జీవితం ఒక్కోసారి 'ముళ్ళపొ'లా అనిపిస్తుంది. అందుకే ఆయన దృష్టిలో ఇది 'అంపశయ్య'. భీష్ముడు అంపశయ్య మీద పడుకొని సహస్ర మనోప్రవృత్తుల మానవ ప్రపంచంలో విష్ణు సహస్రనామాన్ని పలవరించినట్లు నవీన్ గారు అంపశయ్య ద్వారా ఒక జీవితాదర్శాన్ని వెతికే ప్రవృత్తి ధ్వనులను స్ఫురింపజేశారు.

విత్తులో వేర్లు, కాడలు, పుష్పాలు దాగి ఉన్నట్లు, అంపశయ్యలో ఆయన తర్వాతి నవలల బీజాలు కని పిస్తాయి. అందుకే పాఠకలోకం ఆయనను "అంపశయ్య నవీన్" అని పిలుచుకుంది. అంపశయ్యలో పొదిగిన ఆ బీజం ఇతర నవలల్లో మొలకెత్తి, మొగ్గ తొడిగి, చెదిరిన

స్వప్నాలు నవలలో పరిపూర్ణ ఫలాన్ని అందించింది. అందుకే ఈ నవల మీద మాత్రమే ఆయన తన పేరును ప్రత్యేకంగా 'అంపశయ్య నవీన్' అని రాసుకున్నారు.

మనిషి తన అవసరాల రీత్యా కుటుంబానికి లేదా విద్యకు కొంతకాలం దూరంగా ఉండగలిగినా, స్త్రీ సౌందర్యానికి మాత్రం దూరం కాలేడు. అది మనిషిని కేవలం ఆకర్షించడమే కాకుండా కలచివేస్తుంది, ఉడికించి ఊరిస్తుంది, ఒక్కోసారి కుదిపివేస్తుంది. ఈ ఆకర్షణకు ఉన్న శక్తి అపారం. ఇది మనిషిని ఉన్నతమైన ఆశయాల వైపు నడిపించగలదు లేదా విచక్షణ కోల్పోతే అధోలోకానికి (పతనానికి) నెట్టివేయగలదు. అరుంధతి, అమలిన ప్రేమతత్వానికి ఆదర్శ ప్రతిరూపం.

నవీన్ నవలలో 'రాజు' పాత్ర రచయిత అంతర్మథనానిక, సామాజిక అవగాహనకు ప్రతీక అయితే, అతని భార్య 'అరుంధతి' పాత్ర భారతీయ స్త్రీత్వానికి. నిష్కల్మషమైన ప్రేమకు నిలువెత్తు రూపం. ఆమె కేవలం ఒక పాత్ర మాత్రమే కాదు. మార్మిక ప్రేమతత్వాన్ని బోధించే ఒక సహజ విజ్ఞాన సర్వస్వం. అరుంధతి లౌకిక విద్యలు అభ్యసించిన ప్రాజ్ఞురాలు కాదు. ఆమెకు పుస్తక జ్ఞానం తెలియదు. కానీ, హృదయ భాషపై పూర్తి అధికారం ఉంది. లౌకిక విద్యావాసనలు సోకని ఆమె వ్యక్తిత్వం, ప్రేమ సుగంధాన్ని విరజిమ్మే ఒక అపరంజి బొమ్మ లాంటిది. భార్యగా భర్త యొక్క ఇహపర లోకాలకుతానెలా జవాబుదారిగా ఉండాలో ఆమెకు ఎవరూ నేర్పక్కర్లేదు. ఆమె మౌనమే ఒక భాషగా అతడిని తీర్చిదిద్దింది.

నవలలో ఒక కీలక ఘట్టంలో రాజు (నవీన్), తన విద్యాగంధంతో, మార్పు మరియు ఫ్రాయిడ్ల సిద్ధాంతాల ప్రభావంతో అరుంధతిని ఒక ప్రశ్న అడుగుతాడు. "నన్నే భర్తగా ఎందుకు కోరుకున్నావు? నిన్ను నా భార్యగా నేనెప్పుడూ ఊహించుకోలేదే!" అని. దానికి ఆమె చాలా సహజంగా "అది అబద్ధం" అని కొట్టిపారేస్తుంది. ఆర్కలాజికల్ లేదా, సైకలాజికల్ విశ్లేషణలకు అలవాటు పడిన రాజుకు ఆమె సమాధానం అంతుచిక్కదు. అప్పుడు ఆమె చెప్పిన సమాధానం అత్యంత అద్భుతమైనది.

"మా నాయనమ్మ చనిపోయినపుడు నేను ఏడుస్తుంటే, నన్ను ఎందుకు ఊరుకుంచినావు?"

ఈ ఒక్క వాక్యంలో అనంతకాశపు కాంతులు, అగాధ జలధుల ఘోషలు దాగి ఉన్నాయి. పురుషుడు మేధస్సుతో, ఊహల్లో విహరిస్తే, స్త్రీ తన హృదయం ద్వారా, స్పర్శ ద్వారా, చూపు ద్వారా నిజాన్ని గ్రహిస్తుంది. అది మానవ అంతశ్చేతన అరుంధతి పలికిన ఈ మాటల్లో చలం 'ఊర్వశి' ద్వారా పురూరవునికి అందించిన ప్రేమ గీతాసారం కనిపిస్తుంది.

ఈ ప్రేమ మార్పు ఆర్థిక సూత్రాల్లో దొరకదు. ఫ్రాయిడ్ లైంగిక విశ్లేషణల్లో చిక్కరు. ఇది కేవలం స్త్రీ హృదయానికి మాత్రమే తెలిసే ఒక అలౌకిక సంగీతం. కొమ్మయొక్క ఏ ఆకును తెంపినా, ఏ రెమ్మను గిచ్చినా, ఏ పువ్వును కోసినా, ఆ చర్యలకు స్పందించేది భూమిలో దాగిన వేళ్ళ మాతృహృదయమే! వేళ్లు ఎండిపోతే చెట్టు ఎండిపోతుంది. రెక్కలు నరికినా ఆ చెట్టును తిరిగి చిగిరింప చేసేది ఆ వేళ్ళే. అలాంటి వేళ్ళవంటిది భార్య అని రాజు గుర్తిస్తాడు. అయితే రాజు తాను, తన జీవన వివిధ దశల్లో చూచిన ఇతర స్త్రీలను, వారి సౌందర్యాలను అరుంధతిలో చూసి తృప్తిపొందుచున్నానని చెప్పాడు. అందుకే నవీన్ తాను తెలుసుకున్న ఈ జ్ఞానాన్ని రాజు ప్రవర్తనకు ఆపాదించి ఈ విధంగా నవలలో వ్యాఖ్యానించాడు.

"ఎంతకాలంగానో అతడూహించుకున్న అతని ఆదర్శ స్త్రీమూర్తులందరినీ అతడామెలో చూసుకోవడం మొదలెట్టాడు. రమణమ్మ, మనోరమ, మధుమతి - వీళ్ళంతా ఆమె ఉన్నారనిపించింది. అతడు చదివి హృదయంలో ప్రతిష్ఠించుకున్న ఎన్నో పుస్తకాల్లోని నాయికలందర్నీ అతడామెలో చూసుకోగలిగాడు. ఎన్నో ఏళ్ల తన అన్వేషణ ఫలించినదనిపించింది" (పుట.394). ఈ జ్ఞానాన్ని ఈ నవలలో మాత్రమే స్పష్టంగా వ్యక్తం చేశాడు. తాను ఆయా స్త్రీమూర్తులపై కన్నకలలు చెదిరిపోయినవని తపించిన చీకటిరోజులకు అరుంధతి ప్రేమలో ఆ కలల సాకార రూపవెలుగు కాంతులు తోచినాయి. అతని మొదటి నవల 'అంపశయ్య'లో చెదిరిన కలలు ఈ చివరి 'చెదిరిన స్వప్నాలు' అన్న నవలలో వ్యాపించి అరుంధతి ప్రేమకు పరివేశంగా నిలిచినాయి. పగలంతా కలలవెలుగు రేకులు పరుచుకున్న సూర్యుడు అలసిసొలసి చంద్రునిపై అలసట తీసుకొంటూ వేడికి బదులు వెన్నెలను కురిపించి

జీవితాన్ని రాగరంజితం చేసి ప్రవృత్తి, అరుంధతి మనోవృత్తి. పురుషుని జీవితాన్ని పూర్ణం చేసేది స్త్రీ అనే తత్త్వం. ఆద్యంతాలైన అంపశయ్య. చెదిరిన స్వప్నాల్లో కన్పిస్తుంది. వీని మధ్య నున్న నవలల్లో ఈ భావం చెదిరిన స్వప్నంలా కన్పిస్తుంది. అంపశయ్య చైతన్య స్రవంతి నవలాశిల్పానికి ఈ నవలలో చూపిన అరుంధతి ప్రేమ ఆదర్శమని ఈ నవల ధ్వనింపచేస్తుంది. అంపశయ్య మీద పడుకొన్న నవీన్‌కు ఆకాశంలో కన్పించిన తార అరుంధతి.

స్త్రీ అనుభవాన్ని నవీన్ ఈ నవలలో మూడు పాత్రల్లో అద్భుతంగా చూపాడు. మనసుకోరినపుడల్లా స్త్రీ అనుభవానికి శరీరం సహకరించే చంచలీకులకు (చలించే మనస్సుకల్గినవారికి) నారాయణస్వామి అనే టీచర్ నమూనా, మనసు కోరుకుంటుంది. కాని శరీరం సహకరించదు. ఇలాంటివారు తీవ్రమానసిక క్షోభను అనుభవించని పోయే వ్యక్తులకు యాకయ్యపాత్ర ప్రతీక. వీరితో రాజుకు బాగా పరిచయముంటుంది. రాజుకు మనస్సు కోరుకుంటుంది. శరీరం సహకరించే స్థాయిలో వుంటుంది. కానీ తీవ్రసంఘర్షణకు గురైవాళ్ళలాగా చేయలేకపోతాడు. తన చదువుకు, తన అభివృద్ధికి ఇవి ఆటంకాలని భావించిన వాళ్ళ నుండి దూరం వెళ్ళిపోతాడు. బాగా చదువుకొని ఏం చేయాలి? అంటే! ఉద్యోగం చెయ్యాలన్నది మామూలు విషయమే! మరేమిటి? అంటే! రచన చేయడం అతని ప్రధాన లక్ష్యం. ఈ రాయడమంటే ఏమిటి? దానివల్ల సాధించేదేమిటి? అంటటే! జీవితాన్ని అన్వేషించటం! జీవితాన్ని అన్వేషించేదెందుకు? అంటే అరుంధతీ దర్శనం కొరకే! అని తేలుతుంది. ఇది జీవితసారం. నవీన్ జీవితకాసారంలో వికసించిన పద్మం ఈ అరుంధతి.

విష్ణు నాభికాసారం నుండి పుట్టిన పద్మం ఈ అరుంధతీ సుగంధం. భారతీయ సంప్రదాయ చైతన్యం నవీన్‌ను తట్టిలేపగా సృష్టించబడ్డ పాత్ర ఈ అరుంధతీ పాత్ర. దీన్ని శిల్పరంగా నవీన్ అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఇలాంటి శిల్పం నవీన్ రచనల్లో నిత్యనూతనంగా శోభిస్తుంది. అయితే అరుంధతీ దర్శనాన్ని, కులపాలికా ప్రణయాన్ని, ఆ ప్రణవమంత్రాన్ని, ఆ ప్రేమ భక్తిని త్రికాలాల్లో, త్రిసంధ్యల్లో స్మరించాలనే సంకేతంగా ఈ త్రయీ నవలా శిల్పాన్ని ఎన్నుకొన్నాడు. జీవితం మూడుకాలాల్లో తిరుగుతూంటుంది. జీవితం మూడుముళ్ళతో బంధితమై వుంటుంది. ఇలా చెదిరిన స్వప్నాలు అరుంధతితో బంధితమై వున్నవి. ఇలా బంధించబడడం చెదిరిన స్వప్నంగా భావించగూడదు. చెదిరిన స్వప్నం గూడుకు చేరుకున్న వైనంగా భావించాలి.

కలలు కనడమనేది మానవులకు మాత్రమే భగవంతుడు ప్రసాదించిన వరం. కలలు భావాలకు, ఆదర్శాలకు, సంస్కృతికి మూలాలు. ఈ కలలు ద్వారానే మనిషి తాను మారి సమాజమార్పుకు సహకరిస్తాడు. భూమి తన చుట్టుతాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరిగినట్టూ, మనిషి తనను తాను సంస్కరించుకుంటూ సమాజ సంస్కరణకు పూనుకోవడమే జీవితం. అదే ప్రపంచం. అయితే కలలు విఫలమౌతాయనీ అనుకోకూడదు. అవి జీవనపార్శ్వాలలో విస్తరిస్తాయి అని భావించాలి. అందుకే జీవితం నిరాశమయం గారు, ఆశామయం.

కలలు విఫలం కావు అన్నభావం నవీన్ అంతశ్చేతనలో ఉన్నా సామాజిక విషయాల విశ్లేషణకు పూనుకొన్నప్పుడు చెదిరినవే చెబుతాడు. ఏ విషయంలో కూడ కలలు విఫలం కావు అనే విషయాన్ని వరవరరావు నవీన్‌ను ఈ విధంగా హెచ్చరించారు. "ఎన్నో కన్నీటి ప్రవాహాల మీద కత్తుల వంతెనలు దాటివచ్చి, వెనక్కి తిరిగి అంపశయ్య నవలను గుర్తుచేసుకుంటే ఎన్ని అస్పష్ట ఆదర్శ ఉజ్వల స్వప్నాలు నిజమయ్యాయి. ఎన్ని మిగిలిపోయాయి అని గుర్తుంచు కోవాలంటాడు (నవీన్ వజ్రోత్సవసంచిక) స్వప్నాలు చెదిరిపోవు, వ్యాపిస్తాయి.

భారతంలో ఉన్నవే ప్రపంచంలో ఉన్నవి. భారతంలో లేనివి మరెక్కడా లేవు - అనే ప్రతిజ్ఞతో వ్యాసుడు భారతం రాసాడు. అదేవిధంగా ప్రపంచంలోని సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక విషయాలన్నీ తన సాహిత్యంలో ఉన్నవని చెప్పడానికే నవీన్ రచన చేశాడని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. 1.నవీన్ వజ్రోత్సవసంచిక
2. ముళ్ళపొదలు - నవీన్
3. అంపశయ్య - నవీన్

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'ప్రజల మనిషి' నవల విశిష్టత

- డా॥. తండు కృష్ణయ్య
అధ్యక్షులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ.

**ఉపోద్ఘాతం :**

తన కలం ద్వారా తెలంగాణ మాగాణంలో పోరు విత్తనాలు చల్లి ఉద్యమ కుసుమాలను విర బూయించిన వాడు, తెలంగాణ ప్రజా సాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోసినవాడు వట్టికటో ఆళ్వారు స్వామి. రచయితగా, ఉద్యమకర్తగా, కమ్యూనిస్టు నేతగా, ప్రచురణకర్తగా, పాత్రికేయుడుగా భాషా సాహిత్యాల నుంచి పౌర హక్కుల దాకా ఉద్యమాలన్నింటిలోనూ పాలుపంచుకున్నాడు. తెలంగాణ సాయుధపోరాట నేపథ్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈయన రాసిన నవలయే 'ప్రజల మనిషి'.

**పరిచయం :**

వట్టికోట ఆళ్వారు స్వామి నవంబర్ 1, 1915న నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారం గ్రామంలో సింహాద్రమ్మ, రామచంద్రాచార్యులు దంపతు లకు జన్మించాడు. చిన్ననాడే తండ్రి చని పోవడంతో సీతా రామారావు అనే ఉపాధ్యాయునికి వండిపెడుతూ విద్యాభ్యాసం గావించాడు. విజయ వాడలో హోటల్ కార్మికునిగా పనిచేస్తున్న సమయంలోనే స్వాతం త్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపాడు. 1933లో హైదరాబాద్ వచ్చి గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్గా పనిచేశాడు. 1938లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి ప్రముఖ రచయితలు, కవులు రాసిన పుస్తకాలను ఆ సంస్థ ద్వారా ప్రచురించి లోకానికి అందజేశాడు. కాళోజీ రచించిన 'నా గొడవ'ను మొదటిసారి ప్రచురింపజేసింది ఆళ్వారు స్వామియే. సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'హైందవ ధర్మవీరులు', 'ప్రాథమిక సత్యములు' అను గ్రంథములతో పాటు సుమారు 35 పుస్తకాలను ప్రచు రించడం వీరి సాహిత్య కృషికి నిదర్శనం.

ఆళ్వారు స్వామి గ్రంథాలయోద్యమంలోనూ, తెంగాణ రచయితల ఉద్యమంలోనూ ప్రముఖ పాత్ర వహించాడు. ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పని చేశాడు. క్విట్ ఇండియా ఉద్యమం నుండి నిజాం వ్యతిరేక పోరాటం వరకు నాలుగైదు సంవత్సరాలు జైలు శిక్ష అను భవించాడు. 1948లో మహాకవి దాశరథితో కలిసి నిజామా బాద్ కేంద్రకారాగారంలో మూడు నెలలు జైలు శిక్ష అనుభ వించాడు. జైలులో ఉన్నప్పుడు దాశరథి రాసిన పద్యాలను బొగ్గుతో జైలు గోడలపై ఆళ్వారు స్వామి రాసేవాడు. జైలులో ఉన్న కాలంలో కూడా ఖైదీల కోసం అనేక ఉద్యమాలు చేపట్టాడు. 1938 కి ముందు నిజాం పాలనలో ప్రజల స్థితిగతులకు దర్పణం పడుతూ 'ప్రజల

మనిషి' నవలను, 1940-45 మధ్య కాలంలో రాజకీయ, సాంఘిక ప్రజా ఉద్యమాల చిత్రణతో 'గంగు' నవలను రాశాడు. తెలంగాణ విశేషాలను తెలియజేస్తూ 'తెలంగాణ' పేరుతో సంపుటాలను ప్రచురించాడు. ఇవేవీ ఇప్పుడు లభించడం లేదు. అదే విధంగా ఖైదీల విభిన్న మనస్తత్వాలను తెలుపుతూ జైలు లోపల కథల సంపుటి 'నా గొడవ' స్ఫూర్తితో సామాజిక సమస్యలకు దర్పణం పట్టే విధంగా 'రామప్ప రభస' పేరుతో వ్యాసాలు రాశాడు. కడవెండి గ్రామంలో దొడ్డి కొమరయ్య పై కాల్పులు జరిగిన సంఘటనకు సంబంధించి పద్మజా నాయుడుతో కలిసి ఆ గ్రామాన్ని సందర్శించిన ఏకైక పౌరహక్కుల నేతి వట్టికోట ఆళ్వారుస్వామి.

తెలంగాణ ప్రజల జీవితాన్ని, సంస్కృతి సంప్రదాయాలను, తిరుగుబాటు తత్త్వాన్ని, పోరాట నేపథ్యాన్ని సంపూర్ణం అర్థం చేసుకున్న రచయిత ఆళ్వారుస్వామి. తెలంగాణ ప్రజల పలుకుబడి, మాట తీరు, తెలంగాణ భాష, జాతీయాలు ఈయన రచనలో కనిపిస్తాయి. తెలంగాణ భాషకు పెద్దపీట వేస్తూ ఈయన రాసిన కథలు సామాజిక సమస్యలకు దర్పణం పడుతాయి. 'కాఫిర్లు' అను కథలో ముస్లిములుగా మార్చబడిన దళితుల జీవన విధానాన్ని, వారు ఎదుర్కొనే సమస్యల్ని తెలియజేశాడు. పోలీస్ చర్య అనంతరం పోలీసుల అండతో దొరలు గ్రామాలలో చేసే అరాచకాలను గిర్దావర్ కథలో తెలియజేశాడు. మనిషికి తప్ప మతానికి ఏనాడూ ప్రాధాన్యతను ఇవ్వని ఆళ్వారు స్వామి ముస్లింలకు జరిగే అన్యాయాన్ని కూడా ప్రశ్నించాడు. కథ, నవల, విమర్శ, వ్యాసం మొదలైన ప్రక్రియా రచనల్లో అందెవేసిన చేయిగా ప్రసిద్ధిగాంచాడు. ప్రజా సాహిత్యానికి ప్రాణం పోసి, తెలంగాణ సమాజం పునర్వికాస ఉద్యమానికి పునాదులు వేసి 46 సంవత్సరాల జీవిత కాలంలోనే అసాధారణ విజయాల్ని సాధించి తెలంగాణ వైతాళికుడుగా ప్రసిద్ధిగాంచిన వట్టికోట ఆళ్వారు స్వామి ఫిబ్రవరి 5, 1961న పరమపదించాడు.

**ప్రజల మనిషి నవల విశిష్టత :**

తెలంగాణ ప్రాంతంలోని పట్వారీలు, ప్రభుత్వ అధికారులు చేస్తున్న దోపిడిని, దౌర్జన్యాన్ని నిరూపించిన నవల ప్రజల మనిషి. సామాన్య ప్రజలు అధికారుల చేతిలో ఏ విధంగా నలిగిపోయారో వర్ణించిన నవల. అణగారిన ప్రజలను చైతన్యపరిచి ముందుకు నడిపించిన నవల. సమస్యలను పరిష్కరించడం కోసం పోరాటం తప్ప వేరే మార్గాం లేదని ప్రబోధించిన నవల. నెత్తుటి మరక, తుపాకీల చప్పుడు, కత్తుల చెలగాటం కనిపించని అహింసా సిద్ధాంతంతో పోరాటాన్ని వర్ణించిన నవల. ఈ నవలలో ప్రజల మనిషి కంఠీరవం పాత్ర వట్టికోట ఆళ్వారుస్వామితో పోల్చదగినది. ప్రగతిశీల భావాలు కలిగి ప్రగతి బాటలో పయనించి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ వ్యక్తిగా, కృషి, పట్టుదల, పోరాటతత్వం సహజ గుణాలు గల వ్యక్తిగా, ప్రజల మనిషిగా వట్టికోట ఆళ్వారు స్వామి ఏ విధంగా ప్రసిద్ధిగాంచాడో ఈ నవలలోని కంఠీరవం కూడా అదేవిధంగా ప్రసిద్ధిగాంచాడు. దిమ్మగూడెం గ్రామంలో నివసించే సామాన్య వైష్ణవ దంపతులైన అండాళమ్మ రఘునాథాచార్యులకు కంఠీరవం జన్మించినట్లే వట్టికోట కూడా సామాన్య కుటుంబంలో జన్మించాడు. నిజామాబాదులో వేదాంతాచార్యుల కుమారుడు మోహనాచార్యులు కంఠీరవానికి గ్రంథాలయ నిర్వహణ గురించి తెలుపడం, కంఠీరవం ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను అధ్యయనం చేసి భారతదేశ చరిత్ర గురించి, ప్రపంచ దేశాల స్థితిగతుల గురించి తెలుసుకున్నట్లే ఆళ్వారుస్వామి సూర్యపేట గ్రంథాలయంలో పలు పుస్తకాలను చదవడమే కాకుండా స్వయంగా ఉర్దూ, ఆంగ్లభాషలను కూడా నేర్చుకున్నాడు. కంఠీరవం జైలులో ఉండి కూడా జైలు సంస్కరణ కోసం ఏవిధంగా పోరాటం చేశాడో అదేవిధంగా ఆళ్వారు స్వామి కూడా నిజామాబాద్ కేంద్ర కారాగారంలో ఉన్నప్పుడు సంస్కరణల కోసం పోరాటం చేశాడు. కుల, వర్ణ, జాతి భేదం లేకుండా వట్టికోట అందరిని సమానంగా భావించినట్లే కంఠీరవం కూడా అందరిని సమానంగా భావించాడు. ఇలా ప్రజల మనిషి నవలలోని కథానాయకుడు కంఠీరవం పాత్రకు ఆళ్వారు స్వామికి దగ్గర సంబంధాలు ఉన్నాయని చెప్పవచ్చు.

**ఇతివృత్తం :**

వట్టికోట ఆళ్వారు స్వామి 1952లో ఈ నవలను రాశాడు. ఇందులో కథాకాలం 1930-35. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావానికి ముందు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు ఈ నవలలో చిత్రిత మయ్యాయి. అప్పటి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి తాలూకా సమీపంలో దిమ్మగూడెం కేంద్రంగా ఈ నవల సాగుతుంది. దిమ్మగూడెం గ్రామ దొర రామభూపాల్‌రావు. గ్రామీణ ప్రజలను అన్ని విధాలుగా దోచుకునే దోపిడీ దారుడు. అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతుంటాడు. ప్రజలను దారుణంగా పీడిస్తుం టాడు. కొమరయ్య అనే రైతు పొలాన్ని రామభూపాల్‌రావు మోసంతో ఆక్రమిస్తాడు. కొమరయ్యతల్లి సైతం దొరను ఎదిరిస్తుంది. కొమరయ్య దొరను ప్రశ్నిస్తాడు. కాని తాను కోల్పోయిన భూమిని సాధించుకోలేకపోతాడు. వైష్ణవ కుటుంబానికి చెందిన కంఠీరవం ముస్లిం ఉపాధ్యాయుని ఇంట్లో చదువుకుంటాడు. అది కంఠీరవం తల్లికి చాలా కష్టంగా అనిపించేది. ముస్లిం పంతులకు వేరే ఊరికి బదిలీ కావడం వల్ల కంఠీరవం చదువుకు దూరమవుతాడు. కొమరయ్య కష్టించే మనస్తత్వాన్ని చూసి కంఠీరవం అతనికి దగ్గరవుతాడు. కంఠీరవంకు అన్నతో విభేదాలు రావడంతో కట్టుబట్టలతో నిజామాబాద్ చేరుకుంటాడు. అక్కడ కొందరి వ్యక్తుల పరిచయంతో గ్రంథాలయ కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతాడు. రామభూపాల్‌రావు దొర దోపిడీని ఎదిరిస్తూనే ఉంటాడు.

అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో హిందువులను ముస్లిం మతంలోకి మార్చడాన్ని కంఠీరవం వ్యతిరేకిస్తాడు. వారిని మరల హిందూ మతంలోకి తీసుకువచ్చే శుద్ధి కార్య క్రమాలను ఆర్య సమాజం సహకారంతో నిర్వహిస్తుం టాడు. కంఠీరవానికి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తుంది. జైల్లో ఉన్న కాలంలోనూ అక్కడ ఖైదీల బాధలను తెలుసుకుంటాడు. జైలు నుంచి విడుద లైన తరువాత కంఠీరవం పోరాటాన్ని తీవ్రతరం చేస్తాడు. దిమ్మగూడెంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తాడు. ప్రజలకు అండగా నిలబడుతూ వారిలో ఉద్యమస్ఫూర్తిని రగిలిస్తాడు. రామభూపాల్‌రావు ఇతరుల భూములకు సంబంధించిన ఫోర్జరీ కేసులో ఇరుక్కొని జైలుకెళ్తాడు. కొమరయ్య, ఇతర మిత్రులు కోల్పోయిన భూమి వారికి దక్కుతుంది. కంఠీరవం గ్రామంలో సామూహిక పంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తాడు. కుల మతాలకతీతంగా ప్రజలలో అభ్యుదయ భావాలను నెలకొల్పుతాడు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైదరా బాద్ స్టేట్ కాంగ్రేస్ ఉద్యమం చేపడుతుంది. ప్రజల కోసం నిరంతరం తపించిపోతూ ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ చివరి వరకు పోరాట మార్గాన్ని వీడని కంఠీరవమే నిజమైన ప్రజల మనిషి.

**నవల కాలం నాటి తెలంగాణ స్థితిగతులు :**

ప్రజల మనిషి నవలలోని ఇతివృత్తం 1938 కి పూర్వం తెలంగాణ ప్రాంతంలోని ప్రజా జీవితం. ఈ నవలలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు వర్ణించబడ్డాయి. తెలంగాణ ప్రజల జీవన విధానం స్పష్టంగా తెలియ జేయబడింది.

**సాంఘిక పరిస్థితులు :**

ఆనాటి తెలంగాణ ప్రజల సాంఘిక జీవనాన్ని ఈ నవల ప్రతిబింబిస్తుంది. ఆ రోజుల్లో పట్వారీలు గ్రామాధి కారులుగా అధికారాన్ని చలాయించేవారు. వారిని ఆ గ్రామ ప్రజలు, 'దొరా' అని పిలిచేవారు. వారు ప్రజలను అనేక విధాలుగా కొల్లగొట్టేవారు. రామభూపాల్‌రావు లాంటి దొరలు పేదల భూములను స్వాధీనం చేసుకొని వారితోనే సేద్యం చేయించేవారు. తమ ఇండ్లలో పెళ్లి జరిగితే ఆ గ్రామంలోని ప్రజలంతా సహాయం చేయవలసిందిగా దొర హుకుం జారీ చేసేవాడు. గ్రామంలోని ప్రజలందరి చేత వెట్టిచాకిరి చేయించుకునేవారు. భోగం మేళాన్ని పిలిపించి వారిచే కార్యక్రమాలను ఏర్పాటు చేయించేవారు. బ్రాహ్మణులు అనేక ఆచారాలు పాటించేవారు. కంఠీరవం తురక పంతులు ఇంట్లో ఉంటే ఆ ఇంట్లోకి వెళ్లడానికి కూడా తల్లి అండాళమ్మ సంకోచిస్తుంది. మోహనా చార్యులు బొట్టు పెట్టుకోలేదనే కారణంతో వైష్ణవ మతా నికి చెందిన బ్రాహ్మణులు అతనితో సహపంక్తి భోజనానికి విముఖత చూపారు. ఇలాంటి ఆచారాలను లెక్కించని

వారు కూడా ఆ రోజుల్లో ఉండేవారు. కంఠీరవం మహమ్మదీయుడైన బషీరుతో కలిసి భోజనం చేస్తాడు. ఆచారాలు, కట్టుబాట్లు మానవులు ఏర్పరచుకున్నవనీ, వాటిలో మంచి వాటిని మాత్రమే పాటించాలి గాని మానవత్వానికి మచ్చ తెచ్చే వాటిని పాటించనవసరం లేదని కంఠీరవం చెప్పేవాడు. అమాయకులను మోసగించడం వ్యాపారంలో కాకుండా ఉద్యోగుల్లో కూడా ఉండేది. లక్ష్మీనారాయణ అనే బట్టల వ్యాపారి తమ దగ్గరకు ఇచ్చిన వినియోగదారులను మోసగిస్తే, రైల్వే స్టేషన్ మాస్టారు ప్రయాణికులను మోసగించి డబ్బు తీసుకుంటాడు.

**రాజకీయ పరిస్థితులు :**

ఆ రోజుల్లో సభగాని, సమావేశంగాని జరుపుకోవాలంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి ఇచ్చేటప్పుడు అనేక విధాలైన నిబంధనలు విధిస్తుండేవారు. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారిని జైలులో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసేవారు. తప్పులు చేసిన అధికారులను ప్రభుత్వం పట్టించుకునేది కాదు. గ్రామాలలో ప్రభుత్వం తరపున దొంగలే పాలన కొనసాగించేవారు. వీరు ప్రజలపై విపరీతమైన పన్నులను విధించి నిర్బంధంగా వసూలు చేసేవారు. ఒకవేళ ఎవరైనా పన్నులు చెల్లించకపోతే వారి భూములను దొరలే కబ్జా చేసేవారు. అంతేకాకుండా కఠిన శిక్షల్ని విధించేవారు.

**మత పరిస్థితులు :**

హిందువులు హరిజనులను ఊరికి దూరంగా ఉంచేవారు. వారి చేత పనులను చేయించుకునేవారు. అంజుమన్ అనే మత సంస్థ ప్రభుత్వ సహాయంతో హరిజనులను మహమ్మదీయ మతంలోకి మార్చడానికి కృషి చేస్తూ ఉండేది. తురకలుగా మారిన హరిజనులను హిందువులు బహిష్కరించేవారు. ఆర్య సమాజం సంస్థకు చెందిన వారిని పిలిపించి వారి చేత శుద్ధి సంస్కారం జరిపి మళ్ళీ హిందువులుగా మార్పించేవారు. మతం మార్చుకుంటే భూములు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రలోభ పెట్టేవారు. మతమార్పిడిని హిందువులు ఎదిరిస్తే జైల్లో పెట్టేవారు. ఆంగ్లేయులు క్రైస్తవ మత వ్యాప్తి కోసం పాఠశాలలను నెలకొల్పేవారు. అక్కడక్కడ కొన్ని కుటుంబాల మధ్య మతసామరస్యం కనిపించేది.

**ముగింపు :**

అణగారిన ప్రజలను చైతన్యపరిచి ఆవేశంతో ముందుకు నడిపించిన నవల ఇది. ప్రజల సుఖమే పరమావధిగా భావించి పోరాటం సాగించిన ప్రజల మనిషి ఎలా ఉంటాడో చూపించే నవల ఇది. ఆళ్వారు స్వామి నవల ప్రారంభిస్తూ ఒక ఎద్దు వృత్తాంతాన్ని మొదటి పేరాలో ఇలా రాశాడు. రైతు ఎద్దుకు మేత వేస్తాడు. దారిన పోతున్న ఒక ఆవు గడ్డిలో మూతి పెట్టబోతుంది. అప్పుడు ఆ ఎద్దు ఆవును కుమ్మబోతుంది. తన వస్తువును ఇతరులు హరిస్తుంటే జంతువులే సహించలేనప్పుడు మనిషి ఎలా సహిస్తాడని రచయిత పాఠకులకు ముందుగానే తెలియజేశాడు. జైల్లో ఉండి ఖైదీలలో పరివర్తన కలిగించి మంచి మనుషులుగా తీర్చిదిద్దాలన్న సందేశం ఈ నవల అందిస్తుంది. పోరాటం జరిపి ఒక విజయం సాధించినంత మాత్రాన సమాజం మారిపోదని, కొత్త వ్యక్తులు వచ్చి దోపిడీ ప్రారంభిస్తారని కావున పోరాటం నిరంతరం జరుగుతూ ఉండవలసిందేనని, పోరాటమే ప్రజా సమస్యలకు పరిష్కారమని ఈ నవల ద్వారా రచయిత చక్కని సందేశాన్ని అందించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆళ్వారు స్వామి వట్టికోట - ప్రజల మనిషి (1955) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. వరవరరావు - తెలంగాణ విమోచనోద్యమం తెలుగు నవల (1983) - సృజన హనుమకొండ.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కొలకలూరి ఇనాక్గారి "రంధి" నవల – సామాజిక చైతన్యదృష్టి

– డా॥. వై. దివ్య
తెలుగు అధ్యాపకులు, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం), నెల్లూరు.

**పరిచయం :**

తెలుగు సాహిత్యంలో దళితచైతన్యాన్ని, కుల వ్యవస్థలోని అసమానతలను, అణచివేతకు గురైన వర్గాల జీవితాలను అంతర్లీనంగా ప్రతిబింబించిన ప్రముఖ రచనల్లో కొలకలూరి ఇనాక్గారి "రంధి"నవల ఒక ముఖ్యమైన స్థానం సంపాదించింది. "రంధి" అంటేపేచీ, గొడవ మరియు రెండు వర్గాల మధ్య సంఘర్షణ. అయితే ఈ నవలలోని "రంధి" కేవలం వ్యక్తుల మధ్య గొడవకాదు; అది శతాబ్దాలుగా కొనసాగుతున్న కులాధిపత్యం మరియు అణచివేతకు గురైన వర్గాల మధ్య సాగుతున్న సామాజిక పోరాటానికి ప్రతీక. "రంధి" అనే శీర్షికే సంఘర్షణను సూచిస్తుంది. ఈ సంఘర్షణ లేకపోతే మార్పు సంభవించేది కాదు. నవలలోని ప్రతి ఘట్టం సమాజంలోని దురవస్థను బయటపెట్టి, మార్పు అవసరాన్ని సూచిస్తుంది. రంధి కథ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళ నాటిది. నవలస్వాతంత్ర్యానంతరకాలంలో, రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత కూడా గ్రామీణ భారతదేశంలో కులవివక్ష ఎలా కొనసాగిందో ప్రతిబింబిస్తుంది. అంటే ఇనాక్ గారి చిన్నతనం నాటిది. అప్పట్లో ఆధిపత్య కులాలు కింది కులాలపై చేసే దోపిడీ ఆగడాలు అత్యాచారాలూ చాలా బహిరంగంగా నిస్సిగ్గుగా ఉండేవి. అందువల్ల ఈ నవల అప్పట్లోనే రాయబడి ఉంటే మరింత ప్రయోజనకరంగా ఉండేది. భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రతిపాదించినా, నవలలో గ్రామీణ సమాజంలో అవి అమలు కాలేదని స్పష్టమవుతుంది. అందువల్ల ఇది కేవలం కథ కాదు - సామాజిక చైతన్యానికి పిలుపు.

**కులవ్యవస్థ -సామాజిక అసమానతల ప్రతిబింబం :**

నవలలో ప్రధానంగా రెండు కుటుంబాలు - భూస్వామ్య కుటుంబం (నాంచారయ్య కుటుంబం) మరియు మాదిగ కుటుంబం (కోటయ్య కుటుంబం) - రెండు వర్గాలకు ప్రతినిధులుగా నిలుస్తాయి. నవలలో భూస్వామ్య వర్గం మరియు మాదిగ వర్గం మధ్య ఉన్న సంబంధం కేవలం ఆర్థిక సంబంధం కాదు; అది కులాధారిత ఆధిపత్యం. నాంచారయ్య పాత్రలో భూస్వామ్య అహంకారం, అధికారం, దౌర్జన్యం స్పష్టంగా కనిపిస్తాయి. మాదిగ వర్గం గ్రామ అంచుల్లో నివసించడం, సామాజికంగా వేరుచేయబడటం కులవ్యవస్థ నాంచారయ్య భూస్వామ్య దురహంకారానికి ప్రతీక. డబ్బు, భూమి, అధికారం -ఇవన్నీ అతని చేతుల్లో ఉండగా, మాదిగలు అతని కృపా పాత్రులుగా బ్రతకాల్సి వస్తుంది. ఇదికేవలం ఆర్థిక అసమానతకాదు; ఇది సామాజికంగా నిర్మితమైన

అణచివేత వ్యవస్థ. గ్రామంలో మాదిగపల్లె ఒక మూలన ఉండటం, భూస్వాముల ఇళ్ల మధ్యలో ఉండటం - ఇది కేవలం భౌగోళిక నిర్మాణం కాదు. సమాజంలో అధికారం భౌతిక స్థల నిర్మాణం ద్వారా కూడా బలపడుతుంది. అంటరానితనం కేవలం మనసులో కాదు; అది గ్రామ ప్రణాళికలోనే ఉంది. మాదిగలు "అంటరానివారు" అముద్రతో జీవిస్తారు. వారు గ్రామానికి అవసరమైన పనులు చేసినా, గౌరవం మాత్రం దక్కదు. ఇది కుల వ్యవస్థలోని ద్వంద్వ చరిత్రను స్పష్టంగా చూపిస్తుంది.

**సువ్వి - స్త్రీవిద్యా చైతన్యానికి ప్రతీక :**

సువ్వి పాత్ర నవలలో కేంద్రీయ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఆమె చదువుకుంటుంది, తనపై జరిగిన అవమానాన్ని ఎదుర్కొంటుంది. సువ్వి చదువుకోవడం కేవలం వ్యక్తిగత అభివృద్ధి కాదు. ఆమె చదువు ఒక సమాజం పై ప్రభావం చూపుతుంది. దళిత వర్గాల్లో విద్య పెరిగితే భయపడే తత్వం తగ్గుతుంది, ఆత్మగౌరవం పెరుగుతుంది, ప్రశ్నించే స్వభావం వస్తుంది. ఇది సామాజిక చైతన్యానికి మూల స్తంభం.

సువ్విపై జరిగిన దౌర్జన్యం ఒక వ్యక్తిగత సంఘటన కాదు; అది అధికారం ప్రదర్శన. దళిత స్త్రీ శరీరాన్ని ఆధిపత్యానికి సాధనంగా చూడటం గ్రామీణ సామాజిక నిర్మాణంలోని క్రూరమైన వాస్తవం. నవలలో సువ్వి పాత్ర అత్యంత ప్రాధాన్యం కలది. ఆమె ఒక సాధారణ మాదిగ పిల్లకాదు; అణగారిన వర్గాలలో మొలకెత్తుతున్న నూతన చైతన్యానికి ప్రతిరూపం.

సువ్వి చదువు ద్వారా విముక్తి సాధ్యమని గ్రహిస్తుంది. రాముడు తనను అవమానించినప్పుడు, ఆమె భయంతో మౌనంగా ఉండదు; ఎదిరిస్తుంది. చెంపదెబ్బ కొడుతుంది. ఇదికేవలం వ్యక్తిగత ప్రతిఘటన కాదు - శతాబ్దాల మౌనానికి ముగింపు. స్త్రీగా, దళితురాలిగా, పేదరికంలో ఉన్న వ్యక్తిగా మూడురకాల అణచివేతలను ఎదుర్కొంటూ కూడా ఆమె వెనుకడుగు వేయదు. పెళ్లి తర్వాత కూడా చదువు కొనసాగించడం ద్వారా ఆమె స్త్రీవిద్యా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

**రాముడు - వికృత సామాజిక మనస్తత్వానికి ప్రతిబింబం:**

రాముడు ప్రతినాయకుడు. అతని పాత్రలో కుల అహంకారం, అధికారం, వికృత పౌరుషం స్పష్టంగా కనిపిస్తాయి. సువ్వి అందం, తెలివి అతనిలో లైంగిక ఆకాంక్షను రగిలించాయి. సువ్వి తనను నిరాకరించడంతో అతని అహం దెబ్బతింటుంది. ప్రేమను గౌరవంగా వ్యక్తపరచలేక, అధికారం ద్వారా పొందాలని ప్రయత్నిం చడం అతని వికృత మనస్తత్వాన్ని సూచిస్తుంది. సువ్విపై దాడి చేయడం, హత్యాయత్నం చేయడం, చివరకు అవమానం భరించలేక ఆత్మహత్య చేయడం  అతని వ్యక్తిత్వ వైఫల్యాన్ని చూపిస్తుంది.

రాముడు వ్యక్తిగతంగా దుష్టుడు మాత్రమే కాదు; కులాధిపత్యపు వ్యవస్థలో పెరిగిన ప్రతినిధి. రాముడు పాత్రసంక్లిష్టమైనది. అతనుసువ్విని అవమానిస్తాడు, దౌర్జన్యానికి దిగుతాడు. కానీ కథ చివర్లో అతని ప్రేమవికృత రూపంగా ప్రతిఫలిస్తుంది. ఇక్కడ రచయిత చూపించినది - కులవ్యవస్థలో పెరిగిన వ్యక్తి ప్రేమను కూడా స్వచ్ఛంగా వ్యక్తపరచలేడు. అతని మనస్సులో ఉన్న అధికారం, కుల అహంకారం ప్రేమను కూడా దౌర్జన్యంగా మార్చేస్తుంది. రాముడి ఆత్మహత్య - వ్యక్తిగత పరాజయం మాత్రమే కాదు. కులాధిపత్యం యొక్క అంతర్గత వైఫల్యానికి సూచన.

**చందిరి - మానవత్వానికి ప్రతిరూపం :**

చందిరి మూగవాడు. కానీ అతని నిశ్శబ్దంలో గొప్ప మానవత్వం ఉంది. సువ్విమానాన్ని కాపాడటంలో, ఆమెను వివాహం చేసుకోవడంలో అతని ధైర్యం స్పష్టమవుతుంది. అయితే అతనిలో కూడా తరతరాల బానిస మనస్తత్వం కొంత వరకు కనిపిస్తుంది. దొరలకాళ్లు పట్టుకోవడం - అతని అంతర్గత భయాన్ని సూచిస్తుంది. ఇది అణచివేత మనుషుల మనస్తత్వాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూపిస్తుంది.

**కోటయ్య - అణగారిన వర్గాల ప్రతినిధి :**

కోటయ్య నిరుపేద మాదిగ కుటుంబానికి పెద్ద. అతని పాత్రలో అణచివేతకు గురైన వర్గాల నిరుపాయ స్థితి కనిపిస్తుంది. భయంతో పంచాయితీకి వెళ్లలేకపోవడం,

సామాజిక ఒత్తిడిని భరించడం - ఇవి శతాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్గత బానిసత్వాన్ని సూచిస్తాయి.

**మాదిగపెద్ద - సామూహిక చైతన్యానికి ప్రతినిధి :**

మాదిగ పెద్దపాత్ర ద్వారా రచయిత దళిత చైతన్యాన్ని ప్రతిబింబించారు. అతను భావోద్వేగంతో కాక, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాడు. పంచాయితీ ద్వారా న్యాయం సాధించడానికి ప్రయత్నించడం సామూహిక చైతన్యానికి సంకేతం. దళితచైతన్యం అనేది కేవలం తిరుగుబాటు కాదు; అది ఆత్మగౌరవం కోసం సాగించే ఆలోచనాత్మక పోరాటం.నవలలో మాదిగపెద్దపాత్ర అత్యంత చతురతతో చిత్రించబడింది. అతను భావోద్వేగంతో కాక, వ్యూహంతో పోరాడుతాడు. పంచాయితీ ద్వారా న్యాయం సాధించడానికి ప్రయత్నిస్తాడు.

**నాంచారయ్య మార్పు - సామాజిక పరివర్తనకు సాధనం:**

నాంచారయ్య భూస్వామ్య కుటుంబానికి నాయకుడు. భూమి, ఐశ్వర్యం, వడ్డీ వ్యాపారం, దురహంకారం - ఇవన్నీ అతని వ్యక్తిత్వ లక్షణాలు. అయితే అతని భార్య లచ్చిందేవి సాత్వికురాలిగా చిత్రించబడింది. రాముడి మరణం తర్వాత నాంచారయ్యలో మార్పు వస్తుంది. చందిరిని, సువ్విని తన కొడుకు కోడలిగా స్వీకరించడం సామాజిక పరివర్తనకు సూచన. చివర్లో నాంచారయ్యలో వచ్చిన ఈ మార్పు ఒక ఆశావాద సంకేతం. అతను తన తప్పులను గ్రహించి మాదిగపల్లెకు వచ్చి కూర్చోవడం, దత్తత గురించి ప్రకటించడం - ఇవి సామాజిక మార్పు సాధ్యమని రచయిత సూచిస్తున్న సంకేతాలు. అయితే ఈ మార్పు సులభంగా రాలేదు; అది ఒక ప్రాణత్యాగం, ఒక సంఘర్షణ ఫలితం.

**భాష, శైలి - గ్రామీణ వాస్తవికత :**

నవలలో వాడుకభాష, మాండలిక ప్రయోగాలు గ్రామీణ వాస్తవికతను బలంగా ప్రతిబింబిస్తాయి. కొన్ని వర్ణనలు జుగుప్సాకరంగా అనిపించినా, అవివాస్తవ జీవితాన్ని నిర్భయంగా చూపించడానికి ఉపయోగించిన సాధనాలు. రచయిత పాఠకుడిని కుదిపివేసి, ఆలోచింపజేయాలనే లక్ష్యంతో ఈవిధమైన శైలిని అనుసరించారు.

**సామాజిక చైతన్యం దృష్టిలో "రంధి" ప్రాముఖ్యత :**

"రంధి" నవలమూడు ప్రధాన చైతన్యాలను ప్రేరేపిస్తుంది అవికుల చైతన్యం - అణచివేతకు వ్యతిరేకంగా ఐకమత్యం. స్త్రీచైతన్యం - చదువు ద్వారా స్వీయ గౌరవ సాధన. మానవత్వచైతన్యం - ప్రేమ, సహానుభూతి ద్వారా మార్పు. ఈనవల చదివిన పాఠకుడిలో సానుభూతి మాత్రమేకాక, సహానుభూతి (empathy) కలిగిస్తుంది. అణగారిన వారిస్థితిని మనసారా అనుభూతిచెంది సామాజిక స్పృహతో బాధ్యతాయుతమైన జీవితం గడపడంలోని ఆవశ్యకతను గురించి గుర్తుచేస్తుంది.

**ముగింపు :**

కొలకలూరి ఇనాక్గారి "రంధి"నవల కేవలం ఒక గ్రామ కథకాదు; అది భారతీయ సమాజంలోని కులవివక్ష, స్త్రీ అణచివేత, ఆర్థిక అసమానతలపై ఒక శక్తివంతమైన సామాజిక ప్రకటన. సువ్విరూపంలో స్త్రీవిద్యా చైతన్యం, మాదిగ పెద్ద రూపంలో సామూహిక పోరాటం, చందిరి రూపంలో మానవత్వం, నాంచారయ్య మార్పు రూపంలో సామాజికపరివర్తన - ఇవన్నీ కలిసి ఈనవలను ఒక సామాజిక చైతన్య గ్రంథంగా నిలబెడతాయి. సమాజ మార్పు కోసం సంఘర్షణ అవసరమని, విద్య మరియు ఆత్మగౌరవం విముక్తికి మార్గమని ఇనాక్గారు స్పష్టంగా తెలియజేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. రంధి నవల- కొలకలూరి ఇనాక్.
2. నవలాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.
3. ఆచార్య కొలకలూరి నాయక్ గారి రండి నవల సమగ్ర విశ్లేషణ-పోతుల కృపాకర్-ఔచిత్యం-వాల్యూమ్3.
4. మానవతా పరమావధి-కవితశ్రీ (డా. డేరంగుల శ్రీనివాసులు)-ప్రజాశక్తి 2021.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కోకొరో జపనీస్ నవల - మానసిక సంఘర్షణ

- వై. శ్రీనివాసులు
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెదురు కుప్పం.

కోకొరో అనే జపనీస్ నవల రాసింది కవి, నవలా కారుడైన సొసెకి నట్స్ మే. "బొడ్చాన్" ,"ఐ యామ్ ఎ క్యాట్", "కుసుమ కుమారా" ఇతని ఇతర ప్రసిద్ధ నవలలు. కోకొరో నవలను తెలుగులోకి శ్రీనివాస చక్రవర్తి గారు అనువదించారు. ఈ నవల ఆధారంగా ఖోన్ ఈచికవ దర్శకత్వంలో 1955లో "కొకరో" అనే జపనీస్ సినిమా కూడా వచ్చింది.ఈ నవలలో సెన్సే అనే యువకుడి జీవితంలోని ప్రేమ,స్నేహం దాగుడుమూతలుని మనసు కంటితో మనం చూడవచ్చు. సెన్సే తండ్రి, ఆస్తిపాస్తులు, అభిరుచులు గల పల్లెటూరి పెద్దమనిషి. సెన్సేకి యుక్త వయసులోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయాడు. అత్యాశ పరుడైన తన బాబాయి, తన తండ్రి సంపాదించిన ఆస్తిని అనుభవిస్తూ, తన సంరక్షణ బాధ్యత తీసుకుంటాడు. సెన్సే తన బాబాయిని బాగా నమ్ముతాడు. సెన్సేని చదువు నిమిత్తం పట్టణానికి పంపిస్తాడు. తను మొదటి సంవత్సరం చదువు పూర్తి చేసుకొని ఇంటికి రాగానే తన ఇంటిలో తన బాబాయ్ కుటుంబం అంతా ఉంటారు. సెన్సే ఆస్తిని తన బాబాయ్ తన సొంత ఆస్తి లాగా అనుభవిస్తూ ఉంటాడు. తన బాబాయి పిన్ని కలిసి సెన్సే ని తన సొంత కూతుర్ని పెళ్లి చేసుకోమని అడుగుతారు. సెన్సేకి చెల్లెల్ని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. ఆ విషయాన్ని తన బాబాయ్ కి తెలియజేస్తాడు. అప్పటి నుండి తన బాబాయ్ పిన్ని వైఖరిలో మార్పు వస్తుంది. పూర్వంలాగా ఆప్యాయంగా చూడడం మానేశారు. తనని అమాయకుడు చేసి తన ఆస్తి మొత్తం కాజేయాలని తన బాబాయి పిన్నిలిద్దరూ పథకం పన్నారని గ్రహిస్తాడు. మోసానికి తలవగ్గకుండా, ఒక స్నేహితుని సహాయంతో తన ఆస్తినంత చేజిక్కించుకుంటాడు. ఆస్తిని అమ్ముకొని చదువుకోవడానికి టోక్యో నగరానికి బయలుదేరుతాడు.

తన బాబాయి పిన్ని వలన కలిగిన అనుభవంతో సమస్త ప్రజానీకంపై తన వైఖరి మారిపోతుంది. ఇప్పుడు తన దగ్గర సుఖంగా జీవించడానికి కావాల్సినంత డబ్బు ఉంది. గందరగోళంగా ఉండే హాస్టల్ వదిలిపెట్టి ఎక్కడైనా ప్రశాంతంగా జీవించాలని అనుకుంటాడు. ఎవరి ఇంట్లోనైనా అతిథిగా ఉంటే బాగుంటుందని,వారి ఆతిథ్యానికి నెలకు కొంత డబ్బు చెల్లిస్తే సరిపోతుందని అనుకుంటాడు. అలాంటి వారి కోసం వెతుకుతూ ఉండగా, ఒక ఇంట్లో తల్లి, యవ్వనంలో ఉన్న కూతురు మాత్రమే నివసిస్తున్నారని, వారు ఆతిథ్యం ఇస్తారని తెలుసుకున్నాడు. ఆ ఇంటి యజమానురాలు పేరు ఒకుసాన్. ఆమె భర్త ఈ మధ్యనే చనిపోయాడని తెలుస్తుంది. సెన్సే వారి ఇంటికి వెళ్లి ఆమెను అతిథిగా

ఉంటానని అడుగుతాడు. ఒకుసాన్, సెన్సేని అనేక విషయాలు గుచ్చి గుచ్చి అడిగి, మంచివాడని నిర్ధారించు కొని, అతిథిగా ఒప్పుకుంటుంది. ఒక మంచి గదిని తనకు ఇస్తుంది. ఆమె కూడా సెన్సే కి గుణవంతురాలు, నిజాయితీపరురాలగా కనిపిస్తుంది,కానీ తను ఎవరిని నమ్మేవాడు కాదు. అందరూ తన బాబాయిలాగే మోసం చేస్తారని అనుకునేవాడు. మొదట్లో ఇంట్లో తనకి స్థిమితం చిక్కలేదు. బల్ల దగ్గర కూర్చొని ఆ ఇంట్లో వారిని గమనిస్తూ ఉండేవాడు. ఆ ఇంటి యజమానురాలు కూతుర్ని చూడా లని కుతూహలం కలిగింది అతనికి. రూపంలో, నడతలో అచ్చం తల్లిలాగే ఉంటుందని మనసులో ఊహించు కున్నాడు. తను ఆమె కూతుర్ని చూడగానే ముగ్ధ మనో హరుడయిపోయాడు. తనకి ఆ అమ్మాయి మీద ఆసక్తి కలిగింది. డబ్బు విషయంలో తను ఏ మానవుని నమ్మడు. కానీ ప్రేమ విషయంలో అనుమానించడం ఇంతవరకు తాను ఎరగడు. ఆ అమ్మాయి తనకు దగ్గరగా ఉన్నప్పుడు విచక్షణ జ్ఞానం పనిచేసేది కాదు. చివరికి ఆ పిల్ల మీద కలిగిన ప్రేమ, మూఢ విశ్వాసంగా మారింది. కొన్ని కొన్ని విషయాలు తనని తలకిందులు చేసేవి. ఆ కుటుంబాన్ని చూడడానికి ఎవరు వచ్చేవారు కాదు. కానీ ఒక్కొకప్పుడు ఆ ఇంట్లో పురుష స్వరం వినిపిస్తుండేది. అటువంటప్పుడు ఏదో విచిత్రమైన కంపనం, ఉద్రేకం తనలో కలిగేవి. అతని ఎవరు? పడుచువాడా? మధ్య వయస్కుడా? అని ఆశ్చర్యపోతుండేవాడు. తల్లి కూతుర్లు ఇద్దరూ తనని విశ్వాసిస్తున్నారని సెన్సేకి తెలుసు. తల్లికి, తన కూతురూ, సెన్సే పరస్పరం ప్రేమించుకోవాలని ఉంది. కానీ ఆ ప్రేమ ఆమె అనుకున్న హద్దు దాటిపోవడం ఆమెకు ఇష్టం లేదు.

ఏ రోజు కూడా, తన కూతుర్ని ఒంటరిగా ఇంటిలో వదిలి వెళ్ళేది కాదు. ఏ ఉద్దేశంతో మా బాబాయీ, పిన్ని తన కూతురు వివాహం చేయ తలపెట్టారో, అదే ఉద్దేశంతోనే ఆ ఇంటి యజమానురాలు తన కూతుర్ని నేను ప్రేమించాలని ఆశిస్తుందేమోనని అనుమానం కలిగేది. ఒక్కొక్కప్పుడు ఒకుసాన్ మంచి జి త్తులమరిగా కనిపించేది. వారి ఆర్థిక పరిస్థితి సవ్యంగా లేదు. డబ్బు దృష్టితో చూస్తే నాతో సంబంధం వారికి నష్టదాయకం ఏమీ కాదు. అంతేకాదు తల్లితో పాటు కూతురు కూడా మంచి జిత్తులమారి అని అనుమానం తనను బాధించేది. సెన్సే ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నప్పటికీ తనను మోసం చేస్తారని అనుమానంతో ఆ అమ్మాయిని తనకు ఇచ్చి పెళ్లి చేయమని అడగడానికి అవస్థపడేవాడు. ఆ పిల్ల బాగా అలంకరించుకొని తనతో బయటకు వచ్చినప్పుడు దారిలోఎవరైనా ఆమెను చూస్తే తనకు కంపరమెత్తేది. సెన్సే ప్రేమ వ్యవహారం ఇలా నడుస్తూ ఉండగా ఆ ఇంటిలోకి ఇంకొకతను ప్రవేశించాడు. అతని పేరు కె. ఈ సంఘటన సెన్సే నుదుటి గీతలను తలకిందులు చేసింది. చిత్రమేమిటంటే కేని ఆ ఇంట్లోకి ప్రవేశపెట్టింది సెన్సేనే. కె మరియు సెన్సే ఇద్దరూ ఒక ఊరు వారే. కే తండ్రి బాగా డబ్బు కలవాడే కానీ ఏ కారణం చేతనో, కేని ఒక డాక్టర్కి దత్తత ఇచ్చాడు. పెంపుడు తండ్రి, కేని డాక్టర్ చేయాలని కోరిక ఉండేది. కానీ కేకు మాత్రం ఆ కోరిక లేదు. కానీ కేకి మతంలో, తత్వశాస్త్రంలో ఆసక్తి ఎక్కువగా ఉండేది. తను రహస్యంగా కాలేజీలో తత్వ శాస్త్రం చదువుతూ ఉండేవాడు. తనను పెంచుకున్న వారిని మోసగిస్తున్నాననీ, తన నడత క్షమించరాదని అనేవాడు తను చేసినంత ఒప్పుకుంటూ పెంపుడు తండ్రికి ఉత్తరం రాశాడు. కే పెంపుడు తండ్రికి కోపం వచ్చి, ఇక మీదట చదువుకోడానికి డబ్బులు పంపించనని ఉత్తరం రాసాడు. కే చేసిన మోసానికి, కన్న తల్లిదండ్రులు కూడా కోపం వచ్చింది. కేకి చదువుకోడానికి డబ్బు అవసరం ఏర్పడింది. రాత్రిపూట పని చేసుకుంటూ, పగలు కాలేజీ కెళ్ళి చదువుకునేవాడు. కానీ ఎక్కువగా పని చేయడం వలన ఆరోగ్యం, ఉత్సాహం రెండు దెబ్బతిన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితులు, సర్దుబాటు వల్ల అతని మనసు చెదిరిపోయింది. భవిష్యత్తు అతనికి అగమ్య గోచరమైంది. కష్టాల అనుభవిస్తూ, మానసిక శక్తిని పెంపొందించు కుంటూనే, తాను శక్తివంతుడు అవుతానని విశ్వసించే వాడు. కె ఆర్థిక పరిస్థితి చూసి జాలిపడి, సెన్సే అతనికి సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఒంటరితనంలో ఉన్నవాడు మరొక ఒంటరితనంలో ఉన్నవాడు చూస్తే

జాలి కలుగుతుంది. ఇక్కడ సెన్సే కూడా కేని చూస్తే జాలి కలిగింది. కానీ కే మాత్రం తనకి సహాయని నిరాకరించాడు. చివరికి మనిషి పూర్తిగా కృంగిపోయే స్థితికి వచ్చిన తర్వాత ఎంతో బతిమిలాడిగా సెన్సేతో ఉంటానని అంగీకరించాడు.

సెన్సే ఆ ఇంటి యజమానిని ఒప్పించి కేని తనతో పాటే, పక్కన ఉన్న చిన్న గదిలో ఉంచాడు. కష్టాలకు అలవాటు పడిపోతే భరించడం తేలికని చివరి కవిపాదిం చవని కే భావించేవాడు. తప్పు చేశామన్న అపరాధ భావంతో ఒంటరితనం అనుభవించే వాళ్ళకి కష్టాలు అనుభవించడం ప్రాయశ్చితం అని నమ్ముతారు. కేని బాధల నుండి ఉపశమనం కలిగించడానికి, సెన్సే తల్లి కూతుర్లకి కేతో స్నేహంగా మెలగమని, మాట్లాడుతూ ఉండమని చెప్తాడు. ఒకసారి సెన్సే బయట నుండి ఇంట్లోకి వస్తూ ఉండగా కే రూమ్ లో కేతోపాటు యజమాని కూతురు కూడా ఉంది. కె సెన్సేను చూసి ఇదేనా రావడం అని అన్నాడు. ఈ అమ్మాయి ఓ వచ్చారా అని ఏదో మొక్కుబడిగా పలకరించింది. ఆ కంఠస్వరం సహజంగా లేదు. తను ప్రేమించే అమ్మాయి, తనని నిర్లక్ష్యంగా చూడడం సెన్సే భరించలేకపోయాడు. మరొకసారి యజమాని కూతురు, కే మాత్రమే ఇంట్లో ఉన్నారు. సెన్సేకి మొదటిసారిగా ప్రేమ విషయంలో అనుమానం కలిగింది. తన కూతుర్ని నాతో ఎప్పుడూ ఒంటరిగా వదిలి బయటికి వెళ్ళేది కాదు. సెన్సే అమ్మాయిని మీ అమ్మ ఎక్కడికి వెళ్ళింది అని అడిగగా, అమ్మాయి ఒక నవ్వు నవ్వి, పనిమీద బయటికి వెళ్లిందని చెప్పింది. సెన్సే ఆ సన్నివేశాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఆ అమ్మాయి నవ్వడం సెన్సే కి నచ్చలేదు. సెన్సే కేతో పోల్చి చూసుకుంటే కేదె పై చేయిగా ఉండేది. కేని స్త్రీలు ఎక్కువగా ఇష్టపడేవాళ్లు. సెన్సేలో అసూయ పెరిగి పోయింది. ఒకరోజు సాయంత్రం సెన్సే కె ఇద్దరూ షికార్కి వెళ్ళారు. సెన్సే కే ని తల్లి కూతుర్ల మీద నీ అభిప్రాయం చెప్పమని అడిగాడు అతని సమాధానాలు అస్పష్టంగా ఉన్నాయి. సెన్సేకి అనుమానం మరింత పెరిగింది. వేసవి సెలవులకు సెన్సే వేరొక ఊరు వెళ్ళవలసి వచ్చింది కానీ కె ని తల్లి కూతుళ్లతో ఒంటరిగా వదిలి వెళ్ళడం ఇష్టం లేక, కేను కూడా తనతో పాటు రమ్మన్నాడు.కే సెన్సే మాట కాదనలేక తనతో పాటు వెళ్ళాడు. ఆ కొత్త ఊరిలో, సాయంత్రం పూట, బీచ్ లో నడుస్తూ సెన్సే కే తో ఇలా అన్నాడు. హఠాత్తుగా వెనకనుంచి నీ మెడను గట్టిగా పట్టుకుని సముద్రంలో తొలి ఏస్తే ఏం చేస్తావని ప్రశ్నిం చాడు. అప్పుడు కె కదలకుండా, “సరే తోసేసేయ్ అదే నేను కోరుకునేది” అని తల వెనుకకు తిప్పకుండా సమాధానం ఇచ్చాడు. అంటే కే అప్పటికే జీవితం మీద విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకున్నాడు అని మనకు అర్థమవుతుంది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారిలో అపరాధభావం, ఒంటరితనం సాధా రణంగా కనిపించే లక్షణాలు. ఒంటరిగా జీవించాలంటే మనిషికి ధైర్యం ఉండాలి. జీవితం మీద అవగాహన ఉండాలి.

ఆ ఊరు నుంచి తిరిగి వచ్చిన తర్వాత, ఒకసారి సెన్సే వీధిలో నడుస్తూ ఉండగా కె ఎదురుపడ్డాడు. కేకి ఎనకతల ఆ అమ్మాయి నిలబడి ఉంది. ఆ అమ్మాయి కొద్దిగా సిగ్గుతో నన్ను పలకరించింది. ఆ తర్వాత సెన్సే కి ఎక్కడికి వెళ్లాలో తోచలేదు. అమ్మాయి తనకు మాత్రమే సొంతమని, ఇంకెవరితోనైనా మాట్లాడినా,తిరిగినా ఓర్చుకోలేకపోయేవాడు. సెన్సే ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కేని ఆ అమ్మాయితో ఎక్కడికి వెళ్లావు అని అడిగాడు. ఆ అమ్మాయితో కలిసి బయటికి వెళ్లలేదు, బయట నుంచి వస్తుంటే తను కనిపించింది,ఇద్దరం కలిసి ఇంటికి వచ్చాము అని కె సమాధానమిచ్చాడు. సెన్సే అదే ప్రశ్న ఆ అమ్మాయిని అడిగాడు. ఆ అమ్మాయి ఏ సమాధానం చెప్పకుండా ఒక నవ్వు నవ్వింది. సెన్సేకి కే మీద ఈర్ష్య కలిగింది. కే ఇక్కడికి రాక మునుపు ఎవరి వలలో పడకూడదని, సెన్సే దృఢ నిశ్చయం చేసు కున్నాడు. కానీ ఆ అమ్మాయిని గాఢంగా ప్రేమించాడు. ఏ దారి తొక్కలో తెలియక స్తబ్దంగా ఉండిపోయాను.

ఒకరోజు తల్లి కూతుర్లు బంధువులు చూడడానికి వేరే ఊరు వెళ్లారు. సెన్సే,కె మిగిలిపోయి ఎవరి గదిలో వాళ్ళు కూర్చున్నారు. కె సెన్సే గదిలోకి వెళ్లి ఏమిటి

ఆలోచిస్తున్నావు అని అడిగాడు. తెలిసి ఏం మాట్లాడ కుండా కే వంక చూశాడు. కె ఒక్కసారి గురించి ఆమె కుమార్తె గురించి మాట్లాడసాగాడు. ఒకసారి కూతురు మీద తనకు గల గాడ ప్రేమ గురించి కె విపరీతంగా చెప్తుంటే సెన్సే వింటూ కూర్చున్నాడు. కే మాటలు వింటుంటే మాటలు వింటుంటే సెన్సే గుండె రాయి లాగా మారిపోయింది. సమయం మించిపోయింది. ఒక్కసారి కూతుర్ని ప్రేమిస్తున్నానని నేనే ముందుగా కేకు చెప్పనందుకు సెన్సే బాధపడ్డాడు. కే ప్రశాంతంగా కూర్చున్నాడు. సెన్సే మనసు కలత చెంద సాగింది. సెన్సే కే గురించి ఆలోచించసాగాడు. కేలు ఇంత మార్పు ఎలా వచ్చింది? అతను ఎంత బలియుడు, ఎంత నిజాయితీ పరుడు నాకు తెలుసు.కానీ హఠాత్తుగా నాకు పెనుభూతం లాగా గోచరించాడు. శాశ్వతంగా నన్ను పీడిస్తాడేమోనని భయం కూడా వేసింది. సెన్సే కి రాత్రులు నిద్ర పట్టేది కాదు. ఒకరోజున ఒకసాని కూతురు మీద ప్రేమను గురించి నాతో చెప్పడమేనా వాళ్లతో కూడా చెప్పావా అని కేని సెన్సే అడిగాడు. ఇంకెవరితో చెప్పలేదని కే నమ్మకంగా చెప్పాడు. సెన్సే మనసుకు కుదుటపడింది. ఒకుసాన్ కూతురు నీ ప్రేమను తిరస్కరిస్తే నువ్వు తప్పుకుంటావా అని కేని సెన్సే అడిగాడు. కే జవాబు చెప్పలేకపోయాడు. కే అనుసరిస్తున్న మతంలో ప్రథమ సూత్రం ఇంద్రియ నిగ్రహం.తాను నరక యాతను అనుభవిస్తున్నానని చెప్పాడు. కే ఆదర్శానికి వాస్తవానికి మధ్య కొట్టుమిట్టాడు తన గ్రహించి ఒక దెబ్బతో అతని పని పట్టించే సమయం కోసం ఎదురుచూస్తున్నాను. ఇది కలా?నిజమా అర్థం కాలేదు. తనకు దృఢ సంకల్పం అవసరమని తనలో తను తలపోసుకొని, కే కంటే ముందుగా అతను తెలియకుండా నా కార్యం సాధించుకోవాలని సెన్స్ నిశ్చయించుకున్నాడు. సెన్సేకి సంభాషణ ఎలా మొదలు పెట్టాలో తెలియక హఠాత్తుగా ఓకొసన్ నీ నీ కూతురు నాకు ఇచ్చి పెళ్లి చేస్తామని అడిగాడు. ఉపసం ప్రశాంతంగా సరేగాని ఏమంత తొందర వచ్చింది పెళ్లికి అంది. సరే నీకు ఇచ్చి పెళ్లి చేస్తారు అంది. సరే బాగానే ఉంది నా కూతురికి ఇష్టం కాకపోతే ఎలా ఇచ్చి పెళ్లి చేస్తాను అంది. ప్రేమ విషయంలో కే కి తను మోసం చేస్తున్నానేనని సెన్సే మదిలో కలిగింది.

నిజాయితీగా నడుచుకోవాలని యత్నిస్తూ కాలుజారి పడ్డ తెలివి తక్కువ మొ ద్దు నేను . ఈ విషయం నాకు మాత్రమే తెలుసు. పెళ్లి విషయం కేకు తెలుసు తెలియ పరిచావా? అని ఒకుసాన్ సెన్సేని అడిగింది. ఒకుసాన్ సెన్సే పెళ్లి విషయం కేకి తెలియపరిచింది. ఈ విషయం సెన్సేకి చెప్పింది. ఒకుసాన్ని కే ఏమన్నాడు అని సెన్సే అడిగాడు. కే ఆశ్చర్యపోయాడని కానీ ప్రశాంతంగా ఉన్నాడని "అలాగానా అని చిరునవ్వు నవ్వి లేచి నిలబడి నాకు ఎంతో సంతోషంగా ఉంది అని అన్నాడట. పెళ్లి ఎప్పుడు అని ప్రశ్నించి, వాళ్లకు మంచి బహుమతి ఇవ్వాలని ఉంది కానీ చేతిలో డబ్బులు లేదు అన్నాడట. సెన్సే ఎత్తుగడ విజయవంతమైన మానవునిగా అపజయం పొందాడని బాధపడ్డాడు. కానీ ఆ రాత్రికే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు ఆ దృశ్యం తోటి ఇప్పటికే నాకు వణుకు పుడుతుంది. రాత బల్లమీద నాకు కే రాసిన ఉత్తరం కనిపించింది. అందులో కే ఇలా రాసి ఉన్నాడు. తనకు బొట్టుగా మనోనివ్వరం చొరవా లేదని అందువల్ల భవిష్యత్తులో ఆస్మసించి ఆత్మహత్య చేసుకుంటానని కే రాశాడు దయతో ఆదరించినందుకు కృతజ్ఞత అభివందనాలు తెలుపుతూ చనిపోయిన తర్వాత తన వ్యవహారాలను చూడవలసిందిగా సెన్సేని కోరాడు. చిన్న కత్తితో గొంతు కోసుకొని చనిపోయాడు తలుపుల మీద నెత్తురు రక్తం మరకలు పడి ఉన్నాయి. సెన్సే మనసు కలచివేసింది. ప్రేమ విషయంలో కె ని సెన్సే మోసం చేశానని అనుకున్నాడు. అప్పుడు సెన్సేకి తన బాబాయి చేసిన మోసం గుర్తొచ్చింది. జనులు సామాన్యంగా అంతా అంత మంచివాళ్లే కానీ హఠాత్ పరిస్థితులు వారిని దుర్మార్గులుగా మార్చేస్తాయి. ప్రపంచం ఎంత పాపిష్టిదైనా నేను మాత్రం నమ్మదగిన వాడిని విశ్వసించాను కే మరణం వల్ల ఈ విశ్వాసం పటాపంచలు అయిపోయినందున నేను హఠాత్తుగా కనిపించిపోయాను నేను అచ్చం మా బాబాయ్ వంటి వాడిని గుర్తించారు. ప్రేమ విఫలమైనందువల్ల కే ఆత్మహత్య చేసుకోవడం

అనుకున్నాను కానీ నాలాగే వంటతనంతో విసుగెత్తి ప్రాణం తీసుకున్నాడని అనిపిస్తుంది నేను కే తోవలోనే పయనిస్తున్నాననభావం హృదయలో సెన్నే పాపం చేశానని బాధపడ్డాడు ఈ బాధే తన మనసుని కలిచి వేసింది. ఈ భావంతోనే నడిబజార్ల కొత్త వారు ఎవరైనా నన్ను కొడతా కొడితే బాగుందని కోరుకునేవాళ్ళు ఈ బజార్లలో తిరుగుతుంటే ఎవరో వచ్చి కొట్టే కన్నా, నన్ను నేను కూడా కొట్టుకోవాలని, నన్ను నేనే కొట్టుకుని బదులు ప్రాణం తీసేసుకోవాలని అనుకునేవాడిని ఏమి చేయడానికి తోచక రాయిలాగా పడి ఉన్నాను. పెళ్లి చేసుకుంటే కొద్ది రోజులకి ఈ బాధ మరిచిపోతాను అని అనుకున్నాను.

కూతుర్ని పెళ్లి చేసుకున్నాను. కానీ నా మనసులోంచి అపరాధ భావం తొలి గిపోలేదు. ఒంటరితనం ఆవహిం చింది. పెళ్లి చేసుకున్నా నాలో మార్పే మి రాలేదు. నా ప్రభుత్వం నా భార్య కూడా బాధపడేది. మాకు పెళ్లయి ఐదేళ్ల పిల్లలు పుట్టలేదు. దీనికి కారణం కూడా నేను చేసిన పాపమే అని అనుకున్నాను. సెన్నే భార్యకు కూడా తన వల్ల ఆనందం లేకుండా పోయింది. మానసికక్షోభను భరించలేక సెన్నే కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. మనిషి డబ్బు ప్రేమ విషయంలోనే ఎక్కువగా మోసపోతుం టాడు. ముఖ్యంగా ఈ రెండు విషయాల్లో మోస పోయినప్పుడు జనాలు మీద నమ్మకం పోతుంది సంఘం మీద విరక్తి కలుగుతుంది. ప్రపంచం శూన్యం అయి పోతుంది. భవిష్యత్తు చీకటిగా మారిపోతుంది. జీవితం కష్టంగా మారిపోతుంది. జీవితంలో చావే అన్నిటికంటే కష్టమైనది. చావు కంటే జీవితమే కష్టమైనప్పుడు మనిషి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. పిరికివాలే ఆత్మహత్య చేసుకుంటారు. ధైర్వంతులు బతకాలనుకుంటారు ఎలాగైనా బతుకు బతకాలను కుంటారు అంత తొందరగా సచ్చి ఏం సాధిద్దామను కుంటారు. ఏదైనా బతికే సాధిద్దామని ధైర్యంగా ముందుకు సాగిపోతారు.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# అక్కినేని కుటుంబరావు నవలలు - సామాజిక చైతన్యం

- పిడతల రామచంద్రుడు
తెలుగు అధ్యాపకులు, డి.ఆర్.జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్
(పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు)

**ఉపోద్ఘాతం :**

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది మాత్రమే కాదు, సమాజాన్ని ప్రభావితం చేసే ఒక శక్తివంతమైన ఆయుధం కూడా. ముఖ్యంగా 'నవల' ప్రక్రియ సామాజిక పరిణామ క్రమంలో అత్యంత కీలక పాత్రను పోషించింది. మానవ సంబంధాలు, ఆర్థిక అసమానతలు, కుల-మత వివక్షలు మరియు స్త్రీ చైతన్యం వంటి అనేక సామాజిక అంశాలను నవల అక్షరబద్ధం చేస్తుంది. కేవలం ఒక కథా వస్తువుగా మిగిలిపోకుండా, పాఠకుడిలో ఆలోచనలను రేకెత్తించి, సామాజిక మార్పుకు పునాది వేయడమే 'సామాజిక చైతన్యం' యొక్క ముఖ్య ఉద్దేశ్యం.బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అక్కినేని కుటుంబరావు రచయితగా దర్శకుడిగా నిర్మాతగా నటుడిగా ప్రసిద్ధులు. ఆయన నవలలు సామాజిక చైతన్యానికి నిలువుటద్దాలు. ముఖ్యంగా 20వ శతాబ్దపు ద్వితీయార్థంలో సామాజిక చైతన్యానికి ప్రతీకలు. ఆయన రచించిన సౌరాజ్యం, వేణుగానం, అథో జగత్ సహోదరి, మోహన రాగం, కార్మిక గీతం, చేదు పాట నవలల లోని సామాజిక చైతన్యాన్ని పరిశీలించడం ఈ సిద్ధాంత వ్యాస ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు :**

తెలుగు నవల, సామాజిక చైతన్యం, సమాజంలోని అసమానతలు, స్త్రీ సాధికారత, నిరుద్యోగులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు

**సౌరాజ్యంనవల - సామాజిక చైతన్యం:**

ఇది ఒక యదార్ధ సంఘటన ఆధారంగా రూపొందించిన నవల. చౌటపల్లి లో గల మాలపల్లి లోని దళిత వర్గానికి చెందిన ఎంకడి కుటుంబం ఈ నవలకి కేంద్ర బిందువు. 1947 కాలంలోని కొన్ని సంఘటన లను ఈ నవలలో కుటుంబరావు హృద్యంగా మలచారు. స్వతంత్రం రావడం అంటే కుల వివక్షలు పోతాయి అనే హామీ ఏమీ లేదు అని ఎంకడు పాత్ర ద్వారా చెప్పిస్తాడు. అమరయ్య పాత్ర ద్వారా గ్రామాలలో కుల అహంకారాన్ని ఎలా ప్రదర్శిస్తారు అనే విషయం తెలుస్తుంది. దొంగ తనం కేసులో జోజుగాడు అనే పాత్రను దొరలు సజీవ దహనం చేస్తారు. ఆ పని మాలపల్లి లోని నలుగురు యువకులు చేశారని జైలులో వేయిస్తారు. మరొక సందర్భంలో మాల సహదేవుని వాళ్ల దొర ఎర్ర సత్యం కొట్టడాన్ని సహించలేక మాలపల్లి యువకులు వెళ్లి అడుగుతారు. ఆ సందర్భంలో దొరల సహజ స్వభావాలు అయిన కులమదము, అధికార మదము, ధనమదము ఎర్ర సత్యం మాటలతో తెలుస్తుంది. కూలి రేట్లు పెంచమని దళిత కూలీలు అడగగానే పక్క ఊరి నుండి

కూలీలను పిలుచుకుని వచ్చి వారికి పని లేకుండా చేస్తాడు దొర. ఆ సందర్భంలో తిరుపతి అనే దళిత వ్యక్తి కూలీలలో ఐక్యతను తీసుకువస్తాడు. అందువలన దొరలు తిరుపతిని చంపి వేస్తారు. ఈ విధంగా తండ్రి మరణం అన్న మరణం లతో సొరాజ్యం అనాథ అయి వేరే ఊరికి వలస పోతుంది

**వేణుగానం నవల – సామాజిక చైతన్యం :**

ఈ నవల వేణు అనే విద్యావంతురాలైన యువతి భావజాలం ఆధారంగా జరుగుతుంది. ఆవిడ చదివే పుస్తకాలలో స్త్రీల పట్ల సమాన దృక్పథం గల వ్యక్తులు నిజజీవితంలో ఉంటారా అనుకుంటూ ఉంటుంది. ఒక సందర్భంలో సినిమా థియేటర్‌లో ఒక వృద్ధురాలు అడుక్కోవడం చూసి వేణు హృదయం బాధతో విలవిల లాడుతుంది కానీ ఆ స్నేహితుడు ఆవిడని కసురు కుంటాడు. అదే సినిమా హాలులో బూతులు, ద్వంద్వార్థాలు, ఆడపిల్లలను ఇబ్బంది పెట్టేలా ఉన్న సన్నివేశాలను చూసి అసహ్యంచుకుంటుంది. తన స్నేహితుడితో సంభాషణ ద్వారా స్త్రీల మీద పురుషులకు ఉన్న తప్పుడు తక్కువ ఆలోచనలను అర్థం చేసుకుంటుంది.అందుకు కారణం ఆర్థికంగా స్త్రీలు పురుషుల మీద ఆధారపడటమే అనుకుంటుంది. వ్యక్తి స్వార్థం ఎక్కువగా చూసుకునే వ్యక్తులు డబ్బుకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తులు అనురాగం ఆప్యాయతలను పక్కన పెట్టే వ్యక్తులు వీరందరిని వేణు సునిశితంగా పరిశీలిస్తుంది. తనతో పెళ్లి చేసుకున్న శేఖరంలో వచ్చిన మార్పులు వ్యవస్థలు స్త్రీ పురుష ఆలోచన విధానాలలో ఉన్న భేదాలుగా అర్థం చేసుకుని అద్భుతమైన వ్యక్తిత్వాలు చనిపోయాయి అనుకుంటుంది. ఒక సందర్భంలో ఫ్యాక్టరీ కార్మికులను చూసి దేశం అంటే కార్మికులు కర్షకులే అని భావిస్తుంది. మనిషిని ప్రేమించే స్వభావం ఉన్న వెంకటప్పయ్యను పెళ్లి చేసుకోవడంతో నవల ముగుస్తుంది.

**అధో జగత్ సహోదరినవల – సామాజిక చైతన్యం :**

ఈ నవల దుర్గా అనే బలవంతంగా వ్యభిచారంలోనికి నెట్టి వేయబడిన స్త్రీల స్థితిగతులను గురించి చక్కగా తెలుపుతుంది. పేదరికము నిస్సహాయత కొందరి స్వార్థం, పోలీస్, న్యాయ వ్యవస్థలలోని లోపాల వలన ఎంతో కష్టనష్టాలను అనుభవించే స్త్రీల గురించి దుర్గ పాత్ర ద్వారా తెలుస్తుంది. కిడ్నాప్ అమ్మి వేయటం బల వంతంగా వ్యభిచార వృత్తిలోకి దింపడం బయట ప్రపంచంలో బొత్తిగా విలువ లేకపోవడం భౌతిక దాడులు హింస ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పని చేయించడం వంటి ఎన్నో అన్యాయాలకు దుర్గ గురిఅవుతుంది. అదే నవల లోని రేణు అనే పాత్ర ద్వారా ప్రేమ పేరుతో తమకే తెలియని సంసారలంపటత్వంలో మంట కలుపు కోవడం గురించి కూడా రచయిత తెలియజేస్తారు.సినిమా అవకాశాల పేరుతో బలవంతంగా వ్యభిచార వృత్తిలోనికి రేణును గురిచేస్తారు. కొత్త గొప్ప ఆస్తిపాస్తులు ఉన్న రేణు పేదరాలైన దుర్గ కేవలం స్త్రీలు కావడం కారణంగా ఈ కూపంలోనికి దిగి ఉంటారు. ఒక స్త్రీకి మానభంగం అయింది అంటే అది ఆ స్త్రీకి మాత్రమే కాదు మొత్తం మానవజాతికి మానభంగం అయినట్లే అని అను కుంటుంది దుర్గ. సమాజపు పోకడలను జీవితపు ఆటు పోటులను చవిచూస్తుంది. పాపము పుణ్యము స్వర్గము నరకము ఏమీ లేవు ఆకలి మాత్రమే నిజం అను కుంటుంది. జీవన పోరాటంలోని అవస్థలను అనుభవించి చివరకు సుఖ వ్యాధులతో మరణిస్తుంది

**మోహనరాగంనవల – సామాజిక చైతన్యం :**

ఈ నవల మోహన్ అనే యువకుడి ఆలోచన విధానం ఆధారంగా జరుగుతుంది. ఆడపిల్లలు చదువుకోవడం వలన ఉపయోగాలు, నగర కాలుష్య వాతావరణం, రమణమ్మతో సంభాషణలలో అశాశ్వతమైన జీవితం గురించిన ఆలోచన, కుల భేదాలు, పోషకాహార లోపం మొదలైన ఎన్నో సమస్యలను తన లేఖలలో రాస్తాడు మోహన్. మనదేశంలో ప్రతి సమస్య పరిష్కారం మరో సమస్యతో ముడిపడి ఉంటుంది అంటాడు.

**కార్మిక గీతం నవల – సామాజిక చైతన్యం :**

ఈ నవల కార్మికుల జీవితానికి ఒక దర్పణం. ప్రజలకు ప్రజా కళాకారుల వలన నిజమైన మేలు జరుగుతుంది అని ఈ నవల నిరూపిస్తుంది. చంద్రయ్య అనే కార్మికుడు అతని ప్రయాణం కష్ట నష్టాలు ఈ నవలలు కనిపిస్తాయి.

అతను కూలీల ఐక్యత గురించి, అవసరమైతే అందుకోసం చేయాల్సిన త్యాగాల గురించి కూలీలతో ప్రసంగిస్తాడు. పెట్టుబడిదారీ విధానంలోని శ్రమదోపిడిని వివరిస్తాడు. అయితే అతని వలన జరిగిన సమ్మె విఫలమవుతుంది. అందుకు కారణం కార్మిక నాయకులు అమ్ముడుపోవడం. అదే సమయంలో విద్యార్థుల సమస్యలపై ఆందోళన చేసిన అనుభవం ఉన్న మోహనరావు మళ్లీ బంద్ ప్రకటిస్తాడు. కార్మికులు అంతా ఐక్యంగా మద్దతు ఇస్తారు. రాజకీయాలు యూనియన్లను ఎలా చెడగొడతాయో కూడా ఇందులో వివరిస్తాడు రచయిత.

**చేదు పాట - నవల - సామాజిక చైతన్యం :**

చేదు పాట నవలలో మనుషులు విద్యార్థులుగా బాల్యాన్ని కోల్పోవడం పరీక్షల కోసం మార్కుల కోసం విద్యా విధానం ఉండటం కార్పొరేట్ విద్యావ్యవస్థ గురించి విమర్శనాత్మకంగా ఉంటుంది. కేశవరావు కుమారుడు అరుణ్ ఎంసెట్ పరీక్షలకు చదువు తుంటాడు. బాల్యం యవ్వనం చదువుల పేరుతో అకస్మాత్తుగా మాయం కావడం గురించి కేశవరావు బాధ పడతాడు. కేవలం డబ్బు కోసం ఇంత కష్టపడాలా జీవితాన్ని బలి ఇవ్వాలా, చదువు లేని వారు సంపాదిస్తున్న వారు ఎంతమంది లేరు అని అంటాడు రామ్మూర్తి అనే పాత్ర. అలాగే నిరుద్యోగ సమస్య గురించి సినిమా పిచ్చిలో పడి ఘర్షణలకు లోనవడం గురించి, రిజర్వేషన్ వ్యవస్థ గురించి ఈ నవలలో వివరిస్తాడు. డబ్బుతో ముడి పడకుండా లభించే ఆనందాన్ని కావాలనుకుంటాడు కేశవరావు

**ముగింపు :**

ఈ విధంగా అక్కినేని కుటుంబరావు తన నవలలలో సమాజంలోని అనేక అంశాలను వాటి కారణాలను వాటి పరిష్కార మార్గాలను ఆకట్టుకునే లాగా చిత్రించారు. సమకాలీన తెలుగు నవలా సాహిత్యంలో అక్కినేని కుటుంబరావు గారి రచనలు ఒక విశిష్టమైన ముద్రను వేశాయి. సమాజంలోని అట్టడుగు వర్గాల జీవన చిత్రణను, గ్రామీణ నేపథ్యాన్ని మరియు మారుతున్న సామాజిక విలువలను ఆయన తన నవలల్లో అత్యంత సహజంగా ఆవిష్కరించారు. చైతన్యం అనేది కేవలం నినాదాల్లోనే కాకుండా, మనుషుల ప్రవర్తనలోనూ, వారి జీవన పోరాటంలోనూ ప్రతిబింబిస్తుందని ఆయన రచనలు నిరూపిస్తాయి. కేవలం సమస్యలను ఎత్తిచూపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక కారణా లను విశ్లేషిస్తూ పాఠకుడిని ఆలోచింపజేయడం కుటుంబ రావు గారి శైలిలోని ప్రత్యేకత.

**ఆధార గ్రంథాలు :**

1. అక్కినేని కుటుంబరావు నవలలు
2. ఆధునిక నవలలు ఒక పరిశీలన - తెలుగు అకాడమీ
3. 'అక్కినేని కుటుంబరావు రచనలు పరిశీలన' సిద్ధాంత గ్రంథం - గోన నాయక్

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# స్వప్నజీవి - స్త్రీ కోణం

- డా॥. టి. ఎన్. ఆంజనేయులు
తెలుగు అధ్యాపకులు, తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం.

**నవలా నేపథ్యం :**

మహనీయులు అబ్దుల్ కలాం కలలు కనండి ...కలలు సహకారం చేసుకోండి... అని చెప్పారు. కలలు కనాలి కానీ కలలే జీవితం అనుకోకూడదు. నా కళ నిజం కావాలనే ఆతృతతో ఆధునిక సమాజంలో మానవుడు సమయానికి ఆహారం, నిద్ర ,శృంగారం వంటివి కోల్పోతూ మానసిక రోగానికి గురవుతూ జీవితాన్ని నాశనం చేసుకునే స్థితికి దారితీస్తోంది. ఈర్ష్య ద్వేషాలతో మనశ్శాంతిని కోల్పోతూ కలల ప్రపంచంలో మునిగిపోతూ వాస్తవికతకు అవాస్త వితకు తేడా తెలుసుకోకుండా ప్రస్తుత సమాజంలో మానవులు నరకయాతన అనుభవిస్తున్నారని ఈ నవలలో రచయిత విశ్లేషించారు.

నీతి నిజాయితీ గల చిత్రకారుడు హనీ (హనుమంత రావు) భర్తను వదిలేసిన తోటి కళాకారిని శశికళను నమ్మి సహ కళాకారుల సహాయ సహకారాలతో వివాహం చేసుకొని సంతోషంగా జీవనం సాగించేవాడు. శశికళ కుమార్తె భార్గవిని సొంత కూతురు కాకపోయినా తన కూతురుగా భావించి రక్త మాంసాలు పంచుకొని పుట్టిన బిడ్డ కంటే ఎక్కువ ప్రేమతో చూసుకుంటున్నాడు. కొద్ది కాలం వీరి జీవితం ఆనందమయంగా కొనసాగింది వీళ్ళిద్దరికీ గిరీష్ అనే పుత్రుడు కూడా జన్మించాడు. బొమ్మలు వేసుకుని జీవనం సాగించే హనీకి బొమ్మల కొట్టులో బొమ్మలు అమ్ముకునే భీమేశ్వర్ తో పరిచయం ఏర్పడి వాళ్ళిద్దరి మధ్య వ్యాపార లావాదేవీలు జరిగాయి. హనీ వేసిన అద్భుతమైన బొమ్మలకు కొంత డబ్బు ఇచ్చి ఎక్కువ డబ్బులు సంపాదించుకునే వాడు భీమేశ్వర్.

శశికళ మాటలు నమ్మి హనీ సొంత ఇల్లు అమ్మి ఆమె పేరు మీద సైట్ కొని కొత్త ఇల్లు కట్టుకున్నారు. ఇల్లు కోసం భీమేశ్వర్ దగ్గర అప్పులు చేయడంతో శశికళ భీమేశ్వర్ కొట్టులో ఉద్యోగం చేస్తుండేది.ఇంటి కోసం చేసిన అప్పులు ఒకవైపు , కూతురు పెళ్లి, కొడుకు చదువు వల్ల ఆర్థిక భారం పెరిగి హనీ వేసిన బొమ్మలతో ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉందని హనీను నిందిస్తూ హనీ తోనే ఇంటి పనులు చేయించడం మొదలుపెట్టింది శశికళ. డబ్బు , ఆడంబరాలతో మదమెక్కిన శశికళ భీమేశ్వర్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్నది. సర్వస్వం తానే అని నమ్మి చేరదీసిన భర్తను మోసం చేస్తూ లేనిపోని మాటలతో నిందిస్తున్నది.

హనీ భార్గవి తండ్రి కూతుర్ల ప్రేమ విడదీయరాని బంధంలో మారిపోయింది ఇది చూసి ఆడదానికి ఆడదే శత్రువు అన్నట్లు శశికళ భర్త కూతురుపై అనుమానం పెంచుకుంది ఆ అనుమానం పెనుభూతమయ్యే లోగా

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

భార్గవి పెళ్లి జరిగిపోయింది .భార్గవి పుట్టినింటి నుండి మెట్టింటికి వెళ్ళేటప్పుడు తండ్రి హనీని విడిచి వెళ్లలేక కన్నీళ్ళతో కృంగిపోయింది అలా సంబంధంలేని కేవలం చేరదీసి పెంచి పోషించినందుకు భార్గవి తండ్రి హనీ పై అధికమైన ప్రేమను పెంచుకుంది.

డబ్బు మీద పిచ్చి పట్టిన శశికళ భర్తను మోసం చేస్తూ హనీ వేసిన బొమ్మలను భీమేశ్వర్ తన పేరుతో లాభానికి అమ్ముకున్న విషయం తెలిసినా పట్టించుకోలేదు విషయం తెలుసుకున్న హనీ భీమేశ్వర్ మోసాన్ని భరించలేక తన బొమ్మలన్నీ కొట్టులో నుండి తిరిగి తెచ్చుకుంటాడు. ఈ విషయంలో శశికళకు హనీకి మధ్య గొడవలు వస్తాయి. శశికళను ఉద్యోగం మాన్పిస్తాడు. అక్రమ సంబంధంతో పాటు డబ్బుకు అలవాటు పడిన శశికళ హనీ పై కక్ష పెంచుకుని రోజూ వ్యతిరేకిస్తూ చిన్నచూపు చూస్తూ భరించ రాని మాటలతో వేధించింది. కన్న కొడుకు గిరీష్ కూడా తల్లికే వత్తాసు పలుకుతూ తండ్రిని అవమానించాడు ఇది తట్టుకోలేని హనీ మానసికంగా కృంగిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న హనీ శిష్యుడు కపిలేశ్వర్ మానసిక డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి బాగు చేయిస్తాడు.

కొద్దికాలం తర్వాత భీమేశ్వర్ తో ఇంట్లోనే కులుకు తున్న శశికళను చూసి తట్టుకోలేక మరింత మానసికంగా కృంగిపోయిన హనీ విచిత్రమైన వ్యాధితో బాధపడు తుంటాడు. భార్య, కొడుకు వేధింపులు భరించలేక ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. చివరికి తన కలల ప్రపంచంలోకి మునిగిపోతూ మానసిక రోగిగా మారి జీవనం ముగిస్తాడు. ఆకలికి తట్టుకోలేక ఒకప్పుడు జాతీయ పురస్కారం పొందిన ఆ చేయి రోడ్డుపై బొమ్మ వేసి దానిపై పడిన డబ్బులను ఏరుకునే రచయిత దీనావస్థను తెలిపారు. చిత్రకళా రంగం పడిపోవడంతో కంప్యూటర్ యుగంలో పొట్టకూటి కోసం చిత్ర కళాకారులు రోడ్డుల్లో బొమ్మలు వేసుకునే స్థాయికి దిగజారి పోయారని ఈ పాత్ర ద్వారా రచయిత చూపించారు.

## నవలలోని పాత్రల వైశిష్యం

హనీ (హనుమంతు) చిత్రకళాకారుడు.. బొమ్మల గీసుకుంటూ నాటకాలు వేషాలు వేస్తూ జీవనం సాగించే వాడు. నీతి నిజాయితీతో బతికేవాడు. చిత్రకళలో జాతీయస్థాయి అవార్డు పొందిన ఘనుడు. నాటక రంగంలో కూడా అభిమానుల్ని సంపాదించుకున్న కళా కారుడు. నాటకంలో పరిచయమైన కళాకారిని శశికళతో సాన్నిహిత్యం వివాహం దిశగా కొనసాగింది. తోటి కళా కారుల సహాయ సహకారాలతో పెళ్లి చేసుకున్నారు. భర్తను వదిలేసి కూతురుతో జీవనం సాగిస్తున్న శశికళకు ఒక కొత్త జీవితాన్ని ప్రసాదించాడు హనీ. కొద్దికాలం వీరి జీవితం బాగా సాగింది. రక్తసంబంధం లేకపోయినా పెంచి పోషించినందుకు భార్గవి హనీ మీద ఎనలేని ప్రేమ ఆప్యా యత విడదీయలేని బంధంగా ఏర్పడింది. హనీ కూడా కూతురు అంటే ఎనలేని ప్రేమ చూపించాడు. ఈ విషయంలో తల్లి శశికళ ఓర్చుకోలేకపోయింది. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. కన్నకొడుకే తండ్రి మాట వినకుండా అవమానించాడు. భర్త, కొడుకు వేధింపులు ,చీదరింపులు తట్టుకోలేని హనీ ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. మానసిక రోగిగా మారిపోయి లేనిపోని కలలు కంటూ జీవితాన్ని ముగిస్తాడు.

**శశికళ**

నాటకాల్లో స్త్రీ పాత్రలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నది శశికళ ఏ కారణం చేతనో భర్తను వదిలేసి కూతురుతో ఒంటరిగా జీవనం సాగించేది. నాటకంలో పద్యాలు బాగా పాడుతూ మంచి కళాకారుడుగా పేరు ప్రఖ్యాతలు పొందిన హనీతో పరిచయం, సాన్నిహిత్యం వివాహ బంధానికి దారితీసింది.తోటి కళాకారుల సహాయ సహకారాలతో పెళ్లి కుదిరింది. నమ్మి ఆదుకున్న భర్తను మోసం చేసి డబ్బు,ఆడంబరం,శృంగారం కోసం బరి తెగించి అక్రమ సంబంధం పెట్టుకుంది శశికళ. భర్తను పిచ్చివాడిని చేసేసింది. ప్రస్తుత సమాజంలో శశికళలాగే అనేకమంది ఆడవాళ్లు ఉద్యోగాలలో చేరి డబ్బు, ఆడంబరాలకు ఆశపడి అక్రమ సంబంధాలు పెట్టు కోవడంతో సంసారాలు కూలిపోతున్నాయి, పరువుపోతుం దని ఆత్మహత్యలు, హత్యలు కూడా చోటు చేసు కుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి వాటినే రచయిత ఈ నవల ద్వారా బహిర్గతపరిచారు.

**భార్గవి**

శశికళ కూతురు భార్గవి. రక్తసంబంధం లేకపోయినా భార్గవిని హనీ కన్న కూతురు కంటే ఎక్కువగా చూసుకున్నాడు. భార్గవి కూడా తండ్రి మీద ఎనలేని ప్రేమ ఆప్యాయతలు పెంచుకుంది. పెళ్లి తరువాత భార్గవి పుట్టినింటి నుండి మెట్టినింటికి వెళ్లే సందర్భంలో తండ్రిని వదిలి వెళ్ళలేక తీవ్రమైన దుఃఖంతో కంటతడి పెట్టుకున్నది. వీళ్ళిద్దరి ప్రేమానురాగం ఎంత గొప్పది అంటే సొంత తల్లి కూతురును అనుమానించే స్థితికి చేరింది. సొంత కూతురుతో ఇలా రాసుకుని,పూసుకుని తిరిగేవాడా అని భర్తతో కూతురు అంత చనువుగా ఉండటం తట్టుకోలేకపోయింది శశికళ. తండ్రి హనీని అవమానిస్తున్నారని బాధపెడుతున్నారని తెలుసుకున్న భార్గవి తల్లిని తమ్ముడిని నిందించింది. నిరంతరం తండ్రి కూతుర్లు ఫోన్లో సంభాషించుకుంటూ ఆనందంగా గడిపేవారు. కొద్ది రోజుల తర్వాత గర్భంతో పుట్టింటికి వచ్చిన భార్గవికి తండ్రి కనిపించకపోవడంతో తల్లీ కొడుకే ఇంట్లో నుండి తరిమేసారని తెలుసుకుని బాధపడుతుంది. తండ్రి స్నేహితుడు కపిలేశ్వర్ సహాయంతో తండ్రి ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని చంటి బిడ్డతో పాటు సుదూర తీరాలకు వెతుకుతూ వెళ్లి తండ్రి జాడను కనుక్కొని మానసిక రోగిగా ఉన్న తండ్రిని దీనావస్థ చూసి దుఃఖం ఆపుకోలేకపోయింది.

ఆకలితో విలపిస్తున్న బిడ్డకు ఒకవైపు పాలిస్తూ మరోవైపు మానసిక రోగి అయిన తండ్రి దాహం తట్టుకోలేక చనిపోతాడేమోనని భయంతో కన్నతల్లిలాగా హనీకి తన చనుపాలిచ్చి కాపాడింది. తండ్రి కూతుర్ల బంధం గురించి రచయిత వర్ణించిన తీరును చూస్తే గుండె తరుక్కుపోతుంది. సొంత బిడ్డలే తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా వదిలేస్తూ వృద్ధాప్య గృహాల్లో బంధిస్తూ వస్తున్న ఈ సమాజంలో కేవలం పెంచి పోషించినందుకు భార్గవి తండ్రి కాని తండ్రి రుణం తీర్చుకుందనీ చెప్పవచ్చు.

**కపిలేశ్వర్**

కపిలేశ్వర్, హనీ మంచి గురు శిష్యులు.గురువు కోసం ఏమైనా చేయగల మంచి వ్యక్తిత్వం కలవాడు కపిలేశ్వర్. గురువు క్షేమమే నిరంతరం కోరుకునే వాడు. గురువు వేసిన చిత్రాన్ని హనీకి తెలియకుండానే పోటీ కోసం పంపించాడు.అదే చిత్రానికి జాతీయ బహుమతి వచ్చింది. ఇలా తోడునీడుగా ఉంటూ గురువుకు సహకరిస్తూ వస్తున్నాడు.

భార్య, కొడుకు పెట్టే బాధలు అవమానాలు తట్టుకోలేక హనీ మానసిక రోగిగా కృంగిపోతున్న సందర్భంలో డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి మరలా మనిషిని చేశాడు. హనీ కూతురు భార్గవిని తన కూతురుగా భావించాడు. తండ్రిని కలుసుకోవాలన్న ఆమె తపనను చూసి ఆమెతోపాటు హనీని వెతకడానికి వెళ్ళాడు. తండ్రి జాడ తెలిసిన వెంటనే కొడుకు ఆకలి ఒకవైపు తీరుస్తూ... మరోవైపు దాహం దాహం అంటున్న తండ్రి చనిపోతాడేమో అని భయపడి వెంటనే తన చనుపాలిచ్చిన భార్గవి మాతృ హృదయాన్ని చూసి చలించి పోయిన కపిలేశ్వర్ ఆ సన్నివేశాన్ని చిత్రంగా మలిచి జాతీయ అవార్డును పొందాడు. గురు శిష్యుల బంధం ఎలా ఉండాలి అనేదానికి నిర్వచనాన్ని ఈ నవలలో రచయిత చాలా చక్కగా చూపించారు.

**భీమేశ్వర్**

నెలలపాటు కష్టపడి పంట పండించే రైతును మార్కెట్లో దళారీలు మోసం చేస్తున్నారు. అలాగే హనీ బొమ్మలను తక్కువ రేటుకు కొనుక్కొని,ఎక్కువ రేటుకు అమ్ముకుంటూ తన పేరు వేసుకుని బొమ్మలపై కళాకారుడైన హనీని మోసం చేసే విధానం భీమేశ్వర్ పాత్ర ద్వారా రచయిత విశదీకరించారు. కళాకారుడికి సహాయం చేస్తున్నట్లుగా హనీ దగ్గర వచ్చి సాన్నిహిత్యం పెంచుకొని నటిస్తూ హనీ భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్న నీచుడు భీమేశ్వర్ లాంటి వాళ్ళు ప్రస్తుత సమాజంలో చాలామంది మనకు కనిపిస్తారని చెప్పవచ్చు.

ఈ నవలలో ప్రధాన పాత్రలతో పాటు మరెన్నో పాత్రలు మనసుకు హత్తుకుంటాయి. తోటి కళాకారులు హనీ కోసం పడే తపనతో పాటు స్నేహం బాంధవ్యం తెలుపుతాయి. మానసిక రోగిగా ఉన్న హనీకి ఉచిత వైద్యం అందించి డబ్బులు ఇస్తే నేను అతని అభిమానిని అని చెప్పుకున్న డాక్టర్ పాత్ర చాలా గొప్పది.సొంత కొడుకు గిరీష్ తండ్రిని అవమానించే నీచమైన పాత్రను ద్వేషిస్తూ

,ప్రతి కొడుకు తండ్రితో ఎలా మాట్లాడాలో ఎలా గౌరవించాలో తెలుసుకోవాలని రచయిత ఈ పాత్రలో చూపించాడు.

**నవలలో మాతృభాష**

ప్రపంచంలో మేధావులు, శాస్త్రజ్ఞులు, భాషావేత్తలను అడిగిన.. మాతృభాషలో విద్యాబోధన సంపూర్ణమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది అని తెలుపుతారు. కానీ ప్రస్తుతం తెలుగు భాషకు తెలుగు చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. మరి మన ఆంధ్ర రాష్ట్రంలో అయితే ఇంగ్లీషు వాళ్లకే పుట్టారేమో అనేంతలా ఇంగ్లీషు భాష పై మక్కువ పెంచుకుంటున్నారు. తెలుగు భాషను గాలికి వదిలేస్తున్నారు.

"మాతృభాషను చంపేయడమే"

"ఎందుకట్లను కోవాలి? ఇంగ్లీష్ ఉంటే ప్రపంచమంతా తిరగొచ్చు. అది తెలిసిన వాడికి ఎక్కడికి పోయినా ఉద్యోగాలు వస్తాయి కదా"

"తెలుగులో చదువుకుంటే ఉద్యోగాలు రావా?"

"ఎక్కడొస్తాయి! మన ఆంధ్రలో తప్ప! అందునా మితిమీరిన నిరుద్యోగ సమస్య, తెలుగులో చదువుకున్నోడు పాతాళానికే"

"అట్లేం లేదు. జపాన్ లో జపనీస్ భాషలోనే చదువుకుంటారు. రష్యాలో రష్యన్ భాషలోనే చదువుకుంటారు. ఫ్రాన్స్ వాళ్లు ఫ్రెంచి భాషలోనే అంతా... మరి వాళ్లు శాస్త్ర జ్ఞానంలో ఎంతో ముందున్నారు కదా"(పుట:76)

అభివృద్ధి చెందిన దేశాల్లోని జపాన్, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో నేటికీ విద్యాబోధన మాతృభాషలోనే జరుగుతున్నది. వారు అన్ని రంగాల్లో ముందున్నారు. మరి మన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మాతృభాషను తక్కువ చూపు ఎందుకు చూస్తున్నారు. ఇది ప్రభుత్వాల వైఫల్యం అని చెప్పవచ్చు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో మాతృభాషను ఏ విధంగా కాపాడుకుంటున్నారో తెలిస్తే మనం సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తుంది. ఇకనైనా మాతృభాషలో విద్యను అభ్యసించిన వారికి విద్యా,ఉద్యోగ అవకాశాల్లో కొంత ఊరట కల్పించాలని రచయిత ఈ నవల ద్వారా కోరుకుంటున్నారు.

**ఆధార గ్రంథ సూచి**

1. స్వప్న జీవి. రాసాని డా. వి. ఆర్.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# మల్లాది వెంకట కృష్ణమూర్తి సాంఘిక నవలలు - సందేశం

- జి. యమునా రాణి
తెలుగు సహాయాచార్యులు, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ, అనంతపురం.

**వ్యాస సంగ్రహం :**

ఈ వ్యాసం మల్లాది వెంకట కృష్ణమూర్తి గారి రచనా ప్రారంభ దశలో రూపొందిన సాంఘిక నవలలలోని సామాజికాంశాలను, రచయిత సమాజానికి అందించిన సందేశాలను పరిశీలిస్తుంది. ఈ వ్యాసంలో మల్లాది సాంఘిక నవలలోని తొమ్మిది నవలలకే పరిమితమైంది. ఇందులో రచయిత ఎంచుకున్న ఇతివృత్తాలు ఆనాటి సమాజంలోని ప్రధాన సమస్యలను ప్రతిఫలింపజేస్తూ అప్పటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల స్వరూపాన్ని స్పష్టంగా ఆవిష్కరిస్తాయి. నవలలలోని పాత్రలు సామాన్య ప్రజల జీవితీలలోని వాస్తవ విషయాలను ప్రతిబింబిస్తాయి. కథా నిర్మాణం, సంఘర్షణలు, సంభాషణల ద్వారా రచయిత సమాజంలో నెలకొన్న నైతిక సంక్షోభాన్ని తెలియచెప్పారు. అంతేకాక ఈ సమస్యల పట్ల పాఠకుల్లో చైతన్యాన్ని రేకెత్తించి, సామాజిక బాధ్యతాభావాన్ని పెంపొందించాలనే ఆశయం వీరి రచనలలో స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ వ్యాసం పై అంశాల ఆధారంగా మల్లాది వెంకట కృష్ణమూర్తి సాంఘిక నవలలు సామాజిక పరివర్తనకు ఎలా దోహదపడ్డాయో వివరిస్తుంది.

**రచయిత పరిచయం :**

మల్లాది దక్షిణామూర్తి, మల్లాది శారదాంబ దంపతులకు 1949, నవంబర్,13వ తేదీన మల్లాది వెంకట కృష్ణమూర్తి విజయవాడలో జన్మించారు. బాల్యం, విద్యాభ్యాసం పూర్తిగా విజయవాడలోనే సాగింది. వీరు 1970లో వ్రాసిన తొలి కథ ఉపాయశాలి దీనిని "చందమామ" పత్రిక ఆగస్టు సంచికలో ముద్రించింది. ఆ తర్వాత వరుసగా ఆంధ్ర ప్రభ, ఆంధ్ర, అపరాధ పరిశోధల వంటి పత్రికల్లో కథలు ప్రచురితమయ్యాయి. వీరు మొత్తం 5000కు పైగా కథలు వ్రాశారు. అందులో 2000 కథలు అనువాదాలు కాగా,3000 కథలు సొంతంగా వ్రాశారు. 1973లో వీరు వ్రాసిన తొలి నవలిక "అద్దెకిచ్చిన హృదయాలు". నాటి నుండి నేటి వరకు వీరు వ్రాసిన నవలలసంఖ్య 106. ఇప్పటికీ వ్రాస్తూనే ఉన్నారు. వీరి నవలల అధారంగా 22 చలన చిత్రాలు రూపొందిచారు. 9 ధారావాహికలుగా టెలివిజన్లో ప్రసారం అయ్యాయి. 1,000 కి పైగా వ్యాసాలు వ్రాశారు. వివిధ పత్రికల్లో వివిధ పేర్లతో 70 శీర్షికలను నిర్వహించారు. 34 దేశాలను సందర్శించి రచయితగా - 11యాత్రాచరిత్రలను పాఠక లోకానికి అందించారు. ఇలా మల్లాది సాహిత్యప్రస్థానం సుదీర్ఘమైంది.

**ఇతివృత్తాల పరిచయం :**

**అద్దెకిచ్చిన హృదయాలు :**

హౌస్‌సర్జన్గా పనిచేస్తున్న అచ్యుతానికి ఆరుగురు అందమైన అమ్మాయిలున్న అపార్ట్మెంట్‌లో ఇల్లు అద్దెకు దొరికింది. మంచి స్నేహితులైనఆ ఆరుగురు అమ్మాయిలకు అచ్యుతంతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వల్ల అచ్యుతం నిస్వార్థంగా ఆరుగురికి అవసరమైన సహాయం చేశాడు. అచ్యుతం వ్యక్తిత్వం వల్ల ఆరుగురిలోనూ అతని పట్ల ప్రేమ మొదలయ్యింది. ఒకరికి తెలియకుండా మరొకరు తమ ప్రేమను అతని ముందు వ్యక్తపరిచారు. వివిధకారణాలవల్ల అచ్యుతానికి ఆరుగురి అమ్మాయిల పట్ల మొదలైన ఆకర్షణ క్రమంగా ప్రేమగా మారింది.ఆరుగురిలో ఎవరిని పెళ్ళి చేసుకున్నా మిగిలిన ఐదుగురి మనస్సు గాయపడుతుందన్న ఆలోచన అచ్యుతాన్ని మానసికసంఘర్షణకు గురిచేసింది. చివరకు మనస్తత్వశాస్త్ర నిపుణుని మార్గదర్శకత్వం మేరకు తన సమస్యను కాలమే పరిష్కరిస్తుందని ఆశించి, ఆ ఆరుగురు అమ్మాయిల నుండి దూరంగా వెళ్ళిపోయాడు.

**మిసెస్ పరాంకుశం :**

వేశ్యావృత్తిలో బాధలు అనుభవిస్తున్న మహిళలను పరాంకుశం తన చిన్నతనంలోనే చూశాడు. చాలా మంది మహిళలు ఆ వృత్తిలోకి బలవంతంగా దింపబడినవాళ్ళని అర్థం చేసుకున్నాడు. అటువంటి వారిలో ఒక్కరికైనా గౌరవమైన జీవితాన్ని అందించాలని భావించి, తాను వేశ్యను పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన అక్కాబావలు, స్నేహితులు, పోలీసుల సహకారంతో సౌదామిని అనే వేశ్యను పెళ్ళిచేసుకున్నాడు. మొదట్లో సౌదామిని కూడా పరాంకుశం మాటలను నమ్మలేదు. పెళ్ళి పేరుతో మోసం చేస్తాడనుకుంది. చివరికి చాలా షరతులు పెట్టి పెళ్ళికి అంగీకరించింది. పెళ్ళిచేసుకున్నంత మాత్రాన వేశ్య సంసారిగామారడం అసాధ్యమని పరాంకుశాన్ని తన సహచరులు నిరుత్సాహపరిచారు. కానీ అతని నిజాయతీ, ప్రేమ వల్ల తక్కువ సమయంలోనే సౌదామినిలోమంచి మార్పు వచ్చింది. ఎన్నో ఇబ్బందులను, కష్టాలను దాటి సౌదామినిని ఒక పరిపూర్ణగృహిణిగా నిలబెట్టి పరాంకుశంఆదర్శప్రాయుడయ్యాడు.

**లావణ్య :**

సుభద్ర చిన్నవయసులో తల్లిదండ్రులను కోల్పోయి పెద్దనాన్న పెంపకంలో పెరిగింది. తన చుట్టూ ఉన్న పరిస్థితుల వల్ల డబ్బుంటే ఏమైనా సాధ్యమన్న భావనతో పెద్దయితే ధనవంతుడిని పెళ్లి చేసుకోవాలని కలలుకంది. చదువు పూర్తయ్యాక పట్నంలో చక్రధర్ కంపెనీలో స్టెనోగ్రాఫర్‌గా చేరి, తరువాత అతని పి.ఏ.గా నియమితులైంది. స్నేహితురాలి ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు చూసిన తర్వాత లక్షాధికారినే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, కమల్ అనే వ్యక్తి మోసపూరితంగా తాను కోటీశ్వరుడని నటించిన విషయాన్ని చివరకు తెలుసుకుంది. అదే సమయంలో చక్రధర్ ధనవంతుడైనా కూతురు మరణంతో సంతోషం లేని జీవితాన్ని గడుపుతున్నాడని, తన కూతురు పోలికల కారణంగానే తనను దగ్గర చేసుకున్నాడని గ్రహించింది. దాంతో డబ్బే సంతోషానికి మూలం కాదని అర్థం చేసుకుని, అటెండర్‌గా పనిచేస్తున్న చిన్ననాటి స్నేహితుడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించి ఉద్యోగం మానేసింది. తరువాత పెళ్లి పిలుపునివ్వడానికి వెళ్లిన సమయంలో చక్రధర్‌కు గుండెపోటు రావడంతో ఆమె అతని ప్రాణాలు కాపాడింది; ఆ కృతజ్ఞతతో అతడు ఆమెకు పదిలక్షల రూపాయలు పంపించాడు. ఈ విధంగా ఆమెకు ధనం లభించినా, డబ్బుంటేనే సంతోషం అన్న అపోహ పూర్తిగా తొలగిపోయింది.

**దిగ్రాడ్యుయేట్ :**

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన మంచి మిత్రులు కుమార్, సుందర్‌లు ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరైనా ప్రభుత్వ వైఫల్యం, లంచాలు, రికమండేషన్‌ల వల్ల ఉద్యోగాలు దక్కక నిరుద్యోగులుగా మిగిలి, కుటుంబం-సమాజాల నిర్లక్ష్యానికి గురై డబ్బులేకపోతే విలువ లేదన్న భావనతో అసాంఘిక కార్యకలాపాల వైపు మొగ్గు చూపారు. ఉద్యోగం వచ్చి ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలన్న ఆశ నెరవేరకపోవడంతో కుమార్ సుందర్‌తో కలిసి దొంగ తనాలు మొదలుపెట్టి, సులభంగా డబ్బు రావడంతో అదే జీవితంగా మార్చుకున్నారు. పోలీసుల భయం పెరగడంతో రైళ్లలో దొంగతనాలు చేస్తూ ఒకసారి

ఆర్మీ అధికారికి పట్టుబడగా, కుమార్‌ను కాపాడే ప్రయత్నంలో సుందర్ మరణించాడు. ఆ దుఃఖం నుంచి బయటపడ్డ కుమార్ మళ్లీ దొంగతనాలకే దిగాడు. చివరికి తనకు ఉద్యోగం రాకపోవడానికి కారణమైన సిమెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌పై పగతో రైల్లో అతడిపై కాల్పులు జరిపి, అనుకోకుండా అతని చిన్నకూతురు మరణానికి కారణమయ్యాడు. పెద్దకూతుర్ని అపహరించేం దుకు ప్రయత్నించిన సమయంలో బ్రిడ్జ్‌పై నుంచి జారిపడి నదిలో పడి కుమార్ అక్కడికక్కడే మరణించాడు.

**రేపటి కొడుకు :**

నవల మధ్యతరగతి కుటుంబ నేపథ్యంతో సాగుతూ, ఒక నిర్భాగ్యురాలైన యువతికి జరిగిన అన్యాయాన్ని ఖండించే సామాజిక ఇతివృత్తాన్ని ప్రతిబింబిస్తుంది. అనారోగ్యంతో ఉన్న కామేశ్వరమ్మ ఇంట్లో పనుల కోసం సత్తెనపల్లి నుంచి పిలిపించబడిన ఛాయ చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన అనాథ. పనిమనిషిగా వచ్చిన ఆమె తక్కువ సమయంలోనే కుటుంబ సభ్యుల్లా కలిసి పోయినా, ఆమె ప్రవర్తనలో మార్పును గమనించిన కామేశ్వరమ్మ ప్రశ్నించగా ఛాయ నాలుగు నెలల గర్భవతినని చెప్పడంతో సమస్య మొదలవుతుంది. అసలు దోషి ఎవరో తెలుసుకోవడానికి కామేశ్వరమ్మ, శాంత ప్రయత్నించినా ఛాయ మౌనంగా ఉంటూ బాధపడు తుంది. ఆమె అమాయకత్వం చూసి శాంతకు జాలి కలిగి, న్యాయం చేయాలనే సంకల్పంతో నిజాన్ని వెలికి తీయడానికి కఠినంగా వ్యవహరిస్తుంది. చివరికి ఛాయ ప్రసవించి మరణించిన తర్వాత కూడా, ఆమె బిడ్డ ద్వారానైనా నిజం తెలుసుకోవాలని శాంత చేసే ప్రయత్నాలు కథను ఉత్కంఠభరితంగా నడిపిస్తాయి.

**మేఘమాల :**

ఏడు సంవత్సరాల సారథిని అతని మేనత్త సెలవుల్లో తన ఇంటికి పిలిచి, పక్కింటి ఐదేళ్ల మేఘమాలతో బాల్య వివాహం జరిపించి ఆ విషయం రహస్యంగా ఉంచు తుంది. సెలవుల అనంతరం ఇద్దరూ వేర్వేరు ఊర్లకు వెళ్లి పెరిగినా, చిన్ననాటి ప్రేమతో ఒకరికోసం ఒకరు ఎదురు చూస్తారు. పెళ్లి వయసు వచ్చినప్పుడు సారథి తనకు బాల్యంలో పెళ్లి జరిగిందని తల్లిదండ్రులకు చెప్పి, వారి అంగీకారంతో మేఘమాల కోసం వెతకడం మొదలు పెడతాడు. ప్రకటనలు, విచారణల ద్వారా ఆమె జీవితం ఎన్నో కష్టాలతో నిండినదని తెలుసుకుని, ఆమెను కలవాలని తపిస్తాడు.

ఇదివరకే సారథి రావడంపై ఆశ కోల్పోయిన మేఘ మాల, తన పరిస్థితిని అర్థం చేసుకున్న మరో వ్యక్తిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. చివరికి సారథి ఆమె ఆచూకీ తెలుసుకుని పెళ్లి మండపానికి చేరుకున్నా, అప్పటికే మేఘమాల మరో వ్యక్తిని వివాహం చేసుకుంటుంది. నిజం తెలిసినా ఏమీ చేయలేని నిస్స హాయతతో ఆమె నిలబడిపోతే, సారథి మౌనంగా అక్కడి నుంచి వెళ్లిపోతాడు.

**దిలవ్ జర్క్ :**

భరద్వాజ్ తన ఆఫీసు తరపున లండన్‌లో రెండేళ్ల ట్రైనింగ్‌కు ఎంపిక కావడంతో తల్లి శేషమాంబ ఒక్కడే వెళ్లడాన్ని నిరాకరించి పెళ్లికి ఒప్పిస్తుంది. మొదట ఫల్గుణితో పెళ్లి నిర్ణయమైనా, ఆమెకు పెళ్లికి ముందు శారీరక సంబంధం ఉన్న విషయం తెలిసి భరద్వాజ్ పెళ్లిని ఆపేస్తాడు. తర్వాత తల్లి పట్టుబట్టి తులసితో వివాహం జరిపిస్తుంది. దాంపత్య జీవితం సంతోషంగా సాగుతున్న సమయంలో తులసి వల్ల తనకు సుఖవ్యాధి వచ్చిందన్న అనుమానంతో భరద్వాజ్ విడాకులు అను కుంటాడు. విషయం తెలుసుకోవడానికి సన్యాసిరావు తులసిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తే, గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పరీక్షించని రక్తం ఎక్కించడమే వ్యాధికి కారణమని డాక్టర్ ఒప్పుకుంటాడు. తన తప్పును భరద్వాజ్‌కు చెప్పి క్షమాపణ కోరడంతో అనుమానం తొలగి, భరద్వాజ్ తులసిని క్షమించడంతో కథ ముగుస్తుంది.

**స్రవంతి :**

శ్రీనివాస్ ఒక మెడికల్ రెప్రజెంటేటివ్. మొక్కు తీర్చుకోవడానికి తిరుమల వెళ్లిన సమయంలో అతనికి స్రవంతి పరిచయం అవుతుంది. ఆమె ప్రోద్బలంతో సంయమనం కోల్పోయిన శ్రీనివాస్ మొదట ఆమెను

కేవలం భౌతికంగా మాత్రమే ఇష్టపడతాడు. అయితే క్రమంగా స్రవంతి చూపిన శ్రద్ధ, ప్రేమ అతని మనసును ఆకర్షించి నిజమైన ప్రేమగా మారుతుంది. తన భార్య ఇందిరకు అన్యాయం చేస్తున్నానన్న భావన అతనిలో మానసిక సంఘర్షణను కలిగించినా, స్రవంతి నుంచి పూర్తిగా దూరం కాలేకపోతాడు. శ్రీనివాస్ తనను వదిలి పెట్టకుండా ఉండేందుకు స్రవంతి అనేక విధాలుగా అతన్ని ఆకర్షిస్తుంది. ఆమె పరిచయం అతని జీవితంలో ఆనందం, మార్పులను తీసుకువచ్చినా, ఆ ఆనందం ఎక్కువకాలం నిలవదు. అనూహ్యమైన మృత్యువు స్రవంతిని శాశ్వతంగా దూరం చేస్తుంది. ఆమె శారీరకంగా దూరమైనా, మధుర జ్ఞాపకాలతో శ్రీనివాస్ జీవితంలో మంచి స్నేహితురాలిగా మిగిలిపోతుంది.

**నాతిచరామి :**

ఈ నవలలో సునీత, సుధాకర్ ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకుని, కలిసి జీవించాలనుకున్నారు. కానీ పెళ్ళికి బదులు ఫ్రెండ్షిప్ అగ్రిమెంట్ అనే ఒప్పంద పద్ధతిని పాటించారు. వాస్తవానికి సునీతకు సంప్రదాయాలన్నా, కట్టుబాట్లన్నా గౌరవం. ఒప్పంద పద్ధతిలో జీవించడం ఇష్టం లేకపోయినా, సుధాకర్ మీద ఉన్న ప్రేమ ఆమెను ఫ్రెండ్షిప్ అగ్రిమెంట్కు అంగీకరించేలా చేసింది. ఆ ఒప్పందపద్ధతిలో జీవితం హాయిగా సాగిపోతుంది అనుకున్నారు. కానీ దాని వల్ల రోజుకో సమస్య, అడుగడుగునా ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వచ్చింది. సునీత, సుధాకర్తో పాటు వాళ్ళకు పుట్టిన పిల్లలు ప్రవీణ్, ప్రణవ్ కూడా అవమానపడాల్సి వచ్చింది. దాంతో చివరకు సుధాకర్ తన ఆలోచన తప్పని తెలుసుకున్నాడు. అప్పటి వరకు తనను ప్రేమిస్తున్న సునీతను ఇబ్బంది పెట్టానని, ఇప్పుడు పిల్లలు కూడా తన ఆలోచన వల్లనే కష్టపడుతున్నారని అర్థం చేసుకున్నాడు. అప్పటివరకు తల్లిదండ్రులుగా ఉన్న సునీత, సుధాకర్ పిల్లల సమక్షంలో పెళ్ళి చేసుకుని భార్యాభర్తలుగా మారారు.

**సాంఘిక సందేశం :**

మల్లాది వెంకట కృష్ణమూర్తి తొలిదశకం సాంఘిక నవలలు సార్వదేశిక, సార్వకాలిక మరియు సర్వమానవ శ్రేయస్సుకు దోహదపడే గొప్ప సందేశాలను కలిగి ఉన్నాయి. రచయితకు సమాజం పట్ల ఉన్న దృక్పథమే నవల సందేశంలో ఆవిష్కృతమైంది. రచయిత ఆలోచనలు తను సృష్టించిన పాత్రల ద్వారా సామాజిక ప్రయోజనాన్ని పటిష్టంగా వినిపిస్తారు.

**ప్రేమ, వ్యక్తిగత నిబద్ధత :**

నిజమైన ప్రేమ అనేది కేవలం ఆకర్షణ మాత్రమే కాదని, అది ఎదుటి వ్యక్తి క్షేమాన్ని కోరుకుంటూ బాధ్యతతో కూడి ఉంటుందని 'అద్దెకిచ్చిన హృదయాలు'నవలలో అచ్యుతం పాత్ర ద్వారా చెప్పించారు. ప్రేమ స్వార్థరహితమైనదని, అది అవసరమైతే త్యాగానికి కూడా వెనకాడదని అచ్యుతం తీసుకున్న నిర్ణయం ఆధారంగా రచయిత నిరూపించారు. కౌమారదశలో కలిగే ఆకర్షణలు శాశ్వతం కావని, వ్యక్తి సంయమనం, నిబద్ధత మాత్రమే సమాజంలో అతని గౌరవాన్ని వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయని మధుకర్ పాత్ర ద్వారా తెలియచేశారు. ఆలోచన చేస్తే సమాజంలో ప్రతి సమస్యకు శాస్త్రీయమైన పరిష్కారం ఉంటుందని మధుకర్ పాత్ర ద్వారా తెలియచేశారు.

**ఆదర్శమైన ఆలోచనా - ఆచరణ :**

ఎంచుకున్న లక్ష్యం ఆదర్శమైనప్పుడు దానిని సాధించాలంటే ఓర్పు, సహనం ప్రణాళికాబద్ధమైన ఆచరణ వల్లనే సాధ్యమవుతుంది. మనిషికి గొప్ప సంకల్పం ఉన్నప్పుడు, దానిని సాధించడానికి సమాజం నుండి తప్పక సహకారం లభిస్తుందని 'మిసెస్ పరాంకుశం' నవల బోధిస్తుంది. ఒక వ్యక్తి ఆదర్శంగా జీవించడానికి తన నిర్ణయంతో పాటు చుట్టూ ఉన్న వ్యక్తుల తోడ్పాటు కూడా అవసరమని ఇందులో పేర్కొన్నారు. జీవితంలో దేనినైనా సాధించడానికి సహనం, ప్రణాళికాబద్ధమైన ఆచరణ అత్యంత ప్రధానమైనవని.కుటుంబ సభ్యుల మద్దతుతోనే అనుకున్న లక్ష్యాలను త్వరగా చేరుకోవచ్చనేసందేశాన్ని రచయిత అందించాడు. నిస్వార్థంతో చేసే పని ఎప్పుడూ మంచి ఫలితాన్నే అందిస్తుందని మిసెస్ పరాంకుశం పాత్ర ద్వారా నిరూపన చేశారు.

**చుట్టూ ఉన్న పరిస్థితులు వ్యక్తి ఆలోచనలపై ప్రభావం:**

మనిషి ఆనందంగా జీవించడానికి డబ్బే ప్రధానం కాదు. ధనం మాత్రమే సరిపోదని, నిజాయితీగా సంపాదించడానికి కృషి, పట్టుదల కావాలని,సంపాదించిన దానిని నిలబెట్టుకోవడానికి క్షమశిక్షణతో కూడిన జీవితం అవసరమని'లావణ్య' నవలలో తెలియచేశారు.

**యువత నిరుద్యోగం సమాజంపై ప్రభావం :**

నిరుద్యోగం యువత మనస్తత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది వారి నిర్ణయాలను దెబ్బ తీస్తుందని 'ది గ్రాడ్యుయేట్' నవల చెబుతుంది. ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతను కష్టాల పాలు చేస్తోందని పరోక్షంగా విమర్శిస్తూనే, విలాసాల కోసం యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మరలకూడదనే సందేశాన్ని అందించింది. విద్యలో నైతిక విలువలు, ఇంద్రియ నిగ్రహం వంటి గుణాల ప్రాధాన్యతను చెబుతూ, తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఆశ జీవితాలను నాశనం చేస్తుందని,యువత పరిస్థితుల పట్ల సంయమనం పాటించాల్సిన అవసరాన్ని చెప్పి సూటిగా హెచ్చరించారు.

**స్త్రీ చైతన్యం - సామాజిక జాగరూకత:**

గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చే యువతులు లోకజ్ఞానంతో జాగ్రత్తగా ఉండాలని, మితి మీరిన ఊహలతో తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని 'రేపటికొడుకు' సందేశం ఇస్తుంది. స్త్రీల అమాయకత్వం పురుషులకు అవకాశంగా మారకూడదని, గృహహింసకు గురయ్యే మహిళలు సరైన సమయంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని 'మేఘమాల'ద్వారా పిలుపునిచ్చారు. ప్రేమ పేరుతో మగవారిని గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, మంచి వ్యక్తిత్వమే నిజమైన అందమని రచయిత స్త్రీ పాత్రల ద్వారా ప్రబోధించారు.

**వైవాహిక వ్యవస్థ - కుటుంబ విలువలు :**

భారతీయ వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడుకోవడం అవసరమని 'స్రవంతి', 'నాతిచరామి' నవలలు వివరిస్తాయి. వివాహం అనేది చట్టపరమైన రక్షణ మరియు సామాజిక గౌరవాన్ని ఇచ్చే పవిత్ర బంధమని, పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరిస్తూ లివింగ్ రిలేషన్స్ వంటి పోకడల వైపు వెళ్లడం వల్ల స్త్రీలకే ఎక్కువ నష్టం జరుగుతుందని రచయిత హెచ్చరించారు. వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య నమ్మకమే పునాది అని, ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం మరియు నిర్లక్ష్యం చేయడం వల్ల అన్యోన్యత లోపిస్తుందని సందేశం ఇచ్చారు. వివాహేతర సంబంధాలు అనైతికమని, అవి మానసిక సంఘర్షణకు దారితీస్తాయని స్పష్టం చేశారు.

**సామాన్యులలో ఆరోగ్యం పట్ల అవగాహన :**

సుఖవ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, వైద్యపరమైన నిర్లక్ష్యం వ్యక్తుల జీవితాలను ఎలా దెబ్బ తీస్తుందో 'ది లవ్ జర్మ్' నవల ద్వారా తెలియచేశారు. సంసారంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సహనంతో పరిష్కరించుకోవాలని, పిల్లలను బాధ్యతగా పెంచకపోతే దాని ఫలితాన్ని తల్లిదండ్రులే అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మధ్యతరగతి కుటుంబాలలో సంబంధబాంధవ్యాల విలువను వివరిస్తూ, దూరదృష్టితో చేసే త్యాగం ఎన్నటికీ వృథా కాదని భ్రమరాంబ పాత్ర ద్వారా సందేశాన్ని అందించారు. యువత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని రచయిత ఆకాంక్షించారు.

**తల్లిదండ్రుల జీవనవిధానం అలవాట్లు- పిల్లలపై ప్రభావం :**

పిల్లలు చిన్నతనంలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు అనుసరించే అలవాట్లు, వారి జీవనశైలి పిల్లల భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయని 'ది గ్రాడ్యుయేట్' నవలలోని కుమార్, సుందర్ పాత్రల సంభాషణల ద్వారా రచయిత వివరించారు. తల్లిదండ్రుల ప్రవర్తన మాత్రమే కాకుండా, చుట్టూ పరిస్థితులు, ఎదురయ్యే సంఘటనలు పిల్లల ఆలోచనలను, వారి అభిప్రాయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని 'లావణ్య' నవలలోని సుభద్ర పాత్ర ద్వారా తెలియజేశారు.

**పెద్దల క్రమశిక్షణ - పిల్లల భవిష్యత్తు :**

పిల్లలు తీసుకునే కొన్ని నిర్ణయాలు లేదా వారు చేసే పనులు వారి భవిష్యత్తును దెబ్బతీస్తాయనే భయంతో

ఇంటి పెద్దలు కొన్నిసార్లు కఠినంగా ప్రవర్తిస్తారని 'మిసెస్ పరాంకుశం' నవలలో పరాంకుశం మామయ్య పాత్ర ద్వారా చూపించారు. అయితే, పెద్దల కోపావేశాలు తాత్కాలికమని, పిల్లల ఆలోచనలు గనుక మంచివైతే తల్లిదండ్రులు వాటిని అర్థం చేసుకుని, గౌరవించి, వారికి తోడుగా నిలుస్తారని రచయిత సందేశం ఇచ్చారు. పిల్లలు తమ లక్ష్యాలను త్వరగా చేరుకోవడానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని ఈ నవలలు ప్రబోధిస్తాయి.

తల్లిదండ్రుల ప్రవర్తన మరియు వారు కల్పించే వాతావరణం పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది. వారి భవిష్యత్తును ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని నాతిచరామి నవలలో తెలియజేశారు.

**పాశ్చాత్యసంస్కృతి యువతపై ప్రభావం :**

మల్లాది 'నాతిచరామి' నవల ద్వారా లివింగ్ రిలేషన్ షిప్స్ ద్వారా కలిగే నష్టాలను విడమరిచి చెప్పారు. నేటి ఆధునిక జీవనశైలిలోమితిమీరిన స్వేచ్ఛమనుషుల జీవితాలకు ఎంతో నష్టం కలిగిస్తుందని, పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరించడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని రచయిత సూచించారు. ప్రధానంగాలివింగ్ రిలేషన్స్ వంటి సంబంధాలలో పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువ నష్టపోతారని మధుకర్ పాత్ర ద్వారా ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు.

**వివాహ వ్యవస్థలోనే స్త్రీ కి సామాజిక రక్షణ :**

సాంఘిక గౌరవం, చట్టపరమైన రక్షణ, కుటుంబ భద్రత కేవలంచట్టబద్ధమైన వివాహంద్వారానే లభిస్తాయని నాతిచరామిలో తెలియపరుస్తారు. వివాహ బంధంలోని పవిత్రతను, బాధ్యతను విస్మరించడం వల్ల కలిగే ఇబ్బందులను ఆయన చర్చించారు. ఆధునిక మరియు సాంప్రదాయిక దృక్పథాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని రచయిత ఆందోళన వ్యక్తం చేశారు. యువత తమ జీవితాల పట్ల బాధ్యత కలిగి ఉండాలని, సంప్రదాయాలను కాపాడుకుంటూ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన సందేశం ఇచ్చారు. లివింగ్ రిలేషన్స్ వంటి పోకడలు కుటుంబ వ్యవస్థను దెబ్బతీస్తాయని, కనుక మన సంస్కృతిని కాపాడుకోవలసిన అవసరం ఉందని ఆయన హెచ్చరించారు,.

**భార్య భర్తల మధ్య ఉండవలసిన సఖ్యత :**

భార్యాభర్తల మధ్య అన్యోన్యత తగ్గడానికి ప్రధాన కారణం ఒకరి పట్ల మరొకరికి నిర్లక్ష్యం. దంపతులు ఒకరి భావాలను మరొకరు గౌరవించుకోకపోవడం వల్ల బంధంలో పగుళ్ళు ఏర్పడతాయి. వైవాహిక జీవితం నిత్య నూతనంగా ఉండటానికి నిరంతరం ప్రయత్నం చేయాలని, పరస్పర అవగాహన లోపించినప్పుడు అన్యోన్యత మృగ్యమవుతుందని రచయిత స్రవంతి నవలలో వివరించారు.

దాంపత్య జీవితం సజావుగా సాగడానికినమ్మకమే పునాది. జీవిత భాగస్వామి పట్లఅనుమానంపెంచుకోవడం వల్ల మనిషి తన విచక్షణను కోల్పోతాడు. తులసి పట్ల భరద్వాజ్ ప్రవర్తించిన తీరు దీనికి నిదర్శనం. నమ్మకం లేని చోట గౌరవం ఉండదని, అది చివరకు సంబంధం విచ్ఛిన్నం కావడానికి దారితీస్తుందని ది లవ్ జర్మ్‌లో తెలియజేశారు.సంసారంలో ఎదురయ్యే కష్టాలను, ఒడిదుడుకులనుఓర్పుతోఎదుర్కోవాలి. సహనం లోపించినప్పుడు చిన్న గొడవలు కూడా పెద్దవిగా మారి ప్రశాంతతను దూరం చేస్తాయని తులసి పాత్రద్వారా తెలియ చెప్పారు.

**అక్రమ సంబంధాలు - అనైతికత :**

దీనితోపాటు వివాహేతర సంబంధాలుఅనైతికమని, ఇవి సామాజిక కట్టుబాట్లకు విరుద్ధమని స్రవంతి నవలలో పరోక్షంగా తెలియపరిచారు. ఇటువంటి సంబంధాల వల్ల దంపతుల మధ్య తీవ్రమైన మానసిక సంఘర్షణ, కుటుంబంలో అశాంతి నెలకొని చివరి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందటుందిఅనే సందేశాన్ని స్రవంతి ద్వారా అందించారు.

**ముగింపు :**

మల్లాది తొమ్మిది సాంఘిక నవలల్లోనూ పాత్రలను సమాజ సమస్యలకు ప్రతినిధులుగా నడిపించి, పాత్రల

సంభాషణలు, సన్నివేశాల ద్వారా యువతకు సందేశాన్ని అందించారు. అది సంఘం పట్ల తన దృక్పథాన్ని, సమాజం పట్ల తనకున్న భాద్యతను చాటుతుంది. రచయిత ప్రత్యంక్షంగానూ పరోక్షంగానూ సూచించిన అంశాలు కేవలం రచనాకాలం నాటికేకాక వర్తమాన భవిష్యత్ తరాలకు ప్రయోజనకరమైన సూచనలను అందించారు.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శాంతి ప్రబోధ "జోగిని" నవలలో స్త్రీ చైతన్యం

- డా॥. సయ్యద్ ఆఫ్రీన్ బేగం
తెలుగు అధ్యాపకులు, దక్షిణ ప్రాంగణం, తెలంగాణ విశ్వవిద్యాలయం, భిక్నూర్.

తెలుగు సాహిత్యంలో శాంతి ప్రబోధ సామాజిక సేవా రంగ నేపథ్యం గల రచయిత్రి. వీరి రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా కనిపిస్తుంది. భిన్న రీతుల్లో, ఆచార వ్యవహారాల్లో, సామాజిక పరిస్థితుల్లో ఉండే వారి స్థితి గతుల్ని అద్దం పట్టే విధంగా వీరి రచనలుంటాయి. అది నవల కావచ్చు, కథ కావచ్చు, కవిత కావచ్చు, వ్యాసం కావచ్చు లేదా మరి ఏదైనా సరే సమాజపు లోతుల్లో పేరుకు పోయిన జీవితాన్ని అతలాకుతలం చేసే అంశాలు వీరి రచనకు వస్తువులు. రచయిత్రి సమాజంలో వివక్షతో అవమానాలకు బలి అవుతున్న స్త్రీలను కేంద్రంగా రచనలు చేశారు. దానికి అక్షర రూపమే 'జోగిని'. ఈ నవల స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా, చైతన్య స్వరంగా నిలుస్తుంది. ఈ నవలలో స్త్రీ చైతన్యం ఎలా ఆవిష్కృతమయ్యిందో పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం. ఈవ్యాసం ముఖ్యంగా పోశవ్వ పాత్ర ద్వారా రచయిత్రి వ్యక్తం చేసిన భావజాలాన్ని విశ్లేషించడానికి ఉపకరిస్తుంది.

తెలంగాణలో జోగిని వ్యవస్థకు ఆద్యం పోసిన పల్లె రాచరిక వ్యవస్థలో మహిళలు కొవ్వొత్తిలా కరిగిపోయారు. తరతరాలుగా ఆ వ్యధను అనుభవించారు. మనసు ముక్కలు చేసుకున్నారు. నా దాష్టికం నుంచి బయట పడేందుకు సంఘసంస్కర్తలు తీసుకొచ్చిన చైతన్యంతో పాటు కొంతమంది కలంతోనో మార్పు తీసుకొచ్చారు. వీరిలో ఒకరు శాంతి ప్రబోధ గారు. వారిని సంస్కరించి సమాజంలో ఒక గౌరవమైన స్థానాన్ని కల్పించారు. జోగిని వ్యవస్థ యొక్క దురాచారాల నిర్మూలనలో పాలు పంచుకున్నారు. మహిళల హక్కులను సమాజానికి తెలియజేసే విధంగా రచనలు చేస్తూ తెలుగు సాహిత్యంలో రచయిత్రిగా తన ప్రత్యేక స్థానాన్ని చాటు కున్నారు. జోగిని వ్యవస్థ పై తొలి నవల రాసిన ఘనతను వీరు సొంతం చేసుకున్నారు. ఈ నవల 2004వ సంవత్సరంలో వార్త దినపత్రికలో డైలీ సీరియల్‌గా వచ్చింది. 2004లోనే ప్రజాశక్తి బుక్స్‌వారు పుస్తకంగా అచ్చు వేశారు. 2014 నుండి రెండున్నరేళ్ల పాటు విహంగా అంతర్జాల పత్రిక ధారావాహికగా కూడా ప్రచురించింది.

మొదటి తరం నవలా రచయితల ప్రభావం వీరిపై ఉంది. "జోగిని" ప్రతిష్టాత్మకమైనటువంటి తెలుగు విశ్వ విద్యాలయాల పురస్కారంతో పాటు వెంకటసుబ్బ అవార్డును, కందుకూరి నవల పురస్కారంతో ఇందూరు అపురూప నవలా పురస్కారం వంటి అనేక ప్రతిష్టాత్మకమైన పురస్కారాలను అందుకుంది.

**జోగిని వ్యవస్థ - స్త్రీపై అణచివేత :**

తెలంగాణ రాష్ట్రంలో అనేక గ్రామాల్లో ఆచారాల

పేరుతో తరతరాలుగా ఎందరో అమాయక స్త్రీలను దారుణంగా దోచుకుంటున్నది జోగిని వ్యవస్థ. ప్రభుత్వం నిషేధించిన జోగిని దురాచారం నేటికి కొనసాగుతున్నది. తెలంగాణ సామాజిక వ్యవస్థలో అత్యంత అమానవీయ మైన జోగిని వ్యవస్థ మతం ముసుగులో దళిత స్త్రీపై లైంగిక బానిసత్వాన్ని, సామాజిక దోపిడీని ప్రతిబింబిస్తాయి. స్త్రీని ఆట వస్తువుగా చేసి దేవుని పేరిట పెద్దమనిషి కల్పించే వికృతం వెర్రితలల వేస్తుంది. ఈ వ్యవస్థ వివిధ పేర్లతో దక్షిణ భారతదేశమంతటా వ్యాప్తిలో ఉంది. తెలంగాణలో "జోగిని" అని చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో "మాతమ్మ"లని కర్నూలు, అనంతపూర జిల్లాల్లో "బసవి"లని మహారాష్ట్రలో "మురళి"లని కర్ణాటకలో "దేవదాసి"లని తమిళనాడులో "మరియమ్మ"లని గోవాలో "భావిను"లని పిలుస్తారు.

జోగిని పిల్లలు భూస్వాముల సంపర్కంతో పుట్టినప్పటికీ వారు ఆమె బిడ్డలే కానీ ఆయన బిడ్డలు కాలేరు. దురదృష్టవంతులైన వీరు తండ్రి ఉండి కూడా తమ తండ్రి అని చెప్పుకోలేని నికృష్ట పరిస్థితుల్లో ఉండడం. జోగిని కొడుకు ఆ కులంలో ఎవరినైనా వివాహం చేసుకోవచ్చు. అభ్యంతరం ఏమీ ఉండదు కానీ జోగిని కూతురు మాత్రం ఆ కులంలో వివాహం చేసుకోకూడదు. కనీసం ఒక కూతురైన తల్లిలాగే జోగిని అవుతుంది. జోగినికి ఆడపిల్ల పుట్టడం అంటే ఈ సంప్రదాయం కొనసాగించడం అని అర్థం.

**నవలా నేపథ్యం :**

ఈ నవల శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఇద్దరు స్నేహితులు విద్య, కవితల స్నేహంతో మొదలవుతుంది. విద్యది విజయవాడ కాగా, కవితది నిజామాబాద్ జిల్లా సిరిపురం. కవిత, విద్య ప్రాణ స్నేహితులు. ప్రాంతాలు వేరైనా ఇద్దరి ఆశయం ఒక్కటే. సెలవులు గడపడానికి తన ఊరికి రమ్మని విద్యను ఆహ్వానిస్తుంది కవిత. విద్య ఒప్పుకోవడంతో ఇద్దరూ కలిసి సిరిపురం వెళ్లడం జరుగుతుంది. ఈ సమయంలోనే ఆ ఊరిలో ఊర పండగ జరుపుతుంటారు. ఆ రాత్రి సమయంలో ఒంటరిగా డప్పులు, మోతలో వాటికి అనుగుణంగా అక్కడి వాళ్ళు నాట్యం చేస్తుంటే విద్యకు ఎంతో ఆనందం, ఆశ్చర్యం కలగడం వల్ల ఆ ఊర పండగ గురించి తెలుసుకోగా, ఆ ఊరిలో ఉన్నటువంటి జోగిని వ్యవస్థ గురించి కూడా తెలుసుకోవాలనే తపనతో జోగు సాయవ్వ, జోగు పోశవ్వ, జోగు సబితలను కలవగా వారు పడుతున్నటువంటి కష్టాలను, బాధలను గురించి తెలుసుకుంటుంది. ఈ సమస్యలపైనే పి.హెచ్‌డి చేయాలని నిర్ణయించుకొని పరిశోధన కోసం తిరిగి తన విశ్వవిద్యాలయానికి వెళుతుంది. అక్కడ విద్యకు నవీన్ పరిచయం కాగా, వివాహం చేసుకొని వృత్తిరీత్యా విద్య నవీన్‌తో అమెరికా వెళ్ళిపోతుంది.

ఈ తరుణంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళలకు 33 శాతం ప్రకారం సిరిపురం గ్రామపంచాయతీకి ఎన్నికలు జరగగా పోశవ్వ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, ఆ తర్వాత మండల ప్రెసిడెంట్‌గా ఎన్నికై అభివృద్ధి కార్యక్రమాల్లో జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన నీరాజ భానోత్ అవార్డుకు ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకొని జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రశంసలను పొందుతుంది.

**స్త్రీ చైతన్య ప్రతీక పోశవ్వ పాత్ర :**

రచయిత్రి పోశవ్వ పాత్ర చిత్రీకరణ విధానాన్ని గమనిస్తే వాస్తవ జీవితాలకు, సమాజంలో స్త్రీల సమస్యలకు ప్రతిబింబకాలు. ఒక పాత్రపై అభిప్రాయం కలగడానికి ఆధారం రచయిత. పాత్రను చిత్రించిన తీరే అంటే పాత్రచిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యం ఇమిడి ఉంటాయి. ఈ నవలలో ప్రధాన పాత్ర పోశవ్వ. కేంద్ర బిందువు స్త్రీ. జోగు సాయవ్వ కూతురు పోశవ్వ. అగ్రకులాల అక్రమాల్ని ఎదురించగలిగే గుండె నిబ్బరం ఈమెలో ఉన్నాయి. స్వభావరీత్యా ధైర్యశాలి. అనుకున్న పనిని పట్టు విడవకుండా చేసి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. పోశవ్వ పోరాటపటిమను గమనిస్తే జీవితంలో అత్యంత క్లిష్ట ఘట్టంలో కూడా ధీటువుగా ఉండాలని రచయిత్రి హెచ్చరిస్తుంది. ధైర్యంగా ఉండి సమాజంలో ఎదురైన సమస్యలను ఎదురించి

నప్పుడు అట్టడుగు వర్గాల వారు కూడా గౌరవం పొంది ఉన్నత పదవులు పొందవచ్చని పోశవ్వ నిరూపిస్తుంది. మహిళలకు చేయూతనిస్తే స్వయంశక్తితో అన్ని రంగాల్లో రాణిస్తారని, ఏ స్త్రీ అయినా పట్టుదల, ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఎదురైన సమస్యలను ఎదిరించి, నిలదీసి ప్రశ్నించే హక్కు ప్రతి దళిత మహిళకు ఉందని పోశవ్వ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. జోగిని వ్యవస్థ భక్తికాదని స్త్రీపై జరుగుతున్న అణచివేత అని గ్రహించిన పోశవ్వ ఆలోచనలు స్త్రీ జాగృతికి నిదర్శనాలు. రాజకీయ, వ్యక్తిగత జీవితంలో సమస్యలు ఎదురైనప్పటికీ కూడా స్త్రీ వెనుకాడకుండా పోరాడుతుందని కీలకపాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. తన వ్యక్తిగత తిరుగుబాటు ద్వారా కాకుండా సామాజిక మార్పుకు సంకేతమని వ్యక్తపరుస్తుంది ఈ నవల. నేటి స్త్రీలకు కూడా ఉత్తేజ పరుస్తుందని ఆశిద్దాం. పోశవ్వ పాత్ర నేటి తరానికి స్ఫూర్తి దాయకురాలుగా ముఖ్యంగా మహిళ సమాజానికి గర్వ కారణంగా నిలిచిపోతుంది. ఈ నవల ఒక అక్షరనీరాజనం. వనితలకు ఆదర్శ సుభాషితం.

**ఆధార గ్రంథాలు :**


1. మృణాళిని, సి.సి.1998. తెలుగు సాంఘిక నవలల్లో కథాకథన శిల్పం, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.
2. విజయలక్ష్మి, ఆరేపల్లి. 1996 నవల రచయిత్రులు - నవలా ఉద్యమాలు, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.
3. కాత్యాయనీ విద్మహే (సం). 2005, తీరొక్క పువ్వులు - భిన్న అస్తిత్వాల స్త్రీల సాహిత్యం, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, హైదరాబాద్.
4. లలిత, వకుళాభరణం. 2012, జోగినీ వ్యవస్థ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
5. శాంతిప్రబోధ, వి. 2004, జోగిని, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# కోడూరు కౌసల్యాదేవి సాహిత్యంలో స్త్రీ చైతన్యం

- డా॥. బి. జ్యోతి

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మదనపల్లి, అన్నమయ్య జిల్లా.

**పరిచయం :**

అరికెపూడి కౌసల్యాదేవి తెలుగు సాహిత్యంలో ప్రముఖ నవలా రచయిత్రి. ఆమె నవలల్లో రచయిత్రి పాత్ర కేవలం కథ చెప్పడానికే పరిమితం కాకుండా, సమాజాన్ని విశ్లేషించే, ప్రశ్నించే, మార్పు వైపు నడిపించే శక్తిగా కనిపిస్తుంది.

స్త్రీ చైతన్యం అనేది స్త్రీ తన అస్తిత్వాన్ని, తన హక్కులను, తన ఆలోచనలను స్వతంత్రంగా గ్రహించే స్థితి. ఇది ఒక్కసారిగా ఏర్పడే అంశం కాదు దీర్ఘకాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అనుభవాల ఫలితం. తెలుగు సాహిత్యంలో ఈ చైతన్యం క్రమంగా వికసించింది. ప్రారంభ దశలో స్త్రీని ఆదర్శభార్యగా, త్యాగమూర్తిగా మాత్రమే చూపించిన సాహిత్యం, ఆధునిక కాలంలో ఆమె వ్యక్తిత్వాన్ని, భావోద్వేగాలను, ఆలోచనలను ప్రతిష్ఠించే దశకు చేరుకుంది.

తెలుగు సాహిత్యంలో మహిళా రచయిత్రుల పాత్ర విశిష్టమైనది. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అంతర్మథనం, సామాజిక - సాంస్కృతిక పరిణామాలను సున్నితంగా ఆవిష్కరించిన రచయిత్రుల్లో కోడూరు కౌసల్యాదేవి ఒక ముఖ్యమైన స్థానం పొందారు. ఆమె నవలలు సమాజ వాస్తవికతను ప్రతిబింబిస్తూ, స్త్రీల జీవితాల్లోని పోరాటం, ఆశలు, ఆశయాలను ప్రగాఢంగా వ్యక్తపరుస్తాయి.

**స్త్రీ చైతన్య భావన**

స్త్రీ చైతన్యం అనేది కేవలం తిరుగుబాటు కాదు అది ఆలోచనా స్వేచ్ఛ, ఆత్మగౌరవం, స్వీయ నిర్ణయాధికారం. కోడూరు కౌసల్యాదేవి రచనల్లో ఈ చైతన్యం మౌనంగా, లోతుగా, అనుభవాత్మకంగా వ్యక్తమవుతుంది. ఆమె స్త్రీ పాత్రలు గొంతెత్తి నినాదాలు చేయకపోయినా, ఆత్మ విశ్వాసంతో తమ అస్తిత్వాన్ని ప్రకటిస్తాయి. స్త్రీచైతన్యం అనేది పురుష వ్యతిరేకత మాత్రమే కాదు. అది స్త్రీ తనను తాను తెలుసుకునే ప్రక్రియ.

- తనపై విధించిన పాత్రలను ప్రశ్నించడం
- తన జీవితంపై తానే నిర్ణయాలు తీసుకునే ఆలోచన
- భావోద్వేగాలకు విలువనిచ్చే దృక్పథం
- స్వీయగౌరవాన్ని పరిరక్షించుకునే ధైర్యం

ఈ లక్షణాలన్నీ స్త్రీచైతన్యానికి సంకేతాలు. కోడూరు కౌసల్యాదేవి రచనల్లో ఈ చైతన్యం ఘర్షణాత్మకంగా కాకుండా, అంతర్ముఖంగా, సహజంగా వ్యక్తమవుతుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీ రచయిత్రులు స్త్రీ అనుభవాలను, ఆలోచనలను, సంఘర్షణలను కొత్త దృష్టితో ప్రతిబింబించారు. ఆ క్రమంలో కోడూరు

కౌసల్యాదేవి ఒక విశిష్ట స్థానం సంపాదించారు. ఆమె సాహిత్యం స్త్రీని దయనీయమైన పాత్రగా కాక, చైతన్య వంతమైన వ్యక్తిత్వంగా ప్రతిష్టిస్తుంది. కుటుంబం, సమాజం, సంప్రదాయం అనే పరిమితుల్లో స్త్రీ ఎదుర్కొనే అంతర్ముఖ సంఘర్షణలను, స్వీయగౌరవాన్వేషణను ఆమె రచనలు స్పష్టంగా తెలుస్తాయి. ఈ పరిశోధన పత్రం కోడూరు కౌసల్యాదేవి సాహిత్యంలో వ్యక్తమయ్యే స్త్రీ చైతన్య స్వరూపాన్ని విశ్లేషిస్తుంది.

**సమాజ వాస్తవాలను ప్రతిబింబించే రచయిత్రి పాత్ర**

**పితృస్వామ్య వ్యవస్థ :**

అరికెపూడి కౌసల్యాదేవి నవలల్లో పితృస్వామ్య వ్యవస్థ ఒక ప్రధాన సమస్యగా ప్రతిఫలిస్తుంది. ఈ వ్యవస్థలో పురుషుడే అధికారం కలిగినవాడిగా, స్త్రీ ద్వితీయ స్థానం కలిగినవారిగా చూపబడుతుంది. కుటుంబ నిర్ణయాలు, ఆస్తి హక్కులు, వివాహ నిర్ణయాలు అన్నీ పురుషుల చేతుల్లోనే ఉండటం ఆమె నవలల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

రచయిత్రి ఈ వ్యవస్థను అంగీకరించకుండా, దానివల్ల స్త్రీ ఎదుర్కొనే మానసిక, శారీరక, సామాజిక వేదనలను చిత్రిస్తుంది. పితృస్వామ్యం వల్ల స్త్రీ తన అభిప్రాయాలను వ్యక్తపరచలేని పరిస్థితిని ఎదుర్కొంటుందని ఆమె రచనలు స్పష్టంగా తెలుస్తుంది.

**కుటుంబ వ్యవస్థలో స్త్రీ స్థానం :**

కౌసల్యాదేవి నవలల్లో కుటుంబ వ్యవస్థలో స్త్రీ స్థానం త్యాగం, సహనం, సేవలతో ముడిపడి ఉంటుంది. ఆమెను:

- కూతురిగా - విధేయురాలిగా
- భార్యగా - సేవకురాలిగా
- తల్లిగా - నిరంతర త్యాగమూర్తిగా

చూపించే దృక్పథాన్ని రచయిత్రి విమర్శిస్తుంది. కుటుంబ సంక్షేమానికి స్త్రీ ఎంత శ్రమించినా, ఆమెకు తగిన గౌరవం, నిర్ణయాధికారం లేకపోవడాన్ని రచయిత్రి తీవ్రంగా ప్రశ్నిస్తుంది. కుటుంబంలో స్త్రీ కేవలం బాధ్యతలు మోసే వ్యక్తిగా కాకుండా, స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మనిషిగా గుర్తించబడాలనే సందేశాన్ని తెలియజేస్తుంది.

- కుటుంబం స్త్రీకి ఆశ్రయం అయినప్పటికీ, అదే సమయంలో పరిమితుల కేంద్రంగా మారుతుంది.
- త్యాగాన్ని సహజ లక్షణంగా మోపడం
- స్త్రీ ఆశలను ద్వితీయంగా చూడడం
- నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపోవడం
- ఈ పరిస్థితుల్లో స్త్రీ తన అస్తిత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నిస్తుంది.

**వివాహ వ్యవస్థ - స్త్రీ జీవితం :**

వివాహం స్త్రీ జీవితానికి భద్రత అనే భావనను సమాజం ప్రచారం చేస్తుంది. కానీ కౌసల్యాదేవి నవలల్లో వివాహం చాలా సందర్భాల్లో బంధనంగా చిత్రించబడుతుంది.

**వివాహం తరువాత స్త్రీ :**

- భర్త అభిరుచులకు లోబడి ఉండాలి
- తన ఆశలను త్యాగం చేయాలి
- కుటుంబ గౌరవం పేరుతో సహించాలి

అనే పరిస్థితి ఎదుర్కొంటుంది. రచయిత్రి వివాహాన్ని పూజ్యంగా చూడడం కంటే, స్త్రీ స్వేచ్ఛకు అడ్డుగా మారిన సందర్భాలను చూపిస్తుంది.

కోడూరు కౌసల్యాదేవి రచనల్లో వివాహం ఒక పవిత్ర బంధంగా మాత్రమే కాక, స్త్రీ స్వేచ్ఛను నియంత్రించే వ్యవస్థగా కనిపిస్తుంది.

- భావోద్వేగ అసమానత
- భార్య పాత్రకు పరిమిత నిర్వచనం

ఈ అనుభవాలే స్త్రీలో చైతన్యాన్ని పెంపొందిస్తాయి.

**సంప్రదాయాల పేరిట అణచివేత :**

సంప్రదాయాలు అనే పేరుతో స్త్రీపై జరుగుతున్న అణచివేతను కౌసల్యాదేవి నవలలు తీవ్రంగా విమర్శిస్తాయి.

కట్నం, విధేయత, సహనం, నిశ్శబ్దం వంటి గుణాలను స్త్రీకి మాత్రమే వర్తింపజేయడం రచయిత్రికి ఆమోద యోగ్యం కాదు.

**రచయిత్రి అభిప్రాయం ప్రకారం :**

- సంప్రదాయం మానవత్వానికి విరుద్ధంగా ఉంటే

దాన్ని ప్రశ్నించాలి

- స్త్రీ జీవితాన్ని సంకుచితం చేసే సంప్రదాయాలకు అర్థం లేదు

అని ఆమె నవలలు బలంగా తెలియజేస్తాయి.

ఈ అంశాలను రచయిత్రి పాత్ర ఎలాంటి అతిశయోక్తులు లేకుండా వాస్తవికంగా చూపిస్తుంది.

**బాల్య దశలో నియంత్రణ :**

అరికెపూడి కౌసల్యాదేవి నవలల్లో స్త్రీ జీవితం బాల్య దశ నుంచే నియంత్రణలో ఉంటుందని స్పష్టంగా చూపబడుతుంది. చిన్న వయసులోనే బాలికలకు

- ఏమి మాట్లాడాలి
- ఎలా నడవాలి

ఎలా ఉండాలి అనే ఆంక్షలు విధించబడతాయి. వారి అభిరుచులు, ఆశలు, కలలు పట్టించుకోబడవు. బాలురకు లభించే స్వేచ్ఛ బాలికలకు ఇవ్వబడకపోవడం ద్వారా సమాజంలోని లింగ వివక్షను రచయిత్రి తీవ్రంగా విమర్శిస్తుంది.

**వ్యక్తిత్వాన్ని కోల్పోయే పరిస్థితి :**

నిరంతర నియంత్రణ, బంధనాలు, త్యాగాల మధ్య స్త్రీ తన వ్యక్తిత్వాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకుంటుంది. ఆమె :

- తన అభిప్రాయాలను చెప్పలేకపోతుంది
- స్వంత నిర్ణయాలు తీసుకోలేకపోతుంది
- తనను తాను గుర్తించలేని స్థితికి చేరుతుంది

ఈ మానసిక స్థితిని కౌసల్యాదేవి చాలా సున్నితంగా చిత్రిస్తుంది. వ్యక్తిత్వాన్ని కోల్పోవడం స్త్రీ జీవితంలో అత్యంత ప్రమాదకరమైన అంశమని, దీనికి వ్యతిరేకంగా స్త్రీ నిలబడాల్సిన అవసరం ఉందని ఆమె నవలలు స్పష్టంగా సూచిస్తాయి.

ఈ సమస్యలను కేవలం చూపించడమే కాకుండా, వాటిపై చైతన్యపూరిత ఆలోచనకు దారితీస్తుంది.

**భయం, ఆశ, నిరాశ, ధైర్యం :**

కౌసల్యాదేవి నవలల్లో స్త్రీ పాత్రల మానసిక ప్రయాణం ఈ నాలుగు భావాల మధ్య సాగుతుంది.

- భయం - సమాజ భయం, కుటుంబ నిరాకరణ భయం
- ఆశ - మంచి జీవితం, స్వాతంత్ర్యం, గౌరవం పట్ల ఆశ
- నిరాశ - కలలు నెరవేరకపోవడం వల్ల కలిగే బాధ
- ధైర్యం - చివరికి తన స్థితిని మార్చుకోవాలనే సంకల్పం

ఈ భావాల మార్పును సున్నితంగా చిత్రించడం వల్ల పాత్రలు పాఠకునికి దగ్గరగా అనిపిస్తాయి వంటి అంశాలను సున్నితంగా, లోతుగా విశ్లేషిస్తుంది. ఇది ఆమె రచనలకు సాహిత్య విలువను పెంచింది.

**సామాజిక సంస్కరణ దిశగా రచయిత్రి :**

ఎ. కట్న వ్యవస్థపై విమర్శ

కట్న వ్యవస్థను కౌసల్యాదేవి నవలలు ఒక అమానవీయ సామాజిక దురాచారంగా చిత్రిస్తాయి. వివాహాన్ని వ్యాపారంగా మార్చిన ఈ వ్యవస్థ వల్ల:

- స్త్రీని భారంగా చూడటం
- పేద కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి
- స్త్రీపై అవమానం, వేధింపులు

జరుగుతున్నాయని రచయిత్రి బలంగా చూపిస్తుంది. కట్నం పేరుతో స్త్రీ విలువను కొలవడం మానవత్వానికి విరుద్ధమని ఆమె రచనలు స్పష్టంగా విమర్శిస్తాయి.

బి. స్త్రీ అణచివేతను ఖండించడం

స్త్రీ అణచివేత విభిన్న రూపాల్లో కనిపిస్తుంది. కుటుంబంలో, సమాజంలో, సంప్రదాయాల పేరుతో స్త్రీకి స్వేచ్ఛ లేకుండా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. మాట్లాడే హక్కు, నిర్ణయాలు తీసుకునే హక్కు లేకుండా స్త్రీని జీవించే పరిస్థితిని ఆమె నవలలు మానవ హక్కుల ఉల్లంఘనగా చూపిస్తాయి.

సి. పురుషాధిపత్య భావజాలంపై విమర్శ

పురుషుడే అధికారం కలిగినవాడనే భావజాలాన్ని కౌసల్యాదేవి నవలలు అంగీకరించవు. పురుషాధిపత్యం వల్ల:

- స్త్రీ అభిప్రాయాలు నిర్లక్ష్యం చేయబడతాయి

- స్త్రీ శ్రమను తక్కువగా చూడటం జరుగుతుంది
- కుటుంబంలో అసమానతలు పెరుగుతాయి

అని స్పష్టంగా చూపిస్తుంది. సమానత్వంపై ఆధార పడిన కుటుంబం, సమాజమే ఆరోగ్యకరమని సూచిస్తాయి. తీవ్రంగా ప్రశ్నిస్తుంది. ఆమె రచనలు సామాజిక సంస్కరణకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

సి. ధైర్యంగా నిలబడే ప్రేరణ ఇస్తాయి

కౌసల్యాదేవి నవలల్లోని స్త్రీ పాత్రలు తమ పరిస్థితు లతో పోరాడుతూ నిలబడటం పాఠకులకు ధైర్యాన్ని ఇస్తుంది. ప్రత్యేకంగా స్త్రీ పాఠకుల్లో:

- ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
- అన్యాయానికి ఎదిరించే శక్తి వస్తుంది
- స్వంత జీవితం పట్ల బాధ్యత భావన కలుగుతుంది

ఈ విధంగా ఆమె రచనలు పాఠకులను కేవలం పఠనం వరకు కాకుండా, జీవితంలో మార్పుకు దారితీసే ప్రేరణగా మారుతాయి.

**ముగింపు :**

కోడూరు కౌసల్యాదేవి సాహిత్యంలో స్త్రీచైతన్యం సూక్ష్మంగా, లోతుగా, అనుభవాత్మకంగా వ్యక్తమవుతుంది. ఆమె స్త్రీ పాత్రలు ప్రశ్నిస్తాయి, ఆలోచిస్తాయి, నిర్ణయాలు తీసుకుంటాయి. ఈ విధంగా ఆమె సాహిత్యం ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీచైతన్య అధ్యయనానికి విలువైన ఆధారంగా నిలుస్తుంది.

ఈ అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే, అరికెపూడి కౌసల్యాదేవి నవలా రచనలు కేవలం వినోదాత్మక కథనాలు కాకుండా సామాజిక చైతన్యాన్ని మేల్కొలిపే సాహిత్య కృతులుగా నిలుస్తాయని స్పష్టమవుతుంది. ఆమె రచనలు పితృస్వామ్య వ్యవస్థ, కట్న వ్యవస్థ, స్త్రీ అణచి వేత, పురుషాధిపత్య భావజాలం వంటి సమస్యలను బలంగా ప్రశ్నిస్తాయి.

బాల్యదశ నుంచే స్త్రీ ఎదుర్కొనే నియంత్రణ, వివాహంలో ఏర్పడే బంధనం, కుటుంబంలో నిరంతర త్యాగ జీవితం, వ్యక్తిత్వ హీనత వంటి వాస్తవాలను ఆమె నవలలు లోతుగా చిత్రిస్తాయి. అదే సమయంలో స్త్రీకి ఆత్మగౌరవం, నిర్ణయాధికారం, చదువు - ఉద్యోగాల ద్వారా ఆర్థిక స్వావలంబన అవసరమని స్పష్టమైన సందేశాన్ని ఇస్తాయి.

సరళమైన భాష, సహజమైన సంభాషణలు, పాత్రల అంతర్మనస్సు విశ్లేషణ ద్వారా పాఠకులను ఆలోచించే టట్లు, ప్రశ్నించేటట్లు, ధైర్యంగా నిలబడేటట్లు చేసే శక్తి ఆమె రచనలకు ఉంది. మానవత్వం, నిజాయితీ, బాధ్యత, పరస్పర గౌరవం వంటి నైతిక విలువలను పునరుద్ధరించడమే ఆమె నవలా రచనల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది.

మొత్తంగా, అరికెపూడి కౌసల్యాదేవి నవలా రచనలు స్త్రీ చైతన్యానికి స్వరం ఇచ్చినవిగా, సామాజిక సంస్కరణకు దోహదపడినవిగా, తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్నవిగా నిలుస్తాయి. ఇవి పాఠకుని మనస్సులో మార్పు విత్తనాలను నాటే శక్తివంతమైన సాహిత్యంగా భావించవచ్చు.

**సూచనలు :**

1. ఆధునిక తెలుగు స్త్రీ సాహిత్యం - విమర్శాత్మక వ్యాసాలు
2. మహిళా వాద సాహిత్య సిద్ధాంతాలు
3. కోడూరు కౌసల్యాదేవి కథలు, నవలలు
4. మహిళా వాద సాహిత్య సిద్ధాంతాలు

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# పాకుడురాళ్లు నవలలో స్త్రీ స్వేచ్ఛ భోగాలు రాజీ : మంజరి పాత్రలో స్త్రీవాద అస్తిత్వ సంక్షోభ విశ్లేషణ

- డా॥. కె. భీమమోహన రావు
జి.డి.సి., వెదురుకుప్పం.

**ఉపోద్ఘాతం :**

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ్ అందించిన నవల 'పాకుడురాళ్లు'. నవలలోని అనేక అంశాలు ప్రస్తుతాన్ని గుర్తుచేస్తున్నాయి. ఐదు దశాబ్దాల క్రితం స్త్రీల స్థితిని పరిస్థితాన్ని అద్దంలో చూపినట్లే ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

స్త్రీ జీవితాన్ని నిర్ణయించే అంశాల్లో కుటుంబం, సమాజం, ఆర్థిక వ్యవస్థ, లైంగిక రాజకీయాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ వ్యవస్థల మధ్య స్త్రీ తన స్వీయతను నిలుపుకోవడం అత్యంత క్లిష్టమైన విషయం. మంజరి పాత్ర ఈ క్లిష్టతకు ప్రతిరూపం. ఆమెకు లభించిన అవకాశాలు, సంపద, గుర్తింపు - ఇవన్నీ ఆమె స్వీయ నిర్ణయాల ఫలితమా? లేక వ్యవస్థలో భాగమై ఉండటం వల్ల వచ్చిన ప్రతిఫలాలా? అన్న సందేహం నవలంతా వెంటాడుతుంది. మంజరి జీవితం తిరుగుబాటు కాదు. పూర్తిస్థాయి అంగీకారమూ కాదు. అది జీవించడానికి చేసిన రాజీ.

నవలలోని ఈ వాక్యం మంజరి అస్తిత్వాన్ని స్పష్టంగా ఆవిష్కరిస్తుంది. "ఏం బతుకులో మంజూ! మన జీవితాలకో అర్థమంటూ లేకుండా పోతుంది. మనమిలా ఈ పంజరాల్లో ఉండవలసిందే?"[1] ఈ వాక్యం మంజరి వ్యక్తిగత వేదన మాత్రమే కాదు, ఆధునిక స్త్రీ ఎదుర్కొనే సామూహిక అస్తిత్వ సంక్షోభానికి ప్రతిధ్వని. వీరి జీవితాలకు ఒక అర్థం లేకుండా పోతుందని బాధపడతారు. ఇదంతా ఎందుకు చేస్తున్నామని ఆత్మపరిశీలన చేసుకున్నప్పుడు మనం చెప్పుకోగలిగే సమాధానం లేదంటారు. కారణాలను అన్వేషిస్తే ఇది అస్తిత్వ సంక్షోభం. వీరికి స్వేచ్ఛ ఉంటే ఖచ్చితంగా ఈ ప్రశ్నకు జవాబు ఉంటుంది. ఇక్కడ ప్రశ్నే మిగిలింది. ఇక్కడ పంజరం వ్యవస్థ కాబట్టే బతకడానికి తప్పనిసరి అంగీకారం కన్పిస్తుంది.

**సారాంశం :**

స్త్రీ జీవితంలో స్వేచ్ఛ అంటే ఏమిటి? భౌతిక సౌఖ్యాల లభ్యతే స్వేచ్ఛగా పరిగణించవచ్చా? లేక స్వీయ నిర్ణయాధికారం లేకుండా లభించే భోగాలు ఒక రకమైన బంధనాలేనా? అనే మౌలిక ప్రశ్నలను ఈ పరిశోధన పత్రం పరిశీలిస్తుంది.

ఈ అధ్యయన కేంద్రబిందువుగా మంజరి పాత్రను ఎంచుకొని, ఆమె జీవన ప్రయాణంలో ఎదురయ్యే రాజీలు, సంఘర్షణలు, విజయాలు, వైఫల్యాలు, చివరికి ఆత్మహత్యకు దారితీసిన మానసిక ఒత్తిడిని విశ్లేషించడమే లక్ష్యంగా తీసుకున్నాం.

మంజరి పాత్ర ఒక వైపు తిరుగుబాటు స్వభావాన్ని,

మరోవైపు పరిస్థితుల మధ్య సర్దుకుపోయిన రాజీని ప్రతి బింబిస్తుంది. ఆమె సంపాదించిన కీర్తి, ధనం, అధికారాల మధ్య కూడా స్వేచ్ఛ లేని అంతర్గత జీవితం ఎలా కొనసాగిందో ఈ పరిశోధన వివరిస్తుంది. "భోగాలు = స్వేచ్ఛ కాదు" అనే రచయిత దృష్టికోణం ఈ నవలలో ఎలా వ్యక్తమైందో, కళ్యాణి వంటి పాత్రల ద్వారా అది ఎలా బలపడిందో ఈ పత్రం విశదీకరిస్తుంది.

**పరిచయం :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో స్త్రీ పాత్రల ప్రయాణం అనేక మలుపులు చూశాం. ఆధునిక తెలుగు నవలా సాహిత్యంలో స్త్రీ పాత్రల చిత్రణ ఒక విశేషమైన ప్రయాణం చేసింది. సంప్రదాయ బంధనాల నుంచి మొదలైన స్త్రీ పాత్ర, క్రమంగా తిరుగు బాటు స్వరాలను పలుకుతూ, చివరకు అస్తిత్వ ప్రశ్నల దాకా చేరింది. ఈ నేపథ్యంలో మంజరి పాత్ర ఒక సాధారణ స్త్రీ పాత్ర కాదు. ఆమె జీవితం విజయం, వైభవం, కీర్తి, అధికారాలతో నిండినట్లుగా కనిపించినా, ఆ లోపల దాగి ఉన్న శూన్యత, నిస్సహాయత, ఒంటరి తనం అనే ఈ నవల యొక్క ప్రధాన అంశాలు.

మంజరి జీవితం మనకు ఒక కీలక ప్రశ్నను మన ముందు ఉంచుతుంది. సహజం ఇచ్చే సుఖసౌకర్యాలు నిజంగా మనకు స్వేచ్ఛనిస్తాయా? లేక అవే మనలను మరింత బంధిస్తాయా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడమే ఈ పరిశోధన యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

**నవలలో స్త్రీ స్వేచ్ఛ - భావనాత్మక నేపథ్యం :**

స్వేచ్ఛ అనేది కేవలం ఆర్థిక స్వావలంబన మాత్రమే కాదు. శరీరంపై, భావాలపై, నిర్ణయాలపై పూర్తి అధికారం కలిగి ఉండడమే నిజమైన స్వేచ్ఛ. మంజరి ఈ మూడు స్థాయిల్లోనూ పరిమితుల మధ్యే జీవించింది. "చట్టులో మొలిచి, ఆ చట్టును బద్ధలుకొట్టుకొని మహావృక్షంగా రూపొందడమంటే ఏమిటో నాకు తెలుసు"[2] ఆమె సంపాదించింది, పాలించింది, నియంత్రించింది. కానీ తనను ప్రేమించే వ్యక్తి కోసం, తన మనస్సుకు నచ్చిన జీవితం కోసం మాత్రం ఆమె ఎప్పటికీ నిర్ణయం తీసుకోలేక పోయింది. అందుకే ఆమె జీవితం విజయం మధ్యలోనూ విషాదంగా మారింది.

**మంజరి పాత్ర నిర్మాణం - చైతన్యం నాటి పరిస్థితులు :**

మంజరి పాత్రను మొదట చూసినప్పుడు ఆమె ఒక తిరుగుబాటు స్త్రీగా కనిపిస్తుంది. తనకోసం తానే నిర్ణయాలు తీసుకునే ధైర్యం, సంపాదన, అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకున్న సామర్థ్యం, పురుషాధిక్య సమాజాన్ని ఎదుర్కొనే ధాటితనం ఇవన్నీ ఆమెను అసాధారణ వ్యక్తిగా నెలబెడతాయి. కానీ లోతుగా పరిశీలిస్తే, మంజరి తిరుగుబాటు పూర్తిస్థాయి కాదు.

ఆమె వ్యవస్థను కూల్చలేదు. వ్యవస్థలోనే అత్యంత చాకచక్యంగా జీవించడం నేర్చుకుంది. "బతికితే అగ్ని గోళంగా బతకాలి. లేదా బూడిదలాగా, చప్పగా చల్లారి పోవాలి."[3] ఆమె మాటల్లోనే ఈ వాస్తవం వ్యక్తమవుతుంది. "సాధారణ వ్యక్తులు చచ్చీ చెడీగానీ చేయలేని పనులను నేను సులువుగా చేయగలిగాను."[4] ఇది శక్తికి చిహ్నంలా కనిపించినా, అదే సమయంలో ఆమె ఎదుర్కొన్న అనేక రాజీలకు సాక్ష్యం.

**శరీరం - సరుకు : వ్యవస్థాత్మక హింస :**

మంజరి జీవితంలో అత్యంత కలచివేసే ఘట్టం చందూలాల్ ఎపిసోడ్. ఇది వ్యక్తిగత దురాచారం మాత్రమే కాదు. సినీ పరిశ్రమలో స్త్రీ శరీరాన్ని ఒక "వినోద వస్తువుగా" మార్చి వ్యవస్థాత్మక హింసకు ప్రతీక. "ఆవిడ బుద్ధి పూర్వకంగా చెయ్యని పనిని చందూలాల్ బలవంతంగా చేశాడు."[5] ఈ ఒక్క వాక్యం మంజరి స్వేచ్ఛ సరిహద్దులను స్పష్టంగా చూపిస్తుంది. "అతగారు మంజరిని జుట్టు విరబోసుకోమన్నాడు. అందమైన జాకెట్‌ను పీలికలు పీలికలు చేసుకోమన్నాడు. చీర కూడా చింపుకోమన్నాడు. పిచ్చి కేకలువేస్తూ గదంతా తిరగమన్నాడు"[6]. మంజరి 'నెవర్' అంటూనే రాజీపడక తప్పలేదు. ప్రాణాలకోసమైనా పారిపోదామనుకొంది. ఆమె ఎంత శక్తివంతురాలైనా, శరీరంపై చివరి అధికారం ఆమెదే కాదు.

ఇక్కడ రచయిత ఒక చేదు నిజాన్ని చెబుతారు. సంపాదన, గుర్తింపు, అధికారుల అండదండలు ఉన్నప్పటికీ స్త్రీ శరీరం భద్రంగా ఉండదు. ఒకప్పుడు నాటక సమాజం. ఇప్పుడు నగర జీవితం. స్థలం ఏదైనా అణచివేత మాత్రం స్థిరం. "ఓ పిచుక కిచకిచలాడుతూ గదంతా

తిరిగి, కిటికీలోంచి వెళ్లిపోయింది.”[7] పిచుక వెళ్లగలిగినంత సులభంగా వేగంగా మంజరి నాలుగు గోడలనే మాయా వ్యవస్థ నుంచి అవసరాల బంధాలతో బంధించబడింది. మంజరి చూడగలుగుతుంది. కానీ అందుకోలేని స్వేచ్ఛ., ఆమెకు చైతన్యం పెరిగినా వ్యవస్థ ఇంకా పంజరంగానే ఉంది.

“ఓ ప్రబుద్ధుడు కిటికీలోంచి మంగమ్మను చూసి గట్టిగా ఈలవేశాడు. మరొకరెవరో కొత్త పెట్టరా అనడం కూడా మంగమ్మకు వినిపించింది.”[8] కిటికీ అవతలి నుంచి వచ్చిన ఈలలు, అసభ్య వ్యాఖ్యలు మంగమ్మ వ్యక్తిత్వాన్ని కాదు, ఆమె శరీరాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకున్న పురుషాధిపత్య దృష్టిని ప్రతిబింబిస్తాయి. ప్రజా ప్రదేశాల్లో స్త్రీ శరీరం ఎలా వస్తువుగా చూడబడుతోందో రచయిత స్పష్టం చేస్తాడు.

**కళ్యాణి పాత్ర : భోగాల్లో స్థిరపడిన రాజీ :**

మంజరి పక్కనే ఉన్న కళ్యాణి పాత్ర. మంజరికి ఒక అద్దంలా పనిచేస్తుంది. కళ్యాణి తిరుగుబాటు కాదు. ఆమె అంగీకారమూ కాదు. ఆమె జీవితం అలవాటుగా మారిన రాజీ. “ఈ పీల్డులో నిద్ర సంగతి సరేసరి... కంటి నిండా నిద్రపోయి ఎన్ని రోజులయిందో భయమేస్తుంది.”[9] కళ్యాణి జీవితంలో భోగాలు ఉన్నాయి. కానీ అవి స్వేచ్ఛ కాదు. అవి ఒక నిరంతర అలసట, ఒత్తిడి, మానసిక ఖాళీతనాన్ని మాత్రమే ఇస్తాయి. ఇక్కడ రచయిత స్పష్టంగా చెబుతారు. భోగాలు = సుఖాలు కావచ్చు కానీ భోగాలు = స్వేచ్ఛ కాదు. ఇద్దరూ అట్టడుగు నుండి వచ్చినవారే బ్రతకడానికి పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. కత్తితో బెదిరించిన వాడికి లొంగిపోయి అవకాశం ఇస్తానన్నా వాడితో రాజీపడిపోయిన మానసిక స్థితి చూస్తాం.

**డబ్బు, అధికారం - మానవ సంబంధాల విచ్ఛిన్నం :**

మంజరి ఎదుగుదలతో పాటు, ఆమె మానవ సంబంధాలు క్రమంగా ఖాళీ అవుతాయి. “వీళ్లందరికీ తను పూర్తిగా వాళ్ల మనిషేనన్న భ్రమను కలిగించింది.”[10] ఇది ప్రేమ కాదు. ఇది అవసరం. ఇది ప్రయోజనం. “తన నటనా, దాన్ని నలుగురూ మెచ్చుకోవడం. తనకోసం ప్రొడ్యూసర్లు వెంట పడటం, వేలమీద బేరాలు సాగడం - ఇవన్నీ మంజరికి అమితమైన తృప్తినిచ్చాయి.”[11] డబ్బు పెరిగిన కొద్దీ, ఆమెను చుట్టుముట్టిన మనుషులు పెరిగారు కానీ ఆమె ఒంటరితనం కూడా అంతే పెరిగింది.

**స్త్రీ శక్తి, శాపమా? వరమా? :**

కళ్యాణి అన్న మాట చాలా కీలకం : “నువ్వుగానీ శాపం పొందిన దేవతవేమో!”[12] మంజరి శక్తి ఆమెకు విజయాన్ని ఇచ్చింది. అదే శక్తి ఆమెను ఒంటరిగా కూడా చేసింది. ఇది ఆధునిక స్త్రీ ఎదుర్కొనే ప్రధాన అంశమే. స్త్రీ శక్తివంతంగా మారితే - ప్రేమ దూరమవుతుంది. లోబడితే - ఆత్మగౌరవం పోతుంది.

రావూరి భరద్వాజ్ సృష్టించిన మంజరి పాత్రను ఒకే నిర్వచనంలో బంధించడం అసాధ్యం. ఆమె జీవితాన్ని గమనిస్తే, ఆమె స్వేచ్ఛ కోసం తిరుగుబాటు చేసిన స్త్రీలా కనిపిస్తుంది. అదే సమయంలో వ్యవస్థలో బతకడానికి చేసిన రాజీల ప్రతిరూపంలా కూడా అనిపిస్తుంది. ఈ ద్వంద్వత్వమే మంజరి పాత్రను ఆధునిక తెలుగు నవలల్లో అత్యంత సంక్లిష్టమైన పాత్రగా నిలబెడుతుంది.

మంజరి స్వేచ్ఛను కోరుకున్న స్త్రీ. మంజరి జీవితం ప్రారంభం నుంచే ఒక లక్ష్యం స్పష్టంగా ఉంటుంది. తాను ఎవరి చేతిలో సాధనంగా మారకూడదు. ఆమె చలపతితో స్పష్టంగా చెప్పిన మాటలు ఇందుకు ఉదాహరణ. “ఎవరికి కోపం వచ్చినా సరే! ఎవరో ఏదో అనుకొంటారని చేతులారా సిద్ధాన్నాన్ని మట్టిలో కలుపుకోవడం నాకిష్టం లేదు.”[13] ఈ వాక్యంలో మంజరి వ్యక్తిత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ ఆమె సామాజిక భయాన్ని తిరస్కరిస్తుంది.

ఇది రాజీ కాదు - స్వీయ నిర్ణయం. అలాగే చెక్కు విషయమై ఆమె స్పందన “ఆడదాని పేరుమీదుగా చెక్కు రాయడమెందుకు? ఎదురుగా మీరున్నారుగా! ఇంద, మీరు పట్టుకొచ్చిన చెక్కు మీకే పారేస్తున్నాను.”[14] ఇది ఆర్థిక భద్రతకన్నా ఆత్మగౌరవం ముఖ్యమని, నమ్మిన స్త్రీ స్వరం. ఈ దశలో మంజరి స్పష్టంగా స్వేచ్ఛా ప్రతీక. అయితే ఈ స్వేచ్ఛ పూర్తిస్థాయిదేనా? ఇక్కడే రావూరి భరద్వాజ్ నిజాన్ని చెప్పడం మొదలుపెడతారు.

మంజరి సినీ పరిశ్రమలో అడుగుపెట్టింది స్వేచ్ఛతో కాదు. అవసరంతో, అవకాశాల లేమితో, వ్యవస్థ ఒత్తిడితో, ఆమె స్వయంగా చెప్పిన వాక్యం దీనికి సాక్ష్యం. "ఒక బుకింగ్ రావడం కోసం ఎన్ని బాధలు, ఎన్ని ఆశ్రయింపులు, ఎంతమంది ఎన్నెన్ని ఆశలు చూపడం తలుచుకుంటే ఎంత అసహ్యమేస్తుందో చెప్పలేను"[15] ఇక్కడ మంజరి మాటల్లో విజయం వెనుకనున్న అవమానాల చరిత్ర కనిపిస్తుంది. ఆమె సంపాదన ఉంది. కీర్తి ఉంది. కానీ స్వేచ్ఛ లేదు. ఇదే భావాన్ని ఆమె మరో చోట స్పష్టంగా చెబుతుంది. "తెలుసుకోలేదు. నా సంపాదన, నాకున్న డబ్బు, నా పలుకుబడి ఇవే మీకు కనిపిస్తాయి. వీటన్నింటి వెనుకనున్న వ్యక్తిపడే ఘోష మీకు తెలియదు."[16] ఇది స్వేచ్ఛ ఉన్న స్త్రీ మాట కాదు. ఇది బతకడానికి రాజీపడిన స్త్రీ యొక్క ఆవేదన.

మంజరి జీవితం బాహ్యంగా సుఖంగా కనిపిస్తుంది. కానీ రావూరి భరద్వాజ్ స్పష్టంగా చెబుతున్న నిజం భోగాలు స్వేచ్ఛ కాదు. మంజరి మాటల్లోనే ఇది అత్యంత లోతుగా వ్యక్తమవుతుంది. "జీవితంలో విషాదం డబ్బు లేకపోవడం కాదు. మనల్ని ప్రేమించేవాళ్లు లేకపోవడం."[17] ఇక్కడ ఆమె అనుభవం చెబుతున్నది ఏమిటంటే స్వేచ్ఛ అనేది ఆర్థిక స్థితిలో రావడం లేదు. మనిషిగా ప్రేమించబడే హక్కుతో వస్తుంది.

మంజరి తిరుగుబాటా కాదు. సంపూర్ణ అంగీకారమూ కాదు. మంజరి పాత్రను చూస్తే ఆమె తిరుగుబాటు చేసిన స్త్రీ కాదు. సంపూర్ణంగా రాజీపడిన స్త్రీ కూడా కాదు. ఆమె "జీవించడానికి చేసిన రాజీ" యొక్క ప్రతిరూపం. ఆమె మాటల్లోనే ఈ వేదన స్పష్టమవుతుంది. "నేను నాగ జెముడు మట్టలాంటి మొండి ప్రాణిని. బతుకు మీద నాకున్న పాటి ఆశ చాలా మందికి లేదు."[18] ఆశే ఆమెను బ్రతికించింది. కానీ అదే ఆశ ఆమెను వ్యవస్థలో బంధించింది. మంజరి తెలుసుకున్నది.

ఈ రంగం నిర్మలమైన ప్రతిభ స్థలం కాదు. ఇది శక్తి, శరీరం, ఆర్థిక సంబంధాలు మూడింటి వ్యాపారం. అందుకే ఆమె నిర్ణయం వెనక్కి రావడం కాదు. పూర్తిగా మునగటం. ఇది నైతిక పతనం కాదు. స్పష్టమైన వ్యవస్థ అవగాహన అదే వ్యవస్థను తన పనిముట్టుగా వాడుకున్నాననుకున్నది. కానీ తానే వ్యవస్థకు వ్యాపార వస్తువైంది.

మంజరి విజయానికి ప్రతిరూపమా? పరాజయానికి సంకేతమా? మంజరి జీవిత ప్రయాణం పైపైకి చూస్తే అపూర్వ విజయం. డబ్బు, కీర్తి, పలుకుబడి, అంతర్జాతీయ గుర్తింపు అన్నీ ఆమె వెనకే వచ్చాయి. "వంద తెలుగు సినిమాలు తెచ్చి పెట్టలేని కీర్తిని ఆ ఒక్క హిందీ పిక్చరు తెచ్చిపెట్టింది."[19] కానీ ఈ విజయం లోపల ఒక శూన్యత నెమ్మదిగా పెరిగింది. మంజరి సంపాదించింది అన్నీ బాహ్యమైనవి. ఆమె కోల్పోయింది. అంతర్గత శాంతి. ఇక్కడ రచయిత ఒక మౌలిక ప్రశ్న వేస్తారు. విజయం అంటే ఏమిటి? అది మనల్ని నిలబెడుతుందా లేక మానసిక శూన్యతను ఏర్పస్తుందా?

**మార్లిన్ మన్రో సంభాషణ : స్త్రీ అస్తిత్వ తత్వం :**

మంజరి - మార్లిన్ మన్రో సంభాషణ ఈ నవలలో అత్యంత తాత్వికమైన భాగం. "స్త్రీ తన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించినప్పుడు, పురుషుడు సహించలేడు."[20] ఈ మాట మంజరి జీవితానికే సారాంశం. ఆమె వ్యక్తిత్వం పూర్తిగా వికసించిన కొద్దీ పురుషుల ప్రపంచం ఆమెను శత్రువులా చూడటం ప్రారంభించింది. మార్లిన్ మన్రో మాటల ద్వారా రచయిత చెబుతున్న విషయం సహజం స్త్రీని సహిస్తుంది. ఆమె అవసరానికి తగ్గట్టు మారినంత వరకు మాత్రమే.

**డబ్బు, అందం, శరీరం :**

మాయా తెరలు చలపతి చెప్పిన మాట అత్యంత కీలకం "డబ్బు నీ కళ్లకు మాయ తెరలను కప్పింది."[21] ఈ తెరల వల్ల మంజరి నిజాన్ని చూడలేకపోయింది. తన చుట్టూ ఉన్నవాళ్లలో ఎవరు నిజంగా ప్రేమించారో, ఎవరు కేవలం ప్రయోజనంతో ఉన్నారో ఆమెకు తేలలేదు. డబ్బు పెరిగిన కొద్దీ మానవ సంబంధాలు వ్యాపార సంబంధాలయ్యాయి.

**ఆత్మహత్య : పారిపోవడమా? లేక అంతిమ నిరాకరణా?**

మంజరి మరణాన్ని సాదాసీదా "ఆత్మహత్య"గా చూడలేం. ఇది ఒక వ్యక్తిగత పరాజయం మాత్రమే కాదు. అది ఒక వ్యవస్థాపక నేరానికి ఫలితం. "ఎప్పుడో నేను

పొందిన అవమానం, తిన్న దెబ్బలు - జ్ఞాపకానికొస్తే నిద్రరాదు."[22] ఈ వాక్యం ఆమె మరణానికి ముందే ఇచ్చిన వాంగ్మూలం. మంజరి చనిపోయింది. ఎందుకంటే ఒక స్త్రీగా తాను పొందవలసిన ప్రేమ శూన్యం అయింది. నమ్మిన వారిపై విశ్వాసం కరిగిపోయింది. తన ఎదుగుదలకు పునాది వేసిన రామచంద్రం మొదలు అత్యున్నత స్థాయికి చేర్చేందుకు తపనపడిన చలపతి వరకూ తన శరీరం సరుకుగానే చూడబడింది. వ్యక్తిత్వం ఒంటరిగా మిగిలింది. ఇది పారిపోవడం కాదు. ఇది ఈ వ్యవస్థను ఇక భరించలేనన్న అంతిమ నిరాకరణ.

**మరణ దృశ్యం :**

ప్రతీకాత్మక అర్థం "కీర్తి ప్రతిష్టలు, సిరిసంపదలు ఆమె నీ కొసకు తరముకొచ్చాయా అనిపించింది."[23] అగాధం నుండి ఆకాశ హర్మ్యంలా, ఆకాశ హర్మ్యం నుండి అగాధాని కన్నట్లుంది. "ఆకుపచ్చని కాశ్మీరపు తివారీ మీద మంజరి శరీరం వెల్లకిలా పడి ఉంది. పడక గదిలో ఉన్న కిటికీ పూర్తిగా తెరిచి ఉంది. టెలిఫోన్ కింద పడి ముక్కలై పోయింది."[24] మంజరి శరీరం పక్కన డబ్బు, మందు బిళ్లలు, తెరిచిన కిటికీ ఇవన్నీ ప్రతీకలు. తివాచీ విలాస జీవితం, తెరిచిన కిటికీ - బయటపడాలన్న తపన, మందుబిళ్లలు - వ్యవస్థ ఇచ్చిన తాత్కాలిక ఉపశమనాలు, ఒంటరిగా పడి ఉన్న శరీరం - సంపూర్ణ ఒంటరితనం, పగిలిన టెలిఫోన్ తెగిన సంబంధాలను సూచిస్తుంది.

మంజరి ఒక వ్యక్తి కాదు - ఒక యుగపు స్త్రీ ప్రతినిధి. ఆమె విజయం వ్యక్తిగతం, పరాజయం సామాజికం. సినీ పరిశ్రమలో స్త్రీ శరీరం ఇప్పటికీ అధికార సాధనమే. డబ్బు, కీర్తి స్త్రీని రక్షించలేవు. స్త్రీ స్వేచ్ఛ రాజీ లేకుండా సాధ్యంకాని వ్యవస్థలో బంధించబడింది.

**ముగింపు :**

మంజరి కథ మనల్ని ప్రశ్నిస్తుంది. మనం ప్రశంసించే విజయాల వెనుక ఎన్ని మంజరీల ఆర్తనాదాలు దాగున్నాయో ఆలోచించమంటుంది. మంజరి గెలిచిందా? ఓడిపోయిందా? ఈ ప్రశ్నకు సమాధానం నవల ఇవ్వదు. సమాజానికే వదిలేస్తుంది. బాహ్యంగా కనిపించే విజయం, సంపద వెనుక దాగి ఉన్న శూన్యత, నిస్సహాయత, ఒంటరితనం ఇవే ఈ నవల యొక్క అంతర్గత కేంద్ర బిందువులు. మంజరి ఓడిపోయిన పాత్ర కాదు. గెలిచిన వ్యవస్థలో ఓడిపోయిన మనిషి. అదే 'పాకుడు రాళ్లు' నవల యొక్క సాహిత్య మహత్తు.

**ఆధార గ్రంథాలు :**

1. పాకుడురాళ్లు - డా.రావూరి భరద్వాజ్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2013.

**పాదసూచికలు :**

ఈ పరిశోధన వ్యాసంలో ఉపయోగించిన అన్ని ఉదాహరణలు, కొటేషన్లు డా.రావూరి భరద్వాజ్ రచించిన 'పాకుడురాళ్లు' నవల నుంచే సేకరించబడినవి.

1. పాకుడురాళ్లు - డా.రావూరి భరద్వాజ్ పుటలు-319, 355, 350, 225, 358, 358, 68, 68, 216, 538, 253, 383, 199, 200, 609, 535, 611, 610, 382, 577, 399, 609, 613, 613 మొదలైనవి.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగులో వృత్తి ఆధారిత నవలలు (2010 - 2023) - సామాజిక, ఆర్థిక కోణం

- డా॥. సిద్ధుల జ్యోతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, వీరనారిచాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం.

తెలుగు సాహిత్యంలో 1990 తర్వాత సాహిత్యంలో ప్రక్రియాత్మకమైన విషయంలోను కొత్త ధోరణులు వెలుగు చూశాయి. వ్యక్తి, వృత్తి, సామాజిక జీవితం, ఆర్థిక వెసులుబాటు ఈ విషయాలపై ఒక ప్రత్యేకమైన పరిశీల నాత్మకమైన అధ్యయనం వెలుగులోకి వచ్చింది. అది ఆధునిక వచన ప్రక్రియల్లో ఒకటైన నవలల్లో మరింత దృష్టిని సారించిన నేపథ్యంలో మనకు తెలియని మనవారి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటానికి అవకాశాలు ఏర్పాడ్డాయి. ఈ కారణంగా కేవలం ప్రక్రియలకే పరిమితం కాకుండా పరిశోధనలు కూడా చోటు చేసుకోవటం వల్ల రచయితల దృష్టికోణంతోపాటు, పరిశోధకుల దృష్టి కూడా కొంత ప్రగతికి దోహదపడింది.

సామాజిక జీవనంలో ఆర్థిక నేపథ్యంలో చోటు చేసుకున్న అంతస్తు అనేదానికి సామాజిక శాస్త్రవేత్తలు తెలియజేసిన ప్రాథమిక, సాధించిన అంతస్తులకు ప్రధానమైన కారణాలు అన్ని కోణాలలో పరిశీలించటం ద్వారా ఒకకొత్త ఆలోచనకు మార్గాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఇరవై ఒకటవ శతాబ్దంలో వ్యక్తి యొక్క సామాజిక జీవనం, దానితో ముడిపడి ఉన్న ఆర్థిక జీవనం అన్నీ కూడా అంతస్తు ఎదుగుదలకు దోహదపడ్డాయి. అయితే దీని వెనుక చోటుచేసుకున్న సమస్యలను కూడా పరిశీలించటం రచయితలకు ఒక మార్గ నిర్దేశనం అయ్యింది. ఒకవిధంగా చెప్పాలంటే 1936 నాటి అభ్యుదయము అనే విధానానికి 21వ శతాబ్దంలో రచయితలనుకోండి, పరిశోధకులనుకోండి వీరిద్దరి ద్వారా పరిపూర్ణత సంత రించుకుంది. ఈ విషయాలను పరిశీలించినప్పుడు సామాజిక జీవనంలో ప్రతి వ్యక్తి ఎంత గౌరవించబడతాడో, అతని వృత్తి కూడా అంతే గౌరవం పొందాలి అనే నేపథ్యం కలగటం వల్ల అసమానతలు తొలగటానికి కొంతమేరకు కొత్త ఆలోచనలను అటు రచయితలు తమ రచనల ద్వారా సామాజికం చేశారు. దీనివల్ల కేవలం ఆ వృత్తులలో జీవనం చేసేవారి జీవన విధానాలకు సంబంధించిన అంశాలు, దాని ద్వారా వారు పొందుతున్న అనార్థిక లోపాలు అన్నింటినీ కూడ రచయితలు ఆయా వృత్తులకు సంబంధించిన విషయాలను ప్రక్రియాత్మకంగా వర్ణించటం ద్వారా కొత్త దారులు ఏర్పడ్డాయి.

రచయితలు కూడా ఆయా వృత్తులనుంచి వచ్చిన వారు కావటం వల్ల వారు ప్రత్యక్షంగా జీవితంలో పొందిన అనుభవాలను, సంఘటనలను పాత్రల ప్రతిఫలనంతో ప్రక్రియాత్మకం చేయటం ద్వారా ఈ వృత్తులకు సంబంధించి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన సాధికారత ఏర్పడింది. దీని ద్వారా ఆయా వృత్తులకు సంబంధించిన

అనేక అంశాలు సమాజంలో ఇతర వర్గాలకు తెలియనివి కూడా వెలుగులోకి రావటం ద్వారా ఒక అవగాహన ఏర్పడింది. ప్రధానంగా రచయితలు వృత్తులకు సంబంధించిన వారు పొందుతున్న అనేక చేదు అనుభవాలను పాత్రోచితం, సంఘటనాత్మకం చేయటం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు కూడా తెలియ జేయబడ్డాయి.

తెలుగు సాహిత్యంలో ప్రధానంగా 21వ శతాబ్దంలో తొలి రెండు దశాబ్దాల కాలం అనేక విషయాలలో పరిశోధనలు వేగం అందుకున్న విధానాలు మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా వృత్తి నేపథ్యంలో అంతవరకు ప్రధాన వృత్తులుగా ఉన్న వ్యవసాయం, వ్యవసాయేతర వృత్తులకు సంబంధించి మాత్రమే అవగాహనతో రచయితలు పరిశీలించి కేవలం దానికి కొంతమేరకు మాత్రమే న్యాయం చేశారు. అయితే 21వ శతాబ్దంలో ప్రతి వృత్తిలో ఉన్న ఆర్థిక కోణాన్ని కుటుంబ నేపథ్యంలో ఆ వృత్తి చేపట్టినవారి ఆలోచనా దృక్పథంలో చోటుచేసుకున్న విషయాలను పరిశీలించటం జరిగింది. ఈ కారణంగా మానవ సహజమైన బలహీనతలు, బలాలు, స్వార్థ పరత్వం, వృత్తిలోని అసమానతలు ఇవన్నీ కూడ ఆయా వృత్తులలో జీవన విధానం సాగిస్తున్న వ్యక్తులకు ఎంత వరకు ఉపయుక్తమయ్యాయి లేదా వారి జీవితాలను అతలాకుతలం చేశాయి అనే విషయంలో ఒక అధ్యయనం అనేక కోణాల్లో జరిగినప్పటికీ పైన పేర్కొన్న విషయాలన్నింటికీ ప్రధాన బలహీనత ఆర్థిక కోణంగానే తీసుకోవటం జరిగింది. కొంతమంది రచయితలు వారి జీవితంలో వారి వృత్తులపరంగా ఎదుర్కొన్న అనేక సమస్యలను ప్రక్రియాత్మకంగా (నవలల రూపంలో) తీసుకురావటం ద్వారా. ఆ కులంలోగాని, ఆ వృత్తులలో గాని ఉన్న వారి మధ్య సంబంధ బాంధవ్యాలు కూడా చెల్లాచెదరై మానవీయ కోణం రూపుమాసిన వైనాలను రచయితలు నిర్భయంగా తెలియజేశారు.

ఉదాహరణకు నల్గొండ ప్రాంతంలో నేరెళ్ళ శ్రీనివాసు గౌడ్ రచించిన 'బతుకు తాడు' నవల అతని కులపు వారిచే అతనికి ఇబ్బందులు కలిగేలా చేసింది. దీని ద్వారా మేడిపండులాగా ఉన్న ఆ కులంలోని వ్యక్తుల యొక్క దృక్పథంలో చోటుచేసుకున్న స్వార్థం ఏవిధంగా అమాయకుల పాలిటి శాపంగా మారిందో ఆయన తెలియజేశారు. గొప్ప విషయమేమిటంటే, అంత అవమానాలు, దాడులు జరిగిన తరువాత కూడా తన కులంలో జరుగుతున్న అమానుషాలను తెలియజేసే ప్రయత్నాన్ని విస్తృతం చేస్తూ, తర్వాత కాలంలో 'దుల్దుమ్మ' నవలను వారు రచించారు. దీనిని బట్టి ప్రతి వృత్తి కులంలో చోటుచేసుకున్న వైరాలకు సంబంధించిన కారణాలన్నీ కూడా కేవలం కుటుంబపరంగా కాకుండా, ఆయా వృతి సంఘాల ద్వారా పరిష్కరంచబడకపోవటం ఒక లోటుగా తెలియజేశారు. ఈ విషయాలు గమనిస్తే ప్రధానంగా మానవ సామాజిక జీవనంలో స్వార్థపరత్వం, అవినీతి, కుట్రలు ఇవన్నీ కూడా ఒక కుటుంబంగాని, ఒక వ్యక్తిగాగాని ఆర్థికంగా ఎదగటానికి ఏమాత్రం సహకరించక పోవటం కనిపిస్తుంది. అలాగే ఏ వృత్తిలోనైనా వ్యక్తుల బలహీనతలు, దాని ద్వారా జరిగే పరిణామాలకు కారణాలవుతాయి. అంతేకాకుండా సంఘటితమైన విధానాలకు చెల్లుచీటి ఇచ్చిన కారణంగా ప్రధానంగా వృత్తి కూలాలలో కుల సంఘాలు కేవలం నామ మాత్రంగానే మిగిలిపోతున్నాయి. అలాగే వృత్తి కులాలలో ఆర్థిక అసమానతలు విస్తృతంగా చోటుచేసుకోవటం కూడా కనిపిస్తుంది. అదేవిధంగా విద్య, దాని ద్వారా అభివృద్ధి పొందాలనే లక్ష్యాలు కూడ కొంత గ్రామీణ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. అలాగే ప్రపంచీకరణ నేపథ్యం కూడా వృత్తుల నుండి ఆ వృత్తులవారిని దూరం చేసింది. మరో కోణంలో ప్రభుత్వపరంగా ఈ వృత్తులపై ఆధారపడిన వ్యక్తులకు సరైన సహకారం సమయానికి అందక పోవటం ద్వారా కూడా ఈ వృత్తులన్నీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి.

అలాగే సామాజికంగా ఆర్థిక బలహీనత ఆయా వృత్తుల వారిని వృత్తులకు దూరం చేస్తుంటే కొందరు మాత్రం విధిలేక ఆ వృత్తులను పట్టుకు వేలాడుతున్నారు. అంతేగాక, నూతన సాంకేతిక వ్యవస్థను ఎక్కువగా స్వీకరించకపోవటం వల్ల కూడా వృత్తులకు అవి సజావుగా జరగటానికి క్లిష్టత ఏర్పడుతోంది. దీనికి రెండు కారణాలు

పరిశీలిస్తే - చదువుకోనివారికి అంటే పాత తరం వారికి విద్యా లోపంవల్ల నూతన సాంకేతిక విధానాల అవ గాహనకు వారు దూరంగా ఉండటం జరుగుతోంది. మరొక కోణంలో చదువుకున్నవారు ఆయా గ్రామీణ వ్యవస్థకు దూరమవుతూ ఇతర ప్రదేశాలకు వెళ్ళటం (కారణాలు ఏవైనా) ద్వారా గ్రామీణ వ్యవసాయ రంగం ఇబ్బందులు పడినట్లే, ఆధారిత వృత్తులు, అనుషంగిక వృత్తులు అన్నీ కూడా ఇబ్బందులకు గురవుతున్నాయి. అలాగే చేనేత కార్మికుల విషయంలో వారు విద్యుచ్ఛక్తి విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే వారు ఆర్థికంగా చితికి పోవటానికి కూడా దళారుల దోపిడీ కూడా కొంత కారణమవుతున్నది. ఏదేమైనా నేడు వృత్తులను నమ్ముకున్నవారి జీవితాలలో చీకటి పరుచు కున్నది అన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. ఈనాడు కులవృత్తులు (కారణాలేవైనా) కూటికి దూరం చేస్తూ పర్యాయ ఉపాధి అవకాశాలు లేకపోవటం వల్ల ఆకలి మంటలు, అప్పుల ముళ్ళు ఏర్పడుతున్నాయి. వీటి ఫలితంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. తరాల నుంచి వస్తున్న వృత్తి వారిని దూరంగా విసిరేస్తోంది. స్వాతంత్ర్యం తరువాత వృత్తులలో అనేక మార్పులు వచ్చాయి. ప్రతి వృత్తికి దాని పరిరక్షణ కోసం సంస్థలు ఏర్పడి వృత్తి పనివారికి రాయితీలు ఇస్తూ, వారిని శిక్షణలో ముందుకు తీసుకు వెళ్ళే ప్రయత్నం చేశాయి. ముఖ్యంగా వృత్తి పనివారు తమ జీవన విధానంలో ఉన్నత మార్పుకు దగ్గర కాలేక పోవటం గమనిస్తే దానిపై అనేక విషయాలు ప్రభావం చూపాయనే విషయం కూడ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా వృత్తి మీద ఆసక్తితో పనిచేసే నేర్పు ఈ మధ్యకాలంలో తగ్గుతూ వచ్చింది. అదీగాక, చేసే వృత్తిలో లభిస్తున్న ఫలాలు పొట్ట, గుడ్డకు చాలక పోవటంతో చాలామంది నిరాశ, నిస్పృహలకు లోనవు తున్నారు. అలాగే మద్యానికి, ఇతర దురలవాట్లకు కూడ ఆకర్షితులవుతున్నారు, బానిసలౌతున్నారు. తద్వారా వారిలో నిబిడీకృతమైన వృత్తి కళాభినివేశము మంట గలిసిపోతోంది. వృత్తిమాట దేవుడెరుగు, భుక్తి పోసు కోవటానికి అనేక మార్గాలు అనుసరిస్తున్నారు. సహకార బ్యాంకులు, ఋణాలు, ప్రభుత్వ పథకాలు ఇవన్నీ కూడా అనుకున్నంత మంచి ఫలితాలను ఇవ్వలేకపోయాయి. దీనివలన ప్రధానంగా వృత్తులవారు ఆర్థిక కోణంలో బలహీనులయ్యారు. అదీగాక తరానికి తరానికి మధ్య ఉన్న వ్యత్యాసాలు కూడా కొంత వృత్తులు కనుమరుగు అవ్వటానికి కారణాలు అవుతున్నాయి. అయితే, ఈ నేపథ్యాన్ని తెలుగు సాహిత్యంలో దాదాపుగా రెండు దశాబ్దాల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలనాత్మక అధ్యయనం చేసినప్పుడు ఇప్పుడు ఉన్న తరం వారు విద్య, ఉపాధి రంగాలలో లక్ష్యాలు ఏర్పరచుకోవటం వల్లను అంతేగాక, నగరాలపట్ల, దేశవిదేశాలపట్ల ఆకర్షితులవ్వటం వల్లను గ్రామీణ వ్యవసాయ వ్యవస్థ నాశనమైనట్లే వృత్తులు కూడ నాశనమవుతున్నాయి.

భారతీయ సమాజంలో ప్రధానంగా తెలుగు ప్రాంతంలో వృత్తుల ప్రాధ్యానత, వర్తమాన స్థితిగతులు, వాటి వికాసం, వికాస హీనతకు గల కారణాలను పరిశీ లిస్తూ, ఇంతవరకు ప్రధానంగా ఆయా వృత్తి కులాలలో జన్మించినవారు విద్యాధికులై, వారు పుట్టిన వృత్తిని గౌరవిస్తూ రాసిన నవలలు కూడా బాగా ప్రచారంలోకి వచ్చాయి.

విశాల సాహిత్య అకాడమి అవార్డు, నవ తెలంగాణ అవార్డు పొందిన డా॥గడ్డం మోహన్‌రావుగారి 'కొంగవాలు కత్తి' తెలంగాణ వృత్తి కళాకారుల జీవితాలకు, వారి అనార్థిక స్థితిగతులకు కారణాలను బహిర్గతం చేసి దానికి కారణాలను కూడ వివరించటం జరిగింది. ఈ నవలలో గడ్డం మోహన్‌రావు ప్రతిభకు, కులానికి సంబంధం లేదనే అంశాన్ని ప్రతిపాదించాడు. అలాగే ప్రతిభ కులాల గుత్త సొత్తు కాదంటాడు. దళితులు, వారి ఆశ్రిత కులాలవారు వారిలోని ప్రతిభను ఏవిధంగా కనపరచగలరు అన్న సత్యానికి ఈ నవల ప్రాణం పోసింది. రచయిత ఈ నవలలో కులవాదాన్ని మార్పుచెందిన యాంత్రిక కుల వాదంగా తెలియజేశాడు. యాంత్రిక కులవాదమంటే ఒక కులం వారంతా ఒక రకమైన కులంవారు అని వాదిం చటం. అయితే, రచయిత ఈ విషయాన్ని ఖండిరచి యాంత్రిక కులవాదాన్ని నిరశించాడు.

మరొక నవల 'బతుకు తాడు'. దీని రచయిత నేరెళ్ళ శ్రీనివాస గౌడ్. ఈ నవలలో గౌడ కులస్తులు వర్తమానంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తెలియజేశాడు. బతుకుతాడు అనేది ఈ కులపువారికి ఒక ఉరితాడుగా మారుతోంది అన్న విషయాన్ని విశ్లేషించాడు. అలాగే కల్లు కార్మికులకు ఎలాంటి రక్షణ లేదని, వారు దళారుల చేతుల్లో మోసపోతున్నారని, ప్రభుత్వం కూడా అలసత్వం చూపిస్తోందని ఈ కారణంగా వారు ఆర్థికంగా పటిష్టతను పొందలేకపోతున్నారని వివరించాడు.

ఈ రచయితే రాసిన మరొక నవల 'దుల్దుమ్మ'లో కల్లు కార్మికుల జీవన విధానంలో చోటుచేసుకున్న అసాంఘిక నేరాలను తెలియచేస్తూ ప్రభుత్వం, రాజకీయ నాయకులు ఏవిధంగా వృత్తి కులాలవారిని మోసం చేస్తున్నారో కూడ వివరించాడు. ప్రధానం ఈ నవలలో మూడుతరాలు చోటుచేసుకుంటాయి. జీవనోపాధికి తెగించి చెట్లు ఎక్కుతున్న కల్లు గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడిపోయినప్పుడు వారికి ఎలాంటి భీమా సౌకర్యం లేకపోవడాన్ని కూడా ఇతడు తెలియజేశాడు. అలాగే చెట్లని వేలంపాట వేసే సందర్భంలో ఈ కులంలో ఆర్థికంగా స్థిరపడినవారు తమ క్రింది వారిని సొంత కులంవారైనప్పటికి అనేకరకాలుగా మోసగించడాన్ని కూడా తెలియజేసాడు. ఒకప్పటి నిజాం సర్కారులో వారి సమస్యను పరిష్కరించుకోవటానికి ప్రభుత్వ అధికారులు, పోలీసుల నుండి స్వయం రక్షణ కోసం ఉపయోగించిన 'దుల్దుమ్మ' అనే కాయను తిరిగి వర్తమానంలో వారిని వారు రక్షించుకోవటానికి ఉపయోగించిన వైనాన్ని కూడా తెలియజేశాడు. ఏదేమైనా ఈ రచయిత కల్లు కార్మికుల అగచాట్లను అనేక కోణాల్లో ఈ నవలలో తెలియ జేయటమే కాక, వారి ఆర్థిక పెంపుదలకు కావలసిన పరిష్కారాలను కూడ సూచించటం ఒక గొప్ప విషయంగా పేర్కొనవచ్చు.

వృత్తి పనివారల జీవన నేపథ్యంలో ప్రధానంగా చేనేత కార్మికుల అగచాట్లను మంథా భానుమతిగారు 'అగ్గి పెట్టెలో ఆరు గజాలు' నవలలో వ్యక్తం చేశారు. నేత కార్మికులు వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలకు బాధ్యులెవరు అన్నదానిని కూడ విశ్లేషిస్తూ, చారిత్రక కాలం నుంచి చేనేత కార్మికుల వ్యథలను తెలియజేస్తూ, స్వాతంత్ర్యానంతరం భారతీయ సమాజంలో చేనేత కార్మి కులు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏవిధమైన కష్టాలు పడుతున్నారో తెలియజేస్తూ వివరణలు ఇచ్చారు. ముఖ్యంగా ఇందులో ఈ రచయిత్రి చేనేతకారులు వలసలు వెళ్ళడానికి గల అనార్థిక కారణాలను కూడ తెలియజేశారు.

నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన నవల 'కొండ పొలం' ఉత్పత్తి కులాల మానవీయతకు నిలువుటద్దం అని కాత్యాయని విద్మహే కితాబిచ్చారు. మొదటినుండి గడ్డి వేళ్ళ స్థాయి నుంచి మనుషుల జీవన తాత్వికతను ఒడిసిపట్టిన ఈ రచయిత ప్రస్తుత ఆర్థిక సమాజంలో రైతుల, గొర్రెల కాపరుల జీవన విధానంలో అనేక విషయా లను విశదం చేశారు. ప్రధానంగా ఆర్థిక కోణానికి ఊతమిచ్చినట్లుగా ఈ నవలను చెప్పుకోవచ్చు. వ్యవ సాయానికి అనుషంగిక వృత్తిగా కాకుండా ఒక స్వతంత్ర వృత్తిగా గొర్రెల పోషణ, ఆ గొర్రెలతో వారికున్న అను బంధం, వాటి సంబంధాలతోనే నిర్ణయించబడే జీవితాలు, విలువలు అన్నింటినీ కూడా రచయిత ఈ నవలలో ఆవిష్కరించారు. గొప్ప విషయం ఏమిటంటే, రచయిత గొర్రెల కాపరులు వారి కడుపుకంటే ఆ గొర్రెల యొక్క ఆకలిని తీర్చటానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వటానిన మానవీయ కోణంగా చెప్పారు. ఈ నవలలో వేట, సంగ్రహణ విధానం వంటి ఆదిమ సంస్కృతి, ఆహార సేకరణ విధానాలు, ఉత్పత్తి విధానంలో ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయో తెలియజేశారు. అదేరీతిలో వర్తమానంలో ఆర్థిక పరిపుష్టికోసం గొర్రెల కాపరులు చేసే ప్రయత్నాలు, దానికి ప్రతిచోట విఘాతాలు కల్గించే బడా నాయకులు వీరందరూ కూడ సమాజానికి ఎలా ద్రోహం చేస్తున్నారు అన్న విషయాలని కూడ రచయిత తెలియజేసారు. గొర్రెల పెంపకంలో ముడిపడిన గొల్లల ఆహార, ఆహార్య, ఆలోచనా, వస్తు సంస్కృతి ఈ నవలకు మూలధాతువుగా తెలియజేశారు కాత్యాయని విద్మహే.

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన 'జిగిరి' నవల పాత కొత్తల మధ్య ఘర్షణగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు అభివర్ణించారు. ఆదిమ కాలం నుండి మనిషి ప్రకృతితో స్నేహం చేయడమే కాకుండా ఆ ప్రకృతితో పోరాటం చేస్తూ కూడ తన మనుగడ సాగిస్తున్నాడు. ప్రకృతిని తన అవసరాలకు ఉపయోగించుకుంటూ, ప్రకృతికి తాను ఉపయోగపడుతున్నాడు. ఒకరకంగా భయం నీడలో, ప్రకృతి నీడలో బ్రతుకుతున్నాడు. అయినప్పటికీ, ప్రకృతిని ప్రేమిస్తున్నాడు. నిజం చెప్పాలంటే మనిషి ప్రకృతిలో అంతర్భాగమే. ఈ సత్యాలను ప్రకటితం చేస్తూ 'జిగిరి' నవలలో మానవత్వ పరిమళాలను వెదజల్లాడు. ప్రధానంగా మూగజీవమైన షాదుల్ (ఎలుగుబంటి) ఇమామ్, బీబమ్మ, చాంద్ జీవితాలలో మమేకమై వారిని విడిచిపెట్టకుండా రెండు దశాబ్దాల కాలం ఉంటుంది. ఇమామ్ జీవితంలో ప్రభుత్వం ద్వారా వచ్చిన ఒక ప్రకటన అలజడిని సృష్టిస్తుంది. కేవలం అలజడితో ఆగక, భార్యా కుమారుల మనస్సులో అత్యాశకు రూపకల్పన చేస్తుంది. అప్పటిదాకా ఆ కుటుంబాన్ని ఒక ఆర్థిక ఆధారంగా సాకిన ఆ షాదుల్ అనే ఎలుగుబంటిని చంపెయ్యటానికి కూడ తల్లీకొడుకులు వెనుకాడరు. ఇమామ్ మాత్రం అది తప్పని తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితులలో ఉండిపోతాడు. మరోవిధంగా చెప్పాలంటే ఇమామ్‌నిగాని, ఆతని మాటనిగాని లెక్కచేయరు. వారి ఆశ అంతా ప్రభుత్వం పేదవారికి ఇస్తున్న రెండెకరాల భూమి మీదనే ఉంటుంది. ఏదోవిధంగా షాదుల్‌ని వదిలించుకొని, ఆ రెండెకరాలతో సుస్థిరమైన జీవితం గడపాలని భావిస్తారు. వారి మనస్సులో జీవహింస మహాపాపం అన్న మాట కనపడకుండా పోతుంది. అత్యాశతో ఆ రెండెకరాల భూమిని దక్కించుకోవాలని ఇమామ్‌ను కూడా అనేక రకాలుగా హింసలకు గురిచేస్తారు. ఇది కేవలం ఒక బలహీన కుటుంబం చేయాల్సిన పని అయినప్పటికీ ఆర్థికంగా షాదుల్ ద్వారా తిండికి, బట్టకు లోటు లేక పోయినా ప్రభుత్వం ఇస్తున్న రెండెకరాలా భూమికి వారు యజమానులు కావాలనే అత్యాశతో తల్లీకొడుకులు ప్రవర్తించటాన్ని రచయిత అమానవీయ కోణంలో తెలియజేశాడు. ఇక వృత్తిపరంగా చూస్తే ఇమామ్ దంపతులు ఏ వృత్తి అయినా చేసి బ్రతకగలరు. కాని చిన్నప్పట్నుంచి తన ఆలనాపాలనా చూసిన కుటుంబానికి షాదల్ అనే ఎలుగుబంటి ఆర్థికంగా బలోపేతం కావటానికి ఒక కారణం అవ్వటం కనిపిస్తుంది. ఏదేమైనా ఈ నవల అనేక కోణాలలో వృత్తి జీవన చిత్రణను ఆర్థిక నేపథ్యంలో పరిపుష్టం చేసిన కారణంగా ఇది తొమ్మిది భాషలలోకి అనువాదం కావటం గర్వించదగిన విషయం.

ఈ విధంగా పరిశీలించినప్పుడు పైన పేర్కొన్న నవలలే కాక ఈ వృత్తి జీవన చిత్రణను ఆర్థిక, సామాజిక కోణంలో అనేక ఇతివృత్తాలతో ఆవిష్కరించిన నవలలను, వాటి రచయితల వివరాలను ఇక్కడ పొందుపరచటం జరుగుతోంది.

| | |
|---|---|
| జాజుల గౌరి | - వొయినం |
| ముదిగంటి సుజాతా రెడ్డి | - సంకెళ్ళు తెగాయి |
| బండి నారాయణ స్వామి | - శప్త భూమి |
| ఉనదుర్తి సుధాకర్ | - యారాడకొండ |
| భూతం ముత్యాలు | - ఇగురం |
| వేముల ఎల్లయ్య | - కక్క |
| చింతకింది శ్రీనివాసరావు | - మున్నీటి గీతలు |
| కదిరి కృష్ణ | - పొద |
| డా॥గడ్డం మోహన్‌రావు | - గోరు కొయ్యలు (అముద్రితం) |
| కె.వి.ఎల్. | - కల్లు మండువా |
| శీరంశెట్టి కాంతారావు | - ఆకుపచ్చ విధ్వంసం, పరంపర |
| దేవరాజు మహరాజు | - పాలెర్రబడ్డాయి |

ప్రధానంగా పైన పేర్కొన్న నవలల్లో సామాజిక నేపథ్యంలో ఆర్థిక కోణాన్ని, అసమానతలు, అవిద్య, బల హీనతలు మొదలైనఅంశాలను స్పృశించారు. ప్రధానంగా అనార్థికతకు వీరు ఎంతవరకు బాధ్యులు అన్నదానిని కూడ స్త్రీలు, పురుషులు అనే కోణంలో కూడ తెలియజేయటం జరిగింది. అలాగే ఎంత శ్రమించినా ఆదాయం వారి జీవనభృతికి ఏమాత్రం చాలకపోవటానికి ప్రధాన

కారణమైన దళారీ వ్యవస్థను ఒక ప్రత్యేక కోణం కనిపిస్తుంది. ఇటువంటి వారి ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృత్తి పనివారి జీవన స్థితిని రచయితలు ఏ దృష్టికోణంలో తమ తమ నవలల్లో తెలియజేశారో వాటికి పరిష్కారాలు ఏమైనా అందించారోకూడా వీటిలో చూడవచ్చు. ప్రధానంగా వృత్తి కులాల నేపథ్యంలో పూర్వీకుల నుండి వస్తున్న సంస్కృతి, ఆచార వ్యవహారాలు, వీటి ద్వారా తరానికి తరానికి మధ్య ఉన్న అంతరాలు మానవీయ కోణం కనిపించకుండా ఉండటం మొదలైన విషయాలను కూడా రచయితలు ప్రకటితం చేశారు. ముఖ్యంగా సహకార సంఘాలు, దానిలోని వ్యక్తులు వృత్తి కులాల వారికి తగినంత సహకారాన్ని అందించకపోవటం, దాని ద్వారా కలుగుతున్న పరిణామాలు, అలాగే మార్కెట్ వ్యవహారాలలో పెరుగుతున్న ధరలు వారి వృత్తిలో వాటి ప్రతిఫలనాలు అన్నింటినీ కూడా రచయితలు ఆర్థిక కోణంలో తెలియజేశారు. అలాగే వృత్తి కులాలలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు, కూడా ఈ నవలల్లో కనిపించాయి.

**ఆధార గ్రంథాలు :**


1. అశోక్ - తెలుగు నవలల్లో వృత్తి జీవన చిత్రణ (పరిశోధనా గ్రంథం)
2. గడ్డం మోహన్ రావు - కొంగవాలు కత్తి
3. నేరెళ్ల శ్రీనివాస్ - బతుకు తాడు
4. నన్నపురెడ్డి వెంకటరెడ్డి -కొండపొలం
5. లంకా వెంకటేశ్వర్లు - వృత్తి జీవన చిత్రణ (డాక్టరేట్ పరిశోధనా గ్రంథం)
6. పెద్దింటి అశోక్ కుమార్ - జిగిరి
7. మంథ భానుమతి - అగ్గిపెట్టెలో అరుగజాల చీర


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# వేయి పడగల వివేచన

- డా॥. వరలక్ష్మి పూజారి
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నగరి.

"వివేచన" అంటే మంచి - చెడు; నిజం - అబద్ధం; తప్పు - ఒప్పు మధ్య వ్యత్యాసాన్ని స్పష్టంగా గుర్తించగల సామర్థ్యం/ తెలివి అని అర్థం. అయితే వీటన్నింటినీ మించి వాస్తవం - అవాస్తవం; నిత్యం - అనిత్యం వీటిని స్వయం అధ్యయనం ద్వారా తేటగా నిగ్గుతేల్చగల్గడం. ఇది చాలా లోతైన పరిశీలన. వివేకంతో కూడిన నిర్ణయం తీసుకునే మానసిక శక్తి సంబంధ విచక్షణ. దీన్నే జ్ఞానం అని చెప్పవచ్చు. క్లిష్టపరిస్థితుల్లోనూ సరైనమార్గాన్ని ఎంచుకోవడం. అస్పష్టంగా / గందరగోళంగా ఉన్న పరిస్థితుల్లో వివేచనతో కూడిన నిర్దిష్టమైన అంచనా వేయడం. ఇది అంతర దృష్టి ద్వారానే సాధ్యం.

మానవుడ్ని దేవుడిగా మార్చగల్గిన శక్తి నిత్యానిత్య వివేచనకు ఉంది.

శ్లో॥ అదౌ నిత్యానిత్య వస్తు వివేకః పరిగణ్యతే ।
ఇహాముత్ర ఫలభోగ విరాగ స్తదనంతరం ।
శమాది షట్క సంపత్తి ర్ముముక్షుత్వమితి స్ఫుటం ॥
- వివేకచూడామణి, ఆదిశంకరాచార్యులు, - 19

ఈ నాలుగు సాధనలు ఏవి ?

1. నిత్యానిత్య వివేకం
2. ఇహాముత్ర ఫలభోగ విరాగం (ఇహపర భోగాసక్తి యందు విరక్తి)
3. శమాది షట్క సంపత్తి.
   శమం, దమం, ఉపరతి, తితిక్ష , శ్రద్ధ, శాంతి సమాధానం
4. ముముక్షత్వం (మోక్షం పొందాలనే ప్రగాఢమైన ఆకాంక్ష) వీటినే సాధన సంపద అంటారు.

**1. నిత్యా నిత్య వివేకం :**

సనాతనమైన, శాశ్వతమైన పరిపూర్ణ పరబ్రహ్మమే సత్యమని, భౌతికంగా కనిపించే సమస్త జగత్తు మిథ్య అనే దృఢ విశ్వాసం కలిగివుండటమే నిత్యానిత్య వివేకం.

**2. ఇహాముత్ర ఫలభోగ విరాగం :**

ఇంద్రియాల ద్వారా అనుభవించదగిన సమస్త భోగ్య వస్తువులు (ఇహ, పరలోక భోగాలు) అశాశ్వతాలని గ్రహించి వాటి మీద ఇచ్ఛ లేకపోవడమే విరాగం.

**3. శమాది షట్క సంపత్తి :**

శమం - అంతరింద్రియ నిగ్రహం. ఇంద్రియ విషయాలలోని దోషాలను ఎరిగి, వాటినుంచి మనసును మరల్చి, గమ్యమైన ఆత్మసాక్షాత్కారంపై స్థిరంగా లగ్నం చేయడం.

దమం - బాహ్యేంద్రియ నిగ్రహం. జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను ఆయా ఇంద్రియార్థాల నుండి సంయమింపచేసి పరిపూర్ణ పరబ్రహ్మంపై స్థిరపరచడం.

ఉపరతి - బాహ్య ఆకర్షణలకు లొంగక మనసు అంతర్ముఖమవ్వడం.

తితిక్ష - సుఖదుఃఖాల ఫలాపేక్షకు నేననే అహంకారం కర్త. కావున అహంకార వృత్తి అయిన మమతానురాగాలచే బంధింపబడకూడదు. సర్వద్వంద్వాలను సహించుకొని సమదృష్టిచే సదా సమభావంతో స్థితప్రజ్ఞులై ఉండాలి.

సహనం సర్వ దుఃఖానామప్రతీకార పూర్వకం ।
చింతా విలాపరహితం సా తితిక్షా నిగద్యతే ॥
వివేక చూడామణి - 24

శ్రద్ధ - శాస్త్ర వాక్యాలలోను, గురు వాక్యాలలోను నిగూఢంగా దాగివున్న ఆంతర్యాన్ని స్పష్టమైన అవగాహనతో పరిపూర్ణంగా గ్రహించడం. శాంతి సమాధానం - ఏకాగ్ర లక్ష్యంతో మననం, బుద్ధి మొదలైన సమస్త ఇంద్రియాలను సదా నిత్యసత్యమైన పరిపూర్ణ పర బ్రహ్మంపై నిలపడం. పైన చెప్పిన సర్వ విషయాల సారాన్ని గ్రహించి తమలో తాము శాంతియుతమైన వాతావరణాన్ని తమ అంతరంగంలో సంప్రాప్తింప జేసుకోవడం.

**4. ముముక్షుత్వం :**

అజ్ఞానంవల్ల కలిగే దేహభావం, అహంకారం - వీటివల్ల కలిగే ఇతర బంధాలను అనిత్యమైన వాటిగా గ్రహించి స్వస్వరూపాన్ని తెలుసుకుని ఆత్మసాక్షాత్కారంద్వారా ముక్తి పొందాలనే తపన.

మనస్సనే పెద్దపులి,ఆశయనే కాలసర్పం, కామాదులనే దొంగలు - వీటి బారినుండి తప్పించుకొని మోక్ష సాధన దిశగా అడుగులు వేయటానికి పై నాలుగు సాధనలు అత్యవసరం.

ఈ వివేచనాత్మక అంతరదృష్టితో వేయిపడగలని వివేచిస్తే- శ్రీ కృష్ణుడు అర్జునుడికి చేసిన ఉపదేశం భగవద్గీత అయితే విశ్వనాథవారు విశ్వానికి బోధించిన గీత వేయిపడగలు. అటు పండితులకు ఇటు పామరు లకు కూడా ఎంతో సరళంగా ఆత్మతత్వాన్ని, వివేచన తత్వాన్ని చివరకు మానవుడు కోరుకునే అంతిమ లక్ష్యమైన మోక్షసాధనకు కూడా ఉపయోగపడే మార్గాలు, వివేచన వేయిపడగలలో నిబిడీకృతమై ఉంది. అంతేకాదు భౌతిక, ఆధ్యాత్మిక వివేచన సమన్వయానికి ఒక చక్కని వారధి వంటిది. వివేచనాత్మకమైన అంతరదృష్టి లేని కార్యం, పరమార్థం లేని పని; వాసన, జీవం లేని కృత్రిమ పుష్పం వంటిది. అయితే ఎలాంటి లోపం లేకుండా వివేచనా దృష్టిని పరమార్థతత్వాన్ని తెలియజేసి ధర్మాచరణను అలవరిచే వివేచనాత్మక గ్రంథంగా ప్రజల్లో తనదైన స్థానాన్ని నిలుపుకున్న నిత్య సజీవ గ్రంథం వేయి పడగలు. ప్రవృత్తిలో నివృత్తిని, సంసారంలో సన్యాసాన్ని ప్రతి పాదిస్తుంది. రథంలోని చక్రాలు తిరుగుతున్నా, ఇరుసు నిశ్చలంగా ఎలా ఉంటుందో అలాగే శరీరం, ఇంద్రియాలు లోకంలోని వివిధ కార్యాల్లో ఉన్నప్పటికి మనసు నిశ్చలంగా, నిలకడగా వివేచనతోనేకూడి ఉండాలని, అలా లేకపోతే జరిగే విపరీత వినాశక పరిస్థితుల్ని ఎంతో స్పష్టంగా వివరంగా విశ్లేషిస్తుంది, విశదీకరిస్తుంది వేయిపడగలు.

వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, శ్రుతులు, రామాయణం, భారతం, భాగవతం మొదలైనవాటి సారం మంతా వేయిపడగల విశ్వంలో నిక్షిప్తమైవుంది. ఛాందో గ్యోపనిషత్తులో ఉద్దాలకుడు, అరుణికీ, అతని కుమారుడు శ్వేతకేతువుకీ జరిగిన ప్రశ్నోత్తర పూర్వక సంభాషణలో పరబ్రహ్మ స్వరూపం నిరూపణకు సాద్యమేనా?అన్న ప్రశ్నకు శ్వేతకేతువును తండ్రి న్యగ్రోథ వృక్షఫలం తెమ్మంటాడు. ఆ తెచ్చిన పండును పగుల గొట్టమని చెప్పి ''అందులో నీ కేం కనిపించాయి'' అంటాడు. అప్పుడు ''గింజలు'' అంటాడు కుమారుడు. తండ్రి అందులో ఏముందని అడుగుతాడు.''శూన్యం'' అంటాడు కొడుకు. ఆ కనిపించని శూన్యంలో ఇంత పెద్ద న్యగ్రోథ వృక్షం దాగి ఉంది నాయనా! అంటాడు తండ్రి. అప్పటికీ అర్థంకాలేదు నాన్నా అంటాడు కొడుకు. అప్పుడు ఒక గ్లాసు నీళ్ళు తెమ్మని చెప్పి అందులో ఉప్పు వేయ మంటాడు తండ్రి. బాగా కరిగి పోయిన తర్వాత ఆ నీళ్ళలో ఉప్పు తీయమంటాడు. ''ఉప్పు కరిగిపోయింది తీయలేనంటాడు''. ఆ తర్వాత నీళ్ళను రుచి చూడమంటే ''ఉప్పగా ఉంది'' అంటాడు కొడుకు. అయితే

ఉప్పుకన్పిస్తున్నదా? ప్రశ్నిస్తాడు తండ్రి."లేదు" అంటాడు కొడుకు."ఉన్నది" లేనట్టు కన్పిస్తుంది "కానీ ఉన్నది" అలాగే మన శరీరంలో కూడా పరమాత్మ ఉన్నాడు. కానీ కనిపించడు. నీటిలో కరిగిన ఉప్పువలె పరతత్వం దైవత్వం సర్వత్రా వ్యాపించి ఉంది, దాన్ని వివేచనతో దర్శించగల శక్తి సాధన వల్ల లభిస్తుంది. అది తెలుసుకోవడమే బ్రహ్మవిద్య అని సమాధానమిస్తాడు తండ్రి. ఇదే పరిస్థితి వేయిపడగల్లో మనకి కన్పిస్తుంది. వివేచనాత్మక అంశాలు ఎక్కడున్నాయని అంతరదృష్టితో అవలోకిస్తే, నీళ్ళలో కలిసిపోయిన ఉప్పులాగా....

ఏకో దేవ సర్వ భూతేషుగూడః

సర్వవ్యాపీ సర్వ భూతాంతరాత్మా - శ్వేతాశ్వతరో పనిషత్తులో చెప్పినట్లుగా వేయిపడగల నిండా వ్యాపించి ఉంది అనడంలో సందేహం లేదు. ప్రతి పాత్ర, ప్రతి వర్ణన, ప్రతి చోట వివేచనాత్మక దృష్టి ఏరులా, సెలయేరులా ఉప్పొంగి ప్రవహిస్తూనే ఉంటుంది. ఆ ప్రవాహంలో ఒకటి రెండు చుక్కలు మాత్రమే నేను స్పృశించగల్గాను.

ఇక విశ్వనాథ వారి విజ్ఞాన సాగరం నుండి వెలువడి, వేయిపుటల్ని ఆక్రమించిన బృహత్తర మహాకావ్యం, విశ్వకోటి పూజింపదగిన విశ్వవిజ్ఞాన మహావృక్షం, 1934లో సరిగ్గా 29 రోజుల్లోనే విశ్వనాథవారి దివ్యదృష్టి నుంచి ఆవిర్భవించిన మహోన్నతమైన విశ్వసృష్టి వివరాలలోకి వెళ్తే -

ఇందులో విశ్వనాథవారు మూడుతరాల కథను తీసు కొని సమాజంలోని చాతుర్వర్ణ వ్యవస్థను, దాన్ని ఆశ్ర యించి నడిచిన వర్ణాశ్రమ ధర్మాల్ని పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో క్రమంగా ధర్మాచరణ క్షీణించి పోతున్న విధానాన్ని, పూర్వకాలపు జమీందారీ వ్యవస్థను, అందు లోని వెలుగునీడల్ని రమ్యంగా చిత్రించారు. మనదేశంలో సంభవించిన మార్పుల్ని తన భావనాబలంతో ఊహాశక్తితో సమర్థవంతంగా వివేచించి తాను చవిచూచిన వివేచ నాత్మక అంతరదృష్టి అవలోకనాన్ని సమాజానికి వేయి పడగల ద్వారా వ్యక్తం చేసిన ఘనత విశ్వనాథవారిదే. ఇది పాతకొత్తల మేలు కలయిక. ధర్మారావు ఈ రెంటికీ సంగమస్థానం. ఈ స్థానంలో ఉన్న ధర్మారావు సుబ్బన్న పేట నివాసి. ఆర్షవిజ్ఞాన మూర్తి అయిన రామేశ్వరశాస్త్రి కుమారుడు. తెలుగుదేశానికి తెలుగువారి జీవిత విధానా నికి సుబ్బన్న పేట కేంద్రం. ఈ సుబ్బన్నపేట భారతదేశానికి ప్రతీక. ఈ ఊరిలో జరిగిన మార్పులన్నీ ఆనాడు ఆంధ్ర దేశంలో సంభవించింది. నేటికీ సంభవిస్తూనే ఉంది. విదేశీ నాగరికతవల్ల మనదేశంలో సంభవించిన మార్పులన్నీ స్పష్టంగా ఈ నవలలో తెలుస్తుంది. రైలుమార్గాలు మొదలు క్రైస్తవ, నాటక, మహిళా సమాజాలు, వివిధ కార్యాలయాలు ఆర్థిక, రాజకీయాల, సాంఘిక, నైతిక సమాజానికి వ్యవస్థలో వచ్చిన మార్పులు ఇంకా ఎన్నో ఎన్నెన్నో ఈ మహాకావ్యంలో దర్శనమిస్తాయి. ప్రతి వ్యక్తి ఆంగ్లవిద్యను అభ్యసించి, స్వర్గధామాలైన పల్లెల్ని వదలి పట్టణాలకు వెళ్ళడం... ఒకటేమిటి! సృష్టిలో ఉన్న బ్రహ్మాండమంతా ఇందులో చోటు చేసుకుంది. ఆంధ్ర మహాభారతం గురించి ఒక ప్రసిద్ధమైన మాట ఉంది. అదే మాటే ఈ వేయిపడగల భారతానికీ వర్తిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ మహాకావ్యం నాలుగు స్థంభాల ధర్మ మండపం. వేణుగోపాలస్వామి, జమీందారు, బ్రాహ్మణుడు, గణాచారి దీని స్థంబాలు. ఈ నాలుగుస్థంభాలమధ్య నడచిన విచిత్ర మైన ఆటే "వేయిపడగలు". రాజు ధర్మాచరణకు, బ్రాహ్మణుడు ధర్మప్రచారానికి ప్రతినిధులు. ఈ రెండు వ్యవస్థలు క్రమంగా క్షీణించిపోయిన విధానం, వాటి స్థానంలో కొత్తగా రానున్న ప్రజాస్వామ్య వ్యవస్థను చూసిన రచయిత భవిష్య సమాజాన్ని అంచనా వేసిన తీరు అద్వితీయం.

జమీందారైన కృష్ణప్పనాయుడు ధర్మస్వరూపుడు, రామేశ్వరశాస్త్రి శిష్టాచార సంపన్నుడైన గృహస్థుడు. చాతుర్వర్ణ వ్యవస్థకు మూలమైన బ్రహ్మ ఆ మహా సంప్రదాయానికి వారసుడైన ధర్మారావు కథానాయకుడు. కేశవరావు మన విద్యల్ని, కళల్ని పునరిద్ధరించడానికి పుట్టిన కారణజన్ముడు. శివరావు ఆనాడు మనదేశంలో చెలరేగిన దివ్యజ్ఞాన సమాజ ప్రచారానికి ప్రతినిధి, రంగారావు పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతో దుర్గుణాలకు,

స్వార్థపరత్వానికి ప్రతిబింబం. రాఘవరావు గాంధీమహాత్మ ఆజ్ఞను శిరసావహించి తన సర్వస్వాన్ని దేశమాత దాస్య శృంఖలాల విచ్ఛేదనకై అర్పించిన దేశభక్తుడు. అనాది సిద్ధమైన మన సంప్రదాయాన్ని కాపాడటానికి కల్పించిన ఉత్కృష్టమైన కీలకమైన పాత్ర గణాచారి. అలాగే పసిరిక సృష్టి అద్భుతం. ఇలాంటి వినూత్నమైన సృష్టి మరే రచనలో కన్పించదు. ఈ పాత్ర విర్మాణం విశ్వనాథ ప్రతిభాసంపత్తికి నిదర్శనం. తన సర్వస్వాన్ని వేణుగోపాలస్వామికర్పించిన పరమభర్తురాలైన గిరికపాత్ర విశ్వనాథ వారి మేధాసంపత్తికి విజయపతాకం. చిన్న హరప్పనాయుడు కర్మమార్గంలోని వైశిష్ట్యాన్ని గ్రహించిన వివేకి. ఇలా విభిన్నమైన విశిష్ట పాత్రలతో వేయిపడగలు వేల వెలుగుల్ని వెదజల్లింది.

భక్తి - జ్ఞానం - సంగీతం వేయిపడగల నిండా వ్యాపించిన వైనం - 4వ అధ్యాయంలో ప్రభువు రత్నగిరిని అవికాదు జావళీలుపాడు అని చెప్పగానే -

అదరెనే మోవి - తనకుదానెవదలెనీ నీవి
మదిలోన వాడేమొ మంత్రించె కాబోలు
సుదతి మువ్వ గోపాలు చూచినది మొదలు ॥అదరెనా॥

అన్న క్షేత్రయ్య పదంలో శృంగారరసం స్థాయీభావమైన రతియొక్క దశావస్థలు వర్ణించిన తీరు కవికున్న అపారమైన సంగీత జ్ఞానాన్ని తెలియజేస్తుంది. ఇలాంటి సంగీతమే కాక సృష్టిలోని లలితకళలన్నీ, వేయిపడగల్లో తనదైనస్థానాన్ని అలాగే రాణి ధర్మారావుని ఆహ్వానించి ఆదరించి "బాబూ నేడేకాదశి నీవు భారత భాగవతములు చక్కగా చదివెదవు అవి వినిపించు" అన్నప్పుడు ధర్మారావు "నల్లనివాడు" పద్యంతో ప్రార్థనచేసి రుక్మిణీకళ్యాణం చెప్పడం."కల్యాణాత్మకమైన విష్ణుకథలాకర్ణించుచున్-అవి వినంగా కొత్త లౌచుండు" అనగానే రాణి "నాయనా! పోతనగారు ఏమన్నారయ్యా! నిజంగానే విష్ణుకథలు కొత్తగానే కనబడును సుమా" అంటుంది. ఆ సందర్భంలో ధర్మారావు "ముక్త కైవల్యుండెవ్వడు తృప్తుడౌ అనడంతో ఆయనలోని వివేకం, విజ్ఞత మనకు స్పష్టమౌతుంది. అలాగే "ఏ నీగుణములు కర్ణేంద్రియంబులు సోక దేహతాపమ్ములు తీరిపోవు" అనడంలో వ్యక్తిదృష్టి విష్ణు కథలు వినడం ద్వారా ప్రాపంచికత నుంచి అనన్యభక్తితో వివేచనతో కూడిన అంతరదృష్టి ద్వారా భగవంతునికి చేరువ కావడానికి, మోక్షసాధనకు ఎంత ఉపకరిస్తుందో అవగతమౌతుంది. శౌనకాది మునులు విజ్ఞానఫణిత నిఖిల పురాణవ్రాతుడైన సూతుని అడిగిన సన్నివేశంలోనూ "విష్ణుకథలు వినెడివారికి మరణాగతమోహ సంభ్రమము లేదనఘా" అని చెప్పడం గమనించవచ్చు.

5వ అధ్యాయంలో దేవాలయం దగ్గర ధర్మారావు, గిరిక సంభాషణలోని వివేచన చూస్తే - ధర్మారావు "భక్తి వేరు, జ్ఞానం వేరు; జ్ఞానం అందరికి కలగదు భక్తి సులభమైన మార్గం" అంటాడు. వెంటనే గిరిక "భక్తి అనగా ఏమి?జ్ఞానం అనగా ఏమి?అని ప్రశ్నిస్తుంది."సర్వం బ్రహ్మమే. బ్రహ్మం అనగా విష్ణు మహేశ్వరులలో బ్రహ్మకాదు ఈ త్రిమూర్తులకు అతీతమైన శక్తి, అదే నిర్గుణం, సచ్చిదానంద స్వరూపం. అనేకజన్మల అనుభవంతో వివేచనతో దైవచింతన కల్గి తద్వారా ప్రాప్తించిన జ్ఞానంతో జ్ఞానియై భవరూప సంసారబంధం నుండి విముక్తుడౌతాడు" అంటాడు ధర్మారావు. మరి వేదాలు చెప్పే "అహంబ్రహ్మాస్మి" తత్త్వం ఆదిశంకరాచార్యులు ఉద్బోధించిన సాధనపంపద ప్రారంభంలోనే చెప్పినట్లుగా సర్వశాస్త్రాల, మతాల సారం ఈ వేయిపడగల్లో నిక్షిప్తమైనట్లుగా నిరూపణ అవుతోంది. తద్వారా ఆత్మే పరబ్రహ్మం, జీవుడే దేవుడు, దేహమే దేవాలయం, అనుభవమే జ్ఞానం, జ్ఞానమే ముక్తి, మోక్షం అన్నీ కూడా! ఈ వివేచనాత్మక తత్త్వాన్ని తెలుసుకోవడమే మానవజన్మకు సార్థకత చేసుకోవడమంటే. ఇదే వేయిపడగలు గిరిక పాత్రద్వారా విశ్వకోటికి చేస్తున్న ప్రబోధం.

కాలజ్ఞాని - దివ్యజ్ఞాని - గణాచారిని గమనిస్తే గణాచారి పాత్రలో నిక్షిప్తమైన వివేచన - ప్రథమాధ్యాయంలో ఉన్న గణాచారి వేషధారణ 9వ అధ్యాయంలో కన్పించదు. మొదట ఆమె జుట్టు విరబోసుకొని వేపమండ ధరించినట్లు, రెండోసారి జుట్టు ముడివేసుకొని రావిమండ పట్టినట్లు కవి చిత్రించాడు. మొదట రూపానికున్న అంతరార్థం గ్రామానికంతా కాక వ్యక్తికి కూడా ఆపద సంభవిస్తుందని కవి సూచించిన తీరు మనోహరం. ఇలా మొత్తం నవల్లో ఈమె ఎనిమిది సార్లు కన్పిస్తుంది.

అలాగే రాజు పోవడంతో ధర్మస్వరూపుడైన స్వామికి భూలోక ప్రతినిధి వేయిపడగల రక్షకుడైన రాజు పోయి నంత పని. రాజు రాష్ట్ర స్వరూపుడు, రాణి వ్యక్తి, తర్వాత కథలోనివన్నీ వేపమండలే అవి దేశవినాశన సూచకాలు. తాలూకా బోర్డు ఆఫీసుముందు మాత్రమే వేప, రావి మండలు పడ్డాయి. తర్వాత ఆమె బొట్టులేక విభూతి పెట్టుకొని నల్లనిచీరదాల్చి "అమంగళాకృతి"తో వచ్చిందని కవి చేసిన వర్ణనా వైశిష్ట్యం గమనింపదగింది. అందులోని తాత్త్విక, ఆధ్యాత్మిక భావాల్ని వివేచిస్తే "అమంగళాకృతి" ఎవరు? ఆమెను ఆ సందర్భంలో కొట్టడానికి వెళ్ళిన రామేశ్వరం. వ్యక్తిగా తనకు, మంగమ్మను పాడు చేసి ఆమెకు, తద్వారా గృహస్థధర్మానికీ, సినిమాహాలు కట్టించి పేద ప్రజల్ని, దొంగ డబ్బును ముద్రించి ప్రభుత్వాన్ని మోసం చేసిన వాడికంటే అమంగళాకృతి ఎవరుంటారు?

లోకానికి చెడుచేసి లోక వినాశనమే లక్ష్యంగా పెట్టుకొని సమాజానికి నష్టం చేసేవాడు. అందుకే కవి చిత్రించిన తీరు శిల్ప వైవిధ్యం అసాధారణం. నవల మొత్తంమీద శిక్ష అనుభవించిది కూడా ఇతనే. గిరికవంటి మహాభక్తురాల్ని కామించిన దుర్మార్గుడు. వీడి లోపలున్న అధర్మమే గణాచారి చెప్పిన అమంగళ వేషం. కాబట్టి గణాచారి ఒక వ్యక్తి కాదు మహాకాలజ్ఞాని అనే విషయం వివేచనతో నిరూపణవుతుంది. ఆమె మరణిస్తే స్వామికి లోకంలో నిలువ నీడ లేకుండా పోయింది. అందుకే ఆయన అవ్యక్తంలోకి జారిపోయాడు.అంటే పాము పుట్టలోకిపోయింది అందుకే నవల ముగిసింది. ఆమె మరణంతో "స్వర్గమర్త్యముల మధ్య లంకె తెగిపోయింది" అని ధర్మారావు వ్యాఖ్యానించడంతో ఇహ పర లోకాల మధ్య ఉన్న సంబంధాన్ని ఎంతో నైపుణ్యంతో కవి చిత్రించారు.

రాజు, రాణి పోయిన తర్వాత 12,20 అధ్యాయాల్లో "వేప మండలు పడగా ఊరు దగ్ధమై పోయింది గుండేరు పొంగింది"అంటే అది అధర్మపు పొంగు ఊరు తగల బడటం అనేది ధర్మ నాశనానికి చిహ్నం. ధర్మ రక్షకుడైన రాజు, రాణి పోవడం కాలమహత్యం.ఆ అధర్మ విజృం భణమే ఆధునిక నాగరికత.ఈ ఆధునిక నాగరికతలో ప్రధాన లక్ష్యమైన మానవజన్మకు సార్థకతనిచ్చే మోక్షదృష్టి అసలే లేదు.అంతా యాంత్రిక నాగరికతే. మంచివాడైన చంద్రారెడ్డికి ఎన్నికల పిచ్చిపట్టి ఆధునిక నాగరికతను తెచ్చి సస్యశ్యామలంగా ఉన్న సుబ్బన్నపేటలోని మంచి తనానికి నిలువనీడ లేకుండా చేశాడు. అందుకే సుబ్బన్న పేటలో ఇళ్ళు దగ్ధమౌతుంటే అవి స్వామి కోపానల జ్వాలలని, ధర్మం అంతరించినతీరుని కవి స్పష్టంగా వ్యక్తం చేశారు.

ఇలా ఈ కావ్యంలో పరమేశ్వరతత్త్వమైన, కాలాధీన మైన ధర్మ వ్యక్తీకరణ సాధనంగా కన్పిస్తుంది."ధర్మోరక్షతి రక్షితః" అన్నట్లు ధర్మాన్ని సమర్థులు కాపాడుకోమని, నిలుపుకోమని, అందుకు ప్రతిఒక్కరూ నడుంకట్టి సమాజాన్ని గణాచారి పాత్రద్వారా హెచ్చరించిన ఘనత విశ్వనాథవారిది. మొత్తం మీద గణాచారి పాత్రను వివేచిస్తే భవిష్య సమాజ భవిష్యత్తును కాలజ్ఞానరూపంలో చెప్పిన వీరబ్రహ్మేంద్రస్వామిలా వేయిపడగలలో కాలజ్ఞాని గణాచారి కనిపిస్తుంది. ఎందుకంటే కావ్యమంతా ఆయా సందర్భాల్లో సూచనాప్రాయంగా భవిష్యత్తును చెప్తూ కాలజ్ఞాని పాత్ర వహించినట్లుగా స్పష్టమౌతుంది.ఈ విషయాన్ని ఒకచోట ధర్మారావు "గణాచారి దేవతా స్వరూపురాలు నేను మనుష్యుడను,ఆమె లింగ భేదానికి అతీతురాలు, ఆమె ప్రకృతికచ్ఛమైనబిడ్డ, నేను వికార మూర్తిని"అంటాడు.అందుకే ఆమె దివ్యచైతన్యం ప్రబుద్ధమై వ్యక్తిత్వాన్ని అణగదొక్కి రాజ్యంచేసిన పవిత్ర మైన క్షేత్రం. చైతన్యం తనస్థితిగతుల్ని లోకంలో చాటు కోవడానికి తనంతట తానుగా నిర్మించుకున్న మహా విశ్వ చైతన్యమూర్తి.ఆమె వివేచనకు, దైవజ్ఞానానికి మారుపేరు. ఎక్కడో అంతరాంతరాళలో దాగి ఉన్న శక్తిని నిత్య జాగ్రదావస్థకు తెచ్చిన దివ్యశక్తి. వివేచించి చూస్తే ఆధ్యాత్మిక, ఆధిదైవిక సమన్వయ సూత్రమే కాలగమనం. ఈ జగత్తంతా కాలంపై ఆధారపడి తిరుగుతోంది. అయితే వేయిపడగల జగత్తులో కాలం గణాచారి. ఈ కావ్యంలో గణాచారి ప్రధామైన, దివ్యమైన పాత్ర. అందుకే "వేయి పడగల పాము విప్పారుకొని వచ్చి కాటందుకున్నది కల

లోన రాజును" అని ఈమె పాటతోనే కథ ప్రారంభం జరుగుతుంది. ఇదే వేయిపడల కథా నాందీ శ్లోకం.

మానవుడు-ప్రకృతి-పసిరిక ఈ మూడు అంశాల్నీ వివేచిస్తే ఈ వేయిపడగల విశ్వవిజ్ఞాన వటవృక్షంలోని విత్తనమే ఈ పసిరిక పాత్ర. ఈ పాత్రద్వారా ఈ కావ్యం మహావృక్షమైనదా? లేదా ఈ మహావృక్షంనుంచి పసిరిక సృష్టి జరిగిందా? తేల్చడం సాధ్యం కాదు. విత్తుముందా? చెట్టుముందా? ప్రశ్నలాంటిదే ఈ పాత్ర సృష్టి. మానవుడికీ -ప్రకృతికీ మధ్య అవినాభావసంబంధాన్ని అవలీలగా పసిరిక పాత్రద్వారా లోకానికి అద్భుతంగా తెలిపిన ఘనత విశ్వనాథవారిది. ఈ పాత్ర 3వ అధ్యాయంలో వచ్చి 34వ అధ్యాయంలో మరణిస్తుంది. పసిరిక పైరుపచ్చ. పేరుపచ్చేవాడు దేవమాతృకాస్వరూపుడు. దేహంలోని దేహి లాంటివాడు. అంటే పసిరిక ఒక చైతన్యమూర్తి. గణాచారి సమక్షంలో మరణించినప్పుడు ఆమె

"ఒక శిరసు నాగన్న ఒయ్యారముగవచ్చి
నిజముగా నాతండ్రి నిన్ను కరచిందిరా"అంటుంది

"కలిమ లేముల మధ్య చతుర్విధ పురుషార్థ దృష్ట్యా బతికే ఊరు సుబ్బన్నపేట అని కవి మొదటి అధ్యాయం లోనే చెప్పారు. అయితే క్రమంగా రైతు పట్టణానికెగబాకి, పచ్చదనాన్ని చంపేసినతీరు ఈ నవలాసాంతం కన్పిస్తుంది. చివరకు పసిరికకు నిలుచుటకు స్థానంలేదు. అంటే ఆధునిక నాగరికతకు లోబడినప్పుడే, రైతుబిడ్డ చని పోయినప్పుడే పసిరిక చనిపోయింది. ప్రాణశక్తికి ప్రతీక పసిరిక. ప్రాణశక్తి లేకపోతే మానవుడు నిర్జీవి, మృత శరీరంగా ఉంటాడు తప్ప చైతన్యవంతంగా ఉండలేడు. కవి ఈ పసిరిక సృష్టితో దేశంలోని మానవ జీవన స్థితిగతుల్ని ఎంత ఆర్ద్రతతో విశ్లేషించాడో వివేచనాత్మక దృష్టితో ఆలోచించదగిన విషయం. ప్రతీ వ్యక్తి తనను తాను ప్రశ్నించుకోవలసిన, ఆత్మవిమర్శ చేసుకోవలసిన బాధ్యతను ఈ పాత్ర గుర్తుచేస్తుంది పసిరిక ద్వారా.

భౌతిక - తాత్త్విక వివేచనాత్మక సమన్వయం లోపించిన విధానాన్ని తెలిపిన తీరు వారి ప్రతిభా పాటవానికి తార్కాణం. సుబ్బన్నపేటలోకి విద్యుత్తు ప్రవేశించినపుడే మనిషి అంతరదృష్టిని కోల్పోయి పూర్తిగా బాహ్యదృష్టికి అలవాటై పోయాడు. తద్వారా భారతీయ సంస్కృతి, సంప్ర దాయాలు, కళలు అంతరించిపోయిన దైన్యస్థితి. అంతే కాక పసిరికా స్వరూపమైన వటం, చెట్టు-చేమా; పిట్టా - పాటా అన్నీ పోయాయి. మొత్తం మీద మానవుడికీ - ప్రకృతికీ, అంతరంగానికీ - బాహ్యానికీ ఉన్న, ఉండవలసిన వివేచనాత్మక సమన్వయపు దృష్టిని పోగొట్టుకున్నాడు. అసలు సమన్వయం ఎక్కడుంది? జీవిత వాంఛలతో బతికేచోట కాదు, జీవితాన్ని యోగంగా భావించే నిత్యా నిత్య వివేచన ఉన్న చోట.అలాంటి వివేచనాత్మక సమన్వంతో సిద్ధించేదే "సమత".ఈ సమత "ప్రేమ" ఉన్న హృదయం నిష్పన్నమయ్యే చోట ఉంటుంది.ఆ ప్రేమకు విశ్వమంతా ఆరాధ్యమే. ఇదే సాధనసంపద సిద్ధించిన వివేచనాత్మక సమన్వయం. ఒక ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త యూంగ్ "ఇవాళ మనం పదార్థ విషయం ప్రసంగిస్తున్నాం. ప్రయోగశాలల్లో పరిశోధన చేస్తున్నాం.దాని స్వభావాన్ని వ్యక్తీకరించగల్గుతున్నాం. కానీ నేడు ఆ పదార్థమన్న శబ్దం ఎంత నీరస శుష్కకాష్టంగా

జడ పదార్థమైపోయింది. అది ఒక నిర్జీవ పదార్థంగానే మిగిలిపోయింది. కానీ ప్రాచీనులకు తత్త్వవేత్తలకు అదొక "మహాచైతన్యవంతమైన దైవం"వారి దృష్టిలో భూదేవి అన్నింటినీ కన్నతల్లి అన్నారు. అంతేకాదు దానికి కారణం

"బయటకు చూస్తున్నవాడు కలగంటాడు
లోపలికి చూస్తున్నవాడు మేల్కొంటాడు" - కార్ల్ యూంగ్

ఆశలున్న వారి కది యేది అంటదు
ఆశలుడుగ కలుగు ఆత్మ శుద్ధి
ఆత్మశుద్ధి గలుగ అందును పరమాత్మ - వీరబ్రహ్మేంద్రస్వామి

అంతరంగమందు అనువుగా శోధించి
తలప తలప ముక్తి తనకు కలుగు
బాహ్యరంగమందు భాషింప తెలియునా? - వేమన

అలా ప్రతివ్యక్తి తనదృష్టిని బాహ్యప్రపంచంవైపు మాత్రమేకాక నిత్యానిత్యవివేచన అనే సాధనతో అంతర్దృష్టిని అలవరచుకొని అంతరాంతరాళలోకి వెళ్ళి ఆత్మజ్ఞానం పొందాలి.

"అసంశయం మహాబాహెూ మనో దుర్నిగ్రహం చలమ్
అభ్యాసేన తు కౌన్తేయా వైరాగ్యేణ చ గృహ్యతే "
- (6వఅ- 35వ శ్లోకం; భగవద్గీత)

అలా సనాతనసంస్కృతీ, సంప్రదాయాల్ని పరిరక్షించుకోవడానికి నిరంతరం వివేచించాలి. అప్పుడే సాధనా సంపద సిద్ధిస్తుంది. ఈ సంపదే సమస్త మానవాళికి శ్రేయస్సును చేకూర్చుతుంది.

వివేచనతో అజ్ఞానం నుంచి జ్ఞానంవైపుకి పయనించిన మంగమ్మ! ఈ పాత్ర 13వ అధ్యాయంలో వచ్చి 31వ అధ్యాయంలో అదృశ్యమౌతుంది.ఈమె సంప్రదాయాలు వైవాహిక వ్యవస్థకు వ్యతిరేకంగా కన్పిస్తుంది.17సం॥ వయసుగల పూజారి కూతురు ధనం,డబ్బు అనే గాలంలో, వ్యామోహంతో చిక్కుకుంటుంది. డబ్బుకోరికతో భర్తను పోగొట్టుకొని రాధాపతి చేతిలోపడి, అనేకుల నోళ్ళలో నాని చివరకు చెంగల్రావు చేతిలో చనిపోతుంది.ధర్మారావు పరిచయంతో మంగమ్మ మనసులో వివేకబీజం మొలకెత్తి చివరకు లోలోపల ఎంతో దుఃఖోద్వేగాల్ని అనుభవించి అంతరగ్నిలో దగ్ధమైపోతుంది. "స్త్రీ మూలంగా లోకమెంత చెడిపోతున్నదో చూశావా"అన్న కుమారస్వామి మాటతో ఆమె ఆలోచనా స్రవంతి అంతర్ముఖత్వంవైపు అవధి లేనిదిగా పయనిస్తుంది.

"జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం" అన్నట్లు జ్ఞానమనే అగ్నిలో తన కర్మలన్నీ దగ్ధమై జీవుడు వివేచనతో దైవంవైపుగా/ ధర్మంవైపుగా దృష్టిని మరల్చిన తీరు ఈ పాత్రలో గమనించవచ్చు.ఈ పాత్ర ఆధునికవ్యవస్థలోని ఇలాంటి వారి మానసిక స్థితిగతుల్ని ఆలోచింపజేసి వ్యక్తి సంస్కరణకు, తద్వారా సంఘసంస్కరణకు కూడా తోడ్పడే విధంగా రూపాంతరం చెందిన పాత్ర. అలాగే జీవుడు జీవింతంలో తెలియక చేసిన పాపానికి తరువాత ఎంత బాధ పడతాడో ఆ దుఃఖానుభవం ఎలా ఉంటుందో ఈ పాత్రలో స్పష్టమౌతోంది. 28వ అధ్యాయానికి మంగమ్మ పూర్తిగా మారిపోతుంది. 24 -28 అధ్యాయాల మధ్యకాలం 20రోజుల్లో ఆమె ఎంతగా వివేచించి మారిపోయిందో! అదే... కవి ప్రతిమానవునిలో, జీవునిలో ఆశించేది. అంటే సహజంగా అరిషడ్వర్గాలతో, మనసుతో కూడుకున్న మానవ స్వభావం నిలకడలేనిది. అయితే ఈ చంచలమైన మనసును నిశ్చలమైన స్థితికి తీసుకుని రావల్సిన అవసరాన్ని, వివేచించాల్సిన తీరును లోకానికి చాటిన కావ్యం ఈ వేయిపడగలు.

భగవద్గీత ఈ విషయాన్ని -

"యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః"
- (2వఅ-6వ శ్లోకం)

ఓ అర్జునా! అత్యంత చంచలమైన ఇంద్రియాలు పరిపూర్ణత్వానికై ప్రయత్నిస్తున్న జ్ఞాని మనసును కూడా బలవంతంగా లాగుతూ ఉంటాయి. అందుకే గౌతమ బుద్ధుడు దమ్మపదంలో "వెయ్యిమందిని వెయ్యి సార్లు ఓడించిన వీరుడుకన్నా తన మనసును జయించిన వాడే మిన్న" అంటాడు. అలా జయించడానికి కావలసిన అత్యవసర పరికరం సాధనసంపద.

తద్వారా ప్రతిమనిషి తన మనసును బుద్ధితో స్వాధీన పరచుకొని సరైనవిధంగా వివేచించి సాధన సంపదతో "అజ్ఞానపుదశ నుంచి జ్ఞానంవైపుకి పయనించి వ్యక్తిస్థాయి నుంచి శక్తిస్థాయికి, అనిత్యం నుంచి నిత్యంవైపుకు" చేరుకోవాలనేది కవి వేదన.ఈ ప్రయత్నం ప్రతి మానవుడిలో జరిగిన్పుడు ఈ కావ్యసృష్టికి పరమార్థం.అలా తనను తాను స్వాధీన పరచుకొని ప్రశాంతంగా రాజ్య పాలన చేసిన పరిస్థితులు, అలాగే పూర్తిగా మనసుకు లోబడి తనకు, తన రాజ్యానికి, తన ప్రజలకు, విపరీతంగా నష్టం కల్గినటువంటి పరుస్థితులు అన్నీ వేయిపడగల్లో దర్శించవచ్చు.

నాగరికతలు విలాసాలు పైకి భాగ్యవంతమైనవిగా, శారీరక సుఖవంతమైనవి, స్థిరమైనవిగాను కన్పించినా, సామాజిక స్థాయిలో మనిషికి మనస్సు స్వాధీనం తప్పితే వివేచించే అంతర దృష్టిని కోల్పోతే అది ఆయా నాగరికతల వినాశనానికే దారితీస్తుంది. అందుకే "సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నట్లుగా దృష్టిని వివేచనతో అంతర్ముఖత్వం వైపుగా మరల్చి, తననుతాను సంస్కరించుకొని సాత్విక, తాత్విక, ఆధ్యాత్మిక దృష్టిని అల

వర్చుకొని, భౌతిక-తాత్విక సమన్వయంతో నిత్యమైన ధర్మాన్నీ, సత్యాన్నీ, ఆత్మజ్ఞానాన్ని పొందాలి. అంతేకాదు ఈ విషయాన్ని మన వరకు మనం"సూత్రప్రాయం"గా తెలుసుకుంటే సరిపోదు.తదనంతరం మరింతగా ఆత్మానుభవాన్ని, ఆత్మజ్ఞానాన్ని, విస్తరింపజేసుకోవాలి. తదనుగుణంగా మన దైనందిక వాస్తవాన్ని సంపూర్ణంగా సృష్టించుకోవాలి. అలాగే ప్రతి వ్యక్తికీ నిత్యానిత్య వివేకాన్నీ, లోతైన పరిశీలనను అలవరచడం అవివార్యమైన కర్తవ్యం.

"ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానామవ సాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః"-
(6వఅ-5వ శ్లోకం ; భగవద్గీత)

అన్నట్లుగా తననుతానే ఉద్ధరించుకొని వివేచనాత్మక దృష్టితో, త్రికరణశుద్ధితో అంతరాత్మ ప్రబోధంతో స్పష్టంగా శాంతియుతమైన మానవ జీవన మనుగడ కొనసాగించాలని కోరుతూ, వేయిపడగలు విశ్వానికి చేస్తున్న ప్రబోధం కూడా ఇదే అని తెలియజేస్తూ..... స్వస్తి.

**ఆధార గ్రంథాలు :**


1. వివేక చూడామణి - ఆదిశంకరాచార్య
2. వేయిపడగలు - విశ్వనాథ సత్యనారాయణ
3. ఛాందోగ్యోపనిషత్తు - రామకృష్ణమఠం ప్రచురణలు
4. శ్వేతాశ్వతరోపనిషత్తు - రామకృష్ణమఠం ప్రచురణలు
5. వేమన శతకం - వేమన
6. శ్రీమద్భగవద్గీత - గీతా ప్రెస్, గోరఖ్‌పూర్
7. బ్రహ్మపథం-భగవద్గీత - డా. వరలక్ష్మి పూజారి


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# మానవ సంబంధాల విధ్వంస చిత్రణ భూదేవి నవల

- తీగల లావణ్య

**రచయిత పరిచయం**

"నా రచనలు ఎక్కువ భాగం జీవిత చరిత్రలే. కానీ కేవలం వారి జీవిత చరిత్రలు చెప్పటమే నా ఉద్దేశం కాదు. వాళ్లు నడిచివచ్చిన, లేదా వాళ్ళు నిర్మించిన ఉద్యమాల గురించి చెప్పటం. ఆ అనుభవాలను సాహిత్యపరంగా నమోదు చేయటం. తద్వార ఆ సామాజిక చరిత్రను ముందు తరాలకు అందించడమే లక్ష్యం" అని చెప్పుకున్న రచయిత పి. చంద్. ఇది ఆయన అసలు పేరు కాదు. ఆయన కలానికి ఉన్న చాలా పేర్లలో ఒకటి. నిర్బంధం వచ్చిన ప్రతీ సారి ఆయన కలానికి ఒక పేరు వచ్చింది. పేరును మార్చుకున్నాడే గాని రచనా వ్యాసంగాన్ని మాత్రం వదిలేయలేదు. తను ఎంచుకున్న దృక్పదాన్ని వదిలేయలేదు. అది సమాజం పట్ల, సమాజాన్ని అక్షరబద్ధం చేసే సాహిత్యం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత. అక్షరం రాసి గుర్తింపు వెతుక్కుంటున్న ఈ తరంలో పదుల్లో నవలలు రాసి అసలు పేరు తెలియకుండా గుర్తింపు నా అక్షరానికి వస్తే చాలు అనుకోవడం రచయితగా ఆయన గొప్పతనం. పి. చంద్ శేషగిరి, నల్లమల, శ్రామిక యోధుడు, శృతి, నెత్తుటిధార, ధిక్కార కెరటం, విప్లవాగ్ని, వీరుడు లాంటి పదుల్లో నవలలు రాశారు. అలాగే ఆయన రాసిన కథలు అన్ని ఇటీవల నలుపు కథా సంపుటులుగా వెలువడినవి. పి. చంద్ అసలు పేరు ఊరుగొండ యాదగిరి. ఈయన సింగరేణిలో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ప్రస్తుతం పూర్తి కాలం రచనా వ్యాసంగంలో ఉన్నాడు.

**అంశ పరిచయం :**

ఇవ్వాళ ప్రపంచం అంతా అభివృద్ధినామ జపం చేస్తుంది. ఈ అభివృద్ధి జీడిపిలలో కొలవబడుతుంది. ఎంత ఎక్కువ జీడీపీ నమోదు చేస్తే ఆ దేశం అంత గొప్ప అభివృద్ధి సాధించినట్టు. ఈ అభివృద్ధిలో మనిషి ఉండడు కేవలం మనీ తప్ప. అభివృద్ధి అనే పేరు ఎక్కడ వినబడిన అక్కడ ఆ అభివృద్ధి చేత బాధించబడే వర్గం ఒకటి ఉంటుంది. ఆ వర్గ జీవితాలు ఎవరికి కనిపించవు. మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం. అభివృద్ధి కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు తమదైన శైలిలో కృషి చేస్తున్నాయి. పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను నెలకొల్పు తున్నాయి. ప్రభుత్వాలు, మీడియా ఈ తతంగాన్ని అంతా గొప్పగా పొగుడుతున్నాయి. ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే కాని గొప్పగా చెబుతున్న ఈ అభివృద్ధికి ఇంకో వైపు కూలుతున్న జీవితాలు ఉన్నాయి. దేశ అభివృద్ధికి పరిశ్రమలు అవసరం. సహజ వనరుల వినియోగం కూడా అవసరమే. కానీ దేశ అవసరాల కోసం కాకుండా కొంత

మంది వ్యక్తుల, సంస్థల లాభాల కోసం దేశంలో ఉన్న సహజవనరులను విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దాని వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. అదే విధంగా దేశ సంపద రాబోయే తరాల చేతుల్లోకి వెళ్ళ కుండానే అంతమయ్యే అవకాశమూ ఉంది. అధిక లాభాల కోసం కంపెనీలు పర్యావరణం గురించి, కార్మికుల భవిష్యత్తు గురించి ఆలోచించకుండా అనేక అనవసర నూతన పద్ధతులను ప్రవేశ పెడుతున్నారు. అలా బొగ్గును ఉత్పత్తి చేసే రంగంలో ప్రవేశపెట్టిన నూతన విధానమే ఓపెన్ కాస్ట్ పద్ధతి. ఇది బొగ్గు ఉత్పత్తిలో అంతకుముందు ఉన్న అండర్ గ్రౌండ్ మైనింగ్ కి ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన నూతన పద్ధతి. దేశ అభివృద్ధిలో విద్యుత్తు పరిశ్రమ పాత్ర చాలా కీలకం. దేశమంతా వెలుగును నింపుతున్న పరిశ్రమ విద్యుత్తు పరిశ్రమ. అలా దేశమంతా వెలుగుతున్న వెలుగుల వెనకాల కొంత మంది వ్యక్తుల, సంస్థల లాభాల కోసం ఓపెన్ కాస్ట్ మైనింగ్ పేరుతో చీకటిని నింపుతున్నారు. కొన్ని చీకటి జీవితాలు ఉన్నాయి. అవి ఎవ్వరికీ కనిపించని జీవితాలు. అలాంటి జీవితాలను గురించి ఆర్ద్రంగా చర్చించిన నవలే భూదేవి నవల.

**ఇతివృత్తం :**

సింగరేణి సంస్థ ఒపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా తెలంగాణ ప్రాంతంలోని పెద్దపల్లి జిల్లాలో ఉన్న పెద్దం పేట అనే గ్రామంలో భూసేకరణ జరపాలని అను కుంటుంది. భూసేకరణలో భూమిని కోల్పోయిన రైతు లకు మార్కెట్ రేటు డబ్బులు, ఇంటికి ఒక ఉద్యోగాన్ని నష్టపరిహారంగా చూపిస్తుంది. ఊర్లో ఉన్న మొత్తం భూములలో ఎక్కువ భాగం కొంతమంది భూస్వాముల చేతిలోనే ఉన్నాయి. వ్యవసాయం ఆర్థికంగా వెసులు బాటుగా లేకపోవడం, భూమికి మార్కెట్ రేట్ వస్తుంది అని అనడంతో భూస్వాములు అందరూ భూసేకరణకి ఒప్పుకుంటారు. భూమి అంతా తీసేసి ఏదో ఒక పరిశ్రమ పెట్టుకుని బతకచ్చు అని వారి ఆలోచన. సర్పంచ్ రాఘవ రావుకు కూడా ఆ ఊరిలో చాలా భూమి ఉంది. తాతల కాలం నుండి వస్తున్న భూమి అది. అందుకే భూస్వాములు, నాయకులు అందరూ కంపెనీ వెనకాల ఉన్నారు. అలాగే ప్రభుత్వం భూసేకరణ చేయాలి అనుకుంది అంటే అది ఆగే పని కాదు "భూమిని ఇవ్వ కుంటే సర్కారు ఊరుకోదు. బలవంతంగానైనా ఖాళీ చేయిస్తది. అటువంటప్పుడు సామరస్యంగా వీలైనంత ఎక్కువ రాబట్టుకోవడం మంచిది" అన్న ఆలోచన సర్పంచ్ రాఘవరావుది. ప్రజాభిప్రాయంతోనే తీసుకోవాలని చట్టా లలో ఉన్నా ఆ ప్రజల అభిప్రాయాలు వినే పరిస్థితులలో ప్రభుత్వం, సంస్థ లేవు. అందుకే ఈ విషయం శాంతి భద్రతల సమస్య అయింది. ప్రజలను ఒప్పించడం రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి బదిలీ అయ్యి పోలీసుల డిపార్ట్మెంట్ వంతు అయింది. మట్టిని నమ్ముకున్న మనుషులు కొంతమంది ఉన్నా వాళ్ళ అభిప్రాయాలు వినే పరిస్థితులు లేవు. వెంకటేశం, మల్లేశం లాంటి వాళ్ళు భూసేకరణకు వ్యతిరేఖంగా కొన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల అమాయకత్వం ముందు ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. పెద్దంపేట గ్రామాల్లో భూసేకరణ జరిగింది. మెజారిటీ ప్రజలు తమ భూములను కంపెనీకి అప్పగించారు. తర్వాత ఆ ఊరిలో, వాళ్ళ జీవితాలలో అనేక మార్పులు వచ్చాయి. అభివృద్ధి పేరుతో జరిగిన మానవ సంబంధాల విధ్వంసం అది. ఎవరూ గుర్తించ నంతగా మనుషుల జీవితాల్లో జరిగిన విధ్వంసం అది. ఆ విధ్వంసాన్ని గురించి చాలా లోతుగా చర్చించిన నవలే భూదేవి నవల.

**మానవ సంబంధాల విధ్వంస చిత్రణ :**

భూదేవి నవల ఏ ఒక పాత్ర ప్రధానంగా సాగిన నవల కాదు. ఇది భూమి కేంద్రంగా సాగిన నవల. భూమి కోసం జరిగిన పోరాటాల కేంద్రంగానో, ఉద్యమాల కేంద్రంగానో ఈ నవలను రచయిత రాసుకోలేదు. భూమి కోసం జరిగిన మానవ విధ్వంసం కేంద్రంగా నవలను రాసుకున్నాడు. ఈ నవలలో పాత్రలు ఏవి ప్రత్యేకంగా లేవు. అన్నీ పరిస్థితుల నుండి వచ్చిన పాత్రలే. చుట్టూ దట్టమైన అడవులలో ఉన్న కాలం నుండి పారిశ్రామిక ప్రాంతంగా, అక్కడి నుండి ఇంకొకరికి ఉపయోగపడడం కోసం విస్థాపితం అయ్యే దాకా జరిగిన ప్రయాణం భూదేవిదే

కాదు భూమిది కూడా. అందుకే ఆ భూమితో భూదేవి ప్రత్యేక బంధాన్ని పెంచుకుంది. ముందునుండి భూమిని నాశనం చేసే ఓపెన్ కాస్ట్ కోసం జరిగే భూసేకరణను వ్యతిరేకించింది. చివరికి ఆ భూమి కోసమే తన ప్రాణాలను కూడా అర్పించింది. “నిరాశతో చావట్లేదు. నా చావు నిర్వాసితులయ్యే వాళ్ళ కళ్ళు తెరిపించాలి. కంపెనోడు చెప్పే మాటలు నమ్మద్దు. మీ భూములు ఇవ్వద్దు. మీ బతుకులు నాశనం చేసుకోవద్దు” (146). అని చెప్పి ఆత్మహత్య చేసుకుంది. కానీ ఆ ఆత్మహత్య కన్నా ముందు ఎంతమంది జీవితాల విధ్వంసాన్ని చూసింది. భూదేవి చూడడమే కాదు భూదేవి పాత్ర ద్వారా రచయిత పాఠకుడికి చూపించాడు. అలా జీవితాన్ని కోల్పోయిన వాళ్ళలో భూమినే నమ్ముకున్న సాయిలు ఉన్నాడు. “కంపెనోడు భూమికి మంచి ధర ఇస్తామంటే కన్న తల్లి లాంటి భూమిని వదులుకుంటామా? భూమి లేకుంటే మనిషి ఎట్లా బతుకుతాడు?” (52) అని కొడుకుతో వాదించిన సాయిలు ఆ భూమిని కోల్పోయి, ఆ భూమిపై కంపెనీ ఇచ్చిన డబ్బులతో కొడుకు తాగుడుకి బానిస అయ్యి మరణించినాక బస్టాండ్‌లో బిచ్చగాడిగా మారి పోయాడు. భూమి అమ్మకం విషయమై తండ్రి సాయిలుతో కొట్లాడి కంపెనీకి భూమినీ అమ్మిన రాజీరు తర్వాత చేయడానికి పని లేక తాగుడుకు అలవాటు పడ్డాడు.చివరికి రాజీరు జీవితం ఊరు వెనకాల శవం అయి కనపడింది. కానీ రాజీరు మరణం సహజ మరణం అని రచయిత అనుకోలేదు. దాని వెనకాల తాగుడుకు కారణమైన నిరాశామయ జీవితం ఉంది. దాని వెనకాల బతకడానికి పని దొరకని ఒక అసహాయస్థితి ఉన్నది. దాని వెనకాల తన సంపాదనకు మూలమైన భూమిని లాక్కున్న కంపెనీ ఉన్నది. ఆ కంపెనీ మాటలకు మోస పోయిన తన అమాయకత్వం, అవసరం ఉన్నది. అదే ఊర్లో ఒక తరం “ఒంటి మీద అంగి అంటూ లేకుండా బతికి ఎప్పటికైనా తమకంటూ భూమి కావాలని భమిసి నోరు కట్టుకుని పైసా పైసా కూడబెట్టి ఎకరం భూమి సంపాదించారు” (19). కానీ ఇప్పుడు భూమిని నమ్ముకుని బతకలేక అమ్ముకుని వలస వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. ఆ పరిస్థితే రాజీరు మరణానికి కారణం అయింది. అది ప్రభుత్వాల నిర్లక్ష్యాల వలన కృత్రిమంగా ఏర్పడిన పరిస్థితి. ముఖ్యంగా ప్రపంచీకరణ వలన ఏర్పడిన పరిస్థితి. దానికి మనుషుల ఆకలి, చావులు కనిపించవు. కేవలం సంపద మాత్రమే కనిపిస్తుంది. “ఎక్కడ సంపద ఉంటే అక్కడ దోచుకుపోయే దొంగలు తయారైండ్లు. వాళ్లకు వంతపాడే వాళ్లే దేశాధినేతలు అయ్యిన్లు. వాళ్ళ దోపిడీకి అందమైన ముసుగే ప్రపంచీకరణ”(135) రచయిత ప్రపంచీకరణకి ఇచ్చిన నిర్వచనం. ఆ ప్రపంచీకరణలో భాగమే దేశ సంపదను పెద్ద మొత్తంలో తరలించడం కోసం వచ్చిన ఓపెన్ కాస్టు. భూసేకరణ చేయడానికి వచ్చినప్పుడు ఊరిలోని ప్రజల్లో వచ్చిన రెండు అభిప్రాయాలే భూదేవి పాత్ర బిడ్డలైన రాజేశం, మల్లేశంలు. ఒకరు అమ్మడానికి సిద్ధపడితే, ఒకరు పోరాటానికి సిద్ధపడ్డారు. అమ్మడానికి సిద్ధపడ్డ రాజేశం భూమిని అమ్మి పని కోసం దేశానికి పోయిండు. తల్లికి, పెళ్లాంకి, పిల్లలకు దూరం అయిండు. పోరాడడానికి సిద్ధపడ్డ మల్లేశం అంతే. అందరికీ దూరం ఆయిండు. జైళ్ళు, నిర్బంధాలు ఎదురుకున్నాడు. ఎవ్వరినీ ఇంటిదగ్గర తన వాళ్ళతో బతకనివ్వని పరిస్థితి ఏర్పడింది. మల్లేశం చాలా విషయాలు చదువుకున్నవాడు. పరిస్థితులు అన్నిటిని అర్థం చేసుకున్నవాడు. మల్లేశం భార్య కాంట్రాక్టర్ తో అక్రమ సంబంధం పెట్టుకుందని తల్లితో సహా ఊరంతా అనుకుంటుంటే “పెను తుఫాను విరుచుకుపడుతున్నప్పుడు చిన్న గడ్డిపరక దొరికినా గండం నుండి బయటపడవచ్చు. చావు నోరు తెరుచుకుని మన ముందు నిలుచున్నప్పుడు న్యాయ అన్యాయాలకు మంచి చెడులకు స్థానం ఎక్కడ ఉంది. ఎట్లాగో బతకాలి అనే తాపత్రయం తప్పొప్పుల సమస్య కాదు” అని పరిస్థితులను నిందించాడే గాని మనిషిని నిందించలేదు. అది అతను సంపాదించిన జ్ఞానం. మనిషిని ప్రేమించడం తెలిసిన వాడి అవగాహన. వీళ్ళ జీవితాలే కాదు కష్టపడి ఎనిమిది ఎకరాలు సంపాదించుకున్న కాపు రాజయ్య. ఎవరి దగ్గర చేయి చాపకుండా బతికిన వ్యక్తి. భూమిని కంపెనీకి ఇచ్చి వచ్చిన పైసలను కొడుకులు పంచుకున్నారు. వంతుల వారీగా తండ్రిని పంచుకున్నారు. తన బిడ్డలు పెళ్ళాం,

పిల్లల్ని సాధడమే కష్టమయ్యి తనని పట్టించుకోవడం మానేసే సరికి ఇంట్లోనే ఉరి వేసుకుని చనిపోయాడు. ఆదుకోవాల్సిన బాల్యాన్ని ఇసుక బంకరు మింగడంతో నిదురపోతున్నట్టే చనిపోయిన చిన్న పిల్లవాడు బొత్తోని జీవితమూ అంతే. ఊరిలో బడి పోయింది. బడితో పాటే చదువును పోగొట్టుకున్న బావి పౌరుల జీవితాలు ఆ ఊరిలోనే కలిసిపోయాయి.

భారతీయ గ్రామం సబ్బండ వర్ణాల సమాహారం. అనేక కులాలు, అనేక వృత్తులు కలిసి ఉన్న ప్రాంతం. అందులో భూమి లేకున్నా వ్యవసాయరంగంపైనా, గ్రామ ప్రజల పైనా ఆధారపడి జీవించే సమూహాలు అనేకం ఉం టాయి. భూసేకరణలో భూమి కోల్పోయిన వాళ్ళకు డబ్బు, ఇంటికి ఉద్యోగం కంపెనీ ఇస్తామన్నది. కానీ భూములు లేని ఎల్లగౌడ్ లాంటి జీవితాలు గురయ్యే విధ్వంసాన్ని కూడా ఈ నవల చిత్రించింది. " భూములున్న వాళ్లకైతే కంపెనీ నష్ట పరిహారం ఇస్తది. మరి గౌండ్లోల్ల సంగతి ఏంది. వెయ్యి తాటి చెట్లు ఉన్నాయి. వంద కుటుంబాలు బతుకుతాయి. భూ సేకరణ వల్ల తాటివనం కూడా పోతుంది. అటు తర్వాత మా బతుకులు ఏం కావాలి"(68) ఎల్లగౌడ్ దుఃఖంతో చెప్పిన మాటలు. ఎల్లగౌడ్ కాదు ముదిరాజులు, రజకులు, మాలలు, మాదిగలు భూమి లేని ప్రజలు గ్రామాలలో ఎంతో మంది ఉన్నారు. వాళ్ళందరి జీవితాలు గ్రామంపైనే ఆధారపడి ఉన్నాయి. మనుషులకే కాదు మనుషులని కాపాడుతాడు అని చెప్పే దేవుడికీ తప్పలేదు." హనుమాండ్ల గుడి రెండుగా చీలిపోయింది. ఇంటి పెంకులు లేచిపోయాయి. కాకతీయుల కాలం నాటి శివాలయం ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి"(105). దేవుడే ఏం చేయలేక చేతులెత్తేసే అంత బలమైన దోపిడీ. ఊరిలో ఒక్కో వ్యక్తిని కదిలిస్తే ఒక్కో రకమైన ఆవేదన. అమాయక బతుకుల ఆవేదన. ఒక నవలలో ఇమడని దుఃఖం. ఆ దుఃఖమే రేపటి తరం గురించి ఆలోచించింది. వాళ్ళైనా బాగుండాలి అనుకుంది. అందుకే భూదేవి ఆత్మహత్య చేసుకుంది. అనేక సామాజిక సమస్యలు వాటికి మూలమైన ఆర్థిక సమస్యలు అన్నీ మనుషులతో కనిపించని యుద్ధాన్ని చేస్తాయి. ఆ యుద్ధంలో ఓడిపోయి ఆత్మహత్యలుగా మారిన జీవితాలు చాలా ఉన్నాయి. ఎవరి కోసం వచ్చింది ఓపెన్ కాస్ట్ మైనింగ్. పచ్చని ప్రకృతిని ధ్వంసం చేస్తూ, మనిషి జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తూ ఈ విస్థాపన ఎవరి కోసం. పెద్దంపేట మనుషులు, జంతువులు, చెట్లు లేని ఒక పనికిరాని నేలగా ఎవరి కోసం మార్చబడింది. ఇంతమంది చావులకు కారణం ఎవరు. నవల చదువుతున్నంత సేపు ఇట్లాంటి ప్రశ్నలు వాటి సమాధానాలతో ముగుస్తుంది. అలా ఓపెన్ కాస్ట్ మైనింగ్ వలన కూలిపోయిన ఒక గ్రామాన్ని, గ్రామంలోని మనుషుల జీవితాలను గురించి భూదేవి నవల చిత్రించింది.

**రచన విధానం :**

ఒక రచన జరగాలి అంటే చాలా సంఘర్షణ జరగాలి. సామాజిక సమస్యల గురించిన రచన అయితే ఇంకాస్త ఎక్కువ సంఘర్షణే జరగాలి. సమాజంతో మాట్లాడాలి. గతంతో మాట్లాడాలి. భవిష్యత్తుతో మాట్లాడాలి. రచయిత అలా మాట్లాడాడు కాబట్టే మనుషుల జీవితాలను ఇంత లోతుగా అర్థం చేసుకోగలిగాడు. అర్థం చేసుకున్నంత లోతును నవలగా రాయగలిగాడు. ఈ నవల రచయిత పి. చంద్ ఒక ఇంటర్వ్యూలో "ప్రజల జీవితమే నా సాహిత్యానికి ప్రేరణ. ప్రజలు చేస్తున్న పోరాటాలు చూస్తూ వాటి గురించి చెప్పాలనే తాపత్రయమే నాతో రచనలు చేయించింది." అని చెప్పుకున్నాడు. అందుకే ప్రజల జీవితాన్నే నవలా వస్తువుగా చేసుకుని భూదేవి నవల రాసుకున్నాడు. కానీ ఈ నవలలో జీవితాలు అందరిలాంటి జీవితాలు కాదు. విధ్వంసానికి, విస్థాపనకు గురై విసిరి వేయబడ్డ జీవితాలు. ఆ జీవితాలని అలానే చెప్పాలని నవలలో కాల్పనికత కంటే వాస్తవికతకే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాడు. జీవితాలను చాలా సహజంగా చిత్రించాడు. ఎక్కడా కల్పనా, కృత్రిమత్వం లేనట్టుగా నవలను రాయడం రచయిత గొప్పదనం. నవలను నవలగా రాయకుండా ఒక సృజనాత్మక చర్చలా రాయడం కూడా రచయితకు సమస్యపైన ఉన్న అవ గాహనను తెలియజేస్తుంది. భూదేవి నవలలో ఊర్లో

ఉన్న ప్రతీ జీవితాన్ని స్పృశించాడు. ఊర్లో ఉన్న పరిస్థితులను కూడా చాలా హృద్యంగా చిత్రించాడు. నవలను రాయడానికి వాడిన భాష, చేసిన వ్యక్తీకరణలు కూడా అన్ని ప్రజల నుండి వచ్చినవే. ప్రజలకు సులభంగా అర్థమయ్యేవే.

**ముగింపు :**

ఈ విధంగా భూదేవి నవలలో రచయిత పెద్దంపేట గ్రామాల్లో ఓపెన్ కాస్ట్ మైనింగ్ వలన జరిగిన నష్టాలను నవలా రూపకంగా సాహితీకరించారు. సాహిత్యం సమాజంలో ఉన్న మంచిని, చెడును ప్రజల ముందుకు తీసుకువస్తుంది. మంచి వెనకాల ఉన్న చెడును, చెడు వెనకాల ఉన్న మంచిని కాల్పనికంగా విశ్లేషిస్తుంది. అది ప్రజల ఆలోచనల్లో మార్పును, తెలివిని కలిగించినప్పుడు అదొక గొప్ప సాహిత్య పుస్తకంగా నిలిచిపోతుంది. ఆ కోణంలో నుండి చూసినప్పుడు భూదేవి నవల అనేది గొప్ప సాహిత్య పుస్తకం.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# రాగో నవల - ఆదివాసీ స్త్రీ జీవన చిత్రణ

- బొడ్డుపల్లి అఖిల్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

**ప్రస్తావన :**

"ప్రపంచ చరిత్రలో మొదటి నుండి ఇప్పటిదాకా శత్రువుతో సాయుధ పోరాటం చేసిన, చేస్తున్న చరిత్ర ఆదివాసులది మాత్రమే". (వరవరరావు, కొమురం భీం సందర్భం). ప్రపంచ చరిత్ర మొత్తం చూసినా, భారతదేశ చరిత్ర చూసినా ఆదివాసులు, వాళ్ళ జీవన విధానంతో సమంగా కనపడే పదాలు ఆదివాసుల అస్తిత్వం, దాని కోసం వాళ్ళు చేసే పోరాటం. వాళ్ళ జీవితాలలగా, వాళ్ళ పోరాటలలాగా వాళ్లకు సంబంధించిన సాహిత్యం కూడా సాహిత్యచరిత్ర పేజీలకు చాలా దూరంలోనే ఉంచి వేయబడింది. ఇంకా చెప్పాలి అంటే వాళ్ళ జీవితం కూడా సాహిత్యకారుల కలాలకు సాహిత్య వస్తువుగా కనిపించ నంత దూరంగా ఉండిపోయింది. ఆదిమ సమాజ అవశేషాలను ఇంకా తమలో నింపుకుని సమిష్ఠి జీవనాన్ని, స్వార్థం లేని వ్యక్తిత్వాన్ని, సొంత ఆస్తి లేని ఆర్థిక విధానాన్ని ఇంకా అంతో ఇంతో అనుసరిస్తున్న వాళ్ళు ఆదివాసులు. దోపిడీ తెలియని సమాజం ఆదివాసి సమాజం. అడవి కోసం, అడవి కింద ఉన్న సమాజ సంపద కోసం తరాలుగా ఆదివాసులు సాయుధంగా యుద్ధం చేస్తున్నారు. తమ రాజ్యం తమకే కావాలి అని, తమ పాలన తమకే కావాలి అని అనాదిగా నినదిస్తున్నారు. ఇవి మాత్రమే కాకుండా ఆదివాసి సమాజం మనిషిని అణచిపెట్టే ఆచారాలను, స్వేచ్ఛను ఇవ్వలేని అనేక రకాల రివాజులను ఆదివాసి సమాజం తమ తరాలపైన మొస్తున్నది. ఆదివాసి సమాజానికి ఉన్నంత పోరాట చరిత్ర ఆదివాసి మహిళకి కూడా ఉన్నది.అట్లాంటి పోరాట తెగువ ఉన్న ఆదివాసి మహిళకు ఆదివాసి సమాజం విధించిన పురుషాదిపత్య సంకెళ్లు కూడా ఎన్నో ఉన్నాయి. ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్ల పేర అనేక రకాలుగా స్త్రీ భాధిత వర్గంగా నిలబడింది. అట్లాంటి ఆచారాలు నచ్చక ఇల్లు వదిలేసి వెళ్లిపోయిన ఒక అమాయక ఆదివాసి స్త్రీ ఎక్కడైతే సమస్యను ఎదురుకోలేక తాను సమాజానికి ఎదురువెళ్ళలేక, ఎదిరించలేక వెళ్ళిపోయిందో మళ్ళీ అక్కడే తాను తప్పించుకుపోయిన సమస్య దగ్గరే తన స్పష్టమైన అభిప్రాయాన్ని వినిపించేదాకా సాగించిన సత్యాన్వేషణే రాగో నవల.

**నవల ఇతివృత్తం :**

రాగో నవల రాగో అనే ఒక మాడియా తెగకి సంబంధించిన అమ్మాయి తనకి ఇష్టం లేని బావతో ఇష్టం లేని పెళ్లి చేస్తున్న సందర్భంలో మొదలవుతుంది. ఆదివాసుల సంప్రదాయాలలో కొన్ని సాంప్రదాయాలు మనిషి స్వేచ్ఛను ఇష్టాన్ని అణచివేసేవి ఉంటాయి. అందులో

ఒక సంప్రదాయమే లామడే సంప్రదాయం. ఒక అబ్బాయికి అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చేస్తా అని చెప్పి కొన్ని ఏళ్ల పాటు అమ్మాయి ఇంట్లో ఉంచి అన్ని పనులు చెపించడం. ఈ రివాజులో అమ్మాయి ఇష్టంతో పని ఉండదు. అట్లాంటి లామడే రివాజుతోనే రాగొ తండ్రి దల్సు రాగో మేనబావను లామడే తీసుకువచ్చాడు. కానీ రాగో అతనిని మానసికంగా, శారీరకంగాను ఏ విధంగా ఇష్టపడలేదు. ఆ ఊర్లోనే ఉన్న పెళ్ళైన నాన్సును ఇష్టపడింది. నాన్సును ఒప్పించి ఊరు వదిలిపెట్టి వెళ్ళాలని అనుకుంది. కానీ నాన్సు ఊరు వదిలి రాను అన్నాడు. ఇంట్లో ఉంటే పెళ్లి చేయడం ఖాయం. చేసుకోవాలనే ఉద్దేశ్యం లేదు. ఇంట్లో ఇష్టం లేని పెళ్లి చేస్తున్న తల్లిదండ్రుల పైన కోపం, ప్రేమించినా నాన్సు పైన కోపం, అసలు అట్లాంటి పరిస్థితిని సృష్టించిన సమాజంపైన కోపం. ఊరిని వదిలేసింది. స్నేహితురాలు మైని ఇంటికి చేరింది. అక్కడ తన స్నేహితురాలి కష్టాలను చూసింది. తాను ఎదుర్కొంటున్న సమస్య తన నుండి మడియా స్త్రీ సమస్యగా, అక్కడి నుండి అది అందరి మహిళల సమస్యగా రాగోకి అర్థమైంది. ఆ సమస్యలకు పరిష్కారం ఏంటి అనే ప్రశ్నలను తలకెత్తుకుంది. అట్లా ప్రశ్నలకు పరిష్కారాలు వెతికే ప్రయత్నంలో తన జీవితాన్నే మలుపు తిప్పుకుంది. ఆ పరిష్కారాల ప్రయాణంలోనే సంఘాన్ని కలుసుకుంది. వాళ్ళు పాడే పాటలను విన్నది. ఆ పాటలో ఉన్న పంజారాన్ని విన్నది. పంజరంలో ఉన్న రామ చిలుకను విన్నది. తనను పోల్చుకున్నది. వాళ్ళ మాటలను విన్నది. వాళ్ళ ఆలోచనలను విన్నది. వాళ్ళ ఆశయాలను విన్నది. తాను వెతుకుతున్న ఆనందాన్ని సంఘం పనులలో వెతుక్కుంది. దళం గురించి తెలియని రాగో దళం వెనకాల నడిచింది. ఊర్లు అన్ని తిరుగుతూ చదవడం నేర్చుకుంది, అర్థం చేసుకోవడం నేర్చుకుంది. మాట్లాడడం నేర్చుకుంది. పోరాడడం నేర్చుకుంది. ఈ క్రమంలో తాను గతంలో ఎదురుకున్న ఎన్నో సమస్యలను గుర్తుకు తెచ్చుకుంది. ఇక్కడ అట్లాంటి సమస్యలు లేవు అనుకుంది. ఏ మాడియ స్త్రీ పొందని ఆనందాన్ని రాగో పొందింది. రాగో నుండి జైనిగా మళ్ళీ కొత్తం జీవం పోసుకుంది. అలీవ్ గ్రీన్ బట్టలు, భుజానికి తుపాకి, నడుముకు తూటాల దండతో కొత్త రూపం ఎత్తుకుంది. అట్లా రాగో నుండి జైనీగా చేసిన ప్రయాణమే ఈ నవల.

**పాత్ర చిత్రణ :**

రాగో నవల దండకారణ్యంలో ఉన్న ఆదివాసి స్త్రీ జీవితం, ఆ స్త్రీపైన సమాజం ఉంచిన పురిషాధిపత్య అణచివేతలు, రివాజుల కేంద్రంగా జరుగుతుంది. 1980లలో విప్లవోద్యమం ఆదివాసుల సమీకరణ కోసం దండకారణ్యంలో ప్రవేశించింది. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంత కేంద్రంగా చేసుకుంది. నిత్యం పోరాటాలలో ఉన్న ఆదివాసులు విప్లవోద్యమంతో తొందరగా మమేకం అయ్యారు. మైదాన ప్రాంత దోపిడీపై చేసే పోరాటంలో, అడవులను కాపాడడం కోసం, సంపదను కాపాడడం కోసం చేసే పోరాటంలో వాళ్ళతో విప్లవకారులు భాగస్వాములు అవడమూ ఒక కారణం అవ్వచ్చు. అట్లా విప్లవోద్యమం ఆదివాసి సమాజంలోకి వెళ్లిన తర్వాత అక్కడి సమాజ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాలలో అనేక మార్పులు సంభవించాయి. అలాంటి సామాజిక సంబంధాలు మారుతున్న సందర్భం గురించి చర్చించినదే రాగో నవల. ఈ నవలలో సమాజం విధించే అనవసర నిబంధనల పట్ల ఒక ఆదివాసి స్త్రీ పడే సంఘర్షణ ఉంది. మనసును కట్టి పడేసే రివాజుల పట్ల ఆమె చేసిన తిరుగుబాటు ఉంది. ఈ నవలలో కేవలం ఒక రాగో అనే స్త్రీ జీవితం లేదు. ప్రతీ ఆదివాసి స్త్రీ జీవితం ఉంది. ప్రపంచంలో ఉన్న ప్రతి స్త్రీ తాలూకు జీవితం ఉన్నది. సంప్రదాయాల పేర స్త్రీపైన విధించిన అణచివేత ఉంది. స్త్రీ ఇష్టాయిష్టాలతో పని లేకుండా, తాను జీవితాన్ని తాను ఎంచుకునే పెళ్లి విషయంలో తన ప్రమేయం లేకుండా, స్త్రీని ఒక మార్కెట్ వస్తువుగా చేసే లామడే ఆచారం దగ్గర నవల మొదలైంది. తాను నమ్మి ప్రేమించినా మగాడు కోరుకున్న జీవితాన్ని ఇవ్వడంలో వెనకడుగేసాడు. అట్లాంటి సందర్భంలో ఒక స్త్రీ ఎంత వేదన పడగలదో అంత వేదన రాగో పడింది. "రాగోను గదిలోకి తోసాక రక్కినా, గిల్లినా, ఏడ్చినా, తన్నినా, తన్నులు తిన్నా చివరికి రాగో బావకి దొరక్కుండా

ఉండగలదా! ఆనాడెంత అల్లారైనా సరే ఊరంతా అదో సరదాగా ఆనందిస్తారే తప్ప ' అయ్యో ' అనే వాళ్ళే ఉండరు'' (సాధన, 1993. పుట:34) స్త్రీపైన జరిగే దాడికి సమాజ ఆమోదం ఎలా ఉందో రచయిత రాగో పాత్రను ఉద్దేశించిన చెప్పిన మాటలు. అట్లాంటి పరిస్థితుల నుండి రాగో తన స్వేచ్ఛ కోసం అక్కడి నుండి తప్పించుకుని సత్యాన్వేషణ మొదలుపెట్టింది. తను ఎదురుకున్నా సమస్యకి సమాధానం వెతుకుతూ వెళ్తున్న దారిలో సంఘాన్ని కలిసింది. వాళ్ళ మాటల్లో, పాటల్లో తన సమస్యను విన్నది. అనేక సమస్యలకు వాళ్ళు ఇచ్చే పరిష్కారాలను విన్నది. తాను చూడని ఒక కొత్త మానవ సంబంధాల్ని సంఘం మనుషులలో చూసింది. రాగోకు ఇంతటి ఆప్యాయత ఎన్నడూ దొరకలేదు. అయినా ఏ మాడియా స్త్రీ కూడా ఇంత ఆదరం పొందగా తానెప్పుడూ చూడలేదు అని ఊహాలోకాల్లో తేలిపోయింది రాగో. (సాధన. 1993. పుట:51). తాను వెతుకుతున్న ప్రపంచాన్ని విప్లవోద్యమ సహచర్యంలో చూసింది. స్థూలంగా ఆర్థిక సంబంధాలలో మార్పు అనేది విప్లవోధ్యమ లక్ష్యంగా ఉన్నా సూక్ష్మంగా పరిశీలన చేసినప్పుడు మానవ సంబంధాలలో మార్పు విప్లవోద్యమ అవసరంగా కనిపిస్తుంది. పాణి మాటల్లో చెప్పాలి అంటే విప్లవోద్యమం అంతిమంగా అలాంటి ఉన్నతమైన సంబంధాల్లో మనుషులను భాగం చేయడం ద్వారా ఉన్నతీకరిస్తుంది. అది కేవలం మనుషుల ఉన్నతీకరణే కాదు. ఆ క్రమంలో సంబంధాల ఉన్నతీకరణ కూడా. పాత భావజాల చట్రాల నుంచి కొత్త భావజాల వైఖరులకు చేరుకోడానికి మనుషుల ఆచరణే షరతు. (పాణి, 2020. రాగో మనకేం చెబుతుంది). విప్లవోద్యమంలో జైనిగా తాను అనేక ఊర్లు తిరిగింది. అనేక సమస్యలను చూసింది. వాటికి పరిష్కారాలను చర్చించింది. వాటిలో కొన్ని సమస్యలు రివాజులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. అట్లాంటి విషయాలలో తొందరపడితే ప్రజలు ఉద్యమంకు దూరం అయ్యే అవకాశం ఉంది అన్న అవగాహనతో పార్టీ కూడా రివాజుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించింది. ''ఇవ్వాళ మనకోసం ప్రారంభించిన మినహాయింపు రేపు రివాజు అవ్వచ్చు. అసలు ఈ కట్టుబాట్లు అన్నీ కరువులో నుండే పుట్టి ఉండాలి. ఎంత మూఢ విశ్వాసాలు అయినా, ఎంత ప్రాచీన సంప్రదాయాలు అయినా పొట్టతిప్పల ముందు తలవంచక తప్పదు. బతుకుపోరాటం పై చేయి అవుతున్న కొద్దీ ఆ ఆచారాలు, రివాజులు తొలగక తప్పదు'' (సాధన, 1993.పుట:99). కానీ రాగో అలా అనుకోలేదు తాను ఏ సమస్యను ఎదిరించలేక ఊరిని వదిలేసిందో, అదే ఊరిలో అదే సమస్య దగ్గరికి జైనిగా వెళ్ళింది. కానీ ఈ సారి విప్లవోద్యమం ఇచ్చిన సైద్ధాంతిక దృక్పథంతో వెళ్ళింది. అందుకే రివాజులకు వ్యతిరేకంగాగా తన అభిప్రాయాన్ని తన వాళ్ళందరి ముందే చాల స్పష్టంగా చెప్పింది. సమస్య ఏదైనా దానిని చూసే కోణాలు వేరుగా ఉంటాయి. ఆ సమస్య ఎదుర్కొన్నవాడు, దాని వల్ల బాధితుడిగా మారినవాడు, ప్రాపంచిక జ్ఞానం నుండి ఆ సమస్యను చూసినవాడు మాత్రమే ఆ సమస్యకు సరైన పరిష్కారం చూపించగలుగుతాడు. అందుకే తాను చేసిన ప్రయాణం నుండి తెలుసుకున్న విషయాలు, నేర్చుకున్న సైద్ధాంతిక భావాల నుండి తన సమస్యకి పరిష్కారం చూపించగలిదింది. అలా తాను చేసిన సత్యాన్వేషణ ప్రయాణం అనేది తనని విప్లవోద్యమం దగ్గర చేసింది. ఒక అమాయక ఆదివాసి స్త్రీగా సంఘంలోకి వచ్చిన రాగో దళానికి డిప్యూటీ కమండర్ స్థాయికి ఎదిగింది.

**రచనా విధానం :**

రచయిత సాధన విప్లవోద్యమంతో ప్రత్యక్ష సంబంధం కలిగినవాడు. ఆదివాసి సమాజంలో భాగమైనవాడు. అక్కడి సమాజంలో ఉన్న సామాజిక, ఆర్థిక వైరుధ్యాలపైన అవగాహన ఉన్నవాడు. అందుకే తాను భాగమైన విప్లవోద్యమ అవగాహన, ఆచరణ నుండి ఆదివాసి సమాజాన్ని, అక్కడి స్త్రీల జీవితాలను గమనించాడు. వాళ్ళ ప్రశ్నలను, పరిష్కారాలను, ప్రయాణాలనే రాగో నవలగా తీసుకువచ్చాడు. నవలలో స్త్రీ సమస్య కేంద్రంగా నవలా వస్తువు తీసుకున్నా విప్లవోద్యమం ప్రయాణాన్ని నవలలో నిక్షిప్తం చేశాడు. దళం ఉండే విధానం, దాని దిన చర్య, ప్రజలతో దళం మమేకం అయ్యే విధానం, ప్రజల సమస్యలను పరిష్కరించే విధానాలని రచయిత క్రమంగా

చిత్రించాడు. పార్టీ వలన ఆదివాసి సమాజంలో వచ్చిన మార్పులను చిత్రించాడు. "నాటి కాలమైతే ఈపాటికి కోడిపె వాగయ్య వీపు ఏమయ్యేదో గాని ఇపుడు పాడై ఊళ్ళో సంగాలయే, అడవిలో అన్నలయిరి"(సాధన. 1993.పుట:66) షావుకారి దోపిడీని చూసి బూతుల పంచాంగం విప్పిన వాగయ్యను ఏమి అనలేక మనసులో అనుకున్న మాటలు. అలాంటి భయాన్ని షావుకారులలో పార్టీ కల్పించింది. అంతేగాకుండా దళాల అడవుల్లో అన్ని కాలాల్లో పడే ఇబ్బందులను రచయిత నవలలో చెప్పాడు. అయితే ఆదివాసి సమాజం మాతృస్వామ్య వ్యవస్థ అనే విమర్శకుల అభిప్రాయాన్ని ఈ నవల బద్దలుకొట్టింది. ఈ పరిస్థితి గురించే బాలగోపాల్ తన చరిత్ర, మనిషి, మార్క్సిజం అనే వ్యాసంలో "ఈనాటికీ ' ఆదిమ కమ్యూనిస్ట్ సమాజాన్ని ' ఒక ఆదర్శవంతమైన సమ సమాజంగా వర్ణించేవారు, ఆదివాసుల జీవితాన్ని దానికి నమూనాగా భావించేవారు మార్క్సిస్టులలో చాల మందే ఉన్నారు. కాబట్టి వాళ్ళు అంతా ఈ నవల చదివితే మంచిది" (బాలగోపాల్, కే. మనిషి, మార్క్సిజం.పుట:20) అని రాశాడు. అట్లా మైదాన ప్రాంత విమర్శకులు ఆదివాసులను చూసే ఆదర్శ కోణాన్ని రచయిత సాధన రాగో నవలలో పూర్వపక్షం చేశాడు. ఆదివాసి స్త్రీ అనేది సమాజంలో బాధింపపడుతున్న చివరి వర్గం. అట్లాంటి వాళ్ళ జీవితాలను గురించి సాహిత్యంలో చర్చ చేయడం అనేది చాలా గొప్ప విషయం. భాష విషయంలో కూడా రచయిత ఆదివాసి భాషను కూడా నవలలో అక్కడక్కడా ఉపయోగించాడు. నవల చదువుతున్నప్పుడు సహజత్వం రావడం కోసం అట్లా వాడి ఉండవచ్చు. వస్తువు, శిల్పం, కథనం విషయాలలో రచయిత చాల సులభమైన పద్ధతిలోనే నవలను నడిపాడు.

**ముగింపు :**

రాగో నవల ఆదివాసి స్త్రీల అణచివేతలను, వాళ్ళ జీవితాలను చాల లోతుగా చర్చించింది. ఆదివాసి స్త్రీ పోరాట అవసరాన్ని, అనివార్యతను అర్థవంతంగా చెప్పింది. అందుకే రాగో జైనిగా మారింది. కానీ ఆ పోరాటం పితృస్వామ్య భావజాల వ్యతిరేకతతో ఆగి పోతుందా విప్లవోద్యమ అంతిమ లక్ష్యం అయిన సమసమాజ సాధన దిశగా సాగిపోతుందా అనేది తెలియని ఒక ప్రశ్న. "స్త్రీలుగా తమ వ్యక్తిత్వాన్ని కించపరిచే గణాచారాల పట్ల నిరసనతో రాగో వంటి ఆదివాసి స్త్రీలు తమకు అందుబాటులో ఉన్న ఏకైక తిరుగుబాటులో భాగమవుతారు. అంతకు మించి ఆ తిరుగుబాటు అంతిమ లక్ష్యాలతో వాళ్లకు నిమిత్తం ఉందని అనాలోచితంగా అనుకోవడం భ్రమ కాదా"(బాలగోపాల్, కే. మనిషి, మార్క్సిజం. పుట:22). రాగో నవల ముగింపును రచయిత ముగింపులా చేయలేదు. ఇంకొక చారిత్రక సందర్భానికి మొదలుగా ముగించాడు. అంటే డిప్యూటి కమాండర్ గా ఎదిగిన జైని తన ప్రయాణాన్ని ఇంకా ఎంత దూరం కొనసాగించింది. తాను పారిపోవడానికి, ఉద్యమంలో చేరడానికి కారణమైన సమస్యపైన తాను విజయం సాధించినాక తను ఎటు వైపుగా వెళ్తుంది? ఏ లక్ష్యంతో పని చేస్తుంది? ఇంకా ఎంత దూరం నడుస్తుంది? ముప్పై ఏళ్ల క్రితం విప్లవోద్యమంలో భాగమైన రాగో మూడు దశాబ్దాల తర్వాత ఎట్లాంటి ఆలోచన కలిగి ఉంది? భారత ప్రభుత్వం విప్లవకారులపైన చివరి యుద్ధం చేస్తున్నాం అని ప్రకటించి దండకారణ్యాన్ని చుట్టుముట్టిన ఇవ్వాల్టి నిర్బంధ సందర్భంలో రాగో ఇంకా జైనిగానే ఉందా? తాను ఏం కోరుకుంటుంది?. ఇంకా మిగిలి ఉన్న ప్రశ్నలు......

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ప్రతాప రుద్రుడు చారిత్ర నవల - సామాజిక చైతన్యం

- జబ్బు మధు
జూనియర్ లెక్చరర్, తెలుగు.

**రచయిత పరిచయం :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో రచయితగా, నవలా కారుడుగా, కథకుడుగా ప్రసిద్ధిగాంచిన కవి ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు గారు. వీరు తెలంగాణలోని ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1943లో జన్మించారు. తండ్రి రమణారావు, తల్లి పద్మావతి. ఉపాధ్యాయునిగా పని చేస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో బి.ఎ., ఎం.ఎ. పూర్తి చేశారు. సమాజంలోంచి వైవిధ్యమైన, విశేష మైన ఇతివృత్తాలను ఎన్నుకొని చారిత్రక, సామాజిక అంశా లతో రచనలు కావిస్తున్నారు. వీరు రచనా వ్యాసంగానికి ముందు సినిమా రచయితగా సుప్రసిద్ధులు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రశంసలు, బహుమతులు పొందిన మాభూమి, రంగుల కల, మట్టి మనుషులు చిత్రాలకు సహరచయితగా పనిచేశారు. ఆంగ్ల సాహిత్యంలో విద్యనభ్యసించిన ఎస్.ఎం.ప్రాణ్‌రావు గారు ఇప్పటి వరకు మొత్తం 24 రచనలు చేశారు. అందులో ఒక కథా సంపుటి, రెండు కవితా సంపుటాలు, రెండు నాటకాలు, పందొమ్మిది నవలలను వెలువరించారు. పర్యావరణం మీద వచ్చిన తొలి తెలుగు నవల నీలి పాప ఈయనదే కావడం విశేషం. ప్రాణ్‌రావు గారు రాసిన "మలగనిబత్తి' నవల తెలుగు విశ్వవిద్యాలయం నుండి కీర్తి పురస్కారాన్ని 2012 సంవత్సరానికి గాను అందుకుంది. రుద్రమదేవి, మహామంత్రి మాదన్న, ప్రతాపరుద్రుడు, మాలిక్ కాఫర్ లాంటి చారిత్రక నవలలను రాసి తెలుగు ప్రజలకు చరిత్రను మరింత దగ్గర చేసిన కవి ప్రాణ్‌రావు గారు.

**ఉపోద్ఘాతం :**

చారిత్రక నవల కేవలం ఆ రాజు యుద్ధాలను, గెలుపోటములను, ఆ రాజ్య వైభవాన్ని మాత్రమే కాకుండా ఆ రాజ్యం సామాజికంగా సాధించిన ప్రగతిని, ప్రజల స్థితిగతులను వివరిస్తాయి. గతంలో జరిగిన సంఘటనలు, వ్యక్తుల జీవితం, సామాజిక పరిస్థితులను కథారూపంలో చిత్రిస్తూ, నేటి తరానికి ఆలోచనాత్మక దృష్టిని అందిస్తాయి. ఈ నవల కూడా చరిత్రను సజీవంగా మార్చడమే కాక, సమాజంలో మార్పుకు ప్రేరణనిస్తాయి.

మొదటిగా చారిత్రక నవలలు సామాజిక అస మానతలను వెలుగులోకి తెస్తాయి. రాజులు, యోధుల కథలతో పాటు సామాన్య ప్రజల కష్టాలు, వారి పోరా టాలు కూడా ఈ నవలల్లో ప్రతిబింబిస్తాయి. దళితులు, మహిళలు, రైతులు వంటి అణగారిన వర్గాల జీవితాలను చూపించడం ద్వారా సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను పాఠకుల మనసుల్లో నాటుతాయి.

ఇవి దేశభక్తి, స్వాభిమానం వంటి భావాలను పెంపొందిస్తాయి. స్వాతంత్ర్య సమరయోధులు, ధైర్యవంతులైన నాయకుల గాథలు చదివినప్పుడు పాఠకుల్లో దేశం పట్ల ప్రేమ పెరుగుతుంది. తమ సాంస్కృతిక వారసత్వంపై గర్వం కలుగుతుంది.

చారిత్రక నవలలు సామాజిక సంస్కరణలకు దోహదం చేస్తాయి. కులవ్యవస్థ, బాల్యవివాహం, స్త్రీల అణచివేత, వేశ్యవృత్తి, దేవదాసి వంటి దురాచారాలను చిత్రిస్తూ, వాటికి వ్యతిరేకంగా స్వరాన్ని లేపుతాయి. ఈ విధంగా పాఠకులను ఆలోచన చేయిస్తూ, మార్పు దిశగా నడిపిస్తాయి. ఒక రాజు బలం ధనాగారాల్లో కాదు ప్రజల గుండెల్లో ఉంటుంది. ఆ రాజు యొక్క సామాజిక బాధ్యత ఆయన చేసే మంచి ద్వారా వ్యక్తీకృతమవుతుంది. ప్రాణ్‌రావు రచించిన ఈ నవల కూడా ఈ కోవకు చెందిందే. ప్రతాపరుద్రుడు తన రాజ్యక్షేమం కోసం, ప్రజల కోసం తీసుకున్న నిర్ణయాలు ప్రతాపరుద్రుని కీర్తిని మరింత పెంచాయి.

అప్పటివరకు ఉన్న పాత విధానాలను కాదని మొత్తం రాజ్యాన్ని 72 నాయంకరాజులుగా విభజించి, ప్రతి నాయంకరానికి ఒక నాయకుడిని నాయంకరునిగా నియమిస్తాడు. (ప్రతాపరుద్రుడు నవల పుట.24). సామంతులలో కొందరికి ఈ కొత్త విధానం ఇష్టలేకపోయినా, పరిపాలనను ప్రజలకు మరింత దగ్గరకు చేయడం కోసం, అదేవిధంగా రాజ్య క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయాన్ని తీసుకోగలిగాడు. ఇది సామాజికంగా ప్రజలకు ఉపయోగకరమైన ఎంతో గొప్ప నిర్ణయంగా భావించవచ్చు. కాకతీయులు రాజ్యాన్ని నాయంకారాలుగా విభజించాలని అనేక శాసన ఆధారాలు కూడా కలవు. కావున నవలాకారుడు చేసిన కల్పితం మాత్రం కాదు. అంతేగాక నాయంకరులుగా అనేక కులాల వీరులను నియమించి అందరినీ సమానంగా చూశాడు.

యుద్ధంలో వీరులు కేవలం రాజకుటుంబీకులు మాత్రమే పాలుపంచుకోరు. సబ్బండ వర్గాల ప్రజలు యుద్ధంలో పాల్గొని, తమ రాజును, రాజ్యాన్ని, ప్రజలను కాపాడుకోవడానికి యుద్ధం చేసి తమ దేశభక్తి నిరూపించుకుంటారు. ఇలాంటి గొప్ప వీరులను కన్న కాకతీయ రాజ్యం మరియు ప్రతాపరుద్రుడు ఆ వీరుల కోసం కార్చిన కన్నీళ్లు రాజుకు ప్రజల పట్ల పోరాట వీరుల పట్ల ఆయన ప్రేమకు నిదర్శనం. గెలిచిన సంతోషమే కానీ పోయిన ప్రాణం గురించి ఆలోచించే రాజులు చాలా అరుదు. కానీ ప్రతాపరుద్రుడు చనిపోయిన వారికి గుర్తుగా వీర గల్లులు మరియు భర్తల మరణాన్ని చూసి తట్టుకోలేక వీరమరణం పొందిన వారి భార్యలకు సతీ గల్లులు నిర్మించి, వారి ఆత్మకు శాంతి కలిగేలా చేసి, ఎల్లప్పుడూ వారందరినీ సమాజం గుర్తుంచుకునే విధంగా చేశాడు. (ప్రతాపరుద్రుడు నవల పుట.47).

ఇప్పటికీ అనేక గ్రామాలలో కాకతీయులనాటి వీరగల్లులను మరియు సతి గల్లులను కూడా చూడవచ్చు. మా గ్రామానికి దగ్గరలో ఉన్న పేరూరు గ్రామంలో అనేక వీర గల్లులు బయటపడి ఆనాటి కాకతీయ వీరులు త్యాగాలను మాకు వివరిస్తూ మాలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయి.

నేటి ఆధునిక సమాజంలో అనేక మంది యువతులు కడుపుకూటికోసం వేశ్యలుగా మారి ధనాన్ని ఆర్జిస్తున్నారు. ఈనాడు ఇది కనిపించని నిజం కాగా ఆనాడు కనిపించే నిజం వేశ్యవృత్తి. ఈ నవలలో వేశ్యవృత్తి ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించుకున్న తారామని కూతురు మాచల దేవి పాత్ర వేశ్యవృత్తికి వ్యతిరేకంగా "నేను వేశ్యవృత్తిలోకి ప్రవేశించడం జరగని పనమ్మా" అంటూ తన తల్లిని ఎదురించిన తీరు ఆమె సామాజిక చైతన్యానికి నిదర్శనం. ముకుర వీక్షణం (కన్యత్వాన్ని డబ్బుకోసం పోగొట్టుకునే తంతు) ధనవంతుడైన వ్యాపారి లింగాల అప్పయ్య ఇస్తున్న ధనానికి ఆశపడి తన కన్యత్వాన్ని పోగొట్టుకోకుండా వేశ్యవృత్తి అనే దురాచారాన్ని ఈసడించుకొని ఎదిరించిన ధీశాలి మాచల దేవి. (ప్రతాపరుద్రుడు నవల పుట.62).

ఆనాటి రాచరిక సమాజంలో మార్పు కోసం తన గొంతును వినిపించిన మాచల దేవి లాంటి వేశ్యవృత్తి కుటుంబానికి చెందిన యువతిని ప్రతాపరుద్రుడు లాంటి గొప్ప రాజు ప్రాణం కంటే మిన్నగా ప్రేమించడం ఆయన

లోని ఆదర్శభావాలకు నిలువెత్తు రూపం. తాను ప్రేమించిన మాచల దేవిని ఈ నవల పర్యంతం ఎక్కడా చిన్న చూపు చూడలేదు. తమ ఇరువురి ప్రేమలోని నిజాయితీ, నిస్వార్థం కారణంగానే మాచల దేవి తన తల్లి ద్వారా వచ్చిన ధనాన్ని తన కోసం కాకుండా ఇది ప్రజల ధనంగా భావించి ప్రతాపరుద్రుడు సహాయంతో ఒక ఆలయాన్ని నిర్మించి అనేక మందికి ఉపాధిని కల్పించింది. తన సామాజిక బాధ్యతను నెరవేర్చింది. తన ప్రియుడు యుద్ధంలో పోరాడుతున్నాడని తెలిసి తన ప్రేమ బతకాలని దైవం సమక్షంలో నాట్యం చేస్తూ శత్రువుల దాడిలో ప్రాణాలను కోల్పోయిన తీరు ఆమె ద్వారా సమాజానికి ప్రేమ యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది. ((ప్రతాపరుద్రుడు నవల పుట.211). దేవగిరి రామచంద్రుడి రాజ్యంపై అల్లా ఉద్దీన్ ఖిల్జీ సైన్యం దాడికి పాల్పడగా ఆ యుద్ధంలో రెండు మండలాలను పరిపాలిస్తున్న ఇద్దరు వీరవనితలు శత్రువులను ఎదుర్కొని బందీలు కాబడతారు. (ప్రతాపరుద్రుడు నవల పుట.83). ఈ సంఘటన ద్వారా ఆనాడు పాలకులు పురుషులకు మాత్రమే కాదు స్త్రీలకు కూడా అధికారాన్ని అప్పగించారని వారు ఎంతో చైతన్యవంతంగా ఉండి పరిపాలన సాగించడంతో పాటు యుద్ధ రంగంలో తమ ప్రతిభను కనబరిచారు అనే విషయం అర్థమవుతుంది. ఇది నేటి స్త్రీలకు వారి ఏకలిను గుర్తు చేస్తుంది.

శత్రు రాజులు తమ రాజ్యంపై దాడి చేయ చూస్తే కేవలం రాజు, మంత్రులు, సామంతులు మాత్రమే కాక ఆ రాజ్యంలోని గిరి పుత్రుడు సైతం గొడ్డళ్లు పట్టి పోరు సల్పుతారని, దేశభక్తితో పూనకాలు ఊగుతారని వివిధ పాత్రల ద్వారా ఈ నవల మనకు తెలియజేస్తుంది. సమాజంలో కేవలం వ్యక్తులు, కుటుంబాలు మాత్రమే కాకుండా వారికంటూ ఒక మతం, ఒక జీవన విధానం, ఆచార వ్యవహారాలు ఉంటాయి. పాల్కురికి సోమనాథుడు లాంటి కవులు శైవాన్ని తన రచనల ద్వారా ఇతర మతాలను విమర్శిస్తూ, దూషిస్తూ అన్యమతస్తులకు ఇబ్బంది కలిగిస్తుంటే ప్రతాపరుద్రుడు దీనిని ఖండిస్తూ మత సామరస్యాన్ని పటించి రాజ్యంలో అనుచిత పరిస్థితులు ఎదురవకుండా రాజ్యంలోని ప్రజలందరికీ మేలు కోసం తీర్థయాత్రను చేసి పరమత సహనాన్ని కాంక్షించాడు. (ప్రతాపరుద్రుడు నవల పుట.117). సమాజంలో ప్రజలందరి హక్కులను కాపాడాడు. అపర శివ భక్తుడు శివదేవయ్య లాంటి మంత్రి కూడా పాల్కురికి సోమనాథుని విమర్శిస్తూ "ఆయన తన మతాన్ని స్థాపించుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదు కానీ పరమతస్తులను హింసిస్తేనే ఇబ్బంది వచ్చిపడుతుంది" అంటూ తన మతు మాత్రమే కాదు ఇతర మతాలు కూడా స్వచ్ఛగా జీవించాలనేటువంటి ఆకాంక్ష ఆయన మాటల్లో కనిపిస్తుంది. నేటికి కొన్ని ఆధునిక దేశాలు మతసామరస్యాన్ని పాటించకుండా ప్రజల జీవితాలను ఏ విధంగా చిద్రం చేస్తున్నాయో మన కళ్ళ ముందు కనిపిస్తూనే ఉన్నాయి.

అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యాధ్యక్షుడు మాలిక్ కాఫర్ మొదటిసారి కాకతీయ సామ్రాజ్యంపై దండయాత్ర చేసినప్పుడు ఏమాత్రం ధర్మాన్ని పాటించకుండా యుద్ధానికి సంబంధం లేని స్త్రీలను, పిల్లలను, రైతులను అణగారిన వర్గాలను ఊచకోత కోయగా కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుడు ఏనాడు యుద్ధరంగంలో అధర్మాన్ని పాటించకుండా ధర్మాన్ని నిలబెడుతూ క్షమాభిక్ష కోరిన మాలిక్ కాఫర్‌ను విడిచిపెట్టి ధర్మం రాజు యొక్క ప్రథమ కర్తవ్యమని సమాజానికి చాటుతాడు. రెండవసారి మరలా కాకతీయులపైకి యుద్ధానికి వచ్చిన మాలిక్ కాఫర్ తన క్రూరత్వంతో కాకతీయ ప్రజలను క్రూరంగా హింసిస్తుంటే మంత్రుల ద్వారా విషయాన్ని తట్టుకోలేక తనకు రాజ్యము కంటే, తన ప్రతిష్ట కంటే, రాజధాని కంటే, ప్రజల క్షేమమే ముఖ్యమని భావించి సకల సంపదలు మాలిక్ కాఫర్‌కు ధారాదత్తం చేసి ప్రజల మేలును కోరుకున్న రాజుగా ఈ నవల ప్రతాపరుద్రుని చిత్రించి రాజు పరమావధి ప్రజల క్షేమమే అని నిరూపించింది. సమాజ క్షేమాన్ని కాంక్షించారు.

ప్రతాపరుద్రుడు గెలిచిన అనేక యుద్ధాలు కేవలం తనకు మాత్రమే సంతోషాన్ని ఇవ్వలేదు. రాజ్యములోని విప్రవినోధులు, మాల జంగాలు, జముకులు, పూజ గొల్లలు, కోయదొరలు, పిచ్చుక్కుంట్లు వంటి కళాకారులు సంతోషంతో బవనీలు, జవనిక వాయిస్తూ ఊరూరా తిరిగి

ప్రచారం చేశారంటే ఆనాటి సమాజం ఆ రాజు ఏలికలో ఎంత సంతోషంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మేడ రాజు ల ఆంటి గిరిజన యువకులు తృణప్రాయంగా తమ రాజ్యం కోసం సమాజంలో దేశభక్తిని రగిలించడం కోసం చేసిన ప్రాణత్యాగాలు వీర గల్లులై ఓరుగల్లు రాజ్యంలో ప్రజలకు దేశ రక్షణయే తమ పరమావధియని తెలియజేశాయి. "తెలుగు తేజం ఏమిటో ఆమ్లేచ్ఛుడి గుండెల్లో నాటుదాం" (ప్రతాపరుద్రుడు నవల పుట.151). అంటూ సమాజాన్ని ఏకతాటిపై నిలపగలిగాయి. ప్రతాప రుద్రుడు అనేక చారిత్రక నవల రాజుగా ప్రతాపరుద్రుని కర్తవ్యాన్ని మాత్రమే కాకుండా ప్రతాపరుద్రుని సామాజిక బాధ్యతను కార్యదక్షతను అనేక సంఘటనల ద్వారా వివరిస్తూ వచ్చింది. వివిధ పాత్రల ద్వారా సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను ఖండిస్తూ, ప్రజలలో ఉన్నటువంటి దేశభక్తిని రాజ్యం పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేసింది.

**ఆధార గ్రంథాలు :**


1. కాకతీయులు - పి.వి.పరబ్రహ్మశాస్త్రి
2. ఆంధ్రుల చరిత్ర - డాక్టర్ బి.ఎస్.ఎల్.హనుమంతరావు
3. ఆంధ్రుల సంస్కృతి చరిత్ర - కంభంపాటి సత్యనారాయణ
4. ప్రతాపరుద్రుడు - ప్రాణ్‌రావు
5. కాకతీయ శాసన సాహిత్యం - పి.వి.పరబ్రహ్మశాస్త్రి


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శప్తభూమి నవల – దళిత బహుజన జీవన చిత్రణ

– డా॥. ఎం.రాజ్ కుమార్
సహాయ ఆచార్యులు (జా).తెలుగు శాఖ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాద్.

బండి నారాయణ స్వామి రచించిన శప్తభూమి నవల 2017లో ప్రచురితమైన తెలుగు చారిత్రక నవల. శప్తభూమి నవల వర్ణనతో, ఊహాలతో కల్పించిన రచన కాదు. ఇది రాయలసీమ చారిత్రక కథా నేపథ్యంతో మొదలైన నవల. రెండు సంస్థానాల మధ్య వైరంతో మొదలైన కథ. సిద్ధ రామప్ప నాయుడు (హండే రాజు) అనంతపురం సంస్థాన దొర. తాడిమర్రి సంస్థాన రాజు రామప్ప నాయుడు. 18వ శతాబ్దంలో రెండు సంస్థానాల మధ్య నీటి కోసం ఏర్పడిన యుద్ధం.

1775 ప్రాంతంలో అనంతపురం సంస్థానాన్ని హండే రాజు సిద్ధ రామప్ప నాయుడు పరిపాలిస్తుంటాడు. తన శత్రువులైన తాడిమర్రి సంస్థానం వారు బుక్కరాయ సముద్రం చెరువుకు గండి పడేటట్లు చేసి అనంతపురం ముంచి వేయాలని కుట్ర పన్నుతారు. బిల్లె ఎల్లప్ప అనే గొర్రెల కాపరి సాహసంతో వారి కుట్రను భగ్నం చేస్తాడు. హండే రాజు సంస్థానాన్ని కాపాడి రాజు ఆదరణ పొందుతాడు. బిల్లె ఎల్లప్ప చేసిన సాహసానికి జెట్టి అనే రాజ్య పదవి పొందుతాడు. కొన్ని గ్రామాలకు అమర నాయకుడు కూడా అవుతాడు.

తన మేనమామ కూతురైన ఇమ్మడమ్మ అనే అమ్మాయిని ఇష్టపడతాడు. అయితే ఆమెకి కోడెనిలడు అనే మరొక బావ మీద ప్రేమ ఉంటుంది. రాజ పదవి చూపి బిల్లే ఎల్లప్ప ఇమ్మడమ్మను ఇమ్మని ఆమె తండ్రి బాలకొండ బీరప్పను అడుగుతాడు. అతను భార్యకి ఇష్టం లేకపోయినా తమ ఊరిలో గతంలో కరువు వచ్చి నీళ్ల లేక పిల్లలకి ఆహారం లేక ఒక పిల్లని సానివారికి అమ్ము కోవడం గుర్తు వచ్చి నీరు లేని కొండాపురంలో ఉండే నీలడి ఊరికి పిల్లను ఇవ్వడం కంటే నీళ్లున్న చెర్లోపల్లిలో ఉండే ఎల్లప్పకే కూతురిని ఇవ్వడం మంచిదని గట్టిగా చెప్పి భార్యని ఒప్పిస్తాడు. ఎల్లప్పను పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేని ఇమ్మడమ్మ కోడేనీలడికి కబురు చేసి అతనితో వెళ్లిపోతుంది. కోడేనీలడి మీద కుల పంచాయతీ పెడ తాడు ఎల్లప్ప. కోడేనీలడు అంటేనే ఇష్టమని తెలిసి ఇద్దరు ఆమె కోసం పోటీపడాలి అని రాజు అనుమతి కోసం అనంతపురం బయలు దేరుతారు. కానీ ఎల్లప్ప మోసం చేసి కోడేనీలడిని బంధిస్తాడు. కుల పంచాయతీ తీర్పుకి తలవంచి ఎల్లప్పని పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది ఇమ్మడమ్మకి. ఎల్లప్పకి భార్య మనసు తెలియదు కానీ ఆమెను బలవంతంగా తాకడు.

కోడెనీలడు ఊరు వదిలి వెళ్ళిపోయి ఒక ఊరికి దేవరపోతు అవుతాడు. అంటే అతను ఎక్కడికి వెళ్లినా ఏం చేసినా ఎవరు ఏమీ అనకూడదు. ఆ ప్రాంతంలో

ఊరిని పరిపాలన చేసే హరియక్క అనే ఆమెను పెళ్లి చేసుకుంటాడు. హరియక్క తన తండ్రిని (చిత్రలింగ నాయకుడు) చంపిన పెమ్మసాని నాయకుడును మల్ల యుద్ధంలో చంపిన బలమైన యోధురాలు. హరియక్క మాంగల్యం కోసం సిడిమాను ఎక్కుతుంది ఒక జాతరలో. ఈ విషయం తెలిసి ఇమ్మడమ్మకి కోడేనీలడి మీద ఉన్న ప్రేమ కోపంగా మారుతుంది. కాలక్రమంలో ఇమ్మడమ్మ భార్యగా ఎల్లప్పకి దగ్గర అవ్వాలి అను కుంటుంది. ఎల్లప్ప ఊరిలో జాతర కోసం ఉంచిన వస్తువును కోడేనీలడు ఎత్తుకుపోతుంటే ఎల్లప్ప కోడేనీలడిని ధర్మంగా కాకుండా అతని మీద మనసులో ఉన్న కోపంతో చంపుతాడు. అదే రాత్రి ఇమ్మడమ్మను బలత్కారం చేస్తాడు. తర్వాత సిగ్గుపడతాడు తను చేసిన పనికి. ఆ తరువాత ఇమ్మడమ్మ పుట్టింటికి వెళ్లిపోతుంది. అప్పుడు కూడా ఇమ్మడమ్మ కోసం బిల్లే ఎల్లప్ప బతిమాల తాడు. కానీ ఆమె పుట్టింట్లోనే ఉంటానని అంటుంది. ఎందుకంటే తను ప్రేమించిన కోడెనీలడిని ఎల్లప్ప చంపాడు అనే అసహ్యం వల్ల. కొన్నాళ్లకి కులాచారం ప్రకారం మరో పెళ్ళి చేసుకుంటుంది. ఎల్లప్ప కూడా మరో పెళ్లి చేసుకుంటాడు.

హాండే రాజుకి పద్మసాని అనే దేవదాసితో సంబంధం ఉంటుంది. లక్ష్మీ పండుగ రోజు రాత్రి పద్మసానిని సొంతం చేసుకుంటాడు. ఈ పద్మసానికి మన్నారు దాసు అనే కొడుకు, నాగసాని అనే పెంపుడు కూతురు ఉంటారు. కాలక్రమంలో మన్నారుదాసు రాజు మీద విరక్తితో ఆంగ్లం నేర్చుకుని క్రైస్తవం తీసుకుంటే, నాగసాని దేవదాసి అవుతుంది. ఈమె ఇమ్మడమ్మ తండ్రి బాలకొండ బీరప్ప కరువుకాలంలో సానివారికి అమ్మేసిన పిల్ల అని కాలాం తరంలో తెలుస్తుంది. నాగసాని తన అన్న స్నేహితుడైన బ్రౌన్ దొరను ఇష్టపడుతుంది. మన్నారు దాసు ఒక క్రైస్తవ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. రాజు వేరే అమ్మాయిని చేరదీయడంతో అతని మీద విరక్తి వచ్చిన పద్మసాని, తనకి ఉన్న డబ్బు దానం చేస్తూ జక్కుల పేరుతో చెరువు తవ్వించి, తన ఉరికి జక్కలూరు అనే పేరు పెడుతుంది. నాగసాని తన కన్న తల్లి కోసం మళ్లీ ఊరు వెళ్తుంది. అయితే ఆమె కరువు వల్ల చనిపోయిందని తెలిసి తిరిగి వచ్చేస్తుంది. తండ్రిని చూసినా ఆమె హృదయంలో ఏమీ ఆర్ద్రత ఉండదు. ఇమ్మడమ్మ ఏడు పెళ్లిళ్లు చేసుకుంది అని తెలిసి ఆమెపై కూడా విరక్తిని ఏర్పరచుకుంటుంది.

సమాంతరంగా అగ్రహారం అనే ఊరిలో నాగప్ప ప్రెగడ అనే బ్రాహ్మణ పాలకుడు ఊరిలో పెత్తనం చెలాయిస్తూ అరాచకాలు చేస్తూ ఉంటాడు. తనకు అక్కడ మాట్లాడే హక్కు లేని కారణంగా మౌనంగా ఉంటాడు హండే రాజు. నాగప్ప అనే మరో క్రూరుడు అన్నగారు చనిపోతే వదినను లోబరుచుకొని అన్న ఆస్తిని కరిగిస్తూ ఊరి మీద దేవుడి పేరుతో అరాచకాలు చేస్తూ ఉంటాడు. అన్న కూతురికి 12 ఏళ్ళ వయసులోనే భర్త చనిపోతే బలవంతంగా సతీసహగమనం చేయిస్తాడు. అదే ఊరిలో ఉండే మరో 12 ఏళ్ళ బాలుడు తన బావ అయిన మాదిగ గురవప్పను కొత్తగా పెళ్లయిన అతని అక్కను, పరసలో బలవంతంగా గుండు గీయించి ఊరేగింపు జరుగుతుంటే ఏమీ చేయలేక ఊరి నుండి పారిపోయి శివయోగి అవుతాడు. ఒక బ్రాహ్మణుడి వద్ద చదువుకొని తను బ్రాహ్మణుల ఇంట్లో పుట్టానని చెప్పి గురువు కూతురిని పెళ్లి చేసుకుంటాడు. నిడు మామిడి స్వామి అనే పేరుతో తన ఊరి మాదిగలలో చైతన్యం తెస్తాడు. శుభ్రత, చదువు నేర్పిస్తాడు. మూఢనమ్మకాలు ఎదిరించేలా వారిని తయారుచేస్తాడు. నాగప్ప అరాచకాలు తట్టుకోలేక వృత్తి పని వారు ఊరు వదిలి జక్కలూరు వెళ్లిపోతారు. రాణి పద్మసాని ఆ పని వారు చేసిన అప్పులు తీర్చి జక్కలూరులో ఆశ్రయం ఇస్తుంది వారికి. వారి మీద బందిపోట్లు దాడి చేస్తే ఒక్కడే ఎదిరించి చనిపోతాడు మంగలి గంగన్న. అతని వెనకే సహగమనం చేస్తుంది అతని భార్య గైరమ్మ.

ఈ కథలో మరో దుర్మార్గుడు వీరనారాయణరెడ్డి. హండే రాజు అంటే కోపం ఉన్న తాడిమర్రి వారి మీద యుద్ధానికి వెళతాడు జెట్టి వీరనారాయణ రెడ్డి కొడుకు వీర నాగిరెడ్డి. అయితే అతని దూకుడు వల్ల అతనికి నష్టం వచ్చి హాండే రాజు ఎదురు సుంకం చెల్లించి

విడిపిస్తాడు. తర్వాత దొంగల దాడిలో అతడు చని పోతాడు. అతని భార్యని బలవంతపు సహగమనం నుండి ఒక ముస్లిం పాలకుడు రక్షించి పెళ్లి చేసుకుంటాడు. అతని సోదరుడు ఎర్ర నాగిరెడ్డి భార్యని ఊరిని దోచు కోవాలని వచ్చిన దొంగల నాయకుడు కంబళి శరభుడు తన భార్యని లోబరుచుకున్నాడనే కోపంతో బలత్కారం చేస్తే గతిలేక ఆమె అతనితో వెళ్లిపోతుంది. అవమానం తట్టుకోలేక ఎర్ర నాగిరెడ్డి ఆత్మహత్య చేసుకుంటాడు. ఊరిలో పేదల భార్యలను బలత్కారం చేసి, పేదల కూతుర్లను బసివినిగా మార్చే వీరనారాయణ రెడ్డి కుటుంబం ఇలా వంశ నాశనం అవుతుంది.

కొన్ని నెలలకు హండే రాజు పాలించే అనంతపురం ప్రాంతంలో కరువు వస్తుంది. హైదర్ అలీ చనిపోయాక ఆ ప్రాంతం అతన్ని కొడుకు పాలన కిందకు వస్తుంది. సుంకం బాకీ కోసం హండే రాజును నిలదీస్తాడు టిప్పు సుల్తాన్ ప్రతినిధి. కొంత బాకీని అప్పులు చేసి తీర్చి ఎల్లప్ప ఆధీనంలో ఉన్న గ్రామాన్ని తాకట్టు పెడతాడు హండే రాజు. ఆనందంగా ఒప్పుకుంటాడు ఎల్లప్ప. కరువు తీరాలి, హండే రాజు బాగుండాలి అని మల్లన్న వీరమంటపం ఎక్కుతాను, ఆత్మ బలిదానం చేస్తాను అని మొక్కు కుంటాడు ఎల్లప్ప జెట్టి.

ఇమ్మడమ్మ ఈ నిర్ణయాన్ని ఇష్టపడి అతన్ని మళ్ళీ పెళ్లి చేసుకుంటుంది. ఈసారి వారిలో ఏ వికారాలు ఉండవు. అన్న మాట ప్రకారం నిగ్రహం పాటిస్తూ శ్రీశైలం చేరి వీరమంటపం ఎక్కి ఆత్మ బలిదానం చేసుకుంటాడు ఎల్లప్ప జెట్టి. కొన్ని క్షణాల ముందు గొర్రెల కాపరిగా మొదలైన తన జీవితం జెట్టిగా, అమర నాయకుడిగా, ఇమ్మడమ్మ భర్తగా ఇన్ని మలుపులు తిరిగి రాజు కోసం శివుడికి సమర్పణ అవుతున్న తన జీవితం ధన్యమైందని భావిస్తాడు ఎల్లప్పజెట్టి.

ఎల్లప్ప జెట్టి ఊపిరి ఆగిపోయాక ఉరుములు, మెరుపులు వస్తాయి అనంతపురంలో. కానీ వర్షం రాదు. కరువు వల్ల అనంతపురం హండే రాజు టిప్పు సుల్తాన్‌కు తన రాజ్యాన్ని అప్పగిస్తాడు. కాలక్రమంలో రాయలసీమ నిజాంలో కలుస్తుంది. వారు వదిలించుకున్నాక ఆ ప్రాంతాన్ని తర్వాత బ్రిటిష్ వారి హయాంలో సీడెడ్ ప్రాంతంగా మారుతుంది.

శప్తభూమి నవల 18వ శతాబ్దపు రాయలసీమ ప్రాంతపు పాలేగాళ్ళ కథ. అప్పటి రాజకీయ, సామాజిక పరిస్థితులను నిశితంగా పరిశీలించి రాసిన చారిత్రక నవల. రాయలసీమ ప్రాంతంలో ఉన్న ఊళ్ళని, వాటి పేర్ల ఆధారంగా చరిత్రని పునర్ నిర్మించి ఆ ఊర్లు కూడా పాత్రధారులేమో అన్నంత బిగితో రాసిన కథ. రచయిత బండి నారాయణస్వామి గారు దీనిని రాయలసీమ చారిత్రక నవలగా మొదలుపెట్టి దళిత బహుజన నవలగా రాశానని చెప్పుకున్నారు.

శప్తభూమి నవల రాయలసీమ చారిత్రక నేపథ్యంలో ముడిపడిన కథల సంకలనం. ఈ నవలలో దాదాపు 60 పాత్రల చిత్రీకరణ జరిగింది. ఏ కథలోనైనా కథా నాయకుడు, ప్రతి నాయకుడు ఉంటారు. కానీ, ఈ నవలలో ఏ పాత్రకూ అతి ప్రాధాన్యం ఇవ్వలేదు. అలాగూ ఏ పాత్రకూ ప్రాధాన్యత లోపించలేదు. రాయల సీమ ఆచార వ్యవహారాలను సూచిస్తూ, రాయలసీమ ఆహార వంటకాలను పరిచయం చేస్తూ, రాయలసీమ కుల వృత్తులను చూపిస్తూ, రాయలసీమ సంస్కృతిని, ఆనాటి అరాచక పరిస్థితులను, రాయలసీమ నేల, కరవు వలసలను బండి నారాయణ స్వామి ఈ నవలలో చిత్రీకరించారు.

బండి నారాయణస్వామి గారు రాసిన నవలలు అన్నీ సామాజిక (రాయలసీమ) కోణంలో ఆలోచించి రాశారు. వారు ఈ నవలలో భారతదేశానికి స్వాతంత్రం రాక ముందు రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజల యొక్క జీవన విధానం వారి యొక్క కష్టాలను తెలియ జేశారు. నవలలో దొరల యొక్క పెత్తనందారి వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, పాలెగాళ్ల అరాచకాలు, ప్రజలను హింసించడం, మత మార్పిడి చేయడం, వేశ్యలను బసవనిగా మార్చడం, దేవదాసి వ్యవస్థ, పాలెగాళ్ళ పరిపాలన వంటి అంశాలను చర్చించారు.

శప్తభూమి నవలలో 18వ శతాబ్దం నాటి సమాజిక పరిస్థితులను స్పష్టంగా వివరిస్తుంది. ముఖ్యంగా ఈ

నవలలో కనిపించే అంశం పాలెగాళ్ళ పరిపాలన. వారి పరిపాలనా కాలంలో నమ్మకాల పేరుతో జరిగిన అరాచకాలు, దురాచారాలు, అస్పృశ్యత, సతీసహగమనం, దేవదాసీ వ్యవస్థ, మతమార్పిడి, దళితుల జీవితం, బ్రాహ్మణుల ఆధిపత్యం కులాల మధ్య జీవన వ్యత్యాసం మూఢనమ్మకాలు, సామాన్య ప్రజల దుర్భేద్యమైన జీవితాలను గురించి ఈ నవల తెలియజేస్తుంది.

ఈ నవలలోని సిద్ధ రామప్ప నాయుడు, కరిహుళి బసవప్ప, దళవాయి సుబ్బరాయుడు, విలియం బ్రౌన్, మాడల కందప్ప వంటి వారు ఒకప్పుడు నిజంగా జీవించిన చారిత్రక వ్యక్తులు. ఎల్లప్ప జెట్టి, కోడెనీలడు, ఇమ్మడమ్మ, హరియక్క, పద్మసాని, కోమటి పడుచు, బ్రాహ్మణ ఇల్లాలు, వీరనారాయణరెడ్డి, కంబళి శరభుడు వంటి వారు పైన పేర్కొన్న వారి మాదిరి చారిత్రక వ్యక్తులు కారు, చారిత్రక పాత్రలు. ఈ చారిత్రక పాత్రలు చారిత్రక వ్యక్తుల నుండి కాకుండా చారిత్రక సంఘటనల నుండి సృష్టించారు రచయిత. వీర శిరో మంటపం, గాలి దేవర జాతర, గులిగానప్ప పరస, దేవదాసీ వ్యవస్థ, సతీ సహగమనం వంటి చారిత్రక వాస్తవిక పరిస్థితులను ఈ కల్పిత పాత్రల ద్వారా ప్రతిబింపజేశారు.

పవాడప్ప నాయుడి కాలంలో వకీలుగా ఉన్న రామాజీ ప్రెగడ తన సహ ఉద్యోగి అయిన బోయ తిమ్మప్పతో కలిసి పవాడప్ప నాయుడి మీద కుట్ర పన్నుతాడు. రాజ ద్రోహులైన రామాజీ ప్రెగడ, తిమ్మప్పకు మరణశిక్ష విధించమని ప్రకటిస్తారు. కానీ ధర్మశాస్త్రం ప్రకారం బ్రాహ్మణులకు మరణశిక్ష విధించకూడదన్న ప్రధానుల విన్నపంతో రామాజీకి కారాగార శిక్ష, రెండవ ద్రోహి అయిన తిమ్మప్పకు మరణశిక్ష విధిస్తాడు.

రామాజీ ప్రెగడ చేసిన రాజ ద్రోహాన్ని మరువలేక పోయినా పవాడప్ప నాయుడు బుక్కరాయసముద్రానికి స్వారీ పోయి రామాజీ ప్రెగడ నాలుక కోయిస్తాడు. ఇలాంటి జీవితం జీవించలేనని రామాజీ నాలుకను బుడానికి పేరుకుని చచ్చిపోతాడు. పవాడప్ప నాయుడు ఆ శవాన్ని అక్కడే ఉన్న ఒక ఏడు గుంటలో వేయించి, మన్ను రాయి వేయించి అనంతపురానికి తిరిగి వస్తాడు. రామాజీ ప్రెగడ చనిపోయిన అనంతరం నుంచి పవాడప్ప నాయుడుకి అది బ్రహ్మ హత్యగా వెంటాడుతున్నట్లు కనిపిస్తుంది. బ్రాహ్మణుల సలహా ప్రకారం గోదానం, భూదానం, సువర్ణ దానం లాంటి దానాలు చేస్తాడు. అయినా బ్రాహ్మణ హత్య పాతకం వదలదు. అదిగో! బ్రహ్మ రాక్షసి మీది మీదికి వస్తూ ఉంది. గొంతు పట్టుకుంటుంది, అని తన గొంతు తానే పిసుక్కొని చచ్చిపోతాడు. ఈ విధంగా బ్రాహ్మణులను శిక్షిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు అన్నట్లు రచయిత చిత్రీకరించారు. ఈ విషయంలో రచయిత ఆలోచన దృక్పథాన్ని అర్థం చేసుకోవడం కష్టం అని ఈ సన్నివేశం తెలుపుతుంది.

సిద్ధ రామప్ప నాయుడు కాలంలో ఎల్లప్ప జెట్టి, వీరనారాయణరెడ్డి ఇద్దరు ముందు సామాన్యంగా ఉంటారు. ఎల్లప్ప గొర్రెల కాపరి. వీరనారాయణరెడ్డిది రైతు కుటుంబం. ఎల్లప్ప వీరనారాయణరెడ్డి ఒకానొక సందర్భంలో హండే సంస్థాన రాజు అయిన సిద్ధ రామప్ప నాయుడుని, వారి సంస్థానాన్ని సాధారణ మానవుడిగా కాపాడినవారు. వారి ధీరత్వానికి, ఉన్న పరాక్రమానికి రాజపదవి అయిన అమర నాయక పదవి పొందుతారు. కానీ అధికారంలోకి వచ్చాక ఇద్దరు తమ తమ వ్యక్తిత్వం ద్వారా ఒకరు అందరి బాగు కోసం ఆత్మార్పణం చేసుకుంటే, ఇంకొకరు తమ పదవి పేరుతో తమ వంశం నాశనం చేసుకుంటారు. ఎల్లప్ప జెట్టి సిద్ధ రామప్ప నాయుడు పట్ల ఎప్పుడు ప్రభుభక్తితో ఉంటాడు రాజ్యం బ్రిటిష్ వారికి కరువు కాటకాల వల్ల బాకీ చెల్లించలేనప్పుడు, తమ హండే సంస్థానం బాగుండాలని, దొర బాగుండాలని, వర్షాలు పడి పంటలు పండాలని, హండే సంస్థానం బాకీ తీరాలని మల్లికార్జున మంటపం ఎక్కి ఆత్మార్పణం చేసుకుంటాడు.

వీరనారాయణరెడ్డి అమర నాయకత్వంలో దళితుల పట్ల వారు చూపించిన వేదనలను ఈ నవలలో రచయిత చూపించారు. కంబళి శరభుడు మాదిగ. ఆ గ్రామంలో చిన్న గుండు, నల్ల గుండు, గండ శిల అనే మూడు గుండ్లు ఉంటాయి. నల్ల గుండును ఎత్తిన మొనగాళ్ళు ఒకప్పుడు ఉండేవారని చెప్పుకునే వారు. ఒకసారి పండుగ

సందర్భంగా వీరనారాయణ రెడ్డి పెద్ద కుమారుడు నల్లనాగిరెడ్డి నల్ల గుండును ఎత్తి ఊరి ప్రశంసలు పొందుతాడు. అది చూసిన కంబళి శరభుడు ఎవరు లేని సమయంలో దానిని ఎత్తాలని పోయి దాని పక్కనున్న గండశిలను ఎత్తుతాడు. అది చూసిన తలారి ఊరి కులపెద్దలకు చెప్పి పంచాయతీ పెట్టిస్తాడు. వీర నారాయణరెడ్డి సమక్షంలో ఈ పంచాయతీ జరుగుతుంది. అతను గండశిల ఎత్తింది నిజమే అయితే మాదిగ ముందు వారు చిన్న చూపుగా ఉండాల్సి రావడం ఇష్టం లేని కులపెద్దలు అగ్ని దివ్వె పరీక్ష పెడతారు. ఆ అగ్ని దివ్వె పరీక్షలో కంబళి శరభడి చేతులు కాలిపోతాయి. దానితో నిజం రుజువు అయిందని సగం గడ్డం గీయించి అతడిని గ్రామ బహిష్కరణ చేస్తారు.

ఇంకా గులిగానప్ప పరస పేరుతో మాదిగల పట్ల అప్పటి నాయకులు చేసిన అత్యాచారాలు, వారితో ప్రవర్తించిన తీరును రచయిత ఈ నవలలో చారిత్రక సంఘటనలను తీసుకొని వివరించారు. బ్రాహ్మణుల ఆధిపత్యం కూడా స్పష్టంగా కనబడుతుంది ఈ నవలలో. ఆస్తుల కోసం సొంత వారిని కూడా వదిలిపెట్టకుండా సహగమనాలు చేయించేవారు. ఆ రోజుల్లో బాల్య వివాహాలు జరిగినట్టు ఈ నవలలో చూపించారు రచయిత.

18వ శతాబ్దంలో మగ్గరి, గానుగరి, ఇల్లరి, పుల్లరి, వీరముష్టి, గణాచారి, అడ్డుకట్ట, వివాహ పన్ను, వంటి పన్నులు వసూలు చేసేవారు. భూస్వాముల ఆధిపత్యం ఎలా ఉండేదో చాలా స్పష్టంగా వివరించారు రచయిత.

రాజు సంస్థానంలో గొప్ప పేరు మోపిన వర్తకుడు అనంతయ్య శ్రేష్ఠి. అలాంటి అనంతయ్య శ్రేష్ఠి కూతురి మీద కూడా సిద్దప్ప నాయుడు అనే దొర అత్యాచారానికి పాల్పడతాడు. ఆ అత్యాచారానికి అతను ఎదురు తిరగలేక తన సంసారాన్ని అనంతపురం నుంచి పెనుగొండకు మారుస్తాడు అనంతయ్య. ఆ తర్వాత సహ ఉద్యోగులతో కలిసి కుట్ర చేసి సిద్దప్ప నాయుడుని చంపిస్తాడు అనంతయ్య శ్రేష్ఠి.

ఈ నవల ద్వారా నాటి హండే రాజుల కాలం నాటి యుద్ధాలు, నాయంకర వ్యవస్థ, ఆ కాలపు రాజకీయ విషయాలు తెలుస్తున్నాయి. గ్రామ మాన్యాలు, చేను మాన్యాలు, అగ్రహారిక గ్రామాలు, వారం సంతలు, వర్తక శ్రేణులు, పన్నులు ఆర్థిక పార్శ్వాన్ని తెలియజేస్తాయి. కులం కట్టుబడులు, కుల పంచాయితీలు, ద్వంద్వ యుద్ధాలు (హరియక్క, పెమ్మసాని తిమ్మప్ప నాయుడు మధ్య మల్ల యుద్ధం జరగడం, గర్భగుడిలో స్త్రీల పట్ల పూజారుల లైంగిక అకృత్యాలు, మాల మాదిగల అస్పృశ్యత, సతీసహగమనాలు ఇవి ఆ కాలపు సామాజిక పార్శ్వాన్ని తెలియజేస్తాయి. పెళ్లి పేరంటాలు, దేవదాసీ వ్యవస్థ, అప్పుడప్పుడే మొదలైన ఆంగ్ల విద్య, అప్పటికి కొనసాగుతున్న కళలు, విద్యలు, ఆ కాలపు సాంస్కృతిక కోణాలను వివరిస్తాయి.

ముస్లిం రాజ్యాలు సతీసహగమనం నిషేధించిన క్రమము (ఈ నవలలో గైరమ్మ తన భర్త చనిపోయాక సహగమనం చేయడానికి సిద్ధమైతే తనని ఆపడానికి విలియం బ్రౌన్ ప్రయత్నం చేస్తాడు, మరొక ఆడపడుచుని బలవంతంగా సహగమనం చేయించడానికి ప్రయత్నం చేస్తే ఆ ఆడపడుచుని కాపాడి ఒక ముస్లిం యువకుడు ఆమెని పెళ్లి చేసుకుంటాడు). వీరాచారం, క్రతువులూ ....ఆ కాలపు మతాన్ని గురించి వివరిస్తాయి.

కురవలు, బోయలు, మాలలు, మాదిగలు, కోమట్లు, విప్రవినోదులు, మోడీ వారు ఇలా ఎంతో మంది బాధిత బహుజన జీవితాల్ని చిత్రించారు. ఒక స్త్రీ సిడిమాను ఎక్కడం, గాలిదేవర, దేవరపోతు, ఏడుగురు భర్తలను మార్చిన గౌడసాని ఇలా ఆనాటి ఆచారాలను కళ్ళకు కట్టింది ఈ నవల. రాయలసీమలోని మంత్ర, తాంత్రిక విద్యలు చర్చను ఒక భాగంలో మాత్రమే రాశారు.

స్త్రీల పట్ల చులకన భావం, స్త్రీలు కేవలం శారీరక సుఖం కోసం మాత్రమే ఉపయోగ పడతారన్న అహంకార భావాన్ని ఆ కాలంనాటి రాజకీయ అరాచక పురుష ఆధిక్యం చెలామణిలో ఉండేదని వివరించారు రచయిత. దేవదాసీ వ్యవస్థ మరియు వేశ్య వృత్తిలో కొనసాగుతూ ఆ వృత్తిపై ఇష్టం లేకపోయినా తన జీవితాన్ని, కుటుంబాన్ని,

ఆర్థికంగా నిలబెట్టడానికి శరీరాన్ని బలవంతంగా అమ్ముకోవాల్సిన పరిస్థితులను మరియు స్త్రీల మానసిక స్థితిగతులను గురించి బండి నారాయణస్వామి ఇందులో మహోన్నతంగా చిత్రించారు.

ఒక్కొక్క సామ్రాజ్యము నుండి మరొక సామ్రాజ్యం అభివృద్ధి క్రమంలో రతనాల సీమ అనిపించుకున్న రాయలసీమ ప్రాంతము వానలు కురవక, చెరువులు ఎండిపోయి పంటలు పండక, కరువు కాటకాలతో ప్రజలు వలస పోతుంటే, కప్పం కట్టలేని హండే రాజు సిద్ధరామప్ప నాయుడు కోటను ముట్టడిస్తాడు, కప్పం కట్టను లేక, యుద్ధానికి దిగలేని స్థితిలో పడిపోతాడు సిద్ధ రామప్ప నాయుడు. టిప్పు సుల్తాన్ తరపున గుత్తి సుబేదార్ అనంతపురం కోట తాళాలు తీసుకుని సిద్ధ రామప్ప నాయుడుని తన దివాణంలోనే ఖైదీ చేస్తాడు.

కాల పరిమాణంలో టిప్పు సుల్తాన్ పోయి నిజాం నవాబు వస్తాడు. నిజాంను వదిలించుకుంటే సీమ దొరలు (ఇంగ్లీషు వారి) పాలబడి సీడేడ్ జిల్లాల క్రిందకి వచ్చిన రాయలసీమ ప్రాంతము దేశీయుల, విదేశీయుల దోపిడీకి గురి అయిన క్రమం అర్థమవుతుంది. ఎంతటి బలవంతులైనా ఎల్లప్ప జెట్టి, పెమ్మసాని తిమ్మప్ప నాయుడు, సిద్దరామప్ప నాయుడు, కోడెనీలడు, ఎర్ర నాగిరెడ్డి, నల్ల నాగిరెడ్డి, రామప్ప వంటి వారు కాల గమనంలోకి కలిసిపోక తప్పదని ఈ నవల ద్వారా అర్థమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగు నవలానుశీలనం - డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి.
2) నవలాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య.
3) తెలుగు నవలల్లో కథాకథన శిల్పం - డా॥ మృణాళిని.సి.
4) పాలపిట్ట మాసపత్రిక 2020 ఫిబ్రవరి
5) మూఢనమ్మకాలు పూర్వాపరాలు - కె. వీరాంజనేయులు

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# నవలా సాహిత్యం - చాకలి వృత్తి నవలలు

- డా॥. పి. దస్తగిరి
తెలుగు అధ్యాపకులు, డి.ఏ.డబ్ల్యు.కళాశాల, ప్రొద్దుటూరు, కడప జిల్లా.

నవలా వస్తువు భిన్నకోణాల్లో విస్తరిస్తున్న క్రమంలోనే విభిన్నమైన వృత్తులకు సంబంధించిన నవలలు వెలువడ్డాయి. నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' (కల్లుగీత వృత్తి), మాదిపూడి సులోచన 'సుషుప్తి' (కుమ్మరి వృత్తి), సుంకోజి దేవేంద్రాచారి 'రెక్కాడినంతకాలం' (ఆచారి వృత్తి) మొదలైన నవలలు వచ్చాయి. అయితే, 'వృత్తి జీవితాన్ని చిత్రించిన తొలి నవల లోక మలహరి రాసిన 'సంఘం' (చేనేత)"[1] అని కోడం కుమారస్వామి తెలిపాడు. ఈ నవల 1955లో ప్రచురింపబడింది. ఆ తర్వాత వివిధ కులవృత్తులను ఇతివృత్తాలుగా చేసుకొని నవలలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే చాకలివృత్తి జీవితాన్ని కూడా నవలా సాహిత్యం ఇతివృత్తంగా తీసుకొచ్చింది. రేఖామాత్రంగా చాకలి ప్రస్తావనలు చేసిన నవలలు కేశవరెడ్డి 'స్మశానం దున్నేరు', 'రాముండాడు రాజ్జి ముండాది', శీలా వీర్రాజు 'మైనా', చిలుకూరి దేవపుత్ర 'పంచమం' వంటివి ఉన్నాయి.

ఒక భూస్వామి అన్నదాన కార్యక్రమం చేస్తూ, వీధిలో నుండి మనుషులను భోజనానికి తీసుకురావడానికి చాకలిని వీధిలో నిలబెట్టే విషయం 'స్మశానం దున్నేరు' నవలలో కనిపిస్తుంది. ఒక రెడ్డి తన ఇంటి చుట్టాల బట్టలు, తన ఇంటి బట్టలు కలిపి లారీమైన బట్టలు చాకలికి వేసి, సాయంత్రానికంతా ఆ బట్టల్ని ఉతికి తీసుకురమ్మంటాడు. కానీ, ఆ చాకలి సాయంత్రానికి బట్టలు తీసుకురాలేకపోతాడు. అందుకు ఆ రెడ్డి చాకలి ఇంటికి తాళం వేసి, ఆ రాత్రంతా ఆ చాకలి కుటుంబం వీధిలోనే పడుంటేటట్లు చేసే సంఘటన 'రాముండాడు రాజ్జిముండాది' నవలలో కనిపిస్తుంది. ఒక నాయుడిగారి అమ్మాయి చాకలి అబ్బాయిని ప్రేమించి తిరుపతికి తీసుకొస్తుంది. ఆ విషయం తెలుసుకున్న అమ్మాయి కుటుంబం వారు చాకలి అబ్బాయిని ఆయుధాలతో తిరుపతి కొండల్లోనే నరికి చంపేసి, ఆ అమ్మాయిని మాత్రం ఇంటికి తీసుకొచ్చుకునే అన్యాయం 'పంచమం' నవలలో కనిపిస్తుంది. పోలీసువాళ్ళు తాము వెదుకుతున్న వ్యక్తి ఆచూకి ఒక చాకలి తన వృత్తి ఆధారంగా తెలిపే విషయం 'మైనా' నవలలో కనిపిస్తుంది.

ప్రధానంగా చాకలివృత్తి మీదే వచ్చిన నవలలు రెండు. 1.రేవు - జి.యస్.చలం 2.ఉతికేసిన బతుకులు - పి.నాసరయ్య. ఈ రెండు నవలల్లో ఇతివృత్తం, పాత్రల ఆధారంగా చాకలివారి జీవితాన్ని పరిశీలిద్దాం.

### చాకలివృత్తి నవలలు - ఇతివృత్త పరిచయం

'ఇతివృత్తంతు కావ్యస్య శరీరం' అన్నారు ప్రాచీన అలంకారికులు. కావ్యానికి శరీరం ఇతివృత్తం అయినట్లే

ఆధునిక కావ్యమైన నవలకు కూడా శరీరం ఇతివృత్తమే. నవల అంటే సంపూర్ణ కథతో కూడింది. ఈ నిర్వచనం చాకలివృత్తి నవలల్లోని ఇతివృత్తానికి కూడా వర్తిస్తుంది. ఇతివృత్తంలో రచయిత చెప్పదలచుకున్న వృత్తికారుల జీవితం సంపూర్ణంగా కన్పిస్తుంది. అందువల్ల చాకలివృత్తి జీవనాన్ని కేంద్రబిందువుగా చేసుకొని రేవు, ఉతికేసిన బతుకులు నవలల్లోని ఇతివృత్తాన్ని తెలుసుకుందాం.

### 1. రేవు - ఇతివృత్తం

పైడాలు, పోలిశెట్టి భార్యా భర్తలు. వారికి పెళ్లీడు కొచ్చిన కూతురు అంకమ్మ, పదేళ్ళ కొడుకు రామిశెట్టి ఉంటారు. అనుకోకుండా పోలిశెట్టి చనిపోతే, ఆ స్థితిలో పక్క ఊరిలో ఉన్న తన మేనల్లుడు ఆదిశెట్టిని ఇల్లరికం తెచ్చుకొని, అంకమ్మనిచ్చి వివాహం చేస్తుంది పైడాలు. ఆలా ఆదిశెట్టి, అంకమ్మలకు కూతురు సిమాలు, ఆ తర్వాత చాలా ఏళ్ళకు కొడుకు బూసిగాడు పుడతారు.

అంకమ్మ తన కూతురు సిమాల్ని, తమ్ముడు రామి సెట్టికిచ్చి పెళ్లి చేస్తుంది. ఆత్మాభిమానం గల రామిసెట్టికి తరచూ ఊళ్ళోని నాయుళ్ళతో గొడవ అవుతూ ఉం టుంది. అలా ఒకనాడు తన చొక్కా తొడుక్కున్నాడన్న కారణంగా, దాలినాయుడు రామిసెట్టిని చెర్నాకోలతో కొడతాడు. వెంటనే అదే చెర్నకోల అందిపుచ్చుకొని దాలినాయుడ్ని తిరిగి కొడతాడు రామిసెట్టి. ఊళ్ళోని నాయుళ్ళంతా కలసి పంచాయతీ పెట్టి, దాలినాయుడ్ని కొట్టినందుకు, అతని కాళ్ళు పట్టుకోమని రామిసెట్టికి చెప్తారు. ఆత్మాభిమానం ఉన్న రామిసెట్టి అందుకు ఒప్పుకోడు. నాయుళ్ళ కులహంకార భావజాలానికి ఊళ్ళో ఇమడలేక, విశాఖపట్నం చేరుకుంటాడు. తనతోపాటు తన అక్క, బావ, అమ్మలకు కూడా తీసుకెళ్ళాలని ప్రయత్నించి విఫలమవుతాడు.

ఇక్కడ ఊళ్ళో రామిసెట్టి సామాజికవర్గమంతా ఉన్న ఊరిని వదలలేక కులవృత్తినే నమ్ముకొని బతుకుతుంటారు. ఎండనక, వాననక రేవులో కష్టపడటం, నాయుళ్ళు పెట్టే పాచిన అన్నంతోపాటు, వారు తిట్టే అనవసరమైన తిట్లను కూడా తింటుంటారు. ఈ క్రమంలో ఊళ్ళోని నాయుళ్ళతో, తమ చాకలి జాతినంతటినీ కూడగట్టి అంకమ్మ పోరాటం చేస్తుంది. తమ జాతివారంతా భయపడినా, తన ధైర్యంతో వారినంతా ఒకతాటిమీద నిలబెడుతుంది. చెరువుకోసం పోరాడి నాయుళ్ళను అందులో దిగకుండా చేస్తుంది. భర్త ఆదిశెట్టిని దొంగగా ముద్రవేయాలని నాయుడు ప్రయత్నించినప్పుడు అడ్డు కుంటుంది. ఆనవాయితీ ప్రకారం నాయుడి ఇంటి నుండి రావాల్సిన పందిరిమంచం రాబట్టుకుంటుంది. మేర గింజలు ఇవ్వనని నాయుడు బెదిరించినపుడు భయ పడకుండా ఎదురు తిరుగుతుంది. అంకమ్మ చైతన్యానికి అహం దెబ్బతిన్న నాయుడు నోట మాట రాకుండానే ఆమెను పొత్తికడుపులో తన్నుతాడు. అప్పుడు అక్కకు ఒంట్లో బాగలేదని సమాచారం అందిన రామిసెట్టి, అంకమ్మను పరామర్శించడానికి కుటుంబంతో పల్లెకు వస్తాడు. తాను ఊరు వదలిన సంవత్సరకాలంలో జరిగిన పరిణామాలన్నీ నారిశెట్టి ద్వారా తెలుసుకొని తమ జాతిలో ఇంతటి మార్పు (చైతన్యం) వచ్చిందా? అని ఆశ్చర్య పోతాడు. తమ చాకలిజాతంతా ఐక్యంగా పోరాడి సాధించుకున్న విషయాలన్నింటినీ తలుచుకొని పాశ్చాత్తాప పడతాడు. దండలో దారంలాగ తానుండి జాతినంతా ఏకతాటికి తీసుకురాకుండా, ఆ దండలోనుండి తానెం దుకు జారిపోయాడోనని బాధపడతాడు. అలా ఆలో చిస్తున్నప్పుడు విశాఖపట్నంలో తాను చూసిన కార్మిక నాయకుడు, అతని మాటలు గుర్తుకు వస్తాయి. అసంఘటిత కార్మికులందరినీ ఐక్యపరిచే అతని మాటలే రామిసెట్టి చెవుల్లో తిరుగుతుంటాయి. తాను కూడా కార్మిక నాయకుడిలాగ తమ జాతినంతా ఐక్యంచేసి పోరాటంతో దేన్నయినా సాధించాలనుకొని, తిరిగి విశాఖ పట్నం వెళ్ళకుండా అక్కడే తమవారి దగ్గరే నిలబడి పోతాడు రామిసెట్టి.

### 2. ఉతికేసిన బతుకులు - ఇతివృత్తం

పేరయ్య అనే వ్యక్తి తాను చదువుకొని తాను పడిన పాట్లు, చదువుకుంటూ పడిన అవమానాలు, అయినా మధ్యలోనే చదువు ఆపేయాల్సి వచ్చిన పరిస్థితులు ఈ నవలలో సహజంగా, వాస్తవంగా కనిపిస్తాయి. సంస్కృతి, సంప్రదాయాలు, చిన్న కులాలపై జరిగే దౌర్జన్యాలు, చూపుతున్న కులవివక్షను పేరయ్య ఎదుర్కొంటాడు.

శాస్త్రీయంగా దృక్పథాన్ని మలచుకుంటాడు. చిన్న వయసులోనే రైతు కూలీ సంఘానికి నాయకుడవుతాడు. అదే సమయంలో రజకుల సమస్యలను తీరుస్తూ, నాయకత్వాన్ని వహిస్తాడు. ఊరిలోని నాయుళ్ళు రజకులపై పన్నుతున్న కుట్రలను, దాడులను ఎంతో చాకచక్యంగా ఎదుర్కొని రజకులను వారి నుండి కాపాడ తాడు. ఎంతో నిరాడంబరంగా, బ్రాహ్మణుడు లేకుండా అభ్యుదయ భావజాలంతో వివాహం చేసుకుంటాడు. తమ డిమాండ్లను సంఘంతో సమ్మె చేయించి సాధిస్తాడు. ఊరిలోని నాయళ్ళందరికీ కంటగింపవుతాడు.

పేరయ్య తన కొడుకు, కూతుర్లకు కూడా వాళ్ళ ఇష్ట ప్రకారం కులాంతర వివాహాలు జరిపిస్తాడు. చదివింది తక్కువే అయినా, సమాజాన్ని ఆకళింపు చేసుకునే పుస్తకాలను చదువుతాడు.

సంఘ నాయకుల పరిచయం పెంచుకుంటాడు. తన వ్యక్తిత్వంతో రాష్ట్రస్థాయి సంఘాల దృష్టిలో పడతాడు. ఊరిలోని రజకులేగాకుండా, బడుగు, బలహీన వర్గాలవారికందరికీ అభిమాన పాత్రుడవుతాడు ఊరి ప్రజలు, సంఘం ప్రోత్సాహంతో ఊరికి సర్పంచ్ అవుతాడు.

**ఆధార గ్రంథాలు :**


1. వృత్తి జీవితాన్ని చిత్రించిన తొలి నవల (వ్యాసం)-కోడం కుమారస్వామి, నమస్తే తెలంగాణ దిన పత్రిక, 5 మార్చి, 2018
2. రేవు (నవల) - జి.యస్.చలం
3. ఉతికేసిన బతుకులు (నవల) - పి.నాసరయ్య


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# రాసాని నవలలు ప్రపంచీకరణ ప్రభావంతో కూలీగా మారిన రైతు

- డా॥. జి. నాగరాజు

తెలుగు అతిథి అధ్యాపకులు, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం.

భారతదేశం ఒక వ్యవసాయ ఆధారిత దేశం. దేశ జనాభాలో 56 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైన ఆధారపడి జీవిస్తున్నారు. తెలుగు సాహిత్యంలో కథకులుగా నవలాకారులుగా సుపరిచితులైన రాసాని గారు 14కు పైగా నవలలు రచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం పరిధిలోని కురవపల్లె గ్రామం వాసి రాసాని. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. గ్రామీణ ప్రాంత మట్టి వాసనను, అక్కడి మనుషుల జీవన పోరాటాన్ని తన రచనల్లో ప్రతిబింబించిన రచయిత డా.వి.ఆర్.రాసాని, వ్యవసాయం అంటే రైతు తన కుటుంబాలను తీర్చడానికి జీవనాధార వ్యవసాయాన్ని చేస్తారు. కేవలం పంటలు పండించడమే అని మనం భావిస్తాం. కానీ వ్యవసాయ సంక్షోభాన్ని, కరువులోని కఠోర వాస్తవాలను ప్రతిబింబించే విధంగా నవలలు రచించారు. రాయలసీమలో పల్లెల్లో కరువులు, కక్షలు, వ్యవసాయ సంక్షోభాలు, కునారిలు పోతూ వలసలకు అలవాటైపోతూ ఉంది. వలసలు వెళ్లిన ప్రాంతాల్లో తమ జీవితాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని తమదైన తనాన్ని వదులుకోలేక నరకయాతన అనుభవిస్తున్న సగటు జీవి రైతు.

భూమిని భూమాతగా కొలుస్తారు రైతులు. జీవనం కొనసాగించుకుంటూ ఆనందపడే గొప్ప వృత్తిగా భావించబడేది వ్యవసాయం.

భూమి మీద ప్రేమాభిమానాలు ఉన్నవారు పండించిన పంటలు చేతికి రాకపోగా, అప్పులపాలైన జీవితాలు జీవితంలో అప్పుల పాలై, పొరుగూరికి వలస వెళుతూ ఉన్న సంఘటనలు నేటి సమాజంలో చాలా ఉన్నాయి. పెంచి పెద్ద చేసిన తమ్ముళ్లు, అన్నని ఎదిరించడం మూలంగా ఇంటి స్థానంలో అన్న ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం దెబ్బతినింది. ఫలితంగా కుటుంబంలో కలహాలొచ్చాయి.

'వలస' నవలలో వ్యవసాయం చేయలేక వలస వెళుతూ బంధువులను పొలం కొనుక్కోవాలని బలభద్రి అనే రైతు భద్రరావతికి వలసపోవాలని నిర్ణయించుకుంటారు. ఆ క్రమంలోనే తన పొలాన్ని కొనుక్కోవాలని దగ్గర బంధువులకు కోరతాడు. అలా కోరడంలో కుటుంబ పెద్ద ఎన్నో కష్టాలను అనుభవిస్తూ తల్లిగా భావించే భూమిని వదులుకుంటూ వలస వెళుతూ..

"ఏంరా... పెద్దోడా? రమ్మంటివంట? చాప పైన నడుం వాల్చుతూ అడిగాడు వరాలయ్య. ఏంలేదు సినాయనా.... నేను గూడా.... భద్రరావతి పోదామను

కుంటామందా? అతనికెదురుగా కూర్చుంటూ అన్నాడు బలభద్రి.

అదేందిరా అట్టంటవీ? ఆశ్చర్యంగా అడిగాడు వరాలయ్య. అవును సినాయన.... పోవాలను కుంటా వుండా! చెప్పాడు బలభద్రి.

ఈడమమ్మలందర్నీ వదిలేసి యట్టబోతావురా?

నేనీడ ఉండలేనులే సినాయనా... పోవడం ఖాయం.... అంతే ఖచ్చితంగా చెప్పాడు బలభద్రి. నువ్వంత ఖచ్చితంగా సెప్తే... నేనేమనేదిలే... నీయిష్టం... నువ్వేడున్నా సుఖంగా వుంటే అంతే సాలు మాకు.

నానేలానట్రా అన్ని అమ్మేయాలనుకుంటా వుండా... ఊరోళ్ళకెందుకు అమ్మేది... భాగంలో మీరే తీసుకోండి... మనమద్దిలో ఏరాయెడి కెందుకు తావివ్వాల?

ఈ కరవు కాలానికి నాదెగ్గిరంత వరుంబడి ఏమీ లేదు... ఏం జేయాల ఆలోచనల్లో పడ్డాడు.

అదంతా నాకు తెలీదు సినాయనా... మీరే కొనుక్కోవాల.. అప్పోసోప్పో చేసి కొనుక్కోవాల...

అంతే నిక్కచ్చిగా చెప్పాడు బలభద్రి అంటూ చిన్నాన్న, కొడుకుల మధ్య జరిగిన సంభాషణను రచయిత చక్కగా తెలిపారు. తాను ఊరువదలి వెళ్ళిపోతూ తన భూమిని ఇతరులకు అమ్ముకొని వెళ్ళితే ఏదోక విషయమై వాళ్ళు గొడవ పడరాదని, దానికి తాను హేతువు కారాదని బలభద్రి భావిస్తాడు. తన బంధువులకే ఇస్తే ఎలాంటి గొడవలు పడరని అతని నమ్మకం. ఇందులో నూరు శాతం సత్యం ఉంది. తమ పొలం మధ్యలోకి ఇతరులను రానివ్వటానికి చాలా మంది అంగీకరించరు. దీనిని కౌటుంబికి వారసత్వ నీతిగా చూడవచ్చు. మానత్వం ఇంకా కొంచెం వుందని చెప్పడానికి ఇదొక నిదర్శనం. ఇలా చేయడం ఆ కుటుంబ వారసులకే కాకుండా అందరికీ మంచిదేనని సామాజిక చైతన్యాన్ని పెంపొందించారు.

వ్యవసాయం చేస్తూ అప్పుల పాలైన కొంతమంది రైతు దళారులుగా మారి కుటుంబ జీవనాన్ని సాగిస్తూ ఉంటారు. కులాన్ని బట్టి కొనసాగించుకునేవారు. తమ కులవృత్తుల వల్ల నేడు వాటిని కొనసాగించలేక పోతున్నారు. అందువల్ల తమకు రాబడి ఉన్న పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

పశువుల సంతలో దళారీ వ్యాపారం చేస్తూ ఉన్న దళారీల చేతిలో రైతు మోసపోతూ ప్రపంచీకరణ ప్రభావంతో ఎదిగిన దళారీ వ్యవస్థను రచయిత రాసాని వివరిస్తూ..

“బాగానే వుండాది గానీ నువ్వేమి యిట్లొస్తివి గట్టి తట్టను నెత్తి కెత్తి పెట్టుకుంటూ అడిగాడు శేరయ్య.

నిన్నొగసూరి సూసి పోదామనే వస్తి.

అంతా వట్టి మాట. ఈడేడన్నా ఎద్దుల బేరం తగిలుం టుంది. అందుకే వచ్చింటావు. గెనింపైన నడుస్తూ అన్నాడు.

నీ దెగ్గిర దాపరికమేముంది గానీ మీ ఊర్లోనే మేజా రోళ్ళింట్లో ఎడ్ల బేరం ఉంది. వాళ్ళు అమ్మి పెట్టమన్నారు. పులిసెర్లలో ఓగాయ నడిగినాడు. ఆ విషయం చెబుదా మనే యలబారినా.

అంటూ దళారీగా పని చేస్తున్న విషయాన్ని తెలియ జేశారు.

రైతులు తమ పశువులను అమ్ముతారు. అమ్మే వారికి కొనే వారికి మధ్య అనుసంధాన కర్తలుగా కొందరు వ్యవహరిస్తారు. వారినే “దళారులు” అంటారు. ఈ దళారులు పొలాల అమ్మకం, పశువుల అమ్మకం, ఇల్లు అమ్మకం వంటి వాటికి ఇరువర్గాల మధ్య ఉంటారు. కొన్ని సందర్భాల్లో రెండు కుటుంబాల కలహాల్లో కూడా మధ్యవర్తులుగా ఉంటూ కొంత డబ్బు వసూలు చేసుకునే వారు. నేడు దళారులు ఇంటింటా ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో అన్ని వర్గాల ప్రజలు పూర్తికాలం. పాక్షిక కాలం దళారుల అవతారం ఎత్తుతు న్నారు. వీరు ఎంత వరకు ఎదిగారంటే వీరి కనుసన్నల్లోనే స్థిరాస్థులు అమ్మకం కొనుగోళ్ళు నూరుశాతం జరుగు తున్నాయంటే అతిశయోక్తి లేదు. ఈ రంగంలో ప్రవేశించిన వారు. కోట్లకు పడగలెత్తిన వారున్నారు. దివాళా తీసి అప్పులపాలై ఆత్మహత్యలకూ పాల్పడినవారూ ఉన్నారు. ఇన్సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేసిన వారూ ఉన్నారు.

ఒకప్పుడు దళారీలు నీతి నిజాయితీగా తమ వ్యవహారాలు కొనసాగించారు. ఆ తరువాత వివిధ కారణాల మూలంగా వీరు కూడా అవినీతికి పాల్పడ సాగారు. దీని ద్వారా అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు అయోమయానికి గురయ్యారని చెప్పవచ్చు. వీరికి లైసెన్స్ కాని, రిజిస్ట్రేషన్ కాని లేకపోవటంతో వారు ఆడింది ఆట, పాడింది పాటగా అయిపోయింది.

రైతులను మోసగిస్తూ ఎదిగిన దళారీలు తమ ఎదుగుదల అనుకుంటారు గానీ రైతులను మోసం చేస్తున్నాననే స్పృహ దళారీకి లేదు. కనబడదు.

వేసిన పంటలు చేతికి రాక పోగా, చేసిన అప్పులు చెల్లించలేక భూములమ్ము కొనుటకు కొందరు ధన వంతుల అప్పులు తీర్చుటకు భూములమ్ముతారు. అలా అమ్ముతున్నప్పుడు సభ్యులు అభ్యంతరం చెబుతారు. ఆ భూములు తమకే కావాలంటారు. ఇతరులు భూముల్లోకి అడుగు పెట్టకూడదంటారు. అయితే అప్పులో భాగం పంచుకొనుటకు అందుకురారు. ఇలా అన్నదమ్ములు, చిన్నాన్న, పెద్దనాన్నలు ద్వంద్వ ప్రమాణాలు చూపుతారు. ఒక వాస్తవ స్థితిని పూర్వాపరాలను చీకటి ముడులు నవల ద్వారా రాసాని గారు ఇలా వివరించారు.

“ఏదో అందరూ బాగా బతకదామని ఆ ముడ్డి ముండాకొడుకు దగ్గర అప్పు దెచ్చి బాయి తవ్వి... బాయిలో బండపడే... నా బతుకులోనూ బండబడే. దానికి నేనేం జేతు. అది నా దరదృష్టం... ఏ దినం నన్ను ఏరు పెట్టేస్తిరో ఆ రోజుతోనే మీకూ నాకు రుణం తీరిపాయ. ఇప్పుడు అదుకోలేని మీకు యిప్పుడు నన్ను నిలదీసి అడిగే అధోటీ లేదు. అం.... ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు బలభద్రి.

వారే పెద్దోడా... మేమనేదది కాదురా....మేముండంగానే నేను పరాయోడికిస్తావే... మన భూమిలోకి ఎవుదో అడుగుపెట్టే అవకాశమిస్తివే... అని అయితే సర్ది చెప్పడానికి ప్రయత్నించాడు వరాలయ్య.

ఇంక ముసుగులో గుద్దులాటెందుగ్గానీ... అన్నా! నువ్వన్నిట్టు అది నీ భూమి... నీ యిష్టం... కాదనడంలే.. కానీ అదింకా రిజిష్టరీ కాలేదు గదా... మన భూమి మనమే దున్నుకుందాం..! మాకిచ్చేయ్.... అన్నాడు కాస్తా సౌమ్యంగానే కన్నయ్య.

నేను మాట తప్పలేనా... నా సేతుగాదు, దృఢంగా చెప్పాడు బలభద్రి.

అంతేనంటావా! స్వరం పెంచాడు కన్నయ్య.

అంతే దృఢంగా అన్నాడు బలభద్రి.

తుం... ఏమి జల్మరానిది. అయినోళ్ళు పోయినోళ్ళంటా ఏమీ లేదు నీకు. నీకు తమ్ముళ్ళ మనుకోవడం మాదే బుద్ధి తక్కువ... ఆవేశంగా అన్నాడు తిమ్మోజీ.

అలా మాటా మాటా పెరిగింది. వాతావరణం మారి పోయింది. ఒకర్నొకరు అశ్లీలంగా తిట్టుకోసాగారు. ఎలాగయినా ఆ భూమిని తమ వశం చేసుకోవాలన్న ఆశ వాళ్ళది.

“ఏది ఏమైనా.... మాట తప్ప కూడదన్న నిర్ణయం ఈతనిది” అంటూ మాట మీద నిలబడే ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని రచయిత స్పష్టంగా పేర్కొన్నాడు. ఉమ్మడి కుటుంబంగా ఉన్నప్పుడు అన్న చేసిన అప్పులు పంచుకొనుటకు ముందుకు రాని తమ్ముళ్ళు. ఆ అప్పులు తీర్చడానికి భూములమ్ముకుంటుంటే మాత్రం అభ్యంతరం చెబుతారు. ఆ భూములు తమకే కావాలని పట్టు పడతారు. అవకాశవాదంతో నడుచుకుంటారు. కుటుంబ పెద్దగావున్న వ్యక్తి చేసిన అప్పు తిరిగి చెల్లించేటప్పుడు కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు దూరమయ్యే అవకాశం ఉంది. అలా చేసి నైతిక విలువలకు, మానవ సంబంధాలకు, కుటుంబ సంబంధాలకు కొందరు పాతర వేస్తున్నారు.

‘వలస’ నవల ద్వారా రాసాని గారు రాయలసీమ నిరంతరం వెంటాడే కరువులు సాగునీటి కొరత కారణంగా వ్యవసాయం గండంగా మారిందని భూమిని వదిలి వెళ్లడం తల్లి. ఒడికి దూరమైన పసికందు వేదనతో పోల్చి చెప్పడం జరిగింది.

వ్యవసాయం పెట్టుబడి పెరగడం మద్దతు ధర లేక పోవడం వంటి కారణాల వల్ల రైతులు సామాజికంగా మరియు ఆర్థికంగా ఎలా వెనుకబడుతున్నారో రైతు కుటుంబాల్లో వచ్చే మార్పులను వివరిస్తూ...

పొలం పని చేసుకునే రైతులు వలస కూలీలుగా ఎలాంటి సామాజిక భద్రత లేకుండా ఉండే పట్టణాలకు వలస వెళ్లే రైతులను, కనీస వేతనం దక్కకుండా ఉండే స్థితిని వలస నవలలో రాసాని గారు వివరించారు.

సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు అయినా భారతదేశంలో పశువులను గోమాతలుగా పూజించడం జరుగుతుంది. అలాంటి పశువుల పండుగలు వాటిని అలంకరించడం మరియు వాటికి ఇచ్చే గౌరవం గ్రామీణ సంప్రదాయాలను సజీవంగా చిత్రీకరిస్తూనే, మారుతున్న కాలంలో పశువులను సాకడం భారంగా మారడం మేత కొరకు మరియు ప్రకృతి వైపరీత్యాల వల్ల పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితిని కూడా హృద్యంగా వివరించారు.

వ్యవసాయ రంగంలో రావాల్సిన మార్పులను, వలస వెళ్తున్న రైతుల జీవితాల పట్ల ప్రభుత్వాలు మరియు సమాజం తీసుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది 'వలస' నవల. వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు. అది ఒక సంస్కృతి అని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈ నవల ఉద్ఘాటిస్తుంది.

బతుకాట నవల వ్యవసాయ రంగంలోకి క్షేత్రస్థాయి వాస్తవాలను సమాజానికి పరిచయం చేస్తుంది.

రైతు జీవన పోరాటమే ఒక బతుకాట అని ఆటలో గెలవడానికి వారు చేసే నిరంతర శ్రమను ఈ నవల గౌరవిస్తుంది.

పరస నవల పశుపోషణ నేపథ్యంగా వచ్చిన అరుదైన నవల వ్యవసాయం అంటే కేవలం పొలం పనులే కాదని, పశువుల సంరక్షణ కూడా అందులో ఒక అంతర్భాగమని, ఇది సామాజిక చైతన్యాన్ని ఆకాంక్షిస్తున్న రచయిత మనోభావాలను వివరిస్తుంది.

చీకటి రాజ్యం నవల కేవలం ఫ్యాక్షన్ కథ మాత్రమే కాదు. అది ఒక రైతు వేదన వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే కేవలం వర్గాలు ఉంటే సరిపోదు. సమాజంలో ప్రశాంతత కూడా ఉండాలని చీకటి రాజ్యం నవల పాత్ర విశ్లేషణ ద్వారా తెలియపరుస్తుంది.

దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతుల జీవిత ప్రతిబింబం మట్టిని ప్రేమిస్తే ఆ మట్టి మనిషిని ఎలా కాపాడుతుందో. అదే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు మనిషిని ఎలా పరీక్షిస్తాయో వివరించే అనేకమైన విషయాలను, నేటి మానవ సమాజానికి వివరిస్తూ విలువలను సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచీకరణ ప్రభావాన్ని గుర్తుచేస్తూ మనిషి ఎలా ఉండాలి ఎలా ఉండకూడదు అనే విషయాలను రాసాని గారూ నవలా సాహిత్యం ద్వారా వివరించి సామాజిక చైతన్యాన్ని ఆకాంక్షించారని తెలుస్తోంది.

**ఆధార గ్రంథాలు :**


1. పరస నవల - విజయవాణి ప్రింటర్స్.
2. చీకటి ముడులు - విజయ వాణి ప్రింటర్స్.
3. వలస నవల  - విశాలాంధ్ర పబ్లిషర్స్.
4. బతుకాట నవల - విశాలాంధ్ర పబ్లిషర్స్.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ‘ఏడు తరాలు’ నవల – బానిస బతుకుల వెతలు

- ఎ. బిందు మాధవి
రచయిత్రి

**ఉపోద్ఘాతం :**

ఒక రచయిత పన్నెండు ఏళ్ల పాటు కష్టపడి ఒకే పుస్తకాన్ని రాశారంటే, ఆ రచన వెనుక ఎంతటి తపన ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. అలెక్స్ హేలి రాసిన ఈ నవల కేవలం ఒక కథ మాత్రమే కాదు, అది ఒక జాతి మూలాల కోసం సాగించిన సుదీర్ఘ ప్రయాణం. “నేను ఎవరు? నా పూర్వీకులు ఎక్కడి నుంచి వచ్చారు?” అనే ఒక చిన్న ప్రశ్న ఆయనను ఖండాతరాలు దాటించింది. అమెరికా, ఆఫ్రికా, ఐరోపా వంటి దేశాల్లో పర్యటించి, పాత రికార్డులను తిరగేసి, ఎంతో మంది అనుభవాలను సేకరించి ఆయన ఈ అపురూపమైన పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకం అమెరికా రాజకీయ, సామాజిక చరిత్రలో ఒక పెద్ద సంచలనాన్నే సృష్టించింది. ఆఫ్రికన్-అమెరికన్ల మూలాలను వెలికితీయడంలో ఈ నవల కీలక పాత్ర పోషించింది. రచయిత సేకరించిన వాస్తవాలకు కొంత కల్పనను జోడించి, చదువరులకు కళ్ళకు కట్టినట్లు వివరించారు. అందుకే ఇది కేవలం చరిత్ర పుస్తకంలా కాకుండా, ప్రతి ఒక్కరినీ కదిలించే ఒక గొప్ప సాహిత్య కావ్యంలా నిలిచిపోయింది. తన మూలాలను వెతుక్కునే ఏ మనిషికైనా ఈ పుస్తకం ఒక గొప్ప స్ఫూర్తినిస్తుంది.

వందల పేజీల నిడివి ఉన్న మూల గ్రంథాన్ని, తెలుగు పాఠకులకు భారం కాకుండా ‘సహవాసి’ గారు అత్యంత ప్రతిభావంతంగా సంక్షిప్తీకరించారు. అసలు కథలోని గాఢత ఎక్కడా తగ్గకుండా, ఆత్మ దెబ్బతినకుండా ఆయన చేసిన ఈ అనువాదం తెలుగు సాహిత్యానికి ఒక ఆస్తి. ఆఫ్రికా మూలాల నుంచి అమెరికా బానిసత్వం వరకు సాగే ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని, తెలుగు చదువరుల హృదయాలకు హత్తుకునేలా శక్తివంతమైన భాషలో ఆయన అందించారు. ఈ కథ ఆఫ్రికాలోని గాంబియా దేశంలో జపూరు అనే పల్లెటూరులో మొదలవుతుంది. అక్కడ ఉమరో-బింటా దంపతులకు పుట్టిన కుంటా-కింటే, తన తాతగారి ఆశయాలకు అనుగుణంగా ధైర్యవంతుడైన యువకుడిగా పెరుగుతాడు. పద్దెనిమిదేళ్ల ప్రాయంలో ఎంతో చురుగ్గా ఉంటూ, తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ, తన బాధ్యతలను నెరవేరుస్తున్న సమయంలో ఒక అనూహ్యమైన ప్రమాదం అతడి జీవితాన్ని మలుపు తిప్పుతుంది. అడవికి వెళ్ళిన కుంటా, తెల్లజాతి వేటగాళ్ల చేతికి చిక్కి బందీగా మారడం ఆ జాతి చరిత్రలోనే ఒక విషాద ఘట్టం.అమెరికాకు బానిసలుగా తరలించే ఆ నాలుగున్నర నెలల సముద్ర ప్రయాణం వర్ణనాతీతమైన నరకాన్ని తలపిస్తుంది. అమానవీయమైన

హింస, ఆకలి, రోగాల మధ్య సగం మంది బందీలు మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతారు. ఆఫ్రికా గడ్డపై స్వేచ్ఛగా తిరిగిన మనుషులు, ఓడ గదుల్లో పశువుల కంటే హీనంగా పడి ఉండి, చివరికి సగం ప్రాణాలతో అమెరికా తీరానికి చేరుకుంటారు. మానవ చరిత్రలో అత్యంత క్రూరమైన బానిసత్వపు చీకటి కోణాన్ని ఈ ఘట్టాలు మన కళ్ళకు కడతాయి.

అమెరికా తీరానికి చేరుకున్నాక కుంటా-కింటే జీవితం మరింత దయనీయంగా మారుతుంది. ఒక వస్తువులా అతడిని వేలం వేసి, ఒక భూస్వామి తన పందులను మేపడానికి కొనుగోలు చేస్తాడు. తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే ఉద్దేశంతో యజమాని అతడికి 'టాబి' అని కొత్త పేరు పెడతాడు. స్వేచ్ఛ కోసం ప్రాణాలకు తెగించి కుంటా ఎన్నిసార్లు పారిపోయినా, వేటకుక్కల కాట్లు, కొరడా దెబ్బలే మిగులుతాయి. చివరికి అతను మళ్ళీ పారిపోకుండా ఉండేందుకు యజమాని అతడి కాలిని నరికివేయడం, బానిస యజమానుల క్రూరత్వానికి పరాకాష్ట. శారీరక వైకల్యం వల్ల పారిపోయే అవకాశం కోల్పోయిన కుంటా, క్రమంగా అక్కడి పరిస్థితులకు అలవాటు పడతాడు. తన చుట్టూ తనలాగే ఎంతోమంది ఆఫ్రికన్లు ఉన్నా, వారంతా వేర్వేరు ప్రాంతాల వారు కావడం వల్ల ఎవరి భాష ఎవరికీ అర్థం కాదు. తన సొంత 'మాండిగో' భాషను మాట్లాడేవారు లేక తీవ్రమైన ఒంటరితనానికి గురవుతాడు.

చిన్న పిల్లల నుండి ముసలివారి వరకు అందరూ బానిసలుగానే పడి ఉండటం చూసి, తన జీవితం ఇక ఈ సంకెళ్ల మధ్యే గడవక తప్పదని అతను చేదు నిజాన్ని అంగీకరిస్తాడు. అటువంటి చీకటి రోజుల్లో 'బెల్' అనే ఆఫ్రికన్ వనిత పరిచయం అతని జీవితంలో కొంత వెలుగును నింపుతుంది. బానిసలందరిలో పెద్దవాడైన 'ఫిడేలయ' సమక్షంలో వారి వివాహం జరుగుతుంది. వారికి పుట్టిన ఆడపిల్లకు తన వంశం పేరు స్ఫురించేలా 'కిజ్జి' అని నామకరణం చేస్తాడు. బానిసత్వంలో పుట్టిన ఆ బిడ్డనే తన ప్రపంచంగా భావించి, ఆమెపై అమితమైన ప్రేమను కురిపిస్తాడు. తన శారీరక బానిసత్వాన్ని అంగీకరించినా, తన మనసులోని స్వేచ్ఛా భావాలను తన బిడ్డ ద్వారా సజీవంగా ఉంచాలనుకుంటాడు. యజమానులు తనను 'టాబి' అని పిలిచినా, రహస్యంగా తన బిడ్డకు తన అసలు పేరు కుంటా-కింటే అని, తమది ఆఫ్రికా ఖండమని, తమ వంశం 'మాండిగో' అని నిరంతరం బోధిస్తుంటాడు. ఎవరికీ తెలియకుండా తన జాతి చరిత్రను, భాషను కిజ్జికి నూరిపోస్తాడు. తన తరం బానిసత్వంలోనే ముగిసిపోయినా, కనీసం తన బిడ్డ మనసులోనైనా తన జాతి గౌరవం, అస్తిత్వం నిలిచి ఉండాలని అతను పడే తపన ఈ కథలో ఎంతో ఉద్వేగభరితంగా కనిపిస్తుంది. కుంటా-కింటే తన కూతురు కిజ్జికి తన జాతి మూలాలను, కథలను ఎంతో ప్రేమగా నేర్పిస్తాడు. అయితే, కిజ్జికి 14 ఏళ్లు నిండాక ఒక బానిస యువకుడికి సహాయం చేసిందనే నెపంతో యజమాని ఆమెను వేరే తెల్లదొరకు అమ్మేస్తాడు. కన్నబిడ్డను తన కళ్ల ముందే వేరు చేస్తుంటే ఏమీ చేయలేని స్థితిలో కుంటా-కింటే అనుభవించిన నరకయాతన వర్ణనాతీతం. తన ఆశలన్నీ పెట్టుకున్న బిడ్డ తన కళ్ళకు కూడా కనబడకుండా పోవడం బానిసత్వంలోని అత్యంత క్రూరమైన కోణాన్ని ఆవిష్కరిస్తుంది.

కిజ్జిని కొనుక్కున్న తెల్ల యజమాని ఆమెను లోబరుచుకోవడంతో, ఆమె ఒక మగబిడ్డకు జన్మనిస్తుంది. ఆ బిడ్డకు 'జార్జ్' అని పేరు పెడతారు. కిజ్జి తన తల్లిదండ్రులకు దూరమై, ఒంటరిగా బానిస జీవితాన్ని గడుపుతూనే తన తండ్రి తన కోసం వస్తాడని ఎదురు చూస్తుంది. శారీరకంగా, మానసికగా కుంగిపోయినా తన కొడుకును పెంచి పెద్ద చేస్తుంది. జార్జ్ కోళ్ళ పందాల్లో మెళకువలు నేర్చుకుని, యజమానికి ఇష్టుడిగా మారి 'చికెన్ జార్జ్'గా పేరు పొందుతాడు. ఆ క్రమంలో తల్లికి దూరంగా కోళ్ళ ఫారంలోనే ఎక్కువ కాలం గడుపుతుంటాడు. ప్రభుత్వం కొన్ని కొత్త చట్టాలను తీసుకొస్తుంది. తమను కొన్న సొమ్మును తిరిగి యజమానికి చెల్లిస్తే బానిసత్వం నుండి విముక్తి పొందవచ్చనే నిబంధన వస్తుంది. దీనివల్ల చాలా మంది ఆఫ్రికన్లు కష్టపడి డబ్బు సంపాదించి స్వతంత్రులుగా మారుతారు. అలా విముక్తి పొందిన వారు మిగిలిన బానిసల హక్కుల కోసం

అమెరికా అంతటా పోరాటాలు సాగిస్తూ, మార్పుకు నాంది పలుకుతారు. కుంటా-కింటే మొదలుపెట్టిన ఈ వంశవృక్షం తరతరాలుగా కొనసాగుతుంది. కుంటా-కింటే మరియు బెల్ దంపతులకు కిజ్జి, కిజ్జికి జార్జ్, జార్జ్ సంతతిగా టామ్, అతనికి ఇరీన్.. ఇలా ఏడు తరాల వరకు ఈ కథ సాగుతుంది. ఈ ఏడవ తరంలో పుట్టిన వారే ఈ నవలా రచయిత 'అలెక్స్ హేలి'. తన తాత ముత్తాతలు పడిన కష్టాలను, వారి మూలాలను వెలికితీసి ప్రపంచానికి చాటిచెప్పాలనే తపనతోనే ఆయన రచించారు. సాధారణంగా చరిత్రలో విజయం సాధించిన వారి కథలే కనిపిస్తాయి. కానీ, బానిసలుగా మారి, హింసను అనుభవించి, సమాజం దృష్టిలో ఓడిపోయిన వారి గురించి కూడా చరిత్ర ఉండాలని రచయిత భావించారు. తమ అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన సామాన్యుల గాథే ఈ 'ఏడు తరాలు'. ప్రతి మనిషికి తన మూలాల పట్ల అవగాహన ఉండాలని, అణచివేతపై తిరుగుబాటు నిరంతరం కొనసాగుతుందని చెబుతూ రచయిత ఈ నవలను ముగించారు.

**ముగింపు :**

అలెక్స్ హేలి రాసిన ఈ నవల కేవలం ఒక పుస్తకం కాదు, అది అణచివేతకు గురైన ఒక జాతి ఆర్తనాదం. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల మన మూలాలను, మన పూర్వీకుల చరిత్రను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో అర్థమవుతుంది. ఆఫ్రికా వాసులు అడవి మనుషులు కాదని, వారు ఎంతో నాగరికంగా, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని గడిపేవారని ఈ రచన నిరూపించింది. అయితే, సొంత మనుషుల మోసం వల్ల, వర్ణవివక్ష అనే మహమ్మారి వల్ల వారు అమెరికాకు బానిసలుగా ఎలా తరలించబడ్డారో రచయిత గుండెలు పిండేలా వివరించారు. ముఖ్యంగా ఆ నాలుగున్నర నెలల సముద్ర ప్రయాణం, కన్నబిడ్డలను దూరం చేసే క్రూరత్వం, శారీరక హింస వంటి అంశాలు సున్నిత మనస్కులను సైతం కలచివేస్తాయి. ఈ పుస్తకం ఆధారంగా తీసిన ధారావాహికకు పది కోట్ల మంది వీక్షకులు లభించారంటే, బానిసత్వం కలిగించే వేదన ఎంతటిదో మనం అర్థం చేసుకోవచ్చు. విజయం సాధించిన వారి చరిత్రలే లోకానికి తెలుస్తాయి, కానీ ఓడిపోయిన వారి పోరాటాలను కూడా భవిష్యత్తు తరాలకు అందించాలనే రచయిత ఆశయం ఎంతో గొప్పది. తన తండ్రి నేర్పిన పాఠాలను గుర్తుంచుకుని, తన వంశం పేరును, ఆచారాలను తన బిడ్డలకు, మనవళ్లకు చెబుతూ మరణించిన కిజ్జి పాత్ర ఈ నవలకు ప్రాణం పోసింది. అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం ఒక వంశంలోని ఏడు తరాలు పడిన కష్టం ఈ పుస్తకంలో మనకు కనిపిస్తుంది. వర్ణవివక్ష లేని సమాజం కోసం, మనిషిని మనిషిగా గౌరవించే రేపటి కోసం ఈ పుస్తకం ఒక పాఠంలా నిలుస్తుంది. పారిపోవడానికి కాలు నరికి వేసినా, మనసులోని స్వేచ్ఛా కాంక్షను మాత్రం ఎవ్వరూ అణచలేరని కుంటా కింటే జీవితం మనకు చాటి చెపుతుంది.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# యండమూరి వీరేంద్రనాథ్ గారి అంతర్ముఖం నవల - సామాజిక దృక్పథం

- డా॥. కొంకా మల్లికార్జున
తెలుగు అతిథి అధ్యాపకులు

యండమూరి వీరేంద్రనాథ్ గారు తూర్పుగోదావరి జిల్లా రాజోలు సమీపంలో జన్మించారు. వీరు నవలా కారుడుగా, సినిమా దర్శకుడుగా, రచయితగా, వ్యక్తిత్వ వికాస ఉపన్యాసకుడుగా తెలుగు వారికి సుపరిచుతుడు. ఈయన 50కి పైగా నవలలు, కథలు, నాటకాలు రచించారు. రచయిత సమాజంలో ఉన్న మానవతా విలువలు, నైతిక విలువలు, సమాజంలో కూడుకట్టుకున్న మూడ విశ్వాసాల మీద తన రచనా ప్రస్థానాన్ని కొనసాగించారు. వీరు రచించిన రఘుపతి రాఘవ రాజారామ్ నాటకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, అదే విధంగా యండమూరి గారు దర్శకత్వం వహించిన సినిమాలు నంది అవార్డులు కైవసం చేసుకున్నాయి. వీరు రచించిన విజయానికి ఐదు మెట్లు తెలుగు సాహిత్యంలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయంటే వీరి రచనలు ప్రజల్లోకి ఏ విధంగా చొచ్చుకుపోయాయో, సామాన్య పాఠకుడి మనసును తాకేలా, ఆలోచింపజేసేలా ఉన్నాయో అర్థం అవుతుంది.

యండమూరి వీరేంద్రనాథ్ గారు వ్రాసిన తులసి దళం, ఒక ఊరి కథ, వెన్నెల్లో ఆడపిల్ల వంటి రచనలు అన్నింటిలో కెల్లా 1992లో రచించిన "అంతర్ముఖం" నవల ఆయన రచనా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ నవల ఫ్రెంచ్ తత్వవేత్త ఆల్బర్ట్ కాము రచించిన "ది అవుట్‌సైడర్" ( ంఫ్ట్రవ ాబ్ంఱసవతీ )" నవల ఆధారంగా రూపొందింది. ఈ రచనలోని సారాంశాన్ని తీసుకుని, తన స్వంత భావోద్వేగాలను, ఆలోచనా విధానాన్ని వేళవించి యండమూరి గారు ఈ నవలను వ్రాశారు. ఇందులో మనిషి ప్రవర్తన, సమాజం విధించే కట్టుబాట్లు, సమాజానికి మనిషి భయపడే విధానం లేదా గౌరవించే తీరు వంటి అంశాలను లోతుగా విశ్లేషించారు.

యండమూరి రచనా ప్రయాణం నవలలతో ప్రారంభమై, సినీ సాహిత్యంవైపు అడుగులు వేసి వ్యక్తిత్వ వికాస తరగతుల ద్వారా యువతలో చైతన్యం నింపడమే కాక కాకినాడ సమీపంలోని సామర్లకోట వద్ద సరస్వతి విద్యా పీఠాలు ఏర్పాటు చేసి అనేక మంది పిల్లలకు అక్షరాభ్యాసం అందించడంలో కూడా ఆయన విశేష కృషి చేశారు.

**అంతర్ముఖం నవల-విశేషాలు :**

ఈ నవల మనిషి మానసిక బంధాల సంక్లిష్టతను అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. మనం స్వయంగా తెచ్చి పెట్టుకున్నవి లేదా సమాజం నుంచి అరువు తెచ్చుకున్న అనేక రకాల బంధాలు, బాంధ్యాలు ఆలోచనలు, బాధ్యతలు ఇవన్నీ మనిషి మస్తిష్కంపై మోపే భారాలను ఈ నవల లోతుగా విశ్లేషిస్తుంది.

"సమాజం ఏమంటుంది?" అనే భయంతో మనిషి పడే తపన, సమాజంలో గౌరవం పొందాలనే కోరిక కోసం చేసే చేష్టలు ఇవన్నీ మనిషిలోని ద్వంద్వ స్వభావాన్ని బయటపెడతాయి. గౌరవం అనే మాట వెనుక దాగి ఉన్న జంతు ప్రవృత్తి, ఏమీ చేయలేని నిస్సహాయత ఒకవైపు, "అన్ని ఉంటే ఏమైనా చేయవచ్చు" అనే బలమైన పశువాంఛ మరోవైపు మనిషిని ఎలా నడిపిస్తుందో రచయిత చక్కగా చూపించాడు.

ఈ నవలలో స్త్రీ పాత్రలు ప్రణవి, మల్లికను, సుశీల ముఖ్యంగా విశ్లేషణకు నిలుస్తాయి. "నేను అమ్మాయిని" అనే కారణంతో సమాజం ఒకవైపు ఇచ్చే హక్కులు, మరోవైపు విధించే పరిమితులు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా ప్రణవి పాత్ర ద్వారా, స్త్రీని ఒక వుస్తువుగా చూడాలనే బలమైన మానసిక కామవాంఛలను రచయిత తీవ్రంగా ప్రశ్నిస్తాడు. అదే సమయంలో ఆ వాంఛల నుంచి తప్పించుకుని ఒకరి గురించి తపించే సున్నితమైన మనసుతో ఉన్న అమ్మాయిగా ప్రణవి మన ముందు నిలుస్తుంది.

స్పర్శ లేకుండానే ఆనందించగల స్వచ్ఛమైన స్నేహం, శారీరక ఆకాంక్షలకు అతీతంగా వికసించే ఉత్కృష్టమైన ప్రేమ, ప్రేమించిన వాడి కోసం జీవితాన్నే త్యాగం చేయగల మహోన్నత వ్యక్తిత్వం ఇవన్నీ ఈ నవలలోని ప్రేమ భావనను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తాయి. ఇక్కడ ప్రేమకు రూపం లేదు. వ్యక్తిత్వానికి శరీరంతో సంబంధం లేదని చెప్పే ఒక అద్భుతమైన సౌందర్యం కనిపిస్తుంది. అలాగే మనిషి స్త్రీకి ఇచ్చే గౌరవం, పరంధామయ్య లాంటి పాత్రల ద్వారా ఒక ఆడదానిని చూసే దృష్టికోణం, నీతులు-నియమాలు సమాజానికి ఒకలా, మానవాళ్ళకు ఇంకొకలా, మనకు వేరేలా మార్చుకునే మనిషి తెలివి తేటలను రచయిత సూక్ష్మంగా ఆవిష్కరించాడు.

ప్రపంచలో మనిషికి బుద్ధినిచ్చి దేవుడు బుద్ధి మొత్తాన్ని వేరు వాళ్ళను మోసం చేయడానికి ఉపయోగించాలని చెప్పిన విధానం, దేనినైనా తన కనుకూలంగా మార్చు కుంటూ ఉపాధ్యాయ ప్రవృత్తికే హాని కలిగించే విధంగా ప్రవర్తించే పరంధామయ్య చివరికి కన్న కొడుకు దగ్గర తలెత్తుకోకుండా పుట్టుకతో వచ్చిన బుద్ధులు చచ్చేవరకు పోవు అన్నట్టు తనేదో దేశోద్ధారకుడు లాగా మాట్లాడే విధానము, తెలిసి తెలియని చిన్న వయసులో అమ్మ చేసిన ఒక చిన్న తప్పు తనని జీవితాంతం ఏ విధంగా ప్రవర్తిస్తాఉ దానివలన ఒక అబ్బాయి జీవతం ఏ విధంగా నాశనం అవుతుంది, పెళ్ళైన తర్వాత పెళ్ళాం గురించి తెలసిన ఒక భర్త ఏ విధంగా వ్యసనానికి బానిస అవడానికి ఒక స్త్రీ ఎంతవరకు కారణం అనేది ఈ నవల వివరిస్తుంది.

జీవిత ప్రయాణంలో ఎన&ఇన పాత్రలు కనిపించి నప్పటికీ పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్న కథా నాయకుని భార్య మనిషిని విశ్లేషించడం కాదు, మనసును అర్థం చేసుకోవడం ముఖ్యం అని దానికోసం త జీవితాన్ని అర్పించిన త్యాగశీలి. కథానాయకుడు తన ఆలోచనలు అన్నింటిని పక్కనపెట్టి సమాజం కోసం మనిషిగా మారినొక వ్యక్తి బ్రతికున్న మనిషికి చనిపోబోతున్న మనిషికి చనిపోయిన మనిషికి ఈ సమాజయం ఇచ్చే విలువను మార్చలేము అని తెలుసుకుంటాడు. కొందరు మనుషులు తరాలు మారినా యుగాలు మారిన మారరు అని చెప్పడానికి ఇందులో ప్రతి నాయకుడు ఉంటాడు.

ఈ మొత్తం పుస్తకంలో ఒక శిల్పి ఒక చక్కని శిల్పాన్ని చెక్కి దానికి ప్రాణం పోసి ఇదేంటి ఇలా ఉందని దీనిని వెక్కిరించినట్లు ఉంటుంది. అంతవరకు కథానాయకుడు నిజాయితీతో తార్కికంగా ఆలోచిస్తున్నాడు అని, ప్రణవి ప్రేమ అనే మోహంలో కొట్టుమిట్టాడుతుందని అనుకున్నా ప్రేక్షకుడికి ప్రణవిని నేను జైల్లో ఉన్నప్పుడు నువ్వు ఎందుకు రాలేదు అన్న ప్రశ్నకు ఆవిడ చెప్పిన సమాధానం విని మనిషి ఆలోచనలో పరిపక్వత అనేది ఏ క్షణమైన కలగొచ్చని మనిషి జీవితంలో ఆలోచనలు అన్నీ కూడా ఎమోషన్స్‌తోనే ముడిపడి ఉంటాయని ఒక గొప్ప ఆశ మనిషిని ఎంతవరకైనా తీసుకెళ్ళకగలదు అని నిరూపించడం జరిగింది. అసలు మనిషి యొక్క బంధాలు, బంధుత్వాలు ఎంత కష్టంగా ఉన్నా అవసరం తీరిపోయాక మన సమాజంలో తెగిపడే బంధాలను రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

క్రూరత్వం అనేది మనిషి జంతుప్రవృత్తిలో ఎప్పటి

నుంచో ఉంది ఎక్కడా వయసుభేదం గానీ, ఆర్థిక బేధం గాని లేదు. పరంధామయ్య గారి దగ్గర నుంచి, కథా నాయకుడు వాళ్ళ అమ్మగారు, చివరికి కథానాయకుడు జీవచ్చేమయ్యి ఉన్నప్పుడు పక్కనే ఉన్న బిచ్చగాడు అందరిలో కూడా ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మనిషి అంటే ప్రేమతో సమాజం మీద ఇష్టంతో ఒక ప్రణవి మాత్రమే కానీ చివరకు తనకు ఒరిగింది ఏమిటో ఆలోచించినప్పుడు ఆవిడ ఎక్కువ బాధలు అనుభ వించాల్సి వచ్చింది. ఈ పుస్తకం మొత్తం మీద ఎవరూ కూడా తమ ఆలోచనను చంపుకుని బతుకలేదు ఒక మనిషిలో ఎప్పుడైతే క్రూరత్వం నశిస్తుందో ఆ మనిషి జీవితం తన చేతి నుంచి జారిపోతుంది. మనిషి జీవితం తోనే కొన్ని వందల నిజాలు సమాధి అయిపోతాయి. అమ్మ మీద ప్రేమ ఒక చిన్న సంఘటనతో మారి పోతుందా అనేది లేదు. అసలు ఒక వ్యక్తి మీద మనకు ఏ విధమైన అధికారం ఎప్పుడు వస్తుంది ప్రేమిస్తే అధికారం వస్తుందా? నవల పాత్రల నుంచి ఒకసారి బయటకి వచ్చి చూస్తే సుశీల గారి జీవితం తనకి అర్థం కాకపోవచ్చు కానీ తండ్రి అయినటువంటి పరంధామయ్య గారికి అర్థం అవ్వాలి కదా పరంధామయ్య లాంటి గొప్పలు చెప్పుకునే వ్యక్తి కూతురి జీవితాన్ని కూడా తన గొప్పలకు వాడుకోవడం తర్వాత కూతురి జీవితం ఆ విధంగా అయిపోయిందని తన కింద వాళ్ళ మీద అరవడం ఎంతవరకు సమంజసం అసలు ప్రతి సంఘటనకు ఒక్కరినే బాధ్యులను చేయడం తరచుగా మనం గమనిస్తూ ఉంటాము. ఈ నవలలో ప్రతి సంఘటనలోనూ ప్రతి విషయంలోనూ బలహీనులు బలవంతులు తప్పించుకుంటారనే విషయం రచయిత చాలా చక్కగా వివరించారు.

ఈ నవలలో రచయిత మనిషి బలహీనతలని స్వార్థంతో పోలుస్తాడు. ఒక బలహీనత స్వార్థంగా ఎలా అవుతుందో తులుసుకోవాలి అంటే దానికి మనిషి బాగా పరిపూర్ణుడు కావాలి. దానికి చాలా పరిపత్తి కావాలి. పాఠకుడికి ఒక సందర్భంలో ఈ ప్రపంచలో దేనిని నమ్మాలి దేనిని నమ్మకూడదు అనే ఒక మీ మాంస కలుగుతుంది. ఎందుకంటే నవల మొత్తం కూడా నిజాన్ని నమ్మితే మనిషి పడేది కోపం, అసహ్యం, దు:ఖము అదే అబద్ధాన్ని తీసుకుంటూ పోతే మనిషి మనసులో ఆనందము ఒక సంతోషం ఉంటాయి కానీ మనిషి నమ్ముతున్న అబద్ధం ఎప్పుడైనా సరే అది నిజంగా మారు తుంది అప్పుడు మరల మనిషి ఇంకో అబద్ధం వెతుక్కుం టున్నాడు కాని నిజాలను ఒప్పుకోడు కారణం ఏమిటంటే మనిషికి ఉన్న అవసరం, వృద్ధాప్యంలో మనిషి ఎందుకు తోడు కోరుకుంటున్నాడు, బలహీనత వలన ఈ ప్రేమ మరియు బంధాలు సృష్టించబడ్డాయా అనిపిస్తుంది.

ఈ నవల చదువుతున్నప్పుడు ప్రణవి బిజినెస్ పెడుతుంది అని ఎక్కడో మనకి అనిపిస్తున్నా ప్రణవి బిజినెస్ పెట్టింది అన్నప్పుడు మన ఊహకే అందని ఒక గగుర్పాటు మనకు కలుగుతుంది. కథానాయకుడు చివరి శ్వాసలో ఉన్నప్పుడు తన కూతురు తన తండ్రి జీవత్సవంలా పడుకున్నాడు. తనను ఎంతో ప్రేమిస్తున్న తండ్రి ఆ విధంగా ఉండడం వలన తన పెళ్ళి ఆగి పోతుందేమో అని తన తండ్రి ఆక్సిజన్ పైపునే తీసివేసిన కూతురు, ఏ బంధము లేకుండా ఇంకా భార్య కాకుండానే తను ప్రేమించిన మనిషి కోసం తనకు మానసికంగా ఇష్టంలేని పని చేసి తన తనువే చాలించిన తన స్నేహితురాలు ప్రణవి, అవతల వారి మనసు తెలుసు కోకుండా కేవలం తన సుఖం కోరుకునే మల్లిక, ఒక సాంత్వన కోసం ఆరాటపడి చివరకు జీవితాన్ని బజారు పాలు చేసుకున్న సుశీల, ఈ విధంగా నవల మొత్తం స్త్రీ జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు వివరించారు.

సుశీలగారు గాని, కథానాయకుని అమ్మగాని, ప్రణవి గాని వీళ్ళు చేసిన ఒక చిన్న పొరపాటు వల్ల వాళ్ళ జీవితాలు చిద్రమైన విధానం, చేసింది పొరపాటు అయినా తెలివిగా చేయడం వలన శ్రీనాథ్ భార్య మల్లిక తప్పించుకునే విధానం, అమాయకత్వానికి తెలివి తేటలకు మధ్య జరిగే యుద్ధము ఈ నవల మొత్తం సాగింది. తండ్రి ఏం చేస్తున్నా చివరకు తన కట్టుకున్న భార్య వైపే తన దృష్టి ఉన్నా మాట్లాడని కొడుకు తన ఇంట్లో పనిమనిషికి ఆస్తి వెళుతుందని తెలియగానే ఈ

విషయం మీద లోపలికి రండి మాట్లాడుకుందాము అనే సందర్భము మనిషి యొక్క ఆలోచనలను ఆస్తి, ధనం ఏ విధంగా మనిషి ఆలోచనలను ప్రభావితం చేస్తుందో చెబుతుంది.

ప్రణవి తన బెడ్ మీద పడుకున్నా కూడా కథా నాయకునికి ఎటువంటి ఆలోచన రాదు. దీన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి. అమ్మ కొడుకు దగ్గర ఒక నిజం దాచింది అసలు తల్లి ఎందుకు ఆ నిజం చెప్ప లేదు, తనను అర్థం చేసుకునే పరిపక్వత లేదనుకుందా ఒక తల్లి తన సొంత కొడుకును కూడా విశ్వసించలేని స్థితిలో ఉంటుందా? లేదు అంటే నాకున్న ఒక్క ఆధారం కూడా పోతుందనే భయంతో విషయాన్ని దాచిందా? తనను ప్రేమించి వంచించి మోసం చేసిన మార్టిన్ మీద తల్లికి ఎందుకు కోపం లేదు. వ్యసనానికి అలవాటు పడ్డ తన భర్త అంటే ఎందుకు అంత చులకన భావం. ఆ చులకన భావంని ఒక స్త్రీ పట్టించుకోకపోతే పురుషుడు వ్యసనానికి బానిస అవుతాడా? వయసు ఉడికినాక నీతి నియమాలు పక్కనపెట్టి స్వాంతన అనేది ఒక మనిషికి అవసరమా? ఇవన్నీ కథలో ప్రస్తావించబడ్డాయి. మనిషికి భావాలు ఆలోచనలు మారిపోవడానికి రచయిత ఒక తల వెంట్రుక చాలు అని చెప్తాడు. అసలు అబ్బాయిలు ఒక అమ్మాయి ఎందుకు ప్రేమిస్తారు? అమ్మాయి అనేది ఒక అలంకరణ అవుతుందా! ఒక చింపిరి జుట్టు వేసుకొని సాదాసీదాగా కనిపించే అబ్బాయి వైపు సమాజం చూడదు. అదే అబ్బాయికి ఒక అందమైన అమ్మాయి తోడుగా ఉంటే అబ్బాయి మీద వెంటనే సమాజంలో ఆసక్తి ఏర్పడుతుంది. దానికి కారణం ఒక స్త్రీ యొక్క ఆకర్షణే. ఒక స్త్రీ యొక్క ఆకర్షణ, ఒక స్నేహం బలపడాలి అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక్క కామన్ పాయింట్ అనేది ఏదైనా అవసరమా? రెండు విభిన్న మనసులు స్నేహానికి పనికిరావా??...నవల మొత్తంలో కూడా అమ్మాయి మీద గాని, అసలు ఏ విషయం మీద అయినా ఆసక్తి లేకుండా ఉండే ఒక మనిషి ఒక ఉత్తరం వలన మారాడు కదా. మొదటిలో ప్రేమ కోసం వెంపర్లాడే మనిషి తర్వాత నిజ జీవితంలోకి వచ్చి ప్రేమ అనేది ఒక మాయ అని తెలుసు కొని తర్వాత తన స్నేహితురాలి జీవిత త్యాగం వలన మరల ప్రేమలోకి పడి చరమాంకంలో దేవుడి దగ్గరికి వెళ్ళి వెనక్కి వచ్చి మరి ప్రేమ అన్నది లేదని తెలుసు కుంటాడు.

ఈ విధంగా మనం అందరం కూడా ఒక అబద్ధ ప్రపంచంలో బతుకుతున్నామని చెప్తున్నాడు. మన్మధ రావుది ఒక రకమైన స్వభావం అయితే వాళ్ళ కూతురు వేరే రకంగా ఆలోచిస్తుంది. మనిషిని మనిషిగా ప్రేమించలేని వ్యక్తిని ప్రేమించకూడదు అంటున్న ఈ సమాజంలో తన పిల్లవాళ్ళ వయసులోనే ఉన్న ఒక అమ్మాయి పట్ల, అమానుష ప్రవర్తన చూపించే కోడలు తన మామగారు తన మీద అదే భావాన్ని చూపించే సమయానికి దానిని ఒక తప్పుగా చిత్రీకరించింది. బలహీనులకు నోరు లేదు అనేది ఎప్పటికీ వాస్తవంగానే మిగిలిపోతుందనే విషయం ఈ నవల ద్వారా తెలుస్తుంది. ఒక మనిషి బ్రతికినంత కాలం లేని గౌరవం ఒక చావుతో వస్తుంది. చావు మనిషిని పవిత్రున్ని, పుణ్యాత్మున్ని చేస్తుంది. కానీ చావు తర్వాత జరిగే క్రతువులు ప్రతి ఒక్కరికి కూడా ఏదో సమయాల్లో చిరాకు తెప్పించే విధంగా ఉండొచ్చు. కానీ మనమందరం కూడా సమాజానికి కట్టుబడి మనకు కూడా ఈ పరిస్థితి వస్తుందని భావిస్తాము.

రచయిత ఈ నవలలో సత్యం కుటుంబం ద్వారా మనిషి మెచ్చురిటీకి వయసుతో సంబంధం లేదని, సత్యం యొక్క తండ్రి ప్రవర్తించే విధానంకి ఒక మామగా ప్రవర్తించే విధానంకి ఆ వ్యత్యాసం మనం స్పష్టంగా చూడవచ్చును. కూతురు సుఖం కంటే తన చెల్లి మీద ఉన్న నమ్మకం ఒక మనిషిని ఏ విధంగా గుడ్డివానిగా చేస్తుందనేది, అమాయకత్వం వలన, తన అతి ప్రేమ వలన, ఒక కుటుంబం ఏ విధంగా చిత్రమైపోతుంది అనేది సత్యం పాత్ర ద్వారా రచయిత చెప్పాడు. రచయిత ఎవరి మీద ఒక స్పష్టమైన అభిప్రాయానికి రానివ్వరు అసలు మనుషులంటేనే మారుతూ ఉంటారు. సన్నివేశాన్ని బట్టి మనిషిని ఆలోచించాలి తప్ప ఒక సన్నివేశం ఆధారంగా ఒక మనిషిని మొత్తం చెప్పడానికి వీలు

లేదనేది ఈ నవల సారాంశం. ఒక పాత్ర మీద మనకు అభిమానం ఆప్యాయత నమ్మకం కలిగే లోపే వాళ్ళ యొక్క ఆలోచన విధానంతో మనల్ని మరొక్కసారి ఆలోచించుకొనేలా చేస్తారు. రచన మొత్తంలో కథా నాయకుడు. కథానాయకుడు రాత్రిపూట నిద్ర పట్టకుండా ఆలోచిస్తూ ఉంటాడు. అతను ప్రతి చిన్న విషయానికి ప్రతిస్పదించే విధానము మనల్ని ఆలోచించకునేలా చేస్తుంది.

**స్త్రీ పాత్రలు - బాధ, త్యాగం, నిశ్శబ్దం**

సుశీల, మల్లికా, ప్రణవి - ఈ మూడు పాత్రలు స్త్రీ జీవితంలోని వేర్వేరు కోణాలను చూపిస్తాయి. సుశీల ఉపశమనం కోసం జీవితాన్ని తాకట్టు పెట్టిన స్త్రీ. మల్లిక తన సుఖం కోసం ఇతరుల భావాలను పట్టించకోని వ్యక్తి. ప్రణవి ప్రేమలో మౌనంగా కాలిపోయిన దీపం. ఒక చిన్న పొరపాటు వల్ల వీరి జీవితాలు ఎలా చీలిపోతాయో, సమాజం ఆ పొరపాటును ఎంత నిర్దయగా శిక్షిస్తుందో రచయిత బలంగా చూపిస్తాడు.

**క్రూరత్వం - మనిషిలో సహజంగా ఉన్న జంతు స్వభావం**

క్రూరత్వం మనిషిలో కొత్తది కాదు. పరంధామయ్య నుంచి మొదలుకొని, కథానాయకుడు, అతని తల్లి, చివరకు బిచ్చగాడు వరకు - అందరిలోనూ అది దాగి ఉంది. ఈ నవలలో ఒక్క ప్రణవి మాత్రమే తన ఆలోచనలను చంపుకొని బ్రతకగలిగిన వ్యక్తి. మిగతావారంతా తమ ఆలోచనలకే బానిసలవుతారు.

**సమాజం - శిల్పిని వెక్కిరించే గుంపు**

ఈ నవల మొత్తాన్ని ఒక ఉపమానంగా చూస్తే - రచయిత ఒక శిల్పి. సమాజం అతను చెక్కిన శిల్పాన్ని చూసి వెక్కిరించే గుంపు. సమాజమే మనిషిని తయారు చేస్తుంది. అదే సమాజం తిరిగి అతనిపై వేలెత్తి చూపిస్తుంది. బతికున్న మనిషికి, చనిపోతున్న మనిషికి, చనిపోయిన మనిషికి సమాజం ఇచ్చే విలువ వేరువేరుగా ఉంఉటంది. దాన్ని మార్చలేము, మార్చకూడదని దేవుడితో కథానాయకుడు చేసే సంభాషణ ఈ నవలలో అత్యంత తాత్విక ఘట్టం.

**ముగింపు**

యండమూరి వీరేంద్రనాథ్ గారు సుమారు 9 సంవత్సరాల విరామం తర్వాత నేరుగా రచించిన నవల 'అంతర్ముఖం'. ఇది కేవలం కథ కాదు, మనిషి మనస్తత్వాన్ని, సమాజపు ద్వంద్వ నైతికతను లోతుగా విశ్లేషించిన తాత్విక నవల. దీని ప్రధాన సారాంశం - మనుషులు ఈ సమాజంలో గొప్పగా కనిపించాలనే తపనతో ఎలా జీవిస్తారో రచయిత ప్రశ్నిస్తాడు. సమాజం కోసం బతుకుతున్నమనే ముసుగులో మనిషి తన స్వార్థాన్ని తన పిరికితనాన్ని ఎలా దాచుకుంటాడో ఈ నవల చూపిస్తుంది.

మనిషికి ఉన్న విలువ బతికున్నప్పుడు ఒకలా, మరణానికి దగ్గరలో ఉన్నప్పుడు మరోలా మారిపోతుంది. ఒక మనిషిని సమాజం ఎలా చూస్తుంది, అతని తప్పులు ప్రస్తుత పరిస్థితుల ఆదారంగా కాకుండా, అతను గతంలో చేసిన పనుల ఆధారంగా ఎలా తీర్మానించబడతాయో ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కథలోని కథానాయకుడు ఎప్పుడూ మనుషులలోని కుళ్ళు, కుతంత్రాలు, ద్వంద్వ స్వభావం గురించి ఆలోచిస్తూ ఉంటాడు. సమాజపు కట్టుబాట్ల మధ్య జీవిస్తూ కూడా ఒక పవిత్రమైన ప్రేమ కోసం ఒక అమ్మాయి పడే తపన అందరిని కుదిపేస్తుంది.

ఈ నవలలో తన పిరికితనాన్నే ప్రేమించుకునే మనిషి, కూతురు ప్రేమను తన స్వార్థానికి వాడుకునే తండ్రి, పండుగల, ఆచారాల పేరుతో ఆడవాళ్ళు పడే వేదన, అవసరం లేకుండా మనం తెచ్చిపెట్టుకునే భావోద్వేగాలు, ప్రేమ కోసం పరితపించే అమ్మాయి, తెలివితేటల పేరుతో జరిగే మోసాలు ఇవన్నీ మనిషి జీవితంలో ఎదురయ్యే అన్ని మానసిక సంఘర్షణలకు ప్రతీకలుగా నిలుస్తాయి.

ఈ నవలలో ముఖ్యంగా చూపించిన విషయం - మనిషి జీవితంలో దేనికీ లొంగకపోయినా ప్రేమకు మాత్రం ఎలా బానిసవుతాడో, పవిత్రమైన ప్రేమ ఎదురైనప్పుడు మనిషి ఆలోచనలు ఎలా మారుతాయో భావోద్వేగాలు ఎలా అతన్ని నడిపిస్తాయో రచయిత విశ్లేషిస్తాడు. అలాగే వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీ పట్ల సమాజం చూపే ద్వంద్వ వైఖరి, కొతమంది మనుషులు సంవత్స

రాలు గడిచినా మానసికంగా ఎదగకపోవడం, ఒక చిన్న సంఘటన మనిషిని పూర్తిగా వేరే కోణంలో చూపించే విధానం, పరిస్థితులను బట్టి మనుషుల ప్రవర్తన ఎలా మారుతుందో ఈ నవలలో సహజంగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**


1. కొంగు చాటు కృష్ణుడు - ఫిబ్రవరి 2024
2. జ్ఞానం చెప్పిన శిల్పం (జీరో నుంచి హీరోకి) - 2023
3. దిండు క్రింద నల్ల త్రాచు - 2019
4. నిశ్శబ్ద విస్ఫోటనం -2021
5. విశ్వ విజేత - జులై 2022


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణ ప్రజా జీవనం - సామాజిక చిత్రణ

- డా॥. మెంతబోయిన సైదులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రపహాడ్.

**ఉపోద్ఘాతం**

ప్రజల మనిషి అనగానే ఒక వ్యక్తి ప్రజల తరపున పోరాటం చేసి వారి హక్కులను సాధించే క్రమంలో కథా నాయకుడు చేసే ఐక్య పోరాట కథగా మనకు కనిపిస్తుంది. కానీ ఇది పూర్తిగా తెలంగాణలో జరిగిన విధ్వంసకర చర్యలను , దొరల భూస్వాముల విషకౌగిలిలో తెలంగాణ పల్లెలు ఏవిధంగా ఛిద్రమయ్యాయో గడీల పాలనలో గరీబులు గడియ, గడియ ఒక గండంగా ఎంత హీనంగా తమ బతుకు వెల్లదీశారు అనే చరిత్రను నిక్షిప్తం చేసిన నవలగా మనం చూడాలి. స్వాతంత్ర్యానంతరం తెలంగాణాలో వెలువడిన గొప్ప నవల ప్రజల మనిషి అనే చెప్పవచ్చు. తెలంగాణాలో రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవన సరళిని, ప్రజల యదార్థ గాథల స్వీయ అనుభవాలను అక్షరబద్ధం చేసిందీ నవల. 1955లో అచ్చయిన ఈ నవలలో ప్రతిబింబించిన గ్రంథాలయోద్యమం, భూసమస్య, ఆంధ్రమహాసభ, స్టేటు కాంగ్రేసు, మతపరివర్తన, జాతీయభావము, ఇంకా ఎన్నో విషయాల్నే కాకుండా దొరల ఆగడాల్ని అక్షరబద్ధం చేసిన నవల "ప్రజల మనిషి". దాదాపు తన స్వీయానుభవాలను వ్యూహాత్మకంగా అక్షరీకరించి ప్రజా ఉద్యమాలకు మూలాలను నిక్షిప్తం చేసే కార్యాచరణను చేపట్టినవాడు 'వట్టికోట ఆళ్వారుస్వామి'.

ఈ నవల లో కథా నాయకుడు కంఠీరవం తెలంగాణా సామాజిక, సాంఘిక, రాజకీయ వాతావరణానికి ప్రభావితుడై ప్రజలను చైతన్యపరిచి, సమీకరింపజేసి దోపిడికి, వెట్టిచాకిరీకి, భూముల బేదఖలుకు వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేసే క్రమంలో 'కంఠీరవం ప్రజల మనిషిగా మారిన పరిణామక్రమాన్ని తెలియజెప్పే యితివృత్తమే 'ప్రజలమనిషి' నవల.

**రచయిత పరిచయం**

"నల్లగొండ జిల్లా నకిరేకల్లు సమీపంలో వున్న చెరువు మాదారం గ్రామంలో వట్టికోట ఆళ్వారుస్వామి 1915 నవంబరు 1 తారీఖున జన్మించాడు. చిన్నప్పుడు అతనికి చదువుకునే అవకాశాలు దొరకలేదు. కంచినపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయునికి వండి పెడుతూ నకిరేకల్లులో, ఆ తర్వాత సూర్యాపేటలో వున్నాడు". (1) సూర్యాపేటలో వున్నప్పుడు ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథాలయం స్థాపించటం వట్టికోట చూసాడు. ఆ గ్రంథాలయం అతనికి పుస్తక ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఆ తర్వాత వట్టికోట, కందిబండ గ్రామంలో నారపరాజు రాఘవరావు ఇంట్లో చేరాడు. నారపరాజు సోదరులు ఆ గ్రామంలో నెలకొల్పిన గ్రంథాలయంలో వుండే పుస్తకాలు, పత్రికలను వట్టికోట చదివి లోకజ్ఞానాన్ని సంపాదించాడు.

కందిబండ నుంచి వట్టికోట 1933లో హైద్రాబాదు చేరుకొని కోదాటి నారాయణరావు సహాయంతో గొలకొండ పత్రికలో ప్రూఫ్ రీడరుగా చేరాడు.

గోల్కొండ పత్రికలో ఆళ్వారుస్వామి ప్రూఫ్ రీడర్ ఉద్యోగంలో నెలకు 15 రూపాయల వేతనంతో, పని చేసింది కొద్ది రోజులే అయినా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు వంటి సాహితీవేత్తల సాహచర్యం లభించింది. తన జ్ఞానం పెరగడంతో పాటు సాహితీకాంక్ష పెరిగింది. ఇప్పటి వరకు గడించిన అనుభవం తెలుగుతల్లి పత్రిక నిర్వహణలో, దేశోద్ధారక ఉద్యమాల, నిర్వహణలో ఎంతగానో తోడ్పడింది. 15 రూపాయల జీతం తన జీవికకు సరిపోక, నగర జీవితంలో ఇమడలేక మళ్ళీ కందిబండకు చేరుకున్నాడు. కందిబండ గ్రామగ్రంథాలయంలో వీరేశలింగం సమగ్ర సాహిత్య సంపుటాలను చదివి సాహిత్యాన్ని బాగా ఆకలింపు చేసుకున్నాడు. ఇదే సమయంలోనే రచనాభ్యాసం మొదలు పెట్టి ఇంగ్లీషు భాష నేర్చుకోవాలనే అభిలాషతో బెజవాడలో హటరీటల్ సర్వర్ గా ఉన్న సమయంలో ఇంగ్లీషు నేర్చుకుని తిరిగి రెండేళ్ళకు మళ్ళీ కందిబండ చేరుకున్నాడు.

"1946లో వట్టికోట కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి రజాకార్లకు నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేరం మీద అరెస్టయి జైలుకు పోయాడు. 1948 సెప్టెంబరు 17న పోలీసుచర్య జరిగి నిజాం లొంగిపోయిన తర్వాత కూడా కమ్యూనిస్టు నాయకులను సైనిక ప్రభుత్వం విడుదల చేయలేదు. వట్టికోట కూడా విడుదల కాలేదు. 1951లో వట్టికోట జైలు నుంచి విడుదల అయ్యాడు."(2) అప్పట్నుంచి ఆయన రాజకీయాల మీద కన్నా పుస్తక ప్రచురణ మీద దృష్టి నిలిపాడు. పుస్తక ప్రచురణలతో పాటే 1940లో మొదలైన ఆయన రచనా వ్యాసంగం 1961లో చనిపోయేంత వరకు కొనసాగింది. 1938 నుంచి 1941 వరకు 12 పుస్తకాలు ప్రచురించాడు వట్టికోట. మళ్ళా రెండో దశలో 1953 నుంచి 1958 వరకు 18 గ్రంథాలను ప్రచురించాడు. మరో 28 గ్రంథాలను ప్రచురించాలని ప్రణాళిక ఏర్పర్చుకున్నాడు. ప్రచురించిన పుస్తకాలలో సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి, హీరాలాల్ మోరియా, పొట్లపల్లి రామారావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కె.ఎల్.ఎన్. వంటి ఎందరో తెలంగాణ రచయితల పుస్తకాలు వున్నాయి. ఇంగ్లీషు నుంచి అనువదింపబడిన పుస్తకాలు వున్నాయి. టాల్ స్టాయ్ రచన 'ప్రజలు-ప్రభుత్వం' మొదటి ముద్రణ, రెండో ముద్రణలు వున్నాయి. తెలంగాణ చరిత్ర సంస్కృతులను తెలిపే సమకాలిక సమస్యలను వివరించే తెలంగాణ వారి విజ్ఞానాభివృద్ధికి చైతన్యస్ఫూర్తికి తోడ్పడే గ్రంథాలను వట్టికోట ఈ గ్రంథమాలలో ప్రచురించి తెలంగాణలోని సాహిత్యోద్యమానికి రాజకీయ చైతన్యానికి తోడ్పడ్డాడు.

డా॥. దాశరథి రంగాచార్యులు ముందుమాటలో రాసి నట్లుగా "ఆళ్వార్ వెన్నెల్లా వస్తాడు. వసంతంలా వ్యాపిస్తాడు. శిశిరంలా ఆకురాల్చి నిర్గమిస్తాడు. అతని జీవితమూ, జీవితాంతమూ అలాగే జరిగాయి. ఆళ్వార్ పోయింతర్వాత వసంతం రానేలేదు."(3)

### ప్రజల మనిషి సామాజిక పరిస్థితులు

1938కి పూర్వం తెలంగాణాలో రాజకీయ, సామాజిక, సాంఘిక వాతావరణం ప్రజలమనిషి నవలకు నేపథ్యం. ఈ నేపథ్యంలో నుండే చైతన్య వంతులై బయలుదేరిన ఒకరిని కథానాయకుడిగా మలచి ఈ నవలను రచిస్తున్నా నని రచయిత ఈ నవలకు ముందురాసిన 'మనవి' ల పేర్కొనడం వలన 1938 కన్నా ముందు నాటి తెలంగాణా ప్రజల సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక జీవనము ఎలా ఉండేదో తెల్సుకునే అవకాశం ఏర్పడింది.

అయితే 1938 కి పూర్వం తెలంగాణా ప్రజల బతుకులు ఎలా ఉన్నాయి? ఎలా దోపిడీకి గురవు తున్నారనే దోపిడీ చరిత్ర, మరియు దోపిడీదారులను ప్రశ్నించే స్థాయికి చేరిన ప్రజల చైతన్య పరిణామ క్రమాన్ని, ఆనాటి పరిస్థితులు కథానాయకునిపై ఎలాంటి ప్రభావము చూపి అతి సామాన్యమయిన కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి ప్రజల మనిషిగా మారిన తీరును 'ప్రజల మనిషి' నవల ప్రతిబింబించింది.

ఆనాటి తెలంగాణా గ్రామాలన్నీ దొరల పాలనలో మగ్గుతూ ఉండేవి. ఆ గ్రామ ప్రజల శ్రమతో కట్టించు

కున్న గడీలో దొర నివసించేవాడు. రక్షణగా ఎత్తయిన ప్రాకారం, వెట్టి చేయడానికి ఒకటి లేక రెండు కుటుంబాలు శాశ్వతంగా ఉండిపోయేవారు. బలిష్ఠ మయిన దేహదారుడ్యం కల్గిన యువకులతో ఎప్పటికీ దొరకు, ఆ కుటుంబానికి రక్షణ యిస్తూ ఉండే వ్యవస్థ శాశ్వతంగా ఉండేది. గడీలో ఆరుబయట దొర కూర్చుంటే ఎవ్వరూ కూడా ఆ దారి వెంట వెళ్ళడానికి వీలులేదు. ఒకవేళ పొరపాటున వెళ్ళినా కాళ్ళకు చెప్పులు (చెప్పులు వేసుకోవడం, బట్టలతో ఒళ్ళంతా కప్పుకోవడం నేరం) వదిలేసి 'కాల్మొక్త దొర-నీ-బాంచెన్' అంటూ వంగి వంగి సలాం చేస్తూ ముందుకు వెళ్ళాలి.

దారుణమయిన వెట్టిచాకిరీ చేయించుకునే వారీ పెత్తందార్లు, దొరలు, యిలాంటి పెత్తందార్లు ఊరికి నల్గురయిదుగురు ఉండేవాళ్లు. చెప్పినట్లు వినకపోయినా, ప్రశ్నించినా బండబూతులు తిడుతూ, తంతూ కర్రలతో కొడుతూ హింసించే వాళ్ళు. చావిళ్ళ వద్ద వంగబెట్టి వీపు మీద రాళ్ళను పెట్టడం గాని, యితరులను గాని నిల్చో బెట్టి దారుణంగా హింసించేవారు. ఆనాటి తెలంగాణ రైతులను, లెవీలని, తావాలని, నాగులని అడ్డమయిన బలవంతపు సూళ్ళు చేసేవారు. శిస్తులు చెల్లించడం కొరకే పంటలు పండించేవాళ్ళని ఆనాటి చరిత్ర, సాహిత్యం, ప్రజలు అల్లుకున్న పాటల ద్వారా తెలుస్తుంది.

దొర యింట్లో ఎవరు చనిపోయినా బూడిద పట్టీ అని, ఎవరికి పెండ్లి పట్టీఅనీ, ఎవరు సమర్ధుడినా సముర్త పట్టీ , అనీ రైతుల నుండి పంటల కాలంలో వసూలు చేసేవారు. పండించిన పంటలో నుండి 'లెవిగల్లా' అని ధాన్యాన్ని వసూలు చేసి వారి వారి గరిసెల్లో నింపుకునే వారు. దొర చేసే అరాచకాలు అన్నీ సేతు సింధీల ఆధ్వర్యంలో జరిగేవి.

తెలంగాణలో భూస్వాముల దౌర్జన్యాలు ప్రజల జీవితాలను దుర్భరంగా తయారు చేసాయి. ముఖ్యంగా విసునూరు దేశ్ ముఖ్ రాంచంద్రారెడ్డి, ఈయనగారి తల్లి చరిత్ర మరిచిపోలేనంత దుర్మార్గంగా, అమానవీయంగా వుండేది. చంటి పిల్లలకు పాలివ్వడానికి కూడా పోనివ్వ కుండా ఆ పాలను పిండించి పొలంలో చల్లించేవారంటే మధ్యయుగాల ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థనే కాకుండా దక్షిణాఫ్రికాలో నీగ్రో బానిసలపై హింసను తలదన్నే విధంగా దోపిడీ రూపాలు వుండేవి. ప్రజలు అలాంటి దుర్భర జీవితాల్ని సహించి సహించి పిడికిళ్లు బిగించారు.

"అలాగే మరో దేశముఖ్ ఎర్రపహాడ్ జమిందారు జన్నారెడ్డి ప్రతాపరెడ్డి. వరంగల్, నల్లగొండ జిల్లాల్లో లక్షా యాభైవేల ఎకరాల భూమి అనగా కనీసం ముప్పయి, నలబై గ్రామాలయినా ఆయన ఆధీనంలో ఉండేవి. దేవరుప్పల గ్రామానికి చెందిన అబ్బాసలీ ,బేతుకిష్టారెడ్డి విసునూరు రాంచంద్రారెడ్డి బంట్లయితే, జన్నారెడ్డి ప్రతాపరెడ్డికి పెదపంది మారిగాడు, చిన పంది మల్లిగాడు బంట్లు."(4) ఈ బంట్లు దొరల అండ జూసుకుని ప్రజలను నానాహింసలు పెడుతుండేవారు. ఇలాంటి వాళ్ళకు ప్రతీకగా 'ప్రజల మనిషి'లో సేతుసింధీరంగడు అనే పాత్రను ఓ చిన్న ప్రతీకగా చూపాడు రచయిత.

అలాగే ప్రజల మనిషిలో హైదరాలీ, వెంకటాద్రి అలాంటి బంట్ల వరుసలో జేరుతాడు.అంటే ఊరి ప్రజల శ్రమ జీవనము నుండి సంపాదించిన డబ్బునో, ధాన్యాన్నో, దొర ఇంట్లో పెళ్ళి జరుగుతుందంటే ఊరికంతా పెళ్ళి బాధ్యతలు అప్పగించబడేవి. వంటలకు కావలసిన దినుసులు, పాలు, పెరుగు, నెయ్యి, పెళ్ళికి కావలసిన పీటలు, మంచాలు సమకూర్చే వెట్టి వాళ్ళుగా ఊరి ప్రజలంతా చేయాల్సి ఉండేది. ఇస్తళ్ళు కుట్టడానికి కూడా కుటుంబాలకు అలవాటుగా అప్పగించేవారు. ఈ విధమైన ఆర్థిక దోపిడీని ప్రజల మనిషిలో ప్రారంభంలోనే ప్రవేశపెట్టి ఆనాటి దొరల దౌర్జన్యపు వసూళ్ళను ఎత్తిచూపిన తీరు రచయిత యొక్క సామాజిక, సాంఘిక, అవగాహనను పట్టిస్తుంది. ఇక ప్రభుత్వాధికారులు, పోలీసు అధికారులు గ్రామాల్లోకి వచ్చారంటే వారు ఊరిలో చేతికందిన వస్తువులు కావలికాండ్లతో తెప్పించడం, వెట్టి మాదిగతో కట్టెలు తెప్పించుకోవడం లాంటి పనుల్ని దౌర్జన్య పూరితంగా బండబూతులు తిడుతూ వెట్టి చేయించుకునే వారు.

**భూమిసమస్య**

ఈ నవలలో మనకు కొట్టొచ్చినట్టు కనబడేది భూసమస్య. భూమి మీద యాజమాన్యం కల్గివున్నవారు

వ్యవసాయం చేసేవారు కాదు. రెక్కలు ముక్కలు చేసుకుని చెమట ధారలతో వ్యవసాయం చేసిన వారికి భూమి మీద ఎటువంటి హక్కులు ఉండేవి కావు. కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయాలి. యజమాని యిష్టాయిష్టాల మీద ఆధారపడే పరాధీన బతుకులు ఆనాటి సన్నకారు రైతులవి. పట్టా హక్కుల కోసం పోట్లాడేవారు కాదు కాని కౌలు నుండి బేదఖల్ (తీసివేస్తే) చేస్తే మాత్రం తిరగబడే వాళ్ళు.

ఈ నవలలో భూసమస్యను సృష్టించింది దిమ్మెగూడెం దొర రాంభూపాలరావు, ఆయన గుమస్తా హైదరాలి. వీరు భూస్వామ్య పెత్తందారీ వర్గాల ప్రతినిధులు. ఈ పాత్రల కేంద్రంగా వట్టికోట భూమి సమస్యపై కథనాన్ని నడిపారు. ఈ దోపిడీ దారులు ప్రజల భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో వర్గ సంఘర్షణ తీవ్రరూపం దాల్చినప్పుడు, ప్రభుత్వాధికారులే ముందుకు వచ్చి వాళ్ళకు యిష్టం లేకపోయినప్పటికీ (మేజిస్ట్రేట్) కొన్ని చట్టాలు కల్పించిన హక్కులవల్లనో, ప్రజల బలానికి తలవంచో దొరలు భూమిని ఆక్రమించుకోనీకుండా ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని న్యాయపరంగా ప్రజల భూమి ప్రజలకు దక్కేవిధంగా (తప్పని పరిస్థితులలో) తీర్పులిచ్చినట్లుగా ఈ నవలలో కొన్ని ఘటనల చిత్రీకరణ వుంది.

గొట్టం కొమరయ్య కౌలు భూమిలో రాంభూపాలరావు దొర హైదరాలిని పురమాయించి అరకలు కట్టినపుడే దిమ్మగూడెంలో కలకలం మొదలవుతుంది. ఈ సందర్భంలో మనమన్ని సంకలో ఎత్తుకుని అన్నమ్మ (కొమురయ్య తల్లి) "ఇక దున్నండి- నాప్రాణం పోయినా మానె! ఇప్పుడు భూమి గుంజుకున్నారు. రేపు మెడ పిసికేస్తరు. ఎట్టయినా మావి కుక్క బతుకులే, ఎప్పుడో చచ్చేది యిప్పుడే చస్తా"(5) అంటూ శివమెత్తి అరకలకు అడ్డంగా నిలబడ్డ తీరు చూస్తే చాకలి ఐలమ్మ'ను స్ఫురణకు తెస్తుంది. ఆ భూముల్లో వాళ్ళ బతుకులు ముడిపడి వున్నాయి. వాళ్ళకది జీవన్మరణ సమస్య. ఆ జీవన్మరణ సమస్యే వారినంతలా తెగింపజేసింది. తెలంగాణా పోరాటమంతటిలో ఈ మౌలిక సమస్య ఎలా కొనసాగిందో ఈ నవలలో ప్రతిఫలిస్తుంది.

రాంభూపాలరావు కొమరయ్యను, హైదరాలి కాపు కనకయ్యను కొట్టడంతో ప్రజలు ఐక్యమై ప్రతిఘటనకు సమాయత్తమవుతారు. ఫలితంగా హైదరాలి, రాంభూపాల రావు సిత్తందారీతనాన్ని, వారి క్రూరచర్యల్ని ప్రశ్నించే చైతన్యాన్ని కంఠీరవ, విజయదేవు, పరంధామయ్య, చంద్రయ్య వంటి వారి నుండి ప్రజలు అందిపుచ్చుకుని రాంభూపాలరావు దొరను, దొంగ సంతకం చేసిన వెంకటా చారిని న్యాయస్థానంలో వాళ్ళ మోసాన్ని బట్టబయలు చేసి శిక్షపడేట్లు చేస్తారు. కౌలుదార్ల చట్టం ప్రకారం కొమరయ్యకే ఆ భూమిని యజమాని వకీలు వెంకటేశ్వర రావు దఖలు పరుస్తాడు. ప్రభుత్వం కౌలు దారీ చట్టాలను ప్రవేశపెట్టిన నేపథ్యంలో రచయిత ఈ తీర్పునివ్వడం యాదృచ్ఛికం కాదు.

హైదరాలి కూడా ఒక దూదేకుల కుటుంబం భూమిని డబ్బులివ్వకుండా దఖలు పరుచుకున్న విషయం కంఠీరవ న్యాయస్థానంలో హైదరాలిని ప్రశ్నించినప్పుడు మనకు తెలుస్తుంది.

దొరల ముందు తలలు వంచుకుని 'కాల్మొక్త నీ చాంచెన్' స్థాయినుండి ప్రశ్నించే స్థాయికి ఎదిగిన పరిణామ క్రమాన్ని రచయిత చాలా గొప్పగా ఈ నవలలో చూపించాడు.

ఇంతేకాకుండా రాంభూపాలరావు చాలాకాలంగా ప్రజలకు చెందిన చెఱువు చింతల భూమిని తూతూ మంత్రంగా హర్రాజు పాడి ఆ భూమిని అనుభవిస్తుం టాడు. ఎప్పుడయితే దిమ్మెగూడెం ప్రజల్లో చైతన్యం పెరిగి దొరల ఆగడాలను ప్రశ్నించడం ప్రారంభమవుతుందో ప్రజల సమిష్టి సంఘటిత ఉద్యమ కార్యాచరణకు పునాదులు ఏర్పడడం మొదలవుతాయి. ప్రజలంతా ఏకమై కావలసిన ధనాన్ని జమచేసుకుని హర్రాజు పాడాలనుకుంటారు. ఈ లోపునే యధావిధిగా హర్రాజు తన పేరనే ముగించి చెఱువు లో తట్టు లో అరకలను కడతాడురాంభూపాల్ రావు. కుమ్మరి దుర్గయ్యను మట్టి తీసుకోకుండా అడ్డు తగిలినప్పటినుండే ప్రజలు 'హర్రాజు పాడకముందే అడ్డు తగలడానికి దొరకెట్లా అధికారం వచ్చింది' అని ప్రశ్నిస్తారు. ఊరి ప్రజలంతా చెఱువు

లోతట్టుకు చేరి అరకలను విడిచేస్తారు. శాంతి భద్రతల సమస్యగా పరిగణించి మేజిస్ట్రేటు 144 సెక్షను పెట్టి కోర్టు తీర్పు వచ్చేవరకు భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, రాంభూపాలరావు దున్నడానికి వీలులేదని ఆజ్ఞాపించి వెళ్ళిపోతాడు.

దీన్ని ప్రజలు విజయంగా భావిస్తారు. యిక్కడ రచయిత అన్ని శ్రామిక కులాల ప్రజలు ఐక్యంగా వుండి గ్రామ ఉమ్మడి ఆస్తిపై హక్కు కోసం సంఘర్షణపడ్డ తీరుని - ఒక్కో సందర్భంలో ఒక్కొక్క కులం వారు కలసి రావడం - అందరి ప్రధాన సమస్య భూమి, చెరువు వంటి గ్రామంలోని ప్రాథమిక ఉత్పత్తి సాధనాల చుట్టే కేంద్రీకరించబడి వుండడాన్ని ప్రజలకు అర్థం చేయించినట్లుగా చిత్రించారు. అప్పటికీ, ఇప్పటికీ గ్రామీణ ఆధిపత్యానికి భూమి, తదితర ఉత్పత్తి సాధనాలపై ఆధిపత్యం ఎవరిదన్నదే కీలకమైన సమస్యగా ఈ నవల ద్వారా వట్టికోట ఆళ్వారుస్వామి చూపించినట్లనిపించింది.

**పాత్ర చిత్రణ**

**రాంభూపాల్ రావు** : రాంభూపాల్ రావు దిమ్మెగూడెం గ్రామానికి పెత్తందారు అక్కడి రైతు కూలీలపై దౌర్జన్యం చేస్తూ, పీడించి, హింసించి పన్నులు వసూలు చేసేవాడు. గ్రామస్తులందరూ 'దొరా' అని పిలుస్తారు. ఇతనికి భార్య ఒక కూతురు ఉంది. ప్రజల సొమ్ముతో తన అవసరాలు తీర్చుకుంటాడు. తనకు ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే వారిని బెదిరించి ఆర్థికంగా దెబ్బతిస్తాడు. అవసరమైతే కొడతాడు. శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేస్తాడు. ఇతని దగ్గర పనిచేయడానికి, సేతు సింధి రంగడు, హైదరాలి అనే వాళ్ళు అందుబాటులో ఉంటారు. దొరకు ఏమైనా సందేహం ఉన్నప్పుడు సమస్య వచ్చినప్పుడు ఊళ్ళో ఉన్న ఒక పెద్ద రైతు 'వెంకటాద్రిని' సలహాల నిమిత్తం సంప్రదిస్తుంటాడు. కూతురు వివాహంను ప్రజల సొమ్ముతో అంగరంగ వైభవంగా జరిపించాడు.

తనకు ఎదురు మాట్లాడాడని తన తండ్రి 'ఇనాం' గా ఇచ్చిన భూమిని రఘునాథాచార్యుల దగ్గర నుండి తీసుకుని, అతన్ని ఆర్థికంగా చితికేలా చేస్తే అతడు భిక్షాటన చేయాల్సి వస్తుంది. గొట్టం కోటయ్య కౌలు భూమిని అతడు చనిపోయిన తర్వాత కొడుకు కొమరయ్య దగ్గర నుండి అన్యాయంగా వెంకటాచార్యుల సంతకంతో పట్టా చేయించుకొంటాడు. అయినప్పటికీ తన కూతురుకు ఇవ్వాల్సిన వరకట్నం సొమ్మును ఇవ్వకుండా తాత్సారం చేస్తాడు. తరతరాలుగా వస్తున్న ఆర్థిక దోపిడీకి రాంభూపాల్ రావు ప్రతీకగా నిలుస్తాడు. దొర అనుకున్న పని జరగకపోతే ఎంతకైనా తెగించడానికి సిద్ధపడతాడు. అన్నమ్మ అర్కలకు అడ్డం వచ్చి తమ భూమి దున్నకుండా చేసినప్పుడు జీతగాడు వచ్చి దొరకు విషయం చెప్తాడు. అప్పటికే కొమరయ్యను కొట్టి గుంజకు కట్టేస్తాడు రాంభూపాల్రావు, అన్నమ్మ విషయం విని అన్న మాటలు అతని అహంకారానికి దొరపెత్తనానికి, భూస్వామ్య వ్యవస్థ రూపానికి, ప్రతీకగా కనిపిస్తాయి. "ఏందీ కొమురయ్య తల్లి అరకలకు అడ్డం వచ్చింది? దున్నటం ఆగిపోయింది? సిగబట్టి గుంజుకొని రాక పదిమంది జీతగాండ్లు, ఓ గుమస్తా గోళ్ళు గిల్లుకుంటూ ఇప్పటిదాకా కూచున్నరన్న మాట 'లంజాకొడుక' ఏ ముఖం పెట్టుకొని వచ్చినవురా? అంటూ అమాంతంగా కుర్చీ లోంచి లేచాడు. కచ్చడం కాడి ఇనుప కర్రను అందుకొని బలంగా ఆ జీతగాని మీదకు విసిరాడు."(6)

చివరకు తాను, వెంకటేశ్వర్రావు వేసిన పిటిషన్ వల్ల అభియోగాలు ఋజువై చట్టపరిధిలో ఒక సంవత్సరం పాటు కఠినశిక్షపడి నిజామాబాద్ జిల్లా జైలుకు వెళ్ళాడు.

'ప్రజలమనిషి'లో రాంభూపాలరావు రఘునాథాచార్యుల భూమిని తిరిగి లాగేసుకుంటే, తనది కానప్పటికీ గొట్టం కోటయ్య 25 ఎకరాల భూమిని అక్రమంగా స్వంతం చేసుకునే క్రమంలో ప్రజల చేతిలో భంగపడి ఆ ప్రయత్నంలో తనను జైలులో పెట్టించేవరకు కూడా పసిగట్టని అహంకారం రాంభూపాలరావుది, దిమ్మెగూడెం చెరువు కింది ప్రజల భూమిని తూతూ మంత్రంగా హర్రాజు నిర్వహించినట్లుగా రికార్డుల్లో చూపి అనుభవిస్తున్న క్రమంలో ప్రజలు ఏకమై డబ్బులు జమచేసుకుని హర్రాజు ప్రజలే పాడాలనుకునే సందర్భంలో రాంభూపాలరావు అరకలను విడిపించి, ఊరి ప్రజలందరు

చెఱువు లోతట్టు భూమిలో చేరి రాంభూపాలరావుకు వ్యతిరేకంగా ఎదురుతిరగడంతో కథ అడ్డం తిరిగి వదుకోవల్సి వస్తుంది. ఈ సందర్భంగా రాంభూపాలరావు ఆ గ్రామంలో ఉనికిని కోల్పోతాడు.

రఘునాధాచార్యులు: కంఠీరవం తండ్రి. పండితుడు. సనాతన ధర్మాలను ఆచరించే వైష్ణవుడు. తన కుమారుడు వెంకటాచారిని తురక పంతులు కొట్టాడని బడి మాని పించాడు. కంఠీరవం ను కూడా తనలా సనాతన ధర్మాలను ఆచరించే వ్యక్తిగా మార్చాలకున్నాడు. దేశాటనం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. రాంభూపాల్ రావు కూతురి పెళ్ళిలో అతని కోపానికి గురై ఇనుముడు ఇచ్చిన భూమిని కోల్పోయాడు. తన భార్య ఆండాళ్ళ దొరగారికి విస్తళ్ళు కుట్టడం, అవమానంగా భావించాడు. తాను చనిపోయే ముందుకూడా. గౌరవంగా బతికాలని కుటుంబ పరువు కాపాడాలని కంఠీరవంకు బోధిస్తాడు. "నేనుఎట్లా పుట్టానో అట్లాగే పోతున్నాను. నావి ఎప్పుడూ వట్టి చేతులే, కానీ ఒక మాట కొడుక నేల విడిచి సాము చేయకు. ఆవేదనను మాత్రం చంపుకోకు ఈ మాటలనే నీకు నేనిచ్చే ఆస్థి."(7) అని తన కుమారుడికి తనకున్న జ్ఞానాన్ని నేర్పిన ఆత్మగౌరవం కలిగిన వ్యక్తిగా "విజ్ఞానానికి విలువ కట్టని సమాజానికి వృద్ధి లేదు, వికాసము చెందదు"(8) అని నమ్మేవాడిగా మనం భావించవచ్చు.

**వెంకటాచార్యులు :**

రాఘునాథాచార్యుల పెద్ద కుమారుడు కంఠీరవం అన్న. తన తండ్రి మరణానంతరం రాంభూపాల్ రావుతో చేతులు కలిపి తను కూడా అరాచకాలు చేస్తాడు. ఒక రౌడీలాగా ప్రవర్తిస్తాడు. కొమురయ్య కౌలు భూమికి తానే హక్కుదారుడినని రాంభూపాల్ రావు ప్రోద్భలంతో వెంకటేశ్వర్లుగా సంతకం చేస్తాడు. కొమురయ్య భూమిని కోల్పోవడానికి కారకుడవుతాడు. తన తమ్ముడు కంఠీరావంతో ఎప్పుడూ గొడవ పడతాడు. తన తల్లిని నానా దుర్భాషలాడుతాడు కొడతాడు. చివరకు ప్రశ్నించిన కంఠీరవంను ఇంట్లోంచి వెళ్ళగొడతాడు. భార్య తాయమ్మకు కూడా మనశ్శాంతి లేకుండా చేస్తాడు.

రాంభూపాలరావు నమ్మిన బంటుల్లో ఒకడై, ప్రజల దృష్టిలో, మూర్ఖుడిగా, నీచుడిగా భావించబడతాడు. రాంభూపాలరావు సంకోచించి చేయని పనులు కూడా చేస్తుండేవాడు. నవలాంతంలో వెంకటేశ్వరావు చేసిన అభియోగాలు ఋజువై మూడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష పడి జైలుకు వెళ్తాడు వెంకటాచార్యులు.

**కంఠీరవం**

నవలలోని కథానాయకుడు. వెట్టిచాకరీ విముక్తి నుండి గ్రామ ప్రజలను మేల్కొల్పాలని భావించాడు. తన తండ్రి రఘునాథాచార్యులు చేసే భిక్షాటన తప్పని అందరినీ చేయి చాచి అడగడం, సోమరితనమని భావిస్తాడు. చిన్నప్పుడు తురకపంతులు దగ్గర చదువు నేర్చుకొని, వారింట్లో మనిషిగా ఉంటాడు. తన తండ్రి చనిపోయే ముందు చెప్పిన మాటలకు చలించిపోతాడు. తన అన్న వెంకటాచారిని ద్వేషిస్తాడు. కూటికి లేకున్నాకూలీ చేసుకోకూడదు. అగ్రజాతికి ఉన్న గౌరవం ఏం ఉందని, సంభావనకై చేసే ఆరాటం, పోరాటం, దబాయింపు, దర్పము మాత్రమే అని అందులో ఆత్మగౌరవం ఏముందని ఆలోచిస్తాడు. ఆచార సంప్రదాయాలలో తప్పులు ఉంటే సరిదిద్దాలనే గుణం కలిగినవాడు. మనుషులు మానత్వం కలిగి ఉండాలి కానీ, కులాలు, మతాలుగా విడిపోవద్దని, కోరుకుంటాడు కంఠీరవం. మత పరివర్తన పేరుతో ప్రభుత్వం తలపెట్టిన పనిని ద్వేషిస్తాడు. జిల్లాల్లో గ్రామాల్లో మత పరివర్తన పేరుతో జరుగుతున్న దౌర్జన్యాలు అన్యాయాలు విన్నప్పుడు అసహ్యించు కున్నాడు.

కంఠీరవం మత మార్పిడిలను ప్రశ్నించినందుకు రాజద్రోహం నేరం కింద జైలుకు పోతాడు. జైలులో చిత్రహింసలు అనుభవించాడు, కంఠీరవం ఏమైనా జరిగినా ప్రతిదానికి తెగించి అంజుమన్ వాళ్ళను ఎదిరించాడు. అంజుమన్ నాయకుడు ఇక్కడి నుంచి వెళ్ళిపో అన్నప్పుడు "నా ఊరుకు వచ్చి నన్ను పొమ్మంటున్నావా?"(9) అని ఆత్మగౌరవాన్ని చాటాడు. చిన్నప్పటి నుండి నవలాంతం వరకు కొమరయ్యతో మంచి సోదర సంబంధాన్ని కొనసాగిస్తాడు. తన అన్న వెంకటాచారి,

కొమరయ్య భూమిని అక్రమంగా దొంగ సంతకాలు చేసి రాంభూపాల్ రావుకు చెందేలా చేయడంతో, అతని దొరల తొత్తుగా భావించాడు.

అన్నమ్మ తక్కువ కులానికి చెందినప్పటికీ ఆమె కాళ్ళకు మొక్కి తల్లిలా భావించాడు. మనం చేసే పనుల వల్ల చెప్పే మాటల వల్ల కష్టముగాని, నష్టము గానీ ఇతరులకు కలుగకుండా చూడడం ప్రధానమని, నా ఉనికికి కారణమయ్యే ఏ శక్తి లేక, జీవితో నా విజ్ఞానానికి వేరుగా ఉండడం ఆత్మద్రోహమని భావించే మనిషి కంఠీరవం. జైలు జీవితంలో అన్నదమ్ముల తగాదాలు, దొంగతనాలు గ్రామాధికారుల కుట్రలకు బలై, విసిగి, వేసారి రెచ్చిపోయి హత్యలు చేసిన రైతులు, అరాచక చర్యలను ఎదుర్కొనుటకు చేసిన పోరాటాల వల్ల జైలుకు వచ్చిన అనేకమంది రైతు కూలీలే అన్న విషయం విని గుండె బరువెక్కుతుంది. ఆ పోరాట ఫలమే అంతిమమని తెలిపి "ముఖ్యంగా అందరూ ద్వేషించే ఈ నిరంకుశ ప్రభుత్వానికి తుది ఘడియలు దగ్గరికి వచ్చాయి."(10) అని రాచరిక పాలన అంతం కావాలని కోరుకున్న మనిషి కంఠీరవం. చివరకు హైద్రాబాద్ వెళ్ళి స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహంలో పాల్గొని నిర్బంధించబడి ప్రజల మనిషిగా మారిన కథానాయకుడు కంఠీరవం.

**కొమరయ్య**

గొట్టం కోటయ్య కొడుకు. తను పెంచుకుంటున్న పాలిచ్చే ఆవును దొర కూతురుకు అర్నం ఇవ్వడం ఏంటని? కొమరయ్య పసితనంలో తన మనసు లో మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బాధ, దుఃఖం, గుండె బరువు, ఆందోళన, అమాయకత్వం, కోపం, ఆవేదన అన్నీ కలగలిపిన స్వరంతో ఆవును ఇవ్వవద్దని తండ్రిన బతిమాలుతాడు కొమరయ్య, "ఆవును ఎందుకిస్తున్నవయ్య, ఆవును ఇయ్యకయ్య కొమురయ్య బ్రతిమిలాడినట్లు అన్నాడు. వద్దంటే ఆగుతదా, పిచ్చోడా, నాకు మాత్రం ఇయ్యాలని ఉందా? దొర అడిగిండు ఇస్తున్న అంతే"(11)

కొమరయ్య బడికివెళ్తే, తండ్రి మాన్పించి పొలం పనిలో పెట్టాడు. కౌలు భూమిని వ్యవసాయం చేస్తున్న కోటయ్య కొన్ని రోజులకు మరణించాడు. కొమరయ్య ఆ భూమిని కౌలు చేస్తున్నాడు. ఆ భూమిపై దొర కన్ను పడింది. అర్కలు కట్టి దున్నించి భూమి తనదే అని స్వాధీనం చేసుకున్నాడు. దొర 'జాడ జవాబు లేని బాపనాయన మీకు భూమి ఎక్కడ్నించి అమ్మెనండి. మానోట్లో మట్టి గొట్టాలని కాకపోతే' అని దొరను ప్రశ్నించడం కొమరయ్య ఆత్మగౌరవ ప్రతీకంగా భావించవచ్చు. అందుకు కొమరయ్యను కొట్టి, గుంజకు కట్టేస్తాడు దొర. తల్లి, భార్య కొడుకుతో హాయిగా బ్రతుకుతున్న కొమరయ్యకు భూమి లేకుండా చేసి ఆర్థికంగా దెబ్బతీసి అయోమయంలో పడేస్తాడు తన జీవితాన్ని, మానసిక ఆందోళనతో మరింత నీరసించిపోతాడు కొమరయ్య.

కొమరయ్య, కంఠీరవంను ప్రేమతో ఇంటికి తీసుకెళ్ళి ఆహారంపెట్టి ఆశ్రయం ఇస్తాడు. మతమార్పిడిలు చేస్తున్న సమయంలో హైదరాలిని ప్రశ్నించినందుకు రాజద్రోహం నేరం కింద పోలీసుల చేత చిత్రహింసలకు గురవుతాడు. చివరకు ఆర్య సమాజ్ వాళ్ళ సహకారంతో, గ్రంథాలయ ఉద్యమ పాఠశాలతో, తెలివి నేర్చుకొని తన భూమి కోసం పోరాటం కొనసాగించాడు. చివరకు రాంభూపాల్ రావు జైలుకెళ్ళిన తర్వాత తన భూమిని వెంకటేశ్వరరావు, కొమరయ్యకు ఇస్తాడు.

కొమరయ్య మంచి హృదయం గల రైతు. భూమిని తల్లిలా ప్రేమించడం మాత్రమే తెలుసు. దొర క్రౌర్యానికి బలైన వ్యక్తిగా మనకు కనిపిస్తాడు. చిన్నప్పటి నుండే భావోద్వేగం గల పాత్ర కొమరయ్యది. నేటి సమాజంలో కూడా కొమరయ్య లాంటి కౌలు రైతులు బడా భూస్వాముల ఆగడాలకు బలైపోతున్నారు. ఈ నవలలో కొమరయ్యను కంఠీరవంతో కలిసి జీవించిన ప్రధాన పాత్రల్లో ఒకడిగా మనం చూడవచ్చు. కంఠీరవానికి ఆశ్రమిచ్చిన ఆప్పుడిగా నవల ఆద్యంత ఉన్న మంచి సహాయ గుణం ఉన్న పాత్ర కొమరయ్య,

**అన్నమ్మ**

గొట్టం కోటయ్య భార్య. తను పెళ్ళైనప్పటి నుండి భర్తతో పొలం దగ్గరకు వచ్చి వ్యవసాయ పనులు చేస్తుండేది. కోటయ్య మరణం తర్వాత రాంభూపాల్ రావు

కొమరయ్య భూమి మీదకు అర్కలు పంపిస్తే హైదరాలీని అడ్డుకుని అర్కలకు అడ్డంగా మనవణ్ణి ఎత్తుకొని కూర్చుని అర్కలను సాగనీయదు. మనకు ఈ సన్నివేశం ఇసునూరు దొర రామచంద్రారెడ్డికి ఎదురుతిరిగిన 'చాకలి ఐలమ్మ' ను గుర్తు చేస్తుంది. "చూస్తగడ ఎట్ల దున్నుతరో రౌద్రంతో అన్నమ్మ అన్నది. మనుమడిని అందుకుని, చంకనెత్తుకొని, మళ్ళీ నాగండ్లకు అడ్డంగా నిలుచుంది."(12)

అన్నమ్మ తిరుగుబాటు చూసి హైదరలీ జడుసు కున్నడు. జీతగాళ్ళను కొట్టి పంపించి దొరకు సమాచారం చేరవేసిండు. తమ జీవితం తమ బ్రతుకు ఆగమవు తున్నదన్నప్పుడు, ప్రతీమనిషి తిరుగుబాటు చేస్తాడనే ప్రతీకగా రచయిత అన్నమ్మ పాత్రను చూపించాడు. అన్నమ్మ కంఠీరవంను కన్న కొడుకులా చూసుకొని అన్నం పెట్టిన మహనీయురాలు. తల్లి ముందటే, కొడుకు నోట్లో మట్టి కొడుతుంటే, రేపువాని కొడుకును ఎలా సాదు కుంటాడనే విషయాన్ని అన్నమ్మ ముందుచూపుగా ఆలోచిస్తుంది. దొరగడీలను బద్దలుకొట్టాలని తిరుగు బాటును రగిలించిన పాత్ర అన్నమ్మ.

ఇంతేకాకుండా రాంభూపాల్ రావు ఇంట్లో కట్టు బానిసలా ఉన్న సేతుసింధీ రంగడు, గుమస్తా హైదరాలీ, షావుకారు శంభయ్య, సలహాదారు వెంకటాద్రి, చంద్రయ్య రైతు, కంఠీరవంకు జైలులో పరిచయమయ్యి దొంగ నుండి మనిషిగా మారిన బషీరు.ఆర్య సమాజ ప్రచారకుడు జయదేవు, నిజామాబాదులో కంఠీరవంకు ఆశ్రయం ఇచ్చిన వేదాంతాచార్యులు, భార్య సీతమ్మ, కొడుకు మోహనాచార్యులు తమ, తమ పాత్రలలో కనిపిస్తారు. కోర్టులో జరిగే సంభాషణలు, న్యాయమూర్తి గారి ప్రవర్తన అంతా దొరలకు కొమ్ము కాసేదిగా ఉం టుంది.

మొత్తం మీద పాత్ర చిత్రణలో రచయిత ఎక్కువగా చివరిపేజీలలో అంతా ఉపన్యాస ధోరణిలో కథ నడిపించాడనే భావన కలుగుతుంది. ఇది వ్యవస్థలో ఉ న్న లోపాలను చెప్పడానికే అని అర్థం చేసుకోవాలి.

**దొరల, భూస్వామ్య పెత్తనం - వెట్టిచాకిరీ**

నిజాం నిరంకుశ, భూస్వామ్య విషకౌగిలి, నుండి బయటపడడానికి, తమ ఆత్మ గౌరవాన్ని కాపాడు కోవడానికి, తమ తమ అస్తిత్వాల్ని సమాజంలో నిలబెట్టు కోవడానికి రాజకీయ, ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక స్వాతంత్ర్య కాంక్షల సాఫల్యం కోసం సమిష్టిగా ప్రజలు చైతన్యవంతులైన క్రమమే 'ప్రజల మనిషి',

'ప్రజల మనిషి' నవల ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాల నేపథ్యానికి తన జీవిత అనుభవాలను జోడించి, వాస్తవిక చారిత్రక సంఘటనలను సందర్భానుసారముగా ఉల్లేఖించి, వీర తెలంగాణ రైతాంగ సాయుధపోరాట చరిత్రను తడుము తున్నట్లుగా అనుభూతి కలిగే విధంగా చేసిన రచన. 'ప్రజల మనిషి'. నవల ప్రారంభములోనే గ్రామాల మీద భూస్వాముల, జమీందారుల పీడనలతో కూడిన ఆధిపత్య ధోరణి ఎలా బిగింపబడి ఉంటుందో దొర కూతురు పెళ్ళి తంతులో కనిపిస్తుంది. దొరయింట్లో పెళ్లి వచ్చిందంటే ఆ గ్రామ ప్రజల గుండెల్లో (గుడిసెల్లో) పిడుగులు పడ్డట్టే. ఊరికి ఊరంతా పెళ్ళి తంతును పంపకాలు చేసుకొని నిర్వహించాల్సిందే. పర్యవసానంగా రాంభూపాలరావు తనకూతురికి అరణంగా ఆ ఊరులోని గొట్టం కోటయ్య అనే చిన్నకారు రైతు యొక్క పాలిచ్చే ఆవును బలవంతంగా కొట్టుకుపోతాడు. కోటయ్య కుమారుడు కొమురయ్య పసిహృదయం గాయ పడుతుంది. 'మన ఆవుని దొరకెందుకియ్యాలి? ఊళ్ళో ఇంకెవరికి ఆవులు లేవా?' వద్దంటాడు. మౌనంగా ఉన్న కోటయ్యను ప్రశ్నిస్తాడు. దొర మాటను శిరసా వహించాల్సిందేనని నచ్చజెబుతాడు కోటయ్య. వారిని ప్రశ్నించనంత వరకే దొరలు ఇతరులతో ఎంతో కలుపు గోలుగా మాట్లాడతారు. ప్రశ్నిస్తే ఇక ఉగ్రులై ఎదుటి వారిని కష్టాలపాలు చేస్తారు. ఇటువంటి సంఘటనే రఘునాధాచార్యుల విషయంలో జరిగింది. వివాహం సందర్భంగా రాంభూపాలరావు నిర్ణయానికి విరుద్ధంగా కులాచారాన్ని పాటించబోయిన రఘునాథాచార్యులను పిలిపించి "మేమిచ్చిన భూమిమీద ఇకమీదట మీకేమి జోక్యం ఉండబోదు"(13) అంటాడు. దానికి బదులుగా రఘునాధాచార్యులు 'సరే! మీ చిత్తం, ఇచ్చింది మీరే.

తీసుకుంటున్నది మీరే. ధర్మం దృష్టితో మీ నాయన గారిచ్చారు. ధర్మనిర్వహణ కారణంగానే మీరు ఆ భూమిని తీసుకుంటున్నారు' అని నిష్ఠూరమాడుతాడు.

అలా భూమిని కోల్పోయిన రఘునాథాచార్యుల కుటుంబం నిరాశ్రయమవుతుంది. ఆ పూటకు తినడానికి లేని పేదరికంలోకి నెట్టివేయడంతో, పెద్ద కుమారుడు వెంకటాచారిని వెంటబెట్టుకొని ఊరూరా తిరిగి, భిక్షాటన చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. ఎప్పుడయితే వారి అదుపాజ్ఞల్లో నుండి జారి ధిక్కరిస్తారో వారికి ఆర్థిక దిగ్బంధనాలు కల్గించి తమదారికి తెచ్చుకోవడానికి పీడిస్తారు. ఇక్కడే వెట్టిచాకిరీ మొదలవుతుంది.

అదే విధంగా 'ప్రజల మనిషి' లో కోమటి శంభయ్య కూడా రాంభూపాలరావు ఆర్థిక దోపిడీకి గురయినవాడే. అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడమే కాకుండా ప్రభుత్వానికి దొరకకుండా ధాన్యం దాచి (బాకీ కిందికని), తిరిగి ఆ ధాన్యాన్ని తీసుకురమ్మని, హైదరాలీని పురమాయిస్తాడు. కోమటి శంభయ్య, విజయదేవు, పరంధామయ్యల ముందు తన గోడును వెళ్ళబోసు కుంటాడు. ఈ దొరలు అవకాశం దొరికినపుడల్లా ఆర్థిక దోపిడీ కొనసాగించేవాళ్ళు. ఎంతోకాలం నుండి వంశపారం పర్యంగా దోపిడీ చేస్తూనే ఉన్నారు. అనాదిగా ప్రజలు భరించడానికి అలవాటు పడిపోయారు. కనుకనే దొరల భూస్వామ్య పెత్తనానికి ఆటంకం లేకుండా పోయింది.

**వెట్టి చాకిరీ అమలు చేసే విధానం.**

దొరలు ఆర్థికంగా ప్రజలను కృంగదీసి వారిని బానిస లుగా చేసేవాళ్ళు. కొన్ని కులాల వాళ్ళనయితే తమ ఇళ్ళ లోనే వెట్టిచేయడానికి గడీలో ఓ మూలన ఆశ్రయమిచ్చి రాత్రనక పగలనక చాకిరి చేయించుకొని గంజిమెతుకులు పోసి వాళ్ళను పశువుల కన్నా హీనంగా చూసేవాళ్ళు. ఆనాటి తెలంగాణాలో దొరలు, పటేలు, పట్వారీలు పంటలు పండక పోయినా, ప్రజల నుండి భూమిశిస్తు, గోళ్ళూడగొట్టి, వసూలు చేసి తమ వాటా తీసుకొని మిగిలింది. నైజాము ఖజానాకు పంపేవారు. ఇంతే కాకుండా నగదు రూపములోనూ, లెవీగల్లా అని ధాన్యం రూపంలో వసూలు చేసి వారివారి ధాన్యాగారాలను నింపేవారు. ఈ విధంగా సాంఘిక, ఆర్థిక దోపిడీ వివిధ రకాల పేర్లతో నిరంతరం బలవంతపు వసూళ్ళు చేస్తూ తమ దోపిడీ విధానాల్ని నిరాటంకంగా కొనసాగించేవారు. దొర ఇంట్లో సమర్తాడితే సమర్తపట్టి, ఎవరయినా చనిపోతే బూడిదపట్టి అని పేర్లు పెట్టి వసూళ్ళు చేసేవాళ్ళు. ఇంకా ఎన్నో రకాల ఆర్థిక దోపిడీలు చేస్తూ, ప్రజల శ్రమజీవనం మీద పెత్తనం చలాయిస్తూ, జలగల్లా ప్రజలను పీల్చుకు తినే వాళ్ళు. ఆ దోపిడీ గురించి వింటుంటే మన ఒంటి మీద రోమాలు నిక్కబొడుస్తాయి.

తెలంగాణాలో వెట్టి చాకిరీ విధానం చాలా ఆశ్చర్య కరంగా, దిగ్భ్రాంతి కల్గించే విధంగాను. జుగుప్సాకరం గాను ఉండేది. ఈ వెట్టి విధానం ఆఫ్రికా ఖండాన్ని గుర్తుకు తెస్తుంది. వెట్టి అనగా నిర్బంధ చాకిరి మరియు నిర్బంధ వసూళ్ళు. ఈ వెట్టి విధానం తెలంగాణా ప్రాంత మంతటా వర్తించేది. అన్నివర్గాల ప్రజలు వెట్టికి బలి అయినవాళ్ళే, అణగారిన కులాల కుటుంబాల నుండి పట్వారీ, దేశ్ ముఖ్ ఇండ్లల్లో వెట్టి చేయడానికి ఒకరిని కేటాయించవలసి ఉండేది. కొన్ని కుటుంబాలకు కుటుంబాలే దొరల ఇళ్ళలో ఓ మూలన జీవిస్తూ రాత్రిం బవళు వెట్టి చేస్తూ, సంసారాలు చేస్తూ, పిల్లల్ని కంటూ దొరల కామానికి బలి అవుతూ తరతరాలుగా బానిసలుగా బతుకులు వెళ్ళదీసేవారు. 'ప్రజలమనిషి'లో సేతుసింధి రంగడు.

ఈ వెట్టి చాకిరికి హరిజనులు ఒక్కో గ్రామములో 12-16 వరకు ప్రత్యేకించి ఉండేవారు. వీరు ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు సేవచేయడానికి, టపా మోయడానికి, ఒక్కోసారి కాలువలు దాటించడానికి అధికారులను వీపులపై మోసుకొని దాటించేవాళ్ళు. బోయలు, బెస్తలు, చాకలి వాండ్లు, మరికొన్ని వెనుకబడిన కులాల వాళ్ళు దొరల, పట్వారీల కుటుంబానికి చెందిన స్త్రీ పురుషులను పల్లకీలలో భుజాల మీద మేనాలలో మోసుకుని వెళ్ళవలసి వచ్చేది. ఇటువంటి దృశ్యాన్ని పట్టికోట ఆళ్వారు స్వామి "ప్రజల మనిషి'లో దొర రాంభూపాలరావు కూతురును మొదటిసారి కాపురానికి పంపే సందర్భంగా జరిగే హడావుడిలోని అహంభావ పూరిత ఫ్యూడల్ పెత్తందారీ లక్షణాల్ని మనకళ్ళకు కట్టినట్లు చూపాడు.

దొర రాంభూపాలరావు మేనాలో తన కూతురును, కచ్చడంలో అల్లుడిని కూర్చోబెట్టి సాగనంపుతాడు. ఆ దృశ్యం అమానవీయంగా ఉంటుంది." మేనా, కచ్చడాలు బయలుదేరకముందే ఇద్దరు సేతుసింధీలు వెళ్ళే బాటలో కుండలతో ఎవరూ అడ్డంరాకుండా.ఇంటి అరుగుల మీద ఎవరూ కూర్చోకుండాను, ఎడ్లమూగల చప్పుడుకు పిల్లలు ఎదురుగా రాకుండా అందరినీ తరుముతారు. వీధులు నిర్మానుష్యం అయిన తరువాతే మేనాకు ఇరువైపులా దాసీలు, అల్లుడి కచ్చడానికి దాసీవాడు. బండిముందర మాదిగవాడు (చెప్పులులేకుండా బండిముందు పరుగెత్తుతూ ఉండాలి), బండివెనుక చాకలివాడు, దాని వెనుక ఇంకో కచ్చడం ఖాళీ, దానికి తన కూతురు కోసం దౌర్జన్యంగా గొట్టం కోటయ్య వద్ద అరణంగా తీసుకున్న ఆవు కట్టివేయబడి ఉండగా సాగనంపుతాడు దొర రాంభూపాలరావు. ప్రజల్లో భయము, హేయభావము కనబడుతుంది."(14)

ప్రజల మనిషిలో కంఠీరవ తల్లి అండాలమ్మ విస్తళ్ళు కుట్టే వెట్టి పనిచేస్తుంది. కనకయ్య అనే రైతుకూలీ తన భూమిని కోమటి శంభయ్యకు అమ్ముకుని అదే భూమిలో జీతం కుదిరి కూలీగా బ్రతుకీడుస్తుంటాడు. గొట్టం కోటయ్య తన కుమారున్ని ఆముదపుకాయలు, మిరప కాయలు, కోసుకు రమ్మంటాడు. ఎన్నడూలేంది కంఠీరవ విస్తళ్ళ కోసం మోదుగు ఆకుల కోసం అడవికి రావలసి వస్తుంది. ఇలా వెట్టిచాకిరి నుండి పిల్లలు కూడా మినహాయించబడేవారు కాదు.

చివరగా 1938 నాటికి ముందు కాలంలోనే సుమారు ఒక దశాబ్దపు కాలపు సామాజిక జీవన చిత్రణ, రాబోయే మహాసంగ్రామానికి సాగిన సన్నాహక కృషిగా ప్రజల మనిషి నవల అన్పిస్తుంది. ప్రజల మనిషి కథ అతి పల్చని పొర! ఉద్యమం కోసం అల్లిన చిన్న కథ. ఇది రైతాంగ పోరాట నవల మాత్రమే కాదు, సాంఘిక చరిత్ర! నాటి అమలిన జీవితాన్ని ప్రేమలు, ఆప్యాయతలు, వేదనలను అతిసున్నితంగా, ఆర్ధంగా చిత్రించారు. ఈ నవలలో సంభాషణలు తక్కువ. ఉద్యమం ఉరుకులు స్త్రీ పాత్రలను పట్టించుకోలేదు. అండాళమ్మ-రామాయణంలో సుమిత్ర వంటి వేదనామూర్తి! అన్నమ్మ ఆవేశంకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు.

పాలకులు ఇస్లాం మతస్తులైవుండి ప్రజల్ని ఆ మతంలోకి మార్పించే ప్రక్రియ చేపట్టినప్పుడు ప్రధానంగా హిందూ మతంలో క్రింది కులాలపై ఉన్న వివక్ష అంట రానితనాన్ని చూపించి మత మార్పిడులకు పూనుకునే ఘటనల్ని చక్కగా నవలీకరించాడు. రాజు హిందువైనా, ముస్లిం అయినా పీడకుడు పీడకుడేనని ఈ నవలల్లో పాత్రలు సంఘర్షించి ఉన్నత చైతన్యాన్ని ప్రదర్శిస్తాయి. శ్రమ జీవుల మధ్య ఐక్యతను నిలపడానికి ఆ పేదలే చెప్పే అనేక దృష్టాంతాలతో ఆ సంఘర్షణ ఉంటుంది. అటు బ్రిటీషు పాలకులు క్రైస్తవ మతంలోకి మార్పిడు లను ప్రోత్సహించడంగానీ, నైజాం నవాబు కాలంలో ఇస్లాంలోకి మార్పిడులు కేవలం ప్రజల ఉద్యమ చైతన్యంపై జరిగిన దాడులుగా గ్రహించి ఆళ్వారుస్వామి ఆ పాత్రల చేత ఈ సంఘర్షణను నడిపించారు. మరొకవైపున ఆర్య సమాజీకులు ఇదే అదనుగా ముస్లిం రాజుకు బదులు హిందూ రాజు రావాలనే వాదన లేవదీస్తారు. ఈ వాదనపై కూడా ఆయా సందర్భాలలో ఆయా పాత్రల చేత సరైన విధంగా మాట్లాడించి రచయిత నవల ను సామాజిక , సాంస్కృతిక మార్పు దిశ గా నిలబెట్టారు రచయిత.

**ముగింపు**

తెలంగాణలో ఉన్న ఫ్యూడల్ వ్యవస్థ జర్మనీ లోని నాజీలను మించిన హింస, దౌర్జన్యంలకు చిరునామాగా మారింది అది నేటికీ కొన్ని ప్రాంతాలలో కొనసాగుతూనే ఉంది.

ఎలెక్స్ హేలీ ఆంగ్లంలో రాసిన తెలుగులో సహవాసి చే అనువదించబడిన ఏడుతరాలు నవలలో ఆఫ్రికన్ నీగ్రోలను గొలుసులతో కట్టేసి అంగట్లో అమ్మేస్తారు. దానికంటే నీచమైన స్థితి దొరల గడీలలోనే జీవితాంతం పనిచేసి వారి అత్యాచారాలకు పుట్టిన పిల్లలు కూడా అదే గడీ లో పనిచేయడం, ఇదీ నాటి తెలంగాణలో పరిస్థితి. దొరల బిడ్డలకు పెండ్లి అయితే వస్తువులు, సామాన్లతో

పాటు తమ ఆడపిల్లలను కూడా వారికి దాసీ గా పంపడం అనేది రామాయణంలో వచ్చిన 'అరణపు దాసి మందర'ను గుర్తుకు తెచ్చే సంఘటన లాంటి అనాగరిక చర్యలు ఎన్నో తెలంగాణ చరిత్రలో భూస్వామ్య వ్యవస్థ పెంచి పోషించిన తెలంగాణ మట్టి బిడ్డల వెట్టి చాకిరీ లో మనకు కనిపిస్తాయి. అందుకే కంఠీరవం పాత్రతో తెలంగాణ సమాజ ముఖచిత్రాన్ని నాటి రాచరిక భూస్వామ్య గడీల దొరల పెత్తందారి పాలన వ్యవస్థను, చరిత్రను నవలీకరించిన వట్టికోట ఆళ్వారుస్వామిని మనం అభి నందించకుండా ఉండలేము.

**పాదసూచికలు :**

1. వట్టికోట ఆళ్వారుస్వామి, జైలులోపల కథలు- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ముదిగంటి మజాతారెడ్డి రాసిన ముందుమాట, పుట :5
2. వట్టికోట ఆళ్వారుస్వామి, జైలులోపల కథలు- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ముదిగంటి సుజాతారెడ్డి రాసిన ముందుమాట, పుట:10
3. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, దాశరథిరంగాచార్య రాసిన ముందుమాట, పుట : IV
4. డా॥ భట్టు లక్ష్మినారాయణ, మహెజ్జ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నవలా సాహిత్యం - పరిచయాలు పరిశీలన, జనసాహితీ ప్రచురణ, పుట : 9
5. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:42
6. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:47
7. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:21
8. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట: 19
9. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:74
10. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:152
11. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:3
12. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట: 43
13. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట: 13
14. వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పుట:16

**ఆధార గ్రంథాలు**


1. జైలు లోపల కథలు- వట్టి కోట ఆళ్వారు స్వామి, విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్ ప్రచురణలు
2. ప్రజల మనిషి నవల -వట్టికూట ఆళ్వారు స్వామి -విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్ ప్రచురణలు
3. మహోజ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నవలా సాహిత్యం- పరిచయాలు - డా . భట్టు లక్ష్మీనారాయణ, జన సాహితి ప్రచురణ.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కుల అస్తిత్వాన్ని చిత్రించిన నవల - పుట్టు మచ్చ

- డా॥. ఉరటి సతీష్ యాదవ్
తెలుగు ఉపాధ్యాయులు, జి.ప.ఉ.పా. మేడ్చల్ మల్కాజిగిరి.

**నవలా రచయిత పరిచయం :**

బోయ జంగయ్య గారు నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకాలోని పంతంగి గ్రామంలో ఎల్లమ్మ మల్లయ్య దంపతులకు 1942 అక్టోబర్ 3న జన్మించాడు ఆయన దళిత సామాజిక వర్గానికి చెందిన వాడు తెలంగాణలోని సాధారణ జీవితాలు జీవితాలు నలుగుతున్న జీవితాలు గురవుతున్న జీవితాల ప్రతినిధిగా చూడవచ్చు.

కుల వృత్తుల జీవితాలను అతి సహజంగా మన కళ్ళ ముందు కదిలేలా మనకు తెలిసిన తను చూసిన జీవితాలను కథలుగా నవలలుగా చిత్రించిన ప్రత్యేకమైన శైలి అతనిది దళిత వాద దృక్పథంతో రచనలు చేసిన కథ నవలా శిఖరం అతడు. అంబేద్కర్ ఆలోచన విధానం తోనే సమాజంలో మార్పు వస్తుందని ఆయన మార్గంలోనే తన రచనలు సమాజానికి అందించారు. నిజమైన బతుకు అక్షర జ్ఞానం వల్లనే మారుతుందని నమ్మిన కుల నిర్మూలన చదువు వల్ల కలిగే ఉన్నత స్థానం ఆత్మ గౌరవాన్ని వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుందని ఆర్థిక స్థిరత్వాన్ని కలిగిస్తుందని నమ్మాడు సమాజంలో జరిగే తన రచనలలో ఎత్తిచూపి వాటన్నిటికీ విరుగుడు ముందు చదివే అని పూర్తిగా నమ్మినవాడు బోయ జంగయ్య.

సాహిత్యం మీద అభిమానంతో జంగయ్య లిటరేచర్ చదువుకున్నారు కానీ ఆయన పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్గా చేరి ఖజానా శాఖలో ఎస్సి పదవీ విరమణ పొందారు స్వాతంత్ర్యానంతరం చదువుకున్న తొలి తరానికి చెందిన దళితుడు బోయ జంగయ్య.. చిన్ననాటి నుంచి కులం విధించిన అవమానాలను ఎదుర్కొని బడిలో అడుగుపెట్టాడు ఎన్నో కష్టాలు అనుభవించి ఉన్నత చదువుచదివాడు.

“1963లో కష్టసుఖాలు నాటకం తన తొలి పుస్తకంగా ప్రచురించారు అమెరికాలో నుండి అనేక రచనలు వెలువడ్డాయి జీవితమలుపులు, వీరి కలం నుండి అనేక రచనలు వెలువడ్డాయి ఆ తర్వాత విస్తృతంగా రాసిన విశిష్టమైన కవితల్ని రాశారు. లోకం, గొర్రెలు (1981), ఎచ్చరిక (1984), దున్న రంగులు 1984 చీమలు 1996 తెలంగాణ వెతలు 1998 పూజ కథలు 2000 బొమ్మలు 2002 ఉప్పు నీరు 2002 ఇప్పపూలు 2003 ఆమె 2004 మొదలైన కథాసంపుటాలు ప్రచురించారు మనసులోని క్రూరత్వాన్ని ప్రతీకాత్మకంగా చెప్పడానికి జంతువుల కంటే వికృతంగా ప్రార్థించే దోపిడీదారుల గురించి గొర్రెలు కథలో రాశారు. అంబేద్కర్ చీఫ్ అండ్ రామ్ గుర్రం జాషువా కె.ఆర్.నారాయణన్ జీవిత చరిత్రలను, రాశారు. వీటితో పాటు బాలల కోసం ప్రత్యేకించి బడిలో చెప్పని పాఠాలు

గుజ్జనగూళ్ళు ఆటలు పాటలు చిలకపలుకులు మొదలైన వ్రాశారు.."[1] (డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు 2.5.2014 సూర్య దినపత్రిక.)

అంబేద్కర్‌కు అసలు సిసలు వారసుడు బోయ జంగయ్య అని చాలామంది సాహితీవేత్తలు అభిప్రాయం. తను ఏది నమ్మాడో అదే చేశాడు . దానినే రాశాడు .కుల వ్యవస్థలో కింద నలిగిపోతున్న వారు ఆత్మవిశ్వాసంతో అక్షర సేద్యం తో విజయం వైపు ఆకాంక్షించినజంగయ్య పక్షవాతంతో మరణించారు

**పుట్టుమచ్చ :**

**పరిచయం :**

భారత జాతి చరిత్ర సంస్కృతిలో కులం ప్రముఖ పాత్ర వహిస్తుంది అన్ని మతాలలో కొన్ని శాఖలు ఉన్నప్పటికీ హిందూమతంలో చాతుర్వర్ణ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకుని ఉంది బ్రాహ్మణ వైశ్య క్షత్రియ శూద్ర అనే వర్ణ వ్యవస్థలో బిసి ఎస్సీ ఎస్టీలు అందరూ అయినప్పటికీ మనిషిని మనిషికి దూరం చేసి వారు చేసే పని శ్రమ పండించే ఆహారం అన్నింటినీ తీసుకొని మనిషిని మాత్రమే దూరంగా ఉంచి ముట్టుకోకుండా అంటరానివారిగా ముద్రవేసి సమాజానికి దూరంగా ఉంచిన ఒక పెద్ద మెట్ల కుల వ్యవస్థ అని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని మనం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

అంతా సమానమే అని చెప్పినప్పటికీ ఈ దేశంలో ఆర్థిక సమానత్వం లేదు తద్వారా శ్రమదోపిడి కుల వృత్తుల పేరుతో జరిగింది అది నేటికీ గొర్రెలను బర్రెలను చేపల వల ను ఇవ్వడం ద్వారా పాలక వర్గాలు అధికారికంగా దోపిడీని కొనసాగిస్తూనే ఉన్నాయి. కూటికి పేదలైన అయినాగాని కులానికి పొద్దున్న అనే సామెత కూడా అనాది నుండి సమాజంలో పాతుకుపోయింది అది కాస్త 5000 సమానంగా లేవు కదా అని అవి వేరు గా ఉంటేనే పని చేయగలుగుతాం అని అందుకే సమాజంలో కూడా హెచ్చుతగ్గులు ఉంటేనే సమాజం కొనసాగుతుందని నమ్మించి మోసం చేసి, నిరక్షరాస్యులను విద్యావంతులను కానీయకుండా చేసిన కుట్రలో భాగమే ఈ కుల వ్యవస్థ. దాని నిర్మూలించాలనే భావన లోంచే ఈ రచనలు వివిధ అణగారిన నిమ్న, దళిత కుల అస్తిత్వ రచయితలు పుట్టుకొచ్చారు అందులో భాగంగానే లే జంగయ్య కూడా ఈ మార్గంలోనే కథలు నవలలు రాశాడు అని చెప్పవచ్చు.

**పుట్టుమచ్చ నవల పాత్ర చిత్రణ :**

**మోతి :**

ప్రస్తుత సమాజంలో బ్రతక నేర్చిన స్త్రీగా, రచయిత ఈ పాత్రను తీర్చిదిద్దాడు. నిజానికి ఒక గిరిజన స్త్రీ అయినప్పటికీ, దేశ కాల పరిస్థితులు తెలిసిన గొప్ప జ్ఞానిగా మోతీని ఈ నవలలో చూడవచ్చు. తన పనులు తాను చేసుకుంటూ, ఇతరులకు ఇబ్బందికలుగకుండా, నడుచుకునే మానవతా మూర్తిగా, మనం చెప్పుకోవచ్చు. రచయిత సూర్యాపేట దగ్గర్లో ఉన్న రాంపూర్ తండా వాసి నీ గా పరిచయం చేయడంలో ఆ ప్రాంతంపై రచయితకు పట్టు ఉందని ,భావించవచ్చు. మోతి రాజకీయ నాయకురాలిగా ఎదగాలని, తనవారికి చేతనైనంత సాయం చేయాలనే ఆలోచన ఉన్న మనిషి . వివాహ బంధం వల్ల మనం అనుకున్న మార్పు జీవన విధానంలో రాదు అని నమ్మే వ్యక్తి గా చిత్రించబడింది.

"దీపాలు వెలిగే వేళ ఆమని ఎక్కువగా పిలుస్తుండే వాళ్ళు"[2] అని రచయిత మోడీని ఉద్దేశించి చెప్పే మాటల్లో రాత్రివేళ ఆమె వారికి సంతృప్తినిస్తుంది పనిచేస్తుందని అర్థం ఇచ్చే విధంగా చెప్పడం జరిగింది సహజంగానే గిరిజన స్త్రీలు అందంగా ఉంటారు ఆమెను చూసినప్పుడల్లా సీతాకోకచిలుక గా వన మయూరి గా అభివర్ణించడంలో ఒక రచయిత వారి అందాన్ని కట్టు బొట్టు సంప్రదాయ వస్త్రధారణ వర్ణించడంలో శ్రద్ధ వహించాడు. మూతి గంగను పరిచయం చేసుకున్న సందర్భంలో కూడా అన్న మాటలను బట్టి వ్యక్తిత్వాన్ని పాఠకుడు అర్థం చేసుకునే అవకాశం నవల ప్రారంభంలోనే కలుగుతుంది. మోతికి వయసుకు మించిన అనుభవం తెలివి సమాజంలో ఉన్న మనుషులను చేరడం వల్లనే కలిగింది.

"పిచ్చిదానా ! రాజకీయాలంటే ఏదో పాప కూపం అనుకుంటున్నావు దాని మజా తెలియదు నీకు పదవులు వరిస్తాయి అంతస్తులు పెరుగుతాయి. ఆపైన దండలు,

దండాలు చూస్తంలే"[3] అనడంలో మూతికి రాజకీయాల మీద ఉన్న అవగాహన వాటి వల్ల జరిగే పనులు ,ఆర్థిక లావాదేవీలు, గౌరవం, అన్ని విషయాలు తెలిసిన ఒక భావి రాజకీయ నాయకురాలిగా, మోతిని చూడవచ్చు. మోతి మంచి, చెడు, మానవత్వం ఉన్న గిరిజన స్త్రీ, అనడానికి మోతి గంగ కూతురు గురించి చెప్పిన మాటలు చూస్తే అర్థం అవుతుంది. "పాప గురించి ఏదో ఒకటి చేద్దాం అది మన మధ్య పెరగొద్దు"[4], అంటే మూతి చేసే పని సరైనది కాదని ఆ బాటలో గంగ కూతురును వద్దని తన భవిష్యత్తు బాగుండాలని పాటలు నడిచి జీవితం పాడు చేసుకోవద్దని ఆలోచించిన మొత్తం మనం చూడవచ్చు మొత్తంగా తను అనుకున్న బాటలో నడిచి నలుగురికి ధైర్యాన్నిచ్చే పనిచేసిన ధైర్యవంతురాలు.

గంగ కూతురుని మిషనరీ స్కూల్లో చేర్పించడం గాని ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులు అయిన వాళ్లకు పట్టాలు, ఇండ్లు ఇప్పించటంలో గాని తన స్వార్థం లేని ఒక మంచి మనసున్న మహిళగా మూతిని గుర్తించాలి నేటి సమాజంలో ఇలాంటి ఆలోచనలు ఉన్న ఎంతో మంది స్త్రీలను మనం చూస్తూ ఉంటాం కానీ అనుకున్న లక్ష్యం కోసం సర్వం త్యాగం చేసి వివాహాన్ని వదిలేసి సమాజాన్ని కుటుంబాన్ని ఎదిరించి కష్టాలను ఎదురొడ్డి మార్చుకుని జీవించడం అనేది అందరికీ సాధ్యం కాని విషయం కానీ ఈ విషయంలో అది జరిగింది. అందుకే మోతీ గంగకు ఆదర్శం అయ్యింది తన కుల కట్టుబాట్లను తెంచుకుని తన అస్తిత్వం గుర్తింపు రాజకీయాల్లోనే ఉందని గ్రహించి అటువైపు ప్రయాణించి మారుమూల రామ్ సింగ్ తండా నుంచి ఢిల్లీ కేంద్ర రాజకీయాల్లో కులాన్ని కుటుంబాన్ని సమాజాన్ని ఎదిరించి ధైర్యంగా నిలబడిన ఆదర్శమూర్తిగా దీని అర్థం చేసుకోవడంలో సందేహ పడాల్సిన అవసరం లేదని చెప్పవచ్చు. మూతి అంటేనే ముత్యం ఆమె మలినం లేని హృదయంతో స్వచ్ఛమైన మనసు కలిగిన మంచి స్నేహితురాలిగా కూడా మనం భావించవచ్చు.

**గంగ :**

నాగార్జునసాగర్ ఆనకట్ట పూర్తయి హైడ్రో ఎలక్ట్రిక్ ఉత్పత్తి హౌస్ నిర్మాణం మొదలు కావడంతో గంగా వాళ్ళ అత్త యంకమ్మా పని నిమిత్తం కూలీగా అక్కడికి వచ్చిన తర్వాత గంగా తల్లిదండ్రులు అక్క అందరూ అక్కడికి చేరుకున్నారు.

గంగా సమాజంలో అందరిలాగే ఆనందంగా గౌరవంగా తనకు నచ్చిన పని చేసుకుని బ్రతికితే చాలు అనుకునే ఒక సగటు అమ్మాయి. కానీ నీ అమ్మాయి పుట్టిన కులమే తన జీవితాన్ని నాశనం చేస్తుందని తెలియదు కన్న తల్లిదండ్రులు స్థితిని దగ్గరుండి నేర్పిస్తారు పసి జీవితాలతో పడుపువృత్తి చేయించే కులం ఒకటి మన హిందూ మతం లో ఉందని తను ఆ కులంలోనే పుట్టిందని అప్పటిదాకా ఆమెకు తెలియలేదు.

"గంగా బడికి పోవడం మానేసెయ్? అంది తల్లి రంగి.

ఎందుకు?

ఎందుకు అని ప్రశ్నిస్తే నేను తల్లిని గాని నీవు బిడ్డవు ఉంది ఏమీ అర్థం కాలేదు అదే విషయం ప్రశ్నించినట్టు చూసూ్త తన ఈడు వాళ్ళందరూ బడికి ఎందుకు పోకూడదు అనుకుంది మనసులో. ఏంది ఆ చూపులు చెప్పినగా బడికి బంద్ అని అంది తల్లి"[5]. అప్పుడు తమ ఇంట్లో ఉన్న ఆడవాళ్లు అందరూ చేసే పనులు గుర్తుకు వచ్చి గుండె బరువెక్కింది మనసు మౌనంగా రోదించింది అమ్మ పెద్దమ్మ చిన్నమ్మ చివరకు అక్క అందరూ చేసే పని తాను చేయలేని అని తేల్చి చేసుకుంది గట్టిగా తను వృత్తి నుంచి దూరంగా వెళ్లాలనుకున్నా ఒక మానసిక సామాజిక పరివర్తన ఆదర్శ భావాలున్న అమ్మాయిగా మనం చూడవచ్చు.

పుట్టుమచ్చ నవలలోని ప్రధాన పాత్ర గంగ కథ మొత్తం గంగా పాత్ర చుట్టూ తిరుగుతుంది కులం నుంచి తాను ప్రేమించిన నాయుడు మోసం చేసి వెళ్లిపోవడంతో తన జీవితం అయింది అయినా గతాన్ని తలచుకుంటూ ఒంటరిగానే ముందడుగు వేసి తన జీవిత గమనాన్ని తానే వెతుక్కుంది. గంగ పాత్రచిత్రణలో రచయిత అన్ని కోణాలను సృష్టించాడు పాఠశాల జీవితం మోసపోవడం తల్లి ప్రేమ స్నేహం సేవాగుణం సహాయ సహకారాలు

కుటుంబ భరోసా ఆదర్శ వివాహాలు సాహిత్య పఠనం సమాజ మార్పు లు అన్నీ కూడా పాత్ర అనుభవించిన తీరు పాఠకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది అనడంలో సందేహం లేదు.

**గంగా సేవా తత్పరత :**

అనాథ శవాలకు దహన సంస్కారాలు చేయడం అది ఒక స్త్రీ అయి ఉండి కాలువలు కొట్టుకొచ్చిన శవాలను పోస్టుమార్టం చేయించి దహన సంస్కారాలు చేయించేది తద్వారా సమాజంలో సేవాభావం పెంపొందించేందుకు కృషి చేస్తూ తన గౌరవాన్ని కాపాడుకుంది గంగ.

“హలో హలో గంగ గారా !నేను కమలాకర్ ను మాట్లాడుతున్నా రేపు 10 గంటలకు అక్కడ అ కాలనీలో ముంపు బాధితులకు చెక్కుల ప్రభుత్వ భూముల పంపిణీ సర్టిఫికెట్లు పొందుతారట”[6]

గంగ అధికారుల చుట్టూ తిరిగి వాళ్ళు అడిగినది ఇచ్చి మంత్రి గారితో ఫోన్‌లు చేయించి మరీ నిర్వాసిత భూమి పట్టా వచ్చేలా చేసింది నిజానికి తన బాబు కోసం మాత్రమే కాదు సమాజం మొత్తం బాగుంటే అది చూసి తాను బాగుంటాం అనే కోరిక కలిగింది.

పోలీస్ స్టేషన్ లోకి వెళ్లి పేదరికంతో పెళ్లి చేసి కులాంతర వివాహాలు తప్పు కాదని చెప్పిన గంగా కులనిర్మూలన పోరాటంలో భాగంగానే ఈ పెళ్లి జరిగింది అని చెప్తుంది.

బోయ జంగయ్య గారు గంగా ఎస్ఐ గారి ఆధ్వర్యంలో జరిగిన పెళ్లికి ఎస్ఐ గారితో చెప్పిన మాటలు వింటే సమాజంలో మార్పు జరగాలి అనే బలమైన కోరిక రచయితకు ఉన్నట్టు తెలుస్తుంది. “ప్రేమించుకోవడం నేరం కాదు దాని వెనుక ముందు ఆలోచించుకోవాలి దురదృష్టం ఏమిటంటే మన దేశంలో కుల పట్టింపులు డబ్బుల దర్పం వంటి అడ్డంకులు ఉన్నంతవరకు ప్రేమికుల ప్రేమ అంత సజావుగా సాగదు మరీ వీటిని చూసి అడుగేయాలి సుమా”[7], అని సమాజంలో ఉన్న కులాల పట్టింపులను వివరించారు

ఊళ్లో ఉండే స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే సమాజములో గౌరవ నుండి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తన ఇంట్లో పనిచేసే పనిమనిషితో పాటు ఊరిలో చాలామందికి ఇళ్లు కట్టించి కారంపొడి తయారీపై ఇప్పించి తమ కాళ్ల మీద తాము నిలబడే టట్టు చేసింది.

“స్త్రీకి సంపాదన లేక బలహీనురాలుగా మారిపోతుంది ఆమెకు ఆలోచనలున్న ఆర్థికంగా చేయూత కావాలి”(8). ఈ విషయం మీదనే గంగా ప్రభుత్వాల సహాయ సహకారాలు ఉండాలని తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందనీ చెప్పింది. చివరకు తన కూతురు సాగరి కూడా క్రైస్తవ మిషనరీ ట్రస్ట్‌లో చేరి మదర్ తెరిసా బాటలో నడుస్తూ అలాగే సమాజ సేవకే అంకితమైన తను ఇంకా ఒక పెద్ద డాక్టర్ అయితే చూడాలనుకున్న గంగ కు నిరాశే ఎదురైంది.

“రాములులు అతని చేతి వేలు ఉంగరపు హద్దును రిస్ట్ వాచ్ ను చూస్తూ రెండో వైపు చూసింది అంతే కళ్లు తిరిగి పడిపోయింది వదిలి పట్టుకున్నాడు కాసేపటి తర్వాత తేరుకుని మీద ఉన్న గంగ చూసి దుఃఖంతో తన ఒళ్లోకి తీసుకుని బోరున ఏడ్చేసిందామే”[9]. ఈ సంఘటనలు చెప్పడంలో రచయిత గంగా చేసే సంఘ సేవ పనిలోనే తన జీవితానికి సంబంధించిన నిజాన్ని తెలుసుకుని చేసుకోగలిగింది అని చెప్పవచ్చు ఈ సంఘటనను గతాన్ని చదువుతున్నప్పుడు కాటికాపరిగా హరిశ్చంద్రుడు చనిపోయిన తన కుమారునితో వచ్చిన చంద్రమతి సన్నివేశం గుర్తుకు తెస్తుంది.

**మరికొన్ని పాత్రలు :**

**రంగి :**

దేవుడు మనల్ని ఒళ్ళు అమ్ముకుని బతకాలని ఇచ్చిండు అందుకే ఎన్ని ఇబ్బందులు ఉన్నా వేరే పని చేయలేను అని నమ్మిన అదే రొంపిలోకి తన కూతురు చిన్న కూతురు పారిపోయి గర్భవతిగా రావడం లేక పోయింది చివరకు తన నివాసం వదిలి వేరే గ్రామంలో కూతురు నా సొంత పని చేసుకుని బతుకుతుంది.

**జమున :**

శివను ఇష్టపడింది కానీ తమ కులంలో పెళ్లిళ్లు ఉండవని అభివృద్ధి చేసింది తన చెల్లిని ఈ వృత్తిలోకి

దింపే అని భావించింది చివరకు ఒక ముస్లిం యువకుడు పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడింది.

**వెంకమత్త :**

నాగార్జునసాగర్ ఆనకట్ట కట్టడానికి కూలీగా పని చేసింది తన తమ్ముడు మరదలు తీసుకొచ్చి పడుపువృత్తి చేయించింది గంగా ప్రసాదించడం కోసం తాపత్రయపడి పుట్టిన బిడ్డను సాగింది.

**వెంకటస్వామి :**

సీనియర్ పోలీసు ఆఫీసరు గంగా అ నాయుడుతో కలిసి లేచి పోయినప్పుడు ప్రతి ఇల్లు ప్రతి గ్రామం తిరిగి సోద చేశాడు rangi దగ్గరకు అప్పుడప్పుడు వస్తుండేవాడు.

**నాయుడు :**

కాంట్రాక్టర్ కింద గుమాస్తాగా పనిచేసి కాంట్రాక్టర్ అని చెప్పి తీసుకెళ్లి పెళ్లి చేసుకుని గంగా గర్భం దాల్చిన తర్వాత వదిలేసి వెళ్లిపోయాడు చివరకు నాగార్జున సాగర్ కాలువలో అనాథ శవమై తేలాడు.

**జాన్సన్ :**

ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ విదేశీయుడు తను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య విడాకులు ఇచ్చింది కుటీర పరిశ్రమ కాకా పాడి కోసం అప్లై చేసాడు తన సేవా కార్యక్రమాన్ని ఐ.రా.స.కు పంపి ఉత్తమ సమాజ సేవా అవార్డు వచ్చేందుకు కృషి చేశాడు చివరకు ఇష్టపడ్డాడు.

**సాగరి :**

గంగా కూతురు తన తల్లి హాస్టల్లో వదిలేసిందని తన మీద కోపం పెంచుకుంది గతంలో చెప్పిన తల్లి నీ ప్రేమగా చూస్తుంది మన కులం ఒక పుట్టు మచ్చ పోతుందా అని భావించి మదర్ తెరిసా పాటలు సమాజ సేవను ఎంచుకుంది.

**దుర్గ :**

పనులు దొరకక బెజవాడ వెళ్లి కూలి చేసుకుంటున్న సమయంలో ఆసామి కొడుకు చేత 13 సంవత్సరాల వయస్సులోనే అత్యాచారానికి గురైన ఒక మహిళ. తన తల్లిదండ్రులతో చెప్పుకొని మనసు గాయ పడిన దగా పడిన చెల్లెలు చివరకు పెళ్లి చేసుకొని ఇంట్లో పని మనిషిగా చేరి తన మనిషి నమ్మకాన్ని పూర్తి చేసుకున్న దుర్గ.

**సుశీల :**

మిర్యాల గూడెంలో ఖాళీ సీసాల అమ్ముకునే మహిళ తను కూడా పడుపువృత్తి కులానికి చెందిన మహిళ తన అక్క ఆ వృత్తిలో చివరకు రోగాలతో చనిపోయిందని అతను ఆ వృత్తిలోకి తీయలేదు. పాత సామాన్లు సీసాలు పేరు వచ్చి అమ్మి తన వృత్తిని మరిచి బ్రతుకును మార్చుకున్న మహిళగా మనం సుశీలను చూడవచ్చు.

ఈ విధమైన పాత్ర చిత్రాలతో పుట్టుమచ్చ నవల మొత్తం కూడా కులం రూపు మాసి పోవాలి అనే తపన ప్రతి పాత్రలో కనిపిస్తుంది తమ బ్రతుకులు సమాజంలో గౌరవంగా ఉండాలని కోరికలతో పాత్రలు పనిచేస్తుం టాయి ఇందులో ఇంకా ఇంట్లో పనిమనిషిగా పెట్టుకున్న జానకమ్మ పాత్ర పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకునే దిశగా మలచ బడింది.

లచ్చి కోడే, సీత ,శాంతమ్మ విమలక్క పాత్రలు అన్ని కూడా కింది కులాలకు చెందిన వారు వచ్చిన పనులు చేసి నచ్చినట్టు జీవించటమే నిజమైన ప్రతి నిత్యం పోరాటం చేయాల్సి రావడమే కులం చేసిన గాయం అని గుర్తు చేసుకున్న పాత్రలు.

బోయ జంగయ్య గారు పాత్ర చిత్రణతో పాటు సన్నివేశ కల్పనలు కుక్కలను పందులను కోతులను, పాములను, సందర్భానుసారంగా వాటి కోణాన్ని పాత్రల మనో భావాలకు ఆలోచనలకు అనుగుణంగా తీర్చి దిద్దాడు

**వ్యభిచార వృత్తిలో స్త్రీల కష్టాలు :**

వ్యభిచార వృత్తిలో ఉన్న స్త్రీలను సమాజం ఎప్పుడూ చిన్నచూపు చూస్తూనే ఉంది వాళ్ళు కేవలం ఆచరించ డానికి మాత్రమే పుట్టారని వారికి కోరికలు మనస్సు ఉం డదని, సమాజం ఆలోచిస్తుందని రచయిత చెప్పాడు. ఆ సమాజమే తాము మారాలని చూసిన వారిని అదే కోణంలో చేస్తుంది.

"ఒంటి గంటకు ఇద్దరూ సారా సీసాతో వచ్చి ఎంత తిని తాగి తాగి ఒకరినొకరు అన్నారట మీ పెద్దమ్మ పైసలు అడిగింది తాగి తింటివి అంతే పడేసి తొడల మధ్య సిగరెట్లతో కాల్చింద్రట"[10].రచయిత బయట జరిగే నిజాన్ని నిక్కచ్చిగా చెప్పాడు .

యాదగిరిగుట్ట దగ్గర బస్సు ఎక్కిన సన్నివేశం, వ్యభి చారం కేసులో అరెస్టు కాబడిన స్త్రీల గురించి రచయిత వివరించాడు ప్రస్తుతం కూడా చూపిస్తారు కాని గడిపిన విటులను ఎక్కడ అరెస్టు లేదా చూపించారు అని ఈ సన్నివేశం ద్వారా మనకు తెలుస్తుంది.

"ఈ స్థితి ఎన్నడు మారదు పొట్టకూటి కోసం బట్టలు విప్పడం నేరం పోలీసుల దౌర్జన్యం దోపిడి అంగట్లో అమ్మకాలు కంపెనీల కథనాలు ఎన్ని ఘోరాలు తలుచు కుంటూ నిట్టూర్పుతో చెంప మీద చేయి వేసుకున్నాడు బాగా తాగి ఉన్నడు ముఖాన్ని చేతిలోకి తీసుకుని కసిగా ఏం చేస్తావ్ అక్క ఉంది లంగావోని అమ్మాయి వరకు ఊరు కూడా మొదట ఎక్కి ఊరికి పోయిన తన జాకెట్ చూసుకుంటూ"[11]. ఈ విధంగా వేశ్య వృత్తిలో ఉన్న స్త్రీల కష్టాలను కళ్లకు కట్టినట్టుగా వివరించారు బోయ జంగయ్య.

"వాళ్ళు ఒళ్ళు అమ్ముకునే స్థితి నుండి వస్తువులు అమ్ముకునే మార్గంలోకి మళ్ళించే చేయాలి ముందు అక్షరజ్ఞానం వస్తే అన్నీ వాటంతట అవే ఆరిపోతయి."[12]

**సంచార జాతుల సర్కస్ ఫీట్లు :**

"డోల్ మోగుతుంది తండ్రి వచ్చి తన బిడ్డ వెన్నున చేయు ఉంచిండు. అంతే ఆ పిల్ల ధనుస్సు లాగా ఒంగి వెనకనుండి తన కాలి బొటనవేలు పట్టుకుంది తండ్రి ఆమెను రింగులు చేయి వేసి పట్టుకున్నట్టు పట్టుకుని తన చుట్టూ తిప్పి ముందుకు అప్పటివరకు వచ్చి నిలుచున్నాడు చూస్తున్నారు"[13]

ఇప్పటికీ పట్టణాలు గ్రామాలలో ప్రధాన కూడళ్ల దగ్గర సర్కస్ పెట్టి సాయంత్రం వేళల్లో చిన్న పిల్లల చేత ఫీట్లు చేస్తూ తమ జీవనోపాధిని నేటికీ మన కళ్ళముందు తారస పడతాయి.

రచయిత తమ కులం వాళ్ళు చేసే వృత్తుల నుండి వారు అభివృద్ధి చెంది మార్పు కోరుకుని విజ్ఞానం సంపా దించటం లేదని తను చేసిన పనినే పిల్లల చేత కూడా చేస్తున్నారంటే సమాజాన్ని ఎడ్యుకేట్ చేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని భావించవచ్చు దీనికి ప్రధాన కారణం లేకపోవడమే అనే విషయాన్ని రచయిత పూర్తిస్థాయిలో వివరించాడు.

"డోల్ శబ్దం మారింది అమ్మాయి ఒక కొండ నుండి మరొక వస్తుంది ఊపిరి బిగబట్టి చూస్తున్నారు తాడు ఊగుతూ ఉంది బ్యాలెన్సు సరి చూసుకుని పిల్ల ముందుకు నడవడమే కాకుండా వెనక్కి కూడా ఆమె నడుస్తుంటే గుడ్లప్పగించి చూస్తున్నరు."[14]

సంచార జాతులవారు తన జీవితాంతం పిల్లలను అదే పని చేస్తూ వారికి బతుకు తెరువు సర్కస్ మాత్రమే అని లాగా పెంచుతారు అది కాస్త తరతరాలకు తరలి వస్తూనే ఉన్నది. రచయిత చెప్పినట్టుగా కుల వృత్తుల కట్లు తెంపుకొని ఇంకా బయటకు రాలేని ప్రజలు ఎందరో ఉన్నారు వారు కూడా అస్తిత్వాన్ని తరచి చూసుకుని కుల నిర్మూలనకు పాటుపడాలని అందులో భాగంగానే వివక్షకు గురవుతున్నారు కులాల గురించి ప్రస్తావించాడు బోయ జంగయ్య.

**విప్లవం, నక్సలిజం, ఎన్‌కౌంటర్లు :**

నల్లగొండ జిల్లా గురించి ప్రస్తావనకు వచ్చినప్పుడు ఆ విప్లవం గురించిన విషయాలను చర్చించడం సహజం ఎక్కడ అనిచివేత ఉంటుందో అక్కడ తిరుగుబాటు మొదలవుతుంది ఈ విషయం నల్లగొండలో ఉన్న భూస్వామ్య వ్యవస్థ వీటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడి సాయుధ పోరాటం కూడా చేసిన చరిత్ర నల్లగొండ సొంతం అందుకే రచయిత గురించి వివరించే ప్రయత్నం చేశారు.

పాఠకుడిని ఆలోచింప చేస్తూ అనుమానాలు రేకెత్తి స్తుంది మూతి నక్సలైట్లు అయిపోయిందేమో అనే భావన కలిగేలా కథ కొనసాగుతుంది క్రిస్టియన్స్‌లో నన్ను కూడా చేయలేదని చర్చి ఫాదర్ చెప్పిన తర్వాత పాఠకుడి ఆలోచన బలపడుతుంది కానీ అది నిజం కాదని ఢిల్లీ

చేరిన చూసినంక తెలుస్తుంది ఎర్రజెండా విషయాలను రాయడం మనకు కనిపిస్తుంది.

"కనగల్ రోడ్డు మలుపులో ఎన్‌కౌంటర్ ఓ మావోయిస్టు మృతి. ఆయన భార్య పరారు. ఆమె ఆచూకీ తో పాటు ఆమెకు సహకరించిన మరో స్త్రీ కోసం ఆరా తీస్తున్న పోలీసులు"[15]. దీనిని బట్టి ఆ కాలంలో మావోయిస్టులు నల్లగొండ జిల్లాలో ఉన్నారని మహిళలు కూడా ఉద్యమంలో పాల్గొన్నారని అర్థమవుతున్నది తుపాకులు బట్టి చనిపోతున్న వాళ్ళలో అధిక శాతం మంది పేద బలహీన వర్గాల వాళ్లే చనిపోయేది"[16] ఈ క్రమంలోనే గద్దర్ నారాయణమూర్తి లో పేరును రచయితా ప్రస్తావించాడు.

"మర్రిగూడెం వైపు ఎన్కౌంటర్ జరిగిందట ఓ చిన్న పాప తో సహా నలుగురు ఐదుగురిని చంపిండ్రట"[17] దళిత బహుజనులు ఎన్కౌంటర్ల పేరుతో చనిపోకూడదని చదువుకునే విజ్ఞానంతో సమాజాన్ని మార్చాలని కోరుకున్నట్లుగా రచయిత మనకు కనిపిస్తాడు.

**పుట్టుమచ్చల ద్వారా రచయిత ఇచ్చిన సందేశం :**

ఒక సందర్భంలో ఏడు తరాలు నవలను పరిచయం చేస్తాడు రచయిత. మరొక చోట మొదటి పంతులమ్మ గా సావిత్రిబాయి పూలేను పరిచయం చేస్తాడు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని విజ్ఞానపు విషయాలను గుర్తుకు తెస్తాడు. గంగా జాన్సన్ ఒకరినొకరు ఇష్టపడి కుల మత దేశ కాల పరిస్థితులను మార్చి వేసే దిశగా ముగింపు ఇచ్చాడు "అంబేద్కర్ బొమ్మ ను దాటుతున్నప్పుడు గంగా అంబేద్కర్ స్త్రీ జాతి మేలు కోసం ప్రవేశపెట్టిన హిందీ బోర్డు బిల్లు వ్యతిరేకించిన వాళ్ల గుర్తుకు వచ్చారు విగ్రహం కింద బోధించు సమీకరించు వ్యతిరేకించు అన్న పదాలు కనిపించినయి."[18]

కూతురు సాగరితో మనం చచ్చేదాకా కులమనే పుట్టుమచ్చ అని చెప్పిన రచయిత చివరకు జాన్సన్ చేత పుట్టుమచ్చ సమాజం ప్రపంచీకరణలో భాగంగా మారు తుందని ఆహ్వానించాలని చెప్పినట్టుగా మనకు అర్థ మవుతుంది.

**పుట్టుమచ్చ నవలలో ఉపయోగించిన సామెతలు :**

ఎవని పిండం ఎవని గండం - 33
తల్లిదండ్రి కంటే దైవం లేదు. -34
సంచిలో దుడ్లు సరసానికి మెట్లు. -37
తొడ కలిసి తొంబై ఏళ్లుగుర్తు. -38
ఆడదానికి చేసిన సాయం అరటి చెట్టుకు పూసిన నీరు వృధా కావు -54
మాను బాగుంటే మాన్యాలు సాధించొచ్చు -54
ముచ్చట సంబురాన మొగన్ని మరచినట్టు -54
ఇచ్చి పుచ్చుకో నోడు వళ్ళంతా గిచ్చి చూసే -63
సరసానికి సాలీడు-63
నలుగురితో నారాయణ-63
పైసలు ఉంటే పది మంది-63
చూస్తే కంటికి సంబూరం తాకిటే వంటికి తృప్తి -73
ఆడది ఐస్కాంతం అయితే మొగోడు ఇనుప ముక్క.-81
ఒంటె పెదవులకు నక్క ఆశపడ్డట్టు - 85
నిండుకుండ తొణకదు.-148
పనిలేని పరుగు రుచి లేని నాకుడు." -(19) పుట 18

**ముగింపు :**

"చూడు గంగా కులమనే పుట్టుమచ్చ ఉంటే ప్రతి ఒక్కరూ పుడతారు నిజమే అది మారదు అన్నావు కానీ మనిషి రంగు ని మార్చేస్తున్న కాలం ఇది మార్చడం పెద్ద ఇదేమీ కాదు దానికి కొంత టైం కావాలంతే"(20)అని రచయిత ఈ నవల ద్వారా సమాజం మారుతుందని సావిత్రిబాయి పూలే అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా కుల నిర్మూలన జరుగుతుందని కులం అనే పుట్టుమచ్చ నశించాలని బలంగా కోరుకున్నాడు బోయ జంగయ్య గారు.

అణగారిన కులాలు అక్షర జ్ఞానం నేర్చుకున్న ప్పుడే కులం అనే పుట్టుమచ్చ నశిస్తుందని రచయిత గట్టిగా నమ్మాడు...

**పాదసూచికలు :**

1. డా॥ దార్ల వెంకటేశ్వరావు, సూర్య దిన పత్రిక, మే 02, 2011
2. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 01
3. బోయజంగయ్య, పుట్టుమచ్చ. బోజ పబ్లికేషన్ - 2011 పుట : 03
4. బోయజంగయ్య, పుట్టుమచ్చ. బోజ పబ్లికేషన్- 2011 పుట : 40
5. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 04
6. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 52
7. బోయజంగయ్య, పుట్టుమచ్చ. బోజ పబ్లికేషన్ 2011 పుట : 56
8. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 150
9. బోయజంగయ్య, పుట్టుమచ్చ, 5 - 6 పబ్లికేషన్- 2011 పుట : 124
10. బోయజంగయ్య, పుట్టుమచ్చ, 5 - 6 వ పబ్లికేషన్- 2011 పుట : 15
11. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 108
12. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 109
13. బోయజంగయ్య, పుట్టుమచ్చ. బోజ పబ్లికేషన్- 2011 పుట: 12
14. బోయజంగయ్య, పుట్టుమచ్చ. 65- 6- 23 పబ్లికేషన్- 2011 పుట : 13
15. బోయజంగయ్య, పుట్టుమచ్చ, 5 పబ్లికేషన్ - 2011 పుట : 113
16. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్ - 2011 పుట : 113
17. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్ - 2011 పుట: 147
18. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్ - 2011 పుట : 148
19. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్ - 2011 పుట : 18, 33, 34, 37, 38, 54, 63, 73, 81, 85, 148
20. బోయజంగయ్య, పుట్టుమచ్చ, బోజ పబ్లికేషన్- 2011 పుట : 01

**ఆధార గ్రంథాలు :**

1. బోయ జంగయ్య, పుట్టుమచ్చ, భోజ పబ్లికేషన్ 2011.
2. సూర్య దినపత్రిక, మే 2, 2011.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవల - జాతీయోద్యమ చిత్రణ (మాలపల్లి, వేయిపడగలు నవలలు)

- డా॥. టేకు నీలకంఠబాబు
తెలుగు ఉపాధ్యాయుడు, టిజిటి తెలుగు, రాజీవ్ నగర్ కాలనీ తొర్రూర్, మహబూబాద్, తెలంగాణ.

**జాతీయోద్యమం - వివరణ, లక్ష్యాలు, లక్షణాలు :**

19వ శతాబ్దం రెండవ పాదంలో భారతదేశంలో జాతీయ, రాజకీయ చైనత్యం వెల్లి విరిసింది. అప్పటికి ప్రజలందరు జాతీయోద్యమానికి తమ పూర్తి సహకారాన్ని ప్రకటించారు. 1885 డిసెంబరులో భారత జాతీయ కాంగ్రెస్ అనే సంస్థ ఆవిర్భవించింది. దాని సహాయంతో భారత ప్రజలు స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సుదీర్ఘమైన, ధైర్యోపేత పోరాటం సాగించారు. ఆ పోరాట ఫలితంగానే మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించింది. దానినే మనం జాతీయోద్యమాన్ని లేదా స్వాతంత్ర్య సమరం అంటూ పిలుస్తున్నాం.

"భారత జాతి యావత్తు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడం వల్ల ఇది భారత జాతీయోద్యమం అయింది"[1] (తెలుగు నవల జాతీయోద్యమ ప్రభావచిత్రణ, డా॥ టేకు నీలకంఠబాబు, పుట.4, ).

**జాతీయోద్యమం లక్ష్యాలు, లక్షణాలు :**

పారతంత్ర్య భారతాన్ని స్వాతంత్ర్య దేశంగా చేయడమే జాతీయోద్యమం యొక్క ముఖ్య లక్ష్యం. ఇరవయ్యో శతాబ్ది తొలి భాగంలో ఈ ఉద్యమం వేగం పుంజుకుంది.

ఈ ఉద్యమ ప్రభావం తెలుగు సాహిత్యంపై కూడా ప్రభావం చూపింది. ముఖ్యంగా కవిత్వం, కథ, నవల, నాటకం లాంటి ప్రక్రియలపై జాతీయోద్యమ ప్రభావం కనిపిస్తుంది.

జాతీయోద్యమ లక్ష్యాలు కొన్ని "1.జాతీయోద్యమంలో సహాయ నిరాకరణోద్యమాన్ని అమలు పరచడం, 2.సత్యాగ్రహాన్ని పాటించడం, 3.విదేశీ వస్తువులను బహిష్కరించడం, 4.హరిజనోధరణను కలిగి యుండుట. సమ్మెలు చేయడం, జైళ్ళకు పోవడం లాంటి"[2] మరెన్నో అంశాల్ని పేర్కొనడం జరిగింది. (తెలుగు నవల జాతీయోద్యమ ప్రభావ చిత్రణ, డా॥ టేకు నీలకంఠబాబు పుట.5,)

జాతీయోద్యమ లక్షణాల్ని ఈ విధంగా పేర్కొనడం జరిగింది. "1.వందేమాతర గేయాన్ని కలిగియుండటం. 2.వస్తు వినియోగంలో కాని, విద్యలో కాని స్వదేశీ భావము కనిపించేలా ఉండటం, ప్రతిఘటనలు - పురోగమనము ఉండటం, 3.హరిజను సమస్యను కలిగి ఉండటం, 4.వ్యసన ప్రస్తావన, గాంధీజీ ప్రశంసను కలిగియుండటం"[3] (ఉద్యమ దర్శనము - ముదిగొండ శివప్రసాద్, పుట.259)

**మాలపల్లిలోని జాతీయోద్యమ ఛాయలు - పరిశీలన - వివరణ :**

తెలుగులో తొలి నవల వెలువడ్డాక విస్తృత నేపథ్య చిత్రణతో తొలి సామాజిక నవల రావడానికి చాలా కాలమే

పట్టింది. అయితే తెలుగులో తొలి నవల కందుకూరి వారు రాసిన 'రాజశేఖర చరిత్ర' అని మనకు తెలుసు. కాని ఈ రచన కాలంలో అత్యధికంగా మత, సంఘ సంస్కరణల్ని మాత్రమే చిత్రించారు అప్పటివారు.

కారణం అందరూ కూడా కందుకూరి ప్రభావితులే. 9 తర్వాత అనగా ఏడేళ్ళ తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, 1919లో గాంధీజీ కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టడం వల్ల మిగతా ప్రాంతాలతో పాటు ఆంధ్ర దేశంలో కూడా జాతీయోద్యమ వెల్లి వెరిసింది. దాంతో జాతీయోద్యమం అంటే మక్కువ గల ఉన్నవ లక్ష్మీనారాయణ గారికి జాతీయోద్యమంతో సంబంధం ఏర్పడింది. దీనివల్ల అయిన తన సునిశిత పరిజ్ఞానాన్ని ఉపయోగించి 'మాలపల్లి' నవలకు స్వీకారం చుట్టాడు.

ఐతే ఇందులో రామదాసు కుటుంబం ప్రత్యక్షంగా జాతీయోద్యమంలో పాల్గొన్న దాఖలాలు నామమాత్రంగానే కన్పించును. కానీ జాతీయోద్యమానికి ప్రేరణగా, ఉద్రేకంగా ఉపయోగపడే సన్నివేశాలు రచయిత చిత్రణలో కొలమానంగా ఉన్నవని చెప్పవచ్చు.

**కొన్ని ఉదాహరణలు :**

'మాలపల్లి' నవల ఆనాటి ప్రజల జీవన విధానం గురించి చెబుతున్నది. ఆనాటి కాలంలో కల్గిన ఆర్థిక, సాంఘిక పరిణామాల్ని కథానుగుణంగా వర్ణిస్తూనే ఇంకో ప్రక్క బ్రిటీషు వారి దమన నీతిని, కుట్రలను తెలియజేస్తుంది.

రామదాసు కుటుంబం ఐచ్ఛిన్నం అయిన తర్వాత వేంకట దాసు పారిపోయి సాయుధ ధళంలో కలిసి బందిపోటు 'జగ్గడి'గా పేరు పెట్టుకుంటాడు. మార్చుకుంటాడు. అతను బందిపోటు నాయకుడైన 'జగ్గడి' గా మారి ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని వారి క్రింద పనిచేసే - భారతీయ అవినీతి ఉద్యోగులను, ఏ ఒక్కరిని వదల కుండా వారి భరతం పట్టుతుంటాడు.

"అపుడు ఉత్తర హిందూస్తానంలో సుప్రసిద్ధ అన్వీక్షకి శాఖాధికారి అయినటువంటి దివాన్ బహదూర్ రామ్ సింగ్ జి.సి.ఏ.ఐ రాలిని మూడు ప్రభుత్వాల వారు అధిపతిగా నియమించి కర్నూలు సూపరిండెంటును ఇస్తారు. అతను జగ్గడిని ఏడ్పుకునేందుకు సింగు, స్పెన్సర్‌ని జగ్గడు ఎక్కడెక్కడ ఉంటాడో ఊహించి చెప్పమంటాడు. దానికి స్పెన్సర్ గారు మొదట పాపికొండలు గురించి తర్వాత రావూరి కొండల గురించి, చెప్పి, తర్వాత నల్లమల అడవుల వైఖరి గురించి కూడా చెప్పూ బ్రిటిషు రాజ్యంలో ఉంటే నల్లమలలో ఉంటాడు. యీ భాగంలో వుండాలె దానిని మట్టుడింతా"[4] అంటాడు. (తెలుగు నవల జాతీయోద్యమ ప్రభావ చిత్రణ, డా॥ టేకు నీలకంఠబాబు పుట.37,)

ఇందులో బ్రిటీషు వారి ప్రసక్తి కనిపిస్తుంది. కావున ఆనాడు నల్లమల కడప ప్రాంతాలు బ్రిటిషువారి పరిపాలనలో లోబడి ఉన్నాయని తెలుస్తుంది.

అలాగే మరోక ఉదా: "రామదాసు సెటిల్ వెంట్‌లో ఉన్నపుడు బాలు కూతురు జ్యోతి విషయంలో దురాగతం చేపేటట్టు ఉన్నాడని బ్రాన్సన్ గారికి చెప్పే సందర్భంలో "స్వరాజ్యం వచ్చిన తర్వాత కానీ మనదేశ కష్టాలు తీరవని సంగడు చెబుతుండేవాడు. వాస్తవం, సేనలోకి మనుష్యులను చేర్చుకొనడానికీ క్రైస్తవ మతం వ్యాపింప చేయడానికీ తప్ప ఈ సెటిల్‌మెంట్లు మోరల్ వల్ల ఇతర ప్రయోజనా లేదు పూజ్యం వచ్చిన తర్వాత పద్ధతులన్ని మార్చి వీటిని గ్రామాలుగా చేయవలసి ఉంటుంది"[5]. (తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణ, డా.కురెళ్ళ విఠలాచార్య, పుట.165)

**'వేయిపడగలు' నవలలోని జాతీయోద్యమ ఛాయలు - పరిశీలన - వివరణ (సంక్షిప్తంగా)**

'వేయిపడగలు' కవి సమ్రాట్ శ్రీవిశ్వనాథ సత్యనారాయణ (1895-1976) గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కలం నుంచి జాలువారిన మహత్తరమైన నవలే 'వేయిపడగలు'. అదొక మహాకావ్యం.

ఈ వ్యాసం పత్ర సమర్పణ కోసం తయారు చేసింది. కావున వుద్దేశ పూర్వకంగానే ఒక ఉదాహరణతో ముగిస్తున్నాను.

'వేయిపడగలు' నవల కథాకాలం 1920-30 ప్రాంతాల నాటిది. అప్పటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, పరిణామాలు ఇందు చూపబడ్డాయి. ఆ కాలం సంధి

యుగం అప్పుడప్పుడే పాశ్చాత్య వ్యామోహం నుంచి కొందరు కళ్ళు తెరుస్తున్నారు. జాతీయ భావాలు ప్రబల తున్నాయి.

నిజంగా 'వేయిపడగలు' వచ్చిన కాలం జాతీయోద్యమ కాలం.

ఈ నవలలో విశ్వనాథ వారు కొన్ని పాత్రలను గాంధీజీ ఉద్యమానికి ప్రభావితమయ్యేటట్టు చిత్రిస్తాడు. ప్రధానంగా 'కేశవరావు'.

"కేశవరావు గాంధీగారి ఉద్యమం రాగానే ప్రశస్తగా సాగుతున్న తన న్యాయవాద వృత్తిని వదులుకుంటాడు. మహాత్ముని సహాయ నిరాకరణోద్యమంలో ఇంగ్లీషు బోధించే కళాశాలలను విద్యార్థులు వదిలేస్తారు. వారు చెడిపోకుండా విద్యార్జనకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయవలసిన బాధ్యత దేశభక్తులపై పడింది."[6] (తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యంలో చిత్రణ - డా.కూరెళ్ళ విఠలాచార్య పుట.183)

ఈ విధంగా నవల ఆద్యంతం పరిశీలిస్తే ఎన్నో జాతీయోద్యమ ఛాయలు అగుపిస్తాయి.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'చింతల' చేనులో మధ్య తరగతి మనుషుల బ్రతుకు పోరు

- సురేష్ సుండుపల్లి
తెలుగు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కలికిరి, అన్నమయ్య జిల్లా.

**పరిచయం :**

ఆర్.సి. కృష్ణ స్వామి రాజు పల్లెటూరు జీవన విధానాల నుండి నగరవాసుల నాగరిక జీవితం వరకు, మూగ జీవాల పట్ల ప్రేమను, బడుగు జీవుల వేదనను ఉమ్మడి చిత్తూరు జిల్లా మండలికంలో పరిచయం చేసిన కథా రచయిత.

ఇప్పటివరకు 19 కథా సంపుటాలు మూడు నవలలు వెలువరించారు. ఇవన్నీ కూడా పాఠక లోకాన్ని అల రిస్తున్నాయి. ఇవి ఉమ్మడి చిత్తూరు జిల్లా తూర్పు మండలాలు అయినటువంటి నగరి, పుత్తూరు, నారాయణవనం, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి పరిసర ప్రాంతాలలోని సామాన్యుల భాషలో సామాన్యుల జీవన విధానాలను ఇతివృత్తంగా తీసుకొని పాఠకుల మదిలో మార్పుని తీసుకొచ్చేలా వీరు రచనా వ్యాసంగంలో కొనసాగుతున్నారు. రాజు గారి ప్రతి రచన కూడా ఏదో ఒక బహుమతి పొందుతున్నాయి. సామాజిక అంశాలను ప్రధానంగా ప్రకృతి, రైతులు, సామాజిక అసమానతలు, జీవ కారుణ్య భావనలు, వ్యక్తుల మధ్య సంబంధాలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి విద్య ఆవశ్యకతను తెలియజేశారు. అట్టడుగు ప్రజల కుటుంబ జీవితాలని, ఆలోచనలని, సామాజిక పరిస్థితులను అత్యంత సహజంగా కళ్ళకు కట్టినట్లు తన రచనలలో మన కళ్ళ ముందు నిలిపారు. రాయలసీమ సాంస్కృతిక విశేషాలను, జీవన విధానాన్ని చిత్రిస్తున్నారు అని పల్లిపట్టు నాగరాజు చెప్పిన విధంగా లోకంలోని మంచిని గురించి ఎక్కువగా మాట్లాడే ప్రేమైక జీవిగా కనిపిస్తాడు.

రాజు గారు రాసిన మేకల బండ, మునికృష్ణుడి మాణిక్యం, చింతల చేను ఈ మూడు నవలల్లో చింతల చేను నవల నేపథ్యాన్ని ఇతివృత్తాన్ని పాత్రల మధ్య సంఘర్షణని పరిశీలిద్దాం!

**నవల వస్తు విశ్లేషణ :**

గుణశేఖరుడు పెట్టుబడి ఒక్క రూపాయి లేక పోయినా అప్పు చేసి ట్రాక్టర్ కొని ఎన్నో కలలతో జీవనం మొదలుపెడతాడు. మొదట్లో కొద్ది రోజులు బాగా జరిగిన తర్వాత కాలంలో రైతులు డబ్బులు సక్రమంగా ఇవ్వక పోవడం, కొందరు సగమే ఇవ్వడం అనుకోకుండా ట్రాక్టర్ తిరగపడి గుణశేఖరుడి చెయ్యి విరగడం దానితో నెలవారి డబ్బులు చెల్లించలేక అప్పులు పెరిగిపోవడం, జబ్బు చేసి ఆరోగ్యం క్షీణించడం రోజురోజుకీ కుటుంబ పరిస్థితులు దిగజారిపోవడం చివరికి భూమి అమ్మి అప్పులు తీర్చాలి అనుకోవడం ఆ భూమి కూడా ఆక్రమణలకి గురి కావడంతో అప్పు తీర్చకపోవడంతో ట్రాక్టర్ కూడా పోగొట్టు

కుంటారు. చివరికి రైతుగా సాధించలేనిది తన కొడుకు విద్యా ఉద్యోగం ద్వారా సాధించి తండ్రి కలలు నెరవేర్చడంతో నవల ముగుస్తుంది.

**పాత్రల చిత్రణ :**

చింతల చేను నవల ఒక కరువు కథ. పదిమందికి అన్నం పెట్టేవాడు పిడికెడు అన్నం కోసం చేయి చాచే దైన్యపు కథ. ఒకరి దగ్గర పని చేసిన స్థాయి నుంచి ఒకరికి పని ఇచ్చే స్థాయికి వెళ్లేందుకు పోరాటం చేసిన ఒక ట్రాక్టర్ యజమాని కథ. భూమిని నమ్ముకున్న రైతే కాదు, రైతును నమ్ముకున్న ఇతర వృత్తుల వాళ్లు కూడా నిలువునా మునిగిపోతున్నారని పచ్చి వాస్తవాన్ని ఈ నవల ఆవిష్కరించింది. ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా కూడా తగిలే కరువు దెబ్బను మన కళ్ళకు చూపించింది.

ఒక ట్రాక్టర్ సెకండ్ హ్యాండ్దైనా సరే కొనుక్కుంటే తన ఆర్థిక పరిస్థితి బాగుపడుతుంది అనుకునే గుణశేఖరుడు అతడికి అణువణువునా ధైర్యాన్ని నింపి తన బిడ్డ పరిస్థితిని చూసి తల్లడిల్లే తల్లిగా నారాయణమ్మ, కుటుంబ బాధ్యతలు తన వంతుగా భర్తకి తోడునీడగా ఉంటూ బాధ్యతలు పంచుకునే భార్యగా హైమావతి, తల్లిదండ్రులు కష్టాన్ని చూసి,ఆ కష్టాలన్నీ పోవాలంటే ఏం చేయాలి అనే ఆలోచనలు కలిగిన బిడ్డగా బాలాజీ ముఖ్య పాత్రలు గల కథ.

ఈ నవల ఈ చిన్న కుటుంబం చుట్టూతానే పరిభ్రమిస్తుంది. వీరే కాకుండా వడ్డీకి డబ్బులు ఇచ్చి బ్రతికే నిక్కచ్చి మనిషి సిద్ధిరాజు, ఎలాగైనా ఇన్సూరెన్స్ చేయించాలనుకునే వెంకట ముణి, ఏ కష్టం పడకుండా ఎలాగైనా సరే కమీషన్లతోనే జీవితం గడిపేయాలి అనుకునే ఏలుమలై, ట్రాక్టర్ పనులు చేయించుకుని సగం డబ్బు చెల్లించిన సుబ్బారాయుడు సగం డబ్బులు కూడా చెల్లించే పరిస్థితి లేని నరసరాజు అలాగే తంజావూరు సుబ్రహ్మణ్యం ముఖ్యమైన పాత్రలుగా మనం చెప్పుకోవచ్చు.ఎందరు మనసులు! ఎన్ని జీవిత పార్శ్వాలు! ఒకరిలాగా మరొకరు కనిపించరు.ఎవరి ప్రయోజనాలు వారివి కానీ పరస్పర విరుద్ధమైన ఆ ప్రయోజనాలు ఒక్కదానికొకటి తారసపడి పరస్పరం ఖండించుకున్న తావుల్ని పట్టుకున్నాడు రచయిత. రాజుగారు ఈ నవల లో పాత్రలు ప్రవాహంలా కనిపిస్తున్నప్పటికీ ఎక్కడా అస్పష్టత కి చోటు లేదు.

బైకుకి ట్రాలీ లాంటిది తగిలించి ఆటోలా నడిపే బాలచంద్రుడు. బాలచంద్రుని చూస్తే అవసరం అవకాశాలను సృష్టించుకుంటుంది అనే ఆలోచనలని పాఠకుల మదిలో రేకెత్తిస్తుంది.

"రచయితకు జీతాలు ఎవరు ఇవ్వరు అయనే చాలామందికి జీతాలు ఇస్తాడు" అంటూ కవిత్వం రాస్తూ ఉచితంగా పుస్తకాలను పంచుతూ ఉండే నీలి రాజు మాటలు వింటే మనము కూడా అక్కడ ఆలోచనలతో ఆగిపోతాం. వ్యసనాలకు బానిసై పనిలో ఉండలేక పోయిన కన్నదాసన్, ట్రాక్టర్ నడపలేక వెళ్లిపోయిన సిద్దులయ్య డబ్బు ఇవ్వకుండా వైద్యం చేయించుకున్న టీవీ యాంకర్! ఆమె భర్త ఇలా ప్రతి ఒక్కరూ గుణశేఖరుడి జీవిత గమనానికి ప్రత్యక్షీగానో, పరోక్షంగానో కారకులు అవుతారు. కథ లో భాగమవుతారు.

"చెడ్డ ఆలోచనలు పెరిగి మనుషుల్లోనే విచిత్ర దయ్యాలు కనపడతా ఉంటాయి" అని నారాయణమ్మ తన మనవడికి చెప్పే మాటలు పాఠకులను కూడా ఆలోచింపచేస్తాయి. మనుషుల్లో ఉండేటటువంటి చెడు మనస్తత్వాల గురించి తెలియజేస్తాయి.

"కండ్లు లేని గుడ్డి వాళ్లు కూడా కలలు కంటారు నువ్వెందుకు భయపడతావు.ఇది నిజమయ్యే కల మనవల్ల కాదు అనుకుంటే ఇలాగే ఉండిపోతాము పైపైకి ఎదగలేము "అని ఏజెంట్ వెంకట ముని చెప్పే ఆ ధైర్యపు మాటలు ప్రతి నిస్సహాయుడికి ధైర్యాన్ని కలిగిస్తాయి.

"పురిటి నొప్పి లేకుండా పుట్టబోదు బిడ్డ ఎగబడి పోరాడకుంటే తిరగబడవు మన బతుకులు" అని చెప్పే గుణశేఖరుడు తన కుటుంబానికి చెప్పే మాటలు మనకోసమే చెప్పినట్టుగా ఉంటుంది. తదేవ లగ్నం తదేవతార మనం మంచి పని చేసేదే మంచి రోజు ఏ రోజు మనది అవుతుందో మనకు తెలియదు అంతా మంచి జరుగుతుందని ఆశించి అడుగేయాలి అని గుణశేఖర్ తన కొడుకు కి చెప్పే మాటలు ముహూర్తాలు,

శకునాలు ఎప్పుడో చేద్దాం అనుకునే వారందరికీ తక్షణ కర్తవ్యాన్ని ఉపదేశిస్తాయి..

"అప్పు నిప్పు మాదిరి హైమావతి దూరంగా ఉంటే చలికి వెచ్చగా ఉంటుంది మీద పడితే ఒళ్ళు కాలి పోతుంది" అని హైమావతి వాళ్ళ అమ్మగారు చెప్పేటటు వంటి ఆ మాటలు అప్పు ఎంత ఎంత ముప్పో! మన శక్తిని, గౌరవ మర్యాదలని ఎలా నశింప చేస్తుందో! మనల్ని హెచ్చరిస్తాయి. రాజుగారు తమ పాత్రలకు ఎంచుకున్న పేర్ల తోనే వాళ్ళ ఆహార్యాన్ని,వాళ్ళ రూపురేఖల్ని మన కళ్ళముందు నిలుపుతాడు ఉదాహరణకి పాము చెవుల గోపాలుడు, కోతి కడుపు రమణుడు,చెక్క ముఖం నీరజ,రెండు జడల కుసుమ ఇలా.

చీరల వ్యాపారం చేసే నేతన్న "కష్టమేమో పట్టు చీరలంతా! లాభమేమో రవికి గుడ్డలంతా!" అంటూ పంటి మధ్యన పెదవిని బిగబట్టి ఆశ వదలకుండా బ్రతుకు పోరాటం చేస్తూ, అతడు తన కన్నీళ్ళని తుడుచుకుంటూ వెళ్తుంటే వీరి కలలు ఎప్పుడు నిజమవుతాయా! కష్టాలు ఎప్పుడు తీరుతాయో! నేతన్నల సంతోషపు జెండా ఎప్పుడు రెపరెపలాడుతుందో! అని గుణశేఖరుడి మనసు మూలిగింది. నేతన్నల గోడు నేరుగా మనం చూసినట్టే ఉంటుంది.ఒక్క రూపాయి కూడా పెట్టుబడి లేకుండా లక్షల అప్పులు తెచ్చి సెకండ్ హ్యాండ్ ట్రాక్టర్ కొని చేయి విరగకొట్టుకుని అష్ట కష్టాలు పడుతున్న తన కుటుంబాన్ని చూసి అప్పు లేని గంజి గరిటడైన తాగే రోజు రావాలని హైమావతి, అప్పు లేనివాడు అధిక బలుడని అంటారు. నన్ను అధిక బలుడిని చేయకూడదా! అని గుణశేఖరుడు, కాటికి కాళ్లు చాపేలోగా కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి అమ్మ వారిని చూడాలని ఉంది అని నారాయణమ్మ,వెంట వెంటనే పెద్దోడైపోయి కొత్త కారుకొనుక్కొని అమ్మని దాంట్లో కూర్చోబెట్టుకుని ఊరేగిస్తున్నట్లు కలలు కనే బాలాజీ ఇవన్నీ మన ఆశలని, సమాజం లో ఎందరో మానసిక, కుటుంబ పరిస్థితులని మన ముందు నిలిపినట్లు ఉంటాయి.

ట్రాక్టర్ దున్నకానికి సగం డబ్బులు తీసుకున్న కొడుకుని చూసి "ఈరోజు వాళ్ల మీద మనం జాలి చూపిస్తే మనల్ని చూసి జాలిపడే రోజులు వస్తాయి" అని తన కుటుంబ పరిస్థితికి భయపడి నారాయణమ్మ అనగానే పెద్ద గీత చిన్న గీత కథ చెబుతూ వాళ్ళ కష్టాలు చూస్తే మన కష్టాలు చిన్నవి అయిపోతున్నాయి అని చెబుతూ తన కష్టాల్లో ఉన్నప్పటికీ ఎదుటి వాళ్ళ కష్టాల గురించి ఆలోచించే గుణశేఖరుడు నిజంగా సార్ధక నామదేయుడే అని చెప్పుకోవచ్చు. తంజావూరు సుబ్రహ్మణ్యం పొలంలో ట్రాక్టర్ బోల్తా పడినప్పుడు జరగరానిది జరిగి ఉంటే నేను చేసిన అప్పు ఇంట్లో వాళ్ళు ఎలా తీర్చి ఉంటారు! ఎలా బతికి ఉంటారు ఏమి బతుకో కదా! ఇది అంటూ కళ్ళ నుంచి కారుతున్న కన్నీళ్లు బురద మట్టిలో కలిశాయి. ఇది మనకు సహజంగా అనిపించిన అసహజమైన అంతర మదనాన్ని కలిగిస్తుంది.

నేతన్నల గోడే కాదు కర్నూలు వారి ఎర్రగడ్డల వ్యాపారస్తుల ఏడుపుల, రైల్వే కోడూరు అరటిపండ్ల వ్యాపారస్తుల ఆర్తనాదాలు ఈ విధంగా రైతులే కాదు రైతులని నమ్ముకుని బతుకుతున్న వాళ్ళ బాధల్ని మన కళ్ళ ముందు నిలుపుతాడు రాజుగారు

జోరుగా వీచిన గాలికి ఎదురుగా ఉన్న పెద్ద కొమ్మ గబుక్కున విరిగి టపీమని పడితే అక్కడే ఉన్న వీరరాజు దాన్ని పక్కకు తీసి పడేస్తూ చూసావా గుణశేఖరా! వీచిన గాలి ఒక్కటే అయితే మర్రిచెట్టు విరగలేదు అదే మునగ చెట్టు విరిగింది ఎందుకంటే మునగ చెట్టు పెలుసు కాబట్టి అంటే గాలిని ఎదుర్కొనే శక్తి మర్రి చెట్టుకు ఉంది మునగ చెట్టుకు లేదు అలాంటిదే మన డబ్బు లేని వాళ్ళ బతుకులు. ఉన్నవాడు ట్రాక్టర్ తీస్తే అది వాడికి ఆస్తి అవుతుంది అదే లేనివాడు తీస్తే అప్పు మిగులుతుంది. ఉన్నవాడు అవసరమైనప్పుడు ట్రాక్టర్ని తన పొలానికి వాడుకుంటాడు.అదే లేని వాళ్ళ కన్నీళ్ళకు కారణం అవుతుంది. ఈ సంఘటన పాఠకులను వివిధ ఆలోచనలకే గురిచేస్తుంది. అది విన్న గుణశేఖరుడు వెన్నపడే సమయానికి బాన పగిలినట్లు అయింది.నా చేయి విరగడం ట్రాక్టర్ రిపేర్ బిల్లు తడిచి మోపిడవడం ఇలా నిస్సహాయతకు గురవడం మనం చూడవచ్చు.

నువ్వు ఒంటరివి కాదు మేము ఉన్నాము. ఈ

లోకంలో ఎవ్వరూ ఒంటరి కాదు ఎవరూ లేని వారు ఎవరైనా వారికి పగలైతే సూర్యుడు రాత్రి అయితే చంద్రుడు ఉంటారు కదా! కాబట్టి భయపడకూడదు కష్టాలు మనసులకు కాకుండా మాకులకు వస్తాయా! మనో వ్యాధికి మందు లేదంటూ కొండంత ధైర్యాన్ని నారాయణమ్మ పాత్ర ద్వారా గుణశేఖరుడికి నింపుతాడు ఇది కేవలం గుణశేఖరుడి కి మాత్రమే కాదు సమాజంలో ఉన్న అట్లాంటి పరిస్థితుల్ని అనుభవిస్తున్న ప్రతి ఒక్కరికి తన మాటలతో మనోధైర్యాన్ని నింపుతాడు మన రాజు గారు. ఈ విధంగా ఏటిలో కొట్టుకుపోతున్న వాడికి తుంగ మొక్క దొరికినట్లు కన్నీళ్ళతో తడుస్తున్న ముఖాలలో కాంతులు నిలుపుతాడు.

పేద మధ్యతరగతి రైతన్నలు రైతులుని మీద ఆధార పడి జీవనం సాగించే వాళ్ళు అప్పుల ఊబిలో ఎలా కూరుకుపోతారో! అన్న విషయాన్ని చెబుతూ గోదావరి నది పుట్టే త్రయంబకంలో కులాయి నీళ్ల వచ్చినట్లు వస్తూ ఉన్నాయి! అదే తిరుగు ప్రయాణంలో బాసర వచ్చినప్పుడు చూస్తే ఉరకలేసే గోదావరిని చూస్తాము. నది పుట్టుకలా అప్పులు కూడా చిన్నదిగా మొదలై వడ్డీలు చక్రవడ్డీలతో చిన్న కాలువ ప్రవాహానికి మరిన్ని నీళ్ల జత కలిస్తే నది అయినట్లు పెరుగుతూ ఉంటుందని చెప్పడం రాజు గారి చక్కని దృష్టాంతానికి ఉదాహరణ గా చెప్పుకోవచ్చు.

“ఒకే పడవలో ప్రయాణం చేస్తున్న వాళ్ళం కదా అందరూ ఎదురీత ఈదాల్సిందే “అంటూ కుటుంబంలోని ఏ కష్టాన్నైనా కలసి ఎదుర్కోవాలి అని చక్కని మార్గ నిర్దేశం చూపిస్తారు.

“సంసారం కుండ లాంటిది ఆదాయం అనే నీళ్లు పోస్తే నీళ్లు చల్లగా నిల్వ ఉన్నట్లు సంసారం చల్లగా ఉంటుంది. అదే కుండకు అప్పు అనే చిన్న రంధ్రం ఉంటే చాలు ఎన్ని నీళ్లు పోసినా నిలవవు సంసారం ఎగబడి రాదని” హైమావతి అమ్మవారి పాత్రతో చెప్పిస్తూ ఈ సమాజానికి కూడా ఆర్థికపరమైన ఆంక్షలు ఎలా పెట్టుకోవాలో చెబుతారు.

ఎవరు వచ్చి ఈ బాధలు తీరుస్తారు! అద్భుతం జరిగితే తప్ప రాయలసీమ రైతుల జీవితాల్లో రైతులను నమ్ముకున్న వాళ్ళ జీవితాల్లో మార్పు రాదా?అని నిదుర కరువై అర్ధరాత్రి తన తల్లి భార్య కొడుకును చూసి నన్ను నమ్మి చీకటిలో నడిచే వెళ్లేవారికి దారి దీపాన్ని సముద్రంలో ప్రయాణం చేసే వారికి దిక్సూచిగా ఉండాల్సిన వాడిని అయితే మొత్తం కుటుంబమే నా వలన అష్ట కష్టాలు పడుతోంది దీనికి కారణం పైసా పెట్టుబడి లేకుండా లక్షల అప్పులు చేసి ట్రాక్టర్ కొన్నాను పరిస్థితి అనుకూలించలేదు. దీనికి కారణం నా నిర్ణయమా!లేదా దీన్నే కాలం కలిసి రాలేదని అనుకోవాలా! నేను కష్ట పడలేదు అనుకోవాలా! లేకపోతే ఆశపడ్డానా! బాగా బతకాలని అనుకోవడం ఆశ అవుతుందా! ఒక గ్రామీణ యువకుడి ఇలా ఆలోచించకూడదా! అని గుణశేఖరుడి పాత్ర ద్వారా పేద మధ్య తరగతుల వారి ఆవేదన తో కూడిన ఆలోచనల సుడిగుండాలలో ఉక్కిరిబిక్కిరి అయ్యేలా చేస్తాడు రాజుగారు. ఈ నవలలో ఇలా నాయకుడు వేసుకునే ప్రశ్నలు సమాజాన్ని ఆలోచింప చేస్తాయి.

ముద్దుల మనవడి తెగిన చొక్కా గుండీ కుట్టడానికి ఎంతో సులభంగా సూదిలో దారం ఎక్కించే అమ్మ తనక లాడడం చూసి అద్దాలు వేసుకోకుంటే కళ్ళు కనిపించవు కదా! ఎందుకు కష్టపడుతున్నావు అని అడిగితే లేదు గుణ శేఖరా! మొన్న గుడ్డలు ఉతుకుతా ఉన్నప్పుడు ముక్కు మీద ఉన్న కళ్లద్దాలు జారి కిందపడి పగిలి పోయాయి. ఇప్పుడు ఎందుకు ఆ ఖర్చుని మార్చుకోలేదు. ఇప్పుడు నా అద్దాలకి ఏమి తొందర ఆ డబ్బు ఉంటే మన ఇంట్లో నాలుగు పూటలు అయినా గడుస్తాయి. అని చెప్పగానే గుణశేఖరుడి మనసులోనే కాదు పాఠకుడి మనసులో గుచ్చినట్లు అవుతుంది.

పొయ్యిలోకి సర్కారు కంపచెట్లు నరుక్కొద్దామని వెళ్లి ముళ్ళు గుచ్చుకుని, కొడుకు దగ్గర కుట్టించుకుంటూ ఉంటే చెప్పులు వేసుకుని వెళ్లలేదా! అని అడగగానే అమ్మ చెప్పులు తెగిపోయి చాలా రోజులైంది నాన్న అని చెప్పినపుడు స్త్రీలు కుటుంబం కోసే చేసే త్యాగాలు అడుగడుగునా మనకు ఇక్కడ కనిపిస్తాయి.

అలాగే పక్కింటి నుంచి మసాలా గుమగుమలు వస్తూ

ఉన్నాయి. అది చూసి మసాలా వాసనలు బలే వస్తున్నాయి కదా! నాన్న అనగానే మాంసం తిని చాలా రోజులైంది నాన్న  అని అడిగినట్లు అనిపించడం. అది విని పొట్టేలు కోసి కుప్పలేస్తున్న పొట్టి చంగన్న వైపు అప్పు ఏమైనా దొరుకుతుందా! అని చూడగానే, పాత బాకీ కే దిక్కులేదు మళ్లీ వస్తున్నాడబ్బా! అన్నట్లుగా మూతి తిప్పుకోవడం, బిడ్డకు మాంసముక్కు కూడా పెట్టలేక పోతున్నాను అని ఒక తండ్రి మానసిక ఆవేదనతో కూడిన సంఘర్షణ మనకు కూడా కన్నీళ్లు తెప్పిస్తుంది. ఛీ నాది ఒక బతుకేనా!డబ్బు అనే ఏనుగు కింద నలిగిపోయిన చీమ బతుకు చెడు దారిలో అయినా తమ వారి కోరికల్ని తీర్చాలి అని అనుకున్నప్పుడు ఆ ఆలోచన రాగానే అమ్మ చెప్పిన మాటలతో మంచిదారి వైపే మొగ్గు చూపడం ఇక్కడ కష్టాలు వచ్చినా నైతికతను కోల్పోని వైనం మనకు అగుపడుతుంది.

రాజుగారు సన్నివేశాలు సంభాషణలతోనే కాదు నాయకుడి రూపురేఖల చిత్రణతో కూడా మన గుండె బరువు ఎక్కించగలడు. అనారోగ్యంతో అప్పుల ఆలోచన లతో సాలిగూడు లాంటి తల జుట్టు,బాగా పెరిగిన గుబురు గడ్డం, ఎరుపెక్కిన కళ్ళు,ఎండిపోయిన చర్మం వికృతంగా పెరిగిన గోళ్లు నడుస్తూ ఉంటే మోకాళ్ళలో పలపల కొమ్మలు విరిగే చప్పుడు ఇలాంటి గుణశేఖరుడిని మన కళ్ళ ముందు నిలుపుతాడు.

తిరుచానూరులో ఉన్న భూమి అమ్మి అప్పు తీరుద్దా మనుకుంటే ఆక్రమణకు గురి అయినది అని తెలుసుకుని అప్పు ఏనుగు కన్నా బరువు అయింది గట్టిగా నిలబడి పోరాడుదాం! అనుకుంటే ఒళ్ళు చెడింది. ఉన్న ఒక్కగా నొక్క స్థలం  ఆసరా రాకుండా పోయింది కట్టుబట్టలతో ఏట్లోకి దూకి నీళ్లలో నిలబడి తనివి తీరా ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి కార్చిన కన్నీరు పారేయేరులో కలిసింది. ఈ సంఘటన పాటకుడి కళ్ళల్లో కన్నీళ్లు తెప్పిస్తుంది.అతడి నిస్సహాయత, కట్టలు తెంచుకున్న దుఃఖాన్ని తెలియజేస్తుంది.

**విద్య ఆవశ్యకత :**

నాన్న లేని సమయంలో అప్పుల వాళ్లు తమ ట్రాక్టర్ తీసుకుపోతున్నారని తెలిసి రొప్పుతూ పరిగెడుతూ పడిపోయిన బాలాజీని చూసి వాళ్ళ సోషల్ టీచర్ మంచినీళ్లు అందించి “నీ వయసు అనుభవం ఈ సమస్యను పరిష్కరించ లేవు. పేదవాని కోపం పెదవికి చేటు పేదరిక భూతాన్ని వదిలించుకోవాలంటే డబ్బు సంపాదించాలి. ప్రస్తుతం నువ్వుఆ పని చేయలేవు ప్రస్తుతానికి నువ్వు చేయగలిగింది ఒకే ఒకటి ఉంది.బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించడం అప్పుడే ట్రాక్టర్ యజమాని కావాలన్న మీ నాన్న కోరిక తీరుతుంది. మీ ఇంట్లో వాళ్ళ కళ్ళల్లో సంతోషం చూడగలవు, నలుగురికి అన్నం పెట్టగలవు, నీడను ఇవ్వగలవు “అని రాజుగారు చెప్పిన ఈ మాటలు సమాజంలోని పేద మధ్య తరగతి ప్రతి బిడ్డకు చేసిన దిశా నిర్దేశంగా చెప్పుకోవచ్చు.  వ్యవసాయం ద్వారా వ్యవసాయం మీద ఆధారపడిన వృత్తుల ద్వారా సాధించలేనిది విద్యా ఉద్యోగం ద్వారా సాధించ వచ్చు అని సమాజానికి చక్కటి సందేశాన్ని ఇస్తూ విద్య ద్వారా అనుకున్నవన్నీ సాధించి పైసాకు కటకటలాడి ఇప్పుడు పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థితికి వచ్చిన ఈ కుటుంబ జీవన ప్రయాణంలో చింతల చేనులో పేద మధ్య తరగతి బ్రతుకు పోరు సంఘర్షణ మన కళ్ళ ముందు కదలాడే చలనచిత్రంలా నిలిచిపోతుంది.

**భాష :**

ఈ నవలలోని పాత్రలు సంభాషించేటప్పుడు తమ వైనటువంటి పలుకుబడులు సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు సందర్భోచితంగా ఈ రచయిత ప్రయోగిం చాడు. అవి ప్రత్యేకంగా తెచ్చి పట్టినట్లు కాకుండా కథకు సరిపోయే విధంగా ఉండడం ఈ రచయిత యొక్క ప్రత్యేకత. వైద్యానికి, వ్యవసాయానికి, వృత్తులకి సంబంధించిన ప్రత్యేక మాటలు ఈ రచయిత రచనల్లో కనిపిస్తాయి ఇవన్నీ తెలుగు భాష ఔన్నాత్యానికి ఒక చేర్పుగా ఉంటాయి.తమ రచనల్లో సన్నివేశాలను చెప్పడమే కాదు భాష ఔన్నత్యానికి నికి ప్రయోజనకరంగా ఉంటాయి.

**ముగింపు :**

ఈ విధంగా రాజుగారు రచించిన చింతల చేనులో ఈ సమాజంలో పేద, అట్టడగు వర్గాల ప్రజలు బతుకులు మారతాయి అన్న ఆశతో మొదలుపెట్టిన

ప్రయత్నాలు పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎదురయ్యే పరిస్థితులు, ఇందలి మానసిక సంఘర్షణ వర్తమాన విషయాలకి అర్థం పడుతుంది. ఇటువంటి నవలలు తెలుగు సాహిత్యానికి ఒక చేర్పుగా నిలుస్తాయి. ఇటువంటి సాహిత్య అధ్యయనం ద్వారా అట్టడుగు జీవితాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాల్లో జరిగే సంఘర్షణలు పరిస్థితులు అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆర్. సి.కృష్ణ స్వామి రాజు, చింతల చేను నవల, డిసెంబర్ 2025.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# అంటరాని వసంతం - దళితుల జీవన చిత్రణ

- డా॥. సిహెచ్. యేసయ్య

తెలుగు పి.జి.టి., ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, తడ.

[1]"ఈ దేశంలో పీల్చే గాలికి కులముంది. తాగేనీటికి కులముంది. పారే పంటకాల్వకి, పండే భూమికి కులముంది. బడికి, గుడికి, రచ్చబండకి కులముంది. తినే తిండికి, వుండే ఇంటికి, కట్టే బట్టకి కులముంది. మాటాడే మాటకి కులముంది. సాహిత్యానికి, సంస్కృతికి కులముంది. రాజ్యానికి కులముంది, దాని చట్టానికి కులముంది. న్యాయానికి, న్యాయస్థానానికి కులముంది. శవానికి, శ్మశానవాటికకు కులముంది. దేవుడికి కులముంది, దెయ్యానికి కులముంది" అంటూ 'అంటరాని వసంతం'లో కులప్రస్తావనని వర్ణించారు జి.కళ్యాణరావు.

ప్రపంచ నవలాసాహిత్యంలోనే 'అంటరాని వసంతం' అలెక్స్ హేలీ 'రూట్స్'తో పోల్చదగిన గొప్ప నవల. అంతకంటే గొప్ప నవల. వేద, పురాణాల కాలం నుంచి నేటివరకు ఈ దేశంలో మాల మాదిగల చరిత్రని, వాళ్ల పోరాటాన్ని, బ్రతుకుని, వారి కళల్ని, జీవన విధానాన్ని, ఇంకా అనేకానేక సంఘటనల్ని చిత్రీకరించిన నవలిది. ఈ నవల మొదట్నుంచి చివరి వరకు మనల్ని ఏకబిగిన చదివిస్తుంది. కొత్తలోకంలోకి తీసుకెళ్తుంది. బాధామయ ప్రపంచంలోకి పయనింపజేస్తూనే చివరికొచ్చేసరికి ఉద్యమింపజేస్తుంది. నాగవంశ జాతీయులైన గిరిజనులు, మాల మాదిగల్ని చరిత్ర నిర్మాతలుగా నిల్పుతుంది. బతుకంటే పోరాటమని చెబుతుంది.

'ఎన్నిలదిన్ని' గ్రామం ఈ నవలాకేంద్ర బిందువు. సగం నవల తర్వాత వచ్చే సన్నివేశాలన్నీ వలసపాడు, ఆవల పాడు వంటి గ్రామాల్లో జరిగినా పరోక్షంగా వాటి మూలాలన్నీ ఎన్నిలదిన్నె చుట్టూనే తిరుగుతాయి. [2]"ఎన్నిలదిన్నె అంత గొప్పది కాదు. అట్టా అని తక్కువగా అనుకోడానికీ వీలులేదు. ఓ ముప్పయి రెడ్లయిళ్ళు వుండొచ్చు. ఒకే వక్క బ్రాహ్మణ యిల్లు. అదే కరణం యిల్లు. చాకలి, మంగలి, బలిజ, యాదవ, కమ్మరి మొత్తం కలిసి అన్నే యిళ్ళు వుండొచ్చు. రెడ్డి దిబ్బమీద రెండు, అయ్యగార్ల చెరువుగట్టున రెండు యానాదుల యిళ్ళు. దూరంలో ఇరవై మాలల యిళ్ళు. యింకాస్త దూరంలో అంతేవున్న మాదిగల యిళ్ళు. చాతుర్వర్ణంలో భాగమైన కులాలుండే భాగమంతా ఊరు. మాలలుండే చోటు మాలపల్లి. మాదిగలుండే చోటు మాదిగపల్లి. విచిత్రమేమిటంటే మొత్తంగా కలిపి ఎన్నిలదిన్ని." దేశంలోని ప్రతి గ్రామంలో జనజీవనంలో ఈ దారుణమైన అడ్డుగీత ఇప్పటికీ స్పష్టంగా కన్పిస్తుంది.

అలెక్స్ హేలీ 'రూట్స్'లో ఏడుతారాలుంటే 'అంటరాని వసంతం'లో ఎనిమిది. సినసుబ్బడు, ఎల్లన్న, ఎర్రెంకడు

- లింగాలు, ఎల్లన్న - సుభద్ర, శివయ్య - శశిరేఖ, రూబేను - రూతు, ఇమ్మానుయేలు - మేరీ, జెస్సీ - రూబీ అనే ఎనిమిది తరాల చరిత్రల్ని చదివాక ఈ ప్రపంచం కొత్తగా అన్పిస్తుంది మనకు. భారతదేశంలో అగ్రకులాల వారి ఆధిపత్యం స్పష్టమౌతుంది. చరిత్రలో అసలు మనుషులుగానే గుర్తించబడక, బతకడమే ఒక పోరాటంగా సాగించిన దళితుల చరిత్ర తెలుస్తుంది. నిజమైన వీరులు వీరే కదాన్పిస్తుంది. దళితుల మనస్తత్వం సహజమైంది. రూపం సహజమైంది. ప్రేమ, ద్వేషం అన్నీ సహజమైందే.

**రూపవర్ణన :**

పేదోళ్ళు శారీరక అందానికి ప్రాధాన్యతివ్వరు. ఎంతసేపు పని చేయగలరు? ఎంత బరువెత్తగలరూ? వంటి అంశాలపైనే వాళ్లందం ఆధారపడి ఉంటుంది. బూదేవి తన అన్న ఎర్రెంకడికి పిల్లను చూసొచ్చి [3]"పిల్ల బాగుందిరా అన్నా అంది. అయిదు గొడ్లగడ్డి ఒక్క వూపులో మోస్తదిరా అంది... పిల్ల రివటలా వుందని చెప్పింది. లింగాలు అట్టాంటి యిట్టాంటి మనిషికాదు. నిలబడితే చూరుకప్పు దాటేట్టు వుంది. వాకిలి ఎత్తు లేపాల్రా అన్నా అంది." అనే వాక్యాల్లో దళితులు తమ వివాహాది శుభకార్యాల్లోనూ అంటరానితనాన్ని ఎదుర్కొనే దృశ్యం కన్పిస్తుంది. వాకిలి ఎత్తులేపినా కూడా తప్పే. కాపుల కళ్ళు, కరణాల కళ్ళు మండిపోతాయి. తమ సొంతింట్లోకి కూడా వంగే వెళ్ళాల్సిన దుస్థితి.

**పూర్వీకులు - తమ వారిపట్ల వల్లమాలిన ప్రేమ :**

ఈ నవల మొత్తం దుఃఖభరితంగా, విషాదభరితంగా సాగినా, మానవజాతిపట్ల ఒకర్నొకరు ప్రేమపూర్వకంగా ఉండాలని చెబుతుంది. దళితులు తమ బిడ్డలకి పూర్వీకుల పేరు పెట్టడంతోనే అది మొదలౌతుంది. తమ పిల్లలకి నామకరణం పెట్టడం కులపెద్దలతో పెట్టించడం సంప్రదాయం. [4]"కులపెద్ద పిల్లాడికేసి చూసి 'సినసుబ్బా' అన్నాడు. సినసుబ్బడు కాదు ఎల్లడు అని ఎర్రెంకడన్నాడు. ఎల్లడు కాదు ఎల్లన్న అని బూదేవి అంది. అబ్బింటే దీనికి మాయిదిరా ఎర్రెంకా అని కులపెద్ద అన్నాడు."

[5]"బూదేవి మేనల్లుడ్ని పైకెత్తింది. 'అయ్యా' అంది. 'ఎల్లయ్యా' అంది 'ఎల్లన్నా' అంది అని బూదేవి మేనల్లుడ్ని ఇలా పిలవడంలో ఎంత ప్రేముందో వెలకట్టగలమా? కాబట్టి సంతోషంగా బ్రతికేందుకు గొప్ప వంశం అక్కర్లేదు. డబ్బుతో కూడా ఆనందాన్ని కొనలేం. ఆ మాటకొస్తే దళితులు ఊరికి దూరంగా తమని నెట్టివేయబడినా, పండుగల్ని, శుభకార్యాల్ని అద్భుతంగా జరుపుకుంటారు. [6]"బిడ్డకి మేనమామ పంచె కట్టమన్నాడు కులపెద్ద. బూదేవి మొగుడు ఎంకటనర్సు ముందుకొచ్చాడు. మేనమామ పంచె అంటే పట్టు పీతాంబరం కాదు. నల్లటి గోసిగుడ్డ. ఎంకటనర్సు బిడ్డకి గోసె కట్టాడు." తమకున్న ఆర్థిక పరిస్థితుల్లోనే అద్భుతంగా, ఆప్యాయంగా చేసుకోవడం వారికిష్టం.

**కళానైపుణ్యం - ధైర్యం దళితుల సొంతం :**

చాతుర్వర్ణ సమాజం దళితుల్ని అగౌరవపరచకుండా ఆదినుండి ఆదరించి వుంటే ఎంతటి శక్తి మంతులయ్యేవారో, ఎన్ని కళల్ని పెంచిపోషించేవారో చెప్ప లేము. దళితుల నుంచి ఈ సమాజం అన్నీ దొంగిలించ బడ్డాయంటాడు రచయిత. మాలల ఉరుముల నృత్యాన్ని అగ్రవర్ణాలవారు పేరిణీ నృత్యంగా మార్చుకున్నారు. [7]"అంటరానివాళ్ళ మహోన్నత ఉరుముల వసంతం. అన్నీ దొంగిలించబడ్డట్టే. భూమి బతుకు దొంగిలించ బడ్డట్టే. దొంగిలించబడి దేవాలయాల్లో పేరిణీ నృత్యంలా అగ్రవర్ణాలు దాచుకున్న ఉరుముల లయ విన్యాసం." 'ఎల్లన్న' ఈ నవల్లో గొప్ప కళాకారుడు, 'పాటెల్లడు', 'ఆటెల్లడు'గా రచయిత చెప్పాడు గానీ, ఎల్లన్నను వాగ్గేయకారుడిగా, పదకర్తగా చెప్పొచ్చు. ఎల్లన్న బైరాగిగా మారాక 'సుభద్ర' పదాన్ని చేర్చి ఎన్నో పాటలు చెప్పు కుంటూ పల్లెపల్లెలు తిరిగాడు. ఇంకా ఈ నవల్లో ఎన్నో జానపద కళల గురించి వివరించబడింది. చెంచునాటకం, తోలుబొమ్మలాట, కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ, గంగజాతర, ఉరుముల నృత్యం, కుంకాలాట, పేరిణీ నృత్యం, రాయలసీమ బయలాటలు, వీధిభాగోతం, కర్రసాము వంటి ఎన్నో కళలపట్ల జి.కళ్యాణరావుకు ఎంత పట్టుందో తెలుస్తుంది.

ఇక ధైర్యం విషయానికొస్తే ఈ నవల్లోని ప్రతి దళిత

పాత్ర ధైర్యమైందే. చిన్నప్పుడే ఎర్రగొల్లలు వేసే 'చెంచునాటకాన్ని' దగ్గరికెళ్ళి చూసి తాటిబద్దలతో వొంటి నిండా దెబ్బలు తిన్న ఎల్లన్నది చాలా దిటువైన గుండె. కావాలనే ఆ వయసుప్పులో వెళ్ళకపోయినా ఎల్లన్న 'పక్కిలిదిన్నె' దాకా తరమబడి నెత్తురోడుతూ నాగయ్య వద్ద వివిధ కళారూపాల్ని అభ్యసించేందుకు గట్టిగుండే ఉండాలి. నారిగాడు, ఇతని కొడుకు నాగన్న కూడా గొప్ప ధైర్యవంతులే.

ఎత్తైన దిబ్బకు 'మాలాడిదిబ్బ'ని నారన్న ధైర్య సాహసాలకే వచ్చింది. వీధిభాగోతం ఎల్లన్న వేసేముందు దళితుల ఆత్మగౌరవాన్ని నాగన్న ఆకాశానికెత్తి చెప్పే మాటల్లో ఎంతో తెగింపు, ధైర్యముంది. [8]"ఘనత వహించిన పెద్దమాల, అంతే ఘనత వహించిన మాదిగ పెద్ద వచ్చి తమ స్థానాలను అలంకరించారటరా" అనే వాక్యాల్లో విప్లవం దాగుంది. ఎన్నిలదిన్నిలో ఎర్రగొల్లలొచ్చి చెంచు నాటకం ఆడేటపుడు [9]"కరణాలు, కాపులు ఆడేవాళ్ళకు దగ్గర్లో కూర్చొనేవాళ్ళు. వాళ్ళ వెనకాల చాకలి, మంగలి, కుమ్మరి అట్లా మిగతా కులాలవాళ్ళు కూర్చొనేవాళ్ళు. మాలల దిబ్బమీద మాలలు కూర్చొనేవాళ్ళు. మాదిగల దిబ్బమీద మాదిగలు కూర్చొనేవాళ్ళు. అవి రెండూ ఆట ఆడే చోటుకు చాలా దూరంలో వుండేవి. అట్లా కూర్చోవడంలో వాళ్ళు గ్రామపెద్దలకి, యితర కులాల పెద్దలకి కన్పించేవాళ్ళు కారు. ఆట మొదలుకాక ముందు ఆ దిబ్బల మీదికి వచ్చేవాళ్ళు కాదు. సహజంగా కరణం, పెదకాపులు రాందే ఆట మొదలయ్యేది కాదు. పెద కాపులు వచ్చాక, యింకాస్త నింపాదిగా కరణం వచ్చేవాడు. కరణం గారు రాగానే కరణాన్ని పెద్ద ఎత్తున పొగిడే వాళ్ళు. అప్పుడు సూత్రధారుడు ఆట మొదలెట్టేవాడు. కరణం కూడా వచ్చాడని తెలుసుకున్నాక మాలా మాదిగలు దిబ్బల మీదికి చేరేవాళ్ళు. పొరపాటున ముందువస్తే పెద్దలు తప్పు పట్టేవాళ్ళు.

ఎల్లన్న "కన్పించలేదే అత్తా" అనేవాడు. ఎత్తుకొని నిలబడితే కాపులకంట పడొచ్చు. కరణం కంట పడొచ్చు. సహజంగా వాళ్ళు వెనక్కి చూడరు. పొరపాటున చూశారంటే యిబ్బంది. కొనక్కొచ్చుకొన్నట్టే. అయినా అల్లుడి కోసం తెగించి నిలబడేది. ఆట తెల్లవార్లూ వుండేది. ఆటతో పాటు ఎల్లడూ నిద్ర కాసేవాడు."

సుభద్ర ధైర్యవంతురాలే కాదు. అగ్రవర్ణాల నోటినుండి కూడా 'దేవత'గా పలకబడింది. చిన్నప్పుడ్నుంచీ ముద్దుగా పెరగడం, అందరిలాగా పనికి వెళ్ళకపోవడం, పద్ధతిగా పెరగడం వంటి గుణాలు అగ్రవర్ణ స్త్రీలేకాదు. సుభద్ర కూడా అలాగే పెరిగింది. ముక్కుసూటిగా మాట్లాడడం, ఏ చిన్న తప్పులు కూడా చేయకపోవడం, ముఖ్యంగా తమ పొలంలోకి నీళ్ళు పారలేదని, పారించే ధైర్యం మొగోళ్ళకెవ్వరికీ లేకపోయేసరికి పట్టపగలు, నట్టెండన పారెత్తుకుని వెళ్ళి నీళ్ళు పారించిన తీరులో అపరకాళీగా మారింది.

[10]"ఆ నెత్తుటి మధ్య సుభద్ర వుంది. ఆ కన్నీటి మధ్య సుభద్ర వుంది. పక్కనేవున్న పార తీసుకొంది. అంతా చూస్తూనే వున్నారు. కోక బిగదీసి గోచిపెట్టింది. అంతా గుడ్లప్పగించి చూస్తున్నారు. పవిటవో తిప్పి తిప్పి దోపుకుంది. ఎండలో మెరిసే పచ్చని బంగారం తీగలా వుంది. కళ్ళు మండుతున్న కొలిమిలా వున్నాయి. పారతీసుకొని ముందుకు కదిలింది.

"యాడకే సుబద్రా"

ఆ గొంతు పిట్టోడిది మాత్రమే కాదు. బూదేవిది మాత్రమే కాదు. పోలడి దొక్కడిదీ కాదు. చాలా మంది అంటరాని వాళ్ళది. ఎన్నెలదిన్ని మాలా మాదిగలు ఒకే సారి కలిసి అన్న మాట "యాడికే సుబద్రా" అని సుభద్ర ఆగలేదు.

ఎవరి మాటకి ఎదురు చూడలేదు. అడుగులు కాదు అవి పరుగులే. కసి నిండిన పరుగులు. ఎందుకు కదిలిందో తెలీదు. ఎట్టా పరుగెత్తుతుందో తెలీదు. పోలడు భార్య వెర్రిగా కేక పెట్టింది. "ఆగే సుబద్రా... రాండే నా సవుతుల్లారా... ఆగే బిడ్డా..." వెర్రి పరుగు. బిడ్డకోసం తల్లి పరుగు. ఆ పరుగులో బూదేవి వుంది. ఆ తర్వాత ఎన్నెల దిన్ని మాలామాదిగ తల్లులు బిడ్డలు...

"ఆగే సుబద్రా... ఆగే సుబద్రా...

సుభద్ర ఆగింది. అచ్చిరెడ్డి మడవ దగ్గర. మడవ

అంచున కాలు పెట్టింది. బలహీనమైన పనుపు కొమ్ము సుభద్ర. పనివాడు ఆదమర్చితే మంటల్లో వెంటనే కరిగిపోయే అతి సన్నని బంగారు తీగ సుభద్ర... నడుం వంచింది. పిచ్చి బలం, మడవ మీద బలంగా పారని దింపింది. మట్టిలాగి పక్కకు తోసింది. గండి పడ్డ నీళ్ళు, పార ఎత్తి అట్టాగే నిలబడింది. పారే నీటి పైని సూర్యుడి తళుకులు ఆ బంగారు ఒంటిమీద నాట్యం చేస్తుంటే హతాశులై చూస్తున్న అచ్చిరెడ్డి మనుషులకేసి కాళిలా చూస్తోంది. ఆ క్షణానికి అచ్చిరెడ్డి వచ్చాడు.

"పిల్లకి పూనకం పట్టింది."

రెడ్లలో చుక్కిరెడ్డి అన్నాడు. అచ్చిరెడ్డి పక్కనే వున్నాడు. చుక్కిరెడ్డి అంతటితో ఆగలేదు. చుక్కిరెడ్డికి గట్టి నమ్మకం దేవతలు పట్టినవాళ్ళే యిట్టా చెయ్యగలరని.

"జాతర్లో కూడా అంతే. ఆ పిల్ల ఒల్లు పొంగుద్ది. పాప ఆడదు. నోరెత్తి పలకదు." అచ్చిరెడ్డి వింటూనే వున్నాడు. వింటూనే సుభద్ర కేసి చూశాడు. నిజమే పాప కొట్టడం లేదు. చూపు మరల్చడం లేదు. ఎత్తిన పార దించటం లేదు. పెట్టిన పాదం వెనక్కితీయటం లేదు. నీళ్ళు పాదాల్ని చుట్టివెళ్తున్నాయి. అట్టాగే చూశాడు. ఒంట్లో ఎందుకో తెలీదు. చిన్న కంపరం మొదలైంది. చుక్కిరెడ్డి మాట్లాడుతూనే వున్నాడు. నిజంగా చుక్కిరెడ్డికి సుభద్ర సుభద్రగా కన్పించటంలేదు. ఆ పిల్లని అమ్మ ఆవరించింది. అమ్మ తల్లే అట్టా చేస్తుంది.

ఇలాంటి త్యాగమూర్తిమణులే తర్వాత గ్రామదేవతలుగా వెలుస్తారనీ, పోలేరమ్మ, అంకాలమ్మ, ముంగమూరమ్మ, పారాతమ్మ వంటి గ్రామదేవతలందరూ ఇలా పుట్టినవాళ్ళే అని రచయిత నమ్మకం.

**శ్రమజీవుల సహజ ప్రేమకథాచిత్రం :**

శ్రమజీవుల సహజమైన ప్రేమ ఈ నవలంతా నిండుంది. ఎల్లన్న - సుభద్ర, శివయ్య - శశిరేఖ, రూబేను - రూతు, ఇమ్మానుయేలు - మేరీ, జెస్సీ - రూబీ వంటి జంటల ప్రేమ చాలా సహజాతి సహజంగా ఉంటుంది. ఈ నవల్లో కేవలం భార్యాభర్తల మీదుండే ప్రేమేకాదు. దళితుల జీవనంలో వారి శ్రమకు తోడుగానే ఒకరిపట్ల ఒకరికి చెప్పలేనంత ప్రేముంటుంది. ఆ శ్రామికుల ప్రేమకు అటుండదు. గాలిలా, సూర్యకిరణంలా, పారే ఏరునీటిలా సహజమైన ప్రేమ వాళ్ళది. సుభద్రను ఎల్లన్నకి అడగడానికి భూదేవి ఇంటికొచ్చినప్పుడు సుభద్రతో కూర్చొని చాలాసేపు కబుర్లాడింది. మాటల మధ్యలో సుభద్ర చేతికి చెక్కదువ్వెనిచ్చి తన చెమట కాయలు గీకమంది. ఈ సన్నివేశం ప్రతి శ్రామికుల ఇళ్లల్లో జరిగేవే. కానీ పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లలకు ఆ పని చేయడం మొహమాటం. కానీ భూదేవి మీదుండే ప్రేమ వల్లనే సుభద్ర ఆ పని చేయగలిగింది. [11]"పీటేసుకోయే అప్పా" అని చిన్నమ్మి పీటతెచ్చి భూదేవికిచ్చింది. భూదేవి పీటమీద కూచుంది. చెక్కదువ్వెన కొసతో చెమటకాయలు ఒక్కొక్కటే గీకటం మొదలెట్టింది సుభద్ర. అదే అమ్మ అడిగుంటే చేసేది కాదు. ఇంకో సందర్భంలో అయితే భూదేవి పెద్దమ్మ మంచిదనే అభిప్రాయం సుభద్రకుంది." దళిత, గిరిజనుల బ్రతుకులోనే వెలకట్టలేని ప్రేముంటుంది. తమ తర్వాత తరాలవాళ్ళు సుఖంగా బ్రతకడానికి వాళ్ళు చేసే త్యాగాల్లోనే అపూర్వమైన ప్రేమ దాగుంటుంది. తమ జాతిపట్ల, తమ ప్రాంతంపట్ల ఎల్లన్న, నాగన్న, మాదిగ మాతయ్య, సాంబయ్య, పిట్టోడు, శివయ్య, మార్టిన్ వంటి వాళ్లెందరో తమ త్యాగాలతో భావితరాల వాళ్ళకు చక్కని బాటపరిచి వెళ్ళారు. వాళ్లందరిదీ సహజమైన ప్రేమలే.

**దళితులపై దాడుల చిత్రణ - విప్లవం :**

ఈ నవల్లో మొత్తంగా దళితులపై వేద పురాణకాలం నుంచి 20వ శతాబ్దం వరకు కూడా ఎలాంటి దాడులు జరిగాయో తెల్పుతుంది. తరతరాల నుంచి దళితులు, గిరిజనుల ఊళ్ళపై దాడి, భాషపై దాడి, వారి కళపై దాడి, బ్రతుకుపై దాడి, జీవనంపై దాడి, వారి స్వేచ్ఛపై దాడి, తిండిపై దాడి, కూలీపై దాడి, సంస్కృతిపై దాడి, ఆచార నమ్మకాలపై దాడి ఇలా అన్నింటా దాడికి గురైన వాళ్ళ బ్రతుకులు, వారి మనస్తత్వాలు ఎలా ఉంటాయి? ఆ దాడికి గురైనవాళ్ళు ఈ సమాజం మీద ఎలాంటి భావజాలంతో మనగలుగుతారు? అనే కోణంలోనే ఈ నవలంతా సాగుతుంది. 'ఎన్నిలదిన్ని' లో కరువొచ్చి

దారుణమైన పరిస్థితి నెలకొంది. ప్రాణాలు బిగపట్టుకుని ఊరువిడిచి శివయ్య శశిరేఖ బకింగ్‌హాం కెనాల్ కాలువ తవ్వకాల పనికోసం వెళ్ళి అడిగినప్పుడు అక్కడి కూలీ వాళ్ళు కూడా దారుణాతి దారుణంగా మట్టిగడ్డలతో కొట్టి తరమడం గగుర్పాటు కల్గిస్తుంది. [12]"ఈ మాల కొడుక్కి యిక్కడ పనికావాల్ట" గుండ్రని మనిషి కొంపలంటుకు పోయినట్టు అరుస్తూనే వున్నాడు. పని ఆపిన కూలీలు ఆ యిద్దరిమీద మట్టిగడ్డలు విసరటం మొదలెట్టారు. కూలీలలో వకరిద్దరు వూగిపోతూ గడ్డపారల్తోపై కొస్తు న్నారు. గుండ్రని మనిషి ఎందుకు అరుస్తున్నాడో, గడ్డ పారల్తో ఆ యిద్దరు కూలీలు ఎందుకు దాడి చేస్తున్నారో మట్టిగడ్డలు నాలుగు వైపులనుండి ఎందుకు తమపైన పడుతున్నాయో శివయ్యకి అర్థం కావటంలేదు. ఒక్కటి మాత్రం అర్థమైంది. అక్కడవుంటే తమ ప్రాణాలకు ముప్పువస్తుంది. ఆ ఆలోచన రాగానే శశిరేఖ చెయ్యి పట్టుకొని అక్కడ వుండకుండా పరుగుతీశాడు. తమని తరుముకొంటూ కొందరు కూలీలు వస్తున్నట్టు అన్పిం చింది. లేని శక్తి తెచ్చుకొని పరుగు ఎక్కువచేశారు. చాలా దూరం తరిమాక కూలీలు వెనుక్కి తిరిగారు. యిక పరుగెత్తే ఓపికలేక ఎండిన సరిగె తోపుబాటలో చతికిలపడ్డారు.

అగ్రవర్ణాలవారు దళితులపై దాడి చేయడం సర్వ సాధారణమైన విషయంగా ఈ నవల చెబుతుంది. కానీ ప్రభుత్వాఫీసర్ దళితులపై దాడి చేయడం జీర్ణించుకోలేని విషయం. అమాయకమైన పిల్లలపై, ఆడవాళ్లపై, మగ వాళ్లపై జరిగిన దారుణమైన సంఘటనగా 'ఆవలపాడు'పై నీళ్ళకై జరిగిన ఘటన. ఈ ఘటనలో 'చెత్తోడు' అనే పోలీస్ ఆఫీసర్ చేసిన దారుణకృత్యాలు చూస్తే మన కళ్ళల్లో కన్నీళ్ళు ఆగవు. సుబ్బయ్య భార్య సెంద్రి పురిటినొప్పులు భరిస్తున్న సమయం. సెంద్రిని, మంత్రసానిని జుట్టు పట్టుకుని లాక్కెళ్ళారు పోలీసులు. మిగతా ఆడవాళ్లందర్ని లాక్కెళ్లి ఒకచోట చేర్చి అందర్ని కొట్టే సందర్భంలోని ఈ సంఘటనని పరిశీలించండి.

[13]"సెంద్రి నెప్పులు ఎక్కువయ్యాయి. పెద్దగా అరు స్తోంది. కుప్పకూలినట్టు కూర్చొంది. మంత్రసాని మౌనంగా సెంద్రినే చూస్తోంది. పోలీసుదెబ్బలు ఆమెకు గుర్తులేదు. వాళ్ళు ఏమడుగుతున్నారో ఆమె పట్టించుకోలేదు. రాత్రి నుంచి ఓ అంటరానివాడు ఈ భూమ్మీద పడటానికి తొలి చూపుల్తో ఈ దారుణాన్ని చూడటానికి ఘర్షణ పడ్తున్నాడు. వాడికోసం ఎదురు చూస్తోంది. ఖచ్చితంగా మగబిడ్డే. కదిలికంతా అట్టాగే వుంది. సెంద్రి ఆగి ఆగి అరుస్తోంది. మంత్రసాని సెంద్రి చుట్టూ అంతా నిలబడండి అని అంది. అంతే ఆడాళ్ళంతా సెంద్రిచుట్టూ దడి కట్టారు. చెత్తోడు పెట్రోమాక్సు లైటు తీసుకొని అక్కడికి వచ్చాడు. 'కంటోందా' అంటో లోపలికి తొంగి చూడబోయాడు. ఆడాళ్ళు ఛీ అంటో చుట్టు గుడిశలా సెంద్రిచుట్టూ మూగారు. చెత్తోడి లాఠీదెబ్బలు వాళ్ళమీద పడుతున్నాయి. పోలీసులు వాళ్ళ చేతులమీద, కాళ్ళమీద కొడ్తున్నారు. కాని ఆ మానవ చుట్టుగుడిసె కూలిపోలేదు. చెదిరి పోలేదు. వాళ్ళ దృష్టంతా సెంద్రిపైనే. పైన పడుతున్న లాఠీ దెబ్బలు బాధపెట్టడంలేదు. పోలీసుల బూతులు విన్పించటంలేదు. అంత బీభత్సంలో ఓ వెర్రికేక... ఓ పిల్లాడి ఆర్తనాదం. వో అంటరానివాడి తొలికేక."

ఇలాంటి దారుణమైన కృత్యాలను తమ పూర్వీకులపై ఉన్నందున ఇమ్మాన్యుయేల్ వంటి వాళ్ళు విప్లవబాట పట్టారు. రూతు రచయిత్రిగా మారింది. జెస్సీ, రూబీలాంటి వాళ్ళు ప్రజాసంఘాల్లో చేరి తమ హక్కులు, న్యాయం గురించి పోరుబాట పట్టారు. సమాజం ఇంకా మారాల్సివుంది. ఈ దేశంలో దళితులు, గిరిజనులపై జరిగిన అన్యాయాలు, అక్రమాలపై 'తవ్వాల్సింది, పూడ్చా ల్సింది చాలావుంది' అని తెలిపిన 'అంటరాని వసంతం' నవలా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**పాదసూచికలు :**

1. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 197, 198.
2. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 13.

3. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 14.
4. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 15.
5. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 15.
6. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 15.
7. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 25.
8. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 72.
9. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 16.
10. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 105, 106.
11. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 65, 66.
12. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 126, 127.
13. అంటరాని వసంతం - జి. కళ్యాణరావు - పుట 197.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవలల్లో దళితులు – సామాజికత

– డా॥. బి. శ్రీనివాసులు నాయక్
తెలుగు ఉపాధ్యాయులు, కుప్పం.

**పరిచయం :**

ఆధునిక సాహిత్యంలో ఎక్కువ ప్రచారం పొందిన ప్రక్రియ నవల. ఇతర సాహిత్య ప్రక్రియల కంటే ఎక్కువ పాఠకులను కలిగివున్న ప్రక్రియ నవల. జనజీవిత సమస్యలను వాస్తవంగా, విస్తృతంగా వివరించటంలో ముందున్నది నవల. నవలా రచనలలో కథ, ఇతివృత్తం, కథాకథనం, పాత్రలు, సన్నివేశ కల్పనలు, శైలి మొదలైన అంశాలుంటాయి. తెలుగు నవలల్లో దళిత జీవిత చిత్రణ దళితుల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వివక్షతలను, వారి ఆత్మగౌరవ పోరాటాలను, కుల ఆధిపత్యంపై తిరుగుబాటును శక్తివంతంగా ఆవిష్కరించింది. "దళిత" అన్న పదం మరాఠీ నుండి తెలుగులోకి వచ్చిన అన్యదేశీయ పదం. ఈ పదానికి ఖండించబడిన, చీల్చబడిన, ఓడించబడిన అనే అర్థాలున్నాయి. సమాజంలోని నిమ్న జాతులకు 'దళిత' అనే పదాన్ని మొట్టమొదట "మహాత్మ జ్యోతి బాపూలే" ఉపయోగించారు. "మనుషులు మనువులుగా పుట్టక మనువులై పుడితేనే ప్రమాదం" అని దళిత కవిత్వం నినదించింది. మధ్వాచార్యులు (ద్వైతమతం), శంకరాచార్యులు (అద్వైతమతం), రామానుజాచార్యులు (విశిష్టాద్వైతం) మరియు వల్లభాచార్యులు (శుద్ధాద్వైతం) వంటి ప్రముఖులు ప్రాచీన కాలం నుండే కుల, మతాలను నిరసిస్తూ నూతన మత సిద్ధాంతాలను ప్రచారం చేశారు.

**విషయ – వివరణ :**

సమాజంలో దళితుల అభ్యున్నతి కొరకు కృషి చేసిన వారిలో జ్యోతిబాపూలే, డా॥బి.ఆర్.అంబేద్కర్, శివరామ్, కాంబ్లె, కర్మవీర్ హిందే, నారాయణ్ చందావర్క్ వంటి వారన్నారు. ఈ దళిత స్పృహ ప్రారంభంలో రాయబడిన ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన 'మాలపల్లి' నవలలో కనిపిస్తుంది. 1968లో కంచికర్ల కొటేశు 'సహజీవనం', 1985 జూలైలో కారంచేడు, చుండూరు ప్రాంతాల్లో జరిగిన హత్యాకాండ, మండల కమీషన్ నివేదికపై వ్యతిరేకుల దాడి వంటి సంఘటనల పర్యవసానంగా దళిత స్పృహ, దళితవాదంగా స్థిరపడింది. ఈ ధోరణిలో అప్పటికే 'ఖాకీ బ్రతుకులు' (జి.మోహనరావు), 'పంచమం', 'అద్దంలో చందమామ' (చిలకూరి దేవపుత్ర), 'కక్క' (వేముల యల్లయ్య), 'అంటరాని వసంతం' (జి.కల్యాణ్‌రావు) వంటి నవలలు వెలువడ్డాయి.

అసమానతలతో నిండిన సమాజంలో వర్గపోరాటం తప్పదు. అనివార్యం కూడా. అన్యాయానికి గురవుతున్న ప్రజలు ఓపిక నశించినప్పుడు తమ ఉనికిని చాటుకోవడానికి, అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నం

చేస్తూనే వుంటారు. ప్రాంతీయ చైతన్య స్పృహతో నవలలు వెలువడాల్సిన అవసరం ఉంది. 'దళిత కవిత్వం అంటే లలిత కవిత్వం కాదన్న పి.సి.రాములు' గారి మాటలు అక్షర సత్యాలు. దళితులపై నేటికీ కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనం, సామాజిక బహిష్కరణ మరియు సామూహిక దాడులను తెలుగు నవల బలంగా ఎత్తి చూపాయి. వేముల ఎల్లయ్య రచించిన 'కక్క' నవలలో తెలంగాణా మాదిగ జీవితాన్ని, కులవృత్తి నేపథ్యాన్ని, మాండలిక భాష, యాసలో చిత్రించారు. ఈ నవలల దళిత మారుమూల జీవితాన్ని వారిలోని అంతర్గత సంఘర్షణను, పాలేరు తనాన్ని, అగ్రవర్ణాల దౌర్జన్యాలను స్పష్టంగా చూపింది. కొలకలూరి ఇనాక్ రచించిన 'సర్కారుగడ్డి', 'అనంతజీవనం' నవలలు 1990-2010 మధ్యకాలంలో అనంతపురం జిల్లా కరువు, సామాజిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో దళిత జీవితాన్ని, ఆకలి మంటలను మరియు వలసలను చిత్రించాయి.

ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ ప్రాంతంలో దళిత జీవితాలపై అనేక నవలలు వెలువడ్డాయి. కేశవరెడ్డి 'రాముడుండాడు రాజ్జ ముండాది' (1986), స్మశానందున్నేరు (1979), కేతువిశ్వనాథరెడ్డి 'వేర్లు' (1978), పి.నాసరయ్య 'మాదిగపల్లె' (1996), పినాకపాణి 'నిప్పుల నాగు' (2001), బండి నారాయణస్వామి 'గద్దలాడ తాండాయి' (1996), 'మీ రాజ్యం మీరేలండి' (2005), 'రెండు కలలదేశం' (2010) మొదలైన నవలలు దళితుల జీవితాన్ని చిత్రించాయి.

కేతు విశ్వనాథరెడ్డి రచించిన 'వేర్లు' (1978) నవలలో నాయకుడి వెంకట్రాముడు. ఈయన ఆంత్రోపాలజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చదివిన ఒక మాదిగ సామాజిక వర్గ యువకుడు. తన గ్రామంలో తనకు చిన్నప్పటి నుండి ఎదురైన అనుభవాలు, సమాజం నుండి ఎదురైన అనుభవాలు అతనిని ఆలోచింపచేశాయి. సామాజిక, ఆర్థిక అసమానతలను ఒక్క చదువుతోనే ఎదుర్కొ వచ్చుననే నిర్ణయానికి వచ్చి ఆర్.డి.ఓ స్థాయి ఉద్యోగ వేటలో పడుతాడు. తనకు అడుగడుగున ఎదురైన కులవివక్ష, అవమానాలకు కారణం తక్కువ కులంలో పుట్టడమేనని భావనకు వస్తాడు. ఏ కులంలో పుట్టాలో ఎవరింట పుట్టాలో మన చేతిలో లేని పని కాని వీటికి పరిష్కారం మాత్రం బాగా చదివి మంది ఉద్యోగం సంపాదించి ఎదుర్కొవాలనే నిర్ణయానికి వస్తాడు. ఉద్యోగాల కోసం నిరంతరం ప్రయత్నించడం విఫలమడంతో నీటికోసం ఎండమావుల వెంట పరుగెత్తడమేనన్ని గుర్తిస్తాడు. విద్య అనేది చిన్నప్పటి నుండి అబ్బాలి. ఒకవేళ అబ్బినా దానిపై మతం, కులం, డబ్బు అనే కారణాలు ప్రభావం చూపిస్తాయని తెలుసుకోలేకపోతాడు. ఈ నవల వల్ల ప్రభావితులైన ఎందరో మంది దళిత యువకులు వారి స్వగ్రామాలను వదిలి, సమాజంలో వేర్లుగా పాతుకు పోయిన కుల, మత భేదాలకు అతీతంగా దూర ప్రాంతాలకెళ్ళి బాగా చదివి ఉన్నత జీవితాలను అధి రోహించడం జరిగింది.

బండి నారాయణస్వామి 'గద్ద లాడతాండాయి' (1996) ఒక దళిత బహుజన నవల. ఈ నవలలో భూస్వామ్య వ్యవస్థ, కులాధిపత్యం కనబడుతుంది. దళితులకు భూమి వుండదు. వుంటే దాని సాగుకునీటి వసతి వుండదు. దీనిని ఆసరాగా చేసుకొని మాదిగలను అగ్రవర్ణాల వారు తమ పొలాలలో కూలీలుగా మార్చి వారిపై ఆధిపత్యం చెలాయిస్తావుంటారు. అవసరాలకు డబ్బు ఇవ్వడం ఎక్కువ వడ్డీ జమచేయడం అది తీర్చలేక తరతరాలు వారి ఇండ్లలో బానిసలుగా బ్రతుకు నీడుస్తుంటారు. రాజకీయ నాయకులు నేటికీ వారి స్వార్థ ప్రయోజనాల కోసం మాదిగలకు సారా పోయించి, సారా బానిసలుగా మార్చి ఓట్లు దండుకునేకు సంస్కారం ఈ నవలలో కనిపిస్తుంది. ఈ నవలలో మాదిగమల్లేశు పాత్ర దయనీయంగా చిత్రించబడింది. మల్లేశు పండించిన వేరు శనక్కాయలను మోసంతో శంకరరెడ్డి తీసుకొని మిగిలిన డబ్బులు ఇవ్వకుండా బాకీ కిందకు జమకట్టేస్తాడు. చివరకు మాదిగ మల్లేశు ఇంట్లో తినడానికి గింజ లేకపోవడం చేసేది లేక శంకర్‌రెడ్డి ఇంట్లో దొంగతనానికి వెళ్లి చావు దెబ్బలు, అవమానాలు భరించి ఇంటికి చేరుకుంటాడు. ఇలాంటి సంఘటనలు ఈ నవలలో కోకొల్లలు.

దళితులలో చైతన్యాన్ని నింపిన నవలల్లో పి.నాసరయ్య రచించిన 'మాదిగపల్లె' నవల ఒకటి. ఒక దళిత కుటుంబం సహచర దళిత కుటుంబాల వారికి ప్రేరణ నిచ్చి వారిలో నవచైతన్యం నింపే సంఘటనలు ఈ నవలలో చోటు చేసుకున్నాయి. ఈ నవలలో అమరయ్య అతని కుటుంబ సభ్యులు దళితుల కోసం ఇతర వర్గాల వారితో నిత్యం ప్రతిఘటిస్తూ ఉంటారు. ఈ సందర్భంలో అమరయ్య తోట మాల, మాదిగల ఆత్మగౌరవం కాపాడటం కోసం పోరాటం చేయడం ప్రధానంగా కనిపిస్తుంది. ఈ క్రమంలో పల్లెలో దేవాలయం నిర్మించడంతో అగ్రవర్ణాల వారికి తెగిన వేలిపై కారం పడ్డట్టూ ఉలిక్కి పడుతారు. అమరయ్య కూతురైన సుశీలను భూస్వామి కొడుకు, గుండాలు అత్యాచారం చేసి చంపేస్తారు. సుశీల భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న చెల్లెలు సుమతి స్త్రీవాద భావాలతో వర్ణోద్ధరణకై దళితులు, స్త్రీల ఆత్మరక్షణకై పోరాడుతుంది. ఇందులో దళిత స్త్రీ చైతన్యం కనిపిస్తుంది.

ఆధునిక నవలా రచయితల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన రచయితల్లో కేశవరెడ్డి ఒకరు. తన నవలల్లో అత్యధికంగా దళిత చిత్రణకే ప్రాధాన్యతమిచ్చాడు. స్మశానం దున్నేరు, 'ఇన్‌క్రెడ్‌బుల్ గాడెస్', 'బానిసలు', 'చివరిగుసె' నవలలు పూర్తిగా దళిత సమస్యలను చిత్రించాయి. వీటిలో దళిత జీవన పరిస్థితులు నేటికీ అక్కడక్కడ కనిపిస్తుండడం గమనార్హం. 'ఇన్‌క్రెడిబుల్‌గాడెస్'' నవలలో రామచంద్రుడిది ప్రధాన పాత్ర. ఈయన మాల కులానికి చెందిన రంపాల తెగకు చెందినవాడే. రామచంద్రుడు శారీక కష్టం చేస్తూ స్వతహాగా బ్రతికుతున్న లోకజ్ఞాని. ఇతరుల తప్పుల్ని ఎత్తి చూపడమో, అన్యాయాలను, దౌర్జన్యాలకు పాల్పడేవాళ్ళను ఎదిరించాలన్నదో అతని నైజము కాదు. కష్టాల్లో ఉన్నవారికి తగిన సాయమందించాలని అనుకుంటుంటాడు. గొడవలకు తాను ఆమడ దూరం. విధిలేని పరిస్థితుల్లో రామచంద్రుడు 'రెడ్డి' దగ్గర పనిమనిషిగా ఉండేవాడు. ఇతని నిజాయితీ చూసి రెడ్డి పొరంబోకు జాగాను పట్టా చేయించానంటే నమ్మి, అక్కడ ఇల్లు నిర్మించుకొంటాడు. ఇలా సాగుతున్న తరుణంలో ఒక తప్పుడు కేసులో రెడ్డి తనను సాక్ష్యం చెప్పమంటాడు. ససేమిర ఒప్పుకోడు. దాంతో రెడ్డి దగ్గర పనిని మానేసి జీవనాధారం కోసం పందులను మేపడానికైనా సిద్ధపడి ఆత్మసాక్షిని చంపుకోడు. చివరికి తను ఇల్లు నిర్మించుకొని ఉన్న స్థలం పట్టాకాదని తెలిసి తనలాగా తన పిల్లలు బాధపడకూడదనే ఆలోచనతో తన కొడుకును చదివిస్తాడు. ఈ నవలలో చదువు - ప్రాముఖ్యతను నొక్కి ఒక్కాణించారు రచయిత.

కేశవరెడ్డి రచించిన 'రాముడుండాడు రాజ్జముండాది' ఇతివృత్తం వృత్తిమార్పిడి, వలసలు. ఇందులో పులిగాడు ప్రధాన పాత్రధారి. ఇందులో కథంతా ఇతని చుట్టే తిరుగుతుంది. ఊర్లో బ్రతకడానికి పనిదొరకక పట్నానికి వెళ్ళి కూలి పనులు చేస్తూ జీవిస్తాడు. చదువు లేకపోయినప్పటికి లోకంతీరు తెలిసినవాడు. తన బతుకు తాను బతకగల నేర్పరి. నమ్మకాల్లోని నిజాలను బేరీజు వేసుకొని మసలే జ్ఞానం కలవాడు. సమయస్ఫూర్తి గలవాడు. కూలి పనులు దొరకనపుడు తనకు ఎవరైనా సహాయం అర్థిస్తే ఉచితంగానే వారికి పనులు చేసిపెట్టే ఉదారస్వభావం కలవాడు. ఇలా అందరి అవసరాలు తీరుస్తూ, అందరికి అందుబాటులో ఉంటూ తోటి వారందరికి ఆదర్శప్రాయుడై ఉన్నత జీవితాన్ని పులిగాడు గడుపుతుంటాడు.

**ముగింపు :**

తెలుగు నవలల్లో దళితుల జీవిత చిత్రణ చేసిన రచయితలందరూ సమకాలనీ సమాజానికి సరిపడే ఇతివృత్తంతో నవలలు రచించారు. ఒక దళిత కుటుంబానికి చెందిన ఒక బాలుడు లేదా బాలికపై పరిసరాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎంత పాఠశాలకి పంపుతున్న, సహచర విద్యార్థులతో ఉపాధ్యాయులతో కలివిడిగా ఉండరు. బ్రతికి బట్టగట్టడమే కష్టమైన సమయంలో చదువు ఎలా అబ్బుతుంది. ఈ ప్రపంచంలోనే విద్యయే బలమైన ఆయుధం. దళితుల జీవిత చిత్రణపై దళితులు కొందరు స్వంత అనుభూతులు, అనుభవాలు రాస్తే దళితేతరులు కూడా దళితులపై

నవలలు రచించారు. మరోవైపు దళిత స్త్రీ అని మరియు లింగవివక్షతో కూడిన చులకన భావం ఉన్న రోజుల్లో నేటికీ దళిత బాలికలకు ప్రత్యేక శిక్షణ అవసరం. సమాజం బాగుండాలన్నా దళిత బాలికలకు ప్రత్యేక శిక్షణ రక్షణ అవసరం. సమాజం బాగుండాలన్నా, దేశం అభివృద్ధి చెందాలన్నా దళితులు కూడా అభివృద్ధి చెందాలి. ఆర్థిక అసమానతలు లేని సమాజం తయారవ్వాలి. దానికై దోహదపడే నాణ్యమైన విద్యను దళితులకి అందాలి. ఉచితాలతో ప్రభుత్వాలు వారి ఆలోచనాశక్తిని చంపి ఏపనికీ సిద్ధపడని దుస్థితి కల్పించి రాజకీయం చేస్తున్నారు. కానీ రాజకీయ నాయకులు వారు సంపాదించిన ఆస్తులు, వారి పిల్లలు చివరికి వారు కూడా ఈ ఆర్థిక, సామాజిక, అంతరాలున్న సమాజంలో తిరగవలసిందేనని గుర్తెరిగి భవిష్యత్ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నిబద్ధతతో కూడిన సమూల అభివృద్ధిని అందించి వారి కుటుంబాలలో వెలుగులు నింపాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**


1. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం, 1980 తర్వాత తెలుగు దళిత నవల, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2003.
2. ప్రసాద్, కలేకూరి, ఆంధ్రప్రదేశ్ దళితులు, హైదరాబాద్ ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్, 2010.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# కొల్లాయిగట్టితేనేమి? - సామాజికత

- బాణావత్ చంద్రకళ

పరిశోధక విద్యార్థిని, తెలుగు అనువాద & అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసవనం, కుప్పం.

**నవల - పరిచయం :**

క్రీ.శ.19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో ఎన్నో సృజనాత్మకమైన వచన సాహితీ ప్రక్రియలు జనించాయి. ఆంగ్లం నుండి జనించిన ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఎక్కువ పాఠక జనాదరణ పొందిన ప్రక్రియలలో తలమానికమైనది నవల. ఆంగ్లంలో Novel అనే పదం Novelle అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. తెలుగులో నవలను నరహరి గోపాలకృష్ణమశెట్టి 'రంగరాజ చరిత్ర' (1872) ను నవీన ప్రబంధం అని, కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్ర' (1879)ను వచన ప్రబంధమని పేర్కొన్నారు. 1897లో కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి 'వివేక చంద్రికా విమర్శనం' పీఠికలో 'నవల' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించారు. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి "నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా" అని కొత్త విశేషాలు గలది "నవల" అని నిర్వచించారు.

**వివరణ :**

సమకాలీన సమాజంలోని ప్రధానమైన సమస్యలనే ఇతివృత్తంగా "మూడు పువ్వులు - ఆరు కాయలు" అన్న 'చందాన' తెలుగు నవల దినదినాభివృద్ధి చెందింది. 1919-20 నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను చిత్రించే ప్రయత్నంలో మహీధర రామమోహనరావు గారు రచించిన నవల 'కొల్లాయి గట్టితేనేమి?' ఈ నవలకు 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. పంజాబ్‌లో రౌలత్ చట్టం (1919) అప్పుడప్పుడే అమల్లోకి వచ్చింది. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ (1919) అప్పుడప్పుడే జరిగింది. బ్రిటీష్ వ్యతిరేక భావజాలం మరియు జాతీయ భావం గ్రామాల్లోకి, సామాన్య జనంలోకి ప్రవేశిస్తున్నది.

దీనికి చిహ్నంగా కాంగ్రెసు మీద గాంధీ ఆధిపత్యం బలపడుతున్న రోజులలో, అప్పటి వరకు విద్యావంతులే సంస్థ సభ్యులుగా ఉన్న కాంగ్రెస్ ఒక రాజకీయ పార్టీగా రూపాంతరం చెందుతున్న రోజులలో ఈ నవల వెలువడింది. నవల ఆనాటి సమకాలీన సమాజం, ఆచార వ్యవహారాలను మరియు సాంఘిక పరిస్థితులను అద్దం పడుతుంది. 'కొల్లాయి గట్టితేనేమి' వెలువడే నాటికే ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి (సంగవిజయం) సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక, ఆర్థిక రంగాలకు ప్రతిబింబంగా, నవరసభరిత ఉత్తమ కావ్యంగా పేరుపొందింది.

'కొల్లాయి గట్టితేనేమి' నవలలోని ప్రధాన పాత్ర రామనాథం. ఈ నవలలోని కథంతా రామనాథం చుట్టూనే

తిరుగుతుంది. అంటే రామనాథం జీవిత కేంద్రంగా సామాజిక జీవితాన్ని ఆవిష్కరించిన నవల ఇది. గాంధీజీ పిలుపు మేరకు తన చదువును అర్ధాంతరంగా ఆపేసి, కళాశాలను బహిష్కరించి జాతీయోద్యమంలో భాగస్వామి కావడానికి రామనాథం బయల్దేరడంతో ఈ నవల ప్రారంభమౌతుంది. ఈ నవలలోని కథ ప్రారంభ మయ్యేనాటికి మొదటి ప్రపంచ యుద్ధం (1914-18) ముగిసింది. యుద్ధం ముగిసిన తరువాత సైన్యంలో అసంతృప్తి ఎక్కువైంది. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకాయి. పరాయి పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న జాతీయోద్యమాన్ని అణచడానికి రౌలట్ చట్ట ప్రయోగం జరిగింది. మరోవైపు జలియన్ వాలాబాగ్ దారుణ మారణకాండ, గాంధీ పిలుపు మేరకు సహాయ నిరాకరణోద్యమంలో ప్రజలు పాల్గొనడం వంటి పరిస్థితులు ఈ నవల వెలువడటానికి దోహదపడ్డాయి.

గాంధీ సహాయ నిరాకరణోద్యమం ప్రభావంతో రామనాథం విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా విదేశీ వస్త్రాలు దహనం చేసి, ఖద్దరు వస్త్రాలు ధరించి తన స్వగ్రామమైన ముంగండకు వస్తాడు. ఇక్కడేమో పూర్తి భిన్నంగా పరమ నైష్టకత, ఛాందస వాదుల రాజ్యం నడుస్తూ ఉంటుంది. కరుడుగట్టిన ఆధిపత్యం ఒకవైపు, దళితుల కనీస అవసరాలైన తిండి, గుడ్డ మరియు నీళ్లు ఇవ్వడానికి ఇష్టపడని అగ్రకులాలకు నిలయం ఆ ముంగండ గ్రామం. ఆరోజుల్లో ఎక్కడాలేని సాంఘిక దురాచారాలన్నీ ముంగండలోనే తిష్టవేశాయి. విదేశీయానం చేసి ముంగడలో ప్రవేశించాలంటే ఆవుపేడ మింగి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే. రామనాథం ఒకవైపు దేశోద్ధరణకు నడుం బిగిస్తే అక్కడి అగ్రవర్ణం అణచివేసే ప్రయత్నం చేయడం రామనాథంకి మింగుడుపడదు. ఆ గ్రామంలోని అగ్రకులం చేసే పాశవిక అనాగరిక దుశ్చర్యలు రామనాథం కళ్లారా చూసి మార్పు ఇక్కడితోనే మొదలు పెట్టాలనుకుంటాడు.

రామనాథం గాంధీజీ భావజాలంలో ప్రేరేపితుడై, గ్రామంలో అడుగుపెట్టగానే తన సంస్కరణ, ఆశయాలను అమలు జరపటానికి ప్రయత్నిస్తూ సామాజిక మార్పును కాంక్షిస్తాడు. మొట్టమొదటి సంస్కరణలో భాగంగా తన తోటలోని ఒక బావిని దళితులకు తాగునీటి అవసరాలకై ఇస్తాడు. దీని ప్రారంభోత్సవానికి దేశోద్ధారక బిరుదాంకితుడైన కాశీనాథుని నాగేశ్వరరావును పిలుస్తాడు. ఈ విషయం తెలిసిన 'ఛాందసవాదులు' రామనాథంను ఊరి నుండి వెలివేస్తారు. శిలకు ఉలిదెబ్బలు తగిలితేనే కదా శిల్పముగా మారేది అన్న చందాన వచ్చిన కష్టాలను భరిస్తూ ముందుకు సాగాడు. సాహసోపేతంగా తను నమ్మిన సంస్కరణను అమలు జరుపుతాడు. ఖద్దరు ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించి ఎంతో మందికి పనిని కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తూ, సందర్శించడానికి గాంధీజీ లాంటి మహానాయకుణ్ణి ఆహ్వానిస్తాడు.

రామనాథం ఆధునిక భావాలు కలిగినవాడు. అప్పుడప్పుడే సమాజంలో ప్రవేశిస్తున్న బూర్జువా భావజాలంతో ప్రభావితుడైనవాడు. అన్ని కులాల పట్ల సమదృష్టి, స్త్రీ విద్య పట్ల సానుకూల దృక్పథం, మూఢాచారాలు, ఛాందస వాదులపై వ్యతిరేకత, కులాంతర వివాహాల పట్ల సుముఖత, అస్పృశ్యతను పాటించకపోవడం, దేశం పట్ల బాధ్యత కలిగి ఉండటం మరియు ఆంగ్ల విద్య మొదలైనవి బూర్జువా భావజాలంలోని కొన్ని లక్షణాలు. ఈ లక్షణాలన్నీ కలిగి పాత్రగా రామనాథాన్ని రచయిత మహీధర రామమోహనరావు సృష్టించాడు. ఈయన భావజాలాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోయారు. బహిష్కరణకు గురైనా ఆయన తన తోటలోనే గుడిసె ఏర్పాటు చేసుకొని దళితులకు త్రాగునీటిని అందించి వారిని చైతన్యవంతులను చేశారు.

రామనాథం, స్వరాజ్యం పెళ్లి కూడా ఒక ఘర్షణకు లోనయినదే! స్వరాజ్యం అప్పటికే వివాహమై భర్త నుండి విడిపోయిన మహిళ. రామనాథం కూడా భార్యతో విడాకులు తీసుకొని వుంటాడు. ధైర్యం చేసి సామాజిక అభ్యంతరం ఎదురైనా వెరవక వివాహానికే సిద్ధమవుతాడు. కానీ స్వరాజ్యం తండ్రి అంధుడైన అబ్బాయి నాయుడు ఆమె ఆలోచనలు వీటినీ అంగీకరించలేదు. ఒక వైపు భిన్న కులాలు కావడం మరోవైపు ఇరువురికి రెండో పక్షం వారు ఓ జీవులుగా ఉండటంతో "ఉంచుకొన్నాడంటారు.

దీనికిదే పేరు. ఫలానా నాయుడు కూతుర్ని ఎవడో లేవదీసుకుపోయేడంటారు...'' ఆ ఆలోచననే అతడు సహించలేకపోయాడు.

"నేను నీ కూతురై వుండడం ఒక్కటేనా అభ్యంతరం..." అని అడుగుతున్న స్వరాజ్యంకేమి సమాధానం ఇవ్వ గలడు. మరోవైపు కూతురు ఎంచుకున్న వరుడుకన్న తాను మంచివాడిని తేగలనా అనే ఆలోచన తనను కుదురుగా ఉండనివ్వలేదు. చివరికి తన ప్రతిష్టనూ, కుటుంబ ప్రతిష్టనూ దృష్టిలో పెట్టుకొని రామనాథంను చంపడానికి అబ్బాయి నాయుడు సిద్ధ పడుతాడు. "ఏమిటీ దురంతం. నిండు ప్రాణం తీసేద్దువే'' అంటూ స్వరాజ్యం నిల దీస్తుంది. ఇలా ఎన్నో రకాల ప్రశ్నలు, సమాలోచనల తరువాత అబ్బాయి నాయుడి అంతరాత్మ మీద అతని వివేకం జయిస్తుంది. వాళ్ళ వివాహానికి అంగీకరిస్తూ ఆశీర్వదిస్తాడు. మన సంఘంలో ఉన్న ఆచారాలు, సంప్రదాయాలు మన స్థితికి మూలమని తప్పుచేశామనే భావన నుండి బయట పడి సుఖపడండని హితబోధ చేస్తాడు.

ఈ నవలలో రచయిత రామమోహనరావు గారు అబ్బాయి నాయుడు పాత్ర చిత్రీకరణలో వైవిధ్యాన్ని సృష్టించి ఆలోచింపచేస్తూ, సంప్రదాయాలు, ఆచారాలు మనుషులు ఏర్పరచుకొన్న సరిహద్దు రేఖలని సమ సమాజానికి తెలిపే ప్రయత్నం చేయడం అద్భుతం. మనిషి ప్రాణం ఎంత విలువైనదో ఒకవైపు స్వరాజ్యం, అబ్బాయి నాయుడి పాత్ర ద్వారా తెలిపారు. నేడు ఎన్నో కుటుం బాలు పరువు, ప్రతిష్టతలనే ముసుగులో నిండుప్రాణాలు తీసి కుటుంబాలను రోడ్డున పడవేసే ఆలోచనాపరులకు కనువిప్పు ఈ నవల. ఒక అబ్బాయి నాయుడు, స్వరాజ్యం, రామనాథం లాంటి పాత్రలుగా నేడు ఈ సమాజంలో విప్లవకారుడిగా మారవలసిన అవసరం ఉంది. ఆధునికకాలానికి అనుగుణంగా కొన్ని సంప్ర దాయాలు మారవలసిన అవసరం ఉంది. నేడు ప్రభుత్వాలు సైతం కులాంతర వివాహాలను ప్రోత్స హిస్తున్నాయి. కానీ సమాజంలో ప్రాచీన సాంప్రదాయాలు పాతుకుపోయి వుండడంతో అక్కడ చెదురుముదురు దుర్గటనలు జరుగుతూనే ఉన్నాయి.

**ముగింపు :**

రచయిత సమాజంలోని లోపాలను, సమస్యలను ఎత్తి చూపిస్తూ స్వాతంత్ర్యోద్యమం వైపు ప్రజలను చైతన్యం చేయడానికి ప్రయత్నించారు. గాంధీగారు చెప్పినట్లు అస్పృశ్యతను, అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించకపోయినా వారికి గుప్పెడు త్రాగునీళ్ళు పీడితులకు నివాస ఏర్పాట్లు చేయడం వంటి పనుల వలన సామాజిక మార్పును, సంఘసంస్కరణను కాంక్షిం చారు. ఈ నవల విశేషమేమిటంటే రచయిత రామ మోహనరావు గారు 'కొల్లాయి గట్టితేనేమి' అనే పేరుపెట్టిన ఆరు మాసాల కాలం తరువాత గాంధీజీ కొల్లాయి కట్టడం మొదలు పెట్టడం. ఒక వైపు రామనాథం గాంధీజీ బోధన లకు ఆకర్షితుడై తన కళాశాల చదువును అర్థాంతరంగా వదిలివేశాడు. మరోవైపు స్త్రీ విద్యాభిమానంతో కూతురైన స్వరాజ్యంకు అబ్బాయినాయుడు ఇంగ్లీషు చదువు చెప్పించాడు. ఆడపిల్లకు చదువేమిటి? అన్న ప్రశ్న కుటుంబం నుండి, సమాజం నుండి ఎదురైనను వెరవ లేదు. దీనిని బట్టి చూస్తే రచయిత ఒకవైపు జాతీయోద్య మాన్ని గౌరవిస్తూనే స్త్రీ విద్యా ఆవశ్యకతను తెలియ పరిచారు. ఇరవై యేండ్ల మిసిమిసి వయస్సులో వున్న స్వరాజ్యం విధవో, సధవో, వివాహితో, అవివాహితో, యేదైందీ తెలియని వింత పరిస్థితలో వుంది. చేసేదేమీ లేక కాలేజీ చదువుకు పోవాలనుకుంటున్న స్వరాజ్యం ఆలోచనను, దేశభక్తి ప్రేరణతో కాలేజీ చదువు మానుకొన్న రామనాథం హర్షింకపోయినా, ఆమె యొక్క ఆధునిక దృక్పథానికీ, మనస్సంకోచాలు లేని నిర్మల హార్ధిక ప్రవర్తనకూ మనసులో హర్షించకుండా వుండలేక పోయాడు. ఇలా ఆద్యంతం నవల ఆసక్తిగా ఉంటుంది. రామనాథం మామ నారాయణ మూర్తి దురంహకారి, అధికార గర్వి మాత్రమే కాదు ఎదుటి వాళ్ళను పురుగుల్లా హీనంగా చూస్తూ ముందూ వెనకూ చూడకుండా ప్రతిచిన్న విషయానికి లాఠీ ఝులిపించే స్వభావం కలవాడు. ఆనాటి

పోలీసు ఉద్యోగుల పశుత్వం గురించి రచయిత మహీధర రామమోహన్ కున్న నిశ్చితమయిన అవగాహన నుండి ఉద్భవించిన మూర్తే నారాయణమూర్తి పాత్ర. ఆనాటి పోలీసుల మనస్తత్వంలోని పశుత్వమూ, నీచత్వమూ నవల ప్రారంభంలోనే పాఠకులకు అవగతమవుతుంది.

కథ, నవల, నాటకం ప్రక్రియ ఏదైనా సమాజహితం కోసం, సమ సమాజ స్థాపన కోసం, పాఠకులలో ఆత్మస్థైర్యం నింపడం కోసం కథను రక్తికట్టించే మరిన్ని రచనలతో, తెలుగు సాహిత్యం "మూడు పువ్వులు - ఆరుకాయలు" అన్న చందాన దినదినాభివృద్ధి చెందాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. మహీధర రామమోహనరావు, మూ.ము.2015, కొల్లాయి గట్టేతేనేమి, విశాలాంధ్ర బుక్‌హౌస్, విజయవాడ.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# "తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం - పరిణామ క్రమం, సామాజిక దృక్పథం"

- బొడ్డు భరద్వాజ

స్కూల్ అసిస్టెంట్ - తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల అంబం (ఎడపల్లి), జిల్లా: నిజామాబాద్.

**వ్యాస సంగ్రహం (Abstract) :**

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమాజంలో వచ్చే మార్పులను, అలజడులను, ఆశలను అక్షర రూపంలో పట్టిచూపేదే నవల. తెలుగు నవలా సాహిత్యంలో 'స్త్రీ చైతన్యం' అనేది ఒక ప్రధానమైన, శక్తి వంతమైన ఇతివృత్తం. కందుకూరి వీరేశలింగం గారి నుండి నేటి ఆధునిక రచయిత్రుల వరకు తెలుగు నవల స్త్రీ జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించింది. ఒకప్పుడు కేవలం ఆదర్శ గృహిణిగా, బాధితురాలిగా చిత్రించబడిన స్త్రీ, కాలక్రమంలో తన అస్తిత్వం కోసం, హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడే శక్తిగా ఎలా మారిందో ఈ పరిశోధన పత్రం విశ్లేషిస్తుంది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ పడుతున్న అంతర్మథనం, ఆర్థిక స్వాతంత్ర్యం వైపు వేస్తున్న అడుగులు, కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులను తెలుగు నవల ఎలా చిత్రించిందో ఇందులో చర్చించడం జరిగింది.

**ఉపోద్ఘాతం (Introduction) :**

తెలుగు సాహిత్యం ప్రక్రియా పరంగా ఎన్నో మార్పు లకు లోనైంది. అందులో 'నవల'ది విశిష్టమైన స్థానం. సమాజంలోని సంక్లిష్టమైన సమస్యలను విస్తృతంగా చర్చించడానికి నవల ఒక బలమైన వేదిక. తెలుగు నవలా వికాసాన్ని పరిశీలిస్తే, అందులో 'స్త్రీ' కేంద్ర బిందువుగా వచ్చిన నవలలు కోకొల్లలు. అయితే, ప్రారంభ దశలో స్త్రీని చూసిన విధానానికి, ఆధునిక కాలంలో స్త్రీని చూస్తున్న విధానానికి చాలా వ్యత్యాసం ఉంది. 'చైతన్యం' అంటే కేవలం సమస్యను గుర్తించడమే కాదు, ఆ సమస్య మూలాలను ప్రశ్నించడం, పరిష్కారం దిశగా అడుగులు వేయడం. తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం మూడు దశలుగా కనిపిస్తుంది. సంస్కరణ వాదం, అభ్యుదయ వాదం, మరియు స్త్రీ వాదం (ఖీవఎఱఅఱంఎ). ఈ మూడు దశల్లోనూ రచయితలు, రచయిత్రులు స్త్రీని ఒక భోగ వస్తువుగా కాకుండా, ఒక ఆలోచనా శక్తిగా నిల బెట్టడానికి చేసిన ప్రయత్నం అభినందనీయం.

భారతీయ పురాణ, ఇతిహాస సాహిత్యాన్ని పరిశీలిస్తే స్త్రీ జీవితం ఒక విచిత్రమైన వైరుధ్యాల పుట్టగా కని పిస్తుంది. ఒకవైపు ఆమెను శక్తి స్వరూపిణిగా, జ్ఞాన ప్రదాతగా (సరస్వతి), సిరి సంపదలకు అధిపతిగా (లక్ష్మి) కీర్తించారు. కానీ, వాస్తవ సామాజిక జీవనంలోకి వచ్చేసరికి ఆమెను 'మనుధర్మం' పేరిట అనేక కట్టుబాట్ల మధ్య బంధించారు. పురాణ కాలంలో స్త్రీకి స్వతంత్రమైన గుర్తింపు చాలా అరుదు. ఆమె బాల్యంలో తండ్రి చాటు బిడ్డగా, యవ్వనంలో భర్త నీడగా, వృద్ధాప్యంలో కొడుకు

రక్షణలో బతకాల్సిందే. రామాయణంలో సీత పాత్రను గమనిస్తే, ఆమె జనక మహారాజు కూతురిగా, రాముని భార్యగా మాత్రమే లోకానికి తెలుసు. ఆమె ఎంత గొప్ప సహనశీలి అయినప్పటికీ, అడవుల పాలవ్వాలన్నా, అగ్ని ప్రవేశం చేయాలన్నా, అది పురుషుడు (భర్త) తీసుకున్న నిర్ణయం మీదే ఆధారపడి ఉండేది. తన జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన నిర్ణయాల్లో కూడా ఆమె పాత్ర శూన్యం.

నాటి సమాజంలో స్త్రీని ఒక మనిషిగా కంటే, ఒక ఆస్తిగా లేదా వస్తువుగా పరిగణించే ధోరణి ఎక్కువగా ఉండేది. రాజ్యాల మధ్య సంధి కుదుర్చుకోవడానికి, లేదా శత్రురాజుల కోపాన్ని చల్లార్చడానికి రాజకుమార్తెలను ఇచ్చి వివాహం చేయడం సర్వసాధారణం. ఇక్కడ ఆ స్త్రీ మనోభావాలకు ఎటువంటి విలువ లేదు. మహాభారతంలో మాద్రి లేదా గాంధారి వివాహాలు రాజకీయ అవసరాల కోసం జరిగినవే. ఇక సత్యహరిశ్చంద్రుడు సత్యం కోసం భార్య చంద్రమతిని కాశీలో అమ్మేస్తాడు. సత్యపాలనలో హరిశ్చంద్రుడు గొప్పవాడే కావచ్చు, కానీ భార్యను ఒక అమ్మకపు వస్తువుగా మార్చడం నాటి స్త్రీ దయనీయ స్థితికి అద్దం పడుతుంది. ధర్మరాజు ద్రౌపదిని జూదంలో ఒడ్డడం ఈ మనస్తత్వానికి పరాకాష్ఠ.

**విద్వత్తు ఉన్నా, వంటింటికే పరిమితం :**

వేద కాలంలో (పురాణాల కంటే పూర్వం) స్త్రీలకు కొంతమేర విద్యా స్వేచ్ఛ ఉండేది. గార్గి, మైత్రేయి వంటి విదుషీమణులు జనక మహారాజు సభలో యజ్ఞవల్క్యునితో సమానంగా వాదించేవారు. కానీ పురాణ కాలానికి వచ్చేసరికి ఈ స్వేచ్ఛ సన్నగిల్లింది. స్త్రీకి "పాతివ్రత్యం" అనేదే ఏకైక విద్యగా మారింది. ఒక స్త్రీ ఎంత తెలివైనదైనా, ఆమె తెలివిని భర్తను సేవించడానికి, కుటుంబాన్ని నడపడానికే వాడాలి తప్ప, రాజ్య తంత్రాలకు లేదా శాస్త్ర చర్చలకు కాదు అనే లిఖిత నిబంధన ఉండేది.

**పాతివ్రత్యం:**

పురాణాల్లో స్త్రీకి అత్యున్నత లక్ష్యం 'పాతివ్రత్యం'. అనసూయ, సావిత్రి, సుమతి వంటి కథలు స్త్రీలను భర్త పట్ల అంకితభావంతో ఉండమని బోధించాయి. సావిత్రి యముడితో పోరాడి భర్త ప్రాణాలు దక్కించుకుంది. ఇది స్త్రీ సంకల్ప బలాన్ని చూపిస్తుంది. కానీ, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే, ఆమె పోరాటం తన కోసం కాదు, తన భర్త కోసం. అంటే, స్త్రీ శక్తి సామర్థ్యాలు కూడా పురుషుడి శ్రేయస్సు కోసమే వినియోగపడాలి అనే భావజాలం ఇందులో అంతర్లీనంగా ఉంది.అందరూ తలవంచి బతకలేదు. కొందరు స్త్రీలు నాటి పురుషాధిక్యతను ప్రశ్నించారు. ద్రౌపది: కురుసభలో తనను అవమానిస్తున్నప్పుడు, భర్తలు మౌనంగా ఉంటే, 'ధర్మానికి కట్టుబడి ఉండాలా? లేక అన్యాయాన్ని ఎదిరించాలా?' అని భీష్మ ద్రోణులను నిలదీసింది. ఇది నాటి సమాజంలో ఒక సంచలనం. సత్యభామ: శ్రీకృష్ణుడితో పాటు యుద్ధరంగానికి వెళ్లడమే కాక, అవసరమైనప్పుడు బాణం చేపట్టింది. స్త్రీ అబల కాదు, సబల అని నిరూపించిన అరుదైన పురాణ ఘట్టం ఇది.

మొత్తంగా చూస్తే, పురాణ కాలంలో స్త్రీ 'గడప దాటని మహారాణి'. ఆమెకు గౌరవం ఉంది, కానీ స్వేచ్ఛ లేదు. ఆమెకు పూజలు ఉన్నాయి, కానీ హక్కులు లేవు. నాటి స్త్రీ జీవితం.. త్యాగం, సహనం, మౌనం అనే మూడు స్తంభాల మీద నిర్మించబడింది.

ఈ చారిత్రక నేపథ్యమే, తర్వాతి కాలంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి వారు ఆధునిక స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడటానికి, తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం ఊపిరి పోసుకోవడానికి మూలకారణమైంది.

**కీలక పదాలు :**

స్త్రీ చైతన్యం, అస్తిత్వ పోరాటం, పితృస్వామ్య వ్యవస్థ, తెలుగు నవలా వికాసం, స్త్రీవాద సాహిత్యం, సామాజిక వాస్తవికత, ఆర్థిక స్వలంబన, గృహ హింస, మహిళా సాధికారత, అభ్యుదయ దృక్పథం.

**తొలి నాటి నవలలు :**

తెలుగు నవలా ఆవిర్భావం ప్రధానంగా సాంఘిక సంస్కరణోద్యమంతో ముడిపడి ఉంది. కందుకూరి వీరేశలింగం గారు రాసిన 'రాజశేఖర చరిత్ర' (మొదటి నవలగా పరిగణించబడే వాటిలో ఒకటి) నాటి సామాజిక

పరిస్థితులను ప్రతిబింబించింది. ఆ కాలంలో స్త్రీ సమస్యలంటే ప్రధానంగా, బాల్య వివాహాలు, వైధవ్యం, చదువు లేకపోవడం. ఈ దశలో వచ్చిన నవలల్లో స్త్రీ చైతన్యం అనేది పురుషుల దృష్టి కోణం నుండి సాగింది. స్త్రీలు చదువుకోవాలి, కానీ అది మంచి గృహిణిగా మారడానికే. విధవా పునర్వివాహాలు జరగాలి, కానీ అది ఆమెకు రక్షణ కల్పించడానికే. అంటే, ఇక్కడ స్త్రీకి స్వతంత్ర ఆలోచనల కంటే, ఆమెకు సమాజం చేసిన కట్టుబాట్ల నుండి కాస్త వెసులుబాటు కల్పించడమే ప్రధాన ఉద్దేశం. చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి వారు తమ నవలల్లో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా ఉన్నవ వారి 'మాలపల్లి'లో స్త్రీ పాత్రలు సామాజిక పోరాటంలో భాగస్వామ్యం వహించడం ఒక ముందడుగు.

**సంస్కరణ దశ : కందుకూరి 'రాజశేఖర చరిత్ర'**

తెలుగు నవలా చరిత్రలో మైలురాయిగా నిలిచిన 'రాజశేఖర చరిత్ర' (1878) నాటి స్త్రీ స్థితిగతులకు దర్పణం. అయితే, ఇందులో కనిపించే స్త్రీ చైతన్యం ప్రాథమిక దశకు చెందినది. గృహిణిగా బాధ్యత : ఈ నవలలో స్త్రీకి సంబంధించిన సమస్యల ప్రస్తావన ఉన్నప్పటికీ, అది పితృస్వామ్య వ్యవస్థ గీసిన గీతల్లోనే ఉంటుంది. స్త్రీలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, కనీస విజ్ఞానం కలిగి ఉండాలని కందుకూరి ఆశించారు. కానీ, ఆ చదువు ఆమెను మంచి భార్యగా, మంచి తల్లిగా తీర్చిదిద్దడానికే తప్ప, ఆమె స్వతంత్ర వ్యక్తిత్వ వికాసానికి కాదన్నది ఆనాటి సత్యం. సంరక్షణ వాదం: 'రక్షించబడాల్సిన వ్యక్తి'. ఆమె చైతన్యం పురుషుడి సంస్కరణ దృక్పథంపై ఆధారపడి ఉండేది. రాజశేఖర చరిత్రలో స్త్రీ పాత్రలు కుటుంబ గౌరవానికి ప్రతీకలు. అంటే, ఇక్కడ స్త్రీ చైతన్యం అనేది 'కుటుంబం కోసం స్త్రీ ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు సమాధానంగానే సాగింది తప్ప, 'స్త్రీ కోసం సమాజం ఎలా ఉండాలి?' అనే స్థాయికి ఇంకా ఎదగలేదు.

**చలం, కొడవటిగంటి యుగం :**

గుడిపాటి వెంకట చలం రాకతో తెలుగు నవల్లో స్త్రీ చైతన్యం ఒక కుదుపునకు లోనైంది. 'స్త్రీ అంటే శరీరమే కాదు, ఆమెకూ మనసు ఉంటుంది, కోరికలు ఉంటాయి' అని నినదించిన వారు చలం. ఆయన రాసిన 'మైదానం', 'అమీనా', 'బ్రాహ్మణీకం' వంటి నవలలు నాటి సమాజం గీసిన లక్ష్మణ రేఖలను చెరిపివేశాయి. స్త్రీకి పాతివ్రత్యం కంటే స్వేచ్ఛ ముఖ్యం, ప్రేమ ముఖ్యం అని చలం వాదించారు. ఇది తెలుగు నవలా సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పు. అలాగే కొడవటిగంటి కుటుంబరావు గారు స్త్రీ సమస్యలను ఆర్థిక కోణం నుండి, మధ్యతరగతి కుటుంబాల నేపథ్యంలో విశ్లేషించారు. 'చదువు' నవలలో స్త్రీ విద్యావ్యాప్తి, తద్వారా వచ్చే ఆలోచనా పరిణామం అద్భుతంగా చిత్రించబడింది. స్త్రీ కేవలం వంటింటి కుందేలు కాదని, ఆమెకు సామాజిక స్పృహ ఉంటుందని ఈ దశలో నవలలు నిరూపించాయి.

**అస్తిత్వ దశ :**

1970ల తర్వాత తెలుగు నవల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అంతకు ముందు పురుష రచయితలు స్త్రీ సమస్యల గురించి రాస్తే, ఈ దశలో స్త్రీలే తమ సమస్యలను, తమ అనుభూతులను స్వయంగా రాయడం మొదలుపెట్టారు.

**బలిపీఠం' (రంగనాయకమ్మ) - సంఘర్షణకు సాక్ష్యం:**

రంగనాయకమ్మ గారి 'బలిపీఠం' కేవలం ఒక నవల కాదు, అది కుల వ్యవస్థపై ఎక్కుపెట్టిన అస్త్రం. ఇందులో కథనాయిక అరుణ పాత్ర ద్వారా స్త్రీ పడే మానసిక క్షోభను రచయిత్రి అత్యద్భుతంగా ఆవిష్కరించారు. దళిత వర్గానికి చెందిన భాస్కర్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న అరుణ, అత్తగారింట ఎదుర్కొన్న అవమానాలు పాఠకులను కంట తడి పెట్టిస్తాయి. ముఖ్యంగా, ఒక సందర్భంలో భాస్కర్ న్యూనతా భావంతో అరుణను అనుమానించినప్పుడు, అరుణ పలికే సంభాషణలు స్త్రీ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయి. 'నేను కులాన్ని వదిలి వచ్చాను, కానీ నా వ్యక్తిత్వాన్ని కాదు' అనే అర్థం వచ్చేలా ఆమె చేసే వాదన, స్త్రీకి ఉండాల్సిన తెగువను చూపిస్తుంది. సమాజం కోసం కాకుండా, తన నమ్మకం కోసం బతికే స్త్రీగా అరుణ పాత్ర తెలుగు నవలా చరిత్రలో నిలిచిపోయింది.

**'స్వేచ్ఛ' (ఓల్గా) - అస్తిత్వ ఆవేదన :**

ఓల్గా గారి 'స్వేచ్ఛ' నవలలోని అరుణ (బలిపీఠం అరుణ వేరు, ఈమె వేరు) పాత్ర ఆధునిక స్త్రీకి ప్రతినిధి. ఆమె తన భర్త ప్రకాశం నుండి, ఆ తర్వాత తన కూతురు నుండి కూడా మానసిక దూరాన్ని అనుభవిస్తుంది. 'కుటుంబం అంటే ప్రేమ, ఆప్యాయతలే కాదు. అదొక శ్రమ దోపిడీ కేంద్రం' అనే కఠిన సత్యాన్ని ఈ నవల చర్చిస్తుంది. నవలలోని ఒక కీలక ఘట్టంలో అరుణ తన భర్తతో, 'నన్ను నేనుగా బతకనివ్వండి. మీ నీడగా కాదు' అని చెప్పే సందర్భం, స్త్రీ కోరుకుంటున్న 'స్వేచ్ఛ' ను సూచిస్తుంది. కేవలం భార్యగా, తల్లిగా బాధ్యతలు మోయడమేనా నా జీవితం? నాకంటూ ఒక ఉనికి లేదా? అనే ప్రశ్నలు పాఠకుడిని ఆలోచింపజేస్తాయి. చివరికి ఆమె ఒంటరిగా బతకాలని నిర్ణయించుకోవడం ద్వారా, ఒంటరితనం అంటే బలహీనత కాదు, అది ఒక శక్తి అని నిరూపిస్తుంది.

**అరికెపూడి కౌసల్య, మాదిరెడ్డి సులోచన :**

వీరి నవలల్లో గృహిణుల సమస్యలు ప్రధానంగా ఉంటాయి. ఉమ్మడి కుటుంబాల్లో స్త్రీలు పడే ఇబ్బందులు, భర్తను సరిదిద్దుకునే క్రమంలో వారు పడే పాట్లు, పిల్లల పెంపకం వంటి అంశాలను చాలా సహజంగా చిత్రించారు. అరికెపూడి వారి నవలల్లో స్త్రీ, సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంటుంది. విడాకులు, విడిపోవడం వంటి పెద్ద నిర్ణయాల కంటే, ఉన్న పరిస్థితుల్లోనే స్త్రీ తన గళాన్ని ఎలా వినిపించిందో వీరి నవలలు రికార్డు చేశాయి. ఇది ఒక రకంగా 'సాఫ్ట్ ఫెమినిజం' (మృదువైన స్త్రీవాదం) అని చెప్పవచ్చు.

**ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలా వికాసం' :**

ప్రసిద్ధ విమర్శకురాలు ముదిగంటి సుజాతారెడ్డి గారు తన 'తెలుగు నవలా వికాసం' గ్రంథంలో స్త్రీ పాత్రల చిత్రణలో వచ్చిన మార్పులను శాస్త్రీయంగా విభజించారు. ఉపదేశం నుండి అనుభూతి వైపు: కందుకూరి కాలంలో నవల ఒక 'నీతి బోధక సాధనం'గా ఉండేదని, కానీ కాలక్రమంలో అది 'జీవిత చిత్రణ'గా మారిందని సుజాతారెడ్డి గారు విశ్లేషించారు. 19వ శతాబ్దపు నవలలు స్త్రీని బయటి నుండి చూస్తే, 20వ శతాబ్దపు నవలలు స్త్రీ మనసు లోతులోకి వెళ్లాయని ఆమె పేర్కొన్నారు.

**డా. సి. మృణాళిని: తెలుగు నవలా సాహిత్య విశ్లేషణ :**

మృణాళిని గారు నవలలను కేవలం కథలుగా కాకుండా, అందులోని పాత్రల మానసిక ప్రవర్తన ఆధారంగా విశ్లేషించారు. సంఘటనల కంటే సంఘర్షణ ముఖ్యం:

సాధారణ విమర్శకులు నవలలోని కథను, ఇతి వృత్తాన్ని చూస్తే, మృణాళిని గారు పాత్రల అంతరంగాన్ని చూశారు. 'ఒక పాత్ర ఎందుకు అలా ప్రవర్తించింది?' అనే ప్రశ్నకు ఆమె సమాధానం వెతికారు. ఉదాహరణకు, చలం రాసిన 'మైదానం'లో రాజేశ్వరి పాత్ర కేవలం కామంతో ఇంటి నుంచి పారిపోలేదు, ఆమెలో ఉన్న అణచివేయబడిన స్వేచ్ఛాకాంక్ష, అసంతృప్తి ఆమెను అలా చేసేలా ప్రేరేపించాయని మృణాళిని విశ్లేషించారు. స్త్రీ చైతన్యం అంటే కేవలం బయటి ప్రపంచంలో పోరాడటమే కాదు, తనలో తాను జరిగే సంఘర్షణను గెలవడం అని మృణాళిని గారి అభిప్రాయం.

**చలం పాత్రలపై లోతైన చూపు :**

తెలుగు నవలలో స్త్రీ చైతన్యానికి చలం ఆద్యుడు. మృణాళిని గారు చలం పాత్రలను 'సిగ్మండ్ ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతాలతో పోల్చి చూశారు. చలం స్త్రీ పాత్రలు (రాజేశ్వరి, పద్మావతి వంటి వారు) సమాజం దృష్టిలో 'చెడ్డవారు' కావచ్చు.

**రచయిత్రుల నవలలపై విమర్శ :**

రంగనాయకమ్మ, యద్దనపూడి, వాసిరెడ్డి సీతాదేవి వంటి రచయిత్రుల నవలలను మృణాళిని గారు సామాజిక - మానసిక కోణంలో విశ్లేషించారు.

**మధ్యతరగతి మనస్తత్వం :**

యద్దనపూడి సులోచనారాణి నవలల్లో స్త్రీలు మోడరన్‌గా కనిపించినా, వారి ఆలోచనలు ఇంకా పాత 'సిండ్రెల్లా కాంప్లెక్స్ (రాకుమారుడి కోసం ఎదురు చూడటం) చుట్టూనే తిరుగుతున్నాయని మృణాళిని

విమర్శనాత్మకంగా పరిశీలించారు. అదే సమయంలో వాసిరెడ్డి సీతాదేవి 'మట్టి మనిషి' వంటి నవలల్లో స్త్రీ పాత్రలు పడే ఆర్థిక, మానసిక ఒత్తిడిని చాలా సహజంగా చిత్రించారని ఆమె ప్రశంసించారు.

**స్త్రీ చైతన్యం - మానసిక కోణం :**

మృణాళిని గారి ప్రకారం స్త్రీ చైతన్యం అంటే మగ వాడిని ద్వేషించడం కాదు. ఆమె మాటల్లో, 'పురుషాధిక్య సమాజం స్త్రీ మెదడులో నాటించిన బానిస భావజాలం నుండి ఆమె బయటపడటమే నిజమైన చైతన్యం.' బయట సమాజం మారినా, స్త్రీ తన మనసులో ఉన్న 'త్యాగ బుద్ధి', 'అపరాధ భావం' నుండి బయటపడకపోతే ఆమెకు పూర్తి స్వేచ్ఛ దక్కదని మృణాళిని గారి వాదన.

**ఆధునిక నవల :**

గత రెండు దశాబ్దాలుగా వస్తున్న తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం మరింత విస్తృతమైంది. ఇది కేవలం మధ్య తరగతి స్త్రీలకే పరిమితం కాకుండా, దళిత, బహుజన, ముస్లిం మైనారిటీ స్త్రీల జీవితాలను కూడా స్పృశిస్తోంది. ఆర్థిక స్వలంబన: నేటి నవలల్లో స్త్రీ ఉద్యోగం చేయడం ఒక అవసరంగా కాకుండా, ఒక హక్కుగా మారింది. పి. సత్యవతి, కుప్పం నిర్మల వంటి వారి రచనల్లో ఉద్యోగి నుల సమస్యలు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, ఇంటి పని, బయటి పని వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. స్త్రీ శరీరంపై ఆమెకే హక్కు ఉండాలి అనే భావన బలంగా వ్యక్తమవుతోంది. మాతృత్వం అనేది ఒక ఎంపిక కావాలి కానీ, నిర్బంధం కాకూడదు అనే చైతన్యం కనిపిస్తోంది. గృహ హింస: నాలుగు గోడల మధ్య జరిగే హింసను మౌనంగా భరించే స్త్రీలు కాకుండా, ఎదురుతిరిగే స్త్రీ పాత్రలు ఇప్పుడు నవలల్లో కనిపిస్తున్నాయి. విడాకులు తీసుకోవడం అనేది ఒక వైఫల్యంగా కాకుండా, స్వేచ్ఛా జీవితానికి ఒక మార్గంగా నవలలు చూపిస్తున్నాయి.

**నవలల్లో ప్రతిఫలించిన సామాజిక మార్పులు :**

తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యాన్ని గమనిస్తే మనకు స్పష్టంగా కనిపించే అంశం ఏమిటంటే - 'ప్రశ్నించే తత్వం'. ఒకప్పుడు సీత, సావిత్రిలే ఆదర్శం. కానీ ఆధునిక నవలలో అహల్య, శూర్పణఖ వంటి పాత్రలను కూడా పునర్నిర్వచించి, వారి కోణంలో న్యాయం ఎక్కడ ఉందని ప్రశ్నించే స్థాయికి సాహిత్యం ఎదిగింది. ఓల్గా రాసిన 'విముక్త' దీనికి చక్కని ఉదాహరణ. పురాణ స్త్రీ పాత్రల ద్వారా ఆధునిక స్త్రీకి ఒక కొత్త చూపును అందించడం ఇందులో చూడవచ్చు. అలాగే, 'రాజకీయ చైతన్యం' కూడా స్త్రీ నవలల్లో భాగమైంది. తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యం నుండి, నక్సల్బరీ ఉద్యమం వరకు స్త్రీలు పోషించిన పాత్రను అల్లం రాజయ్య, సాహు వంటి రచయితల నవలల్లో చూడవచ్చు. స్త్రీ కేవలం బాధితురాలే కాదు, పోరాట యోధురాలు కూడా అని ఈ నవలలు నిరూపించాయి.

**మధ్యతరగతి స్త్రీ మనోభావాలు :**

తెలుగు నవలల్లో స్త్రీవాదం అనగానే కేవలం విప్లవ భావాలే కాదు, సాధారణ మధ్యతరగతి స్త్రీల చిన్న చిన్న ఆశలు, ఆనందాలు, సర్దుకుపోయే తత్వాలను చిత్రించిన రచయిత్రులెందరో ఉన్నారు. అందులో ముఖ్యులు యద్దనపూడి సులోచనారాణి మరియు అరికెపూడి కౌసల్య. యద్దనపూడి సులోచనారాణి - రొమాంటిక్ రియలిజం: యద్దనపూడి వారి నవలలంటే ప్రేమకథలే అని పైకి అనిపించినా, వాటిలో మధ్యతరగతి స్త్రీ ఆత్మవిశ్వాసం అంతర్లీనంగా ఉంటుంది. ఉదాహరణకు 'సెక్రటరీ' నవలలో జయంతి పాత్రను పరిశీలిస్తే ఒక దిగువ మధ్యతరగతి అమ్మాయి, తన కుటుంబ బాధ్యతలను మోస్తూనే, తన బాస్ (రాజశేఖరం) అహంకారాన్ని ఎలా ఎదుర్కొంటుందో కనిపిస్తుంది. 'డబ్బు, హోదా ఉంటే సరిపోదు, మనిషికి సంస్కారం ఉండాలి' అని నిరూపించే ధీర వనితగా జయంతి కనిపిస్తుంది. యద్దనపూడి నవలల్లో స్త్రీలు ఎక్కువగా చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ, కుటుంబాన్ని పోషించే 'బాధ్యతాయుతమైన' పాత్రలుగా కనిపిస్తారు. ఇది ఆ కాలంలో స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యంపై ఆసక్తిని రేకెత్తించింది.

**తెలుగు నవలలో స్త్రీ చైతన్యం - పరిణామ క్రమం :**

ముదిగంటి సుజాతారెడ్డి గారి 'తెలుగు నవలా వికాసం' మరియు కాత్యాయని విద్మహే గారి 'మహిళా సాధికారత - సాహిత్యం' వంటి సిద్ధాంత గ్రంథల

వెలుగులో విశ్లేషిస్తే, స్త్రీ అస్తిత్వం 'సంస్కరణ' దశ నుండి 'స్వయం నిర్ణయాధికారం' దిశగా ఎలా సాగిందో స్పష్ట మవుతుంది.

**మధ్యతరగతి స్త్రీ ఆవిర్భావం :**

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటికి నవలల్లో స్త్రీ పాత్ర కేవలం వంటింటికే పరిమితం కాకుండా, జాతీ యోద్యమంలో పాల్గొనే స్థాయికి ఎదిగిందని ముదిగంటి వారి విశ్లేషణ ద్వారా తెలుస్తుంది. అంటే, నవల స్త్రీని సామాజిక శక్తిగా గుర్తించడం మొదలైంది. శ్రమజీవిగా స్త్రీ: అప్పటివరకు నవలల్లో స్త్రీ అంటే ప్రేమ, పెళ్లి, కుటుంబం అనే చట్రంలోనే ఉండేది. కానీ 'మట్టి మనిషి'లో రచయిత్రి స్త్రీని ఒక 'ఉత్పాదక శక్తి'గా చూపిం చారు. భూమిని నమ్ముకున్న స్త్రీకి, ఆ భూమి దూరం అవుతున్నప్పుడు కలిగే వేదన ఇందులో కనిపిస్తుంది. ప్రధాన పాత్రధారి భూమిని తల్లిగా ప్రేమిస్తే, ఆమె కొడుకు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తాడు. ఇక్కడ స్త్రీ చైతన్యం అనేది సంప్రదాయ మానవీయ విలువలను కాపాడుకోవడానికి చేసే పోరాటంగా మారుతుంది. పురుషాధిక్య ప్రపంచంలో ఆర్థిక నిర్ణయాలు స్త్రీ చేతిలో లేనప్పుడు, ఆమె అస్తిత్వం ఎలా ప్రమాదంలో పడుతుందో వాసిరెడ్డి సీతాదేవి నిరూపించారు. ఇది స్త్రీ చైతన్యంలో ఒక ముందడుగు.

**కాత్యాయని విద్మహే 'మహిళా సాధికారత - సాహిత్యం':**

కాత్యాయని గారి విశ్లేషణ ప్రకారం, నవలల్లో స్త్రీలు కేవలం తమ బాధలను చెప్పుకోవడం దగ్గరే ఆగి పోకూడదు. నిర్ణయాధికారం దిశగా ఎదగడమే నిజమైన సాధికారత. కందుకూరి కాలంలో స్త్రీకి 'చదువు' ఇవ్వడం ఒక విప్లవం అయితే, వాసిరెడ్డి సీతాదేవి కాలానికి 'ఆర్థిక స్వేచ్ఛ' ప్రధానాంశమైంది. కాత్యాయని విద్మహే గారు ఈ పరిణామాన్ని విశ్లేషిస్తూ, 'పురుషుడు నిర్దేశించిన పద్ధతిలో కాకుండా, స్త్రీ తనకు తానుగా తన జీవితాన్ని నిర్వచించుకునే స్థాయికి సాహిత్యం ఎదగాలి' అని అభిలాషించారు. అంటే, స్త్రీని ఒక బాధితురాలిగా కాకుండా ఒక కర్తగా నవలలు చూపించాలని ఆమె వాదన.

**చైతన్య స్వభావం :**

ఇక్కడ చైతన్యం అంటే, మూఢనమ్మకాలను వదలడం, చదువుకోవడం. ఆమె సమాజం గీసిన గీతల్లోనే ఉంటూ, ఆ గీతలను కొంచెం వెడల్పు చేసుకునే ప్రయత్నం మాత్రమే చేసింది. విధవా వివాహం అనేది స్త్రీ శారీరక, మానసిక అవసరాల కంటే, ఆమెకు 'సామాజిక భద్రత' కల్పించే చర్యగానే నవలల్లో చిత్రించబడింది.

**రెండవ దశ : వ్యక్తిత్వ వికాస చైతన్యం - 'స్త్రీ ఒక వ్యక్తి'**

గుడిపాటి వెంకట చలం, కొడవటిగంటి కుటుంబ రావు వంటి వారి రాకతో (1920-1960) స్త్రీ చైతన్యంలో సమూల మార్పు వచ్చింది. చైతన్య స్వభావం: 'స్త్రీ అంటే పాతివ్రత్యం అనే సంకెళ్లను తెంచుకోవడం, ప్రేమను స్వేచ్ఛగా వ్యక్తపరచడం ఈ దశలో కనిపించే ప్రధాన లక్షణం. అప్పటివరకు స్త్రీని 'దేవత'గానో, 'బానిస'గానో చూసిన సమాజానికి, ఆమెను ఒక మామూలు 'మనిషి'గా చూపించిన దశ ఇది. కొడవటిగంటి వారి 'చదువు' నవలలో, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే వ్యక్తిత్వం నిలబడుతుందనే సత్యం ఆవిష్కరించబడింది. ఇక్కడ చైతన్యం 'శరీర రాజకీయాల' వైపు మళ్లింది.

**మూడవ దశ : అస్తిత్వ ఆవేదన - 'నేను ఎవరు?'**

1960-1980 మధ్య కాలంలో రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, యద్దనపూడి, మాదిరెడ్డి వంటి రచ యిత్రులు విస్తృతంగా రాశారు. మధ్యతరగతి స్త్రీ జీవితం, ఉద్యోగం, అత్తవారింటి వేధింపులు, సర్దుకుపోవడాలు. ఈ దశలో స్త్రీ చైతన్యం 'సంఘర్షణ' రూపంలో ఉంటుంది. ఆమె చదువుకుంది, ఉద్యోగం చేస్తోంది, కానీ ఇంట్లో ఇంకా పాత పెత్తనమే సాగుతోంది. ఈ వైరుధ్యాన్ని నవలలు పట్టుకున్నాయి. 'నేను ఇంటికి దీపాన్ని మాత్రమేనా? నాకంటూ ఒక జీవితం లేదా?' అనే అంతర్మథనం ఈ దశలో స్పష్టంగా కనిపిస్తుంది.

**నాలుగవ దశ : స్త్రీవాద చైతన్యం:**

1980ల తర్వాత ఓల్గా, పి. సత్యవతి, కుప్పం నిర్మల వంటి వారి రచనలతో స్త్రీ చైతన్యం శిఖరాగ్రానికి చేరింది. ఇది కేవలం సమస్యలను చెప్పుకోవడం కాదు, పరిష్కా రాన్ని డిమాండ్ చేయడం. కుటుంబ వ్యవస్థను, వివాహ వ్యవస్థను ప్రశ్నించడం. ఒకప్పుడు భర్తను దేవుడిగా భావించిన స్త్రీ, అతను సహచరుడిగా లేనప్పుడు ఆ

బంధం నుండి బయటకు రావడాన్ని ఈ నవలలు సమర్థించాయి (ఉదా: ఓల్గా 'స్వేచ్ఛ').

**ఒంటరి ప్రయాణం :**

స్త్రీకి పురుషుడి తోడు లేకుండా బతకగల శక్తి ఉందని నిరూపించాయి. రాజకీయ స్పృహ: స్త్రీ కేవలం వంటింటికే పరిమితం కాదు. ఆమెకు సామాజిక, రాజకీయ అభిప్రాయాలు ఉంటాయని ఈ దశ నవలలు చాటిచెప్పాయి.

**మౌనం నుండి గళం విప్పే వరకు :**

పూర్వ నవలల్లో స్త్రీ పాత్రలు ఎక్కువగా మౌనంగా రోదించేవి. కానీ ఆధునిక నవలల్లో స్త్రీలు తమ అసంతృప్తిని గట్టిగా వ్యక్తం చేస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పే ధైర్యంనేటి నవలల్లోని ప్రధాన చైతన్యం. త్యాగం నుండి హక్కుల వరకు: గతంలో 'త్యాగమయి' అనే బిరుదు కోసం స్త్రీలు తమ కోరికలను చంపుకునేవారు. నవలలు కూడా దాన్నే గొప్పగా చిత్రించేవి. కానీ నేటి నవలల్లో 'నన్ను నేను చంపుకొని, ఇతరులను సంతోషపెట్టాల్సిన అవసరం లేదు' అనే స్పష్టత వచ్చింది. త్యాగం స్థానంలో 'హక్కు' వచ్చి చేరింది. గత నవలల్లో స్త్రీ సమస్యలకు పరిష్కారం 'చావు' లేదా 'దేవుడు'గా ఉండేది. కానీ నేటి నవలల్లో స్త్రీ సమస్యలను ఎదురించి, న్యాయపరంగానో, సామాజికంగానో పోరాడి గెలుస్తోంది.

**సంస్కరణ యుగం** : రక్షణ కావాలి- నాయకత్వం: పురుషులు (ఉదా: వీరేశలింగం)

**అభ్యుదయ యుగం** : సమానత్వం కావాలి- నాయకత్వం : చలం, కొడవటిగంట

**అస్తిత్వ యుగం** : గుర్తింపు కావాలి- నాయకత్వం: రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి

**స్త్రీవాద యుగం** : స్వేచ్ఛ, అధికారం కావాలి- నాయకత్వం : ఓల్గా, పి. సత్యవతి

**'స్త్రీ ఒక బాధ్యత'- బరువుగా మారిన బతుకు :**

ప్రారంభ దశ నవలల్లో (కందుకూరి కాలం) స్త్రీని సమాజం ఒక 'బాధ్యత'గా మాత్రమే చూసింది. ఈ దశలో ఆమె అనుభవించిన బాధలు వర్ణనాతీతం. పుట్టుకతోనే వివక్ష: ఆడపిల్ల పుట్టిందంటేనే కుటుంబానికి ఒక బరువు. ఆమెను ఎప్పుడు, ఎవరికి అప్పగించి 'బాధ్యత' తీర్చుకోవాలా అనేదే తండ్రి ఆలోచన. ఈ క్రమంలో ఆమె ఇష్టాయిష్టాలకు, కలలకు చోటు లేదు.

**బాల్య వివాహాల నరకం :**

బొమ్మలతో ఆడుకోవాల్సిన వయసులో, మెడలో మూడు ముళ్లు పడితే ఆ బాలిక మనసులో రేగే తుఫానును ఎవరు అర్థం చేసుకోగలరు? వయసు మళ్ళిన వాడికిచ్చి కట్టబెట్టినప్పుడు, ఆమె అనుభవించే శారీరక, మానసిక హింసను నాటి నవలలు కళ్ళకు కట్టాయి. వైధవ్యం అనే చెరసాల: దురదృష్టవశాత్తు భర్త చనిపోతే, ఆమె బతుకు జీవచ్ఛవంలా మారేది. గుండు గీయించి, మడి కట్టించి, శుభకార్యాలకు దూరంగా ఉంచుతుంటే.. 'నేను చేసిన పాపం ఏమిటి?' అని ఆ స్త్రీ కుమిలిపోయిన వైనం గుండెలను పిండేస్తుంది. ఆమెకు కన్నీరు పెట్టే హక్కు కూడా లేని దయనీయ స్థితి ఇది.

**'స్త్రీ ఒక వ్యక్తి' - శరీరం, మనసు మధ్య సంఘర్షణ :**

చలం, కొడవటిగంటి వంటి వారి కాలానికి వచ్చేసరికి, స్త్రీ 'నేను కేవలం ఇంటిని శుభ్రం చేసే యంత్రాన్ని కాదు, నాకూ ఒక శరీరం ఉంది, కోరికలు ఉన్నాయి' అని గుర్తించింది. కానీ ఈ గుర్తింపు ఆమెకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. పురుషుడు ఎన్ని తప్పులు చేసినా చెల్లుతుంది, కానీ స్త్రీ చిన్న గీత దాటినా ఆమెను 'కులత'గా, 'పతిత'గా ముద్ర వేసే సమాజంతో ఆమె పోరాడాల్సి వచ్చింది. తన మనసును చంపుకోలేక, సమాజం గీసిన గీతను దాటలేక, ఆమె పడిన సంఘర్షణ నరకతుల్యం. ఆమె తెలివితేటలు, సృజనాత్మకత నాలుగు గోడల మధ్యే సమాధి అయ్యాయి.

**'నేను ఎవరు?' - అస్తిత్వ ఆవేదన :**

ఆధునిక నవలల్లో (రంగనాయకమ్మ, ఓల్గా, వాసిరెడ్డి సీతాదేవి) స్త్రీ ఆర్థికంగా నిలదొక్కుకుంది. కానీ మానసికంగా ఇంకా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ దశలో ఆమె బాధలు మరింత సున్నితమైనవి మరియు సంక్లిష్టమైనవి. రెట్టింపు భారం: ఆధునిక స్త్రీ ఉద్యోగం చేస్తోంది, సంపాదిస్తోంది. కానీ ఇంటికి వచ్చాక మళ్ళీ గృహిణి పాత్రను యథవిధిగా పోషించాల్సిందే.

ఆఫీసు ఒత్తిడి ఒకవైపు, ఇంటి బాధ్యత మరోవైపు, ఈ రెండింటి మధ్య నలిగిపోతూ, కనీసం తనకోసం తాను గడపడానికి ఒక్క క్షణం దొరకని యంత్రంలా ఆమె జీవితం మారింది.

**గుర్తింపు లేని వెట్టిచాకిరి :**

కుటుంబం కోసం ఆమె ఎంత చేసినా అది 'బాధ్యత' కిందే లెక్క. 'నువ్వు కొత్తగా ఏం చేశావ్? అందరూ చేసేదేగా?' అనే మాటలు ఆమెను కృంగదీస్తాయి. తన త్యాగానికి, ప్రేమకు విలువ లేనప్పుడు, 'అసలు ఈ ఇంట్లో నా స్థానం ఏమిటి? నేను కేవలం పనిమనిషినా?' అనే ప్రశ్న ఆమెను నిలువునా దహించివేస్తుంది. భర్త పక్కన ఉన్నా, పిల్లలు ఉన్నా, తన మనసును పంచుకునే వారు లేక, తన భావాలను అర్థం చేసుకునే వారు లేక ఆధునిక స్త్రీ అనుభవిస్తున్న 'ఏకాంతం' చాలా బాధాకరమైనది. అందుకే ఈ దశలో విడాకులు, లేదా ఒంటరి పోరాటం ఒక అనివార్యమైన చర్యగా మారింది.

నవలల్లోని స్త్రీ పాత్రలను కేవలం సామాజిక కోణం లోనే కాకుండా, మానసిక కోణంలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. తరతరాలుగా స్త్రీ అచేతన మనసులో పేరుకుపోయిన బానిసత్వపు ఆలోచనల నుండి విముక్తి పొందడమే నిజమైన సాధికారత. చలం నుండి ఓల్గా వరకు వచ్చిన నవలల్లో స్త్రీ పాత్రలు ఈ అంతర్లీన సంఘర్షణను అధిగమించే క్రమాన్ని మృణాళిని గారు సమర్థవంతంగా విశ్లేషించారు.

**ముగింపు (Conclusion) :**

సాహిత్యం అనేది సమాజ గమనానికి వెలుతురునిచ్చే దివిటీ వంటిది. ఆ వెలుగులో తెలుగు నవలా సాహిత్యాన్ని పరామర్శిస్తే.. గత శతాబ్ద కాలంగా స్త్రీ చేసిన ప్రయాణం ఒక అద్భుతమైన పరిణామ క్రమం. ఇది కేవలం పాత్రల మార్పు కాదు, ఒక జాతి ఆలోచనా విధానంలో వచ్చిన మార్పు. ఒకప్పుడు 'గడప దాటడమే పాపం' అనుకున్న కాలం నుంచి, 'గగనమే నా హద్దు' అని నినదించే కాలం వరకు స్త్రీ ప్రయాణించింది. ఈ ప్రయాణంలో తెలుగు నవల ఆమెకు ఒక తోడుగా, నీడగా, ఒక్కోసారి మార్గదర్శిగా నిలిచింది. కందుకూరి వారి నవలల్లో స్త్రీకి 'గొంతు' ఇస్తే, చలం ఆమెకు 'మనసు' ఇచ్చాడు. రంగనాయకమ్మ 'ధైర్యాన్ని' ఇస్తే, ఓల్గా ఆమెకు 'దిశను' చూపించింది.

తాత్వికంగా చెప్పాలంటే, స్త్రీ చైతన్యం అనేది పురుషుడిపై గెలుపు కాదు, అది తనపై తాను సాధించిన గెలుపు. తరతరాలుగా తన రక్తంలో ఇంకిపోయిన బానిస భావజాలం నుండి, అపరాధ భావం నుండి విముక్తి పొందడమే నిజమైన స్వేచ్ఛ అని తెలుగు నవల నిరూపించింది. సంకెళ్లను తెంచుకోవడం అంటే బంధాలను ద్వేషించడం కాదు, ఆ బంధాలలో ఉన్న అసమానతను ప్రశ్నించడం అని ఈ సాహిత్యం చాటి చెప్పింది. నేటి ఆధునిక నవలలోని స్త్రీ సీతలా కష్టాలను మౌనంగా భరించడం లేదు, అలాగని ద్రౌపదిలా ప్రతీకారం కోసం మాత్రమే చూడటం లేదు. ఆమె సావిత్రిలా సంకల్పంతో, మైత్రేయిలా జ్ఞానంతో తనదైన కొత్త దారిని వెతుక్కుంటోంది. 'నేను ఎవరి సొత్తును కాదు, నా జీవితానికి నేనే కర్తను' అనే ఎరుక కలగడమే ఈ చైతన్యానికి పరాకాష్ట.

చివరగా, తెలుగు నవలా సాహిత్యం స్త్రీని ఒక దేవతగా పీఠం ఎక్కించాల్సిన అవసరం లేదని, ఆమెను తోటి మనిషిగా గౌరవిస్తే చాలని హెచ్చరిస్తోంది. ఏ సమాజమైతే స్త్రీ కన్నీటిని కాకుండా, ఆమె కలలను అర్థం చేసుకుంటుందో, అదే నిజమైన చైతన్యవంతమైన సమాజం. ఆ దిశగా తెలుగు నవల వేసిన అడుగులు చరిత్రలో చెరిగిపోని ముద్రలు. ఈ అక్షర ప్రయాణం ఆగదు. ఇది నిత్యనూతనంగా ప్రవహించే జీవనది.

సమాజ గమనంలో స్త్రీ పాత్ర కీలకమైనదని, తెలుగు నవల ఈ గమనాన్ని, గమ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకుంది. సంఘ సంస్కరణ కాలంలో వితంతు వివాహాల కోసం పరితపించిన నవల, నేడు 'లివ్-ఇన్ రిలేషన్స్, సింగిల్ పేరెంట్ వంటి ఆధునిక జీవన విధానాలను కూడా విశ్లేషించే స్థాయికి చేరింది. తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం ఒక ప్రవాహంలా సాగింది. అది ఎక్కడా ఆగిపోలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తన రూపం మార్చు

కుంటూనే ఉంది. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీల అక్షరాస్యత, ఆరోగ్యం, మూఢనమ్మకాలు వంటి అంశాలపై మరింత లోతైన నవలలు రావాల్సిన అవసరం ఉంది. అయితే, ఇప్పటివరకు వచ్చిన సాహిత్యం మాత్రం స్త్రీని ఒక 'మనిషి'గా గౌరవించాలనే సందేశాన్ని బలంగా వినిపించింది. స్త్రీ విముక్తి అంటే పురుష ద్వేషం కాదు, అది ఆత్మగౌరవ ప్రకటన అని తెలుగు నవల చాటి చెప్పింది. భవిష్యత్తులోనూ సామాజిక మార్పుకు తెలుగు నవల ఒక దిక్సూచిలా పనిచేస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**పాద సూచికలు (Footnotes) :**

1. తొలి నవల - సంస్కరణ దృక్పథం: తెలుగులో నవలా ప్రక్రియ ఆరంభమే ఒక సామాజిక అవసరం నుండి పుట్టింది. కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖర చరిత్ర' (1878) కేవలం కథ చెప్పడం కోసం కాకుండా, నాటి మూఢాచారాలను, స్త్రీ అవిద్యను ఖండించడానికి ఒక ఆయుధంగా రాయబడింది.

   ఆధారం: ముదిగంటి సుజాతారెడ్డి, తెలుగు నవలా వికాసం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్, 1999, పుట సంఖ్యలు. 24-26.

2. చలం తాత్వికత - స్వేచ్ఛా ప్రతిపాదన: గుడిపాటి వెంకట చలం తన 'మైదానం' మరియు 'స్త్రీ' వంటి రచనల ద్వారా స్త్రీకి శారీరక, మానసిక స్వేచ్ఛ ఉండాలని బలంగా వాదించారు. 'పాతివ్రత్యం అనేది స్త్రీ మీద పురుషుడు విధించిన బానిసత్వపు సంకెళ్లు' అని ఆయన చేసిన వ్యాఖ్యలు నాటి సాహిత్య రంగాన్ని కుదిపేసాయి.

   ఆధారం: గుడిపాటి వెంకట చలం, స్త్రీ, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1996, పుట సంఖ్య. 42.

3. మధ్యతరగతి జీవన చిత్రణ: రంగనాయకమ్మ గారి 'బలిపీఠం' నవల ప్రధానంగా కులాంతర వివాహాల వైఫల్యాలను, మధ్యతరగతి స్త్రీల గృహ హింసను చర్చించింది. ముఖ్యంగా అత్తగారి పెత్తనం స్త్రీని ఎలా మానసికంగా కృంగదీస్తుందో ఇందులో చూడవచ్చు.

   ఆధారం: రంగనాయకమ్మ, బలిపీఠం, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 2002, పుట సంఖ్యలు. 115-118.

4. మట్టి మరియు మనిషి సంబంధం: వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'మట్టి మనిషి' నవల భూమికి, స్త్రీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ ఆ రెంటినీ ఎలా నాశనం చేసిందో ఈ నవలలో 'వరాలమ్మ' పాత్ర ద్వారా రచయిత్రి విశ్లేషించారు.

   ఆధారం: వాసిరెడ్డి సీతాదేవి, మట్టి మనిషి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1975, పుట సంఖ్యలు. 89-91.

5. స్త్రీవాద ప్రణాళిక - స్వేచ్ఛ: ఓల్గా రాసిన 'స్వేచ్ఛ' (1987) నవల తెలుగు స్త్రీవాద సాహిత్యానికి ఒక మేనిఫెస్టో లాంటిది. కుటుంబ వ్యవస్థలో స్త్రీ తన సొంత వ్యక్తిత్వాన్ని ఎలా కోల్పోతోందో, తిరిగి తనను తాను ఎలా వెతుక్కోవాలో ఈ నవలలోని ఆధారం: ఓల్గా, స్వేచ్ఛ, స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాద్, 1987, పుట సంఖ్యలు. 132-135.

6. సాధికారత నిర్వచనం: కాత్యాయని విద్మహే తన 'మహిళా సాధికారత - సాహిత్యం' గ్రంథంలో పేర్కొన్నట్లుగా - 'సాధికారత అంటే పురుషునితో యుద్ధం చేయడం కాదు, నిర్ణయాధికారంలో సమాన వాటా కలిగి ఉండటం'. ఈ కోణం నుండే ఆధునిక నవలలు విశ్లేషించబడ్డాయి.

   ఆధారం: కాత్యాయని విద్మహే, మహిళా సాధికారత - సాహిత్యం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2010, పుట సంఖ్య. 18.

**ఉపయుక్త గ్రంథ సూచీ : (References)**

1. ఓల్గా. స్వేచ్ఛ. హైదరాబాద్: స్వేచ్ఛ ప్రచురణలు, 1987.
2. కందుకూరి వీరేశలింగం. రాజశేఖర చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, (పునర్ముద్రణ) 1990.
3. గుడిపాటి వెంకట చలం. మైదానం. విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్, 1927 (పునర్ముద్రణలు: 1996).
4. యద్దనపూడి సులోచనారాణి. సెక్రటరీ. విజయవాడ: క్వాలిటీ పబ్లిషర్స్, 1968.
5. రంగనాయకమ్మ. బలిపీఠం. హైదరాబాద్: స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, 1962 (పునర్ముద్రణ: 2002).
6. వాసిరెడ్డి సీతాదేవి. మట్టి మనిషి. విజయవాడ: నవోదయ పబ్లిషర్స్, 1975.
7. కాత్యాయని విద్మహే. మహిళా సాధికారత - సాహిత్యం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010.
8. ముదిగంటి సుజాతారెడ్డి. తెలుగు నవలా వికాసం. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1999.
9. వల్లంపాటి వెంకటసుబ్బయ్య. తెలుగు నవలా పరిచయం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1986.
10. మృణాళిని, సి. తెలుగు నవలా సాహిత్యం - మనోవిశ్లేషణ. హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2000.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# నువ్వే నీ అసలైన నిధి - పరుసవేది

- పి. స్వాతి
ఉపాధ్యాయురాలు, ఆల్లపల్లి, చిత్తూరు జిల్లా.

పరుసవేది అనేది ఒక అనువాద నవల. దీనికి మూలం పోర్చుగీసు భాషలోని "ఓ ఆల్కామిష్టా(1988) ".ఈ ప్రసిద్ధ నవలను "పౌలో కోయెల్హో" అనే గొప్ప రచయిత రచించాడు. ఈయన 1947 ఆగస్టు 24 న రియో డి జనీరోలో జన్మించాడు. కోయెల్హో యవ్వనంలో తల్లిదండ్రులు ఇంజనీరింగ్ చదువుకోమని ఒత్తిడి చేసినప్పుడు, తనకు సంగీతం, నాటకాల్లో ఆసక్తి ఉంది అని తెలియ పరచాడు. ఈయన జీవితానికి, ఈ నవలలోని కథనాయకుని జీవితానికి దగ్గర పోలికలు ఉన్నాయి. ఈ నవల ప్రపంచ వ్యాప్తంగా 166 దేశాలలో 66 బాషలలోకి అనువాదమైంది. 150 మిలియన్లకు పైగా కాపీలు అమ్ముడయ్యాయి. ఈ విషయాలను బట్టి ఈ నవల యెక్క గొప్పతనం మనం అర్థం చేసుకోవచ్చు. ఈ రచయిత ఇతర పుస్తకాలు "ది పిల్గ్రిమేజ్", "బ్రిడా"," వెరోనికా" "డెసైడ్స్ టు డై", మరియు "ఎలెవెన్ మినిట్స్". ఈ నవలను "ది అల్కెమిస్ట్" అనే పేరుతో అలాన్ ఆర్ క్లార్క్ ఆంగ్లంలోకి అనువదించాడు. తెలుగులోకి "పరుసవేది" అనే పేరుతో కె సురేష్ అనువదించాడు.

యండాలూసియాలో గొర్రెలు కాపరి అయిన శాంటియాగో అనే యువకుడు నిధి కోసం అన్వేషించే అద్భుతమైన కథ ఇది. చివరికి ఆ యువకునికి నిధి దొరికితే మనకి ఆ నిధి కంటే గొప్పదైన జీవిత సత్యం తెలుస్తుంది. ఈ చరాచర సృష్టిలో అంశాలన్నీ ఒక అనుసంధానంతో ఒకే ఆస్తిత్వంతో పనిచేస్తూ ఉంటాయి. నీకు నిజంగా ఏదైనా చెయ్యాలని గాఢంగా అనిపించినప్పుడు విశ్వమంతా నీకు అనుకూలంగా మారుతుందని ఈ నవల ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. సీసం నుంచి బంగారాన్ని తయారు చేసే విధానాన్ని "పరుశువేది", "పరుశువేదం" అని అంటారు. బంగారం మీద ఆశతో ప్రతి నాగరికతలోనూ ప్రతి తరంలోనూ ఈ ప్రయత్నం సాగి సాగి వైఫల్యాలతోనే ముగుస్తూ ఉంటుంది.వ్యక్తి తన ముతక ధర్మాలని పరిహరించుకొని సునిశిత ధర్మాలలోకి అంటే ఉన్నత చైతన్యలలోకి ఎప్పుడు ఎదుగుతాడో... అప్పుడు.. బంగారంలా మారిన తనకి.. సీసం నుంచి బంగారం చేయడం అనే పరుస వేద విద్య ఎలా సొంతమవుతుందో, మన చరిత్రలోనూ, ఈ నవలలోనూ నిరూపితమైన స్థిరమైన శాశ్వత వాస్తవం.ఈ రోజుల్లో గొర్రెల మందలాగా అందరు ఏ దారిన నడిస్తే మనం అదేదారిన నడుస్తున్నాం. మన మనసుకి నచ్చిన కొత్త దారుల్లో నడవాలంటే భయం. గుంపులోనే ఉండాలనుకుంటాం. గుంపుని ఎదిరించి ఒంటరిగా ఎలా ప్రయాణించాలో ఈ నవల మనకు నేర్పుతుంది. శాశ్వతం అనుకున్న

సంపదలు కరిగిపోయిన వేళ.., నిత్యం అనుకున్నా ఆత్మీయ బంధాలు ప్రపంచంలో కలిసిపోయిన వేళ.., అన్ని పోగొట్టుకున్న వాళ్లమై అనామకులుగా మనం మిగిలి పోయిన వేళ.. ముందుకు ఎలా సాగిపోవాలో మనం తెలుసుకోవచ్చు. ఒకే కప్పు కింద జీవిస్తూ ఒకరికొకరం అర్థం కాని సమాజ భాషలో జన్మంతా మాట్లాడుకుంటూ ఉండే స్థితి నుండి సృష్టిలోనే ప్రతి అంశంతోను సంభా షించి స్పందింప చేసుకోగలిగిన విశ్వభాష ఉందని మనకు తెలియజేస్తుంది. మతాలలో ఇమడలేక సులువైన, సహజ మైన ఆధ్యాత్మిక అద్భుతాన్ని అందుకోలేక స్వీయ ప్రేరిత అయోమయాలతో, గందరగోళాలతో అవస్థపడుతూ జనబాహుళ్యాన్ని అవస్థపెట్టే ఆధ్యాత్మిక గురువులకీ, అమాయక ఆధ్యాత్మిక విద్యార్థులకీ.. అభ్యాసులకీ ఈ నవల గొప్ప కనువిప్పు.

ఈ నవలలో, స్పెయిన్లోని ఆండలూసియా ప్రాంతం లోని, సాధారణ రైతు కుటుంబానికి చెందిన యువకుడు సాంటియాగో. తన పదహారేళ్ల వయస్సు వరకు అతడు మత గురువుల పాఠశాలకు హాజరయ్యాడు. అతని తల్లిదండ్రులు అతనిని ఒక మత గురువుగా చూడా లనుకున్నారు. అది తమ కుటుంబానికీ, వంశానికి గర్వ కారణం అవుతుందని అనుకున్నారు. కానీ అతనికి దేవుడు గురించి మనిషి పాపాల గురించి నేర్చుకోవడం కంటే బాల్యం నుండి ప్రపంచం గురించి తెలుసుకోవడం ఎంతో ఇష్టంగా ఉండేది. అతడు ధైర్యం కూడగట్టుకుని తనకి మత గురువు అవ్వాలని లేదని, ఊళ్ళు చూడాలని ఉంది అని తండ్రితో చెప్పాడు. కానీ ఇప్పటికీ పిల్లలు, ఇష్టమైన పనినీ, వృత్తినీ ఎంచుకోలేక, తల్లిదండ్రుల మాటలు కాదనలేక, ఇష్టమున్నా లేకున్నా డాక్టర్లు, ఇంజనీర్లుగా మారుతున్నారు. కేవలం డబ్బులు ఎక్కువగా ఏ వృత్తిలో వస్తే అందరు అదే మార్గాన్ని ఎంచుకుంటు న్నారు. నిజంగా పిల్లలకు అ పనిలో ఆసక్తి ఉందా లేదా అని ఆలోచించరు. చిన్నపిల్లలు మీకు ఏం తెలియదని వాళ్ల గొంతు నొక్కేస్తారు. వాళ్లకు ఆలోచించే శక్తిని ఇచ్చి, వాళ్లకి మాట్లాడే స్వేచ్ఛను ఇచ్చి, వాళ్ళు చెప్పింది విని అర్థం చేసుకుంటే, వారి జీవిత గమ్యం ఏంటో తల్లిదండ్రు లకు తెలుస్తుంది. బాల్యంలో అందరికీ తమ జీవిత గమ్యం ఏమిటో తెలుస్తుంది. శాంటియాగో తండ్రి తన కొడుకు ఆసక్తిని అర్థం చేసుకొన్నాడు. మనలో ప్రయాణాలు చేయగలిగిది గొర్రెల కాపరులే అని తండ్రి కొడుకుతో అన్నాడు. తన కొడుకుకి మూడు పురాతన స్పానిష్ బంగారు నాణ్యాలు ఇచ్చి వాటిని ఉపయో గించుకొని నువ్వు గొర్రెలు మందను కోనుక్కొని, నీ ప్రయాణం కొనసాగించమని చెప్పినాడు. శాంటియాగో ఒంటి మీద ఒక చలికోటు, చేతిలో ఒక పుస్తకం, ఒక గొర్రెల మందతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. ఆ పుస్తకం చదవడం పూర్తయితే దానిని అమ్మి మరొక పుస్తకాన్ని కొనుక్కోవచ్చు. యండాలుసియానా మైదాన ప్రాంతాలతో అతడు విసిగి చెందితే తన గొర్రెల మందను అమ్మేసి సముద్ర యానం చేపట్టవచ్చు. సముద్ర యానం విసుగు పుట్టేనాటికి అతడికి మరిన్ని నగరాలతో మరింత మందితో పరిచయం ఏర్పడుతుంది. ఆనందంగా ఉం డటానికి మరిన్ని దారులు పరిచయం అవుతాయి. అవకాశం దొరికినప్పుడల్లా యువకుడు తాను ప్రయా ణించడానికి కొత్తదారిని ఎన్నుకున్నాడు. నావికులు ఊర్లు తిరిగే వ్యాపారస్తులు ఏ బాధర బంధీ లేని తమ సంచార జీవనంలో ఆనందాలను పొందుతారు. గత రెండు సంవత్సరాలుగా అతడు గొర్రెలతో జీవన యానం సాగిస్తూ పల్లె పట్టణంలో మేత నీళ్లు ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్తున్నాడు. తన పుస్తకంలో తనకు బాగా నచ్చిన అంశాలను వాటికి చదివి వినిపించేవాడు గొర్రెలు కాపరి ఒంటరితనం గురించి సంతోషాల గురించి వాటికి చెప్పే వాడు. ప్రపంచం చాలా పెద్దది,అనంతమైనది. ప్రయాణంలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలను కను గొంటాడు. వచ్చిన సమస్యల్లా ఏమిటంటే ప్రతిరోజు ఒక కొత్త దారి వెంట నడుస్తున్నామని ఆ గొర్రెలకు తెలియదు. చేలు కొత్తవిని కానీ, కాలాలు మారాయని కానీ అవి గుర్తించవు. వాటి ఆలోచనలు ఎప్పుడూ మేత నీళ్ల చుట్టూనే. సాధారణంగా పుస్తకాల కంటే ఎక్కువగా గొర్రెలు నుంచి తెలుసుకున్నాడు. తనకి తరచుగా ఒక కల వచ్చేది. ఆ కలలో మైదానంలో ఒక అమ్మాయి వచ్చి గొర్రెలతో

ఆడుకోసాగింది. ఉన్నట్లుండి అమ్మాయి తన చేతిలో తీసుకుని ఈజిప్టులోని పిరమిడ్ల వద్దకు చేర్చింది. ఆ అమ్మాయి తనతో ఇలా అంది "నువ్వు ఇక్కడకు వస్తే నీకు ఒక రహస్య నిధి దొరుకుతుంది" కానీ ఆ నిధి ఎక్కడ ఉందో ఆమె చూపించకుండానే తనకు మెలకువ వచ్చేసింది. ఈ కల తనను వెంటాడేది. ఈజిప్ట్ వైపు తన ప్రయాణం కొనసాగించాడు. అతను కలలను వివరించే వృద్ధురాలు దగ్గరికి వెళ్లి తన కల గురించి చెప్పి, నిధి ఎక్కడుందో చెప్పమంటాడు. అప్పుడా వృద్ధురాలు తనతో ఇలా అంది "నేను కలలను వివరిస్తానంతే వాటిని నిజం ఎలా చేయాలో నాకు తెలియదు''. దాంతో ఆ యువకుడు చాలా నిరుత్సాహపడ్డాడు. ఒక వ్యక్తితో మనం ఎక్కువ కాలం గడిపితే, ఆ వ్యక్తులోని లోపాలు మనకు కనిపిస్తాయి. తన లోపాలను సరిజేయాలని, తను మారాలని మనం కోరుకుంటాం. తాము కోరుకున్నట్లు ఇతరులు ఉండకపోతే మనకి కోపం వస్తుంది. ఎదుటి వాళ్లు వాళ్ళ జీవితాలను ఎలా జీవించాలో ప్రతి ఒక్కరు స్పష్టంగా తెలుస్తుంది. కానీ తమ జీవితానికి వచ్చేసరికి ఎవరికీ ఎటువంటి ఆలోచన ఉండదు. దారిలో ఒక బట్టల వ్యాపారి కూతురు పరిచయం అవుతుంది. తను యవ్వనంలో ఉన్నందున ఆ అమ్మాయి పరిచయం, మాట తనను ఆకర్షిస్తాయి. తను ఆ అమ్మాయిని కలిసిన తర్వాత ఇక ఏ స్త్రీ గురించీ ఆలోచించ లేదు. ఒకసారి యువకుడు ఒక పుస్తకం చదువుతుండగా ఒక వృద్ధుడు "ఈ పుస్తకం చాలా ముఖ్యమైనది. కానీ ఇది చికాకు కలిగిస్తుంది. ఇందులో వ్యక్తులు తమ జీవిత గమ్యాలను ఎంచుకోలేకపోవడాన్ని అది వివరిస్తుంది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అబద్ధాన్ని అందరూ నమ్ముతారంట పుస్తకం ముగిస్తుంది.ఆ అబద్ధం ఏమిటంటే మన జీవితంలో ఏదో ఒక సమయంలో మనకు జరిగే వాటిపై నియంత్రణ కోల్పోయి మన జీవితాలు కర్మతో శాసింపబడతాయి అనుకోవడం. నువ్వు ఎవరివైనా ఏం చేస్తున్నా నీకు నిజంగా ఏదైనా కావాలనిపించింది అంటే ఆ కోరిక విశ్వాత్మలో పుట్టింది. ఈ భూమిపైన నీ కర్తవ్యం అదే.అది కేవలం ప్రయాణం చేయాలని కూడా కావచ్చు లేదా ఒక వస్త్ర వ్యాపారి కూతురుని పెళ్లి చేసుకోవడం కావచ్చు లేదా నిధి కోసం వెతకడం కావచ్చు. ఎవరి జీవితగమ్యాన్ని వారు సాధించడమే వారు తప్పనిసరి కర్తవ్యం. నీకు ఏదైనా కావాలనిపించినప్పుడు నువ్వు దానికి సాధించడంలో సహాయపడడానికి ఈ ప్రపంచమంతా కుట్ర పన్నుతుంది" అని అన్నాడు. అతని పేరు మెల్చిజెడెక్. ఆ వృద్ధుడు ఒక రొట్టెల అమ్మే వ్యక్తిని చూపించి అతను కూడా తన బాల్యంలో ప్రయాణాలు చేయాలనుకున్నాడు. కానీ ముందుగా రొట్టెల దుకాణం పెట్టి కొంత డబ్బు సంపాదించాలనుకున్నాడు అతని ముసలివాడు అయిన తర్వాత ఆఫ్రికాలో ఒక నెల గడిపి వద్దామనుకున్నాడు. తాము కలగన్న దాన్ని జీవితంలో ఎప్పుడైనా సాధించే సామర్థ్యం మనుషులకు ఉందని అతడు గుర్తించలేదు అని చెప్పాడు. ఆ యువకుడు ఆ వృద్ధుడిని ఇదంతా నాకెందుకు చెప్తున్నావు అని అడిగాడు. అప్పుడు వృద్ధుడు ఇలా అన్నాడు "ఎందుకంటే నువ్వు నీ జీవిత గమ్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నావు కానీ దాని అంతటినీ ప్రస్తుతం వదిలిపెట్టే స్థితిలో ఉన్నావు''. ఒక రాళ్ల అన్వేషకుడు ఐదు సంవత్సరాలు నదీ తీరాన ఒక పచ్చ రాయి కోసం వెతికాడు. అతడు తనకున్నదంతా వెచ్చించాడు. పచ్చరాళ్ళ కోసం కొన్ని వేల రాళ్లు వెతికాడు. ఇంకొక రాయిని ఒకే ఒక రాయిని వెతికితే సాఫల్యం పొందే సమయంలో అతడు ఆ అన్వేషం వదిలిపెట్టేయాలి అనుకున్నాడు. ఈ ఐదు సంవత్సరాల వృథాశ్రమ, ప్రయాస అతనికి కోపం తెప్పించింది అప్పుడు రాయి దొర్లుకుంటూ అన్వేషకుడు కాళ్ల దగ్గరకు దొర్లుకుంటూ వెళ్ళింది. ఆ రాయిని తీసి అవతలకి విసిరేసాడు. ఆ రాయిని ఎంత బలంగా విసిరాడంటే ఆ దెబ్బకు రాయి ముక్కలై దాంట్లో నుంచి ప్రపంచంలో కెల్లా అందమైన పచ్చ రాయి బయటపడింది. ఏది ఏమైనా జీవితంలో ప్రతి దానికి ఒక వెల ఉంటుందని నువ్వు తెలుసుకుంటావు. మనుషులు ప్రతిరోజూ తనకు జరుగుతున్న మంచిని గుర్తించ పోవడం వల్ల ప్రతిరోజు మాదిరిగానే మరుసటి రోజు ఉంటుంది. తూర్పు గాలి మరింత వేగం పెరిగి దాని తాకిడి ఆ యువకుడి ముఖం మీద తెలుస్తుంది. గాలికున్న స్వేచ్ఛను చూసి

ఆ యువకుడు కాసేపు ఈర్ష్యపడ్డాడు. తాను కూడా అంతే స్వేచ్ఛగా ఉండవచ్చని తెలుసుకున్నాడు. తనను పట్టి ఉంచేది ఏదీ లేదు- తాను తప్ప! గొర్రెలు, వస్త్ర వ్యాపారి కూతురు,యాండలూసియా మైదానాలు తన జీవిత గమ్యంలో మెట్లు మాత్రమే అనుకున్నాడు. ఆ యువకుడు ఆ ముసలి వాడిని నిధి ఎక్కడ ఉంది అని అడిగాడు. ముసలివాడు యువకునితో ఇలా అన్నాడు "నువ్వు నిధిని కనుక్కోవాలంటే శకునాలను అనుసరించాలి. ప్రతి ఒక్కరూ అనుసరించడానికి దేవుడు ఒక దారిని తయారు చేశాడు. నీకోసం అతడు ఉంచిన శకునాలను చదవా లంతే. నేను నీకు రెండు రాళ్లు ఇస్తాను ఒకటి తెల్ల రాయి ఇంకొకటి నల్ల రాయి వీటి పేర్లు ఉరిం, తుమిం. తెల రాయి అవును చూస్తుంది నల్లరాయి కాదును చూపి స్తుంది. శకునాలను అర్థం చేసుకోలేక పోయినప్పుడు ఇవి నీకు తోడ్పడతాయి. ఎప్పుడు అవును కాదు అనే సమాధానం వచ్చే ప్రశ్న అడగాలి. కానీ సాధ్యమైనంత వరకు నీ నిర్ణయాలు నువ్వే తీసుకో. శకునాల భాషను కూడా మరిచిపోవద్దు అన్నిటికి మించి నీ జీవిత గమ్యాన్ని చివరికంటూ అనుసరించడం మరిచిపోవద్దు. ఒక దుకాణ దారుడు ఆనంద బోలాలను తెలుసుకోవడానికి తన కొడుకులు ప్రపంచంలోకెల్లా జ్ఞాని వద్దకు పంపించాడు. ఆ కుర్రవాడు ఏడారిలో 40 రోజులు పాటు నడిచి చివరికి జ్ఞాని ఉంటున్న కొండపైన అందమైన కోట వద్దకు చేరుకున్నాడు. కోట ప్రధాన ద్వారం వద్ద సందడిగా, అందంగా ఉంది. ఆ కుర్రవాడు జ్ఞానికి ఎందుకు వచ్చాడో వివరిస్తుంటే. ఆ జ్ఞానీ కుర్రవాడితో నాకు ఇప్పుడు అంత సమయం లేదు కోట అంతా తిరిగి చూసి రెండు గంటలు తరవాత రమ్మన్నాడు. ఈ లోక నువ్వు ఒకటి చేయాలి ఒక చెంచాలో రెండు బొట్లు నూనె పోసి నువ్వు కోటను తిరిగి చూసే సమయంలో ఈ చెంచాలోని నూనె కింద పడకుండా జాగ్రత్తగా ఉంచు అని అన్నాడు. కుర్రవాడు కోటలోని మెట్లు ఎక్కుతూ దిగుతూ చెంచాలని నూనె కింద పడిపోకుండా దృష్టి దానిపై నిలిపించాడు రెండు గంటల తర్వాత జ్ఞాని ఉన్న గదిలోకి కుర్రవాడు వచ్చాడు. అప్పుడు జ్ఞాని ఆ కుర్రాడుతో గది గోడలకు వేలాడదీసి ఉన్న బొమ్మలు చూశావా. తోటమాలి శ్రమించి మలిచిన తోటను చూసావా నా గ్రంథాలయంలోని అందమైన పుస్తకాలు గమనించావా? అని అడిగాడు. కుర్రవాడు సిగ్గు పడిపోయాడు తాను ఏమీ చూడలేదని చెప్పాడు. జ్ఞాని తనకు అప్పగించిన నూనె జారిపోకుండా చూడడంలోని అతడు నిమగ్నమై ఉన్నాడు. అయితే వెళ్లి ఇంకొకసారి కోటను చూసి రమ్మన్నాడు. ఊరట చిందిన యువకుడు చెంచా తీసుకొని కోటను చూడడానికి వెళ్ళాడు ఈసారి అతడు గోడల పైనున్న బొమ్మలని తోటని లైబ్రరీలో ఉన్న పుస్తకాలని కొండలని అందాలని అన్నిటిని చూసి తిరిగి జ్ఞాని వద్దకు వచ్చాడు. అప్పుడు జ్ఞాని "నేను నీకు అప్పగించిన రెండు పుట్లు ఏవి" అని అడిగాడు. తన చేతిలో ఉన్న చెంచా కేసి చూసిన కుర్రవాడు నూనె బొట్లు జారిపోయాయని గమనించాడు. అప్పుడు దాని కుర్రవాడితో ఇలా అన్నాడు. "ప్రపంచంలోనే అందా లన్నిటిని చూస్తూనే చెంచాలోని నూనె చుక్కలు గురించి మర్చిపోకపోవడం లోనే ఆనంద రహస్యం ఉంది". ఇది గొప్ప హితబోధ. మన జీవితంలోని అందాలన్నిటినీ ఆస్వా దిస్తూనే మన జీవిత గమ్యం వైపు మనం నడవడం అనేది మనకి ఇది నేర్పిస్తుంది. శాంటియాగో దగరికి వచ్చి నాకు గొర్రెలను కాయడం ఇష్టమైన పని, నాకు నీ గొర్రెలను అమ్ముతావ? అని అడుగుతాడు. తాను నిధి కోసం ప్రాణం చేయాలంటే డబ్బులు కావాలి అందుకని ఆ గొర్రెలను అతని అమ్మేశాడు. గొర్రెలను అమ్మడం వల్ల అతడి చేతిలో డబ్బు దండిగా ఉంది డబ్బులో మాయ ఉందని యువకుడికి తెలుసు డబ్బులు ఉన్నవాడు ఎప్పుడూ ఒంటరిగా ఉండడు. ఆఫ్రికాలోని వింతైన ప్రదేశం టాంజియర్ చేరుకున్నాడు ఆ యువకుడు. అక్కడ ఒక వ్యక్తి శాంటియాగోని ఎవరు నువ్వు అని అడుగుతాడు. నేను పిరమిడ్ల దగ్గరికి వెళ్లాలని యువ కుడు చెప్తాడు. అప్పుడు ఆ వ్యక్తి నువ్వు పిరమిడ్లుకి చేరుకోవాలంటే సహారా ఎడారి దాటాలి అందుకు డబ్బు కావాలి మీ దగ్గర సరిపోవు డబ్బుందా అని అడుగుతాడు. మనం రేపటికల్లా పిలుపుంట చేరుకోవాలంటే ముందుగా మనం రెండు ఒంటెలు కొనుక్కోవాలి నేను వెళ్లి ఒంటెలు

కొనుక్కోస్తాను అని చెప్పి తన దగ్గర ఉన్న డబ్బు తీసుకొని పరారైనాడు. ఒక వ్యక్తి నన్ను మోసం చేసినందున నేనిక మనుషులను నమ్మబోను. నేనిక ఆ నిధిని చేరుకోలేము ఈ ప్రపంచాన్ని జయించలేని అల్పుడను అని అనుకున్నాను. ప్రపంచం వాస్తవంగా ఎలా ఉందో కాకా ఎలా ఉండాలని కోరుకుంటున్నాము ఆ దృష్టి కోణం నుంచి చూసే అందరిలాంటి వాడిని నేను కూడా అని అనుకున్నాడా యువకుడు. ఇప్పుడు తన దగ్గర చలి కోటు మాత్రమే మిగిలింది. జేబులో దమ్మిడీ లేదు కానీ గుండె నిండా విశ్వాసం ఉంది పుస్తకాలలో తాను అభిమానించిన సాహసోపేత నాయకుల్లా తాను ఉండాలని అతడు గత రాత్రి నిర్ణయించుకున్నాడు. పదాల మీద ఆధారపడిన భాష ఒకటి ఉండాలి ఇలాంటి అనుభవం నాకు ఇప్పటికే గొర్రెలతో ఉంది ఇప్పుడు అది మనుషులతో ఏర్పడుతుంది అని అనుకున్నాడు. అంటే మనిషి యొక్క హావాభావాలు ప్రవర్తన చూసి అర్థం చేసుకోవడం. ఒక గాజు వస్తువుల వ్యాపారి, తను వ్యాపారంలో బాగా లాభాలు గడించి ధనవంతుని అవుతానని ముసలివాడు అయ్యేకొద్ది చుట్టూ అందమైన అమ్మాయిలు ఉంటారని కలలు కనేవాడు. కానీ కొన్ని పరిస్థితులు వల్ల ఆ వ్యాపారం దెబ్బతినింది. తన దుకాణం కొండపైన ఉంది. వీటిని కొనడానికి గుట్టపై దాకా ఎక్కి ఆసక్తి ఎవరికీ లేదు. ఇప్పుడు ఏ మార్పు చేద్దాం అన్న చాలా ఆలస్యమైంది. గాజు వస్తువులు కొనడం అమ్మడం ఒక్కటే అతనికి తెలుసు.. శాంటియాగో ఆ గాజు వస్తువుల వ్యాపారి దగ్గరికి వెళ్లి ఈ గాజు వస్తువులన్నిటిని నేను శుభ్రం చేస్తాను దానికి బదులు నాకు తినడానికి ఏమైనా ఇస్తావా అని అడిగాడు. ఎడారిలో ఈ చలికోటుతో అవసరం లేదని తన దగ్గర ఉన్న చలికోటతో శుభ్రం చేశాడు. శుభ్రం చేస్తుండగానే ఒకరిద్దరు కొనుగోలుదారులు వచ్చి గాజు వస్తువులు కొన్నారు. మంచి శకునం. అప్పుడు ఆ వ్యాపారి అబ్బాయిని నా దగ్గర పని చేస్తావని అడిగాడు. నేను రాత్రి పగలు పనిచేస్తాను అందుకు నాకు ఈజిప్ట్ చేరుకోవడం డబ్బులు కావాలి ఇస్తానని అడిగాడు. అమ్మిన ప్రతి వస్తువు మీద నీకు కొంత ఇచ్చినా నువ్వు ఇంకా అప్పు చేయాల్సి వస్తుంది. నువ్వు మీ ఊరు తిరిగి వెళ్ళడానికి కావాల్సిన డబ్బులు నేను ఇవ్వగలుగుతాను అని వ్యాపారి అన్నాడు. యువకుడు ఆలోచించి కొన్ని గొర్రెలు కొనుక్కోడానికి నాకు డబ్బులు కావాలి ఇస్తావా అని అడిగాడు. వ్యాపారి సరే అన్నాడు. వ్యాపారం బాగా ఊపందుకుంది. సంవత్సరంలో సంవత్సరం రోజులు ఆ యువకుడు దుకాణంలో పనిచేశాడు. సాధ్యమైనంత త్వరగా నా గొర్రెల వద్దకు తిరిగి వెళ్లాలని ఉంది అని అనుకున్నాడు. అదృష్టం మన వైపు ఉన్నప్పుడు దానిని మనం పూర్తిగా ఉపయోగించుకోవాలి. పరాయి దేశంలో అడుగుపెట్టి ఒక దొంగతో దోచుకోబడి, ఏ పెట్టుబడి లేకుండా ఏ పెట్టుబడి లేకుండా మునుపుటి కంటే రెట్టింపు మందను పొందటమే తన నిధి ఏమో అని అనుకున్నాడు.. నేను మార్పును ఎదురుకోలేను కాబట్టి నాకు దీనిని మార్చాలని లేదు ప్రస్తుతం నేను ఉన్న పరిస్థితికి నేను అలవాటు పడ్డాను. విస్మరించిన ప్రతి వరము శాపం అవుతుంది. నాకు జీవితంలో ఇంకేమీ వద్దు. యువకుడు గదికి వెళ్లి తన వస్తువులన్నీ సర్దుకున్నాడు మూడు సంచిలతో బయటికి రాబోతున్న గదిలోకి మూల తన పాత గుడ్డ సంచి కనిపించింది అది ఉండలా పడి ఉంది అతడు దాని గురించి మరిచిపోయాడు ఎవరికైనా ఇద్దామని సంచల నుంచి చెల చొక్కా అని బయటకు తీస్తుండగా అందులోంచి రెండు రాళ్లు బయటపడ్డాయి. ఉరితుమిం. ఆ రాళ్ళను చూడగానే వృద్ధ రాజు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. కలగనటం ఎప్పుడూ మానవద్దు శకునాలను అనుసరించు. టాల్జియర్ ఇప్పుడు ఒక వింత పట్టణమేమీ కాదు ఈ ప్రదేశాన్ని జయించినట్లే తాను ప్రపంచాన్ని కూడా జయించగలను. తనకి పిరమిడ్లకు మధ్య అనంతమైన ఎడారి ఉంది. ఇప్పుడు నా దగ్గర కావలసినంత డబ్బు ఉంది సమయం ఉంది. తెలుగు ఎడారిలో ప్రయాణిస్తూ ఎడారి గురించి ఒంటెల గురించి తెలుసుకున్నాడు.. వాళ్లకి అవసరమైనవి కావలసినవి సాధించుకో గల సామర్థ్యం ఉన్నప్పుడు మానవులు తమకు తెలియని వాటి గురించి భయపడాల్సిన అవసరం లేదు. మనకు ఉన్నది ఎదో కోల్పోతామని భయపడుతూ

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

ఉంటాం అది మన ప్రాణం కావచ్చు ఆస్తి కావచ్చు వస్తువులు కావచ్చు. వెనక్కి వెళ్లలేనప్పుడు ముందుకు వెళ్లడానికి మంచి దారి ఏది అని మాత్రమే ఆలోచించాలి. భయంతో సహా మిగిలినదంతా దేవునికే వదిలేయాలి. తనలాగే జీవిత గమ్యం కోసం వెతుకుతున్న ఒక ఆంగ్లేయుడు తారసపడతాడు. ఆ ఆంగ్లేడు ఒక పరుశువేది కోసం వెతుకుతుంటాడు. ఆ యువకుడు ఆంగ్లేయుండి పరుశువేదం అంటే ఏమిటి అని అడుగుతాడు. పరుసువేదం అన్నది చాలా శ్రద్ధతో నేర్చుకోవాల్సిన అంశం గురువుల అనుసరించిన మార్గాన్ని యధార్థంగా అనుసరించాలి. సీసం నుంచి బంగారాన్ని తయారు చేసే విధానాన్ని పరుశువేదం అని అంటారు. రోజువారి జీవితం నుంచి కూడా పరుశువేత నేర్చుకోవచ్చు నమ్మకం యువకుల్లో పెరగసాగింది. కొంచెం ఓపిక పడితే ప్రతిదానిని బంగారంగా మార్చవచ్చా అని అతను అనుకున్నాడు. అందరూ సీసాన్ని బంగారం గా మార్చగలడాన్ని ఊహించుకో అప్పుడు బంగారానికి విలువ లేకుండా పోతుంది. పట్టు విడవకుండా సాధన చేసే వాళ్ళకి విషయాలను లోతుకు అధ్యయనం చేయడానికి సిద్ధపడిన వాళ్లకు మాత్రమే నిపుణుల పని వశం అవుతుంది. ప్రపంచానికి ఒక ఆత్మ ఉంటుందని తెలుసుకున్నాను ఇది అర్థం చేసుకున్న వాళ్లు విశ్వభాషను కూడా అర్థం చేసుకోగలరని తెలుసుకున్నాను. విషయాలను తెలుసుకోవడానికి ఒక్కొక్కరికి ఒక్కొక్క విధానం ఉంటుంది. అతని దారి నా దారి లాంటిది కాదు అదే విధంగా నా దారి అతనిది కాదు కానీ మేమిద్దరం మా జీవిత గమ్యాన్ని అన్వేషిస్తున్నాం అందుకు అతనిని గౌరవిస్తాను. యువకుడికి మంచి స్నేహితుడైన ఒంటె నడిపే వ్యక్తి ఎడారి జాతుల మధ్య యుద్ధం ఆపాటికి మొదలైంది అని చెప్పాడు. ఒంటెను నడిపే వ్యక్తి యువకునితో ఇలా అన్నాడు.  వెన్నెల రాత్రి ఖర్జూర పండ్లు తింటూ నేను బతికి ఉన్నాను అని యువకుడుతో అన్నాడు. తింటున్నప్పుడు కేవలం దాని గురించే నేను ఆలోచిస్తాను ప్రయాణం చేస్తున్నప్పుడు ప్రయాణం వైపే దిష్టి పెడతాను. పోరాడాల్సి వస్తే మిగిలిన అన్ని రోజులు లాగానే చావడానికి కూడా అది మంచి రోజే. నేను అటు గతంలోనూ ఇటు భవిష్యత్తులోని జీవించడం లేదు. ప్రస్తుతం పైన నాకు ఆసక్తి ఉంది ఎప్పుడు ప్రస్తుత క్షణం పైన దృష్టి నిలపగలిగితే నువ్వు అదృష్టవంతుడివి.మనం గడుపుతున్న ప్రస్తుత క్షాణమే జీవితం.ఇది గొప్ప సందేశం. నల్ల బట్టల్లో లేని ఒక యువతి అక్కడికి వచ్చింది. ఆమె భుజం మీద ఒక నీటి పాత్ర ఉంది ఆమె తల మీద బట్ట ఉంది కానీ ముఖం మీద ముసుగు లేదు. పరుశువేది గురించి అడగడానికి యువకుడు ఆమెను సమీపించాడు. ఆ క్షణంలో కాలం నిలిచిపోయినట్లు అతనికి అనిపించింది. ఆమె నల్లని కళ్ళల్లోకి చూసి ఆమె పెదవులు చిరునవ్వుకి నిశ్శబ్దానికి మధ్య ఉండడం గమనించిన తర్వాత ప్రపంచమంతా మాట్లాడే భాషలోనే ముఖ్యమైన భాగాన్ని అతడు తెలుసుకున్నాడు. అదే ప్రేమ. ఒక వ్యక్తికి నిబద్ధుడయ్యే ముందు ఆమె గురించి సంపూర్ణంగా తెలియాలని, ప్రేమలో పడాలని అతని తల్లిదండ్రులు తాత నానమ్మలు చెప్పారు. ప్రపంచ భాష తెలిస్తే ప్రపంచంలో ఒకరు నీకోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తుంది. అది ఎడారి మధ్యలో కావచ్చు పెద్ద నగరంలో కావచ్చు. అటువంటి ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు తారసపడి వాళ్ళ కళ్ళు కలిసినప్పుడు గతము భవిష్యత్తు అప్రస్తుతం అయిపోతాయి. ఆ ఒక్క క్షణం మిగులుతుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తికి మరొక ఆత్మను జతగా సృష్టిస్తుంది. యువకుడు అమ్మాయిని నీ పేరు ఏమిటి అని అడిగాడు. ఫాతిమా అని చెప్పి వెళ్లిపోయింది  ఆ యువతి. ఆమె కలుస్తుందని ఆశతో యువకుడు మర్నాడు కూడా బావి దగ్గరికి వచ్చాడు. అప్పుడు ఫాతిమా వచ్చి తన పాత్రలో నీళ్లు నింపుకుంటుంది.. నీకు ఒక విషయం చెప్పడానికి వచ్చాను అని యువకుడు అన్నాడు. నువ్వు నాకు భార్యగా రావాలి నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నేను నీకోసం ప్రతిరోజు ఇక్కడ వేచి ఉంటాను. తనకు నిధి కంటే పాతిమా చాలా ముఖ్యమైనది. ఆమెతో తన కలల గురించి నిధి గురించి చెప్పాడు. యుద్ధం అయిపోయే వరకు వేచి ఉండాల్సి వస్తే అలాగే వేచి ఉండు కానీ యుద్ధం ముగిసిన తర్వాత నీ కళ్ళను అన్వేషిస్తూ

తప్పనిసరిగా వెళ్ళు. నేను నిజంగా నీ కలలో బాగానైతే ఏదో ఒక రోజు నువ్వు తప్పక తిరిగి వస్తావు. మర్నాడు మళ్ళీ కలుసుకున్నప్పుడు ఫాతిమాతో యువకుడు ఇలా అంటాడు. ప్రేమ ఉన్నప్పుడు ప్రేమించిన వాళ్లకు దగ్గరగా ఉండాలి. రాత్రి యువకుడు బాధతో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆకాశంలో గద్దలు తిరుగుతున్నాయి. శకునాలు ఏదో కీడును సూచిస్తున్నాయి. ఈ విషయాన్ని గుడారంలో ఉన్న పెద్దలకు తెలియజేశాడు. అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశాడు. ఉన్నట్టుండి అతడికి పిడుగులు ఉంటే శబ్దం వినపడింది. అతడి ముందు ఒక పెద్ద తెల్లని గుర్రం ఉంది అది భయంకరంగా సకలిస్తుంది. గుర్రాన్ని ఎక్కి ఉన్న వ్యక్తి నల్లని దుస్తులు ధరించి ఉన్నాడు. అతడు వర నుంచి ఒక పెద్ద వంపు తిరిగిన కత్తిని బయటికి తీశాడు. గద్దలు ఎగరడంలో అర్థాన్ని ఎంచుకోవడానికి సహాయం చేసింది ఎవరు అని అడిగాడు. నేనే అని భయం లేకుండా కూడా సమాధానం ఇచ్చాడు. కత్తివేటు పడలేదు దానికి బదులు కొత్త వ్యక్తి కత్తి కొన యువకుడు నుదుటిన తాకేలాగా దానిని మెల్లగా కిందకి దించాడు ఒక బొట్టు రక్తం కారింది. పక్షులు ఎగరడానికి ఎందుకు అర్థం చేసుకున్నావు అని అడిగాడు. పక్షులు నాకు తెలపాలనుకున్నదే నేను అర్థం చేసుకున్నాను అని చెప్పాడు యువకుడు. గుర్రం మీద ఉన్న వ్యక్తితో యువకుడు ఇలా అన్నాడు. నీకంటే ఓయసిస్ లో ఎక్కువ మంది పురుషున్నారు కాబట్టి రేపు మీరంతా చావబోతున్నారని. కత్తి ఇంకా అతడి నుదుటి మీదే ఉంది. అల్లా అనుకున్నది మార్చడానికి నీవు ఎవరు అని అడిగాడు కొత్త వ్యక్తి. సైన్యాలను అల్లా సృష్టించాడు గద్దలను కూడా అల్లాయే సృష్టించాడు. పక్షుల భాషలు నాకు అల్లానే నేర్పించాడు. కొత్త వ్యక్తి కత్తిని ఊర్లో పెట్టేసాడు. యువకుడికి ప్రాణం కుదుటపడింది.. నీ ధైర్యాన్ని పరీక్షించాల్సి వచ్చింది అని కొత్త వ్యక్తి అన్నాడు. విశ్వభాషను అర్థం చేసుకోవడంలో అన్నిటికంటే ముఖ్యమైనది ధైర్యం. ఆ గుర్రం మీద వచ్చిన కొత్త వ్యక్తి పరుశువేది. ఆగంతుకులందరినీ ఓయసిస్ పురుషులు చంపేశారు. ఒయాసిస్ పెద్ద యువకుడు పిలిపించి అతనికి 50 బంగారు నాణేలు ఇచ్చి, ఒయాసిస్ కి సలహాదారుడుగా చేయమని కోరాడు. వృద్ధ రాజన్న మాటలే పరుసవేది కూడా యువకుడుతో అన్నాడు. యువకుడు పరుసువేధితో ఇలా అడిగాడు అయితే ఇప్పుడు నేను ఏం చేయాలో నాకు చెబుతావా?. “ లేదు నువ్వు తెలుసుకోవాల్సినంత ఈపాటికి తెలుసుకున్నావు నేను నీది ఉన్న దిశను మాత్రమే చూపిస్తాను. మీ హృదయం ఉన్నచోట నీ నిధి దొరుకుతుందన్నది గుర్తుంచుకో. ఇప్పటివరకు దారిలో నువ్వు నేర్చుకున్నదంతా అర్థవంతంగా మారాలంటే నువ్వు నిధిని కనుక్కోవాలి. ఎడారి దాటడంలో నీకు సహాయం చేస్తాను “అని పరుశువేది అన్నాడు. నిధి కోసం అన్వేషణ కొనసాగించమంటే ఫాతిమాని విడిచి వెళ్ళాలి. నాకు ఒయాసిస్ దగ్గరే ఉండాలని ఉంది. నాకు సంబంధించినంత వరకు నిధి కంటే ఆమే ఎక్కువ.నేను ఇక్కడే ఉండి పోవాలి నిర్ణయించుకుంటే ఏమవుతుంది?. ఏమవుతుందో చెప్తాను విను అని పరుశువేది ఇలా మొదలు పెట్టాడు. నీ దగ్గర కావాల్సింది డబ్బు ఉంటుంది నువ్వు ఫాతిమాని పెళ్లి చేసుకుంటావు. మీరిద్దరూ ఒక సంవత్సరం పాటు సంతోషంగా ఉంటారు. రెండో సంవత్సరం ఎప్పుడో నీకు నిధి గుర్తొస్తుంది. నువ్వు దానిని పట్టించుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తావు. రెండో సంవత్సరంలో కూడా శకునాలు నీ నిధి గురించి జీవిత గమ్యం గురించి మాట్లాడుతుంటాయి. నీ అన్వేషణ ను తానే అడ్డుకున్నానని ఫాతిమా దుఃఖిస్తూ ఉంటుంది. ఇక నాలుగో సంవత్సరంలో సెకండ్ హాల్ చెప్పిన వినడం ఎప్పుడో మానేశారు కాబట్టి అవి నిన్ను విస్మరిస్తాయి. నీ జీవిత గమ్యాన్ని అనుసరించలేదని ఇప్పుడు సమయం మించిపోయిందని వగస్తూ శేష జీవితాన్ని గడిపేస్తావు. ఒక వ్యక్తి తన జీవన గమ్యాన్ని అనుసరించడాన్ని ప్రేమ ఎన్నటికీ ఆపదని అర్థం చేసుకోవాలి. ఒకవేళ ఆ అన్వేషణను వదిలిపెట్టారంటే అది విశ్వాసం మాట్లాడే నిజమైన ప్రేమ కాదు. మన హృదయాలను మనం ఆలకించాలి ఎందుకంటే మన హృదయమును చోటే మన నిధిని కనుక్కుంటాం. నీ కలను అన్వేషించడంలో ఇప్పటిదాకా పొందినదంతా

కోల్పోతానేమ అది భయపడడం సహజమే.బాధపడడం కంటే బాధ పడతాము అన్న భయం దారుణమైనదని నీ హృదయానికి చెప్పు. యువకుడు పిరమిడ్లకు చేరి గునుపంతో రాయి రాయి తీసి నిధి కోసం వెతుకుతూ ఉంటాడు. దొంగలు వచ్చి మీకు దొరికిన నిధిని ఇచ్చేయ మంటారు. లేదంటే నీ ప్రాణాలు తీస్తా అని అంటారు.తన దగ్గర తను తెచ్చుకున్న బంగారం మాత్రమే ఉంది. దొంగల నాయకుడు ఆ బంగారం తీసుకొని, ఇంక తన దగ్గర ఏమీ లేదని అతని ప్రాణాలతో వదిలేస్తారు. పిరమిడ్లకు చేరి నిధి లేదని తెలిసినప్పుడు, ఒక దొంగ అతని కల గురించి చెప్పి, నిధి అతను పడుకున్న చర్చి దగ్గర ఉందని బయటపడుతుంది. యువకుడు తన మోకాళ్ళ మీద పడి ఏడవసాగాడు జీవితం గమ్యం పైన తనకి గల విశ్వాసాన్ని దారిలో ఒక రాజుని ఒక వ్యాపారిని ఆంగ్లేయుడిని ఒక పరుశువేదిని పరిచయం చేసినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు. అన్నిటికి మించి మనిషిని అతని జీవిత గమ్యం నుంచి ప్రేమ దూరం చెప్పిన ఎడారి మహిళతో కలిపినందుకు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. అతడు తన జ్ఞానాన్ని కళనీ ఎవరికోసం ప్రదర్శించాల్సిన అవసరం లేదు.తన జీవిత గమ్యాన్ని సాధించుకునే క్రమంలో తాను నేర్చుకోవాల్సినదంతానేర్చుకున్నానని తాను కలగన్న వాటిని అనుభూతి చెందానని గుర్తు చేసుకున్నాడు.ఇదే నాకు గొప్ప నిధి అని. తన ప్రయాణం మొదలుపెట్టిన చోటుకే తిరిగి వెళ్ళాడు.

ఈ నవల ద్వారా ప్రతి మనిషికి జీవిత గమ్యం ఉండాలని, మనసులో గాఢంగా దాని చేరాలని కోరిక ఉంటే విశ్వం అందుకు అనుకూలిస్తుందని తెలుసుకోవచ్చు.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# మాలతీ చందూర్ - శతాబ్ది సూరీడు - స్త్రీ చైతన్యం

- డా॥. వై. ప్రవంతి
తెలుగు భాషోపాధ్యాయలు, నెల్లూరు.

మాలతీ చందూర్ 30వ దశాబ్దపు తొలి సంవత్సరంలో జన్మించారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చే నాటికి ఆమె పదిహేడేళ్ళ ఆధునిక యువతి. వ్యక్తికీ వ్యక్తి కోరికలకూ ఆ కాంక్షలకూ ప్రాధాన్యత పెరగడం, స్త్రీ పురుషులిద్దరికీ వ్యక్తులుగా గౌరవం, హుందాతనం దొరకాలనే భావాలు ఏర్పడడం, స్వేచ్ఛ, స్వతంత్రం గురించి, హక్కుల గురించి స్పృహ కలగటం, మానవుల బాధలు కేవలం వారి నుదిటి రాతలు, కర్మలే కాదని, ఆబాధలను కొన్ని ప్రక్రియల ద్వారా తొలగించుకునే అవకాశాలున్నాయనే గ్రహింపు, హేతుబద్ధతకు విలువనివ్వటం, విశాలార్థంలో మానవు లంతా సమానులనే భావన, ఈ భావనలకు అడ్డువచ్చే సంప్రదాయాలను, ఆచారాలను నిరశించడం వీటన్నిటినీ స్థూలంగా ఆధునికతగా చెప్పుకోవచ్చు. ఈ ఆధునికతకు 19 వశతాబ్దిలో మనదేశంలో బీజాలు పడి క్రమంగా బలపడసాగింది.

మాలతీ చందూర్ మంచి పాఠకురాలు, పుస్తకా పఠనం ఆమెకు వ్యసనం. ఆ వ్యసనం ఎంత తార స్థాయిలో ఆమెకు ఒంట బట్టిందంటే మొత్తం తెలుగు వారందరికీ ఆ వ్యసనాన్ని అంటించాలని ప్రయత్నించి దావిడ తాగండి తాగండి ఈ సాహిత్యాన్నుతా అనేక జీవితానుభవాలను పిండి, ఫర్మెంట్ చేసి వడకట్టిన జీవనామృతం ఇది. ఒక్కసారి తాగితే ఒదిలి పెట్టరు అంటూ ఆ రుచిని పరిచయం చెయ్యటానికి మాలతీ చందూర్ నడుంకట్టుకున్నది. ఆ ప్రపంచ సాహిత్య పఠనం ఆమెలోని రచయిత్రికి తొలి పాఠాలు నేర్పింది.

50వ దశాబ్దంలో విద్యా, ఉద్యోగ రంగాలలోకి అడుగుపెడుతున్న యువతలకు, యువకులకు ఎన్నో సందేహాలు ఇళ్ళు దాటి పాత సంప్రదాయాలు ఒదిలి, కొత్తవాటిని అందుకోవాలో తెలియని అయోమయంలో ఉండేది. స్వాతంత్ర్య సాధన గురించి వారికి ఆ స్పష్టత లేదు. కానీ దేశం స్వతంత్ర్యమయ్యాక వారికెన్నో ఆశలు అభివృద్ధికి, ఆధునికతకూ ఎన్నో నిర్వచనాలు, జీవితాన్ని మార్చుకోవాలనీ, తీర్చొదిద్దుకోవాలనీ తపనలు.

మాలతీ చందూర్ నవలా సాహిత్యమంతా చదివి ఎమిటీవిడ నవలల సారాంశం? మాలతీ చందూర్ ఈ నవలల ద్వారా ఏ సాహిత్య ప్రయోజనాన్ని ఆశించారు? ఏ ముఖ్యమైన అంశాలకు చర్చకు పెట్టారు? పాఠకులకు ఎలాంటి చూపును అందించదల్చుకున్నారు అని ప్రశ్నించి కుంటే మనకు అనేక విషయాలు అర్థమవుతాయి. ఆమె రాసిన నవలలన్నింటిలో వాస్తవ జీవితం, ఆధునిక దృష్టి, పాత సంప్రదాయాల నిరసన, కొత్త దారులలో నడిచేవారి జీవితాలలో వచ్చే సమస్యల పట్ల సానుభూతి, స్త్రీల

సమస్యలను ఆధునిక దృష్టితో పరిశీలించడం కుటుంబ సంబంధాల దోపిడీ, ఇరుకు తనాలను ప్రశ్నించటం, వివిధ జీవన సందర్భాలలో చిక్కుకున్న పాత్రల మానసిక విశ్లేషణ, ఇలా ఎన్నో అంశాలు మన దృష్టికి, మనం పెద్దగా కష్టపడకుండానే కనిపిస్తాయి. ఇంకొంచెం లోతుకు వెళ్ళి చూస్తే ఆమె నవలలన్నింటినీ ఆవరించి ఒక పునాదిలా ఉండిన సామాన్యమైన అంశం ఒకటుంది.

చలం తర్వాత స్త్రీలపై వివిధ రూపాలలో జరిగే హింసను యింత విస్తృతంగా రాసిన రచయితలు తక్కువ. ఎక్కువ మంది రచయిత్రులు కుటుంబ హింసను గురించి రాశారు. మాలతీ చందూర్ సాహిత్యం ఇవాల్టి సామాజిక అవసరం ఇంకా చెప్పాలంటే అత్యవసరం.

మాలతీ చందూర్ 'శతాబ్ది సూరీడు'లో అసామాన్యమైన పని చేశారు. ఆమె చరిత్ర హీనులను చరిత్ర నిర్మాతలుగా చూపారు. మామూలుగా చూసే ఇందులోని సూరమ్మ పాత్ర ఎవరు ఎవరు చరిత్ర నిర్మాత అని ఎవరూ అనరు. అనుకోరు.

సమాజంలోని ఎంతోమంది బాల వితంతువులలో సూరమ్మ ఒకతి. ఆమె చరిత్ర నిర్మాత ఏమిటని, ఏం చరిత్ర నిర్మించింది ఈ సూరమ్మ అని ఆశ్చర్యపోయేవారు, నవ్వేవారు ఉండొచ్చు. కానీ తన జీవితంలో సూరమ్మ తీసుకున్న ఒకటి రెండు నిర్ణయాలు, ఆమెను ఒక నిర్జీవ పరాధీన బాల వితంతువు స్థానం నుంచి ఒక ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. అందువల్లే ఆమె కథానాయిక కాగలిగింది. ఆమె పుట్టుకతో నవల ప్రారంభమై ఆమె మరణంతో సమాప్తమైంది. ఈ మధ్యకాలంలో జరిగిన ఈ నవలలోని కథను స్థూలంగా చెప్పుకుంటేగాని ఒంటరి స్త్రీలు నిర్మించిన సామూహిక చైతన్యం మనం పూర్తిగా అర్థం చేసుకోలేము.

సూరమ్మ బాల వితంతువు. ముగ్గురన్నలు నలుగురు అక్కలు ఉన్న పెద్ద కుటుంబంలో పుట్టి కూడా తను దిక్కులేనిదాన్ని అనుకునే స్థితిలోకి నెట్టబడుతుంది. చివరి అన్న-బుల్లి అన్నయ్య అని సూరమ్మ పిల్చుకునే-రామ చంద్రయ్యకు ఉన్న సానుభూతి తప్ప సూరమ్మకు మరో ఆధారం లేదు. సూరమ్మ ఆ ఆధారాన్నే పట్టుకుంది. తన చిన్నక్క మనవరాలు తల్లిని మింగి పుట్టిందనే నిందతో నిర్లక్ష్యం చేయబడి, దాదాపు చంపబడుతున్న పరిస్థితిలో సూరమ్మ ఆ పిల్లను బతికించి పెంచుకుంటుంది. ఆ పిల్ల ఆధారంతో తనకంటూ ఒక జీవితాన్ని ఏర్పరుచుకుంటుంది. ఆ పిల్ల కమల. చదువుకుంటున్న కమలకు స్వంత అమ్మమ్మ తన కొడుకునిచ్చి పెళ్ళి చేయాలని పట్టుబడుతుంది. ఆ పెళ్ళికొడుకు సత్యం అప్రయోజకుడూ, వ్యసనపరుడు అని తెలిసినా బంధువుల మాట తీసెయ్యలేక సూరమ్మ కమల పెళ్ళి చేస్తుంది. కమలకు వైవాహిక జీవితం తొలి రోజుల్లోనే, బాధను కోపాన్ని మిగులుస్తుంది. కూతురు పుట్టాక సత్యంతో చట్టబద్ధంగా కాకపోయినా తెగదెంపులు చేసుకుంటుంది కమల. తను మళ్ళీచదువు ప్రారంభించి టీచర్ గా ఉద్యోగం చేస్తూ కూతుర్ని చదివిస్తూ, స్వంత అమ్మమ్మను, సూరమ్మను చూసుకుంటూ స్థిమితంగా బతుకుతుంటుంది. సత్యం ఆస్తి పోగొట్టుకుని, ఏ దిక్కూలేక తన పంచనే చేరితే, విముఖంగానే అయినా యింత తిండి తిని, ఓ మూల పడుకునే అవకాశం ఇస్తుంది. కూతురు పద్మను లెక్చరర్ గా చేసి అనుకూలవంతుడైన యువకునితో వివాహం జరిపిస్తుంది. కూతురు, అల్లుడు వేరుగా వెళ్ళి, స్వంత అమ్మమ్మ చనిపోయి, సత్యం చనిపోయిన తర్వాత కమలకు జీవితం పట్ల ఒక నిరాసక్తత యేర్పడుతుంది. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకుని మరణిస్తుంది. సూరమ్మ ఒక్కొక్కరు మరణించినపుడు మళ్ళీ మళ్ళీ ఒంటరి దవుతుంటుంది. కమల పోయాక పద్మ సూరమ్మను తనతో తీసుకుపోతుంది. పద్మ ఉద్యోగస్తురాలు. పూర్తిగా న్యూక్లియర్ కుటుంబానికి అలవాటుపడ్డ ఇద్దరు పిల్లలు. సూరమ్మ వృద్ధాప్యపు చాపల్యాన్ని, అస్థిమితాన్ని, మానసిక అస్థిరతనూ పద్మ మోయలేక పోతుంది. తన ఆరోగ్యం శిధిలమవుతుంటే, విశ్రాంతి కోసం ఒక నెల రోజులు సూరమ్మను వృద్ధాశ్రమంలో ఉంచి తన కుటుంబంతో శలవలు గడపటానికి వెళ్తుంది. తిరిగి వచ్చి సూరమ్మను తెచ్చుకుందామని వెళ్తే అంతకు ముందు రోజే ఆమె చనిపోయిందని దహన క్రియలు కూడా అయిపోయాయని తెలిసి అపరాధ భావనకు లోనవుతుంది. తనకు ఎవరూ

లేరని, తనవారిని ఏర్పరుచుకోవాలని తాపత్రయ పడిన సూరమ్మ, తన ఊరు కాని చోట, తనవారెవరూ లేకుండా ఒంటరిగానే మరణిస్తుంది. వందేళ్ళ క్రితం తన ఇష్టా యిష్టాలతో ప్రమేయం లేకుండా సూరమ్మ ప్రారంభించిన జీవన పోరాటం ముగిసింది. పద్మకూతురు తన ఇష్ట ప్రకారం ఉన్నత విద్య కోసం ఒంటరిగా అమెరికా ప్రయాణం మొదలు పెడుతుంది. తనవారిని, తన దేశాన్ని ఒదిలి ఒంటరిగా మొదలెట్టిన సౌజన్య జీవితం బహుశ రాబోయే యాభై సంవత్సరాలలో ఉన్నత వర్గాల స్త్రీల చరిత్ర కావచ్చు. ఇది స్థూల కథ మాత్రమే. ఇందులో సూరమ్మ చిన్నక్క, కమల, పద్మ అనుభవించిన వ్యథ, బాధ, ఆనందం, వాళ్ళలో వచ్చిన మార్పులు, మారినట్లు కన్పించినా మారని జీవితాలు ఎన్నో ఉన్నాయి. శిధిల మవుతున్న గత కాలపు భూస్వామ్య భావజాల జీవితం, చిగురెత్తుతున్న ఆధునిక భావజాలపు సంధి కాలపు జీవితం, ఆ రెండింటి సంఘర్షణ, వర్తమాన జీవితంలోని మారీ మారని జీవితాలు, ఈ మూడు తరాల సామాజిక చరిత్ర ఈ నవలలో ఉంది. మామూలు చరిత్ర గ్రంథం ఉద్యమాలనూ, పోరాటాలనూ, పాలకవర్గాల జయాప జయాలనే వివరిస్తుంది. ఇళ్ళల్లో నాలుగు గోడల మధ్య సామాన్య స్త్రీలు నిశ్శబ్దంగా ఉన్నట్లు కనపడుతూ వంట, ఇంటి చాకిరి మాత్రమే చేస్తున్నట్లు కనపడుతూ చేసే తిరుగుబాట్లనూ, సృష్టించే అలజడులను వివరించదు. ప్రముఖ బెంగాలీ రచయిత్రీ ఆశాపూర్ణదేవి అన్నట్లు నాలుగు గోడల మధ్య ఎంతో జరుగుతుంది. స్త్రీ విముక్తి కోసం రాతి నేలను చీల్చుకొచ్చే బీజం యొక్క కఠోర ప్రయత్నం రాతి గోడల మధ్యే మొదలవుతుంది. ఆ ఒంటరి విముక్తి పోరాటాలలో వచ్చే నిరాశ, నిస్పృహ, ఆగ్రహం, పిచ్చితనం అన్నీ నాలుగు గోడల మధ్యనే జరుగుతాయి. ఈ నాలుగు గోడల మధ్య నడిచిన చరిత్రే 'శతాబ్ది సూరీడు'.

ఈ నవలలో మాలతీ చందూర్ ముఖ్యంగా చెప్పిన విషయాలు, మనల్ని కదిలించి ఆలోచింప చేసే విషయాలు ఇవి.

1. బాల్య వివాహాలు, బాల వితంతువుల పరిస్థితి, వారిపై జరిగే హింస, లైంగికత్వపు కంట్రోలు, శ్రమ దోపిడి.
2. స్త్రీల ఆస్తీ, వనరులు, వారి నిర్ణయాధికారాన్ని ప్రభావితం చేసే తీరు.
3. విద్యవల్ల, స్వార్జితమైన సంపాదన వల్లా స్త్రీల జీవితాలలో వచ్చే మార్పులు, జరిగే అభివృద్ధి.
4. వృద్ధాప్య సమస్యలు.

నవలలో ఒక్కొక్క విషయాన్ని రచయిత్రి ఎలా విప్పుకుంటూ వెళ్ళారో చూస్తే గాని ఆ సమస్యలన్నిటికి ఒకదానితో మరొకదానికి ఉన్న సంబంధం, వాటి లోతూ మనకు అర్థం కాదు.

బాల వితంతువుల పరిస్థితి తెలుసనుకుంటాం గానీ ఒక వ్యక్తిగా ప్రతి నిమిషం ఆమె పడే బాధను యింత వివరంగా చిత్రించిన నవలలు అరుదనే చెప్పాలి. శ్రీపాద వారి 'ఆత్మబలి'లో కథానాయిక బాల వితంతువు కాదు. 'అరికాళ్ళ కింది మంటలు', కథలో కొంత మనకు అర్థమవుతుంది. కన్యాశుల్కంలో బుచ్చెమ్మ బాల్యం గడిచి యవ్వనంలోకి ప్రవేశించిన తర్వాతే మనకు తెలుసు. అగ్నిహోత్రావధానులు ఎంత ఛాందసుడైనా బుచ్చెమ్మ జుట్టు తీయించే పని తలపెట్ట లేదు. వితంతువుల పరిస్థితి గురించి సంఘ సంస్కర్త, స్త్రీ విద్యా వ్యాప్తికి కృషిచేసిన జ్యోతిబా పూలే ఇలా రాశారు. "భర్త చనిపోయిన తర్వాత యవ్వనవతీ, రూపవతీ అయిన అతని భార్యను ఈ ఆర్య సామాజిక వ్యవస్థ తిరిగి వివాహం చేసుకోనివ్వదు. ఆమె ఆభరణాలన్నీ ఒలిచివేస్తారు. దగ్గరి బంధువులే బల వంతంగా గుండు చేయిస్తారు. ఆమెకు సరిపోయినంత తిండి పెట్టరు. సరైన బట్టలు కట్టుకోనివ్వరు. విందు వినోదాల్లో పాల్గొనటానికి అనుమతించరు. వివాహాలకు, మత కర్మ కాండలకూ రానివ్వరు. నిజానికి ఆమె అన్ని ప్రాపంచిక సుఖ సంతోషాలకూ దూరమవుతుంది. ఆమెను నేరగాళ్ళ కంటే హీనంగా ఒక క్షుద్ర జంతువులా చూస్తారు."

ఇది బాల వితంతువులకు మరింత క్రూరంగా, అమానుషంగా వస్తుంది. శతాబ్ది సూరీడు నవలలో సూరమ్మ రజస్వల కాకముందే వివాహం, వైధవ్యం రెండూ జరిగిపోయాయి. తనంటూ ఆలోచించే వయసు వచ్చేసరికి

తనంటూ లేకుండా ధ్వంసం చేయబడింది సూరమ్మ. బాల వితంతువుగా సూరమ్మ జీవితాన్ని చదువుతుంటే అది ఆమె ఒక్కదాని జీవితం కాదని మనకు అర్థమవు తుంది. వేలాదిమంది బాల వితంతువులు మన కళ్ళ ముందు ప్రత్యక్ష్యమవుతారు. "బయటికెళ్ళకు. పొద్దున్నే వదినలకు కనబడకు. ఆ రంగు పరికిణీలు కట్టుకోకు" ఇలా ఒక్కో కట్టుబాటూ ఒక్కో ఇనప గొలుసులా సూరమ్మ శరీరాన్ని, మనసుని చుట్టుకుంటాయి. గా అమలులోకి "రోజూ తలదువ్వుకోవటం తప్పని ఎవరూ చెప్పకపోయినా సూరీడుకి జుట్టు ముడి విప్పాలంటే ఏదో భయంగా ఉంది. రెండు రోజుల కొకసారి దొడ్డి వైపుకి వెళ్ళి చిక్కు తీసుకుని జడవేసుకుని ముడి పెట్టుకుంటుండేది.

"ఒక రోజున తలకి నూనె రాసుకుంటుంటే చిన్న వదిన కంటబడింది. "ఇదో ఖర్చా. ఎవరి కోసం ఆ షోకులు? ఎవరు సంతోషించాలని. కుంకుడు కాయలు, నూనె, యిదో దండగా..... ఏదో చిన్నపిల్ల అని ఊరుకుంటుంటే" ఇవన్నీ పదీ పన్నెండేళ్ళ విధవ ఆడపడుచు గురించి వదిన అనే మాటలు. ఆడవాళ్ళ చేత తమ తోటి ఆడవాళ్ళని, తమ చెల్లెళ్ళ వంటి, కూతుళ్ళ వంటి ఆడపిల్లలనూ యిలా హింసింపజేయగల వ్యవస్థ ఎంత రాక్షసమైనదై ఉండాలి. అన్నలు ఒకరోజు ఆ చిన్న చెల్లెల్ని గోదావరి నదీ తీరానికి తీసికెళ్ళి ఆమె పొడవాటి జుట్టును కత్తిరించేసి నున్నగా బోడిగుండు చేయిస్తారు. సూరమ్మ ఏడ్చి ఏడ్చి విరుచుకు పడిపోతే బండిలో వేసుకొస్తారు.

తనకంటూ ఏమీ లేదు. మొగుడు లేడు. సంసారం లేదు. పిల్లలు లేరు. నోములు లేవు. వ్రతాలు లేవు. పండుగలు లేవు. పువ్వులు లేవు. ఏమీ లేవు. పని ఒక్కటి తప్ప తనకేమీ లేదు. పని, పని. తెల్లవారి లేచింది మొదలు చాకిరి, తిట్లూ సాధింపులు ఇవే తనకి స్వంతం. చీకటి గది. దొడ్లోని మట్టి అరుగు. ఇవే తన స్వంతాలు" ఇట్లాంటి బతుకీడుస్తున్న సూరమ్మకు మామగారింటినించి పిలుపొచ్చింది. పన్నెండేళ్ళ సూరమ్మ ఏడేళ్ళ పిల్లవాడిని దత్తత చేసుకోవాలని మామగారి కోరిక. అట్లా చేసుకుంటే ఇక సూరమ్మ మనోవర్తి అని అడగకుండా మామగారింట్లో చాకిరి చేసుకుంటూ పడి ఉంటుంది. ఆ దత్తత సూరమ్మ కాకుండ మామ చేసుకుంటే సూరమ్మకు కొంత సుఖ సంతోషాలకూ దూరమవుతుంది. ఆమెను నేరగాళ్ళ కంటే హీనంగా ఒక క్షుద్ర జంతువులా చూస్తారు."

ఇది బాల వితంతువులకు మరింత క్రూరంగా, అమా నుషంగా వస్తుంది. శతాబ్ది సూరీడు నవలలో సూరమ్మ రజస్వల కాకముందే వివాహం, వైధవ్యం రెండూ జరిగి పోయాయి. తనంటూ ఆలోచించే వయసు వచ్చేసరికి తనంటూ లేకుండా ధ్వంసం చేయబడింది సూరమ్మ. బాల వితంతువుగా సూరమ్మ జీవితాన్ని చదువుతుంటే అది ఆమె ఒక్కదాని జీవితం కాదని మనకు అర్థమవు తుంది. వేలాదిమంది బాల వితంతువులు మన కళ్ళ ముందు ప్రత్యక్ష్యమవుతారు. "బయటికెళ్ళకు. పొద్దున్నే వదినలకు కనబడకు. ఆ రంగు పరికిణీలు కట్టుకోకు" ఇలా ఒక్కో కట్టుబాటూ ఒక్కో ఇనప గొలుసులా సూరమ్మ శరీరాన్ని, మనసుని చుట్టుకుంటాయి.

"రోజూ తలదువ్వుకోవటం తప్పని ఎవరూ చెప్పక పోయినా సూరీడుకి జుట్టు ముడి విప్పాలంటే ఏదో భయంగా ఉంది. రెండు రోజుల కొకసారి దొడ్డి వైపుకి వెళ్ళి చిక్కు తీసుకుని జడవేసుకుని ముడి పెట్టు కుంటుండేది.

సూరమ్మ ధోరణి గమనించి భయపడి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ నవలలో సూరమ్మకు మామ మాత్రమే ఉన్నాడు. బావగార్లు ఉండుంటే ఆమెకు అక్కడి నుంచి బైటపడటం చాలా కష్టమయ్యేది. పుట్టింటి వాళ్ళు తిట్టినా నోరెత్తి మామ సంగతి చెప్పలేదు. పైగా మామ తను మంచిది కాదనీ, పోకిరి వేషాలు వేస్తుందనీ చెబితే కూడా నోరెత్తకుండా విన్నది. నోరెత్తే సాహసం సూరమ్మకు లేదు. పుట్టింటికి వచ్చాక ఇక సూరమ్మ 1 ఇంటికీ, అక్కల, అన్నల ఇళ్ళకు, ఇతర బంధువుల ఇళ్ళకూ వెట్టి చాకిరికి అంకితమైంది. ఎవరింటో శుభకార్యం జరిగినా, అశు భకార్యం జరిగినా చాకిరీ చెయ్యటానికి సూరమ్మే కావాలి. రానంటే తిట్లు. వెళ్తే చాకిరికి తోడు అవమానాలు, నిర్లక్ష్యం, నిరాదరణ. ఇవన్నీ సూరమ్మ నోరెత్తకుండా భరించింది.

ఈ నవలలో అతి క్లుప్తంగా సూచన ప్రాయంగా చెప్పినప్పటికీ 19వ శతాబ్దంలో స్త్రీల పై జరిగిన హింస

లలో అతి దారుణమైన ఆడ శిశువుల హత్య ప్రస్తావనకు వచ్చింది. దీని గురించి పైకి మాట్లాడకపోయినప్పటికీ, ఉత్తరభారత దేశంలో, తమిళనాడులోవలే బహిరంగంగా జరగకపోయినప్పటికీ, ఆంధ్రదేశంలో కూడ ఆడ శిశువుల నిరాదరణ, వాళ్ళ ఆరోగ్యం మీద చూపే నిర్లక్ష్యం వలన ఆడ శిశు మరణాలు చాలా ఎక్కువగానే ఉండేవి. ఈ నవలలో కమల అలాంటి ప్రమాదం నుంచి తప్పించుకుంది. కమల సూరమ్మ చిన్నక్క మనమరాలు. కమలను కన్న వెంటనే తల్లి కావమ్మ చనిపోయింది. ఇక ఆ పిల్ల ఎవరికీ అక్కర్లేనిదయింది. కావమ్మ అత్తగారు ఆ పిల్లతో తమకేం సంబంధం లేదని తేల్చి చెప్పేశారు. "మా కోడలే పోయినప్పుడు ఈ పిల్ల మాకెందుకు? తల్లిని మింగిన దౌర్భాగ్యురాలు. పోనీ మగపిల్లాడయితే వంశాంకురం అని కష్టపడి పెంచేదాన్ని. ఈ ఆడపిల్లని మేమేం చేసుకుంటాం? రేపు వాడు పెళ్ళి చేసుకునేందుకు లేకుండా ఇదో అడ్డు" అంటుంది కావమ్మ అత్త.

కావమ్మ తల్లి, సూరమ్మ ఆ పిల్లను పెంచుకుంటానంటే అంటుంది "నెల రోజుల పసిదానికి పాలడబ్బా తెమ్మంటే మీ బావ ఎన్ని మాట్లన్నారు?....... ఇది ఆడపిల్లట చచ్చినా ఫరవాలేదట. మొగపిల్లాడయితే ఎంత కష్టం అయినా పెంచేవారుట."

"అసలు నువ్వు పెంచుకోబట్టి యిది యీ మాత్రంగా ఉంది. మీ బావ అయితే ఏ కాలవలోకో విసిరేసి వుండేవారు." సూరమ్మ లేకపోతే, కావమ్మ కాన్పుకి రాకపోతే, ఆ పిల్లమీద యేదో మమకారం యేర్పడకపోతే, కమల పేరులేని మృత శిశువుగా ఏ కాలవలోనో, చెత్త కుప్పలోనో పడి ఉండేది. ఆ రోజుల్లో యిప్పటిలా వార్తా పత్రికలు లేవుగానీ వుంటే "కసాయి తల్లి చేసిన ఘాతుకమని" వార్త వచ్చేది. చచ్చిపోయిన తల్లులనూ, ఏ అధికారము లేని తల్లులనూ, యిలాంటి వాటికి బాధ్యుల్ని చేసి తాను అపరాధ భావన నుండి బైట పడటం నేర్చుకుందీ పురుషాధిక్య సమాజం. ఆడ శిశువులు బతికి బట్ట కట్టటమనేది 19వ శతాబ్దంలోని భారతదేశంలో పెద్ద సమస్యగానే ఉంది. కాలవలో పారెయ్యటమనేది మాట వరసకు అన్నమాట కాదు. పండిత రమాబాయి ఈ విషయం గురించి రాసిన వాక్యాలు చదివితే భారత దేశంలో ఈ సమస్య తీవ్రత మనకు అర్థమవుతుంది.

"1870 లెక్కలు ఒక ఆసక్తి కరమైన వాస్తవాన్ని తెలియజేశాయి. అమృతసర్ నగరంలో ఒక సంవత్సరంలో 300 మంది పిల్లలని తోడేళ్ళు ఎత్తుకుపోయాయి. ఆ పిల్లలందరూ ఆడపిల్లలే. చివరకు క్రూర మృగాలు కూడా అతి తెలివిగా, మంచి రుచి మరిగి బ్రిటీష్ చట్టాన్ని పరిహాసం చేస్తున్నాయి. తమ ఆకలి తీర్చుకునేందుకు అవి ఆడ పిల్లలనే దొంగిలిస్తున్నాయి." ప్రాంతాన్ని బట్టి పద్ధతులు. ఆడపిల్లల హత్య ఆ నాటి నుంచీ ఈనాటి వరకూ కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు సైన్సు పురోగమనంతో పుట్టిన బిడ్డను క్రూరంగా చంపటాన్నించి బైటపడి, లింగ నిర్ధారణ పరిక్షల్లో తేల్చుకుని పిండ రూపంలోనే చంపుతున్నారు. బతకటమే కష్టం, బతికి బట్ట కడితే బాల్య వివాహాలతో దారీ తెన్నూ లేని జీవితం, చాకిరితో శిధిలమయ్యే శరీరాలు-ఇది వంద సంవత్సరాల నాటి స్త్రీల పరిస్థితి. దీనిని మాలతీచందూర్ చాలా స్పష్టంగా, సంప్రదాయాల పట్ల యెటువంటి మొగ్గూ చూపించకుండా రాశారు. హైమవతీసేన్ "హిందూ సమాజమా సిగ్గుతో చచ్చిపో" అని రాస్తే మాలతీచందూర్ ఒకప్పటి సమాజాన్ని గురించి మనం సిగ్గుపడేలా, ఇప్పటి మన స్థితి గురించి ఆలోచించుకునేలా రాశారు.

అతి దుర్భరమైన పరిస్థితులనుండి బైటపడటానికి ఆనాటి స్త్రీలు దొరికిన ప్రతి చిన్న ఆధారాన్నీ పట్టుకున్నారు. మామగారింటి నుంచి బైటపడటానికి సూరమ్మకున్న ఆధారం బుల్లి అన్నయ్య నేర్పిన అక్షరాలు, మామగారింట్లో దిగబెడుతూ చేతిలో పెట్టిన కార్డు, పెన్సిల్. సమయానికి అవి తన చేతిలో ఉండటం వల్ల సూరమ్మ ఉత్తరం రాయగలిగింది. ఉత్తరం రాయాలనే నిర్ణయం తీసుకోవటం కూడా తేలిక కాదు. పుట్టింట్లో ఆమెకెలాంటి ఆదరణా లేదు. కష్టమో సుఖామో, నరకమో ఇక్కడే పడి వుందామని అనుకునే స్త్రీలు ఎంతమందో. సూరమ్మ ఉత్తరం రాయటమనే చిన్న నిర్ణయం వల్ల, సూరమ్మకూ, చదివే పాఠకులకూ అంత ప్రాధాన్యత లేనిదిగా కనిపించే నిర్ణయం వల్ల, ఆమె జీవితంలో కీలకమైన మార్పు

వచ్చింది. ఆమెకు లైంగిక హింస నుండి విముక్తి లభించింది. నిర్ణయాధికారమనేది చాలా పెద్ద మాటగా కనిపిస్తుంది గానీ స్త్రీలు తమ గురించి తీసుకునే ప్రతి నిర్ణయమూ వాళ్ళ జీవితాలలో ఎంతోకొంత మార్పు తీసుకొస్తుంది. విషయమేమిటంటే చాలాసార్లు స్త్రీలు ఆ చిన్న నిర్ణయాలు కూడా తీసుకోరు. దానికి ఒక కారణం నిర్ణయాలు తీసుకునే మానసిక శక్తిని వాళ్ళ పరాధీనత హరించి వేస్తుంది. తమ జీవితాలకి తాము కర్తలం కాదని వారు నమ్మేవరకూ కుటుంబ వ్యవస్థ వారిని కంట్రోలు చేస్తుంది. ఇంకొక ముఖ్యమైన కారణం, అతి చిన్న నిర్ణయం తీసుకోవటానికి కావలసిన అతి తక్కువ వనరులు కూడా స్త్రీల దగ్గర వుండవు. ముందే చెప్పుకున్నట్లు ఉత్తరం రాయటానికి నాలుగక్షరమ్ముక్కలు రాకపోతే, కార్డు పెన్సిలు అందుబాటులో లేకపోతే, సూరమ్మ నిర్ణయించుకోలేక పోయేది. మనసులో కోరిక వున్నా అది ఆచరణలో సాధ్యమయ్యేది కాదు. కానీ గత శతాబ్దంలోని స్త్రీలు ఎక్కడ నుంచి చిన్న వెలుతురు చార కనిపించినా ఆ దిక్కుని పట్టుకున్నారు. వంటింటి మసి గోడలను అక్షరాలు నేర్చుకోటానికి వినియోగించుకున్నారంటే వారి తపన ఎంత తీవ్రమైందో మనం తెలుసుకోవచ్చు.

సూరమ్మ తీసుకున్న మరొక నిర్ణయం తన చిన్నక్క మనవరాలు కమలను పెంచుకుందామని చేసిన ఆలోచన. పురుటి చాకిరీ చేయటానికి వచ్చిన సూరమ్మ ఆ అనాథ శిశువును అక్కున చేర్చుకుంది. పదిరోజులు ఆ పిల్లకు పాలూ, నీళ్ళూ చూసేసరికి మమకారం పుట్టుకొచ్చి ఆ పిల్లను తాను పెంచుకుంటానని అడిగింది. పెంచుకుందా మనే నిర్ణయం సూరమ్మ తనంతట తాను తీసుకున్నదే. ఆ నిర్ణయం తీసుకోటానికి ఆమెకున్న వనరు ఆమె మామ ఇచ్చిన రెండు వేల రూపాయల మనోవర్తిని బుల్లి అన్నయ్య నిర్వహిస్తున్న తీరు. తన కంటూ కొంత ఆధారం ఉందనే ఆలోచన వల్లే సూరమ్మ ఈ నిర్ణయం తీసుకుంది. అప్పటినుంచీ కమల పెళ్ళయ్యే వరకూ సూరమ్మ జీవితం హాయిగానే గడిచింది. తన జీవితానికో ప్రయోజనం ఉందనే నమ్మకం ఆమెకు శక్తినీ, సంతోషాన్ని ఇచ్చింది. ఒక ప్రాణిని కాపాడగలిగాననే గ్రహింపు ఎంతో ఉత్సాహాన్నిచ్చి ఉండాలి. ఆ ధైర్యంతోనే యిక ఆమె యితరులెవరినీ పట్టించుకోలేదు. తనకంటూ చిన్న ఇల్లు, చిన్న పాప, అజమాయిషీ చేసేవారు లేరు, ఆర్థిక యిబ్బందులూ లేవు. కమల పెంపకం, కమలకు అన్ని ముచ్చట్లూ జరిపించటం వీటిలో తన సార్థకతను చూసుకుంది. కమల పెళ్ళి జరిగే వరకూ సూరమ్మ అనుభవించిన జీవితం చాలా సాఫీయైన మంచి జీవితం.

కమల పెళ్ళి సూరమ్మ నిర్ణయం కాదు. సూరమ్మకు ఆ పెళ్ళి అసలిష్టం లేదు. చిన్నక్క తన కొడుకు సత్యాన్ని మనవరాలు కమలకిచ్చి చెయ్యాలనుకుంది. సత్యం జులాయి. చదువు సంధ్యా లేకుండా తిరుగుతున్నాడు. చెడు అలవాట్లు నేర్చుకుంటున్నాడు. ఇదంతా సూరమ్మకి తెలుసు. అందుకే ఆ పెళ్ళి జరపకూడదని అక్కతో వాదించింది గానీ చివరకు లొంగిపోయింది. ఆ లొంగుబాటు వల్ల సూరమ్మ జీవితంలో, కమల జీవితంలో ఆనందం హరించుకు పోయింది. కమలది రజస్వలానంతర వివాహమేగానీ బాల్య వివాహమే. సూరమ్మకు బాల్య వివాహాల మీద తన జీవితానుభవం వల్ల కూడా విముఖత రాలేదు. సూరమ్మ గతి చూసిన చిన్నక్కకూ, బుల్లన్నయ్యకూ కూడా కమలకు అంత చిన్న వయసులో పెళ్ళేమిటనే ఆలోచన రాలేదు. కర్మ సిద్ధాంతం సంప్రదాయాలకు బలాన్నీ, స్థిరత్వాన్నీ ఇస్తుంది. అది సూరమ్మ కర్మ. కమలకలా ఎందుకు జరుగుతుంది అనుకుంటారు. అంటే కమల పెళ్ళి నాటికి కూడా బాల్య వివాహాలు కూడదనే ఆలోచన సమాజంలో రాలేదన్న మాట.

కమలకు పెళ్ళికాకముందు తనంతట తాను నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం రాలేదు. తనకే కష్టం లేకుండా సూరమ్మ చూస్తోంది. తోటి పిల్లల కంటే కాస్త పై స్థాయిలోనే పెరిగింది. పెళ్ళి కూడా బాగానే చేశారు. ఐతే ఆ పెళ్ళి అంటే యేమిటో కమలకు క్రమంగా కాని అర్థం కాలేదు. పెళ్ళి నాటికి కమలకు తన మంచి చెడ్డలకు తనే బాధ్యత వహించాలనే విషయం తెలియదు. తెలిసే వయసు కాదు. పెళ్ళయి ఒక పిల్లకు తల్లయి ఆ పిల్ల మంచి చెడ్డలు చూసుకోవాల్సిన బాధ్యత నెత్తినపడి, తన

భర్తకు అంతకుముందే పెళ్ళియిందనీ, ఇద్దరు పిల్లలున్నారనే కఠిన వాస్తవం తెలిసిన తర్వాత కమలకు అర్థమయింది, తన గురించి నిర్ణయించుకోవాల్సింది తను మాత్రమేనని. అది కమలకు ఎంత స్పష్టంగా, ఎవరో నెత్తిన కొట్టి చెప్పినట్టు అర్థమయిందంటే కమల చనిపోయేవరకూ తన జీవితానికి సంబంధించిన అన్ని నిర్ణయాలూ తనే తీసుకుంది. వాటి మంచి చెడ్డలకు బాధ్యత వహించింది.

సత్యం నుంచి (చట్టబద్దంగా కాకపోయినా) విడిపోవాలని నిర్ణయించుకున్నపుడు కమలకు 15,16 ఏళ్ళవయసు. 9వ తరగతి పాసైన విద్యార్థి. చేతిలో నెలల పసిపిల్ల. ఈ ఆధారాలే వున్నాయి. సత్యం నుంచి విడిపోవటాన్ని వ్యతిరేకించిన స్వంత అమ్మమ్మ దగ్గర బలగం, బంగారం ఉన్నాయి. అవి తనకు అవసరం లేదని గట్టిగా చెప్పి, ఆ సంబంధాన్ని తెంచుకుంది. ఆ తర్వాత కమల తన వనరులను పెంచుకోవటానికి పూనుకుంది. 10వ తరగతిలో చేరింది. పిల్లలకు ట్యూషన్లు చెప్పి సంపాదనలో పడింది. స్కూల్ ఫైనల్ పాసై టీచర్ ట్రైనింగు చేసి స్థిరమైన ఆదాయం వచ్చే ఉద్యోగం సంపాదించుకుంది. ఈ ఆర్థిక వనరులతో ఆమెకు అంతులేని బలం, ధైర్యం, లోకజ్ఞానం, మానవత్వం అన్నీ వచ్చాయి. వివేకాన్ని పెంచుకుంది. తన జీవితాన్ని తనే నిర్మించుకోవాలనే బాధ్యతను తీసుకోవటంతో ఆమె స్వేచ్ఛను కూడా పొందింది. స్వేచ్ఛ, బాధ్యత అనేవి ఒకే నాణానికున్న రెండు పక్కలని, యిక్కడ మనకు అర్థమవుతుంది. సూరమ్మ జీవితానికీ, కమల జీవితానికీ తేడా యిక్కడే కనపడుతుంది. సూరమ్మకు కొంత ఆస్తి ఉన్నా, దాని నిర్వహణభారం బుల్లన్నయ్యదే. సూరమ్మకు కమల పక్కలని, యిక్కడ మనకు అర్థమవుతుంది. సూరమ్మ జీవితానికీ, కమల జీవితానికీ తేడా యిక్కడే కనపడుతుంది. సూరమ్మకు కొంత ఆస్తి ఉన్నా, దాని నిర్వహణభారం బుల్లన్నయ్యదే. సూరమ్మకు కమల పెంపకంలోనే, ఆ పిల్ల బాధ్యత తనమీద ఉన్నంతవరకే అంతో యింతో స్వేచ్ఛ. ఆ బాధ్యతను సత్యం చేతిలో పెట్టాక ఆమె స్వేచ్ఛ హరించుకు పోయింది. సత్యం అల్లుడిగా ఇంటికి రావటం మొదలయ్యాక "సత్యం యింట్లో వుంటే దొడ్డి వాకిలివైపు వెళ్ళి కూచునేది. పద్దెనిమిదేళ్ళయింది దొడ్డి వాకిలి వైపు కూచోటం మర్చిపోయి. మళ్ళీ సత్యం వచ్చాక తను దొడ్లో తప్పించుకు తిరగవలసి వస్తుంది."

ఐతే పద్మ కష్టం ఆమె వ్యక్తిగత కష్టమే కాదు గాబట్టి ఆ సమస్య గురించి కొంచెం లోతుగా ఆలోచించాలి. ఆలోచించాలనే ఉద్దేశంతోనే మాలతీ చందూర్ నవల చివరి భాగంలో ఆ సమస్యను వివరంగా చిత్రించారు. ఇవాళ వృద్ధాప్యం ఒక సామాజిక సమస్యగా పెద్ద ఎత్తున ముందుకొస్తోంది. మనిషి జీవన కాలం పెరిగింది. వందేళ్ళ క్రితం అరవయ్యేళ్ళుగా ఉన్న జీవనకాలం ఇపుడు 80 ఏళ్ళకు పెరిగింది. ఇంకా పెరిగే అవకాశం ఉంది. గ్రామాలలో కూడా ఇవాళ సమిష్టి కుటుంబ వ్యవస్థ లేదు. వ్యసాయం మీద ఆధారపడే కుటుంబాలు కూడా, పిల్లల చదువుల కోసం పట్టణాలకు వస్తున్నారు. నగరాల్లో, విదేశాల్లో, ఉద్యోగాలు చేసే పిల్లల తల్లిదండ్రులు, చిన్న బస్తీలలో, గ్రామాలలో, నగరాలలో కూడా ఒంటరి జీవితం గడపాల్సి వస్తుంది. ఒక వయసుతర్వాత ఎవరి పంచన చేరక తప్పదు. పట్టణాల్లో, నగరాల్లో వృద్ధుల జీవితం ఒంటరితనంతో నిండిపోతుంది. చిన్న ఊళ్ళలో, పల్లెటూళ్ళలో వృద్ధులకు దొరికే సానుభూతి, స్నేహం, నగరాలలో దొరకదు. అందులో ఆ నగరాలకు వస్తే, జీవితం వారికి అయోమయాన్నీ, భయాన్నీ కలిగిస్తుంది. నగర నగరాల వారికర్థం కాదు. నగరం వారిని పట్టించుకోదు. నగరాలు యువతరపు పునగర కోసం, అభివృద్ధి అనే వేగం కోసం తప్పితే ఒక స్థిమితంతో, శాంతితో బతకాల్సిన వృద్ధుల కోసం కాదు.

ఇంటిల్లపాదీ ఉద్యోగాలకో, చదువులకో బైటికి వెళ్ళిపోతారు. పలకరించే వారుండరు. కబుర్లుండవు. కథలు చెప్పటానికి మనవలకు-చదువుల భారంతో-తీరికుండదు. టి.వి. ఆకర్షణలో ఈ పాతకథలమీద ఆసక్తి ఉండదు. వాళ్ళు పెద్దయ్యే కొద్దీ ముసలివాళ్ళతో ఎడం పెరుగుతూ పోతుంటుంది.

ఇలాంటి పరిస్థితిలో వృద్ధాశ్రమాల అవసరం లేదా?

తమ వయసు వారితో మాట్లాడుతూ, ఎవరికీ భారం కాకుండా ఉండటం, తనకు ఓపికున్న పనులు చేయటం, వాళ్ళకు మామూలుగా ఉత్సాహాన్ని ఇవ్వాలి. కానీ ఇప్పటికి కూడా చాలామందిలో వృద్ధాశ్రమాలంటే ఒక భయం, దిక్కూ మొక్కూలేని అనాథ జీవితం గడిపే వారుండే చోటనే భావన ఉన్నాయి. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చాలంటే పిల్లలకు అపరాధ భావన, చేరాలంటే వృద్ధులకు పిల్లల మీద కోపం, తమను దిక్కులేని వాళ్ళుగా చేశారనే కోపం, బాధ ఉంటున్నాయి. ఇది సంధి దశ గాబట్టి ఈ సమస్య నెదుర్కొంటున్నది మొదటి లేదా రెండవ తరం వాళ్ళు గాబట్టి, ఆ బాధ అపరాధ భావన తప్పక పోవచ్చు.

కానీ రాను రానూ వృద్ధులు, వారిపిల్లలూ కూడా యిదే మంచిదని అంగీకరించక తప్పని పరిస్థితి వస్తుంది. వెసులుబాటు ఉన్నవారి గురించి కాదు. వెసులుబాటు లేనివారు, అపరాధ భావనకు లోనవకుండా వృద్ధాశ్రమాలను ఆహ్వానించగలిగే పరిస్థితులు రావాలి. సూరమ్మను ఒక్క నెల వృద్ధాశ్రమంలో ఉంచటానికి ఎంతో బాధపడిన పద్మ, కాలక్రమంలో వృద్ధాశ్రమానికి వెళ్ళే పరిస్థితి రావొచ్చు. సౌజన్య అమెరికా నుంచి తిరిగి రాకపోవచ్చు. అక్కడే స్థిరపడవచ్చు. కొడుకూ అదే దారి పట్టవచ్చు. అపుడు నిశ్చింతగా వృద్ధాశ్రమంలో చేరే మానసిక శక్తి పద్మకుంటుందా అనేది అనుమానమే. పద్మ తరం దానికి కొంత తటపటాయించ వచ్చు గానీ ఆ తర్వాత తరం వాళ్ళకు ఆ తటపటాయింపు ఉండదు. ఏ వృద్ధాశ్రమాల నిర్వహణ బాగుందో సమాచారం సేకరించుకుని అక్కడికి వెళ్ళే ప్రయత్నాలు చేస్తారు వాళ్ళు.ఈ నవలలో రచయిత్రి కుటుంబ సంబంధాలను వివరంగా చిత్రించారు.

ఈ నవల ఒక సమిష్టి కుటుంబంతో ప్రారంభమై ఒక న్యూక్లియర్ కుటుంబంతో ముగుస్తుంది. సమిష్టి కుటుంబం విడివిడి కుటుంబాలుగా విడిపోవటానికి కారణాలు. ముందే చెప్పుకున్నట్లు భూమి సంబంధాలలో వచ్చే మార్పులు, పట్టణాలలో పెరిగే ఉద్యోగావకాశాలు. భారతీయ సమాజం కుటుంబానికి చాలా విలువ యిస్తుందని చాలామంది అనుకుంటారు. కుటుంబంలో ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు త్యాగాలూ వీటి గురించి యెంతో మిత్, యెన్నో భ్రమలు పోగుపడి వున్నాయి. వీటిలో నిజమెంత, భ్రమలెంత, అని తెలుసు కోటానికి సాహిత్యాన్ని మించిన సాధనం లేదు. జీవిత చరిత్రలూ, సాహిత్యమూ తప్ప కుటుంబ సంబంధాల పొరలను ఉల్లిపొరలను విప్పినట్లు విప్పగలిగే పరికరాలు దొరకటం కష్టం. ఆ కుటుంబ సంబంధాలను రచయిత్రి వాస్తవికంగా, ముందే యేర్పరుచుకున్న భావజాలంతో కాకుండా, తన కళ్ళముందు యదార్థంగా కనపడుతున్న సంఘటనల ఆధారంగా చిత్రించారు.

**ఆధార గ్రంథాలు :**


1. శతాబ్ది సూరీడు,మాలతి చందూర్, క్వాలిటీ పబ్లికేషన్స్ విజయవాడ.
2. నవలా మాలతీయం, డాక్టర్ గీత, అక్షరా పబ్లికేషన్స్, చెన్నై.
3. సంవిధానం, గుడిపాటి, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# సూర నవల దళిత చైతన్యం సామాజిక విశ్లేషణ

- నరేష్ భుక్య
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

**వ్యాస సంగ్రహం :**

సామాజిక వివక్ష, అణచివేత మరియుదళిత చైతన్య తాత్వికత భావాలతో దళితుల జీవన విధానాలను, పదజాల నుడికారాన్ని, భాష (యాస)ని తెలుగు సాహిత్యనికి పరిచయం చేసిన దళిత సాహిత్య నవల భూతం ముత్యాలు రాసిన "సూర" నవల. అగ్రకులాలు నిమ్నకులాలుఅని సామాజిక అసమానతలు కల్గి ఉండి సామాజిక దూరం పాటిస్తూ, అగ్రకులాలుగా చెలామణి అవుతున్నవారుదళిత కులాలను అణచి వేసే దొరణిపోయి దళితులలో చైతన్యం రావాలనే దళిత చైతన్య స్పృహతో రాసిన 'సూర' నవలవిశేషాలను తెలియజేయడమే ఈ వ్యాస ప్రయోజనం.

**కీలక పదాలు :**

చైతన్యం, స్పృహ, దొరణి, అణిచివేత, దళిత.

**ఉపోద్ఘాతము :**

చెప్పులు కుట్టడం, చనిపోయిన శవాలను బొందలు తోడడం లేదా కాష్టం పెట్టడం వంటి కులవృత్తి వాతావరణంలో సామాజిక వివక్ష గల కులంలో పెరిగినవ్యక్తి భూతం ముత్యాలు. తాను పడిన కష్టాలు, అనుభవించిన అవమానాలనేతన సాహిత్యరచనికిఇతివృత్తాలుగాతీసుకొని దళిత సామాజిక చైతన్య రచనలను వెలువరించారు. రచయిత చుట్టూ అల్లుకున్న జీవితాలు, వలస బతుకులతో బతుకు దెరువుకై పడుతున్న ఇబ్బందులు, దళితుల అణచివేత, కులవృత్తుల ధ్వంసం, సామాజిక బహిష్కరణలు దళితుల జీవితాల్లో నిత్యకృత్యాలుగా జరిగే ఈ సంఘటనల ఆధారంగా రచయిత 'సూర' నవలని తన ఆత్మకథనాత్మక శైలిలో రాసారు.

ప్రాంతం, పాత్రలు కల్పితమైనా రచయిత జీవితంలో జరిగిన నిజ సంఘటన రూపమే ఈ సూర నవల. కులాంతర వివాహాల ప్రోత్సాహం, కులనిర్మూలన,దళిత అస్థిత్వ గౌరవాన్ని పెంపొందించడం, అగ్రకుల అహంకారాలకు ఎదురొడ్డి నిల్వడం ఇదే ఈ నవల సారం. కులాంతర వివాహం అనే ఒక ప్రత్యేకమైనా విషయం ఈ సూర నవలలో కనిపిస్తుంది. నేటి సమాజంలో వస్తున్న పరిణామాలు, ఆర్థిక, సామాజిక అసమానతలు, అణగారిన కులాలు జీవితపోరాటంలో వారి ఆశలు ఆవిరవుతున్న తీరు, గ్రామీణులపై గ్లోబలైజేషన్ ప్రభావం, బ్రతకడానికి ఎంతకైనా దిగజారుతూ అగ్రకులాల అవసరాల కోసం బానిసలుగా మారుతున్న తీరును సమగ్రంగా ఈ సూర నవల చర్చించడం జరిగింది.

రచయిత చుట్టూ ఉన్న మనుషులు మాట్లాడే సజీవ మాండలికంలో మమేకమైమట్టి మనుషుల జీవితాల పచ్చి

పచ్చిక సొంపుతో పాఠకుల మనసును గాఢంగా హత్తుకునేలా 'సూర' నవల రచన చేయడం జరిగింది. "నవలలోని కథావస్తువుగాఅగ్రకుల అధికార పెత్తందార్ల అధిపత్యాన్ని ఎదురించే దళితులకు సంబంధించింది. చెన్నడు, చెంద్రిల కుమారుడైనాసూరని చుట్టే నవల కథాంతా నడుస్తుంది. చదువు కోసం నగరానికిపోయి నప్పటికీ తన దళిత జాతికోసం మళ్లీ పల్లెకి వచ్చి దళితులను చైత్యనం చేసే ఉన్నతాశయాలపరంగా సూర నవలలోని కథనం ఉన్నది. "గో బ్యాక్ టుది విలేజెస్" అని సమర్థించే దిశగా నవలా రచన సాగడం నవల కథా వస్తువుకు బలాన్ని చేకూర్చింది. అలాగే దళితుడైనా సూరనికి అగ్రకులానికి చెందినా జయలక్ష్మికి వర్ణాంతర వివాహం జరగడం నవలకంతటికీ ప్రత్యేకతగా మారు తుంది. దళిత జాతివాళ్ళు అవిద్యావంతులై నందున దోపిడీకి గురై బానిసలవుతున్నారని గ్రహించిన సూరడు తమ దళిత గూడములలో పాఠశాలలను పెట్టి అందరినీ చదువుకునేట్టు చేసి, బానిసదోపిడీ బతుకుల నుంచి విముక్తి పరిచి, మూఢనమ్మకాల్ని పారద్రోలేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. నవల వస్తువు స్వభావానికి తగిన రచనా శీర్షిక "సూర".

చెన్నడు, చెంద్రి బాలుడైన సూరన్ని తీసుకొని నగరానికి వలసపోయారు. ఊరు పెత్తందారైన నాగిరెడ్డి బావమరిది కాశిరెడ్డి పట్వారిగా చెలామణి అవుతూ, నగరంలో ఉన్న చెన్నని ఇంటికెళ్లి చెన్నడు, చెంద్రిలకొడుకైనా సూరన్ని చదివిస్తానని చెప్పి హాస్టల్‌లో చేర్పించి, చెన్నడు, చెంద్రి లకు పని ఇప్పిస్తానని చెన్నని, చెంద్రని తన దగ్గరికి రప్పించుకుని, లంచంగాపదివేల రూపాయలు తీసుకొని, హాస్టల్లో పనికి పెట్టించిన రాత్రే చెంద్రిని బలవంతంగా చెరిపేస్తాడు. "కొత్త సోటు కావడం చేత చంద్రికినిద్రరాక అటు ఇటు నసుల్కుంట, ఇగ మా కష్టాలు తీరుతాయి అని ఆలోచించుకుంట కండ్లు మూసి అప్పుడే నిద్దట్లకు జారుతుంది. ఇదే అదను అనుకుని కాశిరెడ్డి పిల్లిలా నడుస్తూ వచ్చి చెంద్రి పక్కల ఒరిగే. ఒక్కసారిగా ఎన్నుకు ఎచ్చగ తాకితాల్కే గుండెలో రాయి వడ్డట్టు అయిన చెంద్రి అదాట్న లేచి చూస్తాల్కి, దొంగ చూపులు చూసుకుంటూ కాశిరెడ్డి! నోటిమాటరానిచెంద్రి భయంతో వణికి పోయింది.కాపాడుతోల్లుకనుచూపుమేరకానరాక దిగులు పడింది చెంద్రి. ఎర్రిచెన్నడు ఈ లోకంలో లేడు. చేతులెత్తి ఏడుకో సాగింది చంద్రి. పటేలా నేను అలాంటి దాన్ని కాను, నన్ను వదిలి పెట్టు నీ కాళ్లు మొక్తా, నీకు దండం పెడ్తా. ఏడు కుంట కాళ్ల మీద పడ్డదిచంది. ఏడుపులు, తూడ్పులు పట్టించుకోని కాశిరెడ్డి ఇగ సడి సప్పుడు చేయకుండఒప్పుకో ఇప్పుడు కాకుండాపనైద్ది. నా సంగతి నీకు తెల్వది. మీసం మెలేస్కుంట, పళ్ళు పట్వటా కొర్కుంట పెద్దపులిలా మీద పడ్డడు కాశిరెడ్డి. ఏటకాని బాణం దెబ్బ తిన్న దుప్పిలా గిలకీలాడిందిచెంద్రి. దుల్పా యించుకోలేక వలలో చిక్కిన చేపలా తన్కులాడింది చంద్రి. కసాయిని నమ్మిన గొర్రెండ్చెంద్రి." దళితులను ఏం జేసినా అడిగే దిక్కు లేదనే దొరల పెత్తనలను రచయిత చెప్పాడనిపిస్తుంది.

ఈ సంఘటనతో పనిచేయలేకపదివేల రూపాయలు పోగొట్టుకొని, శీలం దోచుకోబడి, ఆ దళిత దంపతులు మానసిక వ్యధకు గురి అవుతారు. పట్నంలో ఉండలేక కొన్నాళ్ళకి తమ ఊరికి తిరిగి వచ్చేసి బతుకుతుంటారు. హాస్టల్లో చదివిన సూరడు తర్వాత పట్నంలోనే ఓ కాలేజీలో చేరాడు. అక్కడే అగ్రవర్ణ కులస్తురాలైనాజయలక్ష్మి పరిచయమవుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లిదాకా వచ్చింది. ఈ వర్ణాంతర పెళ్లితో ఊర్లోని అగ్రవర్ణాల వారు తలెత్తుకోలేకపోతారు. సూరన్ని చంపించా లని చాలా విధాలుగా ప్రయత్నిస్తుంటారు. ఇంతలో నాగిరెడ్డి ఊర్లోని దళితుల భూపత్రాలు తీసుకొనిపోయి బ్యాంక్ లో పెట్టి, ఋణం ఇప్పిస్తానని సంతకాలు చేయించుకొని, వచ్చిన డబ్బంతాతానే కాజేశాడు. "నాగిరెడ్డికి పెద్దగా భూములు లేకున్నా పూర్వీకులు చెల్కరెడ్లయియినా, తను మటుకుమోటాటి గానే చెలామణి అయితుండు. ఉన్నది రెండు ఎకరాలు కాడి పట్టింది లేదు. అర్కదున్నిందిలేదు మీసాలబిరైతే అయితే మెండు. తెల్లగా మాయని బట్టలేసుకొని నేల నడుస్తుంటే ప్రతీ పెట్టుకొని, ఖరీదైన సిగరెట్ దమ్ము పిల్చుకుంటూ ఊల్య నుంచి ఎప్పుడు చివరస్తమల్లేపల్లి కి వెళ్ళేవాడు.

ఆడ పని పాట లేకున్నా ఆఫీసుల చుట్టూ తిరిగి చిన్న, చిన్న పనులు చేసిచ్చేటాడు. ఇగ పటేలు లీడర్ అన్నట్టు, ఊర్లోగింత దానికి గంత దానికి నాగిరెడ్డితాన్కి వచ్చి వాళ్ళ గోడెళ్ళ పోసుకునే వాళ్ళు. మీకు లోన్లు ఇప్పిస్తనని, అప్కలు, బుష్కలు, చేసి కర్చులకని తలా గిన్ని పైసలు వసూలు చేసి లోన్లు మంజూరు చేపిచ్చేటోడు. ఎంత వచ్చిందోఎరుకలేని మొద్దులు విళ్ళు. చదువు సంధ్య లేనోళ్ళు, అంగోటినిషాన్గాళ్ళు. యాడ కొత్త మంటే ఆడ వత్తేబాపతి. కూరగాయల కనీ, వడ్లల్ల పని కని, కుమ్మరి చెక్రాలకని, చెప్పులు కుట్టే సామాండ్లకని, లోండ్లుపెట్టిచ్చి, మంజూరు చేపిచ్చి వాళ్ళకు మట్కు ఓ ఐదొందలు చేతుల బెట్టి సంతకాలు పెట్టిచ్చు కొని, చేతులు దుల్పు కునేటోడు" (సూర పుట :24)

అప్పుకట్టమని బ్యాంక్ నోటీసులు దళితులకు వచ్చేసరికి తీసుకొని అప్పుకు ఎట్లా డబ్బులు కట్టాలి అని గెంటెలెంకడు, ఇర్గుబక్కడు, గారిబు ముగ్గురు నాగిరెడ్డిని చంపాలని పథకం వేసుకున్నారు. ఊర్లోమైసమ్మ పండుగలో బొడ్రాయి లేపే తరుణంలో గారిబు నాగిరెడ్డిని దొరకపుచ్చుకొనిచంపేస్తాడు. అగ్రవర్ణాల దళితుల నడుమ కొనసాగుతున్న ఆధిపత్య పోరాటం చివరికి హత్యలతో నవల కథ ముస్తుంది. నిజానికి శ్రమ దోపిడీతోపాటు దళితుల ధనం కూడా దోచుకోబడడం వల్లే పగ తీర్చుకోవా లనే నిర్ణయానికొచ్చారు దళితులు.

నాగిరెడ్డి భూస్వామికాదు, ఖద్దరుబట్టలు వేసుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తూ అక్రమంగా ధనం సంపాదించాడు. కాశిరెడ్డి పట్వారీతనంతో దళిత దంపతుల్ని మోసం చేయగలిగినాడు. అంటే కేవలం పెద్దకుల పొల్లు అవడం చేతనే నాయకులుగా తిరగడం, పలుకుబడిని ఉపయోగించుకొని తమకు అనుకూలమైనా పనులు చేయించుకోవడం, దళితుల్ని దోచుకోవడము వంటి అక్రమ పనులు చేస్తుండేవారు.పటెండ్లు దళిత స్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడం సామాన్యంగా కనిపించే అంశం, కానీ సూరని జయలక్ష్మిల వర్ణాంతర వివాహం ఇక్కడ సామాన్య విషయం కాలేకపోయింది.

అంతేగాక నాగిరెడ్డి దళితుల భూ పాసుబుక్కులు బ్యాంక్‌ల్లో పెట్టి ఋణాలు ఇప్పిస్తానని సంతకాలు చేయించుకొని వచ్చిన డబ్బులన్నితానే కాజేశాడు. ఇంకా చెన్నని చెల్లెలు రంగిని ఉంపుడుగత్తెగా ఉంచుకోవడం కూడా నాగిరెడ్డి అవగుణాల్నితెల్పుతున్నాయి. నాగిరెడ్డి తమ్ముడు రామిరెడ్డి భార్య కళమ్మచెంద్రం అనే దళితునితో అక్రమ సంబంధం పెట్టుకొని వానితోనే లేచి పోయింది. నాగిరెడ్డి బావమరిదే మోచెంద్రి మీద కన్నేసి సూరని చదువిస్తానని, హాస్టల్ పనియిప్పస్తాననితనింటికి తీసుకుపోయి శిలాన్ని దోచాడు. పటెండ్లుఎంతటి కౄరులోసూర నవలలో కనబడతారు. చెన్నడు, చెంద్రి దళిత దంపతులు మొదటి తరానికి చెందినవారైతే, సూరడు, జయలక్ష్మిలు రెండో తరానికి చెందిన దళిత దంపతులు, రెండు తరాల నడుమ సామాజిక చైతన్యంలో భేద సాదృశ్యాలున్నాయి. కాశిరెడ్డి పట్వారితనం చేతిలో పెట్టుకొని చెంద్రి శీలాన్ని అపహరించగలిగాడు. దళిత దంపతుల నుంచికాని, దళిత ప్రజల నుంచి కానీ ఇంత జరిగిన ఎలాంటి ప్రతి ఘటన ఏమీ రాలేదు. అగ్రవర్ణాలు తలుచుకుంటే అనుకున్నవి నెరవేర్చుకుంటారు. అలాగే దొర కూతురు జయమ్మ సూరని చుట్టూ తిరగడమే గాదు వాణ్ని కొంగుకు చుట్టేసుకొంది. రచయిత పరోక్షంగా ప్రతీకారం తీర్చే విషయంగా ఈ సంఘటనలని కల్పించి నారేమో అని అనిపించేలా ఈ నవల కథనం ఉన్నది.

దళితుల విద్య, ఉపాది విషయంలో రచయితకు తనకంటూ కొన్ని అభిప్రాయాలున్నాయి. పై చదువులు చదివిన వాళ్ళంతా ఐఎఎస్, ఐపిఎస్ లు కావాలను కోవడం లేదు, వ్యక్తిగత జీవితాలకీ కూడా అంతగా ప్రాధాన్యాన్ని ఇవ్వలేదు. అలాగే వివాహాల విషయంలో పాతపద్ధతినే కోరుకోలేదు. అందుకే సూరని జీవితాన్ని మలుపుతిప్పి, పట్నంలోంచి పల్లెల్లోకి రప్పించి, దళితుల చైతన్యానికి పాఠశాలని పెట్టించాడు. పాఠశాల పెట్టిన తొలిరోజుల్లో తన జాతివాళ్ళె సహాయ నిరాకరణ చేస్తే సహించాడు. తన లక్ష్యం నెరవేర్చుకోవడానికి ఎన్నో అవ మానాలు భరించాడు. తనపై జరిగిన దాడుల్ని సహిం చాడు. మూఢనమ్మకాలతో దళితులు తమ జీవితాలు నాశనం చేసుకుంటుంటే చదువు నేర్పిదళితుల కళ్ళు

తెరిపించాడు. ఇదంతా సూర నవలా రచయిత కోరుకున్నది.

సూర నవల పాత్రల్లో విభిన్న మనస్తత్వాలు కనిపిస్తాయి. చేంద్రి పాత్రకు రంగి పాత్రకు బోలెడంత వ్యత్యాసం కనబడుతుంది. ఒకరు శీలాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటే మరొకరు తృణప్రాయంగా శీలాన్ని పటేండ్లకు అర్పిస్తారు. కళమ్మజాతి కాంతయితే అదే వర్గానికి చెందిన జయలక్ష్మి శీలవతీయైమొగసాలిగా సంసారం చేసింది. నాగిరెడ్డి, కాశిరెడ్డి ఫక్తుమగవ్యభిచారులు. చెన్ననిలో ఏ వికారాలు కనిపించవు, కాని భార్య చెంద్రి ప్రోద్బలంతో మూఢనమ్మకాల్లనుఆచరిస్తాడు. ఇక సూరనిపాత్రారంభం నుంచి ముగింపు వరకు ఆదర్శ పాత్రగానే కథానాయక పాత్రగా కనిపిస్తున్నది. తాను చిన్ననాటి దోస్తులతో తిరిగి చదువును ప్రక్కకు పెట్టిన సంఘటన తప్ప ఎప్పుడూ అతనిలో ఇతర అవలక్షణాలు కనిపించవు. అందుకే దళిత సూర్యుడుగా సూర పాత్రను భూతం ముత్యాలు 'సూర' పాత్రని చిత్రీకరించాడు.

**ముగింపు :**

భాషా శైలిలదళిత మాండలికం సాఫీగాసాగనివ్వదు. అందులో నవలా సూటిగా సాగినా, సన్నివేశాలు దళితుల్లో ఒక వర్గానికి చెందిన సూరన్ని కేంద్రంగా చేసుకొని, దళిత సంస్కృతిని వర్ణిస్తే మరింత నిండుతనం వచ్చేది. ఇక పాత్రల మనస్తత్వాల్ని ప్రవర్తనా సౌలభ్యం, సానుకూలతలను బట్టి చిత్రించినట్లయితే దళితుల ఆలోచనా విధానం బహిర్గతమయ్యేది. తెలంగాణ మాండలికంలో కథలు, నవలలు హెచ్చుస్థాయిలోరావల్సిందిఅని కోరుకునే అభిమానులకు ఈ నవల కొంత ఊరటని కలిగిస్తుంది. ఏది ఏమైనా తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేసే ప్రక్రియకు తన వంతు చేయూత నిచ్చింది"సూర"నవల అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. భూతం ముత్యాలు, సూర, 2004.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్ నవలా త్రయంలో హైదరాబాద్ నగర జీవన చిత్రణ

– పల్లె సతీష్

పరిశోధక విద్యార్థి, తెలుగు, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

**ఉపోద్ఘాతం :**

ప్రపంచంలో ఏ నగరం కూడా ప్రేమకోసం, ప్రేమకు గుర్తుగ స్థాపించబడలేదు ఒక హైద్రాబాద్ నగరం తప్ప. రెండు విభిన్న మతాలకు మధ్య సమైక్యతకు, స్నేహానికి హైదరాబాద్ ఒక సంకేతం. హైదరాబాద్ అన్నపూర్ణ. ఎక్కడెక్కడి వాళ్లో వచ్చి ఈ నగరంలో స్థిరపడ్డారు. భారత దేశంలోని పలు ప్రాంతాల్లోంచే కాక హబ్సిలు, నీగ్రోలు, అరబ్బులు ఇలా ఎన్నో జాతులవాళ్లు వచ్చారు. వాళ్ల సంతానం ఇప్పటికీ హైదరాబాదు నగరంలో స్థిరపడి ఉంది. ఎవరి వృత్తిలో వాళ్లు వృద్ధి పొందుతూ హైదరాబాద్ నగరాన్ని సుసంపన్నం చేశారు. తాము బాగుపడ్డారు. సాధ్యమైనంత వరకు నగరాన్ని బాగుపరిచే ప్రయత్నం చేశారు. ఇక్కడి మూలవాసుల్లో కలిసిపోయారు. మూలవాసుల ఉద్యమాలన్నిట్లో పాల్గొన్నారు. ఉత్తరాది నుంచి వచ్చిన కొందరు ఉర్దూ కవులు, పండితులు మాత్రం ఇక్కడి ఉర్దూను ఈసడించుకున్నారు. అప్పుడే హైదరాబాదులో "నాన్ ముల్కీగో బ్యాక్" అనే నినాదం మొదటిసారి వెలువడింది. తరువాత వచ్చినవాళ్లు కొందరు ఇక్కడివాళ్ల సంస్కారాన్ని, భాషను, యాసను పరిహసించి తామే గొప్పవాళ్లమన్నట్లు ప్రవర్తించారు. పరవస్తూ లోకేశ్వర్ గారు హైదరాబాద్ నగరంలోని విలాసవంతమైన భవనాల వెనుక ఉన్న పేదరికాన్ని, సామాన్యుల కష్టాలను, హిందూ ముస్లింల మధ్య ఉన్న సఖ్యతను, రాజకీయ కారణాల వల్ల వచ్చే చీలికలను స్వామి అనే ప్రధాన పాత్ర కేంద్రంగా సాగిన నవలలు సలాం హైదరాబాద్ పేరిట విలువరించారు. మొదటి భాగం- సలాం హైదరాబాద్, రెండవ భాగం- కల్లోల కలల కాలం, మూడవ భాగం- తీరం చేరిన నావ (సలాం హైదరాబాద్ ఆఖరి భాగం).

**సలాం హైద్రాబాద్ నవలా త్రయం రచయిత పరవస్తు లోకేశ్వర్ పరిచయం:**

పరవస్తు లోకేశ్వర్ హైదరాబాదు పాత నగరంలో 1951 జూన్ 10వ తేదీన జన్మించాడు. చాలా పెద్ద కుటుంబం. చిన్నతనం నుంచే కష్టపడి చదువుకొని క్లర్కుగా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు. కానీ విద్యార్థి రాజకీయాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఇతనికి పార్టీ కార్యకలాపాల్లో పూర్తిస్థాయి పాల్గొనాలని అనిపించింది. చేసే ఉద్యోగానికి సుదీర్ఘకాలం సెలవు పెట్టి పూర్తి సమయం కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. పార్టీలో కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారికి రాజకీయ తరగతులను నిర్వహించేవాడు. ఇతని భార్య పేరు శోభ. వివాహానంతరం కుటుంబ పోషణ ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో పార్టీ కార్యకలాపాలను వదిలేసి ఒక ప్రైవేటు కళాశాలలో రాజ

నీతి శాస్త్ర అధ్యాపకులుగా ఉద్యోగ జీవితాన్ని మళ్లీ ప్రారంభించాడు. అప్పటికే చేసి వదిలేసిన క్లర్కు ఉద్యోగం నచ్చలేదు. తిరిగి మరొక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని అహోరాత్రులు కష్టపడి చదివాడు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో గ్రూప్ టూ ఏ గెజిటెడ్ కేటగిరిలో ఏసిటిఓ (అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్), ఉద్యోగాన్ని సంపాదించాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు కూతురు పేరు సమత కొడుకు పేరు గాంధీ (రాజా). వీరు ఉన్నత చదువులు చదివి విదేశాల్లో స్థిరపడ్డారు.

పరవస్తు లోకేశ్వర్ పక్కా హైదరాబాద్ వాసి. హైదరాబాదు చరిత్ర సంస్కృతి పట్ల విశేషమైన కృషి చేస్తున్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. తదనంతర కాలంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో కూడా తన వంతు పాత్ర పోషించాడు. ఇప్పటికీ హైదరాబాద్ చరిత్ర పైన అదేవిధంగా తెలంగాణ చరిత్ర సంస్కృతి పట్ల పలు రచనలు చేస్తూనే ఉన్నారు.

## సలాం హైదరాబాద్ నవల - హైదరాబాద్ నగర జీవన చిత్రణ :

ఈ నవలలో హైదరాబాదు నగర పూర్వసంస్కృతి; ఈ తరంవాళ్లకు తెలియని అనేక విషయాలు ప్రస్తుతీకరించబడినవి. హైదరాబాద్ నగరం నిర్మాణమే ప్రేమ మీద ఆధారపడి ఉన్నది. కులీకుతుబ్షా తన ప్రేయసి భాగ్మతి పేర నిర్మించిన నగరం భాగ్యనగరం. 'హైదర్ మహెల్' అనే గౌరవనామంతో భాగ్ మతి కులీకుతుబ్షా జనానాలో చేరిన తరువాత భాగ్యనగరం హైదరాబాద్ అయింది. చార్మినార్ హైదరాబాద్‌కు అలంకారం. ఈ నవలకు తీసుకున్న కాలం 1578-1970 జులై 10. ఇందులో మూడు విషయాలు ఉన్నాయి. అవి :

1. హైదరాబాద్ చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలు, నగర జనజీవితం, నగర సమాజ చిత్రణ.
2. ఈ నగరం నేల మీద నడిచిన రాజకీయాలు, ఉద్యమాలు. 1578 నుంచి 1970 - ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, నక్సలైట్ ఉద్యమం, దిగంబరోద్యమం, విరసం ఆవిర్భావం వరకు.
3. నవలలో ప్రధాన పాత్రధారి స్వామి ఆత్మకథ.

పరవస్తు లోకేశ్వర్ గారి 'సలాం హైదరాబాద్' నవల హైదరాబాద్ నగరాన్ని కేవలం ఒక భౌగోళిక ప్రాంతంగా కాక, వివిధ జాతులు, భాషలు మరియు సంస్కృతుల సజీవ సంగమ క్షేత్రంగా ఆవిష్కరించింది. బ్రిటిష్ రెసిడెన్సీ కాలంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యంతో రైల్వే ఉద్యోగాల్లో స్థిరపడిన తమిళులు మరియు ఆంగ్లో-ఇండియన్ల నుండి మొదలుకొని, నిజాం సైన్యంలో కీలక పాత్ర పోషించిన అరబ్ (చావూష్), రోహిల్లా మరియు హబ్షీల వరకు ప్రతి సమూహం నగర నిర్మాణంలో తమదైన ముద్ర వేశారు.. ముఖ్యంగా వనపర్తి సంస్థానం నుండి నైజాంకు నజరానాగా వచ్చిన ఆఫ్రికన్ కావలీ గార్డ్స్ చరిత్ర, నేటి 'ఏ.సి. గార్డ్స్' వంటి ప్రాంతాల వెనుక ఉన్న సామాజిక మూలాలను వివరిస్తుంది. ఈ నవల ద్వారా లోకేశ్వర్ గారు హైదరాబాద్ను ఒక "కాస్మోపాలిటన్" నగరంగా తీర్చిదిద్దడంలో ఈ వలస సమాజాల పాత్రను చారిత్రక ఆధారాలతో సుసంపన్నం చేశారు. (పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్ పుట సంఖ్య 40 )

హైదరాబాద్ నగరంలోని వివిధ బస్తీల అస్తిత్వం అక్కడ నివసించే ప్రజల వృత్తులు మరియు వారి జీవనశైలిపై ఆధారపడి ఉంది. ధూల్పేటలో స్థిరపడిన లోథ్ క్షత్రియులు ప్రవేశపెట్టిన పతంగుల సంస్కృతి, వారి ద్రాక్షసారాయి వృత్తి మరియు వారి స్త్రీల ఆర్థిక స్వతంత్రం పాతనగర సామాజిక చైతన్యానికి అద్దం పడుతుంది. అలాగే, అబిసీనియా నుండి వచ్చిన హబ్షీలు (చావూష్లు) పరిచయం చేసిన 'తీన్మార్' వాయిద్యం నేడు తెలుగు రాష్ట్రాల పండుగల్లో, ముఖ్యంగా యాదవుల 'సదర్' ఉత్సవాల్లో అంతర్భాగం కావడం విశేషం. రాజస్థాన్ నుండి వచ్చిన బంజారాలు, మధ్యప్రదేశ్ నుండి వచ్చిన బోందిలీలు ఇలా ప్రతి జాతి తమ మూలాలను కాపాడుకుంటూనే హైదరాబాదీ సంస్కృతిలో ఎలా లీనమయ్యారో లోకేశ్వర్ గారు చిత్రించారు.

పరవస్తు లోకేశ్వర్ గారి రచనల్లో 1948 'పోలీస్ యాక్షన్' తర్వాతి హైదరాబాద్ నగరం ఒక సంక్లిష్టమైన పరివర్తన దశను తెలిపింది. నిజాం పాలన ముగిసి,

మిలటరీ గవర్నర్ జె.ఎన్. చౌదరి నేతృత్వంలో పౌర ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో జరిగిన 'ఆంధ్రుల వలసలు' నగర సామాజిక సమతుల్యతను ఎలా ప్రభావితం చేశాయో ఈ నవల చారిత్రక స్పృహతో చిత్రించింది. ముఖ్యంగా ఉర్దూ స్థానంలో ఇంగ్లీష్ పెత్తనం రావడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం వంటి పరిణామాలు 1952 'గైర్ ముల్కీ' ఉద్యమానికి దారితీసిన తీరును లోకేశ్వర్ గారు కళ్లకు కట్టారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో బొల్లారం రైల్వే స్టేషన్ పై దాడి, వార్తాపత్రికల కోసం ప్రజల ఆరాటం వంటి సన్నివేశాలు నగర ప్రజల రాజకీయ చైతన్యాన్ని, తమ అస్తిత్వం కోసం వారు పడ్డ తపన పడ్డారు. ఇది కేవలం ఒక నగర చరిత్ర మాత్రమే కాదు, ఒక ప్రాంతపు ఆత్మగౌరవ పోరాటాన్ని చిత్రించింది.(పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్ పుట సంఖ్య 150)

నగరంలోని 'లాడ్ బజార్' వంటి ప్రాంతాల చిత్రణ ద్వారా హైదరాబాద్లోని విలక్షణమైన వ్యాపార మరియు సౌందర్య సంస్కృతిని లోకేశ్వర్ గారు ఆవిష్కరించారు. కుతుబ్ షాహీల కాలం నాటి మీనా బజార్ నుండి నేటి లార్డ్ రిప్పన్ సందర్శనానంతర 'లాడ్ బజార్' వరకు జరిగిన పరిణామం, అక్కడ మతాతీతంగా స్త్రీలు జరుపుకునే అలంకరణల కోలాహలం నగరపు సమ్మిళిత సంస్కృతికి నిదర్శనం. అలాగే, హిందూ దేవాలయాల కోసం నిజాం నవాబులు చేసిన ఆర్థిక సహాయం, మౌల్వీల అభ్యంతరాలను తోసిరాజని "ఖజానా అందరిదీ" అని చాటిన తీరు నగరంలోని గంగా-జమునా తెహజీబ్కు నిలువెత్తు సాక్ష్యం. భారతదేశపు తొలి ఉర్దూ కవయిత్రి మాహ్ లఖా బాయి చందా వంటి విదుషీమణుల ప్రస్తావన ద్వారా హైదరాబాద్ నగరం కేవలం రాజకీయాలకే కాక, సాహిత్య పరిమళాలకు కూడా నెలవని ఈ నవల చాటిచెబుతోంది. (పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్ పుట సంఖ్య 167 )

పరవస్తు లోకేశ్వర్ గారి 'సలాం హైదరాబాద్' నవలాత్రయం లోని రెండో భాగం 'కల్లోల కలల కాలం'లో హైదరాబాద్ నగరం ఎదుర్కొన్న ప్రకృతి వైపరీత్యాల భీభత్సం అత్యంత ఆర్ద్రంగా చిత్రించబడింది. ఒక అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు గౌలిగూడ బస్సు డిపో ప్రాంతం మూసీ నది వరకు భూకంపం వచ్చినట్లుగా కొట్టుకుపోయిన తీరు, నగర భౌగోళిక మార్పులను కళ్లకు కడుతుంది. ఈ జల విధ్వంసం సృష్టించిన బీభత్సాన్ని చూడటానికి తరలివచ్చిన జనసందోహం, పోలీసుల నియంత్రణ నగరంలోని సామూహిక ఆందోళనను ప్రతిబింబిస్తాయి. మరోవైపు, ఇదే నగరంలోని ఉప్పుగూడ వంటి హరిజన బస్తీలలో నివసించే మున్సిపల్ కార్మికుల దుర్భర జీవనం నగరంలోని మరో చీకటి కోణాన్ని ఆవిష్కరించింది. పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, ఆమనగల్లు వంటి ప్రాంతాల నుండి దొరల దౌర్జన్యాలు భరించలేక వలసవచ్చిన ఈ ప్రజలు, నగరాన్ని శుభ్రం చేసే పాకీపని కార్మికులుగా మారినా, వారి బస్తీలలో కనీస సౌకర్యాలు లేక వారు పడుతున్న 'గోస' నగర అభివృద్ధిలోని అసమానతలను ఎత్తిచూపుతుంది. (పరవస్తు లోకేశ్వర్ కల్లోల కలల కాలం సలాం హైదరాబాదు రెండవ భాగం పుట 49)

హైదరాబాద్ నగర భౌగోళిక విస్తరణ మరియు బస్తీల ఆవిర్భావం వెనుక గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది. రెండవ నిజాం అలీఖాన్ పేరుతో వెలిసిన అలియాబాద్ బస్తీ. కేవలం వ్యాపార కేంద్రంగానే కాక రెడ్డి జనసంఘం గ్రంథాలయం ద్వారా సామాజిక చైతన్యానికి, గణేష్ ఉత్సవాల వంటి సాంస్కృతిక వేదికలకు నిలయమైంది. నగర మణిహారమైన హుస్సేన్ సాగర్ నిర్మాణం (1563) వెనుక ఇరాన్ నుండి వలస వచ్చిన ఇంజనీర్ హుస్సేన్ షా వలీ ప్రతిభ ఉండగా, ఆ ఆనకట్ట నిర్మాణానికి కావళ్లతో రాళ్లు మోసిన కూలీల శ్రమశక్తి 'కవాడీగూడ' బస్తీ రూపంలో సజీవ సాక్ష్యంగా నిలిచింది. అలాగే, మొఘల్ సైన్యం విజయోత్సాహంతో నగారాలు మోగించిన 'నౌబత్ పహాడ్', వారు బస చేసిన 'ఫతే మైదాన్' (నేటి ఎల్.బి. స్టేడియం) నగర చరిత్రలోని యుద్ధ తంత్రాలకు చిహ్నాలుగా మిగిలాయి. సైదాబాద్లోని ఎరుకల బస్తీ కార్మికుల నుండి అలియాబాద్లోని గుజరాతీ, మార్వాడీ వ్యాపారస్తుల వరకు వివిధ సామాజిక వర్గాల జీవన శైలిని రచయిత ఈ

నవలలో అద్భుతంగా చిత్రించారు. హైదరాబాదును కేవలం పాలకులు నిర్మించిన కట్టడాల సమాహారంగా కాకుండా, ఆ కట్టడాల వెనుక ఉన్న 'సామాన్యుడి శ్రమ'ను గుర్తించే విలక్షణమైన శైలిని అనుసరించారు. అలియా బాద్లోని మిల్లు యజమానుల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పికెటింగ్లు, ఎరుకల బస్తీలో యువజన సంఘాల చైతన్యం వంటి అంశాలు నగరంలోని ఆర్థిక వైరుధ్యాలను మరియు వర్గ పోరాటాన్ని సూచిస్తాయి. చరిత్రలో మరుగున పడిపోయిన పేర్ల వెనుక ఉన్న సామాజిక మూలాలను వెలికితీయడం ద్వారా, రచయిత హైదరా బాద్ నగర జీవనానికి ఒక చారిత్రక ప్రామాణికతను కల్పించారు.

హైదరాబాదులోని 'గంగా-జమునా తెహజీబ్' రంజాన్ మాసంలో ఎలా వెల్లివిరుస్తుందో పరవస్తు లోకేశ్వర్ గారు అత్యంత గొప్పగా చిత్రించారు. రంజాన్ జిలుగువెలుగుల్లో లాడ్ బజార్ గాజులు, గుల్జార్ హౌజ్ ముత్యాలు, చార్కమాన్ సిల్కు చీరలు మరియు మదీనా పుట్పాత్ వ్యాపారాల ద్వారా నగరం ఒక భారీ వాణిజ్య కేంద్రంగా మారుతుంది. ముఖ్యంగా, 'తక్కువ ఆహారం-ఎక్కువ బలం' అనే ఇరానీ సూత్రంతో కుతుబ్ షాహీల కాలంలో దిగుమతి అయిన 'హలీం' వంటకం, నేడు మతాతీతంగా హైదరాబాదీయులందరి 'హాట్ ఫేవరేట్'గా మారడం నగరపు సాంస్కృతిక సమ్మిళితత్వాన్ని సూచిస్తుంది. 'హర్ ఏక్ మాల్ చారానా' బండ్లు, షర్బత్ గ్లాసుల వంటి వర్ణనల ద్వారా రచయిత పాతనగరపు మధ్యతరగతి మరియు అట్టడుగు వర్గాల పండుగ సంబరాన్ని, ఆర్థిక చైతన్యాన్ని అద్భుతంగా చిత్రించారు. (పరవస్తు లోకేశ్వర్ కల్లోల కలల కాలం సలాం హైదరాబాదు రెండవ భాగం పుట 249)

హైదరాబాద్ నగర జీవనంలో పండుగల కోలా హలంతో పాటు, రాజకీయ, మతాల వల్ల తలెత్తే మతో న్మాద సంక్షోభాన్ని కూడా లోకేశ్వర్ గారు నిర్భయంగా నమోదు చేశారు. 1983లో తెలుగుదేశం పార్టీ చారిత్రక విజయం సాధించి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరుణంలో, పాతనగరంలో చెలరేగిన మతకల్లోలాలు నగరపు అశాంతికి అద్దం పడతాయి. కర్ఫ్యూ నీడలో సామాన్యుల ప్రాణనష్టం, గాయపడిన వందలాది మంది వ్యధ నగర జీవనంలోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఒకవైపు రంజాన్ వంటి పండుగలు మనుషులను కలిపితే, మరోవైపు రాజకీయ ప్రయోజనాల కోసం రేగే మతోన్మాదం సామాజిక వ్యవస్థను ఎలా చిన్నాభిన్నం చేస్తుందో రచయిత వివరించారు.

ఒకప్పటి హైదరాబాద్ నగరపు సౌందర్యాన్ని, ఆహ్లాద కర వాతావరణాన్ని అద్భుతంగా చిత్రించారు. "హైద్రాబాద్ కీ హవా ఏక్ లాఖ్ కీ దవా" అన్న సామెతను నిజం చేస్తూ, గండిపేట నీటి స్వచ్ఛతను, కాలుష్యం లేని చల్లని గాలు లను నగరపు సహజ సిద్ధ ఏసీ గా వర్ణించారు. సైకిల్ ప్రయాణాలు, కాలి నడక, మరియు గజారోహణను తలపించే డబుల్ డెక్కర్ బస్సుల ప్రయాణం ఆనాటి నిర్మలమైన జీవనశైలికి ప్రతీకలు. ఈ ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు, నగరపు సాంస్కృతిక హృదయ స్పందనగా 'నుమాయిష్' (ఎగ్జిబిషన్) ఆవిర్భావం నగర అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసింది. 1938లో ఉస్మానియా పట్టభద్రుల కృషితో ప్రారంభమై, నాంపల్లి మైదానంలో 'ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్'గా రూపాంతరం చెందిన ఈ ప్రదర్శన, కేవలం వ్యాపార కేంద్రంగానే కాకుండా దేశం నలుమూలల సంస్కృతుల కలయికకు, వినోదానికి వేదికైంది.(పరవస్తు లోకేశ్వర్ కల్లోల కలల కాలం సలాం హైదరాబాదు రెండవ భాగం పుట 428)

హైదరాబాద్ నగరం భిన్న రకాల సంస్కృతికి నిలయం. ఇక్కడికి దేశం నలుమూలల్లోంచి వచ్చిన వారు తమ బ్రతుకుదెరువుకు ఈ నగరాన్ని తమ జీవన పోరాటానికి ఎంచుకున్నారు. దాదాపు ఐదు వందల సంవత్సరాల నుండి ఈ నగరం పెరుగుతూనే ఉంది. నేడు కోటి జనాభాకి చేరింది. "హైదరాబాద్ నగరం నేడు కాస్మో పాలిటన్ సిటీగా పిలవబడుతుంది. ఇక్కడనివసించే ప్రజలు అన్ని భాషలూ మాట్లాడుతారు.ఒల్డ్ సిటీల ఉర్దూ, సుల్తాన్ బజారులో మరాఠీ, బర్కత్పురాలో కన్నడం, గౌలిగూడలో సిక్కుల పంజాబీభాష, లష్కర్

అంటే సికింద్రాబాద్లో తమిళం, ఇంగ్లీషు వంటి భాషలు మాట్లాడే మనుషులు ఈ నగరంలో ఉన్నారు. (పరవస్తు లోకేశ్వర్ తీరం చేరిన నావ సలాం హైదరాబాదు మూడవ భాగం పుట 209)

పరవస్తు లోకేశ్వర్ నవలాత్రయం సలాం హైదరాబాద్ ద్వారా, హైదరాబాద్ నగర ఆత్మను ఆవిష్కరించాడు. స్వామి అనే వ్యక్తి జీవితప్రయాణాన్ని చెపుతూనే, మరోవైపు తొలిదశ తెలంగాణ ఉద్యమాన్ని గురించి ఎంతో క్షుణ్ణంగా అర్థమయ్యేలా ఆవిష్కరించారు. ఆ ఉద్యమ కాలంలో హైదరాబాద్ నగరంలో ప్రజల జీవితాన్నిమన ముందు నిలిపారు. పోలీసుల లాఠీ ఛార్జ్ లో, కాల్పుల్లో బలైన విద్యార్థులు వారి కుటుంబ వేదనను పాఠకున్ని కంటతడి పెట్టిస్తుంది. ఒక నలభైఏళ్ల తెలంగాణ కాలాన్ని, ఒక ఉద్యమం నుంచి మరో ఉద్యమానికి ఈ మూడు రచనలు మనల్ని ప్రయాణింపజేస్తాయి. మూడు నవలల్లో కూడా హైదరాబాద్ గురించిన పుట్టుక నుంచి నేటి కాలం వరకు జరిగిన అభివృద్ధిని దండలో దారంలా ఒక్కొక్క అంశాన్ని చేర్చారు. రచయిత ఎంచుకున్న కథన పద్ధతి, చారిత్రక, సాంస్కృతిక అంశాలు ఈ నవలలను ఉన్నత స్థితిలో నిలబెట్టాయి. 'సలాం హైదరాబాద్', కల్లోల కలల కాలం','తీరం చేరిన నావ' అనే ఈ మరుగున, మరపున పడిపోతున్న తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాలను, అవి జరిగిన కాల క్రమాన్ని వివరించారు. అమరవీరుల త్యాగాల చరిత్రను సువర్ణాక్షరాల్లో లిఖించారు. నేటి కొత్త తరానికి ఈ నవలలు హైదరాబాద్ నాగరజీవితాన్ని తెలుసుకోవడానికి దిక్సూచిలా పనిచేస్తాయి.

**ఆధార గ్రంథాలు :**


1. సలాం హైదరాబాద్ - పరవస్తు లోకేశ్వర్ (2005)
2. కల్లోల కలల కాలం- సలాం హైదరాబాద్ రెండవ భాగం -పరవస్తు లోకేశ్వర్ (2020)
3. తీరం చేరిన నావ - పరవస్తులోకేశ్వర్ (2025)


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# పెద్దింటి అశోక్ కుమార్ జిగిరి నవల – సామాజిక జీవన చిత్రణ

- మారేపల్లి లక్ష్మయ్య
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్.

**ఉపోద్ఘాతం :**

పెద్దింటి అశోక్ కుమార్ నవల జిగిరిలో సాధు జంతువైన ఎలుగుబంటిని ఇమామ్ సాహెబు తన కుటుంబ పోషణ కోసం ఎలుగుబంటితో ప్రదర్శనలు చేయించి పూట గడుపుకున్నారు. జంతు పరిరక్షణ చట్టం రావడం వలన ఇమాం సాహెబ్ ప్రాణంగా పెంచుకున్న ఎలుగు బంటిని ప్రభుత్వ అధికారులు ఆ ప్రదర్శనను నిలిపి వేయమని అడగటంతో సంకట పరిస్థితులు పడింది. బీబమ్మ చాంద్ పాషా ఒకవైపు, హేమంత్ సాహెబు ఎలుగుబంటిల అనుబంధం మరొకవైపు ఉంది. తల్లి కొడుకు ప్రభుత్వం ఇచ్చే భూమి కోసం ఎలుగుబంటిని అడవిలో వదిలై లేకపోతే దాన్ని చంపి అని తండ్రితో వాగ్వాదానికి దిగారు. ఎంతో ప్రేమగా పెంచుకున్న ఆ ఎలుగుబంటిని అడవిలో వదలు లేక చంపలేక చాలా ఘర్షణకు లోనయ్యాడు ఇమాం సాహెబ్. చివరికి ఎలుగుబంటిని అడవిలో వదిలి పెట్టడానికి వెళ్లి దానితో బాటే కనుమరుగైపోయాడు. మూగ జంతువు విశ్వాసం మనుషుల స్వార్థం మధ్య కొట్టుమిట్టాడుతున్న ఇతిరుత్తంతో ఈ నవలను చాలా అద్భుతంగా పెద్దింటి అశోక్ కుమార్ తీర్చిదిద్దాడు.

**పెద్దింటి అశోక్ కుమార్ పరిచయం :**

పెద్దింటి అశోక్ కుమార్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీర్ రావు పేట మండలంలోని భీముని మల్లారెడ్డిపేట అనే గ్రామంలో 06.02.1968న అంజయ్య, మల్లవ్వ దంపతులకు జన్మించారు. వీరికి ఏడుగురు సంతానం. అందులో రెండవవారు ఈయన. ఏడుగురు సంతానంలో ఆనాటి పరిస్థితుల్లో, మెరుగైన వైద్యం, అందుకు కావలసిన ఆర్థిక స్థోమత అందుబాటులో లేకపోవటం వల్ల, పలురకాల అనారోగ్య కారణాలతో ముగ్గురు చని పోయారు. పెద్దింటి అశోక్కుమార్ పేద వ్యవసాయ కుటుంబం. గ్రామంలో పొలం ఉన్న రెండెకరాల భూమి కూడా అక్కడక్కడ వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంవల్ల వ్యవసాయం భారంగా మారింది. అంతంత మాత్రంగా ఉన్న ఆదాయానికి ఇంటిల్లిపాది రోగాలతో ఆస్పత్రుల పాలవటం, వైద్య ఖర్చులు పెరిగిపోవటంతో సంసారం గడవటం కష్టమైపోయింది. ఈ కుటుంబ పరిస్థితులను అధిగమించడానికి చదివే లక్ష్యంగా ఏర్పాటు చేసుకొని కష్టపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగాన్ని సాధించాడు. ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే మరోవైపు తెలుగు సాహిత్యంలో విభిన్న రచనలను చేయడం ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఇందులో భాగంగానే కథలు నవలలు వివిధ సాహిత్య సదస్సులకు పరిశోధన పత్రాలు కూడా ఎన్నో రాశాడు. ఈ క్రమంలో పెద్దింటి అశోక్

కుమార్ రాసిన కొన్ని నవలలను వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా పీజీ విద్యార్థులకు చేర్చారు.

**పెద్దింటి అశోక్ కుమార్ నవలలు :**

ఎడారి మంటలు (2002), దాడి (2005), జిగిరి (2006), ఊరికి ఉప్పులం (2007), సంచారి (2011), మిలియన్ మార్చ్ (2017), ఇంకెంత దూరం (2020). ఈ విధంగా చాలా ప్రసిద్ధమైన నవలలను రచించాడు. ఈ నవలలో సామాజిక జీవితాన్ని పేదల యొక్క వెతలను సాధారణ పాఠకుడికి సైతం మనసుకు హత్తుకునేలా రచించాడు.

**జిగిరి నవలలోని ప్రధాన పాత్రలు :**

ఇమామ్ సాహెబ్, బీబమ్మ, చాంద్ పాషా, షాదుల్ అనే పేరు గల ఎలుగుబంటి. పెద్దింటి అశోక్ కుమార్ 'జిగిరి' చిన్న నవల. ఓ నాలుగు పాత్రలు ఇందులో ఒక పాత్ర మాటలురాని ఎలుగుబంటి. మిగిలిన మరో రెండు మూడు పాత్రలు ఒక్కో సన్నివేశంలో కనిపిస్తాయి. అయినా కథా, కథనం మనలను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళతాయి. గతంలో పల్లెటూళ్లలో భాగమైన ఎలుగుబంటి ఆట, తాయెత్తులు, ఫకీరోళ్ళు అని పిలవబడే ఈ కుటుంబాలు, వాళ్ళ జీవనశైలిలో కుటుంబ సభ్యుని వలె భాగమైపోయింది.

ఇమామ్ తన భార్య బీబమ్మ, కొడుకు చాంద్ మరియు షాదుల్ అని పిలవబడే గుడ్డెలుగుతో జీవిస్తుంటాడు. దాదాపుగా ఇరవయ్యేళ్ళు ఆ కుటుంబంతో కలిసి ఆ కుటుంబానికి తన ఆట ద్వారా డబ్బు సంపాదించి పోషిస్తుంది షాదుల్. షాదుల్, చాంద్ ఇద్దరూ సమవయస్కులు. ఇద్దరినీ కన్న బిడ్డల్లానే సాకింది బీబమ్మ. తల్లి నుండి దూరం చేసి తమతో తీసుకొచ్చేసిన షాదుల్ ఆహారం తీసుకోకుండా, తీసుకున్నా ఆ ఆవుపాలు పడక చావు బతుకుల మధ్య పడితే తన పాలు తాపి, తాయెత్తులు కట్టించి బతికించింది బీబమ్మ. చాందూ, షాదుల్ని తన తోబుట్టువులానే చూసుకున్నాడు. ఇక ఇమామ్ అయితే కన్న కొడుకు లాగానే, సంపాదిస్తోన్న పెద్దకొడుకులానే చూసుకున్నాడు. ఆ కుటుంబం హాయిగా ఉంది. ఆర్థికపరిస్థితి సజావుగానే ఉంది.

షాదుల్ని ఎలా దూరం చేసుకోవాలా అని ఆ కుటుంబం ఆలోచించడంతో కథ రసకందాయంలో పడుతుంది. చివరకు షాదుల్ని చంపేసే ప్రయత్నాలు కూడా సాగుతాయి. కన్నతల్లిలా సాకిన బీబమ్మే, తన కళ్ళముందే దాన్ని చంపే ప్రయత్నాలకు తోడ్పాటు నిస్తుంది. కొడుకైన చాంద్, షాదుల్ని చంపాలని చూస్తుంటే అడ్డుపడి దెబ్బలు తింటుంటాడు ఇమామ్.నేను కావాలా? షాదుల్ కావాలా? అని కొడుకు చాంద్ వేస్తున్న ప్రశ్నలకు జవాబివ్వలేక, షాదుల్ని చంపుకోలేక, అమ్మేద్దామనుకుంటే కొనేవాళ్ళు లేక, దూరంగా విడిచిపెట్టేసినప్పటికీ ఇంటికి వచ్చేస్తున్న షాదుల్ కి వెర్రిమందు తినిపించి అడివిలో విడిచిపెట్టి వస్తానని వెళ్ళిన ఇమామ్ ఆ పని చేయలేక పోతాడు. మళ్ళీ కథలోకి రాడు. తన 'జిగిరి'తో అక్కడే ఉండిపోయాడేమో అనే ఊహను పాఠకుడికే వదిలేసాడు రచయిత.

మనసుకు అంత దగ్గరైన, కుటుంబంలో భాగమైన ఆ షాదుల్ని, ఆ కుటుంబం వదుల్చుకోవాలనుకుంది. వాళ్ళకు ప్రభుత్వం ఓ రెండెకరాల భూమి ఇస్తానని అన్నారు. వాళ్ళకు మరో జీవనాధారం లేకపోతేనే అది వీలవుతుందని అనడం, వన్యప్రాణులను బంధించి ఉంచడం నేరం అని పోలీసులు చెప్పారు. వీళ్ళ వద్ద గుడ్డెలుగు ఉంది కాబట్టి దాని ఆట ద్వారా వీళ్ళ బాగా సంపాదిస్తున్నారు కాబట్టి వీళ్ళకు భూమి ఇవ్వడం సరికాదు అని ఆ ఊరి గ్రామస్థులు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. భూమి వస్తుంది, బతుకు బంగారమవుతుంది కాబట్టి షాదుల్ని దాచిపెట్టి గుడ్డెలుగు లేదు, చచ్చిపోయింది అని వీళ్ళు చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల్లో అది తమ వద్ద ఉంటే బంగారం లాంటి రెండెకరాల భూమి ఎక్కడ తమది కాకుండా పోతుందో అన్న భయంతో మానవసహజ స్వార్థంతో అలాటి పాపపు పనికి ఒడిగట్టారు. మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న ఒక చిన్న లైను మీద రచయిత ఈ నవల అద్భుతంగా తీర్చిదిద్దారు.''అడివిలకా... అడివిల జంతువును ఊర్లెకు తెచ్చినం. అలవాట్లు మార్చినం. ఇరువై ఏండ్లు ఎంట తిప్పుకున్నం. ఇప్పుడు

ఉన్నట్టుండి అడివిల విడిచి పెడితే అది ఏం తింటది? ఎట్ల బతుకుతదిరా...! ఆ ఊహనే భరించనట్టుగా అన్నాడు'' ఇమామ్. (అశోక్కుమార్ పెద్దింటి జిగిరి నవల పుట సంఖ్య 89)

ఇమామ్ ఇంట్లో పరిస్థితుల్ని తెలుసుకుని ఒక మనిషి వలె తన ఆకలిని, ఆవేశాన్ని అణచుకునే ఔదార్యం షాదుల్కి ఉంది. చాంద్ షాదుల్పై దాడి చేసినా, ఇమామ్ మాటకు కట్టుబడి షాదుల్ చాందిని ఏమీ చేయకుండా వదిలేస్తుంది. కానీ చాంద్ ఇమామ్పై కోపంతో, కర్రతో కొడితే మాత్రం ఆవేశంతో చాంద్ పై దాడి చేసింది. "ఇమామ్ షాదుల్ని... "ముక్కు మీద కట్టెతోని కొడు తుంటే, కన్నకొడుకునే కొట్టినంతగా బీబమ్మ పాణం తల్లడిల్లింది. వద్దని భర్తను వారించింది''. (అశోక్ కుమార్ పెద్దింటి - జిగిరి, పుట సంఖ్య 19)

ఇమామ్ షాదుల్కి ఆటలు నేర్పించాలని, దాని ద్వారా కుటుంబాన్ని పోషించవచ్చునని అనుకుంటాడు. ఆటలు నేర్పే క్రమంలో షాదుల్ని బెత్తంతో కొట్టేవాడు. అది చూసిన బీబమ్మ హృదయం తల్లడిల్లిపోయేది. ఇమామ్ని వద్దని వారించేది. బీబమ్మ, షాదుల్ని చాంద్ని ఏ రోజు వేరుగా చూడలేదు. ఇద్దర్ని తన కొడుకులుగానే భావించింది. ఒక మాతృమూర్తి తన పిల్లలపై కురిపించే ప్రేమనే షాదుల్పై చూపించింది. షాదుల్ జ్వరంతో బక్క చిక్కిపోయినప్పుడు చాంద్ కంటే ఎక్కువ షాదుల్ గురించి ఆలోచించి విలవిల్లాడిపోయింది. మాతృత్వానికి జాతి భేదాలు లేవని తెలియచేసేది బీబమ్మ పాత్ర.

ఇమాంకు షాదుల్ తప్ప వేరే ప్రపంచం లేదు. ఇలా ఆ నలుగురి జీవితం కొంతకాలం సాగిపోతుంది.. షాదుల్ను వాళ్ళు పెంచారు. షాదుల్ వాళ్ళను పోషించింది. ఈ లోపల వన్యమృగ సంరక్షణ చట్టం తెచ్చింది. ప్రభుత్వం. వన్యమృగాలను ఎవరూ సొంత పనులకు ఉపయోగించరాదు. వాటిని వదిలిపెడితే బతకడానికి భూమి ఇస్తామని ప్రకటిస్తుంది. చాందు భూమి మీద మనసు పడుతుంది. దానికోసం షాదుల్ను అడవిలో వదిలి రమ్మంటారు తండ్రితో. ఈ అంశం వాళ్ళ మధ్య సృష్టించిన సంఘర్షణే 'జిగిరి' నవల'' అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి జిగిరి నవల ముందుమాటలో పేర్కొన్నారు. (అశోకుమార్ పెద్దింటి జిగిరి, ముందుమాట పుట. 7)

**ముగింపు :**

ఈ నవలను ఆసాంతం పరిశీలిస్తే తెలిసిన విషయం ఏమిటంటే మనిషితో సహవాసం చేసి షాదుల్ సాధు లక్షణాలను నేర్చుకుంటే, ఎలుగుతో పెరిగిన మనుష్యులు మాత్రం క్రూరత్వాన్ని అలవర్చుకున్నారు. మనుష్యుల్లో లేని విశ్వసనీయత, మానవీయత, మూగజీవి అయినా షాదుల్లో నిలువెల్లా కన్పిస్తుంది. మానవత్వాన్ని మరచి పోతున్న ఈ సమాజానికి రచయిత ఈ నవలలో షాదుల్ పాత్ర ద్వారా కనువిప్పు కలిగించడం మనకు తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. పెద్దింటి అశోక్ కుమార్ జిగిరి నవల

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# షాజహాన మేరా జహా నవల - మానవీయ కోణాలు

- షేక్ జరీన బేగం
పరిశోధకురాలు, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

- డా॥. ఇరపని మాధవి
అసోసియేట్ ప్రొఫెసర్, పర్యవేక్షకులు, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

## పరిచయం

తెలుగు సాహిత్యం సుమారు రెండు వేల ఏళ్ల ఘన చరిత్ర కలిగినది, ఇది శాసన కాలం నుండి నేటి ఆధునిక వచన కవిత్వం వరకు అనేక పరిణామాలు చెందింది. క్రీ.శ. 11వ శతాబ్దంలో నన్నయ మహాభారత ఆంధ్రీకరణతో ప్రారంభమైన 'పురాణ యుగం' తిక్కన, ఎర్రనల కృషితో పరిపుష్టమై తెలుగు భాషకు ఒక స్థిరమైన రూపాన్ని ఇచ్చింది. ఆ తర్వాత శ్రీనాథుడు, పోతనల కాలంలో భక్తి, శృంగార రసాలు వెల్లివిరియగా, శ్రీకృష్ణదేవరాయల పాలనలో 'ప్రబంధ యుగం' తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగంగా నిలిచింది. నాయక రాజుల కాలంలో యక్షగానాలు, పద సాహిత్యం ప్రాచుర్యం పొందగా, ఆధునిక కాలంలో కందుకూరి, గురజాడ వంటి సంస్కర్తల వల్ల సాహిత్యం సామాజిక చైతన్యానికి వేదికైంది. గిడుగు రామమూర్తి గారి వ్యావహారిక భాషా ఉద్యమం, శ్రీశ్రీ గారి అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని ప్రజల భాషకు దగ్గర చేశాయి. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా పిలువబడే తెలుగు, అవధానాల వంటి విశిష్ట ప్రక్రియలతో నేటికీ తన వైవిధ్యాన్ని చాటుకుంటూనే ఉంది.

తెలుగు నవలా సాహిత్యం 19వ శతాబ్దం చివరలో ప్రారంభమై, సామాజిక సంస్కరణల నుండి నేటి మనస్తత్వ విశ్లేషణల వరకు ఎన్నో మార్పులకు లోనైంది. 1872లో నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి రాసిన 'శ్రీరంగరాజ చరిత్రము' తొలి తెలుగు నవలగా గుర్తింపు పొందగా, కందుకూరి వీరేశలింగం గారి 'రాజశేఖర చరిత్రము' (1878) పూర్తిస్థాయి లక్షణాలతో వెలువడిన తొలి సామాజిక నవలగా ప్రసిద్ధి చెందింది. ప్రారంభ దశలో చారిత్రక, అద్భుత రస ప్రధానమైన నవలలు (చిలకమర్తి వారి 'హేమలత' వంటివి) వచ్చినప్పటికీ, ఆ తర్వాత కాలంలో విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు', అడవి బాపిరాజు గారి 'నారాయణరావు' వంటి నవలలు తెలుగు వారి సంస్కృతిని, జీవన విధానాన్ని అద్భుతంగా చిత్రించాయి. 1960ల తర్వాత యద్దనపూడి సులోచనా రాణి, కొవ్వలి వంటి రచయితల వల్ల నవలలు సామాన్య పాఠకులకు చేరువయ్యాయి.అదే సమయంలో ముప్పాళ్ల రంగనాయకమ్మ గారి 'బలిపీఠం', బుచ్చిబాబు గారి 'చివరకు మిగిలేది' వంటి రచనలు స్త్రీల సమస్యలను, మానవ మనస్తత్వాలను లోతుగా విశ్లేషించాయి. నేడు నవల కేవలం కథా గమనం మాత్రమే కాకుండా దళిత, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలకు సైతం బలమైన గొంతుకగా నిలుస్తోంది.

తెలుగు సాహిత్యంలో 1990ల కాలంలో బలంగా

వినిపించిన అస్తిత్వ వాదాల్లో 'ముస్లింవాద సాహిత్యం' అత్యంత కీలకమైనది. అంతకుముందు వరకు ముస్లిం కవులు తెలుగులో రచనలు చేసినప్పటికీ, అవి ప్రధానంగా సాధారణ సాహిత్యం లేదా భక్తి సాహిత్యం గానే ఉండేవి. కానీ, 1991లో వెలువడిన 'జలజల' కవితా సంకలనం ముస్లింవాద సాహిత్యానికి ఒక స్పష్టమైన రూపాన్ని, దిశను ఇచ్చింది.

### ముస్లింవాద సాహిత్యంలోని ప్రధానాంశాలు :

**అస్తిత్వ పోరాటం** : సమాజంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ వివక్షను, వారి గుర్తింపు కోసం జరుగుతున్న పోరాటాన్ని ఈ సాహిత్యం ప్రతిబింబిస్తుంది.

**అంతర్గత విమర్శ** : ముస్లిం సమాజంలోని మూఢ నమ్మకాలు, పర్దా పద్ధతి, తలాక్ వంటి అంశాలపై ముస్లిం కవయిత్రులు (ముఖ్యంగా షాజహానా వంటి వారు) ధైర్యంగా తమ గొంతు వినిపించారు.

**భాషా సౌందర్యం** : తెలుగు భాషలో ఉర్దూ, పర్షియన్ పదాలను (ఉదాహరణకు: అమ్మీ, అబ్బా, దువా, ఖైర్) సహజంగా వాడుతూ, ఒక విలక్షణమైన 'దక్కనీ తెలుగు' శైలిని వీరు ప్రాచుర్యంలోకి తెచ్చారు షాజహానా.

షాజహానా ఆధునిక తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా ముస్లింవాద మరియు స్త్రీవాద సాహిత్య రంగాలలో ఒక ధిక్కార స్వరం. ఖమ్మం జిల్లాలో జన్మించిన ఆమె, ముస్లిం సామాజిక వర్గంలోని స్త్రీలు ఎదుర్కొంటున్న ద్వంద్వ అణచివేతను (ఒకటి మతం పేరుతో, రెండోది పితృస్వామ్యం పేరుతో) తన కలం ద్వారా ఎండగట్టారు. 1990ల తర్వాత వచ్చిన ముస్లిం అస్తిత్వ ఉద్యమంలో ఆమె క్రియాశీలక పాత్ర పోషించారు. కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా, సామాజిక కార్యకర్తగా ముస్లిం మహిళల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.

ఆమె రాసిన కవితా సంకలనాల్లో 'నఖాబ్' అత్యంత ప్రాచుర్యం పొందింది. 'నకాబ్' అంటే ముసుగు అని అర్థం. ముస్లిం స్త్రీల జీవితాలు బురఖా అనే ముసుగు వెనుక ఎలా మగ్గిపోతున్నాయో, వారి ఆశలు, ఆశయాలు ఎలా చిదిమేయబడుతున్నాయో ఈ సంకలనంలో ఆమె అత్యంత శక్తివంతంగా చిత్రించారు. అలాగే ఆమె రాసిన 'జమీలా' అనే దీర్ఘ కవిత ముస్లిం స్త్రీవాద సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ముస్లిం సమాజంలోని అంతర్గత సంస్కరణల కోసం ఆమె చేసే రచనలు అటు సాహిత్యకారులను, ఇటు సామాన్యులను ఆలోచింప జేస్తాయి.

షాజహానా కవిత్వంలో భాష చాలా పదునుగా ఉంటుంది. తెలుగు పదబంధాల మధ్య ఉర్దూ పదాలను మేళవించి, ముస్లింల సహజ జీవన పరిమళాన్ని ఆమె తన రచనల్లో అద్దుతారు. మత మౌఢ్యాన్ని, తలాక్ వంటి సామాజిక రుగ్మతలను ప్రశ్నించే క్రమంలో ఆమె చూపిన ధైర్యం అభినందనీయం. అస్తిత్వ స్పృహ, సామాజిక బాధ్యత, మరియు స్త్రీ విముక్తి అనే మూడు అంశాల చుట్టూ ఆమె సాహిత్యం పరిభ్రమిస్తుంది. నేటి తరం రచయితలకు ఆమె ఒక గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారు.

### మేరా జహా' నవల - మనవీయ కోణాలు

తెలుగు సాహిత్యంలో 1990ల తర్వాత వచ్చిన అస్తిత్వ వాదాల్లో ముస్లింవాదం ఒకటి. షాజహానా రాసిన 'మేరా జహా' నవల ముస్లిం మహిళల అంతరంగిక, బాహ్య ప్రపంచాల మధ్య జరిగే సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. 'మేరా జహా' అంటే 'నా ప్రపంచం' అని అర్థం. ఒక ముస్లిం స్త్రీ తన పరిమితులను అధిగమించి తనకంటూ ఒక లోకాన్ని ఎలా నిర్మించుకుందో ఈ నవల వివరిస్తుంది.

### వస్తువు - సామాజిక నేపథ్యం

ఈ నవల కేవలం ఒక కుటుంబ కథ కాదు. ఇది ముస్లిం సమాజంలోని పితృస్వామ్య పోకడలను, మతపరమైన కట్టుబాట్లను ప్రశ్నిస్తుంది. నవలలో స్త్రీల విద్య, పర్దా పద్ధతి, మరియు చిన్న వయసులోనే వివాహం చేయడం వంటి అంశాలను రచయిత్రి ప్రధానంగా చర్చించారు. స్త్రీకి కేవలం 'వంటగది' మాత్రమే ప్రపంచం కాకూడదనే వాదన ఇందులో కనిపిస్తుంది.

### ముస్లిం స్త్రీ అస్తిత్వం

నవలలో కథానాయిక తన గుర్తింపు కోసం పడే తపన

ప్రధానాంశం. మతం ఇచ్చే గౌరవం ఒకవైపు, సమాజం చూపే వివక్ష మరోవైపు ఉన్న స్థితిని షాజహానా చిత్రించారు. ఒక సన్నివేశంలో పాత్ర తన ముసుగును (నఖాబ్) కేవలం వస్త్రంగా కాకుండా, తన గొంతును నొక్కేసే సామాజిక అడ్డుగోడగా భావించడం ఆమె అస్తిత్వ స్పృహను తెలియజేస్తుంది.

**భాషా విశిష్టత**

షాజహానా ఈ నవలలో 'దక్కనీ తెలుగు'ను అద్భుతంగా వాడారు. ముస్లింల ఇళ్లలో వాడే సహజమైన భాషను వాడటం వల్ల నవలకు ప్రాణం వచ్చింది. "అమ్మా!" అనడానికి బదులు "అమ్మీ!", "నాన్న"కు బదులు "అబ్బా!", అలాగే "దువా", "ఖైర్", "ఇన్షా అల్లా" వంటి పద ప్రయోగాలు పాఠకుడిని ఆ వాతావరణంలోకి తీసుకెళ్తాయి.

**పితృస్వామ్య విమర్శ**

ముస్లిం సమాజంలోని పురుషాధిక్యతను షాజహానా ఎక్కడా వెనకాడకుండా విమర్శించారు. స్త్రీ నిర్ణయాల్లో పురుషుడి ప్రమేయం ఎంతవరకు ఉండాలనేది ఆమె ప్రశ్న. పెళ్లి విషయంలో అమ్మాయి ఇష్టాయిష్టాల కంటే, 'ఖాన్దాన్' (వంశం) గౌరవానికే పెద్దపీట వేయడాన్ని రచయిత్రి ఇందులో నిరసించారు.

షాజహానా గారి 'మేరా జహా' నవలలోని పాత్ర చిత్రణ అత్యంత సహజంగా, సమాజంలోని వివిధ ప్రవృత్తులకు అద్దం పట్టేలా ఉంటుంది. ఈ నవలలోని పాత్రలు కేవలం కల్పిత వ్యక్తులు కాదు, అవి ముస్లిం సమాజంలోని ఆచారాలు, ఆశలు మరియు అస్తిత్వ పోరాటాలకు ప్రతిరూపాలు. షాజహానా గారి 'మేరా జహా' నవల కేవలం ఒక వర్గానికో లేదా మతానికో పరిమితమైన కథ కాదు; ఇది విశ్వజనీనమైన మానవీయ కోణాలను ఆవిష్కరించిన ఒక అద్భుత సృజన.

ఈ నవలలో మానవ సంబంధాలు, మనస్తత్వాలు మరియు సామాజిక విలువల విశ్లేషణను ఈ క్రింది విధంగా చర్చించవచ్చు:

**స్త్రీ అస్తిత్వం - ఆత్మగౌరవం**

ఈ నవలలోని అతిపెద్ద మానవీయ కోణం స్త్రీ స్వేచ్ఛ. ఒక మనిషిగా స్త్రీకి ఉండాల్సిన కనీస హక్కులను, తనకంటూ ఒక లోకాన్ని (మేరా జహా) సృష్టించుకోవాలనే తపనను షాజహానా ఇందులో చిత్రించారు. కుటుంబ నియంత్రణలు, మతపరమైన ఆంక్షల మధ్య నలిగిపోతున్న స్త్రీ, తన మేధోశక్తిని గుర్తించి సమాజంలో తన స్థానాన్ని వెతుక్కోవడం ఒక గొప్ప మానవీయ పరిణామం.

**తల్లీకూతుళ్ల అనుబంధం**

నవలలో తల్లి మరియు కూతురి మధ్య ఉండే సంబంధం అత్యంత సున్నితంగా చిత్రించబడింది.తల్లి పాత్ర తన కూతురు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి లోలోపల కుమిలిపోతుంది. తాను పడ్డ కష్టాలు కూతురు పడకూడదని ఆశపడే ఆ తల్లి వేదనలో సార్వజనీనమైన మాతృత్వం కనిపిస్తుంది. సామాజిక ఒత్తిళ్ల వల్ల ఆమె పైకి కఠినంగా కనిపించినా, లోపల ఉన్న మానవీయత కూతురికి అండగా నిలుస్తుంది.

**సంప్రదాయం వర్సెస్ ఆధునికత**

పాత తరానికి, కొత్త తరానికి మధ్య జరిగే సంఘర్షణ ఈ నవలలో ఒక ముఖ్యమైన కోణం. పితృస్వామ్య వ్యవస్థలో పురుషులు 'గౌరవం' పేరిట విధించే ఆంక్షలు, ఆధునిక విద్య ద్వారా మార్పు కోరుకునే యువతరం మధ్య జరిగే ఈ ఘర్షణ కేవలం ముస్లిం ఇళ్లలోనే కాదు, ప్రతి సామాన్య గృహంలోనూ జరిగేదే. ఈ తరాల మధ్య అంతరం ఒక ముఖ్యమైన మానవీయ కోణం.

**సామాజిక వివక్ష - పక్షపాతం**

ముస్లింలు సమాజంలో ఎదుర్కొంటున్న చిన్న చూపును, వారి పట్ల ఉన్న అపోహలను ఈ నవల ప్రశ్నిస్తుంది. ఒక వర్గాన్ని కేవలం మతం ప్రాతిపదికన కాకుండా, వారిలోని మానవత్వాన్ని చూడాలని ఈ నవల కోరుకుంటుంది. ముస్లిం మొహల్లాల్లో ఉండే పేదరికం, నిరక్షరాస్యత, మరియు వారి సుఖదుఃఖాలను చిత్రించడం ద్వారా పాఠకులలో సానుభూతిని కలిగిస్తుంది.

**స్నేహం మరియు సహానుభూతి**

నవలలో పాత్రల మధ్య ఉండే స్నేహ సంబంధాలు

కూడా మానవీయ విలువలను చాటుతాయి. కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరికి ఒకరు తోడుగా నిలవడం, సామాజిక ఆంక్షలను ధిక్కరించి అయినా తోటివారికి సహాయం చేయడం వంటి అంశాలు ఇందులో కనిపిస్తాయి. 'మేరా జహా' నవల మతపరమైన సరిహద్దులను దాటి, మనిషి స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. షాజహానా గారు ఈ నవల ద్వారా "ప్రతి వ్యక్తికీ తనకంటూ ఒక ప్రపంచం ఉండాలి, అది స్వేచ్ఛా వాయువులతో నిండి ఉండాలి" అనే గొప్ప మానవీయ సందేశాన్ని అందించారు.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
2. మేరా జహా నవలా - షాజహాన


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# బసివిని వ్యవస్థపై - చెరగని చైతన్య "ముద్ర"

- మద్దిలేటి సోమశేఖర్

పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం.

ఈ నవలలోని పాత్రలన్నీ సమాజంలో కనిపించే పాత్రలే. అయితే జీవితంలో ఎదురైనా కొందరి వ్యక్తులు వారి వ్యక్తిత్వాలు అనుభవించిన అనుభవంలో ముందుకు సాగుతుంది ఈ నవల.. నాడు గ్రామాలు పట్టుకొమ్మలు అంటారు కానీ.. నాటికి నేటికీ గ్రామాలు ఎప్పుడు గాడి తప్పిన గత తాలూకు జ్ఞాపకాలే. చాలా వైభవంగా, విలాసవంతం జీవితాలను గడిపే ఉన్నత వర్గాల వారు, కంచం దగ్గరకు వచ్చే కులం మంచం దగ్గరకు వచ్చేసరికి అగ్రవర్ణాల వారి ఆధిపత్యం ఎక్కడికి పోయింది. అధమవర్ణాల వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ వాళ్ళ మానాన్ని హీనంగా చూస్తూ ఆదర్శమైన స్త్రీలు సమాజంలో ఉంటారని ఆ రోజుల్లో చెరగని ముద్ర వేసిన నవల వి.ఆర్. రాసాని గారు రాసిన "ముద్ర" నవల.

స్త్రీలను ముఖ్యంగా తక్కువ వర్ణాలలోని కుటుంబాలలో ఉన్న అమ్మాయిలను వారి పరిమిత దుఃఖాలను వారిని తొక్కివేసే సామాజిక నిర్బంధాలను ఆత్మీయానుభూతితో చిత్రించడం జరిగింది. అగ్రవర్ణాల విషపుకోరల్లో చిక్కుకున్న తక్కువజాతి స్త్రీలు బసివిని వ్యవస్థ అనే భయంకరమైన అలవాటు దారిద్ర్యం నీడల్లో మగ్గుతున్న కుటుంబాల్లోని స్త్రీలను అనూహ్యమైన పతనపాలు చేసి సర్వనాశము కావించే అజ్ఞానం కొద్దీ, మూఢ నమ్మకం కొద్దీ, గుడ్డిగా అనుసరించేవారు. ఎక్కడెక్కడ అందమైన స్త్రీలు ఉంటే వాళ్ళని ఎలాగైనా ఉన్నత వర్ణాల వారు ప్రయోజనాల కోసం స్త్రీల పట్ల గౌరవాన్ని చూపకుండా వాళ్లకి రాజముద్ర లేసి మరీ ఉసిగొల్పే బసివిని వ్యవస్థలోకి ఆశీర్వదించే ముద్ర నవలలో ఇతివృత్తం.

నవలలోని భాష రాయలసీమ యాసలో నడుస్తుంది. ప్రజల జీవనశైలిని చూసి చలించినంత ఆర్ద్రత, అనుభూతి, కలుగుతుంది. ఆ మూలాల్లోకి మనల్ని నడిపించే మొదటి సాధనం ఆ భాషలోని యాసే. 'ముద్ర' అని రచయిత పేరు ఊరికే పెట్టలేదు. ఆ ముద్రలను గుండెల్లో సాక్షాత్కరింప చేశాడు. బస్విని వ్యవస్థ గురించి చాలా సాహిత్యం వచ్చింది. ఈ నవలలోని కొత్త విషయమిటంటే బసివినీ వ్యవస్థను తాను కల్లారా చూసి రచయిత తన వర్గ సమాజంలోని బాధితుల కోసం నిలువెత్తు గొంతులా నిలచాడు. తక్కువజాతి స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను ఆ ఊబీలో చిక్కుకొని తనకోసం ఆర్ద్రతతో వచ్చినవారికి కొంగుపరిచి తన ఇష్టానికి మనసుకు సంబంధం లేకుండా తమకంటూ ఒక జీవితం ఉందని కనీసం చెప్పుకోవడానికి కూడా నోచుకోలేని బసివినీల చైతన్యాన్ని రాసాని ఈ నవలలో చిత్రించారు. ఒకవర్గమే బసివినిలుగా మారాల్సి వస్తుంది. ఎవరి స్వార్థం కోసం

ఎవరు బలవుతున్నారో కారణాల అన్వేషణ అగ్రకులాల వారి ఆధిపత్యానికి బాణాలు సంధించిన నవల అర్థంలేని నమ్మకాలు, కుల వ్యవస్థ, పేదరికం, వ్యసనాలు బతుకుల్ని ఎంతగా బలి తీసుకుంటాయో ప్రత్యక్ష సాక్షి 'ముద్ర' నవల.

ఈ వ్యవస్థలో స్త్రీలపై జరిగిన దుర్మార్గాలు, స్త్రీలను వస్తువుగా మార్చిన సమాజ నియమాలు జీవిత కథలుగా తెలుసుకుంటున్నప్పుడు అంతులేని విషాదానికి లోనవుతాం. నిజానికి స్త్రీలకే చాలా వరకు ఇతర స్త్రీల జీవితాను భావాలు తెలియవు. ఒక వర్గానికి చెందిన స్త్రీ పుర్తిగా సమాజాన్ని అకళింపు చేసుకోవడానికి జీవితానుభ వాలతో పాటు ఆమెకు విషయ పరిజ్ఞానం కూడా అవసరం. సాహిత్యం దానికి ఎంతో ఉపయోగపడుతుంది. జనజీవితంలోంచి వచ్చిన కథలు సమాజంలో మనకు తెలియని కోణాలను చూపెడతాయి. అవి మానవమేధకు ఎంతో అవసరం కూడా. ప్రశ్నించడానికి సాహిత్యం ఒక సాధనం కూడా అనేది సమాజంలో జరుగుతున్నటువంటి మూఢనమ్మ కాలనీ మంటగలిపేందుకు సాహిత్యం ఒక ఇంధనంలో కూడా పనిచేస్తుందని అందుకు సందేహం లేదు.

రచయిత 'ముద్ర' నవల స్త్రీలపై తరాలుగా సంప్రదాయం పేరుతో జరుగుతున్న దోపిడిని వివ రిస్తుంది. రాయలసీమ ప్రాంతంలో మాదిగ కులానికి చెందిన స్త్రీలను బసివినులుగా మార్చి ముద్ర వేసి వదిలిపెడతారట. ఆమెకు గ్రామ పెద్ద కన్నెరికం చేసి ఊరి పరం చేస్తాడు. ఆ తరవాత ఆమె ఊరి సొత్తుగా ప్రతిమగవాడికి అందుబాటులో ఊరవతల గుడిసెలో జీవితాన్ని గడిపేస్తుందట. ఆమె ఊరి మగవారందరికీ అందుబాటులో ఉంటుందట.

ఆచారాల పేరుతో ఎంతటి ఘోరమైన దోపిడిని స్త్రీలు అందులోనూ వెనుకబడిన కులాలలోని స్త్రీలు అనుభ వించేవారో చెప్తుందిఈ 'ముద్ర' నవల. "బసివిగా ఏమిటి ఆ తిరుగుళ్ళు" అని కోస్తా జిల్లాలలో పిల్లలను అదిలించే వారని చదువుతుంటే ఎంత దారుణంగా ఈ ఆచారానికి ప్రతి ఒక్కరి ఆమోదం ఉండేదో అర్థం అయి అసహ్యం వేస్తుంది. జంతువులకు వేసినట్లు స్త్రీకి ముద్ర వేయడం, పైగా ఇది ఆమె తల్లి తండ్రుల సమక్షంలోనే జరగడం, అలా చేయకపోతే ఊరికి అరిష్టం అనే మూఢనమ్మకాన్ని తమ స్వార్థం కోసం సమాజం వాడుకుని అమాయకమైన పేద కుటుంబాలలోని స్త్రీల జీవితాలను చీకటి మయం చేయడం, నిజంగా ఎంతటి దుర్మార్గం. కన్నెపిల్ల నగ్నంగా ఊరంతా ప్రదక్షణ చేస్తే చెరువులు నిండుతాయని, వర్షాలు కురుస్తాయనే నమ్మకమని కొన్ని ప్రాంతాలలో ఉండేదట. "గుడిచేటిదానా" అనే మాట వెనుక ఉన్న దేవదాసీ సంప్రదాయం గురించి తెలుసుకుంటే బాధని పిస్తుంది.

ఊరవతల ఒక గుడిసెలో ముసలి ఓబులవ్వ ఒంటరిగా చివరి రోజులు గడుపుతుంటుంది. ఈమెను ఎప్పుడో బసివినిగా మార్చింది ఆ ఊరు. పిల్లలు పుట్టట్లేదని ఆమె తల్లి తండ్రులే ఆ ఊరి అమ్మవారు అయితమ్మకు మొదటిబిడ్డను మాతమ్మగా మార్చుతా మని ఆమె పుట్టినప్పుడే మొక్కుకున్నారట. అలా ఓబులవ్వా ముద్ర వేయించుకుని ఊరిపరం అయింది. వయసయిపోయాక ఎవరూ చూడక ఎక్కడెక్కడో తిరిగి చివరకు మళ్ళీ ఆ ఊరే చేరి ఆ గుడిసెలోనే ఉండి పోతుంది ఓబులవ్వ. అక్కడే అడుక్కుంటూ కడుపు నింపుకుంటుంది. ఆమె గుడిసెకు ఓ అర్ధరాత్రి పూట వస్తుంది హసీనా. రాత్రిపూట కొన్నాళ్ళు తనను ఆ గుడిసెలో ఉండనివ్వమని ఓబులవ్వ చేతిలో వంద నోటు పెడుతుంది. ఓబులవ్వకు చిన్న చిన్న అవసరమైన వస్తువులు తీసుకువస్తూ ఉంటుంది. గుండెకాయలాయన మనవరాలు ఎలా ఉందని హసీనా అడగడంతో ఓబులవ్వ ఆమె ఆ ఊరికి చెందిన మనిషేనని అనుమానపడు తుంది.

ఆ ఊరిలో కొన్నేళ్ళ క్రితం ఓ పన్నెండేళ్ళ చిన్నపిల్ల బుడ్డమ్మను బలవంతంగా బసివిని చేస్తే ఆ ఊరి మునసబు ఆమెపై సంప్రదాయం పేరుతో కన్నెరికం అంటూ అత్యాచారం చేస్తాడు. తరవాత ఊరి మొగపిల్లలు ఆ చిన్నబిడ్డను కసితీరా వాడుకుంటే ఆ అత్యాచారానికి తాళలేక ఆ బిడ్డ చనిపోతుంది. ఆమెను ఆ ఊరి చెట్టుకే

వేలాడదీసి ఉరి వేసుకుందని ప్రచారం చేస్తారు ఊరిలో వాళ్లు. ఆ వాడలోనే ఓ పేద ఇంటి పెద్ద కూతురు కోటమ్మ. తండ్రి తాగుబోతు. తల్లి ఆదెమ్మతో కలిసి పొలాలలో కంకులు ఏరుకుంటూ చిన్నపనులు చేస్తూ దొరికినప్పుడు కూలికి వెళుతూ కుటుంబాన్ని చిన్న వయసులోనే నడిపిస్తూ ఉంటుంది కోటమ్మ.

అందమైన కోటమ్మతో అసభ్యంగా ప్రవర్తించబోతారు ఆ ఊరి పెద్ద మనుషులు. ఆమె వారికి ఎదురు తిరిగిందని దాన్ని అవమానంగా భావించి మోసంతో ఊరికేదో అరిష్టం రాబోతుందని, కోటమ్మపైకి అమ్మవారు వచ్చిందని నమ్మించి ఆమెను బసివిగా మారుస్తారు ఊరిపెద్దలు. ముద్ర వేయించి ఆమెకు ఊరి సర్పంచ్ మునలయ్య హక్కుదారుడవుతాడు. మునలయ్య అహంకారంతో తన జీవితం నాశనం చేసినా కోటమ్మ మరో మగాడి చేతులకు తాను చిక్కకూడదని భావించి మునలయ్యని నమ్ముకుని ఉండిపోతుంది. తన గుడిసెకు వచ్చే ఇతర మగాళ్లకు లొంగనంటుంది. మునలయ్య బిడ్డకు ఆమె తల్లి కాబోతుందని తెలిసి అతను ఇక తెలివిగా ఆమెను వదిలించుకుంటాడు. అయినా ఒంటరిగా బిడ్డను కంటుంది కోటమ్మ. కష్టపడి కూలి చేసుకుంటూ బిడ్డను పెంచుకుంటూ ఉంటుంది. బసివిని గుడిసెలో కాదని తల్లితండ్రుల ఇంట్లోనే ఉండిపోతుంది.

ఆ ఊరికి వచ్చిన అఫీసర్లకు ఆమెను అప్పగించ బోతాడు మునలయ్య. తానుపై అధికారులకు ఫిర్యాదు చేస్తానని వారిని బెదిరిస్తుంది కోటమ్మ. దీనితో ఆమెను చంపేద్దామనుకుంటాడు మునలయ్య. విషయం తెలిసి తనను ఇష్టపడిన కృష్ణయ్య ఇచ్చిన సమాచారంతో ఆ ఊరు వదిలి పారిపోతుంది కోటమ్మ. వెళుతూ తన బిడ్డను తల్లి ఆదెమ్మ దగ్గర ఉంచేస్తుంది. కూలి పనులను వెళ్ళే కోటమ్మను మణి అనే ఓ తమిళ ప్రాంతపు కూలి మనిషి ఇష్టపడతాడు. ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంట పడతాడు. తన ప్రాణం కాపాడుకోవడానికి ఆ ఊరు వదిలి అతనితో వెళ్ళిపోతుంది కోటమ్మ. కాని మణికి ఇదివరకే పెళ్లి అయిందని పిల్లలు కూడా ఉన్నారని, అతను తనను మోసం చేసాడని ఆమెకు ఊరి వదిలిన కొన్నాళ్లకు తెస్లుస్తుంది. మణి భార్య రావడంతో అదే ఇంట్లో ఓ చిన్న గదిలోకి మారుతుంది కోటమ్మ. అప్పటికే ఆమె పేరును కణ్ణెమ్మగా మారుస్తాడు మణి. కాని అక్కడా మణి అన్యాయానికి ఎదురు తిరిగడంతో, ఊరందరి ముందు ఆమెను అవమానిస్తాడు మణి. ఊరి పెద్ద మనుషులు తమ మాలవాడకు ఓ మాదిగ స్త్రీ వచ్చిందని తెలిసి అసహ్యించుకుంటారు. క్రిస్టియన్ గా మారినా మణీ తమ మాలవాడేనని మాదిగస్త్రీతో ఈ పొత్తు మంచిది కాదని ఆమెను అతను వదిలివేయాలని ఊరంతా చెప్పడంతో మణి ఆమెను ఇంటి నుండి గెంటేస్తాడు.

ఆ ఊరికి ఐస్ క్రీంలు అమ్మడానికి వచ్చే ఓ ముస్లిం సాయెబుతో కోటమ్మ ఆ ఊరు నుండి వెళ్ళిపోవలసి వస్తుంది. అతను దుబాయ్ పంపిస్తానంటూ కోటమ్మను లోబర్చుకుని ఆమెను వేశ్యాగృహానికి అమ్మేస్తాడు. పద్దెనిమిది సంవత్సరాలు అలా బతికి చివరకు తన కూతురు కోసం ఆ ఊరు మళ్లీ వస్తుంది హసీనాగా మారిన కోటమ్మ. ఈ ఊరు వచ్చాక తన కూతురికి కూడా బసివినిగా మారుస్తున్నారని, తనకు కన్నెరికం చేసిన మునలయ్య కొడుకే కూతురి జీవితం పాడు చేయడానికి ఉత్సాహం చూపుతున్నాడని తెలుసుకుంటుంది. ఊరందరిలో చైతన్యం తీసుకువచ్చి కూతురు ప్రేమించిన స్కూలు టీచర్తో ఆమె వివాహం జరిపిస్తుంది. తాను సంపాదించిన డబ్బు కూతురికే అప్పగించి ఎవరికీ చెప్పకుండా ఆ ఊరు వదిలి వెళ్లిపోతుంది. అప్పటికే తన శరీరం రోగాల పుట్ట అయిందని, ఆ పరిస్థితులలో ఆ ఊర్లో ఉంటే కూతురు జీవితానికి తాను అడ్డు అవుతానని భావించి ఆ ఊరు శాశ్వతంగా వదిలిపెడుతుంది కోటమ్మ. ఓబులవ్వ అదే రాత్రి మరణిస్తుంది.

బసివినిని చేయడానికి ముందు ఆ ఊరిలోని చివరి గిడిసెను బాగు చేసి, పెళ్లి కూతురులా ఆడపిల్లను తయారు చేసి అంతకు ముందు బసివినిగా మారిన స్త్రీతో తాళి కట్టించి, ఆమె ఒంటి మీద ముద్ర వేయిస్తారు ఊరి వాళ్ళు. వాళ్ళు కొలిచే దేవతపేరు అయితమ్మ. ఆ గుడిలోనే ఈ తతంగం అంతా జరిపించి ఆ అమ్మాయిని

గుడిసెలోకి మారుస్తారు. ఇక మొదట ఆమెను కన్నెరికం పేరుతో ఊరి పెద్ద వాడుకున్నాక ఆమె ఇక ఆ ఊరి మగవారందరి ఆనందం కోసం ఉపయోగపడుతుంది.

కోటమ్మను ప్రేమించి ఒంటరిగా మిగిలిపోయిన కృష్ణుడు ఆ అయితమ్మ గుడిని కూల్చేసి, ఆ బసివిని గుడెసెను కాల్చి ఆ సంప్రదాయంపై తిరుగుబాటు ప్రకటిస్తాడు. తాను హిందువుగా, క్రిష్టియన్గా, ముస్లింగానూ బతికానని, ఏ మతంలోనూ స్త్రీకి రక్షణ లేదని నిర్వేదంతో తన జీవితానుభవాన్ని వివరించే హసీనా ద్వారా సమాజంలో బడుగుజాతి స్త్రీల జీవన పరిస్థితులను వివరిస్తారు రచయిత. కోటమ్మది మొదటి నుండి అన్యాయాన్ని ఎదిరించే వ్యక్తిత్వమే. అందుకే తనను అవమానించబోయిన ఊరి పెద్దలకు బుద్ధి చెప్పి కోపానికి గురి అవుతుంది. కసితో ఆమెను సంప్రదాయం పేరుతో బసివినిగా మారిస్తే ఊరందరికి చిక్కకుండా ముసలయ్యను ఆకట్టుకుని అతనికి లొంగిపోయి కూడా ఊరు సొత్తు కాకుండా తనను తాను కాపాడుకుంటుంది. కాని తనను కాదని బిడ్డను కన్నదని, ఆఫీసర్లకు లొంగక వారిని బెదిరించిందని ఆమెను చంపబోతాడు ముసలయ్య. తప్పక మణిని నమ్ముకుని అతనితో వెళ్లిపోతుంది కోటమ్మ. కాని అక్కడ ఉంపుడుగత్తెగా ఉండలేకపోతుంది. మణి భార్యతో గొడవపడుతుంది. చివరకు కులం కారణంగా ఆ ఊరూ వదిలేయవలసి వస్తుంది. అప్పుడూ సాయిబును నమ్ముకున్నా వేశ్యాగృహం చేరుతుంది.

అయినా ఆమెలోని పోరాడే తత్వం ఆగదు. అక్కడి నుండి పారిపోయి బైటకు వచ్చి పోలీసుల సహాయంతో మరి కొందరు ఆడపిల్లలను ఆ ఇంటి నుండి రక్షించ గలుగుతుంది. కాని తన శరీరంలోని రోగం సంగతి తెలిసి కూతురు కోసం మళ్లీ ఊరు వస్తుంది. కూతురు కోసం ఊరంతటినీ ఎదురిస్తుంది. తోటి కులం స్త్రీలలో చైతన్యం తీసుకువస్తుంది. కూతురికి పెళ్లిచేసి తాను అక్కడ ఉండడం మంచిది కాదని శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లిపోతుంది. అక్కడ ఉన్న కొన్ని రోజులు ముసలి ఓబులవ్వకు అండ అవుతుంది. ఆమె అనాధలా చనిపోకుండా తనకు తోచిన విధంగా సహాయపడుతుంది. అంతటి కష్టంలోనూ చివరిదాకా పోరాడుతూనే ఉన్న కోటమ్మ పాత్ర మనలను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

రచయిత కోటమ్మ పాత్ర ద్వారా సమాజంలో బసివినిల రూపంలో స్త్రీలపై జరుగుతున్న దోపిడిని చర్చిస్తూనే వారి జీవితాల పట్ల వాళ్ళే తిరుగుబాటు చేయాలనే సందేశాన్ని సూచిస్తారు. స్త్రీలందరూ ఒక్కటయి ఆ సంప్రదాయాన్ని ఊరి నుండి పారద్రోలడం, ఈ దోపిడీ సమాజంలో జీవితాలను మెరుగు పరుచుకోవడానికి స్త్రీలు అవలంబించాల్సిన మార్గంగా ఈ సమస్యకు పరిష్కారం చూపడం బావుంది.

**ముగింపు :**

'ముద్ర' నవలలో బసివినుల జీవితాల్లో మార్పుల కోసం సంస్థాగతమైన కృషి గాని ప్రభుత్వ పరమైన కృషిగాని సూచించలేదు రచయిత. కానీ కథానుగుణంగా వ్యవస్థపై వ్యక్తి తిరుగుబాటు చేసినట్టు చిత్రించబడింది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ అనాచారాన్ని ఆపడానికి రచయిత కోటమ్మ పాత్ర ద్వారా ప్రజల్లో స్త్రీలలో చైతన్యం కలిగించి ఆ దురాచారాన్ని నిర్మూలించడానికి కృషి చేశారు. ఈ విధంగా ముద్రనవలలో బసివినిలా జీవితాలను వస్తువుగా గ్రహించి ఆచారాలు సంప్రదాయాల పేరిట తమ అవసరాలను తీర్చుకోవడానికి అగ్రకులాలవారు దళిత వెనుకబడిన కులాలకు చెందిన స్త్రీలను ఏ విధంగా వాడుకుంటున్నారో ఉపయోగించుకున్నది వివరించడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. "ముద్ర" రాసాని డా. వి. ఆర్
2. శ్రీరామమూర్తి, కోడూరి "తెలుగునవల: పరిణామం-ప్రభావం" తెలుగు విశ్వవిద్యాలయం, 1997.
3. చలసాని, ప్రసాద్. "తెలుగు నవల: సామాజిక దృక్పథం" ఎమెస్కో బుక్ హౌస్, 2004.
4. నారాయణరావు, వెల్చేరు. "తెలుగు సాహిత్య విమర్శ: సంప్రదాయం మరియు ఆధునికత". ఓరియెంట్ లాంగ్‌మాన్, 2002.


❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కేశవరెడ్డి నవలలు - బహుజన జీవన చిత్రణ

- కూచం తేజేశ్వర
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

వృత్తిరీత్యా వైద్యులైన కేశవ రెడ్డిగారు ప్రయోగంలా ఉండే వారి రచనల ద్వారా తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు. కేశవ రెడ్డి గారు చిత్తూరు జిల్లాలోని తలుపుల పల్లె గ్రామంలో 1946 మార్చ్ 10న పుట్టారు. పాండిచ్చేరిలో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేశారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లిలోని ఆసుపత్రిలో వైద్యులుగా సేవలు ప్రారంభించి అటు తర్వాత తెలంగాణలోని వివిధ ఆసుపత్రులలో వైద్య సేవలు అందించారు. వీరి రచనలు దాదాపుగా అన్నీ శ్రామిక పక్షపాతంతో, బహుజనుల సమస్యల పట్ల సానుభూతితో ఉంటాయి. రాయలసీమ ప్రాంతంలోని గ్రామీణ జీవితంలోని సంఘర్షణలే ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని రచనలు చేశారు.

కేశవ రెడ్డి గారు కొన్ని నవలలే రాసినప్పటికీ వాటిలో వారి రచన శైలితో ఆయా పాత్రల జీవితాలను, ఆ జీవితాలలో జరిగే సంఘర్షణలను పాఠకుల కళ్ళ ముందు ప్రత్యక్షం చేసారు. దానివలన వీరి నవలలను చదవడం ప్రారంభించిన తర్వాత ఆ నవలలే మనల్ని ఆసాంతం ఏకబిగిన చదివేలాగా చేస్తాయి. సాధారణంగా ఒక పుస్తకాన్ని అందులోనూ ఒక నవలను చదవడం అంత సాధ్యమైన పని కాదు. చదివే మనసు ఉన్నప్పటికీ ఆ నవలలను చదవడం ప్రారంభించిన వెంటనే పాటకునిలో ఒక కుతూహలం రేకెత్తాలి, ఏదో చెప్పబోతున్నాడు అనిపించాలి, ఆ కథ మన కళ్ళ ముందు నిలవాలి అప్పుడే ఆ నవలను పాఠకుడు ఆపకుండా చివరి వరకు ఏకధాటిగా చదువుతాడు. ఇవన్నీ జరగాలంటే ముఖ్యంగా ఆ నవలలో జీవం ఉండాలి, అప్పుడే ఆ నవల చదివేవారి మనసుకు చేరువ అవుతుంది. ఈ జీవం కేశవరెడ్డి గారి ప్రతి నవలలూనూ కనబడుతుంది. అందుకే కేశవ రెడ్డి గారి నవలను ఒక్కదాన్ని చదివిన వారు మిగిలిన అన్నింటిని కూడా పూర్తి చేస్తారు.

డా. కేశవ రెడ్డి గారు తన రచనా ప్రస్థానంలో స్మశానం దున్నేరు, అతడు అడవిని జయించాడు, చివరి గుడిసె, రాముడు ఉండాడు రాజ్జి ముండాది, ఇన్క్రెడిబుల్ గాడెస్, మూగవాని పిల్లన గోవి, మునెమ్మ, భగవానువాచ, సిటీ బ్యూటిఫుల్ వంటి రచనలు చేశారు. ఇందులో నా ఈ పత్రం కోసం బహుజనుల జీవిత గాథలే ప్రధానంగా ఉన్న చివరి గుడిసె, స్మశానం దున్నేరు, అతడు అడవిని జయించాడు అనే మూడు నవలను తీసుకున్నాను.

ఈ మూడు నవలలో రచయిత బహుజనుల జీవితాలను ఏ విధంగా చిత్రించారు, అలాగే శ్రామికప్రజలు వారి జీవిత పోరాటంలో ఎదుర్కొంటున్న సంఘర్షణలు,

ఆ పోరాటాల్లో చితికిపోయిన బహుజన జీవితాలు ఏ విధంగా చిత్రించారు అనేది ఈ పత్రం ద్వారా పరిశీలిస్తాను.

**చితికిన యానాది బతుకులు :**

ఒక జాతిని మొత్తాన్ని తల్లి కడుపులో నుంచే నేరస్తులుగా నిర్ణయించాయి నాటి ప్రభుత్వాలు. ఈ ప్రభుత్వాలు ఆడే ఆటలకు బలైనది అమాయకులైన యానాది ప్రజలు. నల్లమల్ల అడవిలో ఉండే యానాదులు, అడవులను విడిచి వ్యవసాయక కుటుంబాలు ఉన్న గ్రామాలపై ఆధారపడి జీవనం సాగించడం ప్రారంభించారు. అలాంటి అమాయకులపై గ్రామాలలోని భూస్వాములు చేసిన అరాచకాలు, ఒక యానాది కుటుంబాన్ని మొత్తాన్ని మాయం చేసిన భూస్వామి దౌర్జన్యం, తిరగబడి ఆ యానాదులు భూస్వామిని అంతం చేసిన తీరును "చివరి గుడిసె" నవలలో రచయిత మన ముందు ఉంచారు.

ఇందులో ఒక యానాది కుటుంబం, ఆ కుటుంబంలో భాగమై బతికే, భూస్వామ్య దౌర్జన్యాని బలైన ఒక వ్యక్తి (బైరాగి) అస్తిత్వం నిలుపుకోవడం కోసం వారు చేసిన పోరాటం ప్రధానమైన అంశాలు. ఆ ఊరి భూస్వామి, ఆహారం ఏరుకుతినే యానాది వ్యక్తి శ్రమని, అస్తిత్వాన్ని కొల్లగొట్టాడు. అప్పుడు వీరిద్దరి మధ్య జరిగిన సంఘర్షణ బహుజనులకు దోపిడీదారులకు మధ్య తరాల నుంచి జరుగుతున్న పోరాటానికి ప్రతిరూపం.

ఈ కథలో బైరాగి బలహీన వర్గాలలో ప్రశ్నించే తత్వానికి ప్రతీక. ఆ భూస్వామి చేసిన దౌర్జన్యాలు అన్నింటికీ సమాధానం చెబుతూ బైరాగి జంతువుల ప్రవర్తించిన భూస్వామిని మరో జంతువు (కుక్క) చేత చంపిస్తాడు. కానీ అప్పటికే యానాదివాడైన మన్నుగాడు, అతని కొడుకు చిన్నోడిని పోగొట్టుకుని సర్వం కోల్పోయాడు. ఇక్కడ దోపిడీదారులతో పోరాడి గెలిచి నప్పటికీ బహుజన వర్గం ఏ విధంగా చిన్నాభిన్నం అవుతుందో రచయిత చూపించారు. ఇందులో రచ యిత గెలుపు ఓటమి గురించి కాకుండా బహుజన వర్గం తమ అస్తిత్వం నిలుపుకోవడం కోసం పోరాడాలని సూచిస్తున్నారు.

**పోరాడి ఓడిన పందుల కాపరి :**

పందుల మేపుకునే వారి జీవితాన్ని పరిచయం చేసిన నవల "అతడు అడవి జయించాడు". ఇందులో పందులు మేపుకునే ఒక ముసలివాడు, ఒక సుక్క పంది ఈ రెండు పాత్రలే ప్రధానమైనవి. ఈ నవలలో కథ చిన్నదైనప్పటికీ, ఆ పందులను మేపుకునే ముసలివాడు ఆ సుక్క పందిని, దాని పిల్లలు (సలుగులు) నీ కాపాడుకోవడం కోసం చేసిన పోరాటం, బలహీన వర్గంలోని ప్రతి ఒక్కరి జీవితాలను నిలుపుకోవడం కొనం చేసే పోరాటానికి సాక్షి భూతం. ఆ పందుల మేపే ముసలాయన తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఆ సలుగుల్ని, సుక్క పందిని కాపాడడం కోసం ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఇది శ్రామిక వర్గం వారి కష్టాలతో పోరాడి ఓడిపోతున్న తీరుకు నిదర్శనం.

ఇందులో ఒక పందుల మేపే వ్యక్తి జీవితాన్ని మనకు పరిచయం చేశాడు రచయిత. అలాగే పాఠకులకు పూర్తిగా అపరిచితమైన అడవి నేపథ్యాన్ని వందలాది వృక్ష, జంతు జాతులతో నింపి ఆ అడవిని రమణీయంగా, క్రూరంగా, వైవిద్య భరితంగా, ఉత్కంఠతతో ప్రతిష్టించారు కేశవరెడ్డి. ఇందులోని కథంతా నాగరిక సమాజానికి దూరంగా, శ్రామిక సమాజానికి చేరువుగా, బహుజన జీవితాలకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ నవలలోని రచయిత చిత్రించిన అడవి అస్తవ్యస్తమైన నాగరిక సమాజానికి, ఆ పందులను మేపే ముసలాయన ఈ నాగరిక సమాజంలో నలిగిపోతున్న బాహుజనుల బ్రతుకులకు నిదర్శనంగా ఉన్నాయి.

ఈ నవలలో సుక్క పందిని కాపాడడం కోసం దాని యజమాని ఒక రాత్రంతా చేసే పోరాటం అనే అంశాన్ని కాస్త పరిశీలనా దృష్టితో చూస్తే మరో విషయం కూడా సమాంతరంగా చివరి వరకు సాగుతున్నది. అది పీడనకు గురౌతున్న అందరు బహుజనుల జీవితం. అందుకే ఈ నవలలోని ప్రధాన పాత్ర అయినా ఆ ముసలి వ్యక్తికి ఏ పేరు పెట్టలేదు. అది బహుజనుల అందరి తరపున నిలబడిన పాత్ర. ఇందులో కథ ఒక రాత్రిలో ముగుస్తుంది అది ఒక జీవితానికి నిదర్శనం. ఇక్కడ ఆ ముసలి వ్యక్తి

ఆ చీకటిలో, తోడేళ్లు,నక్కలతో చేసిన పోరాటం నేటి సమాజంలో బహుజనులు దోపిడీదారులతో చేస్తున్న పోరాటానికి ప్రతిరూపం. చివరకు ఆ ముసలాయన తాను కాపాడుకున్నాను అనుకున్న పంది పిల్లలను కూడా రాబందులు తినేయడం అనేది శ్రామిక వర్గం చేస్తున్న కష్టాన్ని పెత్తందారులు చివరివరకు దోచుకునే తీరును ఇక్కడ సూచిస్తున్నది.

ఈ నవలలో చివరకు ఆ పందుల మేపుకునే ముసలాయన చేతిలో కత్తి, ఈటెలతో తిరిగి తన గుడిసెకి వస్తాడు. ఇది సమాజంలో శ్రామిక వర్గం ఎంత పోరాడిన ఫలితం చేరువ కావడం లేదు , మళ్లీ వారికి పోరాటం చేయడం మాత్రమే శరణ్యంగా మిగిలిపోయింది. ఇక్కడ పోరాటం ఒక్కటే బహుజన అస్తిత్వాన్ని రుజువు చేసు కునేందుకు మిగిలి ఉన్నది అనే విషయాన్ని రచయిత చెప్పకనే చెబుతున్నారు.

**శ్రామిక వర్గాన్ని విభజించి పాలిస్తున్న భూస్వాములు:**

నాటి నుంచి కొనసాగుతూ ఉన్న పీడిత వర్గాలలోని అంతర్గత వైరుధ్యాలను రెచ్చగొట్టి దానిని తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న పెత్తం దారుల అరాచకాలను రచయిత “స్మశానం దున్నేరు”అనే నవలలో చూపించారు. అందుకే ఈ స్మశానం దున్నేరు కేవలం కల్పిత నవల కాదు. బహుజనుల జీవితాలను రికార్డు చేసిన రచన. పెత్తందారులు ఈ వైరుధ్యాలను రెచ్చగొడుతూ, తమ పీడన కింద అణగారి పోతున్న శ్రామిక వర్గం ఏకం కాకుండా ఉండేందుకు ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారో ఈ నవల మనకు చెబుతుంది.

ఈ నవలలో పెత్తందారుడు పెదరెడ్డి. ఇతని కి ఉన్న 400 ఎకరాల వ్యవసాయ భూమిని చూసుకునే వ్యక్తి వెనుకబడిన వర్గానికి చెందిన వెంకటాద్రి. ఈ వెంకటాద్రి ఆ ఊరిలో ఉన్న స్మశానంలో పనిచేయడానికి మిగిలిన బహుజన వర్గాల వారిని తీసుకొని వెళ్తాడు. అక్కడ వారికి కొన్ని నాణేలు దొరుకుతాయి. వాటి పంపకంలో బహుజనులలో ఒక వర్గానికి చెందిన రంపాల వీర భద్రుడికి అన్యాయం జరుగుతుంది. ఆ అన్యాయాన్ని ప్రశ్నిస్తాడు వీరభద్రుడు. అక్కడే ఉంటూ బహుజనులపై తానే పెత్తందారి అన్నట్టుగా ప్రవర్తిస్తున్న వెంకటాద్రికి అది గిట్టదు. వాస్తవానికి తాను బహుజనులపై ఎంత పెత్తనం చెలాయించిన పెదరెడ్డికి తాను ఒక తొత్తును అన్న విషయం గుర్తించలేకపోయాడు. ఇంక అందరూ ఒక్కటై ప్రశ్నించిన వీరభద్రుడిని, అతని కుటుంబాన్ని నామ రూపాలు లేకుండా చేస్తారు.

ఆ సమస్య మరింత పెరిగి బహుజనులు ఉన్న వాడంతా తగలబడుతుంది. ఈ సమస్యపై కేసు నమోదు అవుతుంది. అంగ బలం అర్థబలం ఉన్న పెదరెడ్డి తప్పించుకుని. వెనుకబడిన వర్గాలకు చెందిన వెంక టాద్రిని, బహుజన వర్గానికి చెందిన 30 మంది శ్రామికు లను దోషులుగా నిలబెడతాడు. వారికి కోర్టు పది సంవత్స రాల జైలు శిక్ష విధిస్తుంది. అన్యాయంగా వారందరూ పది సంవత్సరాలు పాటు జైలు శిక్షను అనుభవిస్తారు.

శిక్షణ అనుభవించి పది సంవత్సరాల తర్వాత జైలు నుంచి తిరిగి వచ్చిన వెనుకబడిన వర్గానికి చెందిన వెంకటాద్రి, బహుజన వర్గానికి చెందిన మిగిలిన 30 మంది ఏకమవుతారు. వారికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడం కోసం శ్రామిక వర్గమంతా ఏకమై ఆ ఊరిపై పెత్తనం చేస్తున్న పెదరెడ్డిని, అతని పరివారం అంతటినీ ఆ ఊరి శివాలయంలోని సూలాలతో పొడిచి చంపి వారి కథకు ముగింపు పలుకుతారు.

ఇక్కడ బహుజన వర్గాల్లో అంతర్గతంగా సమస్యల సృష్టించి ఆ మంటల్లో చలికాచుకునే పెత్తందారులను, అదే బాహుజనులలో తిరుగుబాటుతనాన్ని నింపి వారి చేతిలోనే చంపించారు రచయిత. అలాగే వారి అరాచ కాలు అరికట్టాలంటే వెనుకబడిన వర్గాలు, బహుజన వర్గాలు ఏకమై తిరగబడాలని ఈ నవల ముగింపు సన్నివేశం ద్వారా పరిష్కారాన్ని చూపించారు.

అదేవిధంగా పుట్టినప్పటినుంచి బండెడు కష్టం చేస్తున్న బహుజనుల స్థితిగతులను ఈ నవలలు చూడొచ్చు. పెదరెడ్డి పూజ కోసం ఆలయానికి వెళుతూ ఉంటే అతని నిగనిగలాడే శరీరం, కట్టిన పట్టు వస్త్రాలు చూసి ఆశ్చర్య పోతున్నారు అమాయక శ్రామిక వర్గం. అదే పెదరెడ్డి

వయసులో ఉన్న వీరు ఎముకలు తేలి, వెన్ను వంగిపోయి, చెమటలు కక్కుతున్న శరీరానికి ఒక గోచి గుడ్డతో నిలబడి ఉన్నారు. ఈ మాటలలో బతుకంతా కష్టపడిన కడుపునిండా భోజనానికి నోచుకోని ఆ అభాగ్యుల దీనస్థితి కంటి కనబడుతోంది.

**ముగింపు :**

ఈ నవలలో బహుజన జీవితాలు, అంతర్గతంగా వారిలో వారు పడుతున్న సంఘర్షణ దానికి కారణమైన ఈ పెత్తందారుల అరాచకపు రాజకీయాలు అక్షర రూపం చేశారు రచయిత. అలాగే భూస్వాములు వారి స్వలాభాల కోసం, పైశాచిక ఆనందం కోసం పేదవారిని హింసించే తీరును మన కళ్ళ ముందు నిలిపారు తమ రచనలలో కేశవరెడ్డి గారు. బహుజన జీవితాల గురించి రాయాలంటే బహుజన సమాజంలో పుట్టాల్సిన అవసరం లేదు, వారి బాధలను అర్థం చేసుకునే మనసు ఉంటే సరిపోతుంది అన్న మాటను నిజం చేస్తూ రచయిత ప్రతి అక్షరాన్ని స్వయంగా అనుభూతి చెందిన విధంగా రాశారు.

అతడు అడవిని జయించాడు నవలలో బహుజనుల జీవితం, వారి లోకాన్ని మనకు పరిచయం చేశారు. చివరి గుడిసె నవలలో యానాదులు అనుభవిస్తున్న దౌర్జన్యాలను, భూస్వాముల చేతిలో వారు బలైపోతున్న తీరును తెలుసుకోగలిగాము . అలాగే అక్రమార్కులైన భూస్వాములకు బైరాగిలా ఎదురు తిరిగి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అదేవిధంగా స్మశానం దున్నేరు నవలలో శ్రామిక వర్గాల మధ్య ఉన్న చిన్న చిన్న బేధాలను పెంచి పెద్దవి చేసి దాని ద్వారా వారి స్వ ప్రయోజనాలను పొందుతున్న పెదరెడ్డి లాంటి భూస్వాముల అరాచకాలకు శ్రామిక వర్గమంతా ఏకమై ముగింపు పలకాలాని రచయిత ఈ నవల ద్వారా తెలియజేస్తున్నారు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. కేశవరెడ్డి. 2008. అతడు అడవిని జయించాడు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
2. కేశవరెడ్డి. 2008. చివరి గుడిసె. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
3. కేశవరెడ్డి. 2011. స్మశానం దున్నేరు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
4. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం. నవ చేతన పబ్లిషింగ్ హౌస్.
5. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. 2022. నవ్య పరిశోధక ప్రచురణలు.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# చిల్లర దేవుళ్ళు నవలలోని ఫ్యూడల్ సమాజం

- ఇట్టవేని రాకేశ్
పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం.

**ఉపోద్ఘాతం :**

కవిత్వం మీద వచనం చేసిన తిరుగుబాటే నవల ఆవిర్భావానికి కారణం అని అన్నారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య. రాచరిక వ్యవస్థ అంతమైపోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడడం లాంటి విప్లవాత్మక మార్పుల కారణంగానే నవల లాంటి ఒక నూతన ప్రక్రియ ఆవిర్భవించింది అని డా.అంపశయ్య నవీన్ అభిప్రాయపడ్డారు. అటువంటి సందర్భంలోనే దాశరథి రంగాచార్య గారి నవలలు పుట్టుకొచ్చాయి. ఆ కోవలో ముందు వరుసలో నిల్చునేది, మొదటి నవలే అయినా మహోన్నతంగా వెలిగింది చిల్లరదేవుళ్ళు నవల.

నేటి సంఘటనలే రేపటి చరిత్ర. కానీ జరిగే ప్రతి సంఘటనా చరిత్ర కెక్కదు. దానికి ఒక విశిష్టత ఉండాలి. తెలంగాణ చరిత్రలో 1911 కు వైశిష్ట్యమే కాదు చిరస్థాయి గుర్తింపూ ఉంది. అది ప్రజలు ప్రేమగా మహబూబ్ పాషా అని పిలుచుకునే 'గ్రాండ్ కమాండ్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇండియా' మహబూబ్ అలీఖాన్ మరణించిన సంవత్సరం. ఆయన తర్వాత 1911 సెప్టెంబర్ 12న మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అధికారం చేపట్టాడు. ఆనాడు మారింది కేవలం పాలకుడు మాత్రమే కాదు తెలంగాణ తలరాత అని బహుశా ఎవరూ గుర్తించి ఉండరు.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో ఆర్థికంగా, నిజాం రాజ్యం ఎంతో పురోగతి సాధించింది. రైల్వే లైన్లు, విద్యుత్, రోడ్లు, విమానయానం, నీటిపారుదల, విద్య లాంటి ఎన్నో రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. కానీ అతని పాలనలో ప్రజలు సామాజిక, సాంస్కృతిక, రాజకీయాది రంగాల్లో తీవ్రంగా అణిచివేయబడ్డారు. మహబూబ్ అలీ ఖాన్ కాలంలో ప్రజల నుండి నేరుగా పన్నులు వసూలు చేస్తే దళారీల, గుత్తేదారుల బెడద ప్రజలకు తప్పుతుందనే సదుద్దేశ్యంతో దివాన్ సాలార్జంగ్ ఏర్పాటు చేసినదే "తహసిల్ పద్ధతి". దీని ప్రకారం తాలూకాదారు(తహసిల్దార్), జాగీర్దార్, గిర్దావర్, వీరి కింద ఊరి కరణం, దొర ఉంటారు. కరణం పని తమకు సంబంధించిన ఊరిలోని ప్రజలనుండి పన్నులు వసూలు చేయడం, ఆ ఊరిలో ఉన్న సర్కారీ ఆస్తులను కాపాడడం, ఊర్లో జనగణన, రాకపోకల సంఖ్య, దొంగతనాలు, దోపిడీల సంఖ్య, కంసాలిలవద్ద ఉండే బంగారం విలువ మొదలైన లెక్కలతో రోజ్నామ్చా (డైరీ) రాయడం. దొర పని ఆ ఊరిని పాలించడం. ఇవి రెండు వారసత్వంగా వచ్చే హిందూ పదవులు.

**నవల ఇతివృత్తం :**

స్థూలంగా 1938కి పూర్వపు తెలంగాణా జనజీవన

చిత్రణ. 1938లో నిజాం రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. దాంతో ప్రజలకు తిరుగుబాటు తత్త్వం, ఉద్యమ స్ఫూర్తి అలవడింది. కానీ 1938 పూర్వం ఆంధ్ర మహాసభ, గ్రంథాలయోద్యమం, మాత్రమే ఉద్యమాలు చేశాయి. అందులోనూ నాయకులు పోరాడారు తప్ప ప్రజలు పోరాటపు బావుటాను ఎగురవేసింది స్టేట్ కాంగ్రెస్ పుట్టిన తర్వాతనే. వారు ఒకరి చేత అణచివేయబడు తున్నారని వారే గుర్తించలేని గడ్డుసమయాన్ని ఇతివృత్తంగా తీసుకొని నవలలను రచించారు రంగాచార్యగారు.

**పూర్వరంగం :**

తెలంగాణ రైతాంగపోరాటం నేపథ్యంగా అనేక రచనలు వెలువడ్డాయి. వీటిలో బొల్లి ముంత శివరామకృష్ణ మృత్యుంజయులు(1947), లక్ష్మీకాంతమోహన్ సింహ గర్జన(1950), మహీధర రామ్మోహనరావు ఓనమాలు (1956), మృత్యువు నీడల్లో(1962) మొదలైన నవలలు వెలువడ్డాయి.

ప్రముఖంగా వట్టి కోట ఆళ్వారుస్వామి ప్రజలమనిషి (1955), గంగు (1965) వచ్చాయి. ప్రజలమనిషి ఇది తెలంగాణ గురించి తెలంగాణా వ్యక్తి రాసిన తొలి నవల. 1934-40 మధ్యకాలంలోని తెలంగాణా పరిస్థితులు ఇందులో ఉన్నాయి. అదే క్రమంలో 'గంగు' మొదలు పెట్టారు. కానీ అది అసంపూర్ణంగా ఉండగా ఈ లోకాన్ని వదిలారు. తెలంగాణా ఉద్యమ చరిత్రను నవలీకరించాలన్న ఆళ్వార్స్వామి ఆశయం రంగాచార్య ఎరుగును. ఈ మహోద్యమాన్ని మరెవరైనా ముందుకు తీసుకెళ్తారేమో నని ఆశించాడు. కానీ నిష్ఫలం. అయితే తాను కూడా పూనుకోకపోతే అనేక సత్యాలు వెలుగుచూడవనే ఉద్దేశ్యంతో తాను ప్రత్యేక ప్రణాళిక వేసుకొని ఈ నవలల్ని రచించాడు ఆ కోవలో మొదటి నవల, ఆయన మొదటి నవల చిల్లర దేవుళ్ళు.

**చిల్లరదేవుళ్ళు - విశేషాలు :**

ఈ నవల రచనను 13.10.1964న ప్రారంభించి 10.11.1964 నాటికి పూర్తి చేశారు. ఈ నవలలో మాడపాటి హనుమంతరావు, నరేంద్రజీల పాత్రలు సజీవ పాత్రలు. కాబట్టి వారి సంభాషణలు వారికి చూపి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ నవలకి రచయిత మొదట పెట్టిన పేరు 'రాతిమనుషులు'. నిజంగానే వీళ్లు రాతి మనుషులు వీరికి చలనం లేదు.

మొదట ఈ నవలను ప్రచురించక తిప్పి పంపేశారు. ఆ తర్వాత రచయితకు నార్ల చిరంజీవి గారితో పరిచయం ఏర్పడింది. "మంజరి, లక్ష్మి నా మనసులో గూడు కట్టుకున్నా"రని చిరంజీవిగారు అన్నారు. రంగాచార్యులు తెలంగాణముకు అందరికన్నా ఎక్కువ సేవ చేశాడని దేవులపల్లి రామానుజరావు గారు అన్నారు. ఒక ఆనంద సమయంలో శ్రీనాధుని చాటువైన చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్ళు లోని చిల్లరదేవుళ్ళు అనే పదాన్ని ఈ నవలకు పేరుగా సూచించారు చిరంజీవి గారు. అదే సార్థక నామ ధేయమై తెలుగు సాహిత్యంలో అజరామరంగా విరాజిల్లుతూ ఉన్నది. 'నిజాం నిరంకుశ పాలనలో ఊరూ, పేరూ మాసిన ఆంధ్రజాతికి ఒక తీరూ తెన్నూ కల్పించిన' పద్మభూషణ, ఆంధ్రపితామహ మాడపాటి హనుమంత రావు గారికి ఈ నవలను అంకితం ఇచ్చారు.

ఉద్యమ చరిత్రను తెలియపరచాలని రచయిత ఆవేదన. అందుకే కథాగమనానికి అడ్డంకి అని తెలిసి కూడా మాడపాటి వారి ఇంటర్వ్యూను ఈ నవలలో చేర్చారు. ప్రగతి వారపత్రిక తొలి సంచిక (21.3.1969) నుండి 13.6.1969 వరకు 13 వారాలు సీరియల్గా వచ్చింది. 1969లో ఈ నవల ప్రథమ ముద్రణ పొందింది. 1982లో ఆకాశవాణిలో ప్రసారం అయింది. నవలను రంగాచార్యగారే నాటకీకరించారు. కాకతీయ పిక్చర్స్ వారు సినిమాగా తీశారు. అది 11.3.1977న విడుదలైంది. భీంసేన్ నిర్మల్ దీన్ని 'ఘాట్ కీ దేవత' పేరుతో హిందీలోకి, చక్రవర్తి శేషాచార్యులు 'హవంంవతీ ఐఱఅవీఱవం' పేరిట ఆంగ్లంలోకి అనువదించారు. 1970 డిసెంబర్ 3న ఈ నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించారు. విశ్వవిద్యాలయాల్లో చిల్లర దేవుళ్ళుపై ఎంఫిల్ కోసం పరిశోధన జరిగింది. ఒకప్పుడు కాకతీయ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా ఉండేది.

సినారె లేఖ- చిల్లర దేవుళ్ళు ఒక్క బిగిన చదివేశాను. అది నవల కాదు. యదార్థ జీవితాల రసవచ్చిత్రణం.

వాస్తవికత పేరుతో బొమ్మలు తీయడంతోనే ఊరుకోక ఒక సమగ్ర జీవితానికి బొమ్మ గీసి చూపావు నీవు. ఆ పాత్రలు ఆ సన్నివేశాలూ, ఆ భిన్న మనస్తత్వాలూ, అన్నిటికీ పూసల్లో దారంలాగా ఉన్న ఆ తెలంగాణా మాండలికశైలి. తెలుగు నవలారంగంలో నీ రచన మైలురాయి.

**కథా పరిచయం :**

రామారెడ్డి ఆ గ్రామానికి దొర (దేశముఖ్). వెంకట్రావు కరణం. దొర దయాదాక్షిణ్యాలమీదనే గ్రామమంతా బతకాలి. ఆ గ్రామంలో దొరది మాత్రమే పెద్ద గడీ. ఒకటి రెండు పెంకుటిళ్ళు తప్ప మిగతావన్నీ పూరిగుడిసెలే. "ఈ గడీ ఒక మహా వటవృక్షం. దీని నీడన ఏ గడ్డీ మొలవ డానికి వీలు లేదు. ఒక ప్రాణి కోసమో కాకుంటే ఒక్క కుటుంబం కోసరమో ఈ ఊరంతా వెలిసినట్లుంది. దొర పెడితే తినాలి, కొడితే పడాలి" అని అనుకుంటాడు పాణి. ఆ గడీలో దొర, దొర భార్య, మంజరి, ఆడబాప వనజ మొదలైన వారు ఉంటారు. దొర కరణం అంత కటికుడు కాదు పైగా రసికుడు అందుకే సంగీత విద్వాంసుడు సారంగపాణికి ఆశ్రయం కల్పించాడు. పాణి కరణంబిడ్డ తాయారుకు, నారయ్య బిడ్డ సీతకు సంగీత పాఠాలు చెప్తూ ఉంటాడు.

పాణిని తాయారు, మంజరి, వనజ ముగ్గురూ ప్రేమి స్తారు. లంబాడీల భూమి సమస్య నవలలో ప్రధానమైనది. ఒకే భూమికి పట్టా ఇస్తానని కరణం నారయ్య దగ్గర నుంచి లంబాడీల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తాడు.

చింతకాయల దొంగ పీరిగాని విషయంలో దొర పాణి సలహాను తిరస్కరిస్తాడు. 'బోడిముండకు దండం బెడ్తే నా వోలెనే ఉండమని దీవించిందట' అని తిడతాడు. కానీ హత్య జరిగిన తర్వాత దొర కరణానికి లొంగాల్సి వస్తుంది. కరణం తయారుతో పెళ్లికి పాణిని ఒప్పించ మంటాడు. పాణి ఒప్పుకోడు. దొర ఇంట్లోంచి బయటకు వెళ్లగొడ్తాడు. పాణి మద్రాసు పోతాడు. జబ్బు విషయమై మద్రాసు వచ్చిన రామారెడ్డి కుటుంబం పాణి తమ మేనల్లుడు అని గుర్తిస్తుంది. చివరకు దొర గొంతు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తాడు.

**పరిశీలన :**

చిన్న చిన్న మాటల్తో అనంతమైన అర్థాన్ని చెప్పగలశక్తి రంగాచార్య గారి కలానికి ఉంది. మర్రిచెట్టు జోరున వాన తాను పాణి అనే నాల్గు మాటలతో మంజరి పొందుతున్న విరహవేదన నంతా కళ్ళకు కట్టాడు. అంతేకాదు. వనజతో పాణి పెళ్లి అని రెడ్డి గారు అన్నప్పుడు తాను దాసీదాన్నైనా బాగుండును. ఎందుకీ దొరతనపు బతుకు? అను కుంటుంది. మంజరి స్పృహతప్పి పడిపోతే దానికి కారణం వనజ అని వనజను గొడ్డును బాదినట్టు బాదుతాడు దొర. అంతటి దుర్మార్గమైన గడిలో ఉండలేనని వెళ్ళబోతాడు పాణి. కానీ తనను నాశనం చేస్తానన్న తాయారు మాట నెగ్గుతుందని ఉండిపోతాడు.

**ఆడబాప సంప్రదాయం**

దొర ముందునుండి ఆడవారు పోకూడదు. అది తెలియని వనజ తండ్రి దొర ముందు నుండి వాళ్ళ అమ్మను తీసుకెళ్లడం, వెంటనే ఆమెను దొర చెరబట్టడం, ఆమెకు వనజ పుట్టగానే ఆమెనూ ఆడబాపను చేస్తాడు. రోడ్డుపై వెళ్తుంటే ఎవరైనా ఆడది నచ్చితే అక్కడ దొర దగ్గుతాడు. వెనక ఉన్న పాలేరు(నవల్లో మదర్సాబ్) దాన్ని గమనించి రాత్రికి ఆ ఆడ మనిషిని దొరగడీకి చేరుస్తాడు. ఆ పాత్రే కుమ్మరి మల్లి. ఇలా ఆడదాన్ని బొమ్మకన్నా హీనంగా వాడుకునేవారు.

వనజ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. వనజ ఒక ఆడ బాప. దొర లెవరైనా గడీకి వస్తే వారి గదుల్లోకి భోజనాలు, ఫలహారాలు మోసుకెళ్లాలి. వారి కోర్కెలకు తాను లొంగి పోవాలి. వారు పశువుల్లా ప్రవర్తిస్తూ ఉంటే తాను బొమ్మలా ఉండాలి. రంగాచార్య గారు వారి చిన్నతనంలో స్వయంగా చూసిన పిచ్చి అనే ఒక వ్యక్తిని వనజగా చిల్లరదేవుళ్ళులో పాత్రగా చేశానని ఆయన జీవనయానంలో చెప్పుకున్నారు.

**మాడపాటి ఇంటర్వ్యూ :**

హైదరాబాదుకు పాణిని పంపే నెపంతో రంగాచార్య గారు తెలుగు భాష పై తెలుగు వారిపై అక్కడ జరుగు తున్న దమనకాండను మన కళ్ళకు కడతాడు. ముఖ్యంగా మాడపాటి హనుమంతరావు గారిని కలిసి తెలంగాణాలో జరిగిన ఆనాడు జరుగుతున్న గ్రంథాలయోద్యమం,

ఆంధ్రమహాసభ వంటి ఉద్యమాలు, వాటిపై ప్రభుత్వ ఆంక్షలను పాఠకులకు విశదపరుస్తాడు. ఇవే విషయాలు కాస్త విస్తారంగా జీవనయానంలో మనకు కనిపిస్తాయి. దీనిని బట్టి రచయితకు తెలంగాణాచరిత్రపై ఉన్న మమకారం, నాటి ప్రజలను నిజాం అణచివేసిన తీరును విశదపరచాలనే ఆయన బలమైన కోరిక సుస్పష్టమవుతుంది.

ఒక బ్రాహ్మణ పిల్లవాణ్ణి తురక పిల్లలు రాళ్లతో కొట్టారు. ఓ టాంగా తోలే వ్యక్తి సాయానికి వెళ్తే అతన్నీ గల్లా పట్టుకుని కొట్టారు. అతడు ఎదురు తిరిగితే చుట్టుపక్కల ఉన్న తురకవాళ్ళంతా వచ్చి అతని తల బద్దలు కొట్టారు అతను దవాఖానా పాలయ్యాడు. ఇంత జరిగినా ఒక్క తెలుగు వాడు కూడా కనీసం చూడ్డాని కయినా రాలేదు. ఈ సందర్భంలో దౌర్జన్యంగా మతపిశాచం హైదరాబాదు రాజ్యంలో తాండవిస్తోందని అంటాడు రచయిత.

హిందువులతో కలిసారనే నేరానికి మహబూబ్నగర్ జిల్లా మన్ననూరు జైల్లో విచారణ లేకుండా అనేకమంది ముస్లింలను ఖైదు చేశారు. ఖిలాఫత్ సమావేశాలను నిషేధించారు. ఒక ఫార్మానా విడుదల చేసి బహిరంగ సభలు జరుపుకోకుండా అడ్డుకున్నారు. అటువంటి దుర్భర పరిస్థితులలో తాము జీవిస్తున్నామని మాడపాటి వారు పాణితో అంటారు.

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1911లో గద్దెనెక్కారు. అప్పటి నుండి మతాంతరీకరణం ఎక్కువ కావడమే కాక, ఉత్తర దేశం నుండి ముస్లింల దిగుమతి ఎక్కువ అయింది అని లెక్కలతో సహా స్పష్టపరిచారు మాడపాటివారు. అంతేకాక ఇక్కడి ఉద్యోగస్తుల్లో హిందువుల సంఖ్య నామమాత్రమేనని ఆయన పేర్కొన్నారు ఇలా మాడపాటి వారి ధోరణి సాగింది.

**మతమార్పిడి :**

మతమార్పిడి చేయడానికి బహద్దూర్యార్జంగ్ వస్తాడు. అతని అసలు పేరు బహదూర్ ఖా. అనేకమందిని తురకల్లో కలిపినందుకు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అతని పేరును బహద్దూర్యార్జంగ్గా మారుస్తాడు. ఇదే సందర్భంలో కంసాలి బ్రహ్మయ్య నోట రచయిత మహబూబ్ అలీఖాన్ ఇంత మతోన్మాది కాదని బ్రాహ్మణులకు ఇనాం లిచ్చాడని చెప్పిస్తాడు.

ఈ మతమార్పిడి సందర్భంలో, అమీన్ కరణం స్వంత పని కోసం ఊళ్ళోకి వచ్చినప్పుడు అన్ని కులాలవాళ్ళూ ఏ లాభం చూసుకోకుండా తమ కులవృత్తి(వెట్టి) చేసిపోతారు. ఇది తెలంగాణ ప్రజకు అలవాటైన వ్యవహారమే. అందుకే ఇప్పటికీ జనాల్లో 'ఎట్టి సేత' అనే జాతీయం అక్కరకురాని పని, ఫలితం లేని పని అనే అర్థంలో బలంగా నాటుకుపోయింది.

ఆర్య సమాజానికి సంబంధించిన నరేందర్జీ వచ్చి వారిని (తురకలుగా మారినవారిని) తమ తమ కులాల్లో కలుపుతాడు. అయితే ఇందుకు హోమం చేయాలి. అందుకు అన్నిచోట్లా తగిన వస్తువులు లభించవు. కాబట్టి తనతో తెచ్చిన గండిపేట నీళ్లనే గంగాజలమని వారిపై చల్లి, వారిని పునీతులను చేస్తానని నరేందర్జీ రంగాచార్యతో చెప్పారు. ఈ విషయాన్ని ఆయన తన జీవనయానంలో చెప్పుకున్నారు. ఆ సంఘటననే చిల్లరదేవుళ్ళులో చిత్రీకరించారు.

**రంగాచార్య గారి స్త్రీ పాత్రలు :**

రంగాచార్య గారు మలచిన స్త్రీ పాత్రలు చాలా విశిష్టమైనవి వనజ, మంజరి, తాయారు, సీత, ఇందిరమ్మ, సీత తల్లి, పిచ్చి మంగమ్మ ఇలా ప్రతి ఒక్కరికి తమదైన సొంత వ్యక్తిత్వం ఉంటుంది. ముఖ్యంగా చెప్పుకోవాల్సిన పాత్ర వనజ. వనజ అందరూ తనను పన్నీరులా, అత్తరులా, సారాయిలా వాడుకున్నారే గాని తన వ్యక్తిత్వాన్ని పట్టించుకున్నది పాణి మాత్రమే అని గ్రహిస్తుంది. అతనికి మనసిస్తుంది. అతన్ని అన్నను చేసుకుంటుంది. వనజ పాత్ర మొదట్లో భయంభయంగా బ్రతికే ఆడబాపగా మొదలై పాణి సాహచర్యంతో తన గూర్చి తాను ఆలోచిస్తుంది. పాణితో తనకు పెళ్లి నిశ్చయించినప్పుడు ఆ బురదగుంట నుండి బయటపడాలనే ఉద్దేశ్యంతో ఒప్పుకుంటుంది. ఒక ఆడబాప తన స్వంత వ్యక్తిత్వం గురించి ఆలోచించడం చూసి పాణి సంతోషిస్తాడు. మంజరి తాను అనుకున్నది సాధించుకోవాలనుకుంటుంది. కానీ దొరసాని కావడం వల్ల అన్ని వైపులా పరదాలు అడ్డుగా

నిలుస్తాయి. కానీ చివరికి తాను కోరుకున్న పాణి తన బావ కావడం ద్వారా తన కోరిక నెరవేరుతుంది.

**తెలంగాణ సంస్కృతి :**

రామారెడ్డి బంగలా వర్ణన, మొక్కజొన్న కంకులను కారం, వెన్నతో కలిపి తినడం, జొన్నలు దంచుతూ ఆడ వాళ్ళు పాటలు పాడడం, బతుకమ్మ పండుగ, దసరా పండుగ, గోష పర్దా మొదలైన ఎన్నో సంఘటనలు తెలంగాణా సంస్కృతికి అద్దం పడతాయి.నవలలో పీరిగాని హత్య, కరణం భార్య పిచ్చిదికావడం, వనజ తల్లి ఆడబాప కావడం, నారయ్యకు, లంబాడీలకు జరిగిన మోసం, కరణం, అమీను కుట్రలు మొదలైనవి సమయోచితంగా వర్ణించబడ్డాయి.

రంగాచార్యుల వారు శ్రీవైష్ణవు లవడం వలన ఇందులో శ్రీవైష్ణవులను ప్రవేశపెట్టారు. ధనుర్మాస ఉత్సవాలు వాళ్ళింట్లో ఎంత వైభవంగా జరిగేవో వివరంగా జీవన యానంలో రాశారు. అవన్నీ అలాగే చిల్లరదేవుళ్ళులోకి నడిచివచ్చాయి.

**రామారెడ్డి దొరతనం :**

దొర బండి ముందు ఒకరు పరిగెత్తడం, బండి వెనక ఇంకొకరు పరిగెత్తడం అనేది దొర రావడానికి సంకేతం. ఈ సందర్భంలోనే అయిలిగాడు ఒకసారి కొద్దిగా నెమ్మదిగా పరిగెత్తినందుకు అతన్ని చావకొడ్తాడు దొర. ఇది రామారెడ్డి దుర్మార్గానికి గుర్తు. దాన్ని సహజత్వం ఉట్టిపడేలా వర్ణించాడు రచయిత.

**లంబాడీల ఉదంతం :**

ఈ నవలలో అతి ముఖ్యమైన ఘట్టం లంబాడీలు కరణాన్ని తమ భూమి అడగడానికి వచ్చినది. వారి హక్కును వారు అడిగినందుకు పోలీసుల్ని పిలిపించి ఆమీను చేత లచ్చిమిని చంపించి, కోర్టు వద్ద భీక్యాను చంపిస్తారు. ఈ రెండు హత్యలను తిరిగి లంబాడీలపైనే వేస్తారు. ఆ మాట అంగీకరించినందుకు వారిని నరక యాతనలు పెడతారు. ఒక రోజంతా తిండి లేని వాళ్ళని బండ్లకు కట్టి ఈడ్చుకొని తీసుకువెళ్తారు. ఇంత జరిగినా లంబాడీల నీతి ఏమంటే కోర్టులో ప్రమాణం చేసి అబద్ధం చెప్పలేం, కాబట్టి ప్రమాణం చేయకుండా లక్ష్మిని చంపామని అంటారు. ఇక్కడ గిరిజనుల యొుక్క అమాయకత్వంతో పాటు తప్పు చేయకూడదు అనే ఒక దృఢ నిశ్చయం గల వారి గొప్పదనాన్ని రచయిత నిరూపించాడు. చివరకు వారంతా కలిసి బొడ్రాయి దగ్గర కరణాన్ని హత్య చేస్తారు. ఇది గిరిజనుల ఐకమత్యాన్ని సూచిస్తుంది.

**కరడు కట్టిన ఫ్యూడల్ సమాజం :**

పీరిగాడు చింతకాయలు దొంగిలించడం విషయమై పాణితో సంప్రదించినప్పుడు 'అప్రియస్యతు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభం' అని వాల్మీకి వాక్యాన్ని తెలిపి 'చింత కాయల కోసం గాను తాము చిక్కుల్లో ఇరుక్కోవడం మంచిది కాదని నా మనవి' అంటాడు దానికి రెడ్డి గారు 'బోడిముండకు దండం బెడ్తే నా వోలెనే ఉండమని దీవించిందట' అని పాణిని తిడతాడు. కానీ తర్వాత పాణి అన్నట్టుగానే పీరిగాణ్ణి కొట్టి, చంపి తద్వారా మనోవ్యధకు గురై, చివరకు ఊరు విడిచి వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడుతుంది. ఇంతటి దూరదృష్టి గల పాణి మాట విననందుకు తర్వాత సిగ్గుపడతాడు. కానీ గతజల సేతుబంధన మెందుకు పనికి వస్తుంది.

"చాకలి నా కొడుకు చావు నా ప్రాణం మీద కొచ్చె టట్లున్నది" అంటారు రెడ్డిగారు. ప్రాణం చాకలిది చౌకైందీ, దొరది ప్రియమైందీ ఉంటుందా? ఆ ఊర్లో రెడ్డి గారు అతని కుటుంబం మాత్రమే మనుషులు, మిగిలినవన్నీ అతని దొడ్లోని పశువులు. ఈ నవలలో కొడితే పడడం, తిడితే పడడం తప్ప ఎదురు తిరగడం అనే ఆలోచన లేదు. ఇందులో ఆర్యసమాజం, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ వంటి మహోద్యమాల ప్రస్తావన వచ్చింది. అంతేకాక మాడపాటి వారి నోట నాడు జరిగిన ఉద్యమాల యొుక్క వివరాలు అన్నీ ఇందులో చేర్చబడ్డాయి. అయినా కానీ ఎటువంటి తిరుగుబాటు జరగలేదంటే నాటి పరిస్థితులే అందుకు ముఖ్యకారణం. వీటిని మితవాదం అనేముందు మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆ కాలానికి అదే అతివాదం. ఒక చిన్న సభ జరుపుకోవడానికి ఇరవై షరతులు పెట్టి స్వయంగా దేశ ప్రధానమంత్రి నుండి అనుమతి కావాలని అన్నారంటే, అప్పుడు ఎంతటి గడ్డు పరిస్థితులు నెలకొని ఉన్నాయో ఊహించుకోవచ్చు.

కరణం గౌండ్ల వీరిని హత్య చేస్తాడు. దొర చాకలి పీరిగాణ్ణి హత్య చేస్తాడు. అమీన్ భీక్యాను చావగొట్టి, అతని భార్య లచ్చిమిని హత్య చేస్తాడు. కోర్టు ముందే కానిస్టేబుల్ భీక్యాను చంపుతాడు. కోర్టులో కారణ మడిగితే, అతను ఇనుప బేడీల్ని కొరికి పారిపోతుంటే కొట్టానని వాస్తవికతకు ఎంతో దూరంగా ఉండే సమాధానం చెప్తాడు. విచిత్రంగా ఆ మాటను కోర్టూ నమ్ముతుంది. ఈ విషయాలన్నీ ఆ మెజిస్ట్రేట్లు, సర్కారు వకీళ్ళు, అమీన్లు, దొరలు, కరణాలు సామాన్య ప్రజానీకం యొక్క మానప్రాణాలను గడ్డిపోచతో సమానంగా పరిగణించడాన్ని తెలుపుతున్నాయి. ఎటువంటి దయ, దాక్షిణ్యం లేని, కేవలం అధికార బలం వల్ల కల్గిన అహంకారంతో సామాన్య ప్రజలను అనేక హింసలకు గురిచేసి చంపిన భూస్వామ్య సమాజం అది. అటువంటి పాత్రలన్నీ కలిసి నాటి సమాజంలోని సామాన్యులపై జరిపిన దమనకాండను రంగాచార్య కళ్ళకు కట్టినట్టు చూపించారు.

**జాతీయాలు :**

ఈ నవలలో రంగాచార్యగారు సందర్భానుసారంగా జాతీయాలు, సామెతలే కాక అనేక ఉపమానాలనూ వాడి కథను మన కళ్ళముందు కదలాడేటట్లు చేశాడు. పాణిపై రెడ్డి గారికి రిపోర్టు చేస్తూ కరణం 'తిడ్దామంటే అక్కబిడ్డ, కొడ్దామంటే ఆకటి మనిషి' అనే సామెతను వాడారు. ఆవును కోసే సందర్భం వచ్చినపుడు ఆ పని నిజాముద్దీనుకు అప్పజెప్పి 'ఎవని చేతులు వాని నెత్తిమీదనే పెట్టాలె' అంటాడు దొర. ఆశాలత నిరాశాతాపానికి వాడిపోవడం మొదలైన ఉపమానాలు, గాలిమేడ కూలిపోవడం, కాట్ల బూడిద, గడ్డితినడం వంటి జాతీయాలు, అందితే జుట్టు అందకపోతే కాళ్ళు, పిడుగు పడ్తదనుకున్న ఉరుము చినుకుల్తో పోవడం వంటి సామెతలు ఈ నవలకు అందాన్ని సమకూర్చినవి.

ఇందులో దొర ప్రతినాయకుడు. కానీ అతడు ఎవరి చేతిలోనూ చావలేదు. గొంతు క్యాన్సర్ వల్ల చనిపోయాడు. ఇది నాటి జనాలకి తిరుగుబాటు తెలియదు అనే విషయం స్పష్టపరుస్తుంది. 'చీకటి తెరలు ఎక్కడి వక్కడ నిలిచిపోతూంటే, ప్రభాత మందరానిలాలతో కలిసి ఉషాదేవి అవతరించింది. తమసోమా జ్యోతిర్గమయ' అని నవలను ముగించడం తర్వాత ప్రజల్లో పుట్టబోయే చైతన్యాన్ని, విప్లవాన్ని, సంఘాలని, పార్టీలని ప్రతీకాత్మకంగా చూపుతుంది.

**ముగింపు :**

తెలంగాణా చరిత్రను అక్షరబద్ధం చేయాలన్న దాశరథి రంగాచార్య గారి సంకల్పం నెరవేరిందని ఈ చిల్లర దేవుళ్ళు నవలను బట్టి మనం చెప్పవచ్చు. ఎందుకంటే ఇందులో ఉన్నవి కేవలం పాత్రలు, సంఘటనలే కాదు ఒక నాటి సామాజిక, రాజకీయ జీవితం. దానిని ఉన్న దున్నట్లుగా వర్ణించి నేటి తరానికి తెలియని తెలంగాణా చరిత్రను తెలపడమే కాదు నిజాం రాజు ఎంతటి దుర్మార్గ పాలకుడో తెలిపి భవిష్యత్తు తరాలు గతచరిత్రను తెలుసుకోవడానికి దారిదీపమై నిలిచిన దాశరథి రంగాచార్య గారికి తెలుగుజాతి ఎంతో రుణపడి ఉన్నది.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. రంగాచార్య, దాశరథి. 1999. జీవనయానం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2. రంగాచార్య, దాశరథి. 2018. చిల్లరదేవుళ్ళు. నవచేతన పబ్లిషింగ్ హౌస్.
3. జయప్రకాశ్. 2015. దాశరథి రంగాచార్య నవలలు పరిచయం-పరిశీలన. నవచేతన పబ్లిషింగ్ హౌస్.
4. వెంకటేశ్వర్లు, పంతంగి(సంపా.). 2014. తెలంగాణ తెలుగు నవల. కాకతీయ యూనివర్సిటీ.
5. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1997. వల్లంపాటి సాహిత్య వ్యాసాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

❖❖❖

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవలలు - గిరిజన చైతన్యం

- ఏ. ఆర్. శ్రీకాంత్

రీసెర్చ్ స్కాలర్, వరంగల్.

**సారాంశం :**

తెలుగు సాహిత్యంలో నవల ఒక శక్తివంతమైన సామాజిక మాధ్యమంగా ఎదిగింది. ప్రారంభ దశలో నగర జీవితం, మధ్య తరగతి అనుభవాలు కేంద్రంగా ఉన్న తెలుగు నవలలు, కాలక్రమేణా అంచుల్లో ఉన్న వర్గాల జీవితాలను ప్రతిబింబించటం ప్రారంభించాయి. అందులో గిరిజనుల జీవిత, వారి అస్తిత్వ పోరాటం, భూమి-అడవి సంబంధం, రాష్ట్ర అణచివేత, సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలు విశేష ప్రాధాన్యం పొందాయి.

ఈ పరిశోధనా వ్యాసం తెలుగు నవలల్లో ప్రతిఫలించిన గిరిజన చైతన్య స్వరూపం, దాని సామాజిక - సాహిత్య ప్రాముఖ్యత, సిద్ధాంతాత్మక దృక్కోణాలులను విశ్లేషిస్తుంది. గిరిజనులను బాధితులుగా మాత్రమే కాకుండా చైతన్యవంతులుగా, ప్రతిఘటన శక్తులుగా చిత్రించిన ధోరణిని ఈ అధ్యయనం విశదీకరిస్తుంది.

**కీలక పదాలు :**

గిరిజన చైతన్యం, తెలుగు నవల, అస్తిత్వ పోరాటం, అడవి-భూమి, సామాజిక సాహిత్యం, అణచివేత వర్గాలు.

**1. పరిచయం :**

సాహిత్య సమాజానికి అద్దం మాత్రమే కాదు. అది మార్పుకు ప్రేరక శక్తి కూడా. తెలుగు నవల పరిణామం క్రమంలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. తొలినాళ్లలో సామంత, పట్టణ జీవితాలకు పరిమితమైన నవలలు, 20వ శతాబ్దం మధ్యానంతరం సామాజిక వాస్తవాల వైపు మళ్లాయి.

ఈ సందర్భంలో గిరిజన జీవితం సాహిత్యం కేంద్రంగా మారడం ఒక ముఖ్యమైన మలుపు. గిరిజనులపై జరిగిన చారిత్రక దోపిడీ, అభివృద్ధి పేరుతో జరిగిన భూమి స్వాధీనం, సంస్కృతిపై దాడి ఇవన్నీ తెలుగు నవలల్లో చైతన్యంగా వ్యక్తమయ్యాయి.

**2. గిరిజన చైతన్యం - భావనాత్మక నిర్వచనం :**

గిరిజన చైతన్యం అనేది కేవలం గిరిజనులను ఇతి వృత్తంగా చేసుకోవడం కాదు. అది ఒక విమర్శాత్మక దృక్కోణం. గిరిజనుల చారిత్రక అణచివేతను గుర్తించడం.

ఆధునిక అభివృద్ధి నమూనాలను ప్రశ్నించడం ప్రకృతి - మనిషి సంబంధాన్ని పునర్మూల్యాంకనం చేయడం గిరిజన సంస్కృతిని స్వతంత్ర గుర్తింపుగా ఆవిష్కరించడం.

ఈ లక్షణాల సమాహారమే గిరిజన చైతన్యం.

**3. పరిశోధనా విధానం :**

ఈ పరిశోధనలో క్రింది విధానాలు అనుసరించ బడ్డాయి :

వర్ణనాత్మక పద్ధతి, విశ్లేషణాత్మక పద్ధతి, తులనాత్మక అధ్యయనం.

తెలుగు నవలల్లో గిరిజన జీవితం చిత్రితమైన రచనలను ప్రధాన ఆధారంగా తీసుకొని, సామాజిక - సిద్ధాంతాత్మక విమర్శను ఉపయోగించాం.

**4.తెలుగు నవలల్లో గిరిజనుల ప్రాతినిధ్యం - పరిణామ క్రమం :**

ప్రారంభ తెలుగు నవలల్లో గిరిజనులు అరణ్య వాసులుగా, ద్వితీయ పాత్రలుగా మాత్రమే కనిపిస్తారు. కానీ సామాజిక ఉద్యమాల ప్రభావంతో ఈ దృక్కోణం మారింది.

- గిరిజనుడు కథానాయకుడయ్యాడు.
- అతని సమస్యలు కూడా కేంద్రంగా మారాయి.
- అతని స్వరం సాహిత్యంలో వినిపించసాగింది.
- ఇది తెలుగు నవలల ప్రజాస్వామ్య స్వభావాన్ని సూచిస్తుంది.

**5. భూమి-అడవి-అస్తిత్వం :**

తెలుగు గిరిజన నవలల్లో భూమి ఒక ప్రధాన అంశం. గిరిజనుడికి భూమి అంటే - "జీవనాధారం", "సంస్కృతి", "గుర్తింపు". భూమి కోల్పోవడం అంటే అతని అస్తిత్వాన్ని కోల్పోవడమే. ఈ వాస్తవాన్ని నవలలు తీవ్రమైన సంఘర్షణగా చిత్రించాయి.

**6. రాష్ట్రం మరియు అణచివేత :**

అటవీ చట్టాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, పోలీసు దమనకాండ - ఇవి గిరిజనుల జీవితంపై చూపే ప్రభావాన్ని తెలుగు నవలలు స్పష్టంగా ప్రశ్నించాయి. ఇక్కడ గిరిజనుడు ఒక వ్యక్తి కాదు. అతను వ్యవస్థతో పోరాడుతున్న సమూహ స్వరం.

**7. గిరిజన మహిళ - ద్వంద్వ అణచివేత :**

గిరిజన మహిళ పాత్రలు తెలుగు నవలల్లో ప్రత్యేక స్థానం పొందాయి. ఆమె గిరిజనురాలిగా సామాజిక అణచివేత మహిళగా పితృస్వామ్య అణచివేత రెండింటినీ ఎదుర్కొంటుంది. అయినా ఆమె పోరాటమే నవలలకు మానవీయ శక్తిని ఇస్తుంది.

**8. మార్క్సిస్టు & దళిత సిద్ధాంతాల ప్రభావం గిరిజన చైతన్య నవలలపై మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావం :**

తెలుగు సాహిత్యంలో గిరిజన చైతన్య నవలలు మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావంతో ఒక ప్రత్యేకమైన విమర్శనాత్మక స్వరూపాన్ని సంతరించుకున్నాయి. మార్క్సిజం సమాజాన్ని వర్గ సంబంధాల పరంగా విశ్లేషించే సిద్ధాంతం కావడంతో, గిరిజనుల జీవితం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ అణచివేతను అర్థం చేసుకోవడానికి ఇది బలమైన సాధనంగా మారింది. గిరిజన నవలల్లో ముఖ్యంగా వర్గ పోరాటం, ఉత్పత్తి సాధనాలపై హక్కు, రాజ్యపు పాత్రపై విమర్శ అనే మూడు అంశాలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి.

**1. వర్గ పోరాటం :**

మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటం చరిత్రే. ఈ దృష్టికోణం గిరిజన చైతన్య నవలల్లో స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజనుడు ఇక్కడ కేవలం పేదవాడిగా లేదా వెనుకబడినవాడిగా కాదు; అతను ఒక శ్రమజీవి వర్గానికి ప్రతినిధిగా ఆవిష్కృతమవుతాడు. అడవుల్లో శ్రమచేసే గిరిజన సమాజం ఒకవైపు భూమిని స్వాధీనం చేసుకునే పాలక వర్గం, కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులు మరోవైపు నిలుస్తారు. ఈ రెండు వర్గాల మధ్య జరిగే సంఘర్షణనే నవలలు వర్గ పోరాటంగా చిత్రిస్తాయి. గిరిజనుల తిరుగుబాటు, ప్రతిఘటన, సంఘటిత పోరాటం ఇవి మార్క్సిస్టు వర్గ చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

**2. ఉత్పత్తి సాధనాలపై హక్కు :**

మార్క్సిజంలో ఉత్పత్తి సాధనాలపై హక్కు ఎవరిది అనే ప్రశ్న అత్యంత కీలకం. గిరిజన చైతన్య నవలల్లో భూమి, అడవులు, నీటి వనరులు ఇవి గిరిజనుల జీవనాధారంగా కాకుండా, వారి సహజ ఉత్పత్తి సాధనాలుగా చిత్రించబడతాయి. అయితే రాష్ట్రం లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ ఉత్పత్తి సాధనాలను స్వాధీనం చేసుకోవడం వల్ల గిరిజనుడు తన శ్రమ ఫలితాన్ని కోల్పోతాడు. ఈ దశలో గిరిజనుడు తన హక్కుల కోసం పోరాడే చైతన్యవంతుడిగా ఎదుగుతాడు. నవలల్లో భూమి తిరిగి పొందా

లనే ఆకాంక్ష. ఒక వ్యక్తిగత సమస్య కాకుండా, సమూహ పోరాటంగా మారుతుంది. ఇది మార్క్సిస్టు ఆర్థిక విశ్లేషణకు సాహిత్య రూపం.

**3. రాజ్యపు పాత్రపై విమర్శ :**

గిరిజన చైతన్య నవలల్లో రాజ్యం ఒక తటస్థ సంస్థగా కాకుండా, ఆధిపత్య వర్గాల ప్రయోజనాలను రక్షించే వ్యవస్థగా చిత్రితమవుతుంది. అటవీ చట్టాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, పోలీసు దమనకాండ - ఇవన్నీ గిరిజనులపై రాజ్యం అమలు చేసే నియంత్రణ పద్ధతులుగా నవలల్లో చూపబడతాయి. మార్క్సిస్టు సిద్ధాంతం రాజ్యాన్ని ఒక వర్గ సాధనంగా భావించినట్లే. ఈ నవలల్లో రాజ్యం గిరిజనుల శత్రువుగా నిలుస్తుంది. గిరిజనుల నిరసనలను అణచి వేయడం, వారి పోరాటాలను "చట్టవిరుద్ధం"గా ముద్ర వేయడం వంటి అంశాలు రాజ్య స్వభావంపై తీవ్రమైన విమర్శగా వ్యక్తమవుతాయి.

ఈ మూడు అంశాల సమన్వయంతో గిరిజన చైతన్య నవలలు కేవలం సాహిత్య రచనలు కాకుండా, ఒక విమర్శాత్మక సామాజిక పత్రికలాగా మారాయి. మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావం వల్ల గిరిజన సమస్యను వ్యక్తిగత దు:ఖంగా కాకుండా, వ్యవస్థాగత దోపిడీ ఫలితంగా విశ్లేషించగలిగాయి. అందువల్ల తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం ఒక శక్తివంతమైన వర్గ అవగాహనగా, సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. దళిత చైతన్యంతో గిరిజన చైతన్యం ముడిపడి, ఒక సమగ్ర అణచివేత వ్యతిరేక సాహిత్యంగా మారింది.

**9. గిరిజన నవలల్లో భాషా-శైలీ విప్లవం :**

తెలుగు గిరిజన చైతన్య నవలలు సాహిత్య విషయ వస్తువులోనే కాకుండా భాషా నిర్మాణంలోనూ ఒక విప్లవాత్మక మార్పును తీసుకొచ్చాయి. సంప్రదాయ తెలుగు నవలలు ఎక్కువగా ప్రామాణిక భాషను ఆధారంగా చేసుకున్నప్పటికీ, గిరిజన నవలలు ఆ పరిమితులను దాటి, జీవన వాస్తవానికి దగ్గరగా ఉన్న భాషను ఆశ్రయించాయి. ఈ భాషా ప్రయోగమే గిరిజన అనుభవాన్ని మరింత సహజంగా, నిజంగా ఆవిష్కరించడానికి దోహదపడింది.

**1. మాండలిక భాష వినియోగం :**

గిరిజన నవలల్లో మాండలిక భాష ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. ఇది కేవలం శైలి ప్రయోగం కాకుండా, గిరిజనుల సామాజిక గుర్తింపును ప్రతిబింబించే సాధనం. ప్రాంతాల వారీగా వినిపించే ఉచ్చారణలు, పద ప్రయోగాలు, వాక్య విన్యాసాలు - ఇవన్నీ పాత్రల జీవన వాస్తవాన్ని ప్రత్యక్షంగా ముందుంచుతాయి.

ప్రామాణిక భాషలో చెప్పినప్పుడు కలిగే దూరభావం, మాండలిక భాష ద్వారా తొలగిపోతుంది. ఫలితంగా గిరిజన పాత్రలు సాహిత్య పాత్రలుగా కాకుండా జీవంత వ్యక్తులుగా పాఠకుడి ముందు నిలుస్తాయి.

**2. జానపద పదజాలం :**

గిరిజన నవలల్లో జానపద పదజాలం విస్తృతంగా ఉపయోగించబడుతుంది. అడవి, వ్యవసాయం, వేట, పూజలు, పండుగలు, రోజువారీ పనులకి సంబంధించిన పదాలు - ఇవన్నీ గిరిజన జీవితానికి విడదీయరాని భాగం. ఈ పదజాలం నవలల్లో చోటు దక్కడం ద్వారా, గిరిజన సంస్కృతి సాహిత్యంలో నమోదు అవుతుంది.

జానపద పదాలు సాహిత్యాన్ని కేవలం సమాచార వాహకంగా కాకుండా, సాంస్కృతిక పత్రంగా మార్చుతాయి. ఈ విధంగా భాష గిరిజన చైతన్యానికి ఒక శక్తివంతమైన ఆయుధంగా మారుతుంది.

**3. సహజ వాక్య నిర్మాణం :**

గిరిజన నవలలో భాషలో సహజ వాక్య నిర్మాణం ప్రత్యేకంగా గమనించవచ్చు. వ్యాకరణ పరమైన కఠిన నియమాలకు లోబడి కాకుండా, మాట్లాడే భాషకు దగ్గరగా ఉండే వాక్యాలు కథనానికి సహజత్వాన్ని ఇస్తాయి. చిన్న వాక్యాలు, విరామాలతో కూడిన సంభాషణలు, పునరుక్తులు - ఇవి గిరిజన అనుభవాన్ని నేరుగా పాఠకుడికీ చేర వేస్తాయి. ఈ సహ వాక్య నిర్మాణం ద్వారా రచయితలు "సాహిత్య భాష" అనే ఎలైట్ భావనను సవాలు చేస్తారు.

**4. భాషా రాజకీయాలు - విమర్శాత్మక కోణం :**

గిరిజన నవలల్లో భాష ఒక రాజకీయ సాధనంగా కూడా పనిచేస్తుంది. ప్రామాణిక భాష ఆధిపత్యాన్ని ప్రశ్నించడం ద్వారా, గిరిజన నవలలు సాహిత్యంలో

ఉన్న శక్తి సంబంధాలను వెలుగులోకి తెస్తాయి. ఎవరి భాషను "సరైన భాష"గా గుర్తించాలి అనే ప్రశ్నను ఇవి ముందుంచుతాయి. ఈ విధంగా భాషా ప్రయోగం గిరిజన చైతన్యంలో అంతర్భాగంగా మారుతుంది.

మాండలి భాష, జానపద పదజాలం, సహజ వాక్య నిర్మాణం - ఈ మూడు అంశాల సమన్వయంతో గిరిజన నవలలు తెలుగు సాహిత్యంలో ఒక కొత్త భాషా సంప్రదాయాన్ని నిర్మించాయి. ఈ సంప్రదాయం గిరిజనుల అనుభవాలను అచ్చుగా ప్రతిబింబించడమే కాకుండా, సాహిత్య ప్రజాస్వామ్యీకరణకు దారితీసింది. ఇవి సాహిత్యానికి వాస్తవికతను అందించాయి.

**10. సమకాలీన ధోరణులు :**

సమకాలీన తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం మరింత విస్తృతమైంది.

పర్యావరణ చైతన్యం, మానవ హక్కుల కోణం, గ్లోబలైజేషన్ ప్రభావం

**సమకాలీన తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం : విస్తృత దృక్కోణాలు :**

21వ శతాబ్దంలో వెలువడిన తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం మరింత విస్తృతమైన భావజాలంతో వ్యక్తమవుతోంది. గతంలో గిరిజన సమస్యలు ప్రధానంగా భూమి స్వాధీనం, అణచివేత, ఉద్యమ నేపథ్యాల్లోనే పరిమితమయ్యాయి. కానీ సమకాలీన నవలలు గిరిజన అనుభవాన్ని పర్యావరణం, మానవ హక్కులు, గ్లోబలైజేషన్ వంటి అంతర్జాతీయ చర్చలతో అనుసంధానిస్తూ కొత్త దిశలను తెరలేపాయి.

**1. పర్యావరణ చైతన్యం :**

సమకాలీన తెలుగు గిరిజన నవలల్లో పర్యావరణ చైతన్యం ఒక ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. గిరిజనులు అడవులు, కొండలు, నదులతో సహజీవనం చేసే సమాజంగా చిత్రించబడతారు. ఈ నవలల్లో ప్రకృతి ఒక వనరుగా కాకుండా, జీవించే శక్తిగా ప్రతిఫలిస్తుంది.

అడవుల నాశనం, మైనింగ్ కార్యకలాపాలు, పరిశ్రమల విస్తరణ - ఇవన్నీ గిరిజనుల జీవితంపై చూపే ప్రభావాన్ని రచయితలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంలో గిరిజన పోరాటం కేవలం భూమి కోసం కాకుండా, పర్యావరణం కోసం సాగుతున్న సమూహ పోరాటంగా రూపాంతరం చెందుతుంది. ఈ విధంగా గిరిజన చైతన్యం పర్యావరణ చైతన్యంతో ఏకమవుతుంది.

**2. మానవ హక్కుల కోణం :**

సమకాలీన గిరిజన నవలలు గురించి సమస్యలను మానవ హక్కుల దృక్కోణంలో విశ్లేషిస్తున్నాయి. జీవించే హక్కు, గౌరవంతో జీవించే హక్కు, సాంస్కృతిక గుర్తింపు హక్కు - ఇవన్నీ నవలల్లో ముఖ్యమైన అంశాలుగా మారాయి. పోలీసు దమనకాండ, తప్పుడు ఎన్‌కౌంటర్లు, బలవంతపు తరలింపులు వంటి సంఘటనలు గిరిజనులపై జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలుగా చిత్రించబడతాయి. ఈ కోణం ద్వారా గిరిజన చైతన్యం స్థానిక సమస్యగా కాకుండా, సార్వత్రిక మానవ హక్కుల సమస్యగా ఎదుగుతుంది.

**3. గ్లోబలైజేషన్ ప్రభావం :**

గ్లోబలైజేషన్ సమకాలీన తెలుగు గిరిజన నవలల్లో ఒక కీలక నేపథ్యంగా ప్రవేశించింది. బహుళజాతి సంస్థలు, అంతర్జాతీయ పెట్టుబడులు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ - ఇవి గిరిజన ప్రాంతాల్లోకి ప్రవేశించడం వల్ల కొత్త రకాల దోపిడీ రూపాలు ఏర్పడ్డాయి.

గ్లోబలైజేషన్ వల్ల గిరిజన భూములు కార్పొరేట్ ప్రయోజనాలకు లోనవడం, సంప్రదాయ జీవన విధానం విచ్ఛిన్నమవడం వంటి పరిణామాలు నవలల్లో విమర్శకు గురవుతాయి. ఈ నేపథ్యంలో గిరిజన చైతన్యం స్థానిక పోరాటం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై విమర్శగా విస్తరించబడుతుంది.

పర్యావరణ చైతన్యం, మానవ హక్కుల కోణం, గ్లోబలైజేషన్ ప్రభావం - ఈ మూడు అంశాల సమన్వయంతో సమకాలీన తెలుగు గిరిజన నవలలు ఒక కొత్త విమర్శాత్మక స్థాయికి చేరుకున్నాయి. గిరిజన సమస్యను ఒక ప్రాంతీయ సమస్యగా కాకుండా, సమకాలీన ప్రపంచం ఎదుర్కొంటున్న నైతిక, ఆర్థిక, పర్యావరణ సంక్షోభాల భాగంగా ఈ నవలలు ప్రతిపాదిస్తున్నాయి. ఇవి గిరిజన సమస్యను అంతర్జాతీయ చర్చకు అనుసంధానిస్తున్నాయి.

**11. విమర్శాత్మక పరిశీలన :**

ఈ సాహిత్యంలో కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి:

గిరిజనులను అతిగా ఆదర్శీకరించడం. బయటి దృష్టితో రొమాంటిసైజేషన్. స్వీయ గిరిజన రచయితల కొరత. ఇవి భవిష్యత్తు పరిశోధనకు దారితీసే అంశాలు.

**12. ముగింపు :**

తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం ఒక సాహిత్య ధోరణి మాత్రమే కాదు అది ఒక సామాజిక ఉద్యమ స్వరం.

ఈ నవలలు గిరిజనుల అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. అభివృద్ధి భావనను పునర్మూల్యాంకనం చేశాయి. సాహిత్యానికి సామాజిక బాధ్యతను గుర్తు చేశాయి.

అందుకే గిరిజన చైతన్యం తెలుగు నవలల చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలుస్తుంది.

తెలుగు నవలల్లో గిరిజన చైతన్యం అనేది-ఒక ప్రతి ఘటన, ఒక గుర్తింపు ఉద్యమం, ఒక మానవీయ ఆవేదన.

ఈ నవలలు మనల్ని ఇలా అడుగుతాయి.

"అడవిని కోల్పోయిన మనిషికి దేశం ఏమిచ్చింది?"

ఈ ప్రశ్నకు సమాధానం వెతకడమే గిరిజన చైతన్య సాహిత్య లక్ష్యం.

**సూచిత గ్రంథాలు :**


1. భద్రిరాజు కృష్ణమూర్తి (2003). తెలుగు భాషా చరిత్ర, హైదరాబాద్, ఎమెస్కో బుక్స్.
2. భద్రరాజు కృష్ణమూర్తి (1995). Dravidian Languages, Cambridge: Cambridge University Press
3. చేకూరి రామారావు (1998). భాషాశాస్త్ర పరిచయం, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయం.
4. తెలుగు సామాజిక నవలలు - విమర్శాత్మక అధ్యయనాలు
5. భారత గిరిజన చరిత్ర మరియు సంస్కృతి
6. సమకాలీన తెలుగు సాహిత్యంలో అణచివేత వర్గాలు
7. మార్క్సిస్టు సాహిత్య విమర్శ
8. పర్యావరణ సాహిత్య సిద్ధాంతాలు


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# 'చిల్లర దేవుళ్ళు' నవల - చారిత్రక నేపథ్యం

- ఎస్. పవిత్ర
పరిశోధకులు, తెలుగుశాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**పరిచయం :**

తెలుగు భాషలో నవలా సాహిత్య ప్రక్రియకి ఉన్నంత పాఠకులు ఇతర ప్రక్రియలకు ఎక్కువగా లేరని చెప్ప వచ్చు. నవలలు చాలా మట్టుకు సమకాలీన సమాజానికి ప్రతిబింబాలు, వ్యాఖ్యానాలై నిలుస్తున్నాయి. తెలంగాణలోని ప్రజల జీవితాన్ని చిత్రించిన నవలలు కొన్ని అవతరించాయి. వాటిలో చారిత్రక, సామాజిక స్థితిగతులను, రాజకీయ పరిస్థితులను కళ్లకు కట్టినట్టుగా చూపిన నవలలు సాహిత్య సృష్టిలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. తెలంగాణ పోరాటాలను ప్రజాజీవితాన్ని, చారిత్రక సంఘటనల్ని, చిత్రించిన నవలల్లో చిల్లరదేవుళ్ళు నవల ఒకటి. దాశరథి రంగాచార్య గారు రచించిన చిల్లర దేవుళ్ళు నవలలో సమాజంలోని వైయక్తిక, సామాజిక, వివిధ దృక్పథాలతో పాటు వివిధ వర్గాల సాంఘీక జీవిత సంఘర్షణ, స్వరూపచిత్రణ మొదలైన అంశాలను చారిత్రక నేపథ్యంతో రాయడం వలన పాఠకులకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది.

నిజాం పాలన కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్యులు తురకరాజ్యంలోని అన్యాయాలకు, ఆకృత్యాలకు, అసమానతలకు, అణిచివేతకు గురైన సమాజాన్ని గమనిస్తూ 1945లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని ప్రజల పక్షాన విప్లవ సాహిత్యాన్ని సృష్టించారు. వీరు రచించిన చిల్లర దేవుళ్ళు, మోదుగు పూలు, జనపదం మొదలైన నవలల్లో తెలంగాణ జన జీవనం, నిజాం పాలన నాటి రైతాంగ పోరాటం, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరంగా చారిత్రక సామాజిక పరిణామ దశల్లో దొరల గడీల సామ్రాజ్యంలో వెట్టిచాకిరి అంతం కోసం, సాంస్కృతిక స్వేచ్ఛ, రాజకీయ అస్తిత్వం కోసం తిరుగుబాటు చేయడం, భూమికోసం, భుక్తికోసం పోరాడిన దృశ్యాలు రంగాచార్య సజీవ దృష్టితో లిఖించారు.

**'చిల్లరదేవుళ్ళు' - నామౌచిత్యం :**

నిజాం రాజ్యంలోని గ్రామీణ ప్రజలు భయభక్తులతో కొలిచిన దొరలు, జమీందార్లు, పటేల్, పట్వారీ మొదలైన స్థానిక సర్వాధికారమూర్తులే చిల్లర దేవుళ్ళు. నిజాం ప్రభువు దేవుడైతే ఈ చిన్న ప్రభువులు అయిన గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఈ దొరలు ప్రజలను వేదించి శ్రమ దోపిడికి కారకులైన అధికారమూర్తులే చిల్లరదేవుళ్ళు అని నవల పేరులోని అంతరార్థం. ఈ అధికారులు తమ ప్రాభవాన్ని, అధికారాన్ని, పెత్తనాన్ని చెలాయించడంలో ఎందరో అమాయకులు సమసిపోయారు. మరెందరో నోరులేని జంతువుల్లాగ జీవించారు. అధికారుల భోగవిలాసాలకు నిరుపేద

బ్రతుకులు బలియైపోయాయి. భూస్వామ్య వ్యవస్థలోని బాడా దోపిడిదార్లే ఈ "చిల్లర దేవుళ్ళు" గా రచయిత భావన. ఈ నవలకు చిల్లర దేవుళ్ళు అనే పేరు నార్ల వెంకటేశ్వరరావు సూచించారని రంగాచార్య గారు చెప్పుకొచ్చారు.

**'చిల్లరదేవుళ్ళు' - వస్తువు :**

ఈ నవలలో ప్రధానమైన వస్తువు 1938 పూర్వం నిజాం కాలంనాటి గ్రామీణ నేపథ్యం. గ్రామానికి సప్తాంగాలనబడే రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, మాల మాదిగలు నవలల్లోని ముఖ్య పాత్రలు. రామారెడ్డి ఆ ఊరికి దొర, దేశముఖ్. కరణం వెంకట్రావు ఆ ఊరి పెద్ద. వీరి ఇద్దరి చేతుల్లో గ్రామంలోని పేదప్రజలు పడిన బాధలే నవలలోని ఇతివృత్తం. అహంకారం, అధికారం, దర్పం మూర్తీభవించిన రామారెడ్డి నవల ప్రారంభంలోనే దర్శనమిస్తాడు. కరణం వెంకట్రావు ప్రజల భూములను లాక్కొని ప్రాణాలు తీసైనా అధికారం చెలాయించుకుంటాడు. ప్రజలను దోచుకోవడానికి వీరిద్దరూ చాలదన్నట్టు పోలీసు అధికారి అమీను, తహసీల్దార్ అమాయకపు ప్రజలను హింసిస్తుంటారు. నవల ప్రారంభంలోనే తహసీల్దార్, అమీను గ్రామానికి వచ్చినప్పుడు రామారెడ్డి వెంకట్రావ్ వారికి తగిన ఏర్పాట్లు చెయ్యడానికి ప్రజలను భయపెట్టి బలవంతంగా పనులు చేయించడం కనిపిస్తుంది. ఇది తెలంగాణాలో 1938కి పూర్వం గ్రామాలో దొరల అధికారాన్ని ప్రజలు విధిగా అలవాటుగా చేయడం, ఎదిరించే ధైర్యం లేక వెట్టిచాకిరి చేస్తు జీవించడానికి ప్రతీకగా చెప్పవచ్చు.

**చారిత్రక నేపథ్యం :**

నిజాం నిరంకుశ పాలన, గ్రామాల్లో జమీందారీ, జాగీర్దారి భూస్వామ వ్యవస్థ, వెట్టిచాకిరీ మొదలైన వాటితో ప్రజల అణగారిన పరిస్థితులకు "చిల్లర దేవుళ్ళు" నవల అద్దంపడుతుంది. బాంచెన్ కాల్మొక్త దొర అని గడీ ముందు చావిడీలో దొరకు చేతులెత్తి మొక్కె ప్రజల దీనావస్థ తెలంగాణాలో ఆనాడు ఉండేది. వీటన్నింటిని ఎదుర్కోవడానికి రాజకీయోద్యమం అప్పటికింకా బలం పుంజుకోలేదు. గ్రంథాలయోద్యమం ఆ తరువాత తెలంగాణాలో బయలుదేరిన అనేక రాజకీయ సాంఘిక ఉద్యమాలకు నాంది పలికిందని చెప్పవచ్చు. నిజాం అండ చూసుకొని అధికార బలంతో ముస్లింలు ఒక వర్గంగా తయారైతే, దానికి వ్యతిరేకంగా హిందూ మతస్థులు సంఘటితమై ఆర్యసమాజం స్థాపించుకొన్నట్టు చారిత్రక సంఘటనలను నవలలో ప్రవేశపెట్టడం వాస్తవికతను తెలియజేస్తుంది.

**భూ సమస్యలు :**

నవలలో కరణం వెంకట్రావు లంబాడీలకు భూమి ఇప్పిస్తానని ఆశచూపి వారి నుండి డబ్బుకాజేస్తాడు. ఆ డబ్బు తిని తిన్నట్లు దాఖలాలు ఎక్కడాలేకుండ చేసి భూమిని వారి మీద పట్టా చెయ్యకుండా ఆ గ్రామంలోనీ నారయ్యకు పట్టా చేస్తానని అతని నుండి డబ్బులు తీసుకుంటాడు. అటు డబ్బులు పోయి ఇటు దున్నుకోవడానికి భూమి లేక విలపిస్తున్న లంబాడీల జీవనాన్ని, బతుకు తెరువును మంటకలిపిన కరణం వెంకట్రావు లంబాడీల ప్రతికారానికి గురి అయి దారుణంగా చంపబడతాడు. ఈ పోరాటంలో సాహసి, ధైర్యవంతురాలు అయిన లంబాడీ లక్ష్మి పోలీసుల ఘాతుకాలకు బలియైపోతుంది. ఇలా ఎంతోమంది పేద ప్రజల సొమ్ములు భూములు లాక్కొన్న దొరలు భూస్వాముల వెంబడి ఏండ్లుతరబడి వారి కాళ్ళ చుట్టూ తిరిగి తిరిగి ప్రశ్నించి అడగలేక భయపడి జీవితాన్ని గడిపినవారికి ఈ సంఘటన ఉదాహరణగా చెప్పవచ్చు. చివరగా లంబాడీలు ఎదురుతిరిగి కరణం చావుకు దారి తీయడం అనేది వారిలో కొంత చైతన్యంస్ఫురించినట్లుగా చెప్పవచ్చు. లంబాడీల వృత్తాంతం నవలలో ఒక కీలక ఘట్టం. భూసమస్య ఆనాటి తెలంగాణా ప్రజల జీవన్మరణ సమస్య. తెలంగాణా ప్రజల్లో వచ్చిన చైతన్యం, ఆ వరుసలో పెల్లుబికిన ఉద్యమాలు అన్నీ ఈ భూ సమస్య చుట్టూ తిరిగినవే అనేది చారిత్రక సత్యం.

**ఆడబాప వ్యవస్థ :**

తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఆడబాప వ్యవస్థ అనేదినాటి సమాజంలో కౄరమైన వ్యవస్థగా చెప్పుకోవచ్చు. ఈ ఆడబాప వ్యవస్థ గురించి రంగాచార్య

గారు నవలలో కళ్లకు కట్టినట్టుగా చూపించాడు. నవలలో వనజ అనే పాత్రను ఆడబాపగా రచయిత పరిచయం చేస్తాడు. ఆడబాప గడీలో పశువుల చాకిరి చేయడమే కాకుండా గడీకి వచ్చిన దొరలకు భోజనాలు ఫలహారాలతో పాటు తను ఒక విలాస వస్తువుగా వారి కోరికలు తీర్చడానికి లొంగిపోవాలి. ఆమె గడీలో యంత్రంలా పశు వులా ఆటబొమ్మల జీవిస్తూ కాలం గడుపుతూ ఊడిగం చెయ్యాల్సిందే. ఈ ఆడబాప వ్యవస్థ నాటి సమాజంలో ఎలాంటి ముద్ర వేసిందో రచయిత ఈ పాత్ర ద్వారా పాఠకుల కళ్ళకు కట్టినట్టు చూపించాడు.

**మత పరివర్తన :**

ఇస్లాం మతసంస్థ "ఇత్తెహాదుల్ముసల్మీన్" స్థాపకుడు బహద్దూర్ యార్ జంగ్ అమాయక గ్రామీణ ప్రజలను నమ్మించి బావులు తవ్విస్తాం, భూములిస్తాం అని ఇలా అనేక ప్రలోభాలకు ప్రజలను గురిచేసి, వారిని ముస్లిం లుగా మతాలుమార్చడం ఈ నవలలో ఒక ముఖ్యాంశం. ఈ ఇత్తెహాదుల్ముసల్మీన్ సంస్థ నిజాం నవాబుకు అండగా నిలిచి నిజాం ప్రభువుకు ఎవరు ఎదురు దిరగకుండ మత పరివర్తన కార్యక్రమాల్ని, మతోన్మాద కార్యక్రమాల్ని చేపట్టి ప్రజల్లో భయాందోళనను కల్గించింది. ముస్లింలకు ఉండే తంతు అంత నిర్వహించి మాల మాదిగ మంగళ్ళను నవలలో ఖాజీ (మహమ్మ దీయ పురో హితుడు) తురకలుగా మార్చి ముస్లిం పేర్లను మహమ్మద్, హుసేన్ అని పేర్లు పెట్టడం మొదలైన కార్యక్రమాలు తురక రాజ్యంలో ముస్లిం మతవిస్తరణకు నిజాం ప్రభువు రాజ్యంలో అధిక శాతం ముస్లింలే ఉండాలన్న ఉద్దేశానికి ఇది ఒక ఉదాహరణ.

**ఆర్య సమాజం శుద్ధి కార్యక్రమం :**

ఇస్లాం మతం మారిన హిందువుల్ని మళ్లీ హిందూ మతంలోకి చేర్చుకోవడం ఆ తర్వాత నరేంద్రజీ నాయ కత్వంలో శుద్ధికార్యక్రమం ద్వారా ఆర్యసమాజ్ చేపడ్తుంది. నరేంద్రజీ నవలలో రంగాచార్య ఎంచుకొన్న సజీవపాత్ర శుద్ధికార్యక్రమం ద్వారా ముస్లింలైన హిందువులను అందరిని తిరిగి హిందువులుగా మార్చడం అనే చారిత్రక సత్యాన్ని రంగాచార్య గారు నవలలో ప్రవేశపెట్టారు.

**సాంఘిక పరిస్థితులు :**

రంగాచార్యగారు ఈ నవలలో నరేంద్రజీ తో పాటు మాడపాటి హనుమంతరావు గారిని మరొక సజీవపాత్రగా ప్రవేశపెట్టాడు. హైదరాబాదు వెళ్ళిన పాణి మాడపాటి వారితో జరిపిన సంభాషణలో మాడపాటి వారి చేత ఆ కాలంలోని చారిత్రక సంగతులను రచయిత చెప్పిస్తాడు. హైదరాబాద్ స్టేషన్లో దిగిన పాణికి ఒక తురక దేశానికి వచ్చినట్లనిపించింది. తెలుగు అక్షరం ముక్క ఎక్కడా కనిపించలేదు. వినిపించలేదు. పోర్టర్ సైతం ఉర్దూలో మాట్లాడుతున్నాడు. అందరూ షేర్వానీలు, రూమీటోపీలు ధరించి ఉండడం వల్ల తురకలెవరో, కానివారెవరో గుర్తించలేకపోతాడు. తెలుగు దేశానికి తలమానికంలాంటి మహానగరంలో తెలుగువాడుగాని, తెలుగుదనంగానీ, తెలుగు అక్షరంగానీ కనిపించలేదంటే పాణికి బాధకల్గింది. టంగా నడిపే వాడు కూడా ఉర్దూ మాట్లాడాలి లేకపోతే ఈ రాజ్యంలో విలువ ఉండదు అని పాణితో అంటూ వస్త్రధారణ మాటలు తురక వేషంల ఉంటేనే కొంచెం ఇజ్జత్ ఇస్తరు లేకుంటే కొట్టి చంపుతరని పాణితో చెప్తాడు. ఈవిధమైన మతదౌర్జన్యానికి, ఆధిక్యతకు గురైన ప్రజలదీనావస్థను, వారి వేషభాషల్లోని మార్పును రంగా చార్య వాస్తవంగా వర్ణించారు.

**రాజకీయ పరిస్థితులు :**

ఆంధ్రోద్యమ పితామహుడు మాడపాటివారితో పాణి జరిపిన సంభాషణ నవలలో కొన్ని ముఖ్యాంశాలను తెలియచేస్తుంది. తెలుగు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రజల చరిత్రను అనాదిగా వారి మధ్య ఉన్న పరస్పర సత్సం బంధాల గురించి గ్రంథాలయోధ్యమం, పత్రికలు, ఆంధ్రోద్యమం, ఆంధ్రమహాసభలు మొదలైన అంశాల గురించి చర్చిస్తాడు. తెలుగు మాట్లాడే వారంతా ఒకే సంతతికి చెందిన వారు. ఆచార వ్యవహారాలు, నాగరికత సంస్కృతి, స్వభావం అన్ని ఒకలాంటివే. అయితే కొన్ని రాజకీయ కారణాల వల్ల తెలంగాణలో ఉన్న తెలుగు వాళ్ళను ఆరువందల సంవత్సరాలనుండి తురుష్కులు అవిచ్ఛిన్నంగా పాలిస్తున్నానే విషయం గుర్తుంచుకోవాలని, రెండవ ప్రతాపరుద్రుని తరవాత ఈ ప్రాంతాన్ని పాలించే

హిందూరాజు లేకపోవడం, నేడు నిజాం ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఈ కారణంగా ప్రభుత్వం వారిది కావడంతో ఉర్దూ రాజభాషగా కావడం, వేషభాషల్లో మార్పులు రావడం వంటి నాటి పరిస్థితులను మామూలు విషయాలుగా వివరిస్తాడు.

**గ్రంథాలయోద్యమం :**

తెలంగాణాలోని రాజకీయ, సాంఘిక ఉద్యమాలకు గ్రంథాలయోద్యమం నాంది పలికిందని చెప్పవచ్చు. వేష భాషల్లో ఆంధ్రత్వం వెతకాల్సిన పరిస్థితుల్లో తెలుగువారికి తమ భాషను గుర్తుకుతేవాలనే ఉద్దేశంతో 1901లో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించడం, తెలంగాణాలోని తెలుగు ప్రజలకు క్షీణిస్తున్న తమ భాషా సాహిత్యాల గురించి తెలియచేయడానికి తెలుగు సాహిత్యానికి పునరుజ్జీవనాన్ని కలిగించి, తెలంగాణా ప్రజలు చైతన్యవంతులుగా తయారుకావడానికి ఇలాంటి గ్రంథాలయాలు చాలా అవసరమని గుర్తించి నాయని వెంకటరంగారావు బహద్దూర్, కొమర్రాజులక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ స్థాపకులలో ముఖ్యులని మాడపాటి పాణితో చెప్తాడు. అంతేగాక మరికొన్ని గంథాలయాలు స్థాపించబడినప్పటికి ప్రభుత్వం అనుమతిలేక మూసివేయాల్సి వచ్చిందని, మళ్లీ అతికష్టంమీద వాటిని, తెరిపించడం జరిగిందని మాడపాటి వివరిస్తాడు. ముఖ్యంగా సూర్యాపేటలోని ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథాలయాన్ని దర్శించిన జిల్లా తాలూక్దారు ప్రభుత్వానుమతి లేదని మూసివేయించారని ఆ విషయం గురించి మాడపాటి హటరీమ్ సెక్రటరీ అయిన సర్ అక్బర్ హైదరీకి వ్రాసిన లేఖ తర్వాత ఆ గ్రంథాలయం తిరిగి తెరిపించబడడం, కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉన్న గ్రంథాలయం, వరంగల్ జిల్లాలోని మడికొండ గ్రామంలో నడుస్తున్న ఆంధ్ర గ్రంథాలయం ప్రభుత్వ అనుమతి కోసం మూయించడం వంటివి కార్యక్రమాలు యదార్థ సంఘటనల గురించి చర్చించడం కనిపిస్తుంది.

**ఆంధ్ర మహాసభలు :**

1927లో బ్రిటిష్ ప్రభుత్వం రెవెన్యూ పోలీస్ శాఖమంత్రి లెఫ్టినెంట్ కల్నల్ ట్రెంచ్ ను నియమించడం, వారి అనుమతితో 1928లో సూర్యాపేటలో వైభవంగా సభలు జరగడం మొదలైన అంశాల గురించి పాణి మాడపాటి వారి సంభాషణలో ఆంధ్ర మహాసభల ప్రస్తావన వస్తుంది. 1930 జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతన నిజాం రాష్ట్రాంధ్ర మొదటి మహాసభ, 1931 బూర్గుల రామకృష్ణారావు గారి అధ్యక్షతన దేవరకొండలో రెండవ మహాసభ, 1934 ఖమ్మంమెట్టులో తృతీయాంధ్ర మహాసభ చారిత్రాత్మకంగా జరిగినట్లు మాడపాటి వారు పేర్కొనడం అనేది చరిత్రలో జరిగిన సంఘటనలను ప్రజల దృష్టికి తీసుకోవడం రచయిత ప్రధాన ఉద్దేశం.

**ముగింపు :**

దాశరథి రంగాచార్య గారు నిజాం కాలం నాటి దుర్భరమైన పరిస్థితులను భూస్వాముల చిల్లరదేవుళ్ళ ఆగడాలను అణచివేయబడిన ప్రజల శ్రమదోపిడిని సాంఘీక దుస్థితిని రాజకీయ పరిస్థితులను మొదలైన చారిత్రక సత్యాలను నవలలో ప్రవేశపెట్టడం ద్వార నవల చారిత్రకతను అందిపుచ్చుకుంది. హైద్రాబాద్ వెళ్లిన సారంగపాణి అక్కడ మాడపాటి హనుమంతరావుతో సంభాషించడం నవలకు ఎంతో చారిత్రక వాస్తవికతను సంతరించి పెట్టింది. ఇలా చారిత్రక నేపథ్యంతో రాసిన చిల్లరదేవుళ్ళు నవల నాటి పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రామాణికంగా నిలుస్తుందని చెప్పవచ్చు. నవలలో మొక్కజొన్నకంకులను కాల్చివెన్న మీగడ మిరియంతో కలిపి తినడం, దసరాఉత్సవాలు, బతకమ్మనుపేర్చడం, బతుకమ్మఆడడం మొదలైన సామాన్యసంఘటనలెన్నో రచయిత చిత్రీకరించడం నిజాం కాలం నాటి తెలంగాణలోని చారిత్రక వాస్తవానికే కాకుండా తెలంగాణ సంస్కృతికి కూడా అద్దం పడుతుంది.

**పాద సూచీలు :**

1. చిల్లరదేవ్వుళ్ళు నవలలో 1938 కి పూర్వపు తెలంగాణ ప్రజాజీవితాన్ని చిత్రించడానికి ప్రయత్నించాను. - దాశరథి రంగాచార్య మాటలు. చిల్లర దేవుళ్ళు, దాశరథి రంగాచార్య,పుట.7.

2. ఆడబాప - తెలంగాణా దొరల ఇండ్లలో ఉండే సేవికలను ఆడబాపలు అనేవారు. వీరు గడీలో ఊడిగం చేస్తూ భోగ వస్తువుగా ఉండేవారు. చిల్లర దేవుళ్ళు, దాశరథి రంగాచార్య, పుట.16.
3. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. హైదరాబాదు,తెలుగు అకాడమి,2016. పుట 139, 152, 155.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. ఆళ్వార్ స్వామి, వట్టికోట. ప్రజలమనిషి. విజయవాడ, విశాలాంధ్ర,1970.
2. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. (సం.పా),హైదరాబాదు, తెలుగు అకాడమి, 2016.
3. ప్రేమావతి, ఎమ్. దాశరథి రంగాచార్య రచనల్లో జనపదం. తెనాలి, వాసవి ప్రింటర్స్,1988.
4. రంగాచార్య, దాశరథి.చిల్లరదేవుళ్ళు. హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2006.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బ్రతుకు జీవన చిత్రం పరంపర

- అమల బానోత్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్యం అనేక ప్రక్రియలు ద్వారా విరాజిల్లుతోంది. ఇందులో నవల, కథా ప్రక్రియలు మనిషి జీవిత విస్తృతిని తెలియజేస్తున్నాయి. కథ జీవితంలోని ఒక సందర్భానికి సంబంధించినది అయితే నవల జీవితంలోని సుదీర్ఘమైన అంశాలను సవివరంగా పట్టిచూపుతుంది. తెలుగులో ఎందరో నవలాకారులు, కథా రచయితలు సాహిత్యాన్ని సృజించారు. సమాజంలోని భిన్న పార్శ్వాలను తమ రచనలలో చిత్రించారు. అయినా సమాజంలోని వివిధ సముహాల జీవ వైవిధ్యాన్ని జీవిత సంఘర్షణనూ సాహిత్యీకరించడంలో కొన్ని ఖాళీలున్నాయి. ఈ క్రమంలో ఆయా సమూహాల జీవిత అనుభవాలను సాహిత్యంలోకి తీసుకురావడంలో కొందరు రచయితలు విశేష కృషి చేస్తున్నారు. అత్యంత నిబద్ధతతో సామాజిక బాధ్యతతో తాను చూసిన, తాను ప్రభావితమైన అంశాలను కథలుగా, నవలలుగా మలిచారు. ఇటువంటి వారిలో గొప్ప ప్రజాపక్ష భావజల నిబద్ధతగల రచయిత శిరంశెట్టి కాంతారావు.

ప్రతి వ్యక్తి ఏ పనిచేసినా ఏదో ఒకటి ఆశించే చేస్తాడు. అలాగే ప్రతి రచయితా ప్రతి కథనూ ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించే సృజిస్తాడు. అలాగే శిరంశెట్టి కాంతారావు కూడా తెలుగు సమాజానికి తెలంగాణ ప్రాంత రైతుల సమస్యలను వివరించే బాధ్యతను చేపట్టాడు. ప్రపంచీకరణ ఫలితాలు పల్లెల్లోనూ ఎలా ప్రతిఫలిస్తున్నాయో తన నవల ద్వారా తెలియజేశాడు. పెరిగిపోతున్న జీవన మధ్యమాలను స్థితిగతులను అర్థం చేసుకోవడానికి శిరంశెట్టి నవలలు తోడ్పడతాయి.

మనిషి మనస్సు బాహ్య వాస్తవికతను సృజనాత్మకంగా, క్రియాత్మకంగా ప్రతిఫలిస్తుంది. మనస్సు బాహ్య వాస్తవికతలోని సాధారణ తత్త్వంలో అసాధారణ తత్త్వాన్ని, ప్రత్యేకంలో సాధారణాన్నీ వేరు చేసి చూడగలదు. వాస్తవ పరిణామాల్లోని సారాంశాన్ని గుర్తించగలదు. ఘటనల వెనుక కార్యకారణ సంబంధాన్ని పసిగట్టగలదు.

మనిషి ప్రపంచాన్ని ఆకళింపు చేసుకొనే క్రమంలో అనేక చైతన్యరూపాలు పుట్టాయి. వాటిలో కళ ఒకటి. మనిషి ప్రపంచాన్ని అవగతం చేసుకోవటానికి కళ ఒక సాధనం. మనిషి అనుభవాలు, అనుభూతులు, ఆవేశాలు, భావాలు మొదలైన సామగ్రి భాషారూపంలో ఉన్నత స్థాయికి చేరినప్పుడు పుట్టేది సాహిత్యం. ఎప్పుడైతే సాహిత్యం సాహిత్యంగా ఒక (భాషా) రూపాన్ని పొందిందో అప్పుడు అది కూడా ఒక భౌతిక వాస్తవం అవుతుంది. తిరిగి తను బాహ్య ప్రపంచంపై ప్రతిక్రియ చూపుతుంది.

అంటే ప్రపంచాన్ని, మానవ సంబంధాల్నీ ప్రభావితం చేస్తుంది. వేరే మాటల్లో చెప్పాలంటే మనిషి ప్రపంచాన్ని అవగతం చేసుకోవడానికే గాక దాన్ని మార్చటానికి సాహిత్యం ఉపకరిస్తుంది. అంటే మానవ చైతన్యం బాహ్య ప్రపంచాన్ని ప్రతిఫలించటమే కాక, దానిని సృజిస్తుంది.

మనిషి బాహ్య ప్రపంచాన్ని ఒకే మొత్తంగా అర్థం చేసుకోలేడు. భావాల ద్వారా, భావనల ద్వారా, సూత్రాల ద్వారా, సిద్ధాంతాల ద్వారా నిరంతరం దానికి చేరువవు తుంటాడు. నిర్దిష్ట చారిత్రక భౌతిక పరిస్థితుల్లోని మనిషి చారిత్రకమైన సుస్థిరమైన ఉత్పత్తి పద్ధతుల ద్వారా ప్రకృతి సూత్రాల్ని మరింత గాఢంగా, సమగ్రంగా అవగతం చేసు కొంటాడు. ప్రకృతినీ, సమాజాన్ని అవగతం చేసుకొన్న మనిషి తిరిగి వాటిని మార్చే ప్రయత్నం చేస్తాడు మన శీరం శెట్టి కాంతారావు గారు తన పరంపరలో

మనిషి తన అనుభూతులతో ఆవేశాలతో బాహ్య వాస్తవికతతో పెట్టుకొన్న సంబంధంలో నుంచే నవల పుట్టింది. కాబట్టి అందులో భాగంగా అతను బాహ్యం లోనూ, అది సజీవమైనా, నిర్జీవమైనా తన భావావేశాల్ని చూడగలిగాడు. ఈ భావావేశాల స్పర్శ లేకుండా ఏ కవి లేదా రచయిత ప్రపంచాన్ని దర్శించలేడు. కాబట్టి బాహ్య వాస్తవికత మానవ సంబంధాల్లో నుంచే సాహిత్యంలో నుండి ప్రతిబింబించిన నవలనే శిరంశెట్టి కాంతారావు పరంపర అని చెప్పవచ్చు.

మట్టిపొరల్లో దాగిన మనిషి గుండె చప్పుల్లని ధ్వని ముద్రితం చేస్తే ఎలా వుంటుందో ఈ 'పరంపర' నవలలో వినవచ్చు. కాలం పొడుగుతూ కదిలిపోయిన జీవన సౌందర్యాన్ని మరొకసారి కళ్ళారా చూడాలంటే ఈ నవలలోకి హృదయం పెట్టి చూడాలి. గ్రామీణ ప్రజల మానవ సంబంధాల్లో వృత్తులు ఎంత గాఢంగా పెన వేసుకునిపోయాయనేది తెలుసుకోవాలంటే ఈ నవలలోని తిప్పర్తి గ్రామాన్ని సందర్శించాలి. మనిషికి అవసరమైన, నిత్యావసరమైన లోహ పాత్రల నుంచి రసోల్లాసం కలిగించే శిల్పాల వరకు అద్భుత నైపుణ్యంతో కళాత్మకంగా తయారు చేసే కంచర వృత్తికారుల చారిత్రక జీవన గమ నాన్ని ఆవిష్కరించిన 'పరంపర'ను చదవడం ఒక సృజ నాత్మక అధ్యయన అనుభవం. రచయిత శిరంశెట్టి కాంతారావు కొలిమిలో నిప్పుకణికగా మారి అక్షరాలకు పుటం పెట్టి కంచర వృత్తికారుల ఔన్నత్యాన్ని ఉన్నతంగా చిత్రించారు.

పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే విధానాలు, ఉత్తేజాన్ని అందిస్తాయి. కులవృత్తుల దెబ్బతిన్న సంధికాలంలో బతుకుతెరువు ఎట్లానో అర్థంకాని సమయంలో విశ్వరూపాచారి తీసుకున్న నిర్ణయాలు ఈ కథకు పరిమితమైనవికావు. " పని చేసుకునేవాడికి ఎప్పుడూ పని వుంటనే వుంటది. కాకుంటే ఆ పని కాలానికి తగ్గట్టు చేసుకుంటూ పొవ్వాల గంతే" అంటూ వృత్తి కారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాడు విశ్వరూపాచారి. కేవలం మాటలతోనే సరిపుచ్చకుండా హైదరాబాద్ తీసుకెళ్ళి మిత్రుడు, వ్యాపారి మూల్చంద్ శారడా ద్వారా సహాయాన్ని ఇప్పించి బతుకుపై నమ్మకాన్ని కలిగిస్తాడు. కాలానుగుణంగా వ్యాపారాన్ని విస్తృతం చేసుకునే ఆలోచనలు చేస్తాడు. మనం తయారు చేసే వస్తువులను మన దుకాణంలోనే అమ్మడం కాదు, మనమే కొనుగోలు దారుడు దగ్గరకు వెళ్ళాలనే కొత్త ఆలోచనలు, ప్రయత్నాలు సఫలీకృతం కావడం పఠితలకు సైతం ఆనందాన్ని ఇస్తుంది. జాతరలో దుకాణాలు పెట్టుకోవడం, గ్రామాలకు వెళ్ళి ఉద్దెరకు సామాన్లు అమ్మి, పంట చేతికొచ్చాక తీసుకోవడం, సంతలోను అమ్మకాలు చేయడం, సంచార వాసిగా బేరాలు సాగించడాలు వృత్తి కారుల బతుకుపోరును తెలుపుతుంది. ఈ వృత్తికారుల పాత్రలన్నీ జీవితంలో మన ఇంటి ముందుకు వచ్చిన ఆత్మీయపాత్రలుగా పలకరిస్తాయి. పాత్రల భావోద్వేగాలు నవలా పరిధినిదాటి పఠితలవిగా పరివర్తన చెందుతాయి.

ఒకరి కులవృత్తిలోకి మరొక కులానికి చెందినవారు ఏ విధంగా ప్రవేశించవలసిన పరిస్థితులు ఉత్పన్న మవుతాయో ఈ నవల స్పష్టంగా తెలుపుతుంది. చేతి నిండా పనివుండి, చేతికింద పనిముట్లు అందించే పనివాళ్ళులేని స్థితిలో ఇతర వృత్తులవారిని పనిలోకి తీసుకురావడమనే సహజమైన చారిత్రక పరిణామాన్ని శక్తివంతంగా చిత్రీకరించారు శిరంశెట్టి కాంతారావు. బడుగు

బలహీన వర్గాల ప్రజలు తమ ఉపాధికోసం ఏ పనైనా అలవోకగా నేర్చుకుంటారనడానికి ఈ నవలలో అనేక ఉదాహరణలున్నాయి. 'బంటోల్ల ఉప్పన్న రెండు మూడు రోజులు చూడగానే సుత్తి పట్టుకుని బిందెల తయారీలో చక్కగా పనిచేయడం కంచరకులస్తులే ఆశ్చర్యపోతారు. మరోవైపు ఒక వృత్తికి అనుబంధంగా మరికొన్ని రకాల పనులు చేసుకునే ఇతర కులాలవారు ఉండడం విశేషం. నవలలోని తిప్పర్తి గ్రామంలో కూడా కంచరోళ్ల చేతుల్లో తయారైన ఇత్తడి పాత్రలకు కళాయి పోస్తూ జీవించే నిరుపేద ముస్లీం కుంటుంబాలు ఉంటాయి. కాల క్రమేణా ఇతర కులాలవారే అసలు వృత్తి కులాల వారికి వ్యాపార పోటి నివ్వడం మరో ఊహించని పరిణామం. ఈ విషయాన్నే కంచర పుల్లాచారి ఆవేదన చెందుతూ ఆత్మ విమర్శకు గురిచేస్తాడు. చివరకు ఎదురెదురుగా, పక్క పక్కనే ఇత్తడి దుకాణాలు పెట్టుకుని శత్రువులుగా మారిపోయిన స్థితిని రచయిత చర్చిస్తాడు. కాలం తీసుకువచ్చే అనివార్య పరిణామాల ఫలితాలను వాస్తవికంగా కళ్ళ ముందు దృశ్యీకరిస్తాడు.

గ్రామాల్లోని ఆత్మీయ మానవ సంబంధాలు, మానవీయ విలువలను సహజమైన సన్నివేశాలతో సంభాషణలతో హృదయాన్ని సుతిమెత్తగా కదిలిస్తాడు. జాతరలో సామాన్లు అమ్ముకుని తొందరగా వెళ్లిపోతున్న ఆనందాచారి, ముత్తయాచారీలకు వీడ్కోలు చెబుతూ ఇతర దుకాణదారులు అప్యాయంగా మాట్లాడుతారు. తమ దుకాణాల్లోని గాజుల దండలను, చిలకల దండ లను, బొమ్మలను ఇంట్లో వాళ్ళకి బహుమతిగా ఇస్తారు. దారిలో ఆకలేస్తే తినడానికి పకోడి పొట్లం ఇస్తారొకరు. ఆ సందర్భంగా "నిండా నాలుగు రోజులు గూడా లేని తమ పరిచయానికి గుర్తుగా వాళ్ళు చూపిస్తున్న ప్రేమ ప్యాయతలకు, చారీలిద్దరూ నిలువునా కదలిపోయారు. వాళ్ళు ప్రమేయం లేకుండానే గుండెల్లో నుండి పుట్టు కొచ్చిన సంతోషపు దు:ఖం ఊటలు ఊటలుగా కనుకొలుకులగుండా వెలుపలకి దూసుకొచ్చి ఎదలను తడుపుతుంటే ఒక్కొక్కరిని గుచ్చిగుచ్చి కౌగిలించుకుంటూ అప్పటివరకూ తమ జీవితాల్లో ఎరుగని నిజమైన మానవతా స్పర్శను, వాసనను, మనసు తనువుల నిండుగా అనుభవించారు" అని రచయిత వాళ్ళ స్పందనను వర్ణిస్తాడు. పతితలు సైతం ఆ ఇద్దరు చారీలుగా మారి తాదాత్మ్యతను అనుభవిస్తారు. ఆ దారిలోనే రైతు దంపతుల ఆదరణకు ముగ్ధుడైన ముత్తయాచారి ఒక గుండు చెంబును రైతమ్మకు ఇస్తూ ఇగో చెల్లే నీ పెద్ద బిడ్డకు మేనమామ లెక్క ఇస్తున్న. దాసిపెట్టి దాని పెళ్లి నాటికియ్యి అంటాడు. అపాయ్యతతో ఊహించని కానుక నివ్వడంలో అవతలివారు పొందే ఆనందాన్ని తెలుసు కున్నవారు కాబట్టే ముత్తయాచారి ఆ విధంగా స్పందిం చాడు. ఇలాంటి మానవ సంబంధాలను శిరాంశెట్టి కాంతారావు గారు తన నవల 'పరంపర'లో ఆవిష్క రించాడు.

కంచరకుల సాంస్కృతిక, వృత్తి గత జ్ఞాన నైపుణ్యాలను రచయిత నిశతంగా పరిశీలించాడనడానికి ఈ నవలలో అనేక సన్నివేశాలను ప్రస్తావించవచ్చు. ముఖ్యంగా విశ్వ రూపాచారి ప్రపంచ తెలుగు మహాసభల కోసం కాకతీయ శిల్పకళాతోరణం జ్ఞాపిక తయారీ దశల గురించి చేసిన వివరాలను చూస్తే నోరెళ్లబెడతాం. రచయిత గూడా పతిత లాగా మారిపోయి కంచర వృత్తికారుల లోహ పరిజ్ఞానానికి, మైనంపై, మట్టిపై వారికిగల అవగహనకు ఆశ్చర్యపోతాడు. "ఈ స్థాయికి చేరుకోవడానికి" వాళ్ళు ఎన్నెన్ని తరాలు, తమ మేధస్సును ఎంతెంత దగ్ధం చేసుకున్నారో!? ఎన్ని జీవితాల అనుభవాలను రంగరించి కళలకు వారబోశారో! ఊహకు అందనిది. వాళ్ళంతా అలా వారబోశారు కాబట్టే ఈనాటికి కంచర వృత్తి ఒక నిర్దిష్ట ప్రక్రియగా రూపు దిద్దుకుంది. ఆ ప్రక్రియను చూస్తే ఒల్లు పులకరించి పోతుంది అని రచయిత ప్రశంసించకుండా ఉండలేక పోతాడు. రచయిత విశ్వరూపాచారిగా మారి జ్ఞాపిక రూపకల్పన చేసినట్లుగా అనిపిస్తుంది.

శిరంశెట్టి కాంతారావు ప్రతిభావంతుడే కాదు, అరుదైన రచయిత కూడా వారి కలం నుండి వెలువడే రచనల్లో మధ్యతరగతి, దిగువ తరగతి సామాజిక జీవనచిత్రాలే ప్రతిబింబిస్తాయి. వాస్తవ ఘటనలు, బలమైన వ్యక్తీకరణకు తోడు సందర్భానుసారం ఉపయోగించిన సామెతలు,

పలుకుబళ్ళు సన్నివేశానికి సహజంగా అమరుతాయి. ఇతివృత్తానికి తగిన ట్రిట్మెంట్తో పాఠకుని ఏకబిగిన చదివించగలిగే పఠనీయ ప్రజ్ఞా ఆయన రచనలకు ఉంది. శిరంశెట్టి కాంతారావు ఎన్నుకునే ఇతివృత్తంలో ఎంతో వైవిధ్యముంది. పాత్రచిత్రణ, కథన నిర్మాణ పద్ధతిలో తనకు పరిచయం లేని వృత్తులు, ఆయా వ్యక్తుల జీవన విధానం, వాతావరణాన్ని, పరిసరాలను పరిశోధనా స్థాయిలో శోధించి, సమాచారాన్ని సేకరిస్తాడు. భిన్నమైన కథనాన్ని సహజంగా చిత్రించి, ఆసక్తిగా చదివించగలిగే కాంతారావు వంటి రచయితలు అరుదుగా ఉంటారు. తాజా నవల 'పరంపర' ఈ కోవలోనిదే అని చెప్పవచ్చు. వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో వీరి రచనలు నేటి సమాజానికి అన్వయించుకోదగినవిగా అనిపిస్తాయి. రచయిత శిరంశెట్టి తెలంగాణ ప్రాంతంలో జరిగే సంఘటనలను ఇతివృత్తంగా స్వీకరించి, కథలూ, నవలలూ రాశాడు. ప్రస్తుత సమాజంలో కుటుంబ సంబంధాలు ఎలా సన్నగిల్లుతున్నాయో తెలియజేశారు. మానవసంబంధాలు అడుగంటుతున్న వైనాన్ని తెలియ పరిచారు. ప్రపంచీకరణతో కులవృత్తులు ఎలా విధ్వం సానికి గురయ్యాయో వివరించాడు శిరంశెట్టి కాంతారావు.

**ఆధారగ్రంథాలు :**

1. పరంపర - శిరంశెట్టి కాంతారావు.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# 'మాలపల్లి' నవలలో సామెతలు, జాతీయాలు - విమర్శాత్మక దృక్పథం

- చిట్టి రవీంద్ర

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వ విద్యాలయం.

**పరిచయం :**

తెలుగు సాహిత్యంలో మాలపల్లి నవల ద్వారా తనకంటూ ఒక చెదరని ముద్ర వేశారు ఉన్నవ.తెలుగు సామాజిక నవలల చరిత్రలో మాలపల్లి నవల ఒక మైలురాయి అని చెప్పడంలో సందేహం లేదు.ఉన్నవ లక్ష్మీనారాయణ ఈ నవల ద్వారా కేవలం ఒక కథను మాత్రమే కాక ఆనాటి సమాజంలోని కులవ్యవస్థ, అంట రానితనం, ఆర్థిక అసమానతలు, మూఢ నమ్మకాలు, రాజకీయ ద్వంద్వత్వాలను తీవ్రంగా ప్రశ్నించారు.ఈయన రచయితే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. అట్టడుగు వర్గాలకు అందరితో పాటు సమానత్వం కావాలని పాటుపడిన వ్యక్తి, అంటరాని తనాన్ని, కులవ్యవస్థను నిరసించాడు.గాంధేయవాదిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు.ఉన్నవ 4-12-1877లో శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించాడు. వేములూరుపాడు గ్రామంలో ప్రాథమిక విద్యను, మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. అలాగే ఉపాధ్యాయ శిక్షణ కూడా పొందాడు.1916 బారిష్టరు పూర్తి చేశారు.

**కీలక పదాలు :**

మాలపల్లి, నవల, విమర్శ, జాతీయం, సామెత, వర్గ బేదాలు, కూలీలు, దౌర్జన్యం, పెద్దమనుషులు, చైతన్యం

**వ్యాస సంగ్రహం :**

ఉన్నవ రచించిన మాలపల్లి నవల విశేష ఆదరణ పొందింది. ఈ నవలను అందరికీ అర్థమయ్యే విధంగా వాడుక భాషలో రాశారు.ఈ నవలలో సమాజంలో ప్రబలి ఉన్నటువంటి అనేక అంశాలను వ్యక్తపరిచారు.సామాజిక అంశాలు, రాజకీయ అంశాలు మొదలైన వాటితో పాటు సమాజంలో జరుగుతున్నటువంటి సంఘటనలు తన రచనల్లో తెలిపి ప్రజలకు చైతన్యాన్ని పెంపొందించాడు. ఆనాటి ప్రభుత్వంలోని లోటుపాట్లను కూడా ఇందులో నిరసించాడు. ఆనాడు ప్రజల జీవనం ఏ విధంగా ఉందో, కుల అసమానతలు ఎలా అలుముకొని ఉన్నాయో తెలియజేశాడు. దళిత సమానత్వం గురించి, కూలీల కనీస జీవనం గురించి,పెద్దమనసుల పేరుతో చేసే ఆకృత్యాల గురించి, అంటరానితనాన్ని, కుల వ్యవస్థని, జైలులోపలి పరిస్థితులు, అక్కడి స్థితిగతులు, జైలు అధికారులు చేసే ఆకృత్యాలు నిరసించాడు. నవలలో రచయిత సందర్భానుసారంగా అక్కడక్కడ సామెతలు, జాతీయాలు ఉపయోగించడం జరిగింది. మాలపల్లి నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు ప్రజల మాతృభాషలోనూ,సామాన్య సంభాషణలోనూ వినిపించే సామెతలను విస్తారంగా ఉపయోగించారు.ఇవి నవల

యొక్క భాషకు సజీవత్వం ఇచ్చి ఆ కాలంలోని గ్రామీణ జీవన వాస్తవంను ప్రతిబింబిస్తాయి.ఈ సామెతలు సమాజంలో జరుగుతున్న సంఘటనలను అన్వయించి ఎలా చెప్పారు ఈ వ్యాసం చర్చిస్తుంది.

సమాజంలో సామెతలు,జాతీయం అనేవి జన జీవనంలో కలిసిపోయాయి. ఈ సామెతల, జాతీయల వాడుక ప్రజల జీవనంలో తరచు తారసపడుతుంటాయి. సామెతలు, జాతీయాలు వ్యంగ్యాన్నే కాకుండా జ్ఞానాన్ని కూడా కలిగిస్తాయి. సామెతలు, జాతీయాలు వాచిక సంప్రదాయానికి చెందినవైనా, వ్రాత సాహిత్యంలో అవి పాత్రల స్వభావాన్ని, వర్గస్థితిని, ఆలోచనా విధానాన్ని స్పష్టంగా ఆవిష్కరిస్తాయి.

**వాన కాలం పచ్చీ, ఎండా కాలం యేచ్చి :**

కాలం మారినా జీవన పోరాటం సాగుతూనే ఉండడం. కాల పరిస్థితులను బట్టి మనిషి, వస్తువు యొక్క స్వరూపం మారడం అనే భావాన్ని సూచిస్తుంది.కొంత కాలం పని, ఆదాయం ఉండడం, బతుకు కొంచెం సుఖంగా ఉండడం. చాలా కాలం పని లేకుండడం. పేదరికం, ఆకలి, దుఃఖంలో కూలీల, రైతుల జీవితం ఎంత కష్టమైనదో తెలియజేయడానికి రచయిత ఈ సామెతను ఉపయోగించాడు.

వీ : ఆలోచనేమిటి? కోతలకు పోవద్దు.యెట్లా కోసు కుంటారో చూతం.

రం : ఇదివరకే మన పని వానాకాలం పచ్చి,యెండాకాలం యెచ్చిగా వుంది.పావలామటుకు వారికి నష్టం యెందుకూ? పని మానుకొని వాండ్లను నష్ట పెట్టను వద్దు, వాండ్లనే బాగుపడనీయండీ. చచ్చే వాండ్లం యెట్లాగూ చస్తాం.వూరికే పనిచేసి రండి. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట. 78)

వాన కాలంలో పంటలతో అతివృష్టి,అనావృష్టి వల్ల కష్టాలు పడడం,ఎండాకాలంలో పశువులకు నీటి కొరతతో రైతు జీవితంలోని నిరంతర యుద్ధాన్ని చేస్తూనే వుంటారు. ఇక్కడ కేవలం ఒక సామెతగానే కాకుండా వారి జీవిత స్థితిగతులను సూచించే ఉపమానంగా వాడారు. కూలీల, రైతుల పరిస్థితి ఎల్లపుడూ ఒక నిలకడ,స్థిరత్వం లేని జీవితాలను చూడవచ్చు.ఇది సామాజిక,ఆర్థిక విమర్శకు ఉపయోగించిన అత్యంత భావవంతమైన సామెత ప్రయోగం.

ఇక్కడ పేద కూలీల జీవితం నిరంతర కష్టసాధ్యమైనది అనే వాస్తవాన్ని తెలియజేస్తుంది.కూలీల జీవితంలో అస్థిరత, నిరాశ ఉన్న సరే జీవన పోరాటాన్ని కొనసాగించాల్సిన వాస్తవాన్ని చిత్రీకరించారు.ఈ సామెత కూలీల జీవితంలోని అస్థిరతను,వారి దీన స్థితిని తెలియజేస్తుంది.

**రాళ్లు దేవుళ్ళయితే రాసులు మింగవా? :**

దేవుడిగా పూజలు అందుకుంటున్న వస్తువులో నిజంగా శక్తి ఉంటే అసాధారణ కార్యాలు చేయగలగాలి. మనుషులు భౌతిక వస్తువులకు దైవత్వాన్ని ఆపాదించడం వల్ల ఏర్పడే అవాస్తవ ఆశలను,అనవసర భయాలను నిరసిస్తుంది. ఈ సామెత ఒక మతాన్ని కాదు మతం ముసుగులో జరిగే అవివేకాన్ని ప్రశ్నిస్తుంది. రాళ్లను భగవంతులుగా మార్చి ఆ రాళ్ల చుట్టూ భయాలు, భ్రమలు సృష్టించడం, ఆ భ్రమలను అవకాశంగా మార్చుకొని అధికారాన్ని, ఆదాయాన్ని పొందడం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఈ సామెత మూఢాచార వ్యతిరేక ధోరణికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ సామెత వ్యంగ్యతో కూడినది మాత్రమే కాదు అది తర్కాత్మక తిరుగుబాటు.

జ్యోతి : మన గుడిలోకి వస్తాడా దేవుడు?

మా : ఆహా,యెవరు కట్టించుకున్నా వస్తాడు.ఆయన కంటు లేదు.

రా : పెద్దదేవుడు మనలోనే వుంటే ఈ రాతి దేవుళ్ళెందుకు? రాళ్ళు దేవుళ్ళయితే రాసులు మింగవా అన్నారు.(ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట 29)

ఇక్కడ దేవుడు అనే వారు ఒక స్థలానికి మాత్రమే నిర్దిష్టుడా?, గుడి అంటే కేవలం దేవుని నివాసమా? అనే సంప్రదాయ భక్తి భావన చూడవచ్చు.దేవుడు వ్యక్తి, వర్గ, మత భేదాలకు అతీతుడు అందరికీ సమానమైన వాడు. ఇది భక్తి మార్గంలో ఉన్న విశాల దృష్టిని సూచిస్తుంది. దేవుడు మనలోనే ఉంటే బాహ్య విగ్రహాల అవసరమా?.

రాళ్ళకు దైవత్వం ఆపాదించడం అవివేకం.బాహ్య భక్తి, మూఢనమ్మకంతో దేవుడిని చూడటం ఫలితం ఇవ్వదు. గుడ్డిభక్తి, మూఢ నమ్మకాలపై ఉన్నవ గారి వ్యంగ్య దృష్టిని ఈ సామెత ద్వారా తెలుసుకోవచ్చు. సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని, మూఢభక్తిని ధిక్కరిస్తుంది ఈ సామెత. ఇది మూఢభక్తిపై ఉన్నవ గారి వ్యంగ్య, తాత్విక దృష్టిని వెల్లడిస్తుంది.

**గొర్రె కొవ్వెందల్లా గొల్లవాడికే మేలు :**

సాధారణంగా కష్టం చేసిన వారికె ఫలితం లభిస్తుంది, లభించాలి. అలా కాకుండా ఒకరి కష్టం ఇంకొకరికి లాభం చేకూరినప్పుడు అటువంటి సందర్భంలో ఈ సామెతను ఉపయోగిస్తారు.మామూలుగా గొర్రె ఎంత తిని బలిసిన అది వాటి యజమానికే లాభం అవుతుంది.

రం : యెక్కువ కూలిస్తే యెక్కువ తింటాం.సత్తు వెక్కు వౌతుంది.యెక్కువ పని చేస్తాం.పస్తు పడుకొని వొక మోపెత్తూ చూతం. కడుపులో సత్తు లేకపోతే వొకమాటు మోసేది రెండుమాట్లు మోస్తాం.అందువల్ల వాండ్లకు పని జాగు.మనకు కూలీ నష్టమే.

ము : వీరదాసు చెప్పింది నిజమే.కూలీవాడికి అర్థన్నం పెడితే ఆసామికి శ్రేయస్సు కాదు.పనిచేసి కూలి తీసుకోకుండా వస్తే ఆసామికి మనమీద జాలా? జాలే వుంటే యీ కథంతా యెందుకు? గొర్రె కొవ్వెందల్లా గొల్లవాడికే మేలంటారు.(ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట.78)

గొర్రె బాగా తిని పుష్టిగా బలిసిన దాని మాంసం,పాలు అన్నీ గొల్లవాడికే లాభాన్ని చేకూరుస్తాయి.అలాగే కూలీవారు ఎంత కష్టపడి పని చేసిన అతని శ్రమ యొక్క ఫలితం చివరకు యజమానికే చేరుతుంది.

సమాజంలో లేదా వ్యవస్థల్లో శ్రమ,ఫలాల మధ్య ఉన్న అసమానతను సూచించడానికి ఈ సామెతను ఉపయోగించాడు.పేదల కష్టం ఎప్పుడు అధికారం ఉన్న వారికి లాభంగా మారుతుంది. కూలీవారు ఎక్కువగా పని చేసినపుడు కొంచెం ఎక్కువ తినడం వలన కొంచెం బలం పెరుగుతుంది ఆ బలంతో ఇంకొంచం పని చేయగలుగుతారు.ఈ అదనపు శ్రమ ఫలితం కూలీ వారికి కాక తమ యజమానులకే ఎక్కువగా లాభం చేకూరు తుంది. ఆకలితో ఉన్నప్పుడు అలసట వలన పని చేసే సామర్థ్యం తగ్గుతుంది.తిన్నా తర్వాత శక్తి చేకూరి వారి శ్రమను ఎక్కువ చేయడానికి ఉపయోగిస్తారు.ఇక్కడ శ్రమ, ఫలాల మధ్య ఉన్న అసమానత స్పష్టంగా వ్యక్త మవుతుంది.

ఈ సామెత ద్వారా రచయిత కూలీవారి శ్రమను, యజమానుల స్వార్థాన్ని అలాగే సమాజంలో ఉన్నటు వంటి ఆర్థిక అసమానతను ఒక సామెత ద్వారా చెప్పాడు. వర్గవిభజన, దోపిడీ వ్యవస్థపైన విమర్శను చూడవచ్చు.

**కప్పల తక్కెడ వ్యవహారం :**

స్పష్టత, నిలకడ లేని గందరగోళమైన వ్యవహారం. ఏది ఎటు పోతుందో తెలియని పరిస్థితి, నిర్ణయం తీసు కోవడంలో కష్టమైన వ్యవహారం కలిగి ఉండడం.ఈ సామెతలో కప్ప అస్థిరత్వానికి ప్రతీకగా,తక్కెడ సమ తుల్యానికి, న్యాయనికి, ఖచ్చితత్వానికి సూచికగా చెప్పడం జరిగినది. ఒక తక్కెడలో కప్పలు వేస్తే అవి కదులుతూనే ఉంటాయి అప్పుడు తక్కెడ సమతుల్యం కోల్పోతుంది. నిలకడ లేని నాయకత్వం, మాటలలో పెద్దతనం, పనిలో వెనకడుగు వేయడం మొదలైన సందర్భాలలో ఉప యోగిస్తారు.

సం : నే మనవిచేసే దేమంటే కీడెంచి మేలేనచ్చా మన్నారు. మనవాండ్లది కప్పల తక్కెడ వ్యవ హారం కుదిరారు.పెద్దలంటే మాటలకు అంతా పెద్దలే. క్రియ వచ్చేటప్పటికి యేవో సాకులూ, ధర్మపన్నాలూ చెప్పి తప్పుకుంటారు.------------ఇటువంటి వ్యవహారాలు తమరు లక్ష జూచి వుంటారు. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట.94)

పేరుకే పెద్దలు వయస్సు లేదా పదవి ఆధారంగా వచ్చే గౌరవాన్ని ప్రశ్నించడం, మాట, పని మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బయటపెడుతుంది. సభల్లో ధైర్యంగా మాట్లాడతారు, కార్యాచరణ వేళ సాకులు చెప్పి తప్పు కుంటారు. ఇక్కడ నైతిక నాయకత్వం క్షీణతను

చూడవచ్చు. ఇక్కడ ధర్మపన్నాలు అనే పదం నిజమైన నైతిక విలువగా కాక దాన్ని తప్పించుకునే ఒక ఆయుధంగా ఉపయోగించబడుతోంది. ఇది రాజకీయాల్లో సిద్ధాంతాలు ఏవిధంగా తమ స్వార్థ పరిరక్షణకు వాడబడతాయో చూపిస్తుంది. పోరాటంలో ముందుండటం ధైర్యం, ఒంటరిగా మిగలడం ఐక్యత లేకపోవడం. ఇది సామాజిక ఒత్తిడి, రాజకీయ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో చూపిస్తుంది. 'మనమే సమ్మె గట్టించుకొని చివరకు మునసబుగారి మోస్తరుగా లొంగి పోవలసి వస్తుందేమో'. ఇక్కడ సంస్థాగత శక్తి లేని సమ్మె యొక్క విఫలతను ముందే ఊహిస్తుంది. కూలీలు ఏకమైతే శక్తి,ఒక ఊరు నిలబడకపోతే ఓటమి. లక్ష జూచి వుంటారు అనుభవాధికారానికి వినతి.

**లాభం లేని సెట్టి వరదనబోడు :**

ఏ ఉపయోగం లేని పనిలో స్వార్థపరుడు అడుగు ముందుకు వేయడు. లాభమే కేంద్రంగా ఉన్న మనస్తత్వాన్ని ఈ సామెత సూచిస్తుంది. నైతికత, జాలి, మానవ సంబం ధాలు లాభం ఉన్నంత వరకే, లాభం ఉన్నదే బంధం,లాభం పోతే సంబంధం తెగిపోతుంది.

షా : గిరాకీలేదు, బండలూలేదు, అడిగేదిక్కే లేదు. మీరు పండినా యెండినా వ్యవసాయం చెయ్యక తప్పదు కదా. వర్తకంలో మేమున్నందుకు దండగో పండగో కొంటూ వుంటాం.

సం : లాభం లేని సెట్టి వరదనబోడు, యిదివర కెట్ల దీస్తున్నారు.(ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట.57).

ఇది వాణిజ్య ప్రపంచంలోని మూల సూత్రం.గిరాకీ ఉంటేనే వ్యాపారం,గిరాకీ లేకపోతే వ్యాపారం లేదు. రైతులకు వ్యవసాయమనేది ఒక ఎంపిక మాత్రమే కాదు. అది జీవనాధారం, బతకడానికి తప్పనిసరి. వ్యాపారికి కొనుగోలు ఐచ్ఛికం. లాభం వస్తేనే చేస్తాడు లేదంటే చేయడు. ఇక్కడ శ్రమ, మూలధనం మధ్య అసమాన బంధం చూడవచ్చు.

ఇది వాణిజ్యవేత్త యొక్క ఆర్థిక స్వేచ్ఛను సూచిస్తుంది. పంట బాగుంటే పండగ,పంట చెడితే దండగ రెండింటిలోనూ రైతు శ్రమ విలువ కాదు మార్కెట్ పరిస్థితులే ప్రధానం.

**తోక కొయ్యమంటే సున్నం కూడా పెట్టినట్టు :**

ఒక పని చేయమన్నప్పుడు చెప్పిన దాని కంటే ఎక్కువ చేయడం,అవసరం లేని పనిని కూడా చేసి పరిస్థితులను మరింత చెడగొట్టడం. చిన్న పని చేయమంటే, అతిశయంగా, అతి ఉత్సాహంతో చేయడం,అవసరం లేని అదనపు చర్యలు తీసుకుని సమస్యను పెంచడం, మితిమీరిన జోక్యం వల్ల పని చెడిపోవడం,చెప్పినంతే చేయకుండా, హద్దులు దాటి చేస్తే నష్టం.అతిగా చేసి ఆపద తెచ్చుకోవడం.

వెం : పాలెపు మునసబుగారూ,వీరూ యింకా హేమాహేమీలంతా జేరి కోతకూలి గింజలిస్తామా, డబ్బు లిస్తామా అని ఆలోచిస్తున్నారు.

సం : మన అయ్యగారు యేమిస్తామంటున్నారు?

వెం : మునసబుగారు తోక గొయ్యమంటే యీయన సున్నం గూడ పెట్టమంటున్నారు.

సం : అదేమిటోయ్,కూలీలకు తోకలుంటవా?

వెం : మునసబుగారు కూలీకింద డబ్బులిచ్చి, గడ్డి మామూ లిస్తా మంటుంటే, వీరు గడ్డి అసలే వల్లగా దంటున్నారు. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట. 67)

పంట కోతకూలి విషయమై కూలీలకు ఏమివ్వాలో గింజలా, డబ్బులా అనే చర్చలో మునసబు కూలీ కింద డబ్బు, గడ్డి మామూలు ఇవ్వాలని అనుకున్నప్పుడు ఇంకొకరు డబ్బు ఇవ్వడమే గొప్ప అనుకుంటే డబ్బుతో పాటు గడ్డి కూడా ఇవ్వడం కుదరదు అంటున్నారు.

ఇక్కడ మితిమీరిన జోక్యం,అవసరానికి మించిన ఉత్సాహం, చెప్పిన పనికంటే మించి,అవసరం లేని అదనపు చర్యలు చేసి పరిస్థితిని చెడగొట్టడం చూడవచ్చు.

**మన బంగారం మంచిదైతే కంసాలేమి చేస్తాడు :**

మన పని, మన నడవడిక, మన ఉద్దేశ్యాలు సక్రమంగా, నిజాయితీగా ఉంటే ఇతరులు చేసే

విమర్శలు,అనుమానాలు మనకు ఏ హాని చేయలేవు. తన దగ్గర ఉన్నపుడు ఏ పరీక్షకు భయపడడు,అది తన నిజాయితికి మరింత ధృవీకరణ అవుతుంది. భయం తప్పు చేసినవాడికే ఉంటుంది కని సత్యవంతుడికి కాదు.

రా : ఇది మా దగ్గరకు తెచ్చా వెందుకు?

బంట్రోతు

: ఆ రామదాసెవరో నాకు తెలియదు.సరదార్లు నాతో ఒక మనిషిని పంపి చూపిస్తే నోటీసులు జారీ చేస్తాను.

వెంకటయ్య

: రామదాసు కేసు ఫైసలయిపోయిందను కున్నామే.

రా : అదిగాదు, భూమి స్వాధీన నిమిత్తం వ్యాజ్యం వేశారు.

వెం : వాది, పంతులా? చిన్నాయనా?

రా : లేదు. ఈయనే.

వెం : ఇది పంతులు చేసిన పితలాటకం.

రా : మన బంగారం మంచిదయితే కంసాలేమి చేస్తాడు? (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి., పుట.182)

రామదాసు కేసు ఒకసారి ముగిసిందనుకున్నా న్యాయ వ్యవహారం, భూమి స్వాధీన నిమిత్తం వ్యాజ్యం,ఆస్తి మీద అధికారం కోసం కొత్త దావా వాది పంతులు.ఇక్కడ న్యాయం, అధికారం, మోసం అనే మూడు అంశాల మీద సంభాషణ తిరుగుతోంది.

నిజాయితీగా ఉన్న వ్యక్తి తప్పు చేశాననే అపరాధ భావన లేని స్థితిలో ఉంటాడు, ఆరోపణలను ధైర్యంగా ఎదుర్కొంటాడు, సమాజ ఒత్తిడికి లోనుకాడు. అందుకే ఈ సామెత ఆత్మవిశ్వాసానికి రూపం. అనవసర ఆరోపణలు వచ్చినప్పుడు నిజాయితీని సమర్థించుకునే సందర్భాల్లో ఈ సామెతను ఉపయోగిస్తారు.

**నేల విడచి సాము చేయడం:**

ఆధారాన్ని కోల్పోయి చేసిన ప్రయత్నం ఆచరణ యోగ్యం, తగినది కానిది,అసాధ్యమైనది చేయడం. నిలబడలేని, ఫలితం ఇవ్వని ప్రయత్నం చేసే సంధర్భంలో ఈ సామెతను ఉపయోగిస్తారు.

సంఘ నిర్మాణమంటే వొక పెద్ద మేడగట్టడం మోస్తరు. ఆయానికి దగిన దూలాలూ, గోడలకు దగిన మొకరాలూ, తగినంత కలపా వుండాలె. - - - - నేలవిడిచి సాము జేసినట్లే అవుతవి. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి. పుట.116)

ఇక్కడ సంఘ నిర్మాణం అనే భావాన్ని ఒక మేడ నిర్మాణ రూపకం ద్వారా తెలియజేస్తున్నాడు.పెద్ద మేడను ఒక సంఘంగా,సంఘంలోని వ్యక్తులను దూలాలు, గోడలు, పెంకులు, కలపగా అలాగే అమరిక, పొసగడం సామర్థ్యాలు, పరస్పర అనుకూలత ఉండాలని చెబు తున్నాడు. ఇక్కడ సమిష్టి తాత్విక వివరణ చూడవచ్చు.

ఆచరణకు సాధ్యం కాని,నిలకడ లేని లేదా తన సామర్థ్యాన్ని మించిన కార్యాన్ని తలకెత్తుకోవడం అనే భావాన్ని వ్యక్తపరిచే జాతీయము.వాస్తవాన్ని వదిలి చేసే ప్రయత్నం సాహసం కాదు అది అవివేకం.ఆధారం లేని కార్యం ఎంత గొప్పగా కనిపించినా నిలబడదు.

**బిడ్డగనే కోడలుంటే వద్దనే అత్త ఎక్కడా ఉండదు :**

సమాజంలో మామూలుగా అత్త కోడళ్ళ మధ్య శక్యత ఉండదు. ప్రతి దానికి అత్తలు కోడళ్లను తప్పు బడుతూ, నిందిస్తూనే ఉంటారు. ఇలా ప్రతి దానికి కోడలిని ఒప్పుకోని అత్త కుమారుడి సంతోషం, వంశ కొనసాగింపు, ఈ కారణాల వల్ల అత్త ఎంత మొండిగా కనిపించినా చివరికి ఒప్పుకుంటుంది. ఇది మనం చూస్తూనే ఉన్నాం.

ఒక పని మనకు ప్రయోజనకరంగా మారి అది మనకు లాభం తెస్తుందంటే దానిని తిరస్కరించే,వద్దు అనే వారు ఉండరు.ఎక్కడ లాభం కనిపిస్తుందో అక్కడ ఏ ఆంక్షలు ఉన్న అవి అన్ని కరిగిపోతాయి,నిరాకరణ ఒప్పుకునే స్థితిలోకి మారుతుంది.లాభం ఉన్నచోట తిరస్కారం అనేది ఉండదు. స్వలాభానికి అనుకూలమైన విషయం సామా జిక నిరాకరణలను కూడా కరిగిస్తుంది.

సం : పత్తివిత్తులు యింకా యెన్నాళ్ళు పోతవి?

ఆ : అయిపోవచ్చినవి.రెండురోజులకు మిగలవు.

సం : యెట్లాగబ్బా యిగను? పత్తి అడిగే వాండ్లు లేరు. పత్తిగింజలకు యెక్కడలేని ధరానూ. పత్తి పట్టిస్తే బాగుండు.-- వొక పందుం పత్తి నలుగుతుంది.

ఆ : చౌదరయ్యగారు రేపు వస్తారు; గింజలు కొందా మంటారేమో?

సం : మనం పత్తి పట్టిస్తే ఆయ నెందుకు కొంటా నంటాడు? బిడ్డ గనే కోడలుంటే వద్దనే అత్త యెక్కడా వుండదు. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట.55).

ఇక్కడ పత్తివిత్తనాలు మిగిలిపోయే పరిస్థితి, పత్తి కొనే వారు లేరు, పత్తి పట్టిస్తే విలువ పెరుగుతుంది. కాబట్టి పత్తి తీస్తే విత్తనాలు వస్తాయి.అప్పుడు చౌదరయ్య గింజల కోసం ఎక్కడ కొనవలసిన అవసరం లేదు ఎందుకంటే మనమే పత్తి పట్టిస్తే ఆయన వేరొకరి దగ్గర ఎందుకు కొంటాడనుకుంటాడు. ఇక్కడ సరుకును విలువైన, మంచి స్థితిలో ఉంచితే కొనుగోలుదారు తప్పక వస్తాడు. స్వార్థానికి అనుకూలమైతే ఎవరూ తిరస్కరించరు.

మానవ స్వభావంలోని స్వార్థ,ప్రయోజన ధర్మంపై చేసిన లోతైన వ్యాఖ్య. ప్రయోజనం స్పష్టంగా కనిపిస్తే వద్దు అన్న మాట నిలవదు.

**వెళ్ళు వంకర పెట్టితేగాని వెన్న రాదు :**

కష్టం, ప్రయత్నం, త్యాగంతో పాటు కొంచెం చాక చక్యము ఉంటేనే మంచి ఫలితం లభిస్తుంది. పని చేయకుండా లాభం ఆశించడం వల్ల ఉపయోగం లేదు.

పాలను పెరుగుగా మార్చి ఆ పెరుగును చిలికి శ్రమిస్తేనే వెన్న పైకి వస్తుంది అప్పుడు ఆ వెన్నను వేళ్ళతో వంకరగా అంటూ తీస్తేనే వెన్న చేతికి వస్తుంది.శ్రమ లేకుండా చాకచక్యం లేకుండా వెన్న రావడం కష్టం.అంటే ప్రయత్నం, ప్రక్రియ, కొంత తంత్రం లేకుండా ఫలితం రాదు అన్నది దీని అర్థం.

గు : అప్పీలులో గెలిస్తే యివన్నీ తిరిగిరావా?

వీ : గెల్చేనా ?

గు : సోది చెప్పమంటావా? ఫీజిచ్చి ప్లీడరుగారి నడగండి.

వీ : అప్పీలు రామదాసు చేయగలడని తోచదు. మనిషి దగ్గర ఆశులేదు.

గు : బొత్తిగా యెత్తులేకపోతే అప్పీలు చేయడం కష్టం. నా మామూ లిప్పించు. సలీసుగా అప్పీలు దాఖ లయ్యే ఏర్పాటు చేస్తాను. మా బంధువుడే ఒక ప్లీడరున్నాడు. అప్పీలు మా ప్లీడరుగారి చేతనే చేయిస్తే బాగుండదు. వీ:నారాయణరావుగారు దాఖలు చేయరా?

గు : యెబ్బే? ఆయన పనికిరారు.వేళ్ళు వంక పెట్టితేనేగాని వెన్న రాదు.కాస్త ఉల్టాసీదాలు చేయలేకపోతే ప్రయోజనం లేదు.ఆయన ముక్కుకు సూటిగా పోతానంటాడు.( ఉన్నవ లక్ష్మీనారాయణ.మాలపల్లి.పుట.223).

కానీ ఇక్కడ మాటలల్లో అది న్యాయవ్యవహారానికి అన్వయించబడింది. అక్కడే దాని అసలు లోతు బయట పడుతుంది. అప్పీలు,తీర్పు తిరగరావడం,డబ్బు ప్రభావం అలాగే వకీల్ పాత్ర చెప్పేది ఇదే అప్పీలు వేయడం అనేది కేవలం చట్టపరమైన ప్రక్రియ మాత్రమే కాదు. అందులో చాకచక్యం, మెలకువ, కొంత ఉల్టాసీదాలు ఉండాలిని అవి లేకపోతే, ఎంత నిజం ఉన్నా ఫలితం రావడం కష్టం అని అంటాడు. వెళ్ళు వంక పెట్టితేనేగాని వెన్న రాదు అంటే కొంచెం ఉల్టాసీదాలు చేయలేకపోతే ప్రయోజనం లేదు. ఇక్కడ న్యాయపరమైన కేసు,వాస్తవంగా బలమైన అంశం అయిన కేసు గెలవలంటే కొన్ని లొసుగులు అలాగే చాకచక్యంగా ముందుకు వెళ్లాలి అప్పుడు విజయం సాదిస్తామని చెబుతున్నాడు. ఇక్కడ సామెత ఒక నైతిక బోధ కాదు వ్యవస్థపై చేసిన కఠిన విమర్శ.

సామెత అర్థం ఈ సందర్భంలో ఇలా మారుతుంది గెలవలంటే కేవలం న్యాయం సరిపోదు వ్యవస్థకు తగిన మెలకువ,మలుపులు అవసరం అని న్యాయంగా నడిచే వాడికి ఫలితం దక్కని సందర్భంలో వంక పెట్టడమే విజయ మార్గంగా మారింది. నేరుగా నిజాయితీతో వెళితే ఫలితం రాదు, చాకచక్యంగా తిప్పితేనే గెలుపు అని ఇక్కడ చూడవచ్చు.

**ముకుతాడు పోసిన పోట్లకోడె వలె వెంట పోవడం :**

ఇతరుల ఆజ్ఞలకు లోబడి, ఒక స్వంత నిర్ణయం

లేకుండా, ప్రశ్నించకుండా వెంట వెళ్ళడం.ఎవరో చూపించిన దారిలోనే తన ప్రమేయం లేకుండా బలవంతంగా, అవివేకంగా నడుచుకునే పరిస్థితిని ఇది సూచిస్తుంది.

రా : రైలుకు వొక్కళే పోగలను.తోడవసరం లేదు.

మో : ఊరికి పోదాం.

ఉభయులూ జట్కా బండెక్కారు. ఒకరితో ఒకరు మాట్లాడలేదు. స్టేషన్కు బోయేవరకు అయిదైంది. రాజారావు టిక్కెట్లు తీసుకొనేందుకు వెళ్ళాడు.మోహనరావు యింతలో సందు చేసుకొని జాబు ఉత్తరాల పెట్టెలో వేసి,టిక్కెట్లు తేంగానే ముకుతాడు పోసిన పోట్లకోడె వలె వెంట పోయి రైలెక్కాడు. (ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, పుట. 200).

రాజారావు, మోహనరావు ఇద్దరూ కలిసి ఊరికి వెళ్లడానికి జట్కా బండెక్కారు. ఇద్దరి మధ్య మాటలే లేవు.ఒక రకమైన అంతరంగిక ఉద్రేకం, మౌనం కనిపిస్తుంది. స్టేషన్‌కు చేరుకున్నాక రాజారావు టిక్కెట్లు తీయడానికి వెళ్తాడు.ఈలోగా మోహనరావు ఒక అవకాశాన్ని ఉపయోగించుకుని లేఖ పోస్టుబాక్సులో వేస్తాడు. రాజారావు టిక్కెట్లు తీసుకొచ్చిన వెంటనే ముకుతాడు పోసిన పోట్లకోడె వలె వెంట పోయి రైలెక్కాడు.

ఇక్కడ మోహనరావు బయటకు స్వతంత్రంగా కనిపించినా, వాస్తవానికి అతడు పరిస్థితుల చేత,రాజారావు చర్యల చేత నడిపించబడుతున్న వ్యక్తి తన అంతరంగంలో ఏదో రహస్యం దాచుకొని ఉన్నప్పటికీ బయటకు మాత్రం ప్రశ్నించకుండా, ఎదురు మాట్లాడకుండా, అనుసరించే వాడిగా ఉండడం చూడవచ్చు.

తన సంకల్పం బయటపెట్టలేని, నిస్సహాయ స్థితి, అంతర్గత సంఘర్షణ పడుతున్న బాహ్య పరిస్తుతులకి లోబడి నడుచుకోవడం, స్వేచ్ఛ ఉన్నట్టు కనిపించినా ఆచరణలో లేని పరిస్థితి మొదలగు సందర్భాలలో ఉపయోగిస్తారు.

**ముగింపు :**

ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి నవలలో సామెతలు, జాతీయాలు కేవలం భాషా సౌందర్యాన్ని పెంపొందించే సాధనాలుగా మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంలోని లోతైన విరోధాలను వెలికితీసే శక్తివంతమైన విమర్శా ఆయుధాలుగా పనిచేశాయి. ఇవి రచయిత భావజాలాన్ని ప్రత్యక్ష ఉపదేశం లేకుండా సహజమైన సంభాషణల ద్వారా పాఠకుడికి చేరవేస్తాయి. మొత్తంగా చూస్తే, మాలపల్లి నవలలోని సామెతలు, జాతీయాలు భాషకు ప్రాణం పోసినవే కాదు అవి సమాజానికి అద్దం పట్టిన వ్యాఖ్యానాలు. ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రజల నిత్యజీవితంలో వినిపించే మాటలనే సాహిత్య ఆయుధాలుగా మలచి, సామాజిక అన్యాయాలపై గట్టి విమర్శ చేశారు. ఈ సామెతల ప్రయోగం వల్ల నవలలోని భావ జాలం మరింత లోతుగా, బలంగా పాఠకుడి మనసులో నాటుకుపోతుంది. మాలపల్లి నవలలో సామెతలు, జాతీయాలు అలంకారాలుగా కాకుండా సామాజిక వాస్తవానికి ప్రతిబింబాలుగా నిలుస్తాయి. సమాజంలోని ఆర్థిక అసమానతలు, అజ్ఞానం, నైతిక విలువలు మరియు చైతన్యం వంటి అంశాలను ప్రతిబింబించే సాహిత్య శక్తులు.

**ఆధార గ్రంథాలు :**


1. మాలపల్లి - ఉన్నవ లక్ష్మీనారాయణ. జయంతి పబ్లికేషన్స్,కారల్ మార్క్స్ రోడ్,విజయవాడ-520002.
2. తెలుగు జాతీయాలు - డా॥బూదరాజు రాధాకృష్ణ. ముద్రణ: శ్రీ కళాంజలి గ్రాఫిక్స్ హైదరాబాద్ -- 29.
3. సామెతలు జాతీయాలు - డా॥ ద్వానా శాస్త్రి. ప్రచురణ: సూర్య ప్రచురణలు 37/202,రామ్మోహన్ టవర్స్ హుడా కాంప్లెక్స్, హైదరాబాదు 500 035, హైదరాబాద్
4. సంపూర్ణ తెలుగు సామెతలు - మైథిలి వెంకటేశ్వరరావు(సేకరణ,కూర్పు). ముద్రణ : రమణ ఆఫ్సెట్ ప్రింటర్స్,విజయవాడ - 3.

5. తెలుగు సామెతలు - రెంటాల గోపాలకృష్ణ. పబ్లిషర్స్ : నవరత్న బుక్ సెంటర్, కారల్ మార్క్సరోడ్, విజయవాడ, ప్రింటర్స్ : శ్రీ విజయలక్ష్మి ఆఫ్ సెట్ ప్రెస్, టిక్కిల్ రోడ్, విజయవాడ-2.
6. తెలుగు సామెతలు సాంఘిక జీవితం - డా. అక్కిరాజు రమాపతిరావు.విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500001.
7. తెలుగు జాతీయాలు వాటి పుత్తు పూర్వోత్తరాలు - డా॥. బూదరాజు రాధాకృష్ణ పబ్లిషర్స్ : క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్. (1 జనవరి 2019).
8. తెలుగు జాతీయాలు - డా. వెలగా వెంకటప్పయ్య(సంపాదకుడు). పబ్లిషర్స్ : నవరత్న బుక్ హౌస్.
9. తెలుగు సామెతలు - డా. వెలగా వెంకటప్పయ్య(సంపాదకుడు). పబ్లిషర్స్ : నవరత్న బుక్ హౌస్
10. తెలుగు సామెతలు - వి. హనుమంతరావు. ప్రచురణ : లక్ష్మీ శ్రీనివాస పబ్లికేషన్స్.

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# హిమజ్వాల నవల – గీత పాత్ర మనో విశ్లేషణ

– మీసరగండ గాయత్రి దేవి

పరిశోధక విద్యార్థిని, యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప.

**వ్యాస సంగ్రహం :**

మనిషి స్వభావం అనేది అతని ప్రవర్తనలో తెలుస్తుంది. ఒక వ్యక్తి ప్రవర్తనను బట్టి అతని మనసేమిటో తెలుసు కోవచ్చని అంటారు పెద్దలు. మనసు అనేది ఒక అమూర్త భావన. మనలో భావోద్వేగాలు, అనుభూతులు, రకరకాల కోరికలు కలిగించేది మనసు. ఏదైనా వస్తువు లేదా జీవరాశిపై ప్రేమ, ద్వేషం వంటి భావాలను కలిగించే ఒక అంతరాళంగా చెప్పవచ్చు. ప్రతి మనిషి యొక్క భావాలు, అనుభూతులు, అభిప్రాయాలు వారి వారి మనసు, అది ఆలోచించే విధానంపై ఆధారపడి ఉం టుంది. అందుకే ఎవరి ఆలోచనలు వారివి. మనిషి ప్రవర్తన, నడవడి వారి మానసిక స్థితిని తెలియజేస్తుంది. ఆధునిక కాలంలో సాహిత్యంలో మనస్సు ప్రభావం చాలా ఎక్కువుగా కనిపిస్తుంది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో కూడా మనస్తత్వశాస్త్ర ప్రభావం కనిపిస్తుంది. ముఖ్యంగా నవలా సాహిత్యంలో దీని ప్రభావం ఎక్కువ. పాశ్చాత్య దేశాలలో సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రభావంతో మనస్సుని గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయడం ప్రారంభమయింది. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాల ప్రభావం సాహిత్యంలో అనుసరించారు కొందరు రచయితలు. అటువంటి వారిలో వడ్డెర చండీ దాస్ ఒకరు. వారు రచించిన అనేక నవలల్లో ఒకటి 'హిమ జ్వాల.' దాని ఇతివృత్తం గురించి వివరించి, అందులోని ప్రధాన పాత్ర గీత. ఆమె పాత్రలో కనిపించే మానసిక విశ్లేషణను గురించి వివరించడమే ఈ పరిశోధన వ్యాసం ఉద్దేశం.

**కీలక పదాలు :**

ఆధునిక సాహిత్యం, నవల ప్రక్రియ, వడ్డెర చండీదాస్, హిమ జ్వాల, గీత పాత్ర, మనో విశ్లేషణ

**పరిచయం :**

ఎంతో విశిష్టమైన తెలుగు సాహిత్యంలో ఎందరో రచయితలు తమ రచనల ద్వారా చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. వారి రచనలు పాఠకుల హృదయాలను హత్తుకున్నాయి. కొన్ని సామాజిక మార్పు నకు కారణమైతే మరి కొన్ని సమాజాన్ని ఆలోచింపజేస్తాయి. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో నూతన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆనాటి కాలంలో అటు రచయితలను, ఇటు పాఠకులను ఆకర్షిం చిన ప్రక్రియ నవల. అందులోనూ మనిషి తత్వాన్ని, మనసు తత్వాన్ని గురించి అవగాహన కలిగిస్తూ వచ్చిన మనోవిశ్లేషణాత్మక నవలలు కూడా అనేకం ఉన్నాయి. సాహిత్యంలో అన్ని నవలలు ఒక ఎత్తు, మనోవిశ్లేషణాత్మక

నవలలు ఒక ఎత్తు అనిపించాయి. మనిషిని, అతని స్వభావాన్ని, అంతరంగాలను ఆవిష్కరించడంలో రచయితలు కృతకృత్యులయ్యారు. అటువంటి రచయితలో వడ్డెర చండీదాస్ ఒకరు. వారు రచించిన 'హిమ జ్వాల' నవల సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. దాని గురించిన విశేషాలు ఈ వ్యాసంలో ఇవ్వడం జరిగింది.

**రచయితగా చండీ దాస్ :**

వడ్డెర చండీ దాస్ అన్న కలం పేరుతో రచనలు చేసిన రచయిత అసలు పేరు 'చెరుకూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు'. కష్టాన్ని నమ్ముకొని బ్రతికే శ్రమ జీవులు వడ్డెరల మీద గౌరవంతో వారి పేరుని, కాళీ మాత మీద భక్తి భావంతో చండీ దాసుడు అనే పేరుని స్వీకరించి వీరు రచనలు చేశారు. వీరు 1937 నవంబర్30 వ తారీఖున కృష్ణాజిల్లా, పామర్రు మండలం, పెరిశేపల్లి గ్రామంలో జన్మించారు. వీరు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్ర అధ్యాపకుడుగా పని చేశారు. 1960లో ప్రారంభించిన ఈ నవలను 1967 లో పూర్తి చేశారు. ఈ నవలా రచనలో తనపై ఎంతగానో ప్రభావం చూపించిన రచయిత బుచ్చిబాబు గారికి దీనిని అంకితమిచ్చారు. వీరి ఇతర రచనలు అనుక్షణికం, చీకట్లోంచి చీకటిలోకి, ప్రేమతో ప్రముఖమైనవి.

**ఇతివృత్తం :**

చండీదాస్ గారి "హిమజ్వాల" నవలలోని గీత ప్రవర్తనలో మనకు Nymphomanic ప్రవర్తన కనిపిస్తుంది. తన "యిచ్ఛ" చెప్పిన రీతిలో స్వేచ్ఛగా ప్రవర్తించిన 'గీత' అనే అందమైన అమ్మాయి కథ ఈ నవలలో కనబడుతుంది. "వ్యక్తి లేకపోతే సంఘం లేదు. సంఘ జీవనం అవసరార్థం మాత్రమే. సంఘం అనేది వ్యక్తి అంతర్గత జీవితం బాహ్య వాతావరణం మాత్రమే సంఘం కాదు"[1] (ఈమాట అంతర్జాల పత్రిక - తేది:జులై, 2006) అనే ఈ రచయిత లేఖిని నుండి ఇలాంటి పాత్రలు జాలువారడంలో ఆశ్చర్యం లేదు.

కృష్ణ చైతన్య, గీతాదేవిల పరిచయంతో నవల ప్రారంభమవుతుంది. గీతాదేవి అనుకోకుండా కృష్ణ చైతన్య కారు కింద పడటం వల్ల ఆమె దేహం అంతా మట్టి కొట్టుకొని, దుమ్ముతో ఉన్నా ఆమె అందం మాత్రం కట్టిపడేసేలా ఉంది. గీతాదేవి బాగా చదువుకున్న అమ్మాయి, సౌందర్యవతి, ఆదర్శ భావాలు, సంగీతం పట్ల ఆసక్తి ఎక్కువుగా ఉన్నాయి. ఆమెలో భావుకత కూడా ఎక్కువే. గీతాదేవికి చనిపోయిన తన తండ్రి ఆదర్శం. ఆయన గొప్ప భావుకుడు. ఆయన భావుకతను, భావాలను, ఆధునిక భావాలను, ఆలోచనలను పుణికిపుచ్చుకుంది. ఆమె దృష్టిలో సామాజిక కట్టుబాట్లు అనేవి అంత ప్రాముఖ్యత ఇవ్వవలసినవి కావని, వ్యక్తి వికాసం, స్వేచ్ఛ (లిబర్టీ) మనిషికి ముఖ్యమని బలంగా నమ్ముతుంది. అందుకే ఆమె జీవితంలో చాలా విచిత్రమైన సంఘటనలను, పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి స్థితిలో కూడా చెక్కుచెదరని వ్యక్తిత్వం,ఆత్మస్థైర్యంతో నిలిచే గీతాదేవి ముందు సంప్రదాయాలకు, కట్టుబాట్లకు విలువిచ్చే కృష్ణ చైతన్య కొంచెం బలహీనుడని చెప్పకనే చెప్తాడు రచయిత.

అంత ఉన్నతమైన వ్యక్తిత్వం, ఆధునిక స్వేచ్ఛా భావాలు ఉన్న గీతాదేవికి ఆశ్రయం ఇస్తాడు. వారి ఆలోచనలు, అభిప్రాయాలు కలవడంతో వారి మధ్య స్నేహబంధం బలంగా ముడిపడుతుంది. ఫిలాసఫీ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, గీతాదేవికి ఒకరిపై ఒకరికి సహజ మోహం కలుగుతుంది. సహజమయిన భావుకతతో గీత అతనికి తన ప్రేమతో పాటు ఆమెకు అతని పట్ల కలిగిన వాంఛను తెలియజేస్తుంది. అప్పటి నుండే కథ మొదలవుతుంది.

కృష్ణ చైతన్యకున్న సహజ స్వభావం సంకోచం, భయం. సమాజం పట్ల నైతిక విలువల పట్ల కొంచం భయ కలవాడు. ఇద్దరు చాలాకాలం పా ఒకరి మనసు ఒకరు అర్థం చేసుకున్నారు. ఆమెతో కలిసి తిరిగే వాడు. అతడి మీద ఆమెకు ప్రేమ కలిగింది. తన మనసులోని మాటను, కోరికను అతడి ముందు ఉంచింది.

కానీ ఆమెలో తన చనిపోయిన తల్లిని చూసుకునే కృష్ణ చైతన్య, ఆమె బహిర్గతంగా వెలిబుచ్చిన కోర్కెను తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఆమె కోరికను తిరస్కరిస్తాడు. స్త్రీగా తాను ముందుకు వచ్చి, మనసు విప్పి, అతనికి

చెప్పిన కోర్కెని అతను నిరాకరించాడన్న ఆవేదనతో, అది తన ప్రేమకే తిరస్కారంగా, అగౌరవంగా భావించి, కృష్ణ చైతన్యకు తెలియకుండా ఒక లెటర్ రాసి ఉంచి, అతని ఇల్లు వదిలి వెళ్ళిపోతుంది గీతాదేవి. అతను జరిగింది తెలుసుకొని 'guilty compensation'తో గీతాదేవికి అన్యాయం చేశానేమోనన్న ఆందోళనతో దేశదిమ్మరవు తాడు. అక్కడి నుండి ఈ సమాజంలో ఒంటరి ఆడపిల్లలు ఎదుర్కొనే సమస్యలను ఎదుర్కుంటుంది గీతా దేవి. తనకు ఎన్ని సమస్యలు వచ్చినా కానీ అలాంటి స్థితిలో మనస్థైర్యం కోల్పోకుండా ముందుకు నడుస్తుంది గీతా దేవి. రోడ్డున పడ్డ గీత ఆమె స్నేహితురాలి సహచర్యం వల్ల చదువుకోసాగింది. ఆమె దగ్గరే ఉంటూ వీ.ఏ చదివి, ఉద్యోగ అన్వేషణలో పడుతుంది.

అలాంటి సమయంలో స్నేహితురాలి భర్త శారీరకంగా తనని వాంఛించడం, ఆమె స్నేహితురాలికి ఆ విషయం తెలిసినా ఆమె దానికి అభ్యంతరం చెప్పకపోవడం గీతాదేవికి నచ్చలేదు. ఆధునిక ఉదార భావాలు ఉన్నంత మాత్రాన, ఎవరితో ఒకరితో తన అవసరాన్ని తీర్చు కోవాలనుకునే ఆలోచనే ఆమెకి జుగుప్స కలిగిస్తుంది. అందుకే స్నేహితురాలిని కూడా వదిలి ఒక పత్రికలో సహాయక సంపాదకురాలుగా చేరుతుంది. అక్కడి పరిస్థితులు కూడా ఆమెను బాధ పెట్టడంతో కొంత కాలానికి దాన్ని కూడా వదిలేసి, లెక్చరర్ గా వాల్తేరులోని ఒక కాలేజీలో చేరుతుంది. అక్కడే ఆమె జీవితం అనుకొని మలుపు తిరుగుతుంది.

అక్కడే ఆమెకు శివరాం పరిచయమవుతాడు. అతను చెప్పే ప్రేమ పూరితమైన మాటలు, భావుకత కలిగిన అతడి ఆలోచనలు గీతా దేవి మనసు మీద కొంచెం కొంచెం ప్రభావం చూపిస్తాయి. దాని ఫలితమే శివరాం పట్ల ఆమెలో కలిగిన నమ్మకం. ఆ నమ్మకంతోనే శివరాం ఒత్తిడికి లొంగిపోయి, అతడిని పెళ్లి చేసుకుంటుంది. పెళ్లి జరిగిన తర్వాత శివరాం కూడా అందరి లాంటి వాడేనని, తనలో కలిగే రస స్పందనలు అర్థం చేసుకోగలిగే భావుకత అతనిలో లేదని అర్థం చేసుకుంటుంది. ఆమె వివాహం ఒక భావుకతతో నిండిన వ్యక్తికి, ఏ మాత్రం రస స్పందన లేని పశువుకి మధ్యన ఏర్పడిన బంధం లాంటిది. అతని దృష్టిలో భార్య అయిన, మరే స్త్రీ అయినా సరే తనలోని వాంఛను తెలియజేస్తే ఆమెను ఒక తిరుగు బోతుగా, చెడిపోయిన సరుకు అన్న బలమైన అభి ప్రాయాల్లో ఉంటాడు. పైగా తల్లి ప్రభావంలో పూర్తిగా సాంప్రదాయ బద్ధంగా ఉండే జీవితాన్ని, భార్యతో సహ జీవనాన్ని కోరుకుంటాడు. అతడితో ఆమె జీవితం రంగులమయం అవుతుందనికుంది. కానీ ఆమె కోరికలు సంతృప్తి చెందకపోవడం, భర్త తనకు స్వేచ్ఛనివ్వడంలో కఠినంగా వ్యవహరించడం కొంత ఇబ్బందులకు గురి చేసింది. భర్త శివరాంతో కలిసి అరకు పర్యటనకు వెళు తుంది. అందమైన అరకు లోయలో మనసు మయూరమే అవుతుంది గీతకు. కానీ ఏ రకమైన రసస్పందన లేని పురుషుడుగా శివరాం, భార్యలోని ప్రేమని, భావుకతని అర్థం చేసుకోకుండా ఆమెని మాటలతో బాధపెడతాడు. అతని ప్రవర్తనతో సహనం చచ్చిపోయి, గీతలోని 'spilt personality' వల్ల అభ్యుదయ వ్యక్తిత్వం తిరగబడు తుంది. డాని వల్ల వారి మధ్య తీవ్రమైన వాగ్వాదం జరుగు తుంది. దానికి ఆమె పెద్ద మూల్యమే చెల్లించాల్సి వస్తుంది. ఆమె కలలు కన్న జీవితం కుప్పకూలిపోయింది. శివరాంలోని మగాడు పాశవికంగా, శారీరకంగా హింసించ యినా తనతో తీసుకు పోవాలనుకుంటాడు. కానీ గీతాదేవి ఒప్పుకోకపోవడంతో తాళి తెంపి ఇచ్చేయ మంటాడు. ఆమెను ఆ అడవిలోనే ఒంటరిగా వదిలేసి, తన దారిన తాను వెళ్ళిపోతాడు.

మరోసారి స్త్రీ స్వేచ్ఛను లైంగిక పరంగా కూడా కోరుకున్న గీతాదేవి ఒంటరిదైపోయింది. అలా అరకు అడవిలో చిక్కుబడిన ఆమెని పార్థసారథి (కృష్ణ చైతన్య తండ్రి) అనే అతను చేరి దీస్తాడు. అతను కృష్ణ చైతన్యకు తండ్రి అనే విషయం ఆమెకు తెలియదు. ఆ సందర్భంలో అతనొక ఆదర్శవాదిగా ఆమెకు కనిపిస్తాడు. పార్థసారధికి తన చనిపోయిన భార్య పట్ల చూపిస్తున్న ప్రేమ, గౌరవాలు గీతను ఎంతగానో ఆకర్షిస్తాయి. అతని పట్ల ఆకర్షితురాలయిన గీత అతనికి చేరువకావాలను కుంటుంది. వయసు వ్యత్యాసం ఉన్నప్పటికి కొత్త

జీవితాన్ని వెతుక్కునే ప్రయత్నంలో సమాజం ఒప్పుకున్నా, లేకున్నా అతనితో కలిసి జీవించడానికి మనస్ఫూర్తిగా పార్థసారధి తోటి కలిసి అతని ఇంటికి వెళుతుంది. గీతలోని కొన్ని చీకటి కోణాలు తెలిసినప్పటికి, పార్థసారథి కూడా ఆమె పట్ల జాలితో ఆమెకు భార్య స్థానం కల్పిస్తాడు. వీరిద్దరికీ పెళ్లి జరిగే లోపే అనుకోకుండా దురదృష్టవశాత్తు పార్థసారథి చనిపోతాడు.

కృష్ణ చైతన్య గీతను పోగొట్టుకున్నాడన్న భావనతో పిచ్చివాడై తన తండ్రిని, ఆస్తి సర్వస్వాన్ని వదిలేసి ఊర్లు పట్టుకు తిరుగుతూ, ఒక పెళ్లి అయిన స్త్రీ వలలో చిక్కుకు పోతాడు. ఆమె పేరు మాధురి, చిదంబరం భార్య. చిదంబరం ఒక రోగి. మాధురి కృష్ణ చైతన్యకు ఆకర్షితు రాలయి, అతనితో లైంగిక సంబంధం పెట్టుకుంటుంది. ఒకానొక బలహీనమయిన క్షణంలో ఆమెది నిజమయిన ప్రేమనుకొని ఆమెకి లొంగిపోతాడు కృష్ణ చైతన్య. కానీ చిదంబరం ఆరోగ్యం కోలుకోవడంతో కృష్ణ చైతన్యతో తనకేమి సంబంధం లేనట్టుగా ప్రవర్తిస్తుంది మాధురి. ఆమె ప్రవర్తనకు హతాశుడై, తానెంతో పెద్ద తప్పు చేశాడన్న ఆత్మ న్యూనతా భావనతో కృష్ణ చైతన్యకు జీవితంపైన విరక్తి కలిగి కొంతకాలం అందరికి దూరంగా ఆశ్రమ జీవితం గడుపుతాడు. అలా ఒంటరి వాడైన కృష్ణ చైతన్య తన తండ్రి మరణం గురించి విని తిరిగి తన ఇంటికి చేరుకుంటాడు. అక్కడ గీతా దేవిని చూసి హతాసుడై, జరిగింది తెలుసుకొని, అక్కడే ఉండిపొమ్మని అభ్యర్థి స్తాడు. బంధువులందరు ఆమె వల్లనే చనిపోయాడని నిందించినా ఆమెతో సహజీవనం చేయడానికి సిద్ధ పడతాడు.

భార్య మీద మనసు చావని శివరాం గీత బొంబాయిలో కృష్ణ చైతన్య దగ్గర ఉందని జాడ తెలుసు కుని, గీతను వెతుక్కుంటూ కృష్ణ చైతన్య ఇంటికి వస్తాడు. కానీ ఆమె అతడిని తిరస్కరించి, అవమానకరంగా మాట్లాడి, అతని అహం (ego)ని రెచ్చగొడుతుంది. ఆ కసిలో ఆమె గొంతు నులిమి, తన తలతో ఆమె తలను గట్టిగా మోదుతూ చంపేస్తాడు. చనిపోయే ముందు ఆమె పలికిన మాట 'డాడీ.' అదే ఆవేశంలో తాను కూడా ఆత్మ హత్య చేసుకొని మరణిస్తాడు. ఇలా సంబంధం లేని పోకడలను వివిధ విభిన్న మానవ నైజాలను ముత్యాలుగా ఏరి కూర్చి ఒక అద్భుతమైన చైతన్య స్రవంతి ప్రక్రియతో "హిమజ్వాల" అనే ఒక నవల ముత్యాల హారాన్ని పాఠకు లకు అందించారు వడ్డెర చండీదాస్.

**గీతాదేవి పాత్ర - మనోవిశ్లేషణ :**

ఈ నవలలోని 'గీత' మనకు ఒక కారు ప్రమాదం సంఘటనలో పరిచయం అవుతుంది. "నలిగి దుమ్ము కొట్టుకున్న చీర శరీరం వొంపులకు లొంగిపోయి సగం శరీరాన్ని బయటకు వదిలేసింది. నల్లని మకిలి కంఠం గీత గొంతులో ఇరుక్కుపోయింది. నూనె, దుమ్ము కలిసి చెరిగిన జుట్టులోంచి వచ్చినట్లుగా ఏదో వింత పరిమళం అతన్ని ఆవరించింది."[2] (హిమజ్వాల -- వడ్డెర చండీదాస్- పుట:1) గీత బి.ఏ. లిటరేచర్ చదివింది. ఉద్యోగ అన్వే షణలో భాగంగా హైదరాబాద్ నగరంలో తిరుగుతూ, అనుకోకుండా కారు తగలడం వల్ల పడిపోతుంది. ఆ సమయంలో డాక్టరు కృష్ణ చైతన్య ఆమెను రక్షిస్తాడు. ఆమె పరిస్థితిని గురించి తెలుసుకొని తన దగ్గర ఆశ్రయ మిస్తాడు.

గీతాదేవి అందం సాక్షాత్మూ జీవం పోసుకున్న పాల రాతి విగ్రహం అని ఆమె కాలేజీలో చదువుకున్నప్పటి మిత్రుడు సఫీజ్ మంజిల్, అనే బ్రహ్మాండమయిన భవంతిలో వుండే ఫిలాసఫీ లెక్చరరు శివరాం, కృష్ణ చైతన్య, అతని ప్రియ స్నేహితుడు జర్నలిస్ట్ శశాంక, కృష్ణ చైతన్యకు తండ్రి అయిన పార్థసారధి అందరూ అంగీకరించే విషయమే. అయితే "గీత కేవలం పాలరాతి విగ్రహమే కాదు. ఆమెకూ కొన్ని కోరికలు వున్నాయి. రొట్టె, బిస్కట్లు, చీరలు, ఆల్బర్ట్ కామూ, కాఫ్కా, యిజ్రాపాండ్ - వీళ్లమీద చర్చలూ వగయిరా మాత్రమేకాదు కావలసింది. అందుకే, ప్రొఫెసర్ గారూ, మనిషికి ఆకలివేసేది ఒక్క కడుపులోనే కాదు అని ఉత్తరం రాసి పెట్టేసి వెళ్లిపోయింది!"3 (నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి - పుట: 172)

గీతాదేవి స్వభావంలో 'nymphomanic' ప్రవర్తన కని పిస్తుంది. అంటే తన మనసుకు నచ్చిన వాడితో సుఖాన్ని

అనుభవించాలని అనుకుంటుంది. ఆమెకు సంఘం మీద, కట్టుబాట్ల మీద ఆసక్తి లేదు. తన సంతోషమే తనకు ముఖ్యం. అయితే అదే సమయంలో తనకు ఇష్టం లేని వ్యక్తులు తనను వాంఛించనప్పుడు వారిని తిరస్కరించింది. సఫీజ్ మంజిల్, తన స్నేహితురాలి భర్త విషయంలోనూ, తాను ప్రేమించిన కృష్ణ చైతన్య విషయంలో కూడా మనం చూడవచ్చు. ఆ తర్వాత తనలోని (id) 'యిచ్ఛ' ఏం చెబితే అది చేసింది. చదువుకునే రోజుల్లో చాలామంది 'బోయ్ ఫ్రెండ్స్'తో తిరిగింది. కానీ తనకు ఇష్టం లేని శృంగారాన్ని చేయడానికి ఆమె ఒప్పుకోలేదు.

విశాఖపట్టణంలో లెక్చరర్ ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత, ఓ మధ్య తరగతి ఆఫీసరుకి యిల్లాలు అయింది. పెళ్ళయిన తర్వాత 'పెద్ద ముత్తయిదువు' వేషం వేసుకొని కొన్నాళ్లు తిరిగింది. అయితే ఆమె భర్త శివరాం తనకు శృంగార పరంగా సరయిన "సంతృప్తి" ఇవ్వటం లేదని అసంతృప్తిని వ్యక్తం చేసింది. తనలోని కామ వాంఛను ఆమె స్వేచ్ఛగా తెలియజేయడం అతడికి నచ్చలేదు. ఆమెను అనుమానించాడు, అవమానించాడు. అతడి చేష్టలకు విసిగిపోయిన గీతాదేవి పెళ్ళిని పెటాకులు చేసుకొంది. ఆపైన కృష్ణ చైతన్య తండ్రి సారధిగారితో 'రొమాన్సు' సాగిస్తుంది. వ్యవహారం పెళ్లి వరకూ వెడుతుంది గాని, అంతలోనే సారధి మరణిస్తాడు. తండ్రి మరణించిన తర్వాత కృష్ణచైతన్య ముందు నాడు ఆమె ప్రేమను కాదన్నందుకు మనసు మార్చుకొని ఇప్పుడు తనను పెళ్లి చేసుకోమంటాడు. కానీ అందుకు ఆమె అంగీకరించక "నేను నీకు సవతి తల్లిని. నన్ను నువ్వు పెళ్ళి చేసుకోకూడదు"[4] (హిమజ్వాల - వడ్డెర చండీదాస్- పుట:208) అంటుంది గీత. ఒకనాడు అతడిని ఆమె ప్రేమించినా అతడి తీరు వల్ల ఆమె మనసు విరిగి పోయింది. ఆమె మనసు మార్చేందుకు కృష్ణ చైతన్య ప్రయత్నం చేశాడు. కానీ ఇంతలోనే ఆమె భర్త శివరామ్ ఆమెను హత్య చేస్తాడు.

గీత 'సఫీజ్ మంజిల్'ను ఎందుకు వదిలి వెళ్ళి పోయింది? కట్టుకున్న భర్త శివరామ్ పట్ల ఎందుకు విముఖురాలైంది? అనే ప్రశ్నకు సమాధానంగా "సెక్సు విషయంలో ఆమెకు సంతృప్తి లభించకపోవడం' అని చెప్పాలి. ఆమెకు వీరెవ్వరిలోనూ దొరకని ఆనందం రిటైరై పోవడానికి సిద్ధంగా వున్న పార్థసారధితో దొరికిందను కోవాలా? అని పాఠకుడు ప్రశ్నించుకోవాలి. ఆమెలో ఉన్నది కేవలం కామ వాంఛ అనుకుంటే సారధి చని పోయిన తర్వాత అతడితో ఆమెకున్న శారీరక సంబంధం తెగిపోవాలి. అంతే కాకుండా పెళ్ళి అవకుండానే ఆమె సారధిగారిని తన భర్తగా ఊహించుకోవడం అనేది ఆమె ఉద్దేశం ప్రకారం "ప్లేటోనిక్ లవ్" (శృంగార ప్రస్తావన లేని మానసిక అనుబంధం) వైపు మొగ్గుతోందా? అనే సందేహం మనకు కలుగుతుంది. తనను ఎంతగానో ప్రేమించి, తన పొందు కోసం దాదాపుగా పిచ్చివాడై పోయిన కృష్ణచైతన్య కంటే, చనిపోయిన సారధి మీద "సెంటిమెంట్" లాంటిది ఏర్పడ్డాన్ని బట్టి చూస్తే ఆమెకు శారీరకమైన ఈ మార్పు హఠాత్తుగా ఎలా సాధ్యమైంది? ఇదే, 'గీత' అనే ప్రధాన పాత్ర వెనుకనున్న చిక్కు ప్రశ్న. ఇది కేవలం ఆమెలో కలిగిన మానసిక పరిపక్వతగా (mind maturity) భావిస్తే ఈ చిక్కు ప్రశ్నకు ముడి విప్పడానికి ప్రయత్నించిన వారవుతారు. ఆమె తీరులోనే ఆమె విచిత్ర మనస్తత్వం మనకు అర్థం అవుతుంది. అస్తిత్వవాదం ప్రవర్తన తర్కానికి అందక ఎప్పుడూ చిత్రంగానే ఉంటుంది.

**ముగింపు :**

పైన చెప్పబడిన విషయాలను బట్టి చండీదాస్ నవలా రచనా విధానం మనకు అర్థమవుతుంది. వీరి నవల పైన చలం గారి ప్రభావం చాలా కనిపిస్తుంది. వారి నవలల్లో, కథల్లో కనిపించే స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం ప్రభావం ఈ నవలలో కూడ కనిపిస్తుంది. గీత పాత్రలో దాని ప్రభావాన్ని చూపించారు రచయిత. అంతే కాకుండా "రచయిత యవ్వనంలో వున్న స్త్రీలను 'దేవీ'గా కీర్తిస్తాడు. అందుకే గీతాదేవి, మాధురీదేవి, నిర్మలాదేవి అని పిలుస్తాడు. చండీదాస్ ఎంతటి దేవీదాసుడనేది ఈ విషయంలో స్పష్టంగా నిర్ధారణ చేసుకోవచ్చు."5 (మిసిమి పత్రిక, సంపుటి 17, సంచిక -3, తేది:మార్చి, 2006) స్త్రీల పట్ల తనకున్న గౌరవాన్నీ ఎక్కడ తక్కువ చేయలేదు.

కానీ అతి స్వేచ్ఛ వల్ల కలిగే అనర్థాలు, సమాజంలో ఒంటరి స్త్రీలకు ఎదురయ్యే సమస్యలు వంటివి ఈ నవల ద్వారా తెలియజేశారు. మనిషిలో కనిపించే భిన్నమైన స్వభావాల తీరు తెన్నులు తెలియజేశారు.

**పాద సూచికలు :**

1. ఈమాట అంతర్జాల పత్రిక - తేది:జులై, 2006
2. హిమజ్వాల - వడ్డెర చండీదాస్- పుట:1
3. నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి -- పుట: 172
4. హిమజ్వాల - వడ్డెర చండీదాస్- పుట:208
5. మిసిమి పత్రిక, సంపుటి 17, సంచిక -3, తేది:మార్చి, 2006

**ఉపయుక్త గ్రంథ సూచీ :**


1. ఈమాట అంతర్జాల పత్రిక - తేది: జులై, 2006
2. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి - ప్రచురణ: ప్రచురణ: 2002, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, హైదరాబాద్
3. తెలుగు సాహిత్య చరిత్ర - కొర్లపాటి శ్రీరామమూర్తి- ప్రచురణ:1991, రమణ శ్రీ ప్రచురణలు, విశాఖపట్నం
4. నెచ్చెలి అంతర్జాల మాస పత్రిక - తేది: ఆగస్ట్, 2004
5. మిసిమి మాస పత్రిక - తేది: మార్చ్, 2006
6. నూరేళ్ళ తెలుగు నవల - సహవాసి(రచన), సంపాదకుడు: డి. వెంకట్రామయ్య - ప్రచురణ: 2007, నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, కాచిగూడ.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవలల్లో ఆదర్శ దాంపత్య జీవన చిత్రణ

- దేవరపల్లి విశ్వనాథ్
పరిశోధక విద్యార్థి, యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప.

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత నాగరికతలలో ఒకటి ఈ దేశానికి చెందిన సాహిత్యం వేల సంవత్సరాలు చరిత్ర కలిగి ఉంది. భారతీయ సాహిత్యం కేవలం కళాత్మక వ్యక్తికరణే కాకుండా మతం, తత్వశాస్త్రం, సామాజిక, రాజకీయ పరిణామాలను ప్రతిబింబించే అద్దం లాంటిది. భారతదేశ సాహిత్యం కాలాను క్రమంలో విస్తారమైన వికాసం సాధించింది అలా భారతదేశంలో 19వ శతాబ్దంలో సాహిత్యం వివిధ రూపాలలో కొత్త పుంతులు తొక్కింది. ఆధునిక సాహిత్యంలో వచ్చిన ప్రక్రియలు అన్నిటిలో నవల కూడా ఒకటి ఇది తరువాత కాలంలో తెలుగు సాహిత్యంలో ఒక ఉన్నతమైన స్థానాన్ని ఆక్రమించింది మానవ జీవితానికి సంబంధించిన ఎన్నో సంఘటనలో క్షుణ్ణంగా వివరించడం జరిగింది.అదేవిధంగా సాహిత్యం హితాన్ని కోరుకుంటుంది సమాజానికి ప్రతిబింబం లాంటిది సాహిత్యం సమాజంలో ఉన్న సాంఘిక దురాచాలు, మూఢనమ్మకాలు జీవన నైతిక విలువలు ఇవన్నీ కూడా సాహిత్యం ద్వారా తెలుసుకోవచ్చు వీటంటిని మన కళ్ళకు కట్టినట్టు చూపడంలో నవల ప్రక్రియ ఎంతో ముందుంది.

**1. ప్రవేశిక**

ప్రపంచ జనాభా నైతిక విలువలతో, కొన్ని నిబంధనలతో కట్టుదిట్టంగా ఆదిమానవుని దశ నుంచి నేటి వరకు కొనసాగుటకు దోహదపడుతున్నది ఈ కుటుంబ వ్యవస్థ. ఒకప్పుడు ప్రజలంతా ఒకే కుటుంబంగా ఉండేవారు. ఆ తర్వాత అది విభిన్న కుటుంబాలుగా విభజించబడింది. అదే ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు దారి తీసింది. గతంలో దంపతులు, వారి పిల్లలు, భర్త, అమ్మనాన్నలు, అతని అక్కచెల్లెంద్రు, అన్నదమ్ములు అందరూ. కలసి ఉండేవారు. దానినే ఉమ్మడి కుటుంబం అన్నారు. కాలక్రమంలో దానిలో కూడా మార్పులు వచ్చాయి. అది వ్యష్టి కుటుంబంగా పరిణహించింది. భార్య, భర్త, వారి పిల్లలు మాత్రమే ఉంటే దానిని వ్యష్టి కుటుంబం అంటున్నారు.

ప్రజల స్వార్థపరత్వం కావచ్చు. వ్యక్తిగత అభిరుచులు కావచ్చు, ఆర్థిక స్థితిగతులు కావచ్చు.మరేదైనా కారణం కావచ్చు. వ్యష్టికుటుంబాలు అసంఖ్యాకంగా పెరిగాయి. ఉమ్మడి కుటుంబాలు మచ్చుకైనా కనబడని పరిస్థితి వచ్చింది.

కుటుంబ లక్ష్యాన్ని గురించి ఎం. ఇందుబాల ఇలా అంటారు....

“కుటుంబ జీవనానికి అవసరమైన విజ్ఞానాన్ని, వైఖరులను, కౌశలాలను, అభివృద్ధి పరచి కుటుంబ

సభ్యుల స్తోమతను పెంపొందించడం కుటుంబం ముఖ్య లక్ష్యము. తల్లిదండ్రులిద్దరూ కుటుంబంలో వారి వారి కర్తవ్యాలను, పాత్రలను గుర్తించేటట్లు చేసి, లైంగిక సంబంధము, వివాహము, మాతృత్వం పట్ల ఖచ్చితమైన భావాలు ఏర్పడే విధంగా ఈ విజ్ఞానాన్ని తమ పిల్లలకు అందించాలి" (వివాహము - కుటుంబ సబంధాలు- పుట 1 ప్రచురణ: తెలుగు అకాడెమీ, హైదరాబాద్-2002) అంటారు.

పై లక్ష్యాలను ప్రతి కుటుంబమూ సాధించాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్యసాధనకు దంపతులందరూ కృషి చేయాల్సి ఉంది.

**1. కుటుంబం ఒడిదుడుకులు**

ఆర్థికంగా, పలుకుబడి పరంగా బాగా అభివృద్ధి చెందిన కుటుంబం. తమ ఎదిగిన పిల్లలను సరైన అదుపులో, క్రమశిక్షణలో పెట్టకపోవడం వల్ల ఆ కుటుంబం ఎలా పతనమవుతుందో రచయిత గుంటి సుబ్రహ్మణ్య శర్మ వివరంగా తెలిపారు. ఆ అంశాలు ఇలా ఉన్నాయి.

"వీరాపురంలోనే కాక పరిసరాల్లో కూడా చాలా ప్రసిద్ధి కెక్కిన పి.డబ్ల్యు.డి. కాంట్రాక్టరు రాఘవరావు, బాగా డబ్బు గడించాడు. అటు ఉద్యోగుల్లో, యిటు ప్రజల్లో చాలా పలుకుబడి ఉండేదతనికి. సజ్జనుడు, నిగర్వి, పరోపకారి ఆ జిల్లాలో లేదంటే అతిశయోక్తి కాదు. సత్యవతమ్మ అతనికి తగిన భార్య. వారి అన్యోన్య ప్రేమ విశ్వాసాలు ఆదర్శ ప్రాయాలు, అలాంటి రాఘవరావు అకాల మరణం పాలయ్యాక బ్రతుకంతా అడవిగాచిన వెన్నెలయింది. పెద్ద కొడుకు రెండేళ్ళ క్రితం దుర్మార్గ సహవాసములో పడి డబ్బు విచ్చల విడిగా ఖర్చు చేస్తూ, తల్లిదండ్రులతో చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఈనాటి వరకు వాని జాడయే తెలీదు. భార్యాబర్తలు వాని కారణంగా చాలా మనోవ్యథ ననుభవించారు. ఇంతలో భర్త మరణంతో సత్యవతమ్మ మరింత క్రుంగి పోసాగింది." (జయాపజయాలు- పుట 23 గుంటి సుబ్రహ్మణ్య శర్మ) అంటూ ఒక కుటుంబం ఎలా ఒడిదుడుకులకు లోనవుతుందో పూసగుచ్చినట్లు వివరించాడు నవలా రచయిత గుంటి సుబ్రహ్మణ్య శర్మ.

తల్లిదండ్రులు డబ్బులు సంపాదించడం ముఖ్యం కాదు. ఆ డబ్బును పద్ధతిగా ఖర్చు పెట్టే తీరుసు పిల్లలకు నేర్పాలి. అలా చేయకపోతే వారు విచ్చలవిడి తనంతో ఆ డబ్బును వృథా చేస్తారు. దాంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతుంది. తల్లిదండ్రులు దిగులు పడతారు. దాంతో వారి ఆరోగ్యాలు దెబ్బతింటాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం లేనట్లుగా ఆ తర్వాత చింతిస్తే లాభం ఉండదు. పిల్లలు సక్రమంగా వ్యవహరించకపోవడం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి.

సాహిత్యంలో అయితే ఇలాంటి కుటుంబానికి నిదర్శనంగా మహాకవి శ్రీనాథుడు రాసిన కాశీఖండంలోని గుణనిధి కథను పేర్కొనవచ్చు.

యజ్ఞదత్తుడు, సోమిదమ్మల కుమారుడు గుణనిధి. యజ్ఞదత్తుడు రాజాస్థాన ఉద్యోగి. తల్లి గృహిని. లేక లేక పుట్టిన గుణనిధిని అల్లారు ముద్దుగా పెంచారు. తండ్రికి వ్యవధి లేనందువల్ల కొడుకు బాధ్యతను భార్యకు అప్పజెప్పాడు. గుణనిధి బాల్యం నుంచి చెడు అలవాట్లకు బానిస అయ్యాడు. నాస్తికులతో స్నేహం ఏసేవాడు. జూదం ఆడేవాడు ఒక రోజు తన ఇంటిలోని విలువైన ఉంగరాన్ని జూదంలో ఓడిపోయి వారికి అప్పగించాడు. ఆ ఉంగారన్ని రాజు యజ్ఞదత్తునికి బహుమతిగా ఇచ్చి ఉంటాడు. దాన్ని అతడు భార్యకు ప్రేమగా ఇచ్చాడు. ఇవన్నీ తెలిసినా సోమిదమ్మ కుమారునిపైగల ప్రేమతో మిన్నకుండిపోతూ వచ్చింది అప్పుడపుడు కొడుకును గురించి భర్త విచారిస్తే ఇంతవరకు ఇంట్లోనే ఉండినాడని ఇప్పుడే ఆడుకొనుటకు వెళ్ళాడని కల్లబొల్లి కబుర్లు చెబుతుంది. భార్య మాటలు నిజమేనని అతడూ నమ్మాడు.

ఒకరోజు యజ్ఞదత్తుడు ఇంటికి వస్తూ ఉంటే ఒకడు రాజు తనకు బహుకరించిన ఉంగరాన్ని ధరించి ఉండడాన్ని గమనించినాడు. ఆ ఉంగరం ఎక్కడిదని అతన్ని ప్రశ్నించాడు. పంచాంగం చెప్పడంలో నీయంతటి

వారు లేరని, అదేవిధంగా జూదం ఆడడంలో నీకొడు కంతటివాడు లేడని, గుణనిధి ఓడిపోయి తనకు అప్ప గించాడని అంటాడు. యజ్ఞదత్తుడు మండిపడుతూ ఇంటికి వచ్చి, తనకు ఆ ఉంగరాన్ని చూపమని భార్యను అడుగుతాడు. అపుడు కూడా ఆమె బొంకి ఎక్కడో దాచిపెట్టానంటుంది. అపుడు యజ్ఞదత్తుడు మండిపడి తన కుమారుడు చెడిపోవడానికి సోమిదమ్మే కారణమని భావించి భార్యాపుత్రులను వదలి వెళ్ళి, వేరొక వివాహం చేసుకుంటాడు. దాంతో తల్లీ కొడుకులు అనాథలవుతారు. ఇంటికి వచ్చిన గుణనిధితో తల్లి అన్ని అంశాలు వివరంగా చెబుతుంది. దాంతో ఖిన్నుడైన గుణనిధి ఇలా పశ్చాత్తాప పడతాడు.ఏమిసేయుదు? ఎక్కడి కేగువాడ? ధనము నిప్పచ్చరంబు విద్యయు హాళికి? పెట్టి సాగెడు నాచేయి భిక్షసేయ నెట్టు నేరుచు? దైవంబ యెఱుగు నింక -అని పశ్చాత్తాప పడ్డాడు. (కాశీఖండము చతుర్థాశ్వాసము పద్యం 111- ప్రచురణ: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నై - 1960)

కొడుకును వదలి తల్లి ఎక్కడికో వెళుతుంది. తిండికి లేక గుణనిధి ఎన్నో తిప్పలు పడతాడు. ఒక శివరాత్రి రోజు శివుని విగ్రహం ముందు పెట్టిన నైవేద్యాన్ని దొంగి లిస్తాడు. ఆ సందర్భంలో భక్తులు అతన్ని దొంగగా భావించి తీవ్రంగా కొడతారు. ఆ దెబ్బలకు అతడు మరణిస్తాడు. కుటుంబంలో వారి వారి బాధ్యతలను సక్రమంగా నెరవేర్చకపో ఎలాంటి దుష్ఫలితాలు కలుగుతాయో గుణనిధి వృత్తాంతం తెలుపుతున్నది.

## 2. వివాహం - ఆస్తి పంపకాలు

ఒకప్పుడు పెద్దలనంతరం బిడ్డలుగాని, దాయాదులు గాని ఆస్తిపంపకాలు చేసుకునేవారు. కానీ నేడు ఆడబిడ్డకు లగ్నం చూసుకున్నరోజే ఆస్తి పంపకాలు నిర్ధారించు కుంటున్నారు. ఈ విషయాన్ని నవలాకారుడు గుంటి సుబ్రహ్మణ్య శర్మ తెలిపాడు. తమ అనంతరం కొడుకులు తమ కూతురికి ఆస్తి ఇస్తారో, లేదోనని తల్లిదండ్రులు కూతురి వివాహమప్పుడే ఆస్తి పంచి ఇస్తున్నారు.

"శ్రావణ శుద్ధ పంచమి గురువారం నాడు ముహూర్తం నిశ్చయించాడు కృష్ణుడు. సత్యవతమ్మ, సీతారామ్య అందుకంగీకరించారు. అతడేమీ అడగకనే, ఆమె చూడండి సీతారామయ్య గారూ, నేను ఆడమనిషినైనా మీరు నాకెంత తెలిసినవారైనా మనసులోని మాటను స్పష్టంగా చెబుతున్నాను. మీరేమి అడుగకపోయినా అబ్బాయికి వరకట్నము క్రింద పదివేల రూపాయలు రొక్కమిస్తూ, సాలంకృత కన్యాదానము చేసియిస్తాం. మా అమ్మాయికి కావలసిన నగలు చీరలు యిచ్చి ఉనన ఆస్తినంతా మూడు సమభాగాలు చేసి ఒక భాగం జయ గురుకు, రెండవ భాగం బిడ్డ అల్లుండ్రకు, మూడవ భాగం మా పెద్ద కొడుక్కు పంచి పెట్టదలిచాను" (జయాప జయాలు పుట 52 గుంటి సుబ్రహ్మణ్యశర్మ) అని ఒక స్త్రీ తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఒకప్పుడు బంధాలకు, మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఉండేది. నేడు ఆస్తికి ప్రాధాన్యం పెరిగింది. దీనితో మానవసంబంధాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఆస్తిగానీ డబ్బు గానీ బంగారం గానీ ఇవ్వకపోతే కన్న బిడ్డలు కూడా తల్లిదండ్రులకు తిండి పెట్టడం లేదు. నిరుపేదలు తల్లిదండ్రులను బాగా చూసుకుంటుండగా ధనవంతులు వృద్ధాశ్రమాల్లో వేస్తున్నారు. మధ్యతరగతి వారు గుళ్ళ వద్ద, దేవాలయాల వద్ద, రైల్వే స్టేషన్లలో వదలి భిక్షాటన చేయిస్తున్నారు. ఇంకొందరైతే సుదూర ప్రాంతంలో వదలి వస్తున్నారు. మరికొందరు స్మశానంలో వదిలేస్తున్నారు. ఒకప్పటికి తమకు ఆగతి పడుతుందని వారు గుర్తించకపోవడం తల్లిదండ్రులైన ఆ వృద్ధులు చేసుకున్న దౌర్భాగ్యం, కోడండ్రను అత్తలు వేధిస్తే, వృద్ధులైన తరువాత అత్తలను కోడండ్రు వేధిస్తున్నట్లు స్పష్టంగా చెప్పవచ్చు. దీనికి సమకాలీన కుటుంబ జీవనాన్ని నిదర్శనంగా పేర్కొనవచ్చు.

ఒకప్పుడు ఆడపిల్లకు తల్లిదండ్రులు ఆస్తిలో భాగం ఉండేదికాదు. పెళ్ళి చేసివ్వడం, తోచినంత అమ్మాయికి ఇవ్వడం వరకే తల్లిదండ్రులు బాధ్యత తీసికొనేవారు. దీనిమూలంగా మెట్టినింట ఆడపిల్లఉ అనేక సమస్యలు ఎదుర్కొంటుండేవారు. ఆ సమస్యలను పుట్టినింట చెప్పు కోలేక మెట్టినింట భరించలేక ఆడపిల్లలు అనేక ఇబ్బందు లెదుర్కొంటుండేవారు. కొన్ని సందర్భాల్లో అనుకోని

దుర్ఘటనలు కూడా జరుగుతుండేవి. భర్త అత్తమామలు కట్నం తేలేదని కిరోసిన్ పోసి నిప్పంటించి కాల్చేసేవారు. చంపి ఫ్యానుకు ఉరితీసి ఆత్మహత్యకు పాల్పడిందనే వారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని. మాజీముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు ఆడపిల్లలకు ఆస్తిలో హక్కు ఉందనే చట్టాన్ని తెచ్చారు.

1956 హిందూ వివాహ చట్టం ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో ఆడపిల్లలకు సమాన వాటా హక్కు ఉంది. ఆ తర్వాత దానికి మరికొన్ని మార్పులు చేర్పులు చేసి 1984లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చట్టం తెచ్చారు. ఆ తర్వాత 2006లో సెక్షన్ 6లో మార్పులు చేసి మగ పిల్లలతో సమానంగా ఆస్తి హక్కు కల్పించబడింది. ఈ చట్టాల ద్వారా ఆడపిల్లలకు ఆస్తి భరోసా కల్పించినట్లైంది. దీని ద్వారా ఆడపిల్లలపై గృహహింస భారీ స్థాయిలో తగ్గిందనవచ్చు. ఒకప్పుడు మీడియా అంత ఎక్కువగా లేని రోజుల్లోనే నిత్యం వరకట్న హత్యల వార్తలు వినేవారం. నేడు మీడియా సర్వేసర్వత్ర వ్యాపించి యున్నా ఇంటి వార్తలను అరుదుగా వింటున్నాం. దీనికి స్త్రీలకు శుభ పరిణామంగా పేర్కొనవచ్చు. యువతీ యువకులు చైతన్యవంతులు కావాలి. మగపిల్లల తల్లిదండ్రుల్లో కట్నం కావాలనే కోరిక నశించాలి. అప్పుడే స్త్రీకి సమానత్వం లభిస్తుందనవచ్చు.

### 3. ఆదర్శ దాంపత్యం

దంపతులు వివాహమైనది మొదలు చివరి వరకు ఆనందంగా, సంతోషంగా జీవించాలి. ఒకరిపై ఒకరు ఆధిపత్యం సాధించాలనే అహంభావాన్ని వదలి పెట్టాలి. దాంపత్య బంధంలో ఒకరు ఎక్కువ కాదు, ఇంకొకరు తక్కువ కాదు. అలాంటి దంపతులే ఆదర్శ దంపతులుగా గుర్తింపబడతారు. ఈ విషయాన్ని ఆచార్య కొలకలూరి ఇనాక్ వసు, మధు అనే దంపతులు ఎంత ఆనందంగా జీవిస్తున్నారో ఇలా వివరించాడు.

"స్త్రీ పురుషులు పరస్పరం ఆకర్షితులై అనురాగం, ఆత్మీయత పెంచుకుంటే, వారి వివాహం, దాంపత్యం నిత్యకళ్యాణం, పచ్చ తోరణంగా ఉంటుంది. వసు హృదయం ఎలా ఉన్నా మధుమనస్సు ఆమె కోసం అహో రాత్రాలు తపించి పోతూ వుంది. అతని ఆరాధన ఉన్నతమైనది. మధుతో వసు జీవితం అందాల ఆనందమే అవుతుంది" (సౌభాగ్యవతి పుట 86 - ఆచార్య కొలకలూరి ఇనాక్) అన్నాడు.

వారు విద్య, క్రమశిక్షణ పరంగా బాగా ఎదుగుతారు. పోటీ ప్రపంచంలో బాగా రాణిస్తారు.వారి భావిజీవితం ఉజ్జ్వలంగా ఉంటుంది.తల్లిదండ్రులను పిల్లలు ప్రతి క్షణమూ పరిశీలిస్తారు. వివిధ కారణాలతో తల్లిదండ్రులు వాదులాడుకుంటుంటే ఆ ప్రభావం వారిపై పడుతుంది. దాంతో వారు మానసికంగా ఎదగలేరు. ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు, మనస్తత్వ శాస్త్రవేత్తలు ధృవీకరిస్తున్నారు.

### 4. భార్యాభర్తల బంధం

మానవులకు సంబంధించిన అన్ని బంధాలకంటే పవిత్రమైనది. విశిష్టమైనది దాంపత్య బంధం. భార్యా భర్తలు ఒకరినొకరు అర్థం చేసికొని మసలుకోవాలి, ఎలాంటి కలతలకూ, ఆధిపత్యానికి అవకాశం ఇవ్వరాదు. ఇద్దరూ కలసి మెలసి నిర్ణయాలు తీసికోవాలి. లేదంటే వారి జీవితం నరక ప్రాయమవుతుంది. ఈ బంధాన్ని గురించి నవలా రచయిత అశ్వర్థగారు ఇందిర పాత్ర ద్వారా లతతో చెప్పిస్తాడు. ఆ మాటలు ఇలా ఉన్నాయి.

"భార్యాభర్తలన్న తరువాత సహజంగా వారిలో ఒకరిపై ఒకరికి ప్రేమానురాగాలు గాఢంగా పెనవేసుకోనుంటాయి. అందరిలోనూ ఉంటాయా అని అడగద్దు. భార్యను ప్రేమించలేని భర్త, భర్త నారాధించలేని భార్య ఉన్నారంటే వారెలాంటి వారో చెప్పలేము. కొన్ని కారణాల వల్ల పరస్పరం ప్రేమించుకోలేక పోయినా కాలానుగుణంగా వారిద్దరి మధ్య అనురాగం అల్లుకపోక తప్పదు. ఆ వివాహ బంధాన్నికున్న శక్తి అటువంటిది. అలా దాన్ని ఉల్లంఘించి తమ జీవిత భాగస్వామిని ప్రేమించలేని వారికి ఈ సమాజంలోనే కాదు, ఈ లోకంలోనే తావుండదు. నువ్వు చెప్పినట్లు వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య కల్లోలాలు పుట్టి వారి అనురాగ స్రవంతి చీలిపోవడానికి అవకాశముంది. కానీ అది తిరిగి కలుసుకోక తప్పదు. ఆవేశానుమానాలు వారిలో కలగడం సహజమే. వాటికి అతీతులైన వారు దేవతలుగా పూజింపబడతారు. కానీ

వచ్చిన అనర్థాలను సరిదిద్దుకు పోగలిగేవారు ధన్యులు" (మూసిన తలుపులు - పుట 81 - అశ్వర్థ) అంటూ భార్యాభర్తలు ఎలా మసలు కోవాలో నవలా రచయిత అశ్వర్థ సవివరంగా తెలిపాడు.

దాంపత్య బంధాన్ని గూర్చి 'మహానిర్వాణ మంత్రం' ఇలా చెబుతున్నది.

ధనేనా వాససా ప్రేమ్ణా, శ్రద్ధయామృత భాషణైః ।
సతతం తోషయేద్ధారాన్ నాప్రియం క్వచిదాచరేత్ ॥

ధనము, వస్త్రాదులు ఇచ్చి శ్రద్ధతో, మంచిమాటలతో భార్యను ఎల్లప్పుడూ సంతోష పెట్టాలి. ఆమెకు అప్రియము అయిన పనిచేయరాదని తెలిపింది. భర్త స్థానంలో ఉన్నవారు ఈ నియమాలు పాటించాల్సిన అవసరం చాలా ఉంది.

ఒక కుటుంబం ప్రశాంతంగా ఉందంటే దానికి హేతువు భర్త అని, ఒక కుటుంబం అభివృద్ధి చెందు తున్నదంటే దానికి కారణం భార్య అని చెప్పవచ్చు.

కుటుంబానికి భార్యాభర్తలు రెండు కళ్ళ వంటివారు. కుటుంబమనే రథానికి భార్యాభర్తలు రెండు చక్రాల వంటి వారు.

అందుకే కాబోలు పెద్దలు సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు, రాధాకృష్ణులు అంటూ భార్యాభర్తలను జంటగానే పిలుస్తారు.

**5. సంతానం పొందిన క్షణంలో దంపతులు పొందే ఆనందం**

దంపతులు సుఖ సౌఖ్యాలు అనుభవించాక ఎదురు చూసేది సంతానం కోసం. పురిటినొప్పులు భరించి మొదటి సంతానాన్ని కన్నతల్లికి కలిగే ఆనందం అనిర్వచనీయ మైనది. అలాంటి ఆనందమే తండ్రికి కూడా కలుగు తుంది. ఈ విషయాన్ని నవలా రచయిత పుట్టపర్తి నారా యణాచార్యులు దంపతులైన కుముద - రాజేష్ పాత్రల ద్వారా తెలిపాడు.

"ఈ రూపము మాతృప్రేమ పూరితమైన ఒక తల్లి యొక్క మాతృమూర్తి యొక్క- ప్రేమ అనబడే స్త్రీది. మొదటిసారిగా స్త్రీ పురుషులిరువురు పరస్పరం అపరిచతు లైనప్పటికీ దైవయోగంచేత కలుసుకొని నూతన సృష్టికి ప్రబోధితులైనప్పుడే వారి ప్రథమ సంతానము అందునా స్త్రీ తన చేతుల మీదుగా పతి కందిస్తుంది. అప్పుడు ఆ క్షణంలో వారికి కలిగే ఆనందం అలౌకికమైనది. అనిర్వచ నీయమైనది. సృష్టికి తామే ప్రథములన్నట్లు గర్వహేతు వైనదిగా కూడా అవుతుంది" (సంఘర్షణ - పుట 13 -- అనువాదం పుట్టపర్తి నారాయణాచార్యులు) అంటూ సంతానాన్ని పొందిన క్షణంలో దంపతులు పొందే ఆనందాన్ని అద్భుతంగా చిత్రించాడు నవలా రచయిత పుట్టపర్తి నారాయణాచర్యులు.

సంతానం పొందినపుడు దంపతులు పొందే ఆనం దాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. రాజుల నుంచి సామాన్యుల వరకు ఇలాంటి సంతోషాన్ని పొందుతారు. సంతానం కోసం దశరథుడు పుత్రకామేష్టి యాగాన్ని చేశాడు. సంతానం కోసం దిలీపుడు నందినీ ధేనువుకు సేవలు చేశాడు. సంతానం కోసం శంకరాచార్యుని తల్లి దండ్రులు నోయని నోము లేదు. ఇలా ఎన్ని ఉదా హరణలైనా పేర్కొనవచ్చు. సంతానం కలిగినపుడు తల్లిదండ్రులు సంతోషించేదానికంటే ఆ సంతానం గొప్ప ప్రయోజకులైనపుడు పొందే ఆనందాన్ని నిర్ధారించుటకు కొలమానాలుండవని చెప్పవచ్చు.

తల్లిదండ్రులకు తమకు సంతానం కలిగినపుడు కాకుండా మరెప్పుడు సంతోషం కలుగుతుందో ప్రజాకవి బద్దెన ఇలా తెలిపాడు.

పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు
జన్మించినపుడ పుట్టదు
జనులా పుత్రుని కనుగొని
పొగడంగ నాడు కలుగుర సుమతీ!

దంపతులు తమకు సంతానం కలిగినపుడు ఎంతగానో ఆనందిస్తారు. అయితే ఆ సంతానం విజయం సాధించి నపుడు పలువురు ప్రశంసిస్తారు. అప్పుడు కలిగే ఆనందమే అసలైన ఆనందమని కవి బద్దెన అంటాడు.అదే విధంగా సంతానం పెరిగి పెద్దయ్యాక తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి. అలా చూడని సంతానం వృథా అంటాడు ప్రజాకవి వేమన.

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి?
పుట్టలోని చెదలు పుట్టడా గిట్టదా!
విశ్వదాభిరామ వినుర వేమ! అంటాడు వేమన,

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు (బిడ్డలు ఎవరైనా) పుట్టినా ఒక్కటే, గిట్టినా ఒక్కటే! అదెలాగంటే పుట్టలోని చెదలు పుడుతుంది. దానంతటదే నాశనమై పోతుంది. పైన పేర్కొన్న సంతానం కూడా అలాంటిదే. తల్లిదండ్రులను ఆదరించని సంతానం చెదలుతో సమానం.

ఇద్దరు ప్రజాకవులు ఎలాంటి సంతానం ఉండాలో, ఎలాంటి సంతానం ఉండకూడదో తెలిపారు. ఈ సూక్తి సార్వకాలిక సత్యవంతమైనదని అందరూ అంగీకరిస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**


1. సౌభాగ్యవతి - ఆచార్య కొలకలూరి ఇనాక్
2. మూసీన తలుపులు - అశ్వర్థ
3. సంఘర్షణ(అనువాదం) - పుట్టపర్తి నారాయణ చార్యులు
4. వేమన శతకం
5. సుమతీ శతకం
6. జయాపజయాలు - గుంటి సుబ్రహ్మణ్య శర్మ


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No.: 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు నవల - దళిత చైతన్యం

- యస్. రెడ్డి ఆంజనేయులు
స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, బెంగుళూరు విశ్వవిద్యాలయం.

## 1. పరిచయం :

తెలుగు సాహిత్యంలో నవల ఒక ప్రముఖమైన ఆధునిక సాహిత్య ప్రక్రియగా గుర్తించబడింది. కథా రూపంలో విస్తృతంగా సాగుతూ మానవ జీవితాన్ని సమగ్రంగా ప్రతిబింబించే సాహిత్య రూపమే నవల. కవిత్వం, నాటకం, కథలతో పోలిస్తే నవలకు విస్తారమైన స్థలం, విభిన్న పాత్రలు, లోతైన సంఘటనలు ఉండటం దాని ప్రత్యేకత. తెలుగు నవల 19వ శతాబ్దంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆవిర్భవించింది. కందుకూరి వీరేశ లింగం రచించిన “రాజశేఖర చరిత్ర” మొదటి తెలుగు నవలగా ప్రసిద్ధి చెందింది. ఈ నవలతో తెలుగు సాహిత్యంలో ఒక కొత్త దశ ప్రారంభమైంది. తెలుగు నవలలు సమాజంలోని జీవన వాస్తవాలను ప్రతిబింబిస్తూ ప్రజల ఆలోచనలను ప్రభావితం చేశాయి. కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, ఆచారాలు, సంప్ర దాయాలు, సమస్యలు వంటి అనేక అంశాలను నవలలు చర్చించాయి. గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, మధ్య తరగతి ప్రజల కష్టసుఖాలు నవలల్లో సజీవంగా చిత్రించ బడతాయి. పాత్రల భావోద్వేగాలు, మనస్తత్వాలు, సంఘర్షణలు రచయితల ద్వారా లోతుగా వ్యక్తమవు తాయి. అందువల్ల పాఠకుడు కథతో అనుబంధం ఏర్పరచుకొని ఆసక్తిగా చదువుతాడు.

తెలుగు నవలల్లో అనేక రకాలున్నాయి. సామాజిక నవలలు సమాజ సంస్కరణలను లక్ష్యంగా పెట్టు కుంటాయి. చారిత్రక నవలలు గత సంఘటనలను ఆధారంగా చేసుకొని చరిత్రను మన ముందుకు తెస్తాయి. ప్రేమనవలలు మానవ సంబంధాలలోని అనురాగాన్ని చిత్రిస్తాయి. మనోవిజ్ఞాన నవలలు వ్యక్తి అంతర్ముఖ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి. డిటెక్టివ్ నవలలు ఉత్కంఠను కలిగిస్తాయి. హాస్యనవలలు వినోదాన్ని పంచుతాయి. బాలల నవలలు చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా రాయబడతాయి. తెలుగు నవల అభివృద్ధిలో అనేక రచయితలు విశేష సేవలందించారు. విశ్వనాథ సత్య నారాయణ, చలం, రాచకొండ విశ్వనాథశాస్త్రి, యద్దన పూడి సులోచనారాణి వంటి రచయితలు తమ ప్రత్యేక శైలులతో నవలా సాహిత్యాన్ని సమృద్ధి చేశారు. మహిళా రచయితలు కూడా నవలా రంగంలో ముందుకు వచ్చి స్త్రీ సమస్యలను, సమానత్వ భావనను ప్రతిపాదించారు. ఆధునిక కాలంలో కొత్త భావజాలాలు, ప్రయోగాత్మక శైలులు తెలుగు నవలలకు కొత్త దిశను చూపుతున్నాయి.

మొత్తంగా తెలుగు నవల సమాజానికి అద్దంలా పని చేస్తూ పాఠకులకు వినోదం, జ్ఞానం, నీతిబోధను అంది స్తుంది. ఇది భావోద్వేగాలను మేల్కొలిపి మనలో

ఆలోచనా శక్తిని పెంపొందిస్తుంది. భాషా సంపదను, సంస్కృతిని కాపాడటంలో కూడా నవల కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల తెలుగు సాహిత్యంలో నవల ఒక అత్యంత ముఖ్యమైన, ప్రభావవంతమైన ప్రక్రియగా నిలిచింది. నవలా ప్రక్రియ ఆంగ్ల సాహిత్యంలో ప్రారంభమై తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానం ఏర్పాటు చేసుకుంది. తెలుగు భాషకు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే తెలుగు భాషలో ఏ భాషా పదాలైనా ఇమిడిపోతాయి, కానీ తెలుగు ఇతర భాషలలో అంత సులభంగా ఇమడలేదు అందుకే తెలుగు సాహిత్యంలో అనేక భాషల పదాలు, ప్రక్రియలు అధికంగా కనిపిస్తూ ఉంటాయి.

**2. దళిత నవల పరిచయం :**

దళిత నవల అనేది సమాజంలో శతాబ్దాలుగా అణచి వేయబడిన దళితుల జీవన వాస్తవాలను, వారి బాధలను, పోరాటాలను, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ. ఇది కేవలం కథను చెప్పే రూపం మాత్రమే కాదు, సామాజిక చైతన్యాన్ని కలిగించే ఉద్యమ సాహిత్యంగా కూడా భావించబడుతుంది. దళితులపై జరిగిన అన్యాయాలు, వివక్ష, అంటరానితనం, ఆర్థిక-సామాజిక దోపిడీ వంటి సమస్యలను స్పష్టంగా చూపించడమే దళిత నవల లక్ష్యం. సమానత్వం, న్యాయం, మానవహక్కులు వంటి విలువలను స్థాపించడానికి ఈ నవలలు కృషి చేస్తాయి. తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం పెరగడంతో దళిత రచయితలు తమ అనుభవాలను స్వయంగా రచనల రూపంలో వ్యక్తపరచడం ప్రారంభించారు. వారి జీవితం, కష్టాలు, అవమానాలు, ఆకలి, నిరుద్యోగం, విద్యాహీనత వంటి అంశాలు ఈ నవలల్లో సహజంగా ప్రతిఫలిస్తాయి. దళిత నవలల్లో పాత్రలు కల్పితంగా కనిపించినా, అవి వాస్తవ జీవితానికి అత్యంత దగ్గరగా ఉంటాయి. అందువల్ల ఈ నవలలు పాఠకుడిని లోతుగా ఆలోచింపజేస్తాయి. దళిత నవలల్లో గ్రామీణ సమాజంలోని కులవ్యవస్థ, భూస్వామ్య దోపిడీ, మతపరమైన అణచివేత, సామాజిక అవమానాలు వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఈ రచనలు కేవలం బాధలను మాత్రమే చెప్పవు; దళితుల ఆత్మగౌరవం, తిరుగుబాటు స్వభావం, విద్యపట్ల ఆసక్తి, స్వతంత్ర జీవన లక్ష్యాన్ని కూడా చూపిస్తాయి. దళితుల స్వరాన్ని సమాజానికి వినిపించడం ఈ నవలల ముఖ్య ఉద్దేశం. ఇవి సమాజంలో మార్పుకు దారితీసే చైతన్యాన్ని కలిగిస్తాయి. తెలుగు దళిత నవలల అభివృద్ధిలో అనేక రచయితలు విశేషంగా కృషిచేశారు. వారి రచనలు సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తూ పాఠకుల మనసులను కదిలించాయి. దళిత సాహిత్యం ద్వారా సమానత్వ భావన పెంపొందించి, మానవత్వాన్ని గుర్తు చేయడం ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. భాషలో సరళత, వాస్తవికత, నిష్కళంకత దళిత నవలల ప్రత్యేక లక్షణాలు. మొత్తంగా దళిత నవల అణచివేతకు గురైన వర్గాల జీవితాలను ప్రతిబింబించే ఒక శక్తివంతమైన సాహిత్య ప్రక్రియ. ఇది కేవలం వినోదాన్ని కాకుండా చైతన్యాన్ని, సామాజిక బాధ్యతను కలిగిస్తుంది. సమాజాన్ని సమానత్వ దిశగా నడిపించే సాహిత్య ఉద్యమంగా దళిత నవల తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. దళిత నవల అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రచించిన 'మాలపల్లి' నవల. ఈ వ్యాసంలో దళిత నవలలు అయినటువంటి 'సూర', 'పంచమం' దళితుల జీవనం, చివరికి వారిలో వచ్చే చైతన్యం గురించి ప్రస్తావించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

**3. సూర నవలలో దళిత చైతన్యం :**

ఈ నవలను రచించింది భూతం ముత్యాలు, అయ్యన్న తెలంగాణ ప్రాంతానికి చెందిన కవి. సూర అసలు పేరు సూరడు అతని తల్లితండ్రులు చెన్నడు, చంద్రి ఆ ఊరిలో వారికి ఒక ఇల్లు కొంత భూమి అయితే ఉండేది. అయితే అతని తల్లిదండ్రులు పసితనంలోనే ఆ ఊరి నుంచి సూరని తీసుకొని పట్టణానికి వలస వెళ్తారు. ఆ పట్టణంలో ఎవరికి తగిన పనుల్లో వారు నిమగ్నమై జీవితాన్ని అంత సుఖంగా జీవించక అంత కష్టంగా జీవించక తటస్థంగా జీవిస్తూ ఉంటారు. అయితే వారి సొంత ఊరు పెత్తందారుడు అయినటువంటి నాగిరెడ్డి, ఆయన బావమరిది కాశిరెడ్డి ఇద్దరూ కూడా

పట్నానికి వచ్చి సూరడిని చదివిస్తామని చెప్పి కాశిరెడ్డి తనతోపాటు సూరని తీసుకువెళ్తాడు. ఆ తర్వాత హాస్టల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెన్నన్ని చంద్రిని అడిగి పదివేల రూపాయల లంచం తీసుకొని వారిని హాస్టల్లో పనికి పెడతాడు. ఆరోజు రాత్రి చంద్రిని బలాత్కారం చేస్తాడు. ఉద్యోగం లేదు, ప్రాణంగా చూసుకుంటున్న మానం పోయింది. దాంతో మానసిక వ్యథకు లోనై తిరిగి కొన్నాళ్లకు వారి ఊరికి వచ్చేసి బతుకుతూ ఉంటారు. ఆ సమయం లోనే సూరడు కాలేజీలో చదువు చదవడానికి వెళతాడు. అక్కడ దొర కూతురు విజయలక్ష్మి పరిచయం అవు తుంది. ఆమెను ప్రేమిస్తాడు ఆ ప్రేమ కాస్త పెళ్లి దాకా వచ్చింది. అయితే ఆ ఊరిలో అది వర్ణాంతర వివాహం అవుతుంది. కాబట్టి ఆ ఊరిలోని దొరలు అందుకు అంగీ కరించరు. సూరడని చంపించాలని పథకాలు వేస్తారు. అంతలోనే నాగిరెడ్డి ఊర్లో ఉన్నటువంటి దళితుల భూముల పాసుబుక్కులు తీసుకపోయి బ్యాంకులో పెట్టి, అప్పులు ఇప్పిస్తానని చెప్పి సంతకాలు చేయించాడు. వచ్చిన డబ్బంతా తానే తీసుకొని అక్కడి నుంచి వెళ్ళి పోతాడు. అప్పు కట్టమని బ్యాంకు నోటీసులు దళితులకు వచ్చాయి. అలా నష్టపోయిన గెంటే లెంకడు, ఇర్గు బక్కడు, గారీబు ముగ్గురు నాగిరెడ్డిని చంపాలని పథకం వేసుకున్నారు. ఊర్లో మైసమ్మ పండుగలు బొడ్రాయి లేపే తరుణంలో గారీబు నాగిరెడ్డిని దొరకవుచ్చుకొని చంపేశాడు. ఇది సంగ్రహంగా నవల పరిచయం.

ఈ నవలలో సామాజికపరంగా అగ్రవర్ణాలకు చెందిన వారికి, దళితులకు నడుమ కొనసాగుతున్న పోరు పరోక్షంగా కనిపిస్తుంది. సూరడని చంపాలని ప్రయత్నం చేస్తున్న వారు సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. అయితే విజయలక్ష్మిని వివాహం చేసుకొని వెళ్లిపోయిన తర్వాత సూరడు కొన్ని రోజులు పట్టణంలోనే ఉద్యోగం చేస్తూ జీవిస్తాడు. అయితే ఉన్న ఊరిని కన్న ఊరిని ఎవరు మర్చిపోకూడదు అనే ఉద్దేశంతో తిరిగి తన ఊరికి వస్తాడు. ఆ ఊరిలో దళితుల కోసం పాఠశాలలు ప్రారంభిస్తాడు. తన భార్యని ఉపాధ్యాయురాలిగా చేసి పాఠాలు చెప్పిస్తాడు. ఊరిలోని వారందరికీ సమాజం గురించి దాని పట్ల వారు మసలుకోవలసిన తీరుతెన్నుల గురించి అవగాహన కల్పిస్తాడు సూరడు. ఈ సందర్భంలో సూరడి పాత్ర చైతన్యవంతంగా కనిపిస్తుంది. ఆ చైతన్యాన్ని తన సామాజిక వర్గమైనటువంటి దళితులందరికీ కూడా కల్పించాలని ఒక సంఘ సంస్కర్తగా, ఒక మంచి నాయకుడిగా తన వంతు బాధ్యతను నిర్వహిస్తాడు. అతడిచ్చిన ప్రోద్బలంతోనే చివరికి ముగ్గురు నాగిరెడ్డిని చంపడానికి నిర్ణయించు కుంటారు. అవకాశం లభించడంతో గారిబు ఆ పని పూర్తి చేస్తాడు.

**4 పంచమం నవలలో దళిత చైతన్యం :**

భారతదేశంలో అనాదికాలం నుంచి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు రకాల వర్ణాలు కని పిస్తాయి. కానీ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ పంచమ కులం ఒకటి తయారయింది. వాస్తవానికి మహా భారతాన్ని పంచమ వేదం అంటారు. పంచమం అనే పదం అంత అపవిత్రమైంది అయితే మహాభారతానికి ఎందుకు ఆ పేరును తగిలించారు అన్నది అర్థం కాని విషయం. ఒకవేళ ఆ పేరు పవిత్రమైనది అయితే పారు కూడా పవిత్రులే పంచమ కులస్తులు కూడా పవిత్రులే. ఇలాంటి అనేక అనుమానాలు సందేహాలు నేటికీ పూర్తిగా వైదొలగకుండా ఈ సమాజం నడుస్తూనే ఉంది. అందుకే చిలుకూరి దేవపుత్రగారు పంచమం అనే పేరుతో ఒక నవల రాశారు. ఈ పంచమం అనే నవల ఒక దళిత నవల. ఈ నవలలో చిన్నప్పటి నుంచి అనేక అవమానాలు భరిస్తూ పదోతరగతి మొదటి క్లాసులో ఉత్తీర్ణత సాధించి, ఆపై చదువుల కోసం పట్టణానికి వెళతాడు మన కథా నాయకుడు. అయితే అతని తండ్రి చేసేది చెప్పులు కుట్టే వ్యాపారం. అందువల్ల అతని తండ్రికి సరైన మర్యాద గౌరవం లభించేవి కావు. పైగా అడుగడుగునా అవ మానాలు చీత్కారాలు కచ్చితంగా లభించే విషయాలు. మన కథానాయకుడు చిన్నప్పటినుంచి తనతో పాటు చదువుకునే ఒక అమ్మాయికి ట్యూషన్ చెప్పేవాడు. ఆ అమ్మాయిని ప్రేమించేవాడు. కానీ కులానికి భయపడి ఆ విషయాన్ని బయట పెట్టలేదు. పెరిగి పెద్దవాడై కష్టపడి

చదివి ఒక ప్రభుత్వ అధికారి అవుతాడు. అతను తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిద్దామనుకున్నా అతని చుట్టూ ఉన్న వ్యక్తులు ఆ సమాజం అతని కాళ్లు చేతులు కట్టిపడేస్తుంది. దొర గారి భూముల విషయంలో చిన్నప్పటి నుంచి అతని పట్ల కక్షను పెంచుకున్న కొందరు స్వార్థపరుల వల్ల అతను తన ఉద్యోగాన్ని కోల్పోయి చివరికి ఏమీలేని ఒంటరి వ్యక్తిగా తన ఊరికి చేరు కుంటాడు. ఈ నవలలో వ్యక్తుల వ్యక్తిత్వాలు అలాగే ఆనాటి సమాజంలో భూమి విలువ, దళిత విద్యార్థులు ఎంత కష్టపడి చదివినా ఎంతో శ్రమకోర్చి ఉద్యోగం సంపాదించిన వారికి మాత్రం చివరికి లభించేది వారి కులానికి సమాజం ఇచ్చిన గౌరవం మాత్రమే. అలా ఈ నవల ముగిస్తుంది.

**5. ముగింపు :**

దళిత సాహిత్యం, ముఖ్యంగా దళిత నవలలు వాస్తవాలను నిర్భయంగా బయటపెట్టాయి. సమాజంలోని అన్యాయాలను ప్రశ్నిస్తూ మానవత్వం, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రతిష్ఠించాయి. ఈ రచనలు పాఠకుల్లో అవగాహనను పెంపొందించి, మార్పు కోసం ఆలోచింపజేశాయి. అందుకే నవలాప్రక్రియ ఎంతో విశిష్టమైన ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో పేరు పొందింది. ఏ వయస్సు శ్రోతలనైన ఆకట్టుకోగలిగిన సాహిత్య ప్రక్రియ నవల ప్రక్రియ. పై రెండు నవలల లోనూ ఇద్దరు కథానాయకులు చిన్నప్పటినుంచి సమాజంలో అవమానాలు, వివక్ష భరించిన వారే ఏ ఒక్కరి కుటుంబ ఆర్థిక పరిస్థితి సవ్యంగా లేదు. ఏ ఒక్కరూ కూడా కనీసం మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు కాదు కనుకనే వారు దళితులని పిలవబడ్డారు. ఇద్దరూ చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలకోర్చి చదివి సాధించిన ఉద్యోగాలు ఆయా ఊర్లలో ఉన్నటువంటి ఉన్నత వర్గాల ఉక్కు పాదాల కింద పడి నలిగిపోయాయి. ఇద్దరూ చైతన్యవంతులే మార్చగలిగే శక్తి ఉన్నవారే, వారి సహాయ శక్తుల వారి ప్రయత్నించారు. కానీ మార్పు కేవలం ఒక్కరిలో వస్తే సరిపోదు, అందరిలోనూ రావాలి. కొందరిలోనైనా మార్పు వచ్చింది కనుకనే, సూర నవలలో చివరికి ఆ ఊరి దొర చంపబడ్డాడు. కేవలం అది ఆ వ్యక్తి ఒక్కడి బాధ్యత మాత్రమే అనుకున్నారు కాబట్టే అతను ఉద్యోగం పోగొట్టుకొని చివరికి ఎక్కడినుంచి మొదలయ్యాడో అక్కడికే వచ్చి నిలిచిపోయాడు. ఐకమత్యం యొక్క బలాన్ని అలాగే సమాజంలో అణగారిన వర్గాల యొక్క రెండు దృక్కోణాలని ఈ రెండు నవలలు గమనించవచ్చు.

**6. ఆధార గ్రంథాలు :**


1. సూర నవల - భూతం ముత్యాలు
2. పంచమం నవల- చిలుకూరి దేవపుత్ర
3. నవలా సాహిత్యం- తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా.శాస్త్రి.


❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ప్రతి మనిషి అంతర్ముఖం - అసమర్థుని జీవయాత్ర నవల

- తండు శివుడు

స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, అంబర్ పేట్.

**వ్యాస సంగ్రహం**

మానవ జాతి ఎన్నో సమస్యలు దాటుకుని పరిణామం చెందుతూ వచ్చింది. ఇప్పుడు కాలాన్ని చూస్తే ఇంక రూపాంతరం చెందడానికి వీలు కావడానికి ధీటైన సమస్యలు ఏమున్నాయి? ఎప్పుడు చూసినా కూడు గుడ్డ నీడ కోసం కొట్టుకోడంలోనే ఇరుక్కుపోయాం ఏమో అని అనుకుంటూ ఉంటారు. కానీ వాటన్నిటి కన్నా భయం కరమైన సమస్య మానసిక సమస్య. ఆత్మన్యూనత సమస్య ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొం టున్నారు. నేటి కాలం మనిషి ముందు ఉన్న ప్రతి సమస్య అస్థిత్వం నిలపెట్టుకోడం మీదే. సమస్యని ఎదుర్కోలేక పోతే ఇక అంతా అయిపోయినట్టే. కానీ గెలిస్తే మరో కొత్త సమస్యలోకి వెళ్తాము. అనంత విశ్వాన్ని బయట నుండి చూసే సరికి తాను ఒక అసమర్థుడిలా కనిపిస్తాడు, పరిస్థితులను మేధస్సుతో మార్చుకోవచ్చు అనుకోవడం ఒక భ్రమలా కనిపిస్తుంది. అప్పటి వరుకు ప్రపంచంలో ఉండి దూరమైన వాడుకాబట్టి, వాడి నుండి వాడే దూరం అయిపోతాడు. ఈ సమస్యకు పరిష్కారం చూపే శాస్త్రమే మనో వైజ్ఞానిక శాస్త్రం. మానసిక సంఘర్షణలో సతమతమయ్యే మనిషి అంతరంగం ఎలా ఉంటుంది అనేది ఎవరికి వారు విశ్లేషించుకుంటే తప్ప ఈ సమస్య నుండి బయటపడలేరు. దానికి ఉత్ప్రేరకంగా పనిచేసే మనో వైజ్ఞానిక శాస్త్రం ఆధారంగా త్రిపురనేని గోపీచంద్ రాసిన "అసమర్థుని జీవ యాత్ర" నవల మారుతున్న విలువలకు అద్దంపడుతున్నట్టుగా వుంది. మనిషిలోని వివిధ లక్షణాలను ఆలోచనా ధోరణినిగూర్చి రాయటం గోపిచంద్ శైలికి నిదర్శనం. ప్రతి మనిషి అంతర్ముఖంగా అనిపించే అసమర్థుని జీవ యాత్ర నవలను ఈనాటి తరానికి తెలియచెప్పే ప్రయత్నమే నా వ్యాస రచన ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు :**

జీవితం, అసమర్థుడు, మనో వైజ్ఞానిక శాస్త్రం, గోపీచంద్, నవల, కుటుంబం, సమాజం.

**త్రిపురనేని గోపీచంద్**

త్రిపురనేని గోపీచంద్ తెలుగు రచయిత, హేతువాది, మనో వైజ్ఞానిక సాహితీవేత్త, తెలుగు సినిమా దర్శకుడు. గోపీచంద్ 1910, సెప్టెంబర్ 8 న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో త్రిపురనేని రామస్వామి చౌదరి, పున్నాంబ లకు జన్మించాడు. ఈయన తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు హేతువాది, సంఘసంస్కర్త. ఈయనకు కొమ్మా నారయ్యా గారి పుత్రిక శకుంతలా దేవితో 1932లో వివాహం జరిగింది, 1933లో బి.ఎ పట్టా పొంది ఆ

తర్వాత మద్రాసులో లా డిగ్రీ చదివారు. కొంతకాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీసు పెట్టినా ఆ వృత్తిలో ఇమడలేక పోయాడు. వీరికి ఆరుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు ముగ్గురు అమాయిలు. ఈయన ఆఖరి కుమారుడు త్రిపురనేని సాయిచంద్ సినీ నటుడు, దర్శకుడు. గోపీచంద్ తన జీవితంలో చాలా సంఘర్షణను అనుభవించాడు. ఈ క్రమంలో అతనిలో చెలరేగిన సంఘర్షణ అతని నవలలన్నింటిలోనూ ప్రతిఫలించింది. ఒక పుస్తకాన్ని ఆయన తండ్రిగారికి అంకితం ఇస్తూ- 'ఎందుకు' అని అడగటం నేర్పిన నాన్నకి అని వ్రాసాడు. అలా నేర్చుకోబట్టే స్వతంత్ర భావాలు గల ఒక గొప్ప రచయిత స్థాయికి ఎదిగాడు. గోపీచంద్ రచనలలో "విలువల మధ్య పోరాటం" ముఖ్యముగా చెప్పుకోతగినది. అతని మీద చాలా కాలము వారి నాన్నగారి ప్రభావం ఉండేది. ఆయన మొదట వ్రాసిన చాలా నవలలో మార్క్సిస్టు భావాలు మనకు పూర్తిగా కనిపిస్తాయి.

మొదట్లో కథా సాహిత్యంపై దృష్టి సారించిన ఆయన కొద్దికాలానికి నవలా రంగంవైపు కూడా మళ్ళారు. ఆయన రచనల్లో అసమర్థుని జీవితయాత్ర, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా మొదలైనవి పేరు గాంచాయి. ఆయన వ్రాసిన అసమర్థుని జీవయాత్ర తెలుగులో మొదటి మనో వైజ్ఞానిక నవల. 1963లో పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. గోపిచంద్ ఒక చోట ఇలా అంటాడు, "మానవులు జీవ నదుల లాగా ఉండాలి కానీ, చైతన్యంలేని చెట్లు, పర్వతాల లాగా ఉండకూడదు". మానవ జీవితం ఒక చైతన్య స్రవంతి. ఎన్నో మలుపులు తిరుగుంది. అలాగే మనం కూడా నిరంతర అన్వేషణలో ఉండాలి. అప్పుడే మనకు సత్యమంటే ఏమిటో తెలుస్తుంది. నిన్న మనం నమ్మింది ఈ రోజు సత్యం కాదని తెలిసిన వెంటనే దాన్నివదలి మళ్ళీ అన్వేషణ సాగించాలి". 1962 నవంబర్ 2 నాడు 52 సంవత్సరాల వయసులోబహుముఖ ప్రతిభాశాలి అయిన గోపీచంద్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు.

## గోపీచంద్ రచనలు

అసమర్థుని జీవయాత్ర, గడియపడని తలుపులు, చీకటి గదులు, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా, ప్రేమోపహతులు, పరివర్తన, యమపాశం, శిథిలాలయం, జీవితం, తత్వవేత్తలు, పోస్టు చేయని ఉత్తరాలు, మాకూ ఉన్నాయి సొగతాలు.

## అసమర్థుని జీవయాత్ర

త్రిపురనేని గోపీచంద్ 1947 లో రాసిన "అసమర్థుని జీవయాత్ర" తెలుగు సాహిత్యంలోని మొట్టమొదటి మనోవైజ్ఞానిక నవల. ఈ నవల మన మానవ జాతి లోని తప్పులన్నీ బహిర్గితం చేస్తుంది. కథానాయకుడు సీతా రామారావు జీవితంలోని వైఫల్యాలు, మానసిక సంఘర్షణలు, సమాజంతో అతని విభేదాలను, "అసంబద్ధ తర్కంతో" తన అసమర్థతను సమర్థించుకునే విధానాన్ని ఈ నవల అద్భుతంగా విశ్లేషిస్తుంది. జీవితాన్ని బాధ్యతగా కాకుండా, కేవలం ఊహల్లో జీవిస్తూ తన చాతకానితనం వల్ల కుటుంబానికి, సమాజానికి దూరమై, చివరకు నష్టపోయే ఒక వ్యక్తి కథ ఇది. తన నిర్ణయాల వల్ల వచ్చే దుర్భర పరిస్థితులను కథానాయకుడు ఎలా ఎదుర్కొన్నాడ నేది మూలం.

గోపీచంద్ ఇందులో చేతనా స్రవంతి అనే శైలిని ఉపయోగించారు, ఇది పాత్రల మనస్సులోని ఆలోచనలను నేరుగా పాఠకుడికి తెలియజేస్తుంది. రామయ్య తాత పాత్ర నవలకు హృదయం వంటిది, ఇది మానవ జీవన పరిపక్వత, జ్ఞానాన్ని తెలియజేస్తుంది. సమస్య తీవ్రతను అర్థం చేయించి, మనిషి తనని తాను సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకతను ఈ నవల నొక్కి చెబుతుంది. చివర్లో వచ్చే మలుపు ఆశ్చర్యకరంగా ఉంటుంది. అసమర్థుని అంతం అనే అధ్యాయంలో రామయ్య తాత, సీతారామరావు తో చెప్తాడు. "నీతో మాట్లాడి మాట్లాడి నాకు మొహం మొత్తింది" అని. సీతారామారావు బుర్రలో వచ్చే ఆలోచనలు, పిచ్చి మాటలు పుస్తకం మొదట్లో కొంచం కొత్తగా అనిపించినా, చదువుతున్న కొద్దీ జాలిగా అనిపిస్తుంది. మూర్ఖుడు, చేతకాని వాడు, అసమర్థుని కథ. ఇలాంటి వాళ్ళు మన చుట్టూ చాలా మంది ఉంటారు. నవల కనీసం ఒక తరం జీవితాన్నయినా కళ్లకు కట్టాలంటారు సాహితీవేత్తలు. ఈ నవల

ఆ పనిచేసిందనీ, మన జీవితాలని మనకి ఎరుక పరిచిందనీ చెప్పవచ్చు.

**ప్రధాన పాత్రలు**

**సీతారామారావు :**

నవల యొక్క కథానాయకుడు. తండ్రి నుంచి సంక్రమించిన అహంకారం, తల్లి నుంచి వచ్చిన సున్నిత మనస్తత్వం మధ్య నలిగిపోయే పాత్ర. సమాజంలో బతకడానికి కావాల్సిన ఆచరణాత్మక జ్ఞానం లేకపోవడం వల్ల, వాస్తవ ప్రపంచానికి దూరంగా, ఊహాలోకంలో విహరిస్తూ తన జీవితాన్ని నాశనం చేసుకునే వ్యక్తి. ఇతడు స్వార్ధపరుడు, బాధ్యతారహితుడు, విచ్ఛిన్నమైన వ్యక్తిత్వానికి ప్రతీక.

**సీతారామారావు తండ్రి :**

అతి అహంకారం (Megalomania) కలిగిన వ్యక్తి. కుటుంబ ప్రతిష్టను కాపాడాలనే భారాన్ని కొడుకుపై వేసి, అతడి జీవితాన్ని దెబ్బతీస్తాడు.

**సీతారామారావు భార్య (కమల) :**

సీతారామారావు బాధ్యతారాహిత్యం, ఆకలి, కష్టాల వల్ల ఇబ్బందులు పడే పత్ని.

**రామయ్య తాత :**

సీతారామారావుకు సలహాలు ఇస్తూ, అతని తప్పులను ఎత్తిచూపే పెద్దమనిషి.

**పిల్లలు :**

సీతారామారావు నిర్లక్ష్యానికి బలైపోయే కుటుంబ సభ్యులు.

**అసమర్థుడు పాత్ర విశ్లేషణ**

సీతారామారావు తన జీవితంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కోలేకపోతాడు. తన వైఫల్యాలకు కారణం తనలోని లోపాలే అని గ్రహించ కుండా, ఇతరులను నిందిస్తూ ఉంటాడు. ఇతను ధీరోదాత్తుడూ, సకల గుణాభిరాముడూ కాదు. అంత ర్ముఖుడు. గోరంతలు కొండంతలు చేస్తాడు. పరిసరాలని పట్టించుకోకుండా ఊహాలోకాల్లో తేలిపోతూ వుంటాడు. ఇతడు ఊహాశాలి. అంతేకాదు ఉన్మత్తుడు కూడా. దీనికి దాఖలాలు నవల పొడుగూతా కనిపిస్తాయి. అన్నిటికంటే తిరుగులేని సాక్ష్యం అసమర్థుని అంతిమయాత్రే. అది బీభత్సరసప్రధానం. తన మనసులో జరిగే ఘర్షణలను, ఆత్మన్యూనతను గోపీచంద్ ఈ పాత్ర ద్వారా అద్భుతంగా ఆవిష్కరించారు. ఇది నిరంతర ఆత్మశోధనతో కూడిన పాత్ర. చివరికి తన జీవితం ఎందుకు ఇలా అయిందో తెలియని అజ్ఞానంలో తన భ్రమల తెరలు తొలగి పోయేసరికి జీవిత నాటకం ముగిసిపోతుంది. సీత రామారావు పాత్రలో కనిపించే ఆధిక్యతా, ఆత్మన్యూనతా భావాలు వివిధ రకాలైన మానసిక చిత్తప్రవృత్తుల దృష్ట్యా ఫ్రాయిడ్, ఆడ్లర్ సిద్ధాంతాల ప్రభావంతో వచ్చిన మనోవైజ్ఞానిక నవల అని చెప్పవచ్చును.

సీతారామారావు అసమర్థుడుగా మారటం ఆరంభం నుండి అతను కడతేరే వరకు జీవితాన్ని ఆరుభాగాలుగా విభజించి రచించాడు గోపీచంద్.

అసమర్థుడు, అసమర్థుని భార్య, అసమర్థుని ఆదర్శం, అసమర్థుని మేనమామ, అసమర్థుని ప్రతాపం, అసమర్థుని అంతం. ఆ ఆరుభాగాలూ సీతారామారావు లోని పరిణామ క్రమాన్ని చూపుతాయి.

**ముగింపు**

అసమర్థుని జీవయాత్ర పుస్తకాన్ని 2023 లో నేను కొని చదివిన తర్వాత నా మనసులో కలిగిన భావాలు:

“అసమర్థుని జీవయాత్ర పుస్తకం చాలా సంవత్సరాల నుండి చదవాలనుకున్నా ఎందుకో కుదర్లేదు. ఎప్పుడు పుస్తకాలు కొనడానికి వెళ్లినా ఎందుకో తెలియదు ఈ పుస్తకం నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించేది. ఇప్పుడు చదివిన తరువాత అర్థమైంది ఎందుకు నన్ను ఆహ్వానించేదో. కొన్ని రోజుల నుండి నాకు ఎదురైతున్న నేను ఎదుర్కొంటున్న సంఘటనల, వ్యక్తుల, సమస్యల ఫలితంగా నాలో నేను పడే సంఘర్షణలను చాలా సార్లు అప్పుడప్పుడు అక్షరీకరి స్తున్నా కూడా ఎక్కడో చిన్న అసంతృప్తి ఇంకా ఏదో వెలితి ఈ పుస్తకం తో ఒక్కసారిగా తీరిపోయింది. త్రిపురనేని గోపీచంద్ మస్తు చెప్పినవ్.

మొత్తంగా నేనూ, ఈ పుస్తకం చెప్పేదేంటంటే అహం

కారం, డబ్బు, హోదా, ఆత్మన్యూనతా భావాలతో తోటి మనుషులని చులకనగా చూడకూడదు. ఎందుకోసాని కంటే గీ పెపంచికంల ఏ మనిషీ మనిషిగా ఇంకో మనిషి కన్నా ఎక్కువా కాదు తక్కువా కాదు. ఎక్కువా తక్కువా పెద్దా చిన్నా అనేవి పుట్టుకతోనో డబ్బు తోనో రావు మన మాటతో మన ప్రవర్తనతో వస్తాయ్.'' అసమర్థుని జీవయాత్ర కేవలం ఒక నవల కాదు, మానవ మనస్తత్వాన్ని విశ్లేషించే ఒక అద్దం. సమాజంలో మనుషుల ప్రవర్తన, ఆలోచనా సరళి, వ్యక్తిగత బాధ్యతలను అర్థం చేసుకోవడానికి ఇది తప్పక చదవాల్సిన పుస్తకం. మానవ మనుగడలోని కీలకాంశాలను రచయిత చాలా ఒడుపుగా మనకు విశదపరిచాడు. కనకనే ఈ నవలది తెలుగు సాహిత్యంలో చెక్కు చెదరని స్థానం. 70 ఏళ్లకు పైబడినా, నేటి తరానికి కూడా ఇది ఒక ముఖ్య రచనగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. అసమర్థుని జీవయాత్ర, త్రిపురనేని గోపీచంద్, 1947
2. https://te.wikipedia.org/wiki/అసమర్థుని జీవయాత్ర

❖❖❖

Vol. 23 | Spl. Issue 02 | February 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# నిన్ను చేరుకోవడానికి నువ్వు చేసే ప్రయాణమే - పరుసవేది

- కె. మధుమిత
బి.ఎస్సీ కంప్యూటర్ సైన్స్, (ద్వితీయ), ప్రభుత్వ కళాశాల కుప్పం.

**పరిచయం :**

**ది ఆల్కెమిస్ట్ (The Alchemist)**

పావులో కోయిలో రచించిన ప్రపంచ ప్రఖ్యాత నవల. ఈ పుస్తకం ఒక సాధారణ గొర్రెల కాపరి అయిన సాంటి యాగో (Santiago) అనే యువకుడి ప్రయాణం ద్వారా జీవితంలోని అర్థం, కలలు, లక్ష్యాలు, ధైర్యం, విశ్వాసం వంటి అంశాలను లోతుగా వివరిస్తుంది. సరళమైన కథ రూపంలో ఉన్నప్పటికీ, ఈ నవలలో తాత్విక భావాలు మరియు జీవన సత్యాలు దాగి ఉన్నాయి. అందుకే ఇది యువత నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టు కుంటుంది

**కథా సారాంశం:**

సాంటియాగోకు వరుసగా ఒకే కల వస్తుంది. ఆ కలలో ఈజిప్ట్ లోని పిరమిడ్ల దగ్గర ఒక నిధి ఉంది అని కనిపిస్తుంది. మొదట అతడు ఆ కలను పెద్దగా పట్టించు కోడు. కానీ అదే కల మళ్లీ మళ్లీ రావడంతో దానికి అర్థం తెలుసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అతడు ఒక జప్సీ మహిళను కలుస్తాడు. ఆమె ఆ కల నిజమయ్యే అవకాశ ముందని చెబుతుంది. తరువాత అతడు సాలెం రాజు మెల్కి జెడెక్ కలుస్తాడు. ఆ రాజు సాంటియాగోకు "వ్యక్తిగత లక్ష్యం" అనే భావనను వివరిస్తాడు. ప్రతి మనిషి తన జీవితంలో ఒకప్రత్యేక లక్ష్యంతో పుడతాడు. దాన్ని సాధించాలనే తపన ఉండాలి అని చెప్పాడు.

ఈ మాటలతో ప్రేరణ పొందిన సాంటియానో తన గొర్రెలను అమ్మి, నిధిని వెతుక్కుంటూ ప్రయాణం ప్రారంభిస్తాడు. అతడు ఆఫ్రికాలోని టాంజియర్ నగరానికి చేరుకుంటాడు. అక్కడ అతడిని ఒక వ్యక్తి మోసం చేసి అతని డబ్బు మొత్తం తీసుకు పోతాడు. ఈ సంఘటన అతడిని తీవ్రంగా నిరాశకు గురి చేస్తుంది. అయినా అతడు వెనక్కి తగ్గకుండా ఒక స్ఫటికల దుకాణంలో (crystal shops) పని చేయడం ప్రారంభిస్తాడు. అక్కడ తన తెలివితేటలు, కష్టపడే స్వభావం వల్ల ఆ దుకాణాన్ని అభివృద్ధి చేస్తాడు. కొంత డబ్బు సంపాదించిన తరువాత తన ప్రయాణాన్ని మళ్లీ కొన సాగిస్తాడు. ఎడారిలో ప్రయాణించే సమయంలో అతడు ఆల్కెమీ నేర్చు కోవాలని ప్రయత్నిస్తున్న ఒక ఇంగ్లీష్ వ్యక్తిని కలుస్తాడు. ఎడారిలోనే సాంటియాగోకు ఫాతిమా అనే అమ్మాయితో ప్రేమ కలుగుతుంది. అయినా ఫాతిమా అతని లక్ష్యాన్ని అర్థం చేసుకుని, తన కలను పూర్తి చేసుకోవాలని అతడిని ప్రోత్సహిస్తుంది.

తరువాత అతడు నిజమైన ఆల్కెమిస్ట్ ను కలుస్తాడు. ఆ ఆల్కెమిస్ట్ సాంటియాగోకు ప్రకృతి, మనసు, విశ్వం

ఈ నమ్మకం గురించి లోతైన బోధనలు చేస్తాడు. భయాన్ని జయిస్తే ఏదైనా సాధ్యమే అని నేర్పిస్తాడు. చివరకు సాంటియాగో పిరమిడ్ల దగ్గరకు చేరుకుంటాడు. కానీ అక్కడ అతడికి తెలిసేది ఏమిటంటే - నిజమైన నిధి అతడు కల కనిన చోటే, అంటే స్పెయిన్లోని ఒక పాత చర్చ్ దగ్గర ఉందని. అక్కడికి తిరిగి వెళ్లి అతడు నిజంగానే ఆ నిధిని పొందుతాడు. అంతకంటే గొప్పగా అతడు జీవిత సత్యాలను తెలుసుకుంటాడు.

**ముఖ్యమైన అంశాలు :**

1. ప్రతి మనిషికి ఒక జీవిత లక్ష్యం ఉంటుంది, ఈ లక్ష్యం వ్యక్తి యొక్క జీవితానికి దిశానిర్దేశం
2. కలలు మన జీవితానికి దారిని చూపిస్తాయి
3. భయం విజయంలో అడ్డంకి.
4. భయాన్ని అధిగమించడం.
5. ప్రయాణమే అసలు గురువు,
6. అనుభవం నుండి నేర్చుకోవడం జీవితంలో ముఖ్యం
7. ప్రేమ లక్ష్యానికి అడ్డంకి కాదు, అది ప్రేరణగా ఉంటుంది.
8. ప్రకృతి మనతో మాట్లాడుతుంది, ప్రకృతి మనకు ఎన్నో జీవిత పాఠాలను నేర్పుతుంది.
9. జీవితంలో విజయానికి కీలకం నమ్మకం
10. నమ్మకం ఉంటే విశ్వం సహకరిస్తుంది. పుస్తకం చదివితే ఒక వ్యక్తి ఏమి నేర్చుకుంటాడు.

1. తన కలలను గౌరవించడం తన కలలను చిన్నవిగా భావించకుండా వాటి కోసం ప్రయత్నించాలి అని నేర్చుకుంటాడు.
2. భయాన్ని జయించడం. వైఫల్యం వచ్చినా ముందుకు సాగాలి అనే ధైర్యం వస్తుంది.
3. జీవితం ఒక ప్రయాణం అని అర్థం అవుతుంది.
4. ప్రతి అనుభవం ఒక పాఠమని తెలుసుకుంటాడు.
5. శ్రమకు విలువ తెలుసుకోవడం.
6. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందని నమ్మకం పెరుగుతుంది.
7. నిజమైన ప్రేమ అర్థం తెలుస్తుంది.
8. ప్రేమ అనేది బంధించేది కాదు, ప్రోత్సహించేది అని తెలుసుకుంటాడు.
9. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.
10. తన మీద తానే నమ్మకం పెట్టుకోవడం నేర్చుకుంటాడు.

**ఉపసంహారం :**

ది ఆల్కెమిస్ట్ కేవలం ఒక కథ మాత్రమే కాదు. ఇది జీవితాన్ని ఎలా చూడాలో చెప్పే మార్గదర్శి. ఈ పుస్తకం చదివిన ప్రతి వ్యక్తి తన జీవితలక్ష్యాలపై ఆలోచించడం మొదలుపెడతాడు. విద్యార్థులకు, యువతకు, జీవితంలో దారి వెతుక్కుంటున్న ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ప్రేరణనిచ్చే గ్రంథం. ది ఆల్కెమిస్ట్ అనే నవల ఒక సాధారణ కథలా మొదలైనప్పటికి, అది మనిషి జీవితానికి సంబంధించిన లోతైన సత్యాలను మనకు తెలియజేస్తుంది. సాంటియానో ప్రయాణం ద్వారా ప్రతి మనిషి తన కలలను నమ్మితే, వాటి కోసం నిజాయితీగా ప్రయత్నిస్తే, జీవితం తప్పకుండా సరైన దారిని చూపిస్తుందని రచయిత తెలియజేస్తాడు. ఈ కథ మనకు విజయం అనేది ఒక్కసారిగా వచ్చేది కాదు, అనుభవాలు, కష్టాలు, తప్పిదాలు, ఓర్పు ద్వారా ఏర్పడుతుందని బోదిస్తుంది.

ఈ నవల చదివిన తరువాత పాఠకుడు తన జీవితాన్ని కొత్త దృష్టితో చూడటం ప్రారంభిస్తాడు. మనకు ఎదురయ్యే ప్రతి సంఘటన వెనుక ఒక అర్థం ఉందని, ప్రతి వైఫల్యం ఒక పాఠమని అర్థమవుతుంది. భయం, ఆవేశం, అసహనం వంటి భావాలే మన లక్ష్యాల సాధనలో ప్రధాన అడ్డంకులని గ్రహిస్తాడు. వాటిని జయిస్తే అసాధ్యమనేమాటే లేదని తెలుసుకుంటాడు. అలాగే, ప్రేమ, నమ్మకం, శ్రమ ఇవన్నీ, సమతుల్యంగా ఉన్నప్పుడే జీవితం సంపూర్ణమవుతుందని, ఈ కథ తెలియజేస్తుంది.

నిజమైన ప్రేమ మన కలలను ఆపదు, వాటిని సాధించడానికి మనకు బలమిస్తుంది. అందువల్ల ది ఆల్కెమిస్ట్ ఒక కథ మాత్రమే కాకుండా, ప్రతి వ్యక్తి తన జీవితాన్ని అర్థవంతంగా మార్చుకోవడానికి సహాయపడే మార్గదర్శక గ్రంథంగా నిలుస్తుంది.

**పరుసవేది :**

విద్యార్థి జీవితానికి దారి చూపే ముఖ్యమైన వాక్యాలు మరియు వాటి అర్థాలు

1. నీ హృదయం కోరుకునే పనిని నువ్వు నిజాయితీగా చేస్తే ఈ ప్రపంచం నీకు సహాయం చేస్తుంది అనడంలో సందేహం లేదు (పేజీ 32)

ఈ వాక్యం విద్యార్థులకు చాలా ప్రేరణ ఇస్తుంది. మనకు ఏదైనా లక్ష్యం ఉంటే - UPSC కావచ్చు, డిగ్రీ కావచ్చు, లేదా ఏదైనా కల కావచ్చు - దానిని నిజాయితీనా నమ్మి కష్టపడితే అవకాశాలు మనవైపు వస్తాయి.

2. "కలలను వదిలిపెట్టడం అంటే మనజీవితంలోని అసలు అర్థాన్ని కోల్పోవడమే".( పేజీ41.)

చాలామంది విద్యార్థులు ఫెయిల్ అయ్యాక లేదా ఒత్తిడి వల్ల తమ కలలను వదిలేస్తారు.

కానీ పుస్తకం చెప్పే విషయం ఏమిటంటే - కలలు లేనప్పుడు చదువుకూ జీవితం కూ అర్థం ఉండదు. కష్టం వచ్చినా కలను పట్టుకుని ముందుకు వెళ్ళాలి.

3. "ప్రతి పరీక్ష నీకు ఓ పాఠం నేర్పించడానికే వస్తుంది". (పేజీ .55)

పరీక్షలు అంటే కేవలం మార్కుల కోసమే కాదు. ఫెయిల్యూర్ వచ్చినా అది మనకు ఏదో ఒకటి నేర్పు తుంది - కష్టపడే విధానం, సహనం, సమయం విలువ ఒక విద్యార్థిగా ప్రతి ఓటమిని నేర్చుకునే అవకాశంగా తీసుకోవాలి.

4. నాకు బాగా నచ్చిన వ్యాకం, ఆంగ్లంలో "When you desire something, all the universe conspires in helping you to achieve it" చాలా బాగా ఉంటుంది. ఎటువంటి కష్టంలో అయినా ఈ వ్యాకం. గుర్తు చేసుకుంటే మనసు చాలా తేలిక పడుతుంది.

5. "నువ్వు ఏదైనా నిజంగా కోరుకుంటే, అది నిన్ను పరీక్షించకమానదు!

ఒక లక్ష్యాన్ని నిజంగా కోరుకుంటే జీవితంలో పరీక్షలు తప్పవు. పరీక్షలు రావడం అంటే మన లక్ష్యం తప్పు అన్నమాట కాదు. అది మన సహనం, నిబద్ధత ఎంత ఉందో చూడటానికీ.

6. కొంతమంది కలలను చూడటానికే భయపడాతారు (పేజీ నం 37.) ఒక విద్యార్థిగా కలలు కనడమే మొదటి విజయం, కానీ చాలా మంది భయ పడతారు.
7. ప్రపంచం సంకేతాల ద్వారా మనతో మాట్లాడు తుంది. (పేజీ నం: 49)
8. మన జీవితంలో వచ్చే అవకాశాలు, తప్పులు, అనుభవాలు ఇవి సంకేతాలే.
9. నిజమైన సంపద బంగారం కాదు, అనుభవం"( పేజీ నం: 89).
10. జీవితం మనకు నేర్చే పాఠాలే అసలైన సంపద, అవే మనల్ని బలంగా, తెలివిగా మారుస్తాయి.
11. ప్రేమ లక్ష్యాన్ని చేరుకోవడంలో అడ్డంకి కాదు.
12. సరైన ప్రేమ అయితే అది లక్ష్యాన్ని బలపరుస్తుంది.
13. నిజమైన ప్రేమ మన జీవిత లక్ష్యాలకు "వ్యతిరేకంగా ఉండదు. ఒక విద్యార్థి జీవితంలో ప్రేమ అనేది దృష్టిని చెదరగొట్టే అంశం కాదు . అది మనపై నమ్మకం పెంచుతుంది, ధైర్యం ఇస్తుంది, కష్ట కాలంలో ముందుకు నడిపిస్తుంది. ప్రేమ ఉన్న చోట బాధ్యత కూడా ఉంటుంది. ఆ బాధ్యతే మనలను, లక్ష్యానికి దగ్గర చేస్తుంది.
14. తన దారిని నమ్మినవాడే నిజంగా ధనవంతుడు. (పేజీ : 101.)

ఇతరులతో పోల్చుకోకుండా, మన ప్రయాణాన్ని మనమే నమ్మాలి. మార్కులు, ర్యాంకులు కాకుండా మన అభివృద్ధినే కొలమానం చేసుకోవాలి. ఇదే నిజమైన విజయం.

❖❖❖

# తెలుగు నవల - సామాజిక చైతన్యం

## జాతీయ సదస్సు - ఫిబ్రవరి 2026




**ప్రభుత్వ డిగ్రీ కళాశాల : కుప్పం**

**చిత్తూరు జిల్లా.**